Revised and Enlarged 6th Edition 2010

# ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర

పి. రఘునాధరావు

# ఆధునిక
# ఆంధ్రప్రదేశ్
# చరిత్ర

పి. రఘునాధరావు

STERLING PUBLISHERS PRIVATE LIMITED

## ఐదో ముద్రణ పీఠిక

**(Preface to Fifth Edition)**

ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్రకు ఇది ఐదో ముద్రణ మొదటి ముద్రణ 1990లో వెలువడ్డది ఈ గ్రంథం పట్ల విద్యార్థులు సామాన్య పాఠకులు విశేష ఆదరాభిమానాల్ని ప్రదర్శించారు

ఐదవ ముద్రణలో క్రొత్తగా మూడు ప్రకరణాలను చేర్చాను ఆవిధంగానే 3వ అనుబంధం చేర్చాను దాంట్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల జాబితా వుంది ఐదవ ముద్రణను కూడా పాఠకులు ఆదరించగలరని ఆశిస్తున్నాను

ఐదవ ముద్రణను కూడా నిర్ణీత సమయంలో చక్కగా ప్రచురించినందుకు శ్రీ **S.K. Ghai** (సురేంద్రకుమార్ ఘయ్) Mg మేనేజింగ్ డైరెక్టర్, (Sterling Publishers, New Delhi) గారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు

తిరుపతి

**పి. రఘునాథరావు**

# ముందుమాట

ఆంగ్లంలో నాచే రచించబడ్డ "The History of Modern Andhra Pradesh" అన్న గ్రంథానికి తెలుగు అనువాద రూపమే ఈ ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర. ఈ గ్రంథం ఎం.ఎ. విద్యార్థుల్ని, వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల్ని ఉద్దేశించి ప్రత్యేకంగా రచించబడ్డది. వీరేగాక ఆంధ్రప్రదేశ్‌లోని సామాన్య పాఠకులు సైతం ఈ గ్రంథాన్ని సమాదరిస్తారని భావిస్తున్నాను.

ఈ గ్రంథాన్ని అనువదించడంలోను, వ్రాతప్రతిని సిద్ధంచేయడంలోను సహకరించిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ చరిత్రశాఖలోని నా మిత్రులు శ్రీ కె. గజేంద్ర రెడ్డి, సి. రవీంద్రనాథ రెడ్డికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు

ఈ తెలుగు అనువాద రూపాన్ని వెలుగులోకి తేవడానికి అత్యంత ప్రోత్సాహాన్ని ఇచ్చి, నిర్ణీత సమయంలో చక్కగా ప్రచురించినందుకు M/s Sterling Publishers (Pvt.) Limited, New Delhi అధినేతలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

పి. రఘునాధరావు

# విషయసూచిక


1 ప్రవేశిక 1
2 యూరోపియన్‌ల రాక 31
3 నైజాం ప్రభువు - ఈస్టిండియా కంపెనీ 48
4 కంపెనీ పాలనలో ఆంధ్రదేశం 69
5 బ్రిటిష్ రాణి పాలనలో ఆంధ్రదేశం 91
6 1857-1911 మధ్యకాలంలో హైదరాబాద్ రాష్ట్రం 106
7 ఆంధ్రదేశంలో ప్రజా చైతన్యం 118
8 ఆంధ్రోద్యమం - ఆవిర్భావం 134
9 భారత జాతీయోద్యమం - ఆంధ్రదేశం 157
10 మద్రాస్ రాజకీయాల్లో ఆంధ్రదేశం 183
11 తెలంగాణాలో రాజకీయ చైతన్యం 196
12 తెలంగాణాలో స్వాతంత్రోద్యమం 202
13 హైదరాబాదుపై పోలీసు చర్య - సెప్టెంబర్ 1948 216
14 ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావం 225
15 ఆంధ్రప్రదేశ్ అవతరణ 243
16 కమ్యూనిస్టుపార్టీలు - హింసాయుత తిరుగుబాట్లు 258
17 1956 నుండి రాజకీయ సంక్షోభాలు 280
18 రామారావు ప్రభుత్వం రద్దు - దాని తరువాత పరిణామాలు 292
19 రామారావు మూడవ మంత్రివర్గం 301
20 పి వి నరసింహారావు 306
21 తెలుగుదేశం పార్టీలో చీలిక 310
22 చంద్రబాబునాయుడు ప్రభుత్వం 316


## అనుబంధం


1 తెలుగు సాహిత్యం - ఒక చారిత్రక సమీక్ష 319
2 కొంతమంది ఆంధ్ర ప్రముఖులు 339
3 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు 369

# 1

# ప్రవేశిక

భారతదేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఐదవ స్థానాన్ని ఆక్రమించింది దీని వైశాల్యం 2,75,909 చ కి మీ దాదాపు 54 మిలియన్ల (1981) జనాభాను కల్గివుంది వైశాల్యంలోను, జనాభాలోను ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారత రాష్ట్రాల్లోకెల్లా అతి పెద్దది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతాలుగ తూర్పున బంగాళా ఖాతము, ఉత్తరాన ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు, దక్షిణాన తమిళనాడు, పశ్చిమాన కర్ణాటక, మహారాష్ట్రలు ఉన్నాయి. 960 కి మీ సుదీర్ఘమైన తీరప్రాంతాన్ని కల్గి ఉంది. దేశంలో పెద్ద నౌకా కేంద్రాల్లో ఒకటైన విశాఖపట్నం నౌకా కేంద్రం ఈ రాష్ట్రంలోనే ఉంది. భారత నౌకాదళపు తూర్పు విభాగపు కేంద్రంగాను, దేశంలో ఏకైక జలాంతర్గాముల స్థావరంగాను విశాఖపట్నం ప్రసిద్ధి చెందింది

ఇరవై మూడు జిల్లాలు గల ఆంధ్రరాష్ట్రం భౌగోళికంగా మూడు విభాగాలుగా వ్యవహరించబడుతోంది అవి 1 సర్కారు ప్రాంతం లేక తీరాంధ్ర ప్రాంతం, 2 రాయలసీమ, 3 తెలంగాణాలు/ సర్కారు, రాయలసీమ ప్రాంతాలు మొదట ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వుండేవి. తర్వాత 1953 అక్టోబరు 1న

---

(1) 23 జిల్లాలు 1 శ్రీకాకుళం 2. విజయనగరం 3 విశాఖపట్టణం 4 తూర్పు గోదావరి 5 పశ్చిమ గోదావరి 6 కృష్ణా 7 గుంటూరు 8 ప్రకాశం 9 నెల్లూరు 10 చిత్తూరు 11 అనంతపురం 12 కడప 13 కర్నూలు 14 మహబూబ్‌నగర్ (పాలమూర్) 15 మెదక్ (మెతుకు) 16 నిజామాబాద్ (ఇందూరు) 17 కరీంనగర్ (ఎల్గందల) 18 ఆదిలాబాద్ (ఎదులాపురం) 19 వరంగల్ (ఓరుగల్లు) 20 నల్గొండ 21 ఖమ్మం 22 హైదరాబాద్ (భాగ్యనగరం) 23 రంగారెడ్డి

ఆంధ్రరాష్ట్రం అవతరించడంతో మద్రాసు నుండి వేరు పడ్డాయి తెలంగాణా ప్రాంతం నైజాం పాలనలోని హైదరాబాదు సంస్థానంలో ఉండేది కాని 1956 నవంబరు 1న హైదరాబాదు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించడంతో తెలంగాణా ప్రాంతం విశాలాంధ్రలో భాగంగా మారిపోయింది

ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికులు వ్యవహరించే భాష తెలుగు దాదాపు 88 శాతం ప్రజలు తెలుగు భాషలో వ్యవహరిస్తారు రాష్ట్రంలో తెలుగు తర్వాత రెండవ స్థానాన్ని ఉర్దూ భాష ఆక్రమించింది దాదాపు 7 శాతం ప్రజలు ఉర్దూ భాష మాట్లాడుతారు దాదాపు 88 శాతం ప్రజలు హిందువులు కాగా 7 శాతం ముస్లింలు, 4 శాతం క్రైస్తవులు వున్నారు సిక్కులు, బౌద్ధులు, పారశీకులు కలసి ఒక శాతం ఉన్నారు

## పూర్వచరిత్ర

క్రీ పూ 1000 సంవత్సరాల నాటిదైన ఐతరేయ బ్రాహ్మణంలో మొట్టమొదటి సారిగా ఆంధ్రులను గూర్చిన ప్రశంస కనిపిస్తుంది. సునశ్శేపుని దత్తత తీసుకోవడానికి అంగీకరించని తన 50 మంది కుమారులను విశ్వామిత్రుడు బ్రాహ్మణవర్గం నుండి బహిష్కరించాడు. ఈ విధంగా బహిష్కరించబడ్డ విశ్వామిత్ర సంతతికి చెందిన వారుగా ఆంధ్రులతో పాటు పుండ్రులు, సవరులు, పుళిందులు, మూతిబుల్ని పేర్కొవడం జరిగింది. మహాభారత యుద్ధంలో ఆంధ్రులు, కౌరవుల పక్షాన నిలిచిపోరాడినట్లు తెలుస్తున్నది. ధర్మరాజు చేపట్టిన రాజసూయయాగంలో భాగంగా సహదేవుడు ఆంధ్రరాష్ట్రాన్ని కూడా జయించినట్లు పేర్కొనడం జరిగింది

ఆంధ్రదేశంలో చారిత్రక యుగం మౌర్యుల పాలన నుండే ప్రారంభమయిందని చెప్పవచ్చు. మౌర్య సామ్రాజ్యంలో ఆంధ్రదేశం ఒక భాగంగా ఉండేది. కర్నూలు జిల్లా యందలి ఎర్రగుడిలో కన్పించే అశోకుని శాసనాన్ని దీనికి నిదర్శనంగా పేర్కొనవచ్చు చంద్రగుప్తమౌర్యుని ఆస్థానంలో గ్రీకు రాయబారిగా వుండిన మెగస్తనీసు తాను రచించిన 'ఇండికా' అన్న గ్రంథంలో పలుచోట్ల ఆంధ్రులను గూర్చి ప్రస్తావించాడు. ఆంధ్రులు పటిష్టమైన సైనిక వ్యవస్థను కల్గి, సర్వస్వతంత్రులై ఉండేవారని మెగస్తనీసు రచనవల్ల

తెలుస్తున్నది ఇంకా ఆంధ్రులకు దాదాపు 30 కోటలు, ఒక లక్ష కాల్బలము, 2000 అశ్వాలు, 1000 ఏనుగులు ఉండేవని తెలుస్తున్నది

కణ్వవంశీయుల్లో చివరివాడైన సుశర్మ అను మగధరాజును ఆంధ్రరాజైన శ్రీముఖుడు హతమార్చి మగధ రాజ్యాన్ని ఆక్రమించినట్లు మత్స్య, వాయు పురాణాలు చెపుతున్నాయి కాని శాతవాహనుల పాలన ఇంకా ముందే (క్రీ.పూ. 236లో) ప్రారంభం అయినట్లు శాసనాధారాలు చెబుతున్నాయి మౌర్యుల ప్రాభవం క్షీణించిన తర్వాత వారి సామంతులైన ఆంధ్రులు స్వతంత్రతను ప్రకటించారు

## శాతవాహనులు

### ఆంధ్రుల పుట్టుపూర్వోత్తరాలు

ఆంధ్రుల పుట్టుకను గురించి అనేక వాదోపవాదాలున్నాయి ఆంధ్రులు ఆర్యులని, దక్కను ప్రాంతానికి వలస వచ్చి స్థానికులతో కలసిపోయి వారి సంస్కృతిని అలవర్చుకొన్నారని కొందరి భావం కాని ఆంధ్రులు ఆర్యులు కారని, ద్రావిడులేనని, ద్రావిడులు అతి ప్రాచీనకాలం నుండి దేశమంతటా నివసిస్తున్నారని మరికొందరి వాదన

ఆంధ్రుల జన్మస్థానం గురించి గూడా వివాదం ఉంది ఆంధ్రుల జన్మస్థానం గోదావరి, కృష్ణా నదుల మధ్య ప్రాంతమని కొందరు భావించగా, ఆంధ్రశాతవాహనుల పాలన మొదట మహారాష్ట్రలోని మరధ్వాడ ప్రాంతంలో స్థాపించబడిందని, వారు తమ సామ్రాజ్యాన్ని తూర్పు దిశగా కృష్ణ గోదావరిలోయ ప్రాంతాలకు విస్తరింపచేశారని, పశ్చిమ ప్రాంతంలో తమ ఆధిపత్యం క్షీణించిన తర్వాతనే ఆంధ్రప్రాంతానికి తమ రాజధానిని మార్చారని మరికొందరు పండితులు అభిప్రాయపడ్డారు

ఆంధ్రులు అసలు శాతవాహనులేనా? అన్న వివాదం గూడా మరొకటి ఉంది కొందరు పండితులు, శాతవాహనులు ఆంధ్రులు కారని, వారు సర్వస్వతంత్రులైన ఒక రాజవంశీయులని భావించారు కాని బండార్కర్, రాప్సన్, వి ఎ స్మిత్ వంటి ప్రసిద్ధి చెందిన చరిత్రకారులు మాత్రం శాతవాహనులు ఆంధ్రదేశానికి చెందినవారుగానే అభిప్రాయపడ్డారు ఈ అభిప్రాయనికనుగుణంగా

పురాణాల్లోని ఆధారాల్ని వారు ఎత్తిచూపారు పురాణాలు శాతవాహనుల్ని గూర్చి ప్రస్తావించేటప్పుడు 'ఆంధ్రదేశీయ ', 'ఆంధ్ర జాతీయః' అని వ్యవహరించాయి అశోకుని శాసనాలు కూడా శాతవాహనుల్ని 'ఆంధ్రభృత్యులు'గా పేర్కొంచాయి

## శాతవాహనుల పాలన

శాతవాహనుల పాలన ప్రారంభాన్ని గురించి, వారి పరిపాలనా కాలాన్ని గురించి వివిధాభిప్రాయాలు ఉన్నాయి శాతవాహనుల కాలం క్రీ పూ 6 లేక 5వ శతాబ్దిలో ప్రారంభం అయివుంటుందని ఆర్ భండార్కార్ అను పండితుడు అభిప్రాయపడ్డాడు కాని ఈ అభిప్రాయాన్ని చాలామంది పండితులు అంగీకరించలేదు శాతవాహనుల పాలన క్రీ పూ 221 నుండి క్రీ శ.218 సంవత్సరాల మధ్య కాలంలో విలసిల్లిసట్లు డా ఎం రామారావు అభిప్రాయపడ్డారు

## శ్రీముఖుడు (క్రీ.పూ.221–198)

అశోకుని మరణం తర్వాత మౌర్య సామ్రాజ్యం క్రమంగా క్షీణించింది ఉత్తర భారతంలోని అస్థిరతను ఆసరాగా తీసుకుని శాతవాహనులు తమ స్వతంత్రతను ప్రకటించారు శాతవాహన రాజుల్లో మొదటి వాడు శ్రీముఖుడు. ఇతని కాలంలో శాతవాహన రాజ్యం పశ్చిమాన దక్కను ప్రాంతం వరకు వ్యాపించింది శ్రీముఖుడు దాదాపు 23 సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు శ్రీముఖుని తర్వాత అతని తమ్ముడు కృష్ణ క్రీ పూ 198లో రాజ్యాధికారం చేపట్టాడు

## కృష్ణ (క్రీ.పూ. 198 – 180)

కృష్ణ తన సోదరుని అడుగుజాడల్లో రాజ్యాన్ని పాలించి పశ్చిమాన నాసిక్ వరకు రాజ్యాన్ని విస్తరింపజేశాడు. ఇతని పాలన గురించిన విశేషాలు మనకంతగా లభించలేదు నానేఘాట్ చెక్కడాల్లోని చిత్రాల్లో సైతం కృష్ణ చిత్రం కన్పించదు కృష్ణ తర్వాత రాజ్యానికి వచ్చిన మొదటి శాతకర్ణి భార్య నాగానిక నానేఘాట్‌లో చిత్రాల్ని చెక్కించింది. తన సంతానం, తండ్రి, భర్త, శాతకర్ణి తండ్రి చిత్రాల్ని చెక్కించిన ఈమె కృష్ణ చిత్రాన్ని చెక్కించకపోవడం ఆశ్చర్యం వేస్తుంది దీనివల్ల కృష్ణ సింహాసనాన్ని అక్రమంగా చేజిక్కించుకుని ఉంటాడని కొంతమంది పండితులు అభిప్రాయపడ్డారు

## శాతకర్ణి (క్రీ.పూ. 180 – 170)

శాతకర్ణి భార్య నాగానిక. ఈమెనే నాయనిక అని కూడా అంటారు. ఈమె వేయించిన నానేఘాట్ శాసనం వల్ల శాతకర్ణి పాలనను గురించిన చాల విషయాలు మనకు తెలుస్తున్నాయి. నాగానిక మహారధి 'త్రాణకైరో' కుమార్తె. ఈమె రాచ కార్యాల్లో కూడా తన ప్రభావాన్ని చూపగల్గింది. మగధ నేలిన పుష్యమిత్రసుంగునికి, కళింగనేలిన కారవేలునికి శాతకర్ణి సమకాలీనుడు. పశ్చిమ మాల్వా, అనుప లేక నర్మదా నది లోయ ప్రాంతాన్ని, విదర్భమ శాతకర్ణి ఆక్రమించినట్లు నానేఘాట్ శాసనం తెలియజేస్తుంది. ఈ ప్రాంతాల్ని జయించినందుకు విజయ చిహ్నంగా శాతకర్ణి అశ్వమేధ యాగాన్ని, ఒక రాజసూయాగాన్ని కూడ నిర్వహించినట్లు పై శాసనం తెలుపుతోంది. శాతకర్ణి తనను తాను 'సామ్రాట్టు'గా ప్రకటించుకొని 'దక్షణాపతి', 'అప్రతిహతఃచక్ర' వంటి బిరుదుల్ని దరించాడు. శాతకర్ణి తర్వాత పిన్న వయస్కుడైన ఆయన కుమారుడు వేదశ్రీ రాజ్యానికి వచ్చాడు. నాగనిక తన కుమారుని పేరుతో ప్రభుత్వ వ్యవహారాల్ని సమర్థవంతంగా నిర్వహించింది. వేదశ్రీ యుక్తవయస్సుకు రాకముందే మరణించాడు. తర్వాత వేదశ్రీ తమ్ముడు సతిశ్రీ రాజ్యాధికారాన్ని చేపట్టాడు. వీరిని గురించిగాని, వీరి తర్వాతి రాజులను గురించి తెలిపే ఆధారాలు ఏవీ లేవు. తర్వాత వచ్చిన ముఖ్యమైన రాజుల్లో రెండవ శాతకర్ణి ఒకడు. ఇతడు క్రీ.పూ.152 నుండి 96 సంవత్సరం వరకు పాలించాడు.

## రెండవ శాతకర్ణి (క్రీ.పూ. 152 – 96)

రెండవ శాతకర్ణి సాగించిన సుధీర్ఘమైన పరిపాలన శాతవాహనుల చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా పేర్కొనవచ్చు. ఇతని కాలంలోనే మగధ రాజధానియైన పాటలీపుత్రం మొదటిసారిగా శాతవాహనుల ఆధీనంలోకి వచ్చింది. విదుష, కళింగ రాజ్యాల్ని కూడా ఆక్రమించి శాతకర్ణి తన సామ్రాజ్యాన్ని విస్తరింపచేశాడు. కాని తన చివరి రోజుల్లో శాక్యులు పశ్చిమ దక్కను ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. శాతకర్ణి తర్వాతి రాజుల గురించి మనకంతగా తెలియదు. తర్వాత వచ్చిన రాజుల్లో హాలుడు ముఖ్యుడు. ఇతడు క్రీ.శ. 19 నుండి 24వ సంవత్సరం వరకు రాజ్యపాలన చేశాడు.

## హాలుడు (క్రీ.పూ. 19 – 24)

హాలుడు శాతవాహన రాజుల్లో 17వ వాడు వాత్స్యాయనుని కామసూత్రంలోను, రాజశేఖరుని కావ్యమీమాంసలోను హాలుని గూర్చిన ప్రశంస ఉంది హాలుడు సాహిత్యాన్ని, కళల్ని ఆదరించి పోషించాడు స్వయంగా ప్రాకృతభాషలో 'సప్తశతి' అనే గ్రంధాన్ని హాలుడు రచించాడు బృహత్కథ రచయితయైన గుణాఢ్యుడు హాలునికి సమకాలికుడు చాలమంది కవులకు, పండితులకు ఆశ్రయం కల్పించడం వల్ల హాలునికి 'కవివత్సలుడు' అనే బిరుదు వచ్చింది. హాలుడు సప్తగోదావరి – భీమనదుల ఒడ్డున శ్రీలంక రాజకుమార్తెను పెళ్ళాడాడు. హాలుని తర్వాత శాతవాహనుల చరిత్ర మరల మరుగున పడింది శాతవాహనులు మధ్య, పశ్చిమ భారతాల్లో తమ అధికారాన్ని కోల్పోయారు. వీరి పాలన ఆంధ్రదేశంలో మొదట తమ ఆధీనంలో ఉండిన ప్రాంతాలవరకే పరిమితమయింది.

## మలి శాతవాహనులు

## గౌతమీపుత్ర శాతకర్ణి (క్రీ.శ.78 – 102)

ప్రాచీన భారతదేశపాలకుల్లో గౌతమీపుత్ర శాతకర్ణి పేరెన్నికగన్నవాడు ఇతడు శివస్వాతి, గౌతమీ బాలశ్రీలకు గల్గిన పుత్రరత్నము. శాతకర్ణి వ్యక్తిత్వాన్ని గురించి, అతని ఘనవిజయాల్ని గురించి బాలశ్రీ నాసిక్ శాసనం చక్కగా తెలియచేస్తుంది.

గౌతమీ పుత్రశాతకర్ణి రాజ్యాధికారానికి వచ్చేనాటికి దేశపరిస్థితులు నిరాశాజనకంగా ఉండేవి. భారత గంగా మైదానంలోకి కుషాణులు చొచ్చుకు రావడం మొదలయింది. పశ్చిమ దక్కను ప్రాంతం క్షహరాటుల చేతుల్లోకి పోయింది. హిందూమతాన్ని స్వీకరించి భారతదేశంలో స్థిరపడ్డ విదేశీ తెగలైన శాక్యులు, యవనులు, పహ్లవులు దక్కను ప్రాంతంలో శాంతిభద్రలకు భంగం కలిగించారు. ఈ పరిస్థితుల్లో శాతకర్ణి ధైర్యాన్ని కోల్పోక పరిస్థితులకు అనుగుణంగా స్పందించి శాక్యుల్ని, యవనుల్ని, పహ్లవుల్ని ఓడించాడు. నహాపానుని క్షాత్రపవంశాన్ని సమూలంగా నాశనం చేశాడు. శాతవాహన వంశ ప్రతిష్ఠను తిరిగి నెలకొల్పాడు. శాతకర్ణి అనుప, అపరంత. సౌరాష్ట్ర, కుకుర, అవంతి రాజ్యాల్ని

నహాపనుని నుండి స్వాధీనం చేసుకున్నాడు ఇవేకాక విదర్భ, ఆస్మాక, మూలక రాజ్యాల్ని కూడా తన అధీనంలోకి తెచ్చాడు ఈ ప్రాంతాలు పశ్చిమ భారతం లోను, దక్కనులోను (ప్రస్తుత గుజరాత్, మహారాష్ట్ర) ఉన్నాయి దక్షిణాన కృష్ణా నది నుండి ఉత్తరాన మాల్వ, కథియ వారు ప్రాంతాల వరకు, తూర్పున బంగాళాఖాతం నుండి పశ్చిమాన కొంకణ ప్రాంతం వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరింపచేశాడు. 'త్రి సముద్రతోయ పీతవాహన' (మూడు సముద్రాల నీరు త్రాగిన గుర్రాలు కలవాడు) అనే బిరుదును వహించాడు దీన్ని బట్టి శాతకర్ణి బంగాళాఖాతం, అరేబియా సముద్రం, హిందూమహాసముద్ర పర్యంతం దండయాత్రను నిర్వహించినట్లు తెలుస్తున్నది.

## సాహిత్యం

శాతవాహన రాజులు సంస్కృత, ప్రాకృత భాషా సాహిత్యాల్ని చక్కగా పోషించారు. శాతవాహన రాజైన హాలుడు, 'సప్తశతి' అనే గ్రంధాన్ని ప్రాకృతంలో రచించాడు గుణాఢ్యుడు 'బృహత్కథ'ను పైశాచీమాండలికంలో వ్రాశాడు

## వర్తక వ్యాపారాలు

శాతవాహన రాజులు దేశంలోనే కాక విదేశాలలో సైతం వర్తక వ్యాపారాలు నడిపేవారు. శాతవాహనుల నాణాలపై కన్పించే ఓడబొమ్మ వారి సముద్ర వర్తకానికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. కృష్ణానదీలోయ ప్రాంతంలో దొరికిన రోమను నాణేలు ఈ అభిప్రాయానికి మరింత బలం చేకూర్చాయి

ఆర్థిక రంగంలో 'శ్రేణులు' అభివృద్ధి చెందడం శాతవాహనుల పాలనలోని ఒక ముఖ్యలక్షణంగా భావించవచ్చు ఈ శ్రేణులు ఈనాటి బ్యాంకుల వలె పనిచేసి వర్తకాభివృద్ధికి దోహదం చేశాయి

## నాగార్జునుడు

మాధ్యమిక వాద సిద్ధాంతకర్తయైన ఆచార్య నాగర్జునుని ప్రసక్తి లేకుండా శాతవాహనుల చరిత్రకు పరిపూర్ణత చేకూరదని చెప్పవచ్చు ప్రాచీన కాలంలో శ్రీపర్వతంగా వ్యవహరించబడ్డ ఈనాటి నాగార్జున కొండలో నాగార్జునుడు నివశించాడు కొంతకాలం పాటు గౌతమీ పుత్ర యజ్ఞశ్రీ ఆస్థానాన్ని కూడ అలంకరించాడు. నాగార్జునుడు తత్వశాస్త్రవేత్తగానే కాక రసాయన శాస్త్రవేత్తగా

కూడ ప్రసిద్ధి చెందాడు. శాతవాహనుల సాంస్కృతిక సేవ విశేషంగాను, బహుముఖంగాను సాగిందని చెప్పవచ్చు

గౌతమీ పుత్ర శాతకర్ణి హిందూమతాభివృద్ధికి విశేషంగా కృషి చేశాడు హిందూ సాంఘీక వ్యవస్థలోని నాల్గు వర్ణాల్ని సమాన గౌరవంతో ఆదరించాడు ఇతనితో పాటు రాణియైన వాసిష్ఠి ధర్మోద్ధరణకు అంకితభావంతో కృషి చేసింది రాజమాతయైన గౌతమీ బాలశ్రీ చాల గొప్ప వ్యక్తిత్వాన్ని కల్గిఉండేది. శాతకర్ణి తన్నుతాను 'గౌతమీపుత్రుడు'గా సగర్వంగా పిలుచుకునేవాడు శాతకర్ణి తర్వాత ఆయన కుమారుడు వాసిష్టి పుత్ర పులోమావి రాజ్యాధికారానికి వచ్చి క్రీ.శ 102 నుండి 130 సంవత్సరం వరకు పాలించాడు తన తండ్రి ఇచ్చిన విస్తృత సామ్రాజ్యాన్ని పులోమావి చక్కగా కాపాడగల్గాడు. వాసిష్టి పుత్రపులోమావి తర్వాత శాతకర్ణి రాజ్యానికి వచ్చి క్రీ.శ.130 సం నుండి 154 సం. వరకు పాలించాడు. శాక్య రాజైన రుద్రదామనుడు శాతకర్ణిని ఓడించి శాతవాహన సామ్రాజ్యంలోని కొన్ని ప్రాంతాల్ని స్వాధీనం చేసుకున్నాడు.

## గౌతమీ పుత్ర యజ్ఞశ్రీ (క్రీ.శ.174 – 203)

ప్రసిద్ధి చెందిన శాతవాహన రాజుల్లో చివరివాడు గౌతమీపుత్ర యజ్ఞశ్రీ. రుద్రదామనుని మరణం తర్వాత ఉజ్జయినిలో చెలరేగిన అల్లకల్లోల్లాల్ని ఆసరాగా తీసుకుని యజ్ఞశ్రీ ఆ రాజ్యంపై దండెత్తాడు. పశ్చిమ, మధ్య భారతాల్లోని చాల ప్రాంతాల్లో శాతవాహనుల పూర్వ వైభవాన్ని నెలకొల్ప గలిగాడు

అమరావతి స్తూపాన్ని విస్తృత పరచి మహా చైత్యానికి చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేశాడు. యజ్ఞశ్రీ ఆస్థానంలో ఆచార్య నాగార్జునుడు కొంత కాలం పాటు వున్నాడు యజ్ఞశ్రీ మరణం తర్వాత శాతవాహన సామ్రాజ్యం క్రమంగా క్షీణించింది. క్రీ.శ. 3వ శతాబ్దికంతా రాజకీయంగా పూర్తిగా తెరమరుగయింది.

## శాతవాహనుల సాంస్కృతిక సేవ

క్రీ పూ 3వ శతాబ్ది నుండి క్రీ శ.3 వ శతాబ్ది వరకు దాదాపు అయిదువందల సంవత్సరాలు సాగిన శాతవాహనుల పాలన భారతదేశ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా భావించవచ్చు. శాతవాహనుల ప్రాభవానికి ముందు భారతదేశ చరిత్ర అంటే కేవలం ఉత్తర భారతదేశ చరిత్రగా భావించేవారు. ఉత్తరాన నర్మదా

నది నుండి దక్షిణాన తుంగభద్ర వరకు, తూర్పున బంగాళాఖాతం నుండి పశ్చిమాన అరేబియా సముద్రం వరకు గల భూభాగంపై శాతవాహనులు తమ ఆధిపత్యాన్ని చెలాయించడంతో దక్కను ప్రాంతానికి శాంతి సౌభాగ్యాల్ని చేకూర్చిపెట్టారు. ఇదే కాలంలో ఉత్తర భారతంలో విదేశీ దండయాత్రల వల్ల, అంతరంగిక కల్లోలాల వల్ల రాజకీయ అస్థిరత చోటు చేసుకోవడం గమనించ దగ్గది.

శాతవాహనుల పాలన అత్యున్నత దశలో ఉన్నప్పుడు ఈనాటి ఆంధ్ర దేశమే కాక మహారాష్ట్ర, గుజరాతు, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహారు రాష్ట్రాల్లోని ప్రాంతాలు సైతం శాతవాహన సామ్రాజ్య పరిధిలో ఉండేవి. వైశాల్యంలో మౌర్యసామ్రాజ్యం తర్వాత శాతవాహన సామ్రాజ్యాన్ని అతి పెద్దదిగా పేర్కొనవచ్చు.

## మతం

శాతవాహన రాజులు వైదిక మతాన్ని అవలంబించారు. వర్ణాశ్రమధర్మం ఆధారంగా ఏర్పడిన చాతుర్వర్ణ వ్యవస్థను పటిష్టం చేశారు. కాని వీరు మతోన్మాదులు మాత్రం కాదు. అశ్వమేధం, రాజసూయం వంటి క్రతువుల్ని నిర్వహించారు. బౌద్ధమతాన్ని ఆదరించడమే కాక చాలమంది శాతవాహన రాణులు బౌద్ధమత విశ్వాసాల్ని ఆచరించారు. వీరు అనేక బౌద్ధ విహారాల్ని, చైత్యగృహాల్ని నిర్మించడానికి సాయపడ్డారు. చైత్యగృహాలు బౌద్ధాలయాలుగాను, విహారాలు బౌద్ధ భిక్షువుల నివాస స్థలాలుగాను ఉపయోగపడేవి.

## సమాజం

శాతవాహన రాజులు బ్రాహ్మణులు. వర్ణాశ్రమధర్మానుసారం ఏర్పడ్డ చాతుర్వర్ణ వ్యవస్థను పటిష్టం చేశారు. సాంఘిక వ్యవస్థను బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలుగా విభజించడమే గాక, సాంఘిక హోదాననుసరించి కూడ మరో విభజన ఏర్పడింది. ఉన్నతోద్యోగులైన మహారథులు, మహాభోజులు, మహాసేనాపతులు మొదటి వర్గంగా వ్యవహరించబడ్డారు. అమాత్యులు, మహామాత్రులు, భాండాగారికులు, నైగములు, సార్థవాహులు మొదలగు మధ్యతరగతి ఉద్యోగులు రెండవ వర్గంలో చేరారు. ఇక మూడవ వర్గంలో చిన్న ఉద్యోగులైన లేఖకులు, వృత్తికారులైన సువర్ణకారులు, ఘండికులు ఉన్నారు. తర్వాత లోహవణిజులు,

వార్ధకులు, మాలాకారులు, దాసకులు మొదలగువారు నాలుగో వర్గంగా పరిగణింప బడేవారు

కళాపోషణ

శాతవాహన రాజులు కళ, వాస్తు శిల్పాల్ని విశేషంగా ప్రోత్సహించారు ప్రసిద్ధి చెందిన కన్హేరి, కార్ల, నాసిక్ గుహలు, ప్రపంచ కీర్తి బడసిన సాంచి, అమరావతి బౌద్ధ స్తూపాలు వీరి కళా పోషణకు నిదర్శనంగా నిలిచాయి శాతవాహనుల రాజధానియైన అమరావతి పేరుమీదుగా ఒక భారతీయ కళాశైలి పిలవబడుతున్నది అదే విధంగా అజంతా గుహల్లో కన్పించే అతి ప్రాచీనమైన చిత్రకళాఖండాలు శాతవాహనుల కాలం నాటివే.

## కాకతీయులు

క్రీ.శ. 3 వ శతాబ్దిలో శాతవాహనుల సామ్రాజ్యం అంతరించిన తర్వాత ఆంధ్రదేశాన్ని ఇక్ష్వాకులు, తూర్పు చాళుక్యుల వంటి చిన్నచిన్న రాజవంశాలు దాదాపు 700 సంవత్సరాలు పాలించాయి. క్రీ.శ.11వ శతాబ్దిలో వరంగల్లులో కాకతీయుల అధికారస్థాపనతో ఆంధ్రుల చరిత్రకు, నాగరికతకు రూపుదిద్దగల నాయకత్వం ఆంధ్రదేశానికి లభించింది.

కాకతీయుల పుట్టుపూర్వోత్తరాల్ని గురించి కూడ వాదోపవాదాలున్నాయి 'కాకతీయ' అన్న పేరు వరంగల్లు పాలకులు పూజించే 'కాకతి' అను స్థానిక దేవతాపరంగా వచ్చి ఉంటుందని కొంతమంది పండితులు భావిస్తున్నారు. మరి కొందరు 'కాకతి' అనే పట్టణం పేరు నుండి కాకతీయ పదం రూపొందిఉంటుందని భావిస్తున్నారు కాని కాకతీయ రాజులు వేంగి దేశాన్నేలిన తూర్పు చాళుక్యుల సామంతులనే విషయంలో మాత్రం పండితులందరు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తూర్పు చాళుక్య రాజైన రెండవ అమ్మరాజు మరణం తర్వాత సామంత రాజైన మొదటి బేతరాజు క్రీ.శ. 1000 సంవత్సరంలో స్వతంత్రతను ప్రకటించి ఒక కొత్త రాజవంశాన్ని స్థాపించాడు. ఇతడు ముప్పై సంవత్సరాలు పాలించాడు. బేతరాజు తర్వాత ఆయన కుమారుడు మొదటి ప్రోలయ రాజ్యాధిపత్యాన్ని స్వీకరించాడు.

## మొదటి ప్రోలయ (క్రీ.శ. 1030 – 1075)

తన తండ్రి మరణంతో క్రీ శ 1030లో సింహాసనాన్ని అదిష్టించిన ప్రోలయ చాల క్లిష్టమయిన సమస్యల్ని ఎదుర్కోవలసి వచ్చింది. తన రాజ్యానికి చోళుల వల్ల, కళ్యాణి చాళుక్యుల వల్ల ప్రమాదం ఏర్పడింది చక్రకూట రాజైన నాగవంశి తన రాజ్యాన్ని ఆక్రమించే ప్రయత్నాలు చేశాడు. అయినా ప్రోలయ పరిస్థితులకు ఎదురు నిలచి చక్రకూటరాజ్యంపై దండెత్తాడు ఈ రాజ్యపాలకుడైన ధారావళువును ఓడించాడు. ప్రోలయ తన 36 సంవత్సరాల రాజ్యపాలనలో తన రాజ్యన్ని అన్నివైపులకు విస్తరించగలిగాడు ప్రోలయ తర్వాత రాజ్యానికి వచ్చిన రెండవ బేతరాజు క్రీ.శ 1075 నుండి 1110 వరకు రాజ్యం చేశాడు. ఇతని కాలంలో చెప్పుకోదగిన విశేషాలు ఏమీ లేవు. రాజ్య రాజధానిని వరంగల్లు సమీపంలోని అనమకొండకు మార్చాడు 'త్రిభువనమల్ల' అనే బిరుదును వహించాడు.

## రెండవ ప్రోలయ (క్రీ.శ. 1110 – 1158)

ప్రాచీన కాకతీయ రాజుల్లో రెండవ ప్రోలయ ముఖ్యుడు. ఇతని విజయాల్ని గురించి ఇతని కుమారుడైన రుద్రదేవుడు వేయించిన అనమకొండ శాసనంలో వివరంగా వర్ణింపబడి ఉంది. ఇతడు మైలపదేవుని, గోవిందరాజును, గుండయను, జగ్గదేవుని జయించినట్లు విదితమౌతుంది. కాని ఈరాజుల్ని, వారి రాజ్యాల్ని గుర్తించడంలో చాల వాదోపవాదాలు ఉన్నాయి.

## రుద్రదేవుడు ( క్రీ.శ. 1158 – 1195)

తన తండ్రి రెండవ ప్రోలయ మరణం తర్వాత క్రీ శ 1158లో రుద్రదేవుడు సింహాసనాన్ని అదిష్ఠించాడు అనమకొండలోని రుద్రేశ్వరాలయంలో రుద్రదేవుడు వేయించిన శాసనంలో అతడు నిర్వహించిన దండయాత్రల్ని గుంచి విపులంగా వర్ణింపబడిఉంది తన రాజ్యం చుట్టు ప్రక్కల ఉన్న చాళుక్య రాజ్య సామంతుల్ని ఓడించినట్లు ఈ శాసనం వల్ల తెలుస్తున్నది. తూర్పున వెలనాడు ప్రభువుతోను, పశ్చిమాన యాదవ రాజులతోను రుద్రదేవుడు అనేక యుద్ధాలు చేసినట్లు తెలుస్తున్నది

రుద్రదేవుడు సాహిత్యాన్ని విశేషంగా ఆదరించాడు అనమకొండలో గంభీరమైన రుద్రేశ్వరాలయాన్ని నిర్మించాడు స్వయంగా సంస్కృత భాషలో నీతిసారమనే గ్రంధాన్ని రచించాడు పాల్కురికి సోమనాధుని వంటి శైవభక్తులకు తన ఆస్థానంలో ఆశ్రయం కల్పించాడు. ఇతని పాలనలోనే రాజ్య రాజధాని అనమకొండ నుండి వరంగల్లుకు మార్చబడింది ఒకవైపు రుద్రదేవుడు తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడంలో నిమగ్నుడై ఉండగా దేవగిరిని పాలించే యాదవరాజులు దక్షిణప్రాంతం వైపు చొచ్చుకు రావడం జరిగింది. జైత్రపాలుడనే యాదవరాజు క్రీ శ. 1195లో కాకతీయ రాజ్యంపై దండయాత్ర చేశాడు ఈ యుద్ధంలోనే శత్రువును ఎదుర్కొంటూ రుద్రదేవుడు తన ప్రాణాలు వదిలాడు రుద్రదేవునికి సంతానం లేనందువల్ల ఇతని తమ్ముడు మహాదేవుడు రాజ్యాధికారం చేపట్టాడు.

## మహాదేవుడు (క్రీ.శ. 1195 – 1198)

రుద్రదేవుని తమ్ముడైన మహాదేవుడు మూడు సంవత్సరాలు మాత్రం రాజ్యపాలనం చేయగలిగాడు. యాదవుల రాజధానియైన దేవగిరిని ముట్టడించడంలో ఇతడు తన ప్రాణాల్ని కోల్పోయాడు.

## గణపతి దేవుడు (క్రీ.శ. 1198 – 1262)

కాకతీయ రాజుల్లో ప్రసిద్ధుడైన రాజు గణపతి దేవుడు. తన తండ్రి మహాదేవుడు చేపట్టిన దేవగిరి ముట్టడిలో తన వంతు సహాయాన్ని అందించేందుకు తండ్రితో పాటు యుద్ధభూమికి వెళ్ళాడు. ఈ యుద్ధంలో మహాదేవుడు మరణించడమూ, గణపతిదేవుడు శత్రువులకు బందీ కావడం జరిగింది. ఈ వార్త కాకతీయ రాజ్యంలో అల్లకల్లోలం రేపింది కాకతీయుల సామంతులు చాలమంది తిరుగుబాటు చేసి తమ స్వతంత్రతను ప్రకటించడానికి ప్రయత్నించారు. కాని కాకతీయులకు విశ్వాసపాత్రుడైన సైన్యాధిపతి రేచర్లరుద్రుడు ఈ తిరుగుబాట్లను అణచివేసి రాజ్యం చీలిపోకుండా కాపాడాడు. క్రీ.శ. 1202లో గణపతి దేవుడు శత్రురాజుల చెరనుండి విముక్తుడు కావడంతో మరల యధాతధంగా రాజ్యపాలన చేసే అవకాశం కల్గింది

దాదాపు 60 సంవత్సరాలు సాగిన గణపతి దేవుని పాలనలో ఈనాటి ఆంధ్రదేశంలోని చాలా ప్రాంతం కాకతీయుల అధికారంక్రిందికి వచ్చింది

గణపతి దేవుడు మొదట తన దృష్టిని తీరాంధ్ర దేశంలోని వెలనాడు, వేంగి ప్రాంతాలపై మరల్చి వాటిని స్వాధీనం చేసుకున్నాడు. కళింగ రాజ్యాన్ని కూడా కైవశం చేసుకున్నాడు నెల్లూరు ప్రభువైన మనుమసిద్ధికి తన రాజ్యాన్ని తిరిగి పొందడానికి సాయం చేశాడు మనుమసిద్ధి మంత్రిగాను, మహాభారతాన్ని వెలయించిన కవిత్రయంలో ఒకరుగా పేరుపొందిన తిక్కన, గణపతి దేవుని సహాయాన్ని పొందడంలో కీలకపాత్ర వహించాడు. తన ప్రభువైన మనుమసిద్ధిని గట్టెక్కించగలిగాడు రాయలసీమ ప్రాంతంలో ముఖ్యనాయకుడైన గంగయసాహిణిని గణపతి దేవుడు అణచివేయగలిగాడు. కంచిని స్వాధీనం చేసుకోవడం, దేవగిరి యాదవుల్ని అణచివేయడం గణపతిదేవుడు చేసిన గొప్ప కార్యాలుగా చెప్పవచ్చు

నిరంతరం యుద్ధాల్లో మునిగి ఉన్నా గణపతి దేవుడు రాజ్యపాలనలో మాత్రం అశ్రద్ధ చూపలేదు అనేక దేవాలయాల్ని కట్టించాడు సాగునీటి పద్ధతుల్ని మెరుగు పరచి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ్డాడు వర్తకవ్యాపారాల్ని ప్రోత్సహించాడు. దీనికి మోటుపల్లి ఓడరేవులోని అభయశాసనాన్ని నిదర్శనంగా భావించవచ్చు ప్రాచీనకాలంలోను, మధ్యయుగంలోను మోటుపల్లి ఓడరేవు చాల ప్రసిద్ధి చెందింది అనేక విదేశీ ఓడలు కూడా మోటుపల్లి ఓడరేవుకు వచ్చేవి వెలనాడు పాలకుల పతనంతో మధ్య తీరాంధ్రంలో పరిస్థితులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీన్ని అవకాశంగా తీసుకుని స్థానిక నాయకులు విదేశస్తుల నుండే గాక స్థానిక వ్యాపారస్తుల నుండి కూడ అక్రమపన్నులు వసూలు చేసేవారు దీని ఫలితంగా ఈ నౌకాకేంద్రం మూతపడింది వ్యాపారం క్షీణించిపోయింది వెలనాడును స్వాధీనం చేసుకున్న తర్వాత గణపతిదేవుడు అభయ శాసనాన్ని వేయించి విదేశీ ఓడలకు రక్షణ కల్పించాడు. అక్రమ పన్నులన్నింటినీ రద్దు చేశాడు. అచిరకాలంలోనే మోటుపల్లి రేవు తన పూర్వ వైభవాన్ని పొందగల్గింది.

గణపతి దేవునికి ఇద్దరు కుమార్తెలు. కుమారులు మాత్రం లేరు రుద్రాంబ మొదటి పుత్రిక కాగా గణపాంబ రెండవ కుమార్తె. రుద్రాంబ మాత్రం రాజ్యపాలనా వ్యవహారాల్లో చురుకుగా పాల్గొనేది గణపతిదేవుడు దాదాపు 64 సంవత్సరాలు విజయవంతంగా పాలించి క్రీ శ 1262లో మరణించాడు

కాకతీయ ప్రభువుల్లో గణపతిదేవుడు గొప్పవాడనటంలో సందేహం లేదు. తెలుగు భాషను మాట్లాడే చాల ప్రాంతాల్ని ఒకే అధికారం క్రిందకు తెచ్చి వ్యవసాయకంగా, వాణిజ్యపరంగానే కాక ఇంకా అనేక రంగాల్లో ఈ ప్రాంత అభివృద్ధికి నాంది పలికాడు క్రీ పూ 1240 నుండే తన కుమార్తె రుద్రాంబను పాలనా వ్యవహారాల్లో చురుకుగా పాల్గొనేట్లు ప్రోత్సహించి చక్రవర్తిగా గణపతిదేవుడు తన విజ్ఞతను, ముందు చూపును ప్రదర్శించాడు

## రుద్రాంబ (క్రీ.శ.1262 – 1296)

గణపతి దేవుని మరణం తర్వాత క్రీ శ 1262లో రుద్రాంబ కాకతీయ సామ్రాజ్యానికి నాయకత్వం వహించింది. ఆంధ్రదేశాన్ని ఏలిన ఏకైక మహిళ రుద్రాంబ. స్త్రీ సింహాసనం చేపట్టడం ఇష్టం లేని సామంతులు తిరుగుబాటు లేవదీశారు కాని రుద్రాంబ వీటన్నింటినీ ఎదుర్కొని సామ్రాజాన్ని అవిచ్ఛిన్నంగా కాపాడగల్గింది.

క్రీ శ 1268 – 70 సంవత్సరాల మధ్య యాదవరాజైన మహాదేవుడు కాకతీయ సామ్రాజ్యంపై దండయాత్ర చేశాడు. దీనివల్ల రాజ్యానికి ఏ మాత్రం నష్టం కలుగలేదు. ఏ భూభాగాన్ని వదులుకోలేదు.

క్రీ శ 1280 లో రుద్రాంబ తన మనుమడైన ప్రతాపరుద్రదేవుని యువరాజుగా పట్టాభిషిక్తుణ్ని చేసింది. 1285లో పాండ్యులు, యాదవులు, హొయసాలులు కూటమిగా చేరి కాకతీయ సామ్రాజ్యాన్ని కబళించాలని ప్రయత్నించినపుడు యువరాజు ప్రతాపరుద్రుడు వారి ప్రయత్నాన్ని విచ్ఛిన్నం చేశాడు

## ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1296 – 1323)

క్రీ శ. 1296లో రుద్రాంబ మరణించడంతో ప్రతాపరుద్రుడు రాజ్యపాలన చేపట్టాడు. తాను పరిపాలనా భాద్యతల్ని స్వీకరించిన నాటినుండే ప్రతాపరుద్రుడు అనేక సంస్కరణల్ని ప్రవేశపెట్టాడు. గణపతిదేవుని కాలంలో తన అధీనంలోని వివిధ ప్రాంతాలకు రాజప్రతినిధుల్ని నియమించి ఆయా ప్రాంతాల పాలనా బాధ్యతల్ని వారి కప్పగించేవారు. వీరినే 'నాయకులు' అంటారు ఈ నాయకుల్ని వివిధ కులాల్నుండి నియమించే ఆచారం ఉండేది. దీనినే

'నాయంకార పద్ధతి' అంటారు. కాని ప్రతాపరుద్రుడు ఈ ఆచారానికి స్వస్తిపల్కి కేవలం పద్మనాయక కులం నుండే నాయకుల్ని నియమించాడు. ఇతర కులాల నాయకుల్ని తొలగించాడు క్రీ.శ. 1303లో ఉత్తర భారతం నుండి ముస్లింలు దండయాత్ర చేయడంతో ప్రతాపరుద్రుని సంస్కరణా కార్యకలాపాలకు ఆటంకం కల్గింది క్రీ శ 1303 నుండి క్రీ శ 1323 వరకు కాకతీయ సామ్రాజ్యంపై ఢిల్లీ పాలకులు అయిదుసార్లు దండయాత్ర చేశారు. ఈ దండయాత్రల వల్ల కాకతీయ సామ్రాజ్యం పతనమయింది

యాదవరాజ్యమైన దేవగింపై విజయం సాధించిన తర్వాత క్రీ శ 1296 లో అల్లాఉద్దీన్ ఢిల్లీ సింహాసనాన్ని చేపట్టాడు. కార, అలహాబాదు ప్రాంతాల గవర్నరుగా ఉన్నప్పుడు అనధికారంగా అల్లాఉద్దీన్ దేవగిరిపై దండయాత్రను నిర్వహించాడు ఈ యుద్ధంలో విజయం సాధించిన తర్వాతనే తన మామ సుల్తాను జలాలుద్దీన్ను హత్యగావించి తన్ను తాను సుల్తానుగా ప్రకటించుకున్నాడు దేవగిరిని సునాయాసంగా గెలవడంతో అల్లాయుద్దీన్ ఖిల్జీ మరల 1303 లో దక్షిణ భారత దండయాత్ర చేశాడు అయితే కాకతీయ సైన్యం కరీంనగరు జిల్లాలోని ఉప్పరపల్లి వద్ద ముస్లిం సైన్యాన్ని ఓడించింది. మరల క్రీ శ 1307 లో మాలిక్ కాఫర్ నాయకత్వాన ముస్లిం సేనలు దక్షిణదేశంపై దండయాత్ర చేసి దేవగిరిని ముట్టడించడానికి ప్రయత్నించాయి. తర్వాత 1310 జనవరి 19న వరంగల్లు కోటను మాలిక్ కాఫర్ ముట్టడించాడు. కాకతీయ సైన్యం రెండు నెలల పాటు వీరోచితంగా పోరాడి చివరికి మార్చి 19న లొంగిపోయి మాలిక్ కాఫర్ విధించిన షరతులకు అంగీకరించింది. ప్రతాపరుద్రుడు తన అపార సంపదను సమర్పించడమే కాకుండా ఢిల్లీ సుల్తాన్‌కు ప్రతిఏటా కప్పం కట్టడానికి అంగీకరించాడు

మాలిక్ కాఫర్ ఢిల్లీ చేరుకోగానే రాయసీమ లోని కాకతీయ సామంతులైన అంబరాజు (గండికోట), త్రిపురాంతకుడు (వల్లూరు) తిరుగుబాటు చేశారు ప్రతాపరుద్రుడు తన సైన్యాన్ని నడిపించి తిరుగాబాటును అణచివేశాడు ఈ సమయంలోనే శ్రీశైలం, త్రిపురాంతకాలలోని ప్రసిద్ధి చెందిన శివాలయాల్ని ప్రతాపరుద్రుడు దర్శించాడు దట్టమైన అడవులతో కూడియున్న ఈ ప్రాంతాల్ని చూచి నివాసయోగ్యంగా చేయదల్చాడు. అడవుల్లోని చెట్లను

నరికించి అధిక భూభాగాన్ని వ్యవసాయాయోగ్యంగాను, నివాసయోగ్యంగాను తీర్చిదిద్ది కొత్త గ్రామాల్ని నిర్మించాడు. తెలంగాణా, కోస్తా ప్రాంతాల ప్రజల్ని ఈ ప్రాంతానికి వచ్చి స్థిరపడేందుకు ప్రోత్సహించాడు. ఈ ప్రాంతాన్ని ఒక 'నాయంకర'గ రూపొందించి స్థానిక ముఖ్యుడైన వీడెము కొమ్మరాజుకు పాలనా బాధ్యతల్ని అప్పజెప్పాడు

రాయలసీమలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకున్న తర్వాత ప్రతాపరుద్రుడు కంచిపైన, పాండ్యరాజులపైన దండయాత్ర చేశాడు కంచిని స్వాధీనం చేసికొని వీరపాండ్య, సుందరపాండ్యలను ఓడించాడు ప్రతాపరుద్రుడు మాలిక్ కపూర్ తో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రతిఏటా ఢిల్లీ సుల్తానుకు కప్పం కట్టేవాడు. క్రీ శ. 1316లో అల్లాయుద్దీన్ మరణించడంతో సింహాసనం కోసం పోరాటం ప్రారంభమైంది దీన్ని అసరాగా తీసుకుని ప్రతాపరుద్రుడు ఢిల్లీ సుల్తానుకు కట్టవలసిన కప్పాన్ని నిలిపివేశాడు. అయితే క్రీ శ 1318లో కుతుబుద్దీన్ ముబారక్ ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించాడు. సుల్తానుకు కట్టాల్సిన కప్పాన్ని రాబట్టుకునేందుకు ఖుస్రూ ఖాన్ నాయకత్వంలో వరంగల్లుపైకి తన సైన్యాన్ని పంపాడు. ఈ సమయంలో ప్రతాప రుద్రుడు కంపిలి రాజైన కుమార రాజుతో యుద్ధంలో వున్నందున ఢిల్లీ సుల్తాన్ తో సంధి కుదుర్చుకుని, కట్టాల్సిన కప్పాన్ని పూర్తిగా చెల్లించాడు

క్రీ.శ. 1320 లో ఢిల్లీ సింహాసనంపై ఖిల్జీల అదుపు తప్పడంతో తుగ్లకులు అధికారం చేపట్టారు. ఘియాసుద్దీన్ ఢిల్లీ సుల్తానయ్యాడు. కప్పం విధించే విషయంలోను, రాజ్యాక్రమణ విషయంలోను దక్కను ప్రాంతంలో అనుసరించవలసిన వ్యూహాన్ని ఘియాసుద్దీన్ మార్చేశాడు. ఈ మధ్యలో ప్రతాపరుద్రుడు మరల సుల్తానుకు కట్టవలసిన కప్పాన్ని నిలిపివేశాడు. అంతే కాకుండ ఖిల్జీ గవర్నరైన ఖుస్రోకు తాను దత్తం చేసిన చాదర్ కోట మొదలగు ప్రాంతాల్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు క్రీ.శ. 1321లో ఢిల్లీ సుల్తాన్ తన కుమారుడైన ఉలుగ్ ఖాన్ నాయకత్వంలో అతిపెద్ద సైన్యాన్ని వరంగల్లుపైకి పంపాడు. కాని ఈ దాడిని వరంగల్లు సైన్యం తిప్పికొట్టడంతో ఢిల్లీ సైన్యానికి విపరీతమైన నష్టం కల్గింది. ఢిల్లీ సైన్యం తిరుగుముఖం పట్టింది. అయితే తర్వాత నాలుగు నెలలకే ఢిల్లీ సైన్యం వరంగల్లుపై దాడిచేసి విజయాన్ని సాధించింది.

ప్రతాపరుద్రుడు కుటుంబసమేతంగా బందీ అయి ఢిల్లీకి పంపబడ్డాడు కాని ప్రతాపరుద్రుడు మార్గమధ్యంలోనే ఆత్మహత్య చేసికొని ప్రాణాలు విడిచాడు.

వరంగల్లును ఆక్రమించిన తర్వాత ఉలుగ్ ఖాన్ తీరం మీదుగా నెల్లూరు నుండి రాజమండ్రి వరకు గల ప్రాంతాలపై దాడి జరిపి 1324 సెప్టెంబరు కంతా కాకతీయ సామ్రాజ్యాన్నంతటినీ స్వాధీనం చేసుకున్నాడు. ఎవరూ ఊహించని రీతిలో వరంగల్లుతో పాటు కాకతీయ సామ్రాజ్యమంతా శత్రువుల స్వాధీనం కావడంతో ప్రజల్లో భయాందోళనలు ఎక్కువయ్యాయి దీనికి తగ్గట్టుగానే ముస్లిం పాలకులు పరమనిరంకుశంగా పాలన చేశారు. దీనితో అనతి కాలంలోనే కాకతీయ సామంతులు నాయకత్వం వహించి ముస్లిం పాలన నుండి విముక్తి పొందేందుకు ఒక ఉద్యమం చేపట్టారు

## కాకతీయులు ఆంధ్రసంస్కృతికి చేసిన సేవ

ఆంధ్రుల సంస్కృతీ వికాసానికి కాకతీయులు ఎనలేని సేవ చేశారు. దాదాపు మూడు వందల సంవత్సరాలు పాలించిన కాకతీయులు ముస్లిం దండయాత్రల నుండి ఆంధ్రదేశాన్ని రక్షించి ఆంధ్రుల చరిత్రకు, సంస్కృతికి ఒక రూపం కల్పించారు.

### సాహిత్యం

తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నింటినీ ఒకే అధికారం క్రిందికి తెచ్చి ఆంధ్రదేశానికి ఒక గుర్తింపు కలుగుజేసినవారుగా కాకతీయులు చిరస్మరణీయులు. వీరి కాలంలోనే తెలుగు భాషా సాహిత్యాలు క్రమంగా వికాసదిశలో పయనించాయి. నన్నయ రచించిన మహాభారత కావ్యమే తెలుగు భాషలో వెలువడిన మొదటి రచన. రాజమండ్రి నేలిన తూర్పు చాళుక్య రాజైన రాజరాజనరేంద్రుని కాలంలో (క్రీ.శ. 1019-61) నన్నయ మహాభారత రచన కుపక్రమించి పూర్తి చేయలేకపోయాడు కాని నెల్లూరు ప్రభువైన మనుమసిద్ధి ఆస్థానకవి, మంత్రియైన తిక్కన మహాభారతంలో మిగిలిన 15 పర్వాల్ని పూర్తి చేశాడు. మనుమసిద్ధిని గద్దె నెక్కించేందుకు గణపతి దేవుని సహాయం కోరి వరంగల్లుకు వచ్చి అక్కడే ఈ 15 పర్వాల్ని పూర్తిచేయడం విశేషం.

విద్యానాథుడు, సకలకల్యమల్లుడు, పాల్కురికి సోమనాథుడు, భాస్కరుడు వంటి ప్రసిద్ధి చెందిన కవులు కాకతీయుల కాలంలో వెలసిన వారే. మొదట

ప్రతాపరుద్రుడు స్వయంగా నీతిశాస్త్రం అను గ్రంధాన్ని రచించాడు పాల్కురికి సోమనాధుడు రచించిన బసవపురాణం, పండితారాధ్య చరిత్ర ఈ నాటికీ ప్రసిద్ధి చెందిన కావ్యాలుగా మిగిలిపోయాయి. భాస్కరరామాయణం కూడ ఈకాలంలో వెలువడ్డ రచనయే ప్రసిద్ధుడైన సుమతి శతక కర్త బద్దెన కూడ కాకతీయుల యుగానికి చెందినవాడే

## కళలు

కాకతీయులు ఆలయాల్ని నిర్మిచడంలో శ్రద్ధ కనపరిచారు అనమకొండలోని రుద్రేశ్వరాలయం, వరంగల్లు కోటలోని స్వయం భూనాధ దేవాలయం కాకతీయులు చేపట్టిన నిర్మాణాలే రామప్ప దేవాలయం, పిల్లల మర్రి దేవాలయాలు కళాజగత్తులో గొప్పవిగా నిలిచిపోయాయి వరంగల్లు కోటలో కన్పించే గంభీరమైన నాలుగు మహాద్వారాలు ఆంధ్రకళాకారుల నైపుణ్యానికి చిహ్నాలుగా దర్శనమిస్తాయి కాకతీయ రాజధానియైన వరంగల్లునే 'ఆంధ్రమహానగరం' అని కూడ వ్యవహరిస్తారు ఆంధ్రదేశం లోని ఏ నగరానికి ఇటువంటి ఖ్యాతి లభించలేదు

## సాగునీటి నిర్మాణాలు

కాకతీయుల కాలంలో వ్యవసాయం విశేషంగా అభివృద్ధి చెందింది ఈ అభివృద్ధికి కాకతీయ రాజులు నిర్మించిన అనేక చెరువులు, కొలనులు, బావులు మొదలైనవి దోహదం చేశాయి వీటిలో రామప్ప చెరువు, పాకాల చెరువు పేర్కొనదగినవి. ప్రతాపరుద్రుడు కర్నూలు జిల్లాలోని అటవీ ప్రాంతమైన చాల భూభాగాన్ని వ్యవసాయ యోగ్యంగాను, నివాసయోగ్యంగాను చేసి అక్కడ వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చి స్థిరపడేందుకు ప్రోత్సహించాడు

## మతం

క్రీ శ. 11వ శతాబ్దిలో కాకతీయులు తమ అధికారాన్ని స్థాపించేనాటికి, ఆంధ్రదేశంలో జైనమతం విశేష ప్రచారంలో ఉండేది. కాని రెండు శతాబ్దాలకే జైన మతం ఆంధ్రదేశం నుండి కనుమరుగైంది. జైనమతం స్థానంలో శైవమతం విశేషంగా వ్యాప్తిలోకి వచ్చింది శ్రీపతి, శివలెంక మంచన, మల్లిఖార్జున పండితారాధ్యుడు అను ముగ్గురు ఆంధ్రదేశంలో శైవమత వ్యాప్తికి

మూలకారకులయ్యారు కర్ణాటక ప్రాంతంలో వీరశైవం వీరవిహారం చేయడంతో మతసంఘర్షణలు మొదలై రక్తపాతానికి దారితీసింది ఈ ప్రభావం నుండి ఆంధ్రదేశం గూడ తప్పించుకోలేకపోయింది శైవులకు, జైనులకు మధ్య అనేక సంఘర్షణలు జరిగాయి. అనమకొండలోని 'పద్మాక్షి' ఆలయంతోపాటు అనేక జైన ఆలయాలు శివాలయాలుగా మార్చబడ్డాయి రెండవ ప్రోలయ తర్వాత వచ్చిన కాకతీయ రాజులు గొప్ప శైవభక్తులుగా మారారు. కాని వీరు ఎప్పుడూ మత మౌఢ్యంతో ప్రవర్తించలేదు జైనులకు శైవులకు మధ్య తలెత్తిన అనేక వివాదాల్ని పరిష్కరించడానికి ప్రయత్నించారు

ఒక్కమాటలో కాకతీయుల పాలన ఆంధ్రదేశానికి, తెలుగుబాషకు ఒక ప్రత్యేక అస్థిత్వాన్ని కలుగజేసిందని చెప్పవచ్చు

## విజయనగర సామ్రాజ్యం (క్రీ.శ. 1336 – 1678)

కాకతీయ సామ్రాజ్యం పతనం తర్వాత ముస్లిం పాలకుల నిరంకుశత్వం మితిమీరిపోవడంతో దక్షిణ భారతంలోని ప్రజలకు ఒకరకమైన భద్రతారాహిత్య భావం కలిగింది దీనితో ఇస్లాం మతాన్ని ఎదుర్కోవడానికి హిందువులు సుసంఘటితంగా సిద్ధమయ్యారు ఈ ప్రయత్నంలో హరిహర బుక్కరాయ సోదరులు ప్రత్యేకపాత్రను నిర్వహించారు ఈ అన్నదమ్ముల జన్మస్థలం వరంగల్లు కాకతీయ ప్రభువైన ప్రతాపరుద్రుని వద్ద హరిహరరాయలు మంత్రిగాను, బుక్కరాయలు కోశాధికారిగాను పనిచేశారు క్రీ శ. 1323లో వరంగల్లును ముస్లింలు ముట్టడించడంతో ఈ సోదరులు తప్పించుకు పారిపోయారు తుంగభద్రా నది ఉత్తరపు ఒడ్డున వెలసిన కంపిలి రాజ్యంలో వీరు తమ సేవలు నిర్వహించారు కంపిలి రాజ్యాన్ని కూడ ముస్లింలు కబళించినపుడు వీరు తుంగభద్రను దాటి వచ్చి క్రీ.శ. 1336లో 'విజయనగరం' అనే ఒక కొత్త నగరాన్ని స్థాపించారు.

విజయనగర సామ్రాజ్యాన్ని నాలుగు రాజవంశాలు వరుసగా పాలించాయి అవి 1) సంగమవంశం 2) సాళువ వంశం 3) తుళువ వంశం 4) ఆరవీడు వంశం

## సంగమ వంశం (క్రీ.శ. 1336 – 1485))

మొదటి హరిహరరాయలు (1336-1356), మొదటి బుక్కరాయలు (1356-1377), రెండవ హరిహరరాయలు (1377-1406), మొదటి దేవరాయలు(1406-1422), రెండవ దేవరాయలు(1422-1465) మరియు విరూపాక్షుడు (1465-1485) వరుసగా సంగమ వంశానికి చెందిన రాజులు విరూపాక్షుని పాలనలో బహమనీ సుల్తాను ప్రధాన మంత్రియైన మహమ్మద్ గవాన్ విజయనగరంపై దండెత్తి వచ్చాడు విరూపాక్షుడు బహమనీ రాజ్యపు సవాలును ఎదుర్కోలేకపోయాడు విరూపాక్షుడు తన కుమారుని చేత సంహరింపబడ్డాడు. కాని విరూపాక్షుని కుమారుడు పశ్చాతాపముచే పదవీ కాంక్షలేక సింహాసనాన్ని తన తమ్ముడైన ప్రౌఢదేవరాయలకు త్యాగం చేశాడు కాని చంద్రగిరి పాలకుడైన సాళువ గుండయ కుమారుడైన సాళువ నరసింహుడు ప్రౌఢదేవరాయలను పదవీచ్యుతుని చేసి సింహాసనాన్ని అదిష్టించి కొత్త రాజవంశానికి నాందిపలికాడు

## సాళువ వంశం (క్రీ.శ. 1485 – 1505)

ఈ వంశంలో సాళువ నరసింహరాయలు, ఇమ్మడి నరసింహరాయలు అను ఇద్దరు రాజులు మాత్రమే రాజ్యపాలన చేశారు.

## తుళువ వంశం (క్రీ.శ. 1505 – 1570)

క్రీ శ 1505 లో వీరసరసింహరాయలు ఇమ్మడి నరసింహరాయుల్ని సంహరించి సింహాసనం చేపట్టడంతో తుళువ వంశ రాజుల పాలన ప్రారంభమయింది వీరసరసింహరాయల తర్వాత అతని సవతి తమ్ముడైన శ్రీ కృష్ణదేవరాయలు 1509లో విజయనగర రాజ్యాధీశుడుగా పదవీ బాధ్యతల్ని చేపట్టాడు.

## శ్రీకృష్ణదేవారాయలు ( క్రీ.శ. 1509 – 1529)

దక్షిణ భారతాన్ని ఏలిన రాజులందరిలోను శ్రీకృష్ణదేవరాయలు ప్రసిద్ధుడైన గొప్ప చక్రవర్తి. 1509లో తాను రాజ్యాధికారం చేపట్టేనాటికి రాజ్యంలోని పరిస్థితులు అస్తవ్యస్తంగాను, నిరాశాజనకంగాను ఉండేవి. ఒరిస్సా పాలకులు నెల్లూరు వరకు గల తీరాంధ్ర దేశాన్ని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. విజయనగరాన్ని ఫణంగా పెట్టి తన సరిహద్దుల్ని విస్తరింపజేయాలని బీజాపూరు

సుల్తాను ప్రయత్నాలు ప్రారంభించాడు.

ఈ పరిస్థితుల్లో శ్రీ కృష్ణదేవరాయలు, విజయనగరంపై కలసికట్టుగా మతయుద్ధం (జీహాద్) ప్రారంభించే ప్రయత్నంలో ఉన్న దక్కను ముస్లిం పాలకులపై తన దృష్టి మరల్చాడు. ఈ ముస్లిం రాజ్యాల కూటమికి యూసఫ్ ఆదిల్‌ఖాన్ నాయకత్వం వహించాడు కాని శ్రీకృష్ణదేవరాయలు, ముస్లిం కూటమి సైన్యాన్ని ఆదోని వద్ద చిత్తుగా ఓడించాడు. వెనుతిరిగిన ముస్లిం సైన్యాన్ని వెంటాడి కోవలకొండ వద్ద మరోసారి ఓడించాడు. ఈ యుద్ధంలో యూసఫ్ ఆదిల్‌ఖాన్ మరణించాడు క్రీ.శ. 1512లో రాయచూరును రాయలు ఆక్రమించాడు కృష్ణా- తుంగభద్రా నదుల మధ్య ప్రాంతమంతా శ్రీకృష్ణదేవరాయల అధీనంలోకి వచ్చింది అక్రమంగా అధికారానికి వచ్చిన బారిద్ మమాలిక్‌ను తొలగించి, మహమ్మద్‌షాకు బహమనీ రాజ్యాన్ని తిరిగి కట్టబెట్టాడు

తర్వాత కృష్ణదేవరాయలు ఉమ్మత్తూరు పాలేగార్లపై తన దృష్టిని మరల్చి ఉమ్మత్తూరును స్వాధీనం చేసుకోవడమే కాక, శివసముద్రం, శ్రీరంగపట్టణాల్ని కూడ వశపర్చుకున్నాడు

## ఒరిస్సా దండయాత్ర

శ్రీ కృష్ణ దేవరాయలు ఒరిస్సా పాలకులపై అయిదుసార్లు దండయాత్ర చేశాడు ఒరిస్సా పాలకులు స్వాధీనం చేసుకున్న నెల్లూరు జిల్లాలోని ఉదయగిరిని తిరిగి వశం చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. క్రీ శ 1513లో దుర్భేద్యమైన ఉదయగిరి కోటపై దండెత్తి అతి పెద్దదైన ప్రతాపరుద్రుని సైన్యాన్ని ఓడించగల్గాడు. ఒరియా సైన్యం కొండవీడులో తలదాచుకోవలసి వచ్చింది ఉదయగిరిని స్వాధీనం చేసుకున్న తరువాత శ్రీకృష్ణదేవరాయలు శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుపతిని సందర్శించాడు తిరుమల గుడిలోని ద్వారం వద్ద తన విగ్రహాన్ని తన రాణులైన చిన్నాదేవి, తిరుమల దేవి విగ్రహాల్ని ప్రతిష్ఠించాడు.

శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించిన తర్వాత శ్రీ కృష్ణదేవరాయలు మరల రెండోసారి ఒరియా పాలకులపై దండయాత్ర చేశాడు. కొండవీడు మార్గంలో గల కందుకూరు, వినుకొండ, బెల్లంకొండ మొదలైన కోటల్ని

స్వాధీనం చేసుకున్నాడు కొండవీడును చుట్టుముట్టాడు కాని సైన్యాధిపతియైన సాళువ తిమ్మయ కోటను వశపరుచుకోలేక పోయాడు. అందువల్ల శ్రీ కృష్ణదేవరాయలు స్వయంగా సైన్యాన్ని నడిపించి పెద్ద ఎత్తున దాడిచేశాడు చివరకు ఒరియా సైన్యం లొంగిపోయింది. యువరాజైన వీరభద్రునితో పాటు చాలమంది ఒరియా రాజప్రముఖులను బంధించి విజయనగరానికి తీసుకుపోయాడు

ఇక మూడవ దండయాత్రలో కృష్ణానది ఒడ్డున గల బెజవాడను రాయలు స్వాధీనం చేసుకున్నాడు. గోల్కొండ మార్గంలో ఉన్న కొండపల్లిని కూడ ఆక్రమించాడు నల్గొండ, వరంగల్లు, జిల్లాలోని కోటలన్నీ విజయనగరం అధీనంలోకి వచ్చాయి.

నాల్గవ దండయాత్రలో వేంగి రాజ్యం తిరిగి స్వాధీనమయింది రాజమండ్రి అతి సునాయాసంగా చేజిక్కింది. తర్వాత శ్రీకృష్ణదేవరాయలు సింహాచలం వెళ్ళి అక్కడి ఆలయంలోని నరసింహస్వామిని దర్శించాడు పొట్నూరు వద్ద తన విజయాలకు చిహ్నంగా ఒక విజయస్థంభాన్ని నాటించాడు

చివరిదైన అయిదవ దండయాత్రలో శ్రీకృష్ణదేవరాయలు గజపతుల రాజధానియైన కటకంపై దండయాత్ర సాగించాడు యువరాజైన వీరభద్రుడు విజయనగర చెఱసాలలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతాపరుద్రుడు సంధికి అంగీకరించాడు. క్రీ శ 1518లో జరిగిన ఒడంబడిక ప్రకారం ప్రతాపరుద్రుడు తన కుమార్తెను శ్రీకృష్ణదేవరాయలకిచ్చి వివాహం జరిపించాడు దీనికి ప్రతిఫలంగా శ్రీకృష్ణదేవరాయలు కృష్ణానదికి ఉత్తరంగా తాను ఆక్రమించిన ప్రాంతాలన్నింటినీ ఒరిస్సా రాజుకు తిరిగి ఇచ్చేశాడు.

## గోల్కొండ

శ్రీకృష్ణదేవరాయలు ఒరిస్సా దండయాత్రలో తలమునకలై ఉండగా, గోల్కొండ సుల్తాను అయిన కులీకుతుబ్ షా పానగల్లు, గుంటూరు ప్రాంతాలపై దాడిచేసి వరంగల్లు, ఖమ్మంపేట, కొండపల్లి, ఏలూరు, రాజమండ్రిలో గల కోటల్ని స్వాధీనం చేసుకున్నాడు ఒరిస్సా ప్రభువు నుండి కృష్ణా గోదావరీ ముఖద్వారాల మధ్య గల ప్రాంతాన్నంతా బలవంతంగా చేజిక్కించుకున్నాడు

తర్వాత నాదెండ్ల గోపన్న అధీనంలో ఉన్న కొండవీడును చుట్టుముట్టాడు నాదెండ్ల గోపన్న శ్రీకృష్ణదేవరాయల మంత్రియైన తిమ్మరుసుకు మేనల్లుడు. గోపన్న గోల్కొండ సైన్యాన్ని సమర్థవంతంగా ఎదుర్కోలేకపోయినపుడు తిమ్మరుసు స్వయంగా సైన్యాన్ని నడిపించి గోల్కొండ సైన్యాన్ని ఓడించడమే కాక వారి సేనాపతియైన మదరుల్ ముల్కును బంధించాడు.

## బిజాపూర్

శ్రీకృష్ణదేవరాయలు చివరిసారిగా బిజాపూర్‌ను పాలిస్తున్న ఇస్మాయిల్ ఆదిల్‌షాపై దండయాత్ర చేశాడు శ్రీ శ 1512లో రాయలచే ఆక్రమింపబడ్డ కృష్ణా, గోదావరి నదుల మధ్య ప్రాంతాన్ని తిరిగి బిజాపూరుకు స్వాధీనం చేయవలసిందిగా సుల్తాను కోరాడు. ఈ నేపధ్యంలో సాగిన యుద్ధంలో బిజాపూరు సైన్యం చిత్తుగా ఓడిపోయింది తర్వాత శ్రీకృష్ణదేవరాయలు గుల్బర్గా వరకు తన సైన్యాన్ని నడిపించి అక్కడ గల కోటను ధ్వంసం చేశాడు ముహమ్మదుషా పెద్ద కుమారునికి బహమనీ రాజ్యాన్ని అప్పగించి మిగిలిన ఇద్దరు కొడుకుల్ని బంధీలుగా విజయనగరానికి తీసుకుపోయాడు.

## పోర్చుగీసులతో సంబంధాలు

శ్రీకృష్ణదేవరాయలు పోర్చుగీసు వారితో స్నేహపూర్వక సంబంధాల్ని కలిగియుండేవాడు క్రీ శ 1510లో భారతదేశంలోని పోర్చుగీసుల ఆధీనంలో గల ప్రాంతాలన్నింటికి గోవా కేంద్రస్థానమయింది దీని ఫలితంగా వాణిజ్యం అభివృద్ధి చెందింది శ్రీకృష్ణదేవరాయలు ఆరేబియా గుర్రాల్ని పోర్చుగీసు వారి ద్వారా పొందేవాడు ఇదేకాక పోర్చుగీసువారు తుపాకులు మొదలయిన యుద్ధ సామాగ్రిని కూడ విజయనగరానికి అందచేశారు ఈ ఆయుధసామగ్రితోనే రాయలు రాయచూరుపై దండెత్తాడు. విజయనగరానికి నీరు సరఫరా చేసేందుకు పోర్చుగీసు ఇంజనీర్లు సహాయపడ్డారు

శ్రీకృష్ణదేవరాయలు చివరి రోజులు విషాదకరంగా మారాయి రాయలు తాను జీవించి ఉండగానే తన చిన్న కుమారుడైన తిరుమలదేవుని విజయనగర రాజుగా చేశాడు కాని తిరుమలదేవుడు సింహాసనం అదిష్ఠించిన ఎనిమిది నెలలకే మరణించాడు తిమ్మరుసు కుమారుడైన తిమ్మడు తిరుమలదేవునికి విషప్రయోగం

చేసి చంపాడని రాయలకు తెలిసింది అందువల్ల తిమ్మని, తిమ్మరుసును బంధించి వారి కళ్లు పీకించి వేశాడు. ఈ పరిణామాల వల్ల శ్రీకృష్ణదేవరాయలు తన చివరిరోజుల్లో అశాంతికి గురయ్యాడు. తన సవతి తమ్ముడైన అచ్యుతరాయల్ని రాజుగా ప్రకటించి క్రీ.శ 1529 సంవత్సరాంతంలో మరణించాడు.

## రాయల గొప్పతనం

దక్షిణ భారతాన్నేలిన రాజుల్లో శ్రీకృష్ణదేవరాయలు ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించాడు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి గొప్ప యుద్ధవీరుడుగా, సమర్థుడైన పాలకుడుగా, కళాసాహిత్యాల ఉదారపోషకుడుగా, శ్రీకృష్ణదేవరాయలు కీర్తిని గడించాడు ఆయనే ఒక ఇతిహాసంగా మారిపోయాడు. చదవులు రాని గ్రామస్థులు, పిల్లలు కూడ రాయల విజయాల్ని గూర్చి నెమరు వేసుకుంటారు రాయల సామ్రాజ్యానికి కేంద్రస్థానంగా ప్రస్తుత ఆంధ్రదేశంలోని రాయలసీమ జిల్లాలు ఉండేవి

ఒక యుద్ధవీరుడుగా రాయలు తన పరాక్రమాన్ని శత్రురాజులైన దక్కను సుల్తానులకు, ఒరిస్సా పాలకులకు చవిచూపించాడు బహమనీ రాజ్యంపై రాయలు చేసిన దండయాత్రలు అతని సైనిక శక్తిని, యుద్ధవ్యూహాన్ని స్పష్టం చేస్తాయి దక్కను ప్రాంతంలో రాజకీయ సుస్థిరతను కాపాడటానికి రెండుసార్లు బహమనీ రాజవంశాన్నే సింహాసనంపై అదిష్టింపచేశాడు ఇదే విధంగా పోర్చుగీసువారితో రాయలకున్న స్నేహసంబంధాల వల్ల 16వ శతాబ్దిలోని రాజకీయ పరిస్థితిని రాయలు క్షుణ్ణంగా అర్థం చేసుకున్నట్లు మనకు అర్థమవుతుంది. రాయలు జరిపిన ఒరిస్సా దండయాత్రలు ఆ కాలం నాటి సైనిక చరిత్రలో గొప్ప విజయాలుగా మిగిలిపోయాయి.

పాలకుడుగా రాయలు తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు విస్తృతమైన విజయనగర సామ్రాజ్యాన్ని మండలాలుగాను, నాడులుగాను, సీమలుగాను విభజించి చిన్నచిన్న గ్రామాలు కూడ ప్రభుత్వం వల్ల ప్రయోజనం పొందేటట్లు చూడగల్గాడు

కళాసాహిత్య రంగాలకు ఆశ్రయమిచ్చి వాటిని పోషించడంలో రాయలకు మించినవారు లేరు తెలుగు సాహిత్య చరిత్రలో రాయల యుగాన్ని స్వర్ణయుగంగా బావించవచ్చు ఇంగ్లాండులో ఎలిజబెత్తు యుగానికి, గ్రీసులో 'పెరిక్లీసు'

యుగానికి రాయల కాలాన్ని పోల్చవచ్చు. రాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలనే ఉద్దండ కవులుండేవారు వీరిలో మనుచరిత్ర కారుడైన అల్లసాని పెద్దన సాటిలేని మేటి కవిగా ప్రసిద్ధి చెందాడు ఈయన్నే ఆంధ్రకవితాపితామహుడని కూడ అంటారు. పారిజాతాపహరణ కావ్యాన్ని వ్రాసిన నందితిమ్మన, మాదయగారి మల్లన, దూర్జటి, అయ్యలరాజు రామభద్రుడు, పింగళి సూరన, రామరాజభూషణుడు, తెనాలి రామలింగ కవి అష్టదిగ్గజాల్లోని మిగిలిన కవులు. రాయలు కూడ స్వయంగా గొప్ప కవిత్వాన్ని చెప్పగల్గాడు. ఆయన రచించిన 'ఆముక్తమాల్యద' అనే గ్రంథం తెలుగు సాహిత్యంలో ఎన్నదగిన ప్రబంధంగా గుర్తింపబడింది. రాయలు సంస్కృత, కన్నడ సాహిత్యాల్ని కూడ పోషించాడు

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప కట్టడాలు నిర్మించాడు విజయనగరంలోని హజార రామాలయం, విఠలస్వామి ఆలయం రాయలు నిర్మించినవే. తన తల్లి జ్ఞాపకార్థం నాగలాపురమనే పట్టణాన్ని నిర్మించాడు ఒక మాటలో చెప్పాలంటే శ్రీకృష్ణదేవరాయలు ఆసియా, ఐరోపా దేశాల్లో విరాజిల్లిన గొప్ప చక్రవర్తులతో సమానుడని చెప్పవచ్చు.

## విజయనగర సామ్రాజ్య పతనం

శ్రీకృష్ణదేవరాయల తర్వాత ఆయన సవతి తమ్ముడు అచ్యుతరాయలు క్రీ శ 1530 నుండి 1542 వరకు రాజ్యపాలన చేశాడు అచ్యుతరాయలు క్రూరమైన మనస్తత్వం కలవాడు కావడంతో రాజ్యపాలనం సక్రమంగా చేయలేపోయాడు అధికారాన్నంత తన మంత్రియైన ఆరవీడు రామరాజు చెలాయించేవాడు. ఆరవీడు రామరాజు కృష్ణదేవరాయల అల్లుడు అచ్యుతరాయల తర్వాత ఆయన కుమారుడు మొదటి వెంకటరాయలు రాజ్యాదికారానికి వచ్చాడు కాని అనతికాలంలోనే మరణించాడు. తర్వాత రామరాయలు అచ్యుతరాయల తమ్ముడి కుమారుడైన సదాశివరాయల్ని క్రీ.శ 1543లో రాజుగా ప్రకటించి ప్రభుత్వాన్ని తానే నిర్వహించాడు.

## తాళికోట యుద్ధం (క్రీ.శ. 1565)

తన అధికారాన్ని, కీర్తిని పెంచుకునేందుకు రామరాయలు దక్కను సుల్తానులైన బిజాపూరు, అహమ్మదు నగరు, గోల్కొండ పాలకుల వ్యవహారాల్లో

తలదూర్చేవాడు 1543లో రామరాయలు అహమ్మదు నగరు, గోల్కొండ సుల్తానులతో చేతులు కలపి బిజాపూరు రాజ్యంపై దండెత్తాడు పదిహేను సంవత్సరాల తర్వాత (1558) బిజాపూరు సుల్తానుతో చేతులు కలపి అహమ్మదు నగరుపై దండయాత్ర చేశాడు. ఈ పరిస్థితుల్లో ముస్లిం రాజ్యాలు కూడ పల్కుకొని తమ మధ్యగల వైరాన్ని విస్మరించి కలసికట్టుగా రామరాయలపై యుద్ధాన్ని ప్రకటించడానికి నిర్ణయించాయి దీని ఫలితమే తాళికోట యుద్ధం

రాక్షస తంగడి అని కూడ వ్యవహరింపబడే ఈ తాళికోట యుద్ధం జనవరి 25, 1565న జరిగింది మొదట విజయనగర సైన్యానికి విజయం చేకూరినా, ముస్లింల కాల్బలం ముందు వారు నిలువలేకపోయారు ముస్లింల బందీగా చిక్కిన రామరాయల తలను అహమ్మదు నగరు సుల్తాను హుస్సేను నిజాంషా నరికి వేశాడు

తాళికోట యుద్ధం తర్వాత ముస్లిం రాజ్యకూటమి మరల విడిపోయింది యధాప్రకారం అంతఃకలహాలు మొదలయ్యాయి ఈ పరిస్థితి రామరాయల తమ్ముడైన తిరుమల రాయల పాలనలో విజయనగరం తిరిగి కోలుకోవడానికి దోహదపడింది 1570లో తిరుమల రాయలు నామమాత్రంగా సాగుతున్న సదాశివరాయల్ని పదవీచ్యుతిని చేసి సింహాసనమధిష్ఠించాడు ఈ విధంగా ఆరవీడు వంశరాజుల పాలన మొదలయింది విజయనగరాన్నేలిన చివరి రాజవంశం గూడ ఇదే రెండవ వెంకట రాయల కాలంలో విజయనగర రాజధానిని చిత్తూరు జిల్లాలోని చంద్రగిరికి మార్చారు ఆరవీడు వంశం క్రీ.శ 1675 వరకు తన అధికారాన్ని కొనసాగించగల్గింది

## కుతుబ్‌షాహి వంశం – గోల్కొండ రాజ్యం (1512–1687)

విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన తొమ్మిది సంవత్సరాలకు (క్రీ.శ 1347లో) అల్లాయుద్దీన్ జాఫర్ ఖాన్ బహమనీ దక్కను ప్రాంతంలో బహమనీ రాజ్యంగా వ్యవహరింపబడే ఒక ముస్లిం రాజ్యాన్ని స్థాపించాడు. ఈ బహమనీ రాజ్యం రాయచూరు ప్రాంతంపై (కృష్ణ, తుంగభద్ర నదుల మధ్య ప్రాంతం) పట్టు సంపాదించడం కోసం విజయనగర రాజ్యంతో అనేక యుద్ధాలు చేసింది. చివరికి 1526లో పతనమయింది. పతనమయిన ఈ బహమనీ రాజ్యంలో

మరల అయిదు కొత్త సుల్తానుల రాజ్యాలు లేచాయి. అవి 1.ఇమాద్ షాహి వంశం పాలించే బేరారు 2 నిజం షాహి వంశం పాలించే అహమ్మదు నగరు 3 ఆదిల్ షాహి వంశం పాలించే బిజాపూరు 4 కుతుబ్ షాహి వంశం పాలించే గోల్కొండ 5 బరిదుషాహి వంశం పాలించే బీదరు రాజ్యాలు.

## కుతుబ్షా (1512–1543)

సుల్తాను కులి షియా జాతికి చెందినవాడు క్రీ శ 1514లోను, 1530లోను బీదరు, బీజాపూరుల మధ్య జరిగిన కలహాల్లో ఆయన బీదరుకు సహాయాన్ని అందించాడు దాదాపు 98 సంవత్సరాలు జీవించి తన కుమారుడైన జంషిద్ చేత చంపించబడ్డాడు

## జంషిద్ (1543–1550)

జంషిద్ ఏడు సంవత్సరాలు మాత్రమే పాలించినా బీజాపూర్ లో అనేక యుద్ధాలు చేశాడు క్రీ శ 1550లో శైశవదశలో ఉన్న తన కుమారుడైన సుబాన్ను రాజుగా ప్రకటించి ప్రాణాలు వదిలాడు కాని సుబాన్ మామయ్యైన ఇబ్రహీం అతనిని పదవీచ్యుతుణ్ణి చేసి సుల్తానుగా తన్ను తాను ప్రకటించుకున్నాడు

## ఇబ్రహీం (1550 – 1580)

ఇబ్రహీం అహమ్మదునగరు సుల్తాను మొదటి హుస్సేను నిజాంషా కుమార్తెను వివాహమాడాడు. విజయనగర రాజ్యానికి వ్యతిరేకంగా ముస్లిం కూటమిని ఏర్పాటు చేయడంలో ఇబ్రహీం నాయకత్వం వహించాడు. ఈ కూటమే 1565లో జరిగిన తాళికోట యుద్ధంలో విజయగనర సామ్రాజ్యాన్ని పూర్తిగా నాశనం చేసింది ఇబ్రహీం కాలంలోనే వరంగల్లు శాశ్వతంగా గోల్కొండ రాజ్యంలో కలిపివేయబడింది.

## ముహమ్మదు కులి కుతుబ్షా (1580–1612)

హైదరాబాదు నగర స్థాపకుడుగా పేరుగాంచిన ముహమ్మద్ కులి కుతుబ్ షా 1589లో గోల్కొండకు పది మైళ్ళ దూరంలో ఒక కొత్త నగరాన్ని నిర్మించాడు ఈ నగరానికి తన హిందూ ప్రేయసియైన భాగమతి పేరు మీదుగా 'భాగ్యనగరు' అని పేరు పెట్టాడు తర్వాత కాలంలో ఈ భాగ్యనగరాన్నే హైదరాబాదు అని

వ్యవహరించడం జరిగింది హైదరాబాదులోని ముఖ్య కట్టడమైన చార్మినార్ ఇతని కాలంలో నిర్మింపబడ్డదే. ఈయన తర్వాత రాజ్యాధికారానికి వచ్చిన ముహమ్మదు క్రీ.శ 1612 నుండి 1626 వరకు రాజ్యపాలన చేశాడు

## అబ్దుల్లా కుతుబ్‌షా (1626–1672)

క్రీ.శ. 1635లో మొగలు చక్రవర్తియైన షాజహాన్ ఆధిపత్యాన్ని అబ్దుల్లా అంగీకరించవలసి వచ్చింది. ఈ సంఘటనకు ముందే 1634లోతూర్పు ఇండియా కంపెనీకి ఆంధ్రతీరప్రాంతంలో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇస్తూ ఒక 'సువర్ణ ఫర్మాను'ను అబ్దుల్లా జారీ చేశాడు. అబ్దుల్లా ప్రధాన మంత్రియైన మీర్‌జుమ్లా ప్రభుద్రోహిగా మారి ఔరంగజేబుతో రహస్యంగా మంతనాలు జరిపాడు. దీని ఫలితంగా దక్కను ప్రాంతానికి మొగలు రాజప్రతినిధి అయిన ఔరంగజేబు 1655లో గోల్కొండపై దాడిచేసి హైదరాబాదు నగరాన్ని దోచుకున్నాడు దీంతో అబ్దుల్లా పెద్ద మొత్తంలో నష్టపరిహారాన్ని చెల్లించి ఔరంగజేబుతో సంధి కుదుర్చుకోవలసి వచ్చింది అబ్దుల్లా తర్వాత ఆయన మేనల్లుడు అబుల్ హసన్ తానీషా అధికారాన్ని చేపట్టాడు.

## అబుల్ హసన్ (తానీషా) 1672–1687

అబుల్ హసన్‌కు ప్రధానమంత్రిగా వైష్ణవ బ్రాహ్మణుడైన అక్కన్న ఉండేవాడు. ఇతని తమ్ముడు మాదన్న సర్వసైన్యాధిపతిగా ఉండేవాడు. ఫిబ్రవరి, 1677 లో ఔరంగజేబుకు వ్యతిరేకంగా శివాజీతో అబుల్‌హసన్ సంధి కుదుర్చుకున్నాడు మార్చి, 7, 1677న శివాజీ హైదరాబాదును సందర్శించాడు ఆ సమయంలో శివాజీని తానీషా విశేషంగా ఆదరించి సన్మానించాడు ఇది పసిగట్టిన ఔరంగజేబు 1687 లో గోల్కొండపై దండెత్తి వచ్చాడు. మతోన్మాదులైన కొందరు ముస్లింలు అక్కన్న, మాదన్నల్ని చంపేశారు. అబ్దుల్ రజాక్ అనే సేనాపతి గోల్కొండ దుర్గాన్ని సమర్థవంతంగా కాపాడాడు. ఏడునెలల ముట్టడి తర్వాత కూడ గోల్కొండ దుర్గం ఔరంగజేబు వశం కాలేదు దీంతో ఔరంగజేబు విశేషంగా లంచమిచ్చి కోటలోనికి ప్రవేశించగలిగాడు. అబ్దుల్ రజాక్ ధైర్యసాహసాలతో పోరాటం జరిపినా ఫలితం లేకపోయింది కాని రజాక్ ఔరంగజేబు క్రింద పనిచేయడానికి ఒప్పుకోలేదు. తానీషా బందీ అయ్యాడు

దౌలతాబాదులోని చెఱసాలలో ఉంచబడ్డాడు. 1687 అక్టోబరు నెలలో గోల్కొండ రాజ్యం పతనమయింది. దీంతో కుతుబ్‌షాహి వంశపాలన అంతమయింది. గోల్కొండ మొగలు సామ్రాజ్యంలో విలీనం చేయబడింది.

## మొగలుల దక్కను ఆక్రమణ

తాళికోట యుద్ధం (25 జనవరి 1565) తర్వాత దక్కను సుల్తానులు పూర్వంలాగే పరస్పరం కలహించుకోవడం ప్రారంభించారు. వీరి కలహాల్ని ఆసరాగా తీసుకొని దక్కనులో తన ఆధిపత్యాన్ని స్థాపించాలని మొగలు చక్రవర్తి అక్బరు ప్రయత్నించాడు మొదట క్రీ.శ. 1595లో అహ్మదునగరును ముట్టడించాడు రాణి అయిన చాంద్‌బీబీ నగరాన్ని రక్షించడానికి సర్వశక్తులా ప్రయత్నించింది. అయినా లాభం లేకపోయింది. మొగలుల ఆధిపత్యాన్ని అంగీకరించి, బీరారును వదలుకోవలసి వచ్చింది క్రీ శ 1600లో రెండవసారి మరో దండయాత్రని ఎదుర్కోవలసి వచ్చింది. తర్వాత షాజహాను కాలంలో ఈ రాజ్యం మొత్తాన్ని మొగలు సామ్రాజ్యంలో విలీనం చేయగల్గారు.

షియా తెగకు చెందిన గోల్కొండ, బిజాపూరు రాజ్యాలంటే షాజహానుకు వ్యతిరేక భావం ఉండేది. అందువల్ల క్రీ శ. 1636లో ఈ రాజ్యాలపై దండయాత్ర చేసేందుకు తన సైన్యాన్ని దక్కను ప్రాంతం వైపు నడిపించాడు

గోల్కొండ ప్రభువైన కుతుబ్‌షాహి వంశస్థుడు అబ్దుల్లా, షాజహాన్ ఆధిపత్యాన్ని అంగీకరించి ప్రతిఏటా కప్పం కట్టడానికి ఒప్పుకున్నాడు ఔరంగజేబు దక్కను ప్రాంతానికి మొగలుల రాజప్రతినిధిగా నియమించబడ్డాడు అప్పటికి దక్కను ప్రాంతంలో ఖాందేష్, బేరారు, దౌలతాబాదు, తెలంగాణా కొంతభాగం మొగలుల ఆధీనంలో ఉండేవి. 1644లో ఔరంగజేబు ఆగ్రాకు తిరిగి వచ్చాడు. మరల 1653లో ఔరంగజేబు దక్కను ప్రాంత రాజప్రతినిధిగా రెండవసారి వచ్చి నాలుగు సంవత్సరాల పాటు గడిపాడు

### గోల్కొండ పతనం

క్రీ.శ. 1682లో ఔరంగజేబు మహారాష్ట్రుల ఆధిపత్యాన్ని, బిజాపూరు, గోల్కొండ రాజ్యాల్ని అణచివేయడానికి చక్రవర్తి హోదాలో స్వయంగా వచ్చాడు. 1686లో బిజాపూరును స్వాధీనం చేసుకున్నాడు. 1685 జూన్

భారత దేశానికి కొత్త సముద్ర మార్గాన్ని కనుగొనడంలో పోర్చుగీసు నావికులు ముందంజ వేశారు. పోర్చుగల్ రాజైన హెన్రీ గొప్ప నావికుడుగ ప్రసిద్ధి చెందాడు. ఆయన భారత దేశానికి సముద్రమార్గాన్ని కనుగొనేందుకు పోర్చుగీసు నావికుల్ని ప్రోత్సహించాడు. హెన్రీ ప్రయత్నాలు క్రీ. శ. 1498లో సఫలీకృత మయ్యాయి. వాస్కోడిగామా అను పోర్చుగీసు నావికుడు 1498లో భారత దేశపు పశ్చిమ తీర ప్రాంతమైన కాలికట్‌కు చేరుకున్నాడు. దీంతో చిరకాలంగా ఎదురుచూచిన కొత్త సముద్ర మార్గం కనుగొన బడింది.

కాలికట్ రాజైన జమోరిన్ పోర్చుగీసు వారికి హృదయ పూర్వకంగా స్వాగతం పల్కాడు. మరికొంత కాలానికే కాలికట్, కొచ్చిన్, కన్ననూరు ప్రాంతాల్లో పోర్చుగీసువారు తమ వ్యాపార కేంద్రాల్ని స్థాపించారు. భూమార్గం మీదుగా యూరపులో సాగుతున్న ఆసియా వ్యాపారాన్నంతా ముస్లింల నుండి కైవశం చేసుకుని తాము కనుగొన్న కొత్త సముద్ర మార్గానికి మళ్లించడం, ఇండియాతోనేగాక తదితర తూర్పు దేశాలైన ఆగ్నేయాసియా, చైనా వంటి దేశాలతో కూడ తమ వ్యాపారాన్ని విస్తృత పరచడం వంటివి పోర్చుగీసువారు తమ ప్రదాన లక్ష్యాలుగ పెట్టుకున్నారు.

క్రీ శ. 1500– 1509 సంవత్సరాల మధ్య కాలంలో హిందూ మహా సముద్రంపై తమ ఆధిపత్యాన్ని స్థాపించడంలో పోర్చుగీసువారు సఫలీకృతులయ్యారు. క్రీ. శ. 1503లో వారు కొచ్చిన్ వద్ద ఒక నౌకా స్థావరాన్ని ఏర్పరచుకొన్నారు ఆ తర్వాత సంవత్సరములోనే ఇండయాలోని పోర్చుగీసు ప్రాంతాలకు రాజప్రతినిధిగా నియమింప బడ్డ ఫ్రాన్సిస్‌ది ఆల్మెడా కొచ్చిన్ చేరుకున్నాడు. ఆయన తన కున్న వనరుల్ని భారతదేశంలో వలస రాజ్యాన్ని స్థాపించడం కోసం వినియోగించ కూడదనుకున్నాడు. సముద్రంపై తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంటూ వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలని భావించాడు. అందుకే పోర్చుగీసువారు తమ కార్యకలాపాల్ని వ్యాపారం వరకే పరిమితం చేసుకున్నారు. ఆల్మెడా అనుసరించిన ఈ పద్ధతినే 'నీలి నీటి విధానం' (Blue Water Policy) అని వ్యవహరిస్తారు.

ఆల్మెడా తర్వాత రాజ ప్రతినిధిగ వచ్చిన ఆల్బనోన్సిడి అల్బూకర్క్ నీలి నీటి విధాన్ని పూర్తిగా త్రోచిపుచ్చి భారతదేశంలోని భూభాగాల్ని ఆక్రమించడానికి ఉపక్రమించాడు. క్రీ. శ. 1510లో గోవాను, 1511లో మలక్కా దీవిని

ఆక్రమించాడు శ్రీ కృష్ణదేవరాయలు పోర్చుగీసు వారితో స్నేహ సంబంధాల్ని ఏర్పరచుకొని గోవా పోర్చుగీసు వారి ఆధీనంలో ఉండేందుకు అంగీకరించాడు పోర్చుగీసువారు మలక్కాదీవిని ఆక్రమించడమేగాక ఆగ్నేయాసియాలోని దీవుల్ని కూడ స్వాధీనం చేసుకున్నారు

తూర్పు దేశాలతో నిరాటంకంగా సాగుతున్న పోర్చుగీసు వ్యాపారానికి క్రీ శ 16వ శతాబ్ది చివరి కల్లా డచ్చి దేశీయుల నుండి పోటీ ఎదురయింది లిస్బన్ వంటి నౌకా కేంద్రాలనుండి సుగంద ద్రవ్యాలు మొదలగు తూర్పు దేశపు వస్తువుల్ని కొనుగోలు చేసి డచ్చివారు ఉత్తర యూరపులో అమ్మేవారు కాని 1594లో స్పెయిన్-పోర్చుగల్ రాజైన రెండవ ఫిలిప్ తన రాజ్యంలోని లిస్బన్ మొదలగు నౌకా కేంద్రాలలోకి డచ్చివాళ్ళ ప్రవేశాన్ని నిషేదించాడు దీంతో సుగంధ ద్రవ్యాలు డచ్చి ప్రజలకు అందకుండా పోయాయి. తూర్పు దేవాల వస్తువుల్ని నేరుగా కొనుగోలు చేయడానికి డచ్చివారు నిర్ణయించుకున్నారు ఇదే సమయంలో తూర్పు దేశాలతో వ్యాపారం నిర్వహించేందుకు డచ్చివారికి అనుకూలవాతావరణం ఏర్పడింది

వాన్ లిన్స్ కొటెన్ అను డచ్చి ప్రయాణీకుడు ఆగ్నేయాసియాలో దాదాపు తొమ్మిది సంవత్సరాలు గడిపి క్రీ శ 1592లో మాతృభూమిని చేరుకున్నాడు. ఆయన తన అనుభవాల్ని రెండు పుస్తకాల రూపంలో వెలువరించాడు వీటిలో 1595లో వెలువడిన Revsgeschrift అనే పుస్తకం మొదటిది. 1596 లో వెలువడిన Itincrario అన్నది రెండవది. మొదటి పుస్తకం తూర్పు సముద్రాల నావికా మార్గాల్ని సూచించేది కాగా, రెండవది తూర్పు దేశాల్లో తాను జరిపిన ప్రయాణపు అనుబవాల్ని గురించి చెపుతుంది ఈ రెండు పుస్తకాలు యూరోప్‌పై విపరీత ప్రభావాన్ని చూపాయి. మొదటి సారిగా తూర్పు దేశాల్ని గురించిన నిజమైన వివరాల్ని యూరోపియనులు తెలుసుకోగల్గారు. హాలండు దేశ వర్తకులు 1595లో వర్తక సంఘాన్ని (Campaignie Van verre) ఏర్పాటు చేసుకొన్నారు. కార్నెలిస్ ది హాట్ మాన్ నాయకత్వంలో వారు ఆగ్నేయాసియాకు వ్యాపార సాహస యాత్రకు ఉపక్రమించారు. క్రీ. శ. 1596 జూన్ నెలలో జావాకు వాయవ్య తీరంలో వున్న 'బాంతమ్' ఓడ రేవుకు చేరుకున్నారు. ఈ వ్యాపార యాత్ర విజయవంతం కావడంతో 1595-1601 మధ్య కాలంలో పోటీ మనస్తత్వంగల కొన్ని స్వతంత్ర

బృందాలు దాదాపు 15 యాత్రలు నిర్వహించాయి క్రీ. శ 1600 నాటికి ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ ఏర్పాటు కావడంతో డచ్చి నెదర్లాండు పాలకులు కూడ వివిధ బృందాలుగ వున్న వ్యాపారస్థులందర్ని కలిపి ఒకే వర్తక సంఘాన్ని ఏర్పాటు చేయ దల్చారు. తూర్పు దేశాలపై తమకున్న వ్యాపార పరమైన ఆది పత్యాన్ని నిలుపుకోవాలని ప్రయత్నించారు. ఈ ప్రయత్నంవల్లే క్రీ శ 1602లో నెదర్లాండ్ యునైటెడ్ ఈస్టిండియా కంపెనీ అనే వ్యాపారసంస్థ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పడింది

సుగంధ ద్రవ్యాల వ్యాపారాన్ని తమ గుత్తాధిపత్యం క్రిందికి తెచ్చుకోవాలన్న ఉద్దేశంతో డచ్చివారు మొదట భారత దేశంపై కంటె తూర్పు దీవులపైన్నే తమ దృష్టిని కేంద్రీకరించారు. డచ్చి ఈస్టిండియా కంపెనీ మొదట విల్ బ్రాండ్ వాన్ వార్విజిక్ నాయకత్వంలో 15 వ్యాపార నౌకల్ని పంపింది తూర్పు దీవుల్లోని జావా, సెలిబస్ మొదలగు ప్రాంతాల్లో ఫ్యాక్టరీల్ని స్థాపించింది ఇండియాలో సూరత్, మచిలీపట్నం, పేటపోల్లి (కృష్ణా జిల్లా) ప్రాంతాల్లో డచ్చి ఫ్యాక్టరీలు వెలశాయి నాగపట్నం, నరసాపురం, బీముని పట్నం, చిన్సురా (బెంగాలు) మొదలగుచోట్ల కూడ డచ్చివారు ఫ్యాక్టరీలు స్థాపించారు.

## ఆంగ్లేయుల రాక

ఇంగ్లాండు దేశం కూడ ఇతర యూరపు దేశాల వలెనే సుగంధ ద్రవ్యాల్లాంటి తూర్పు దేశపు వస్తువుల్ని ఇటలీ వ్యాపార నౌకల ద్వారా తమ నౌకా కేంద్రాలకు తెచ్చుకునేవారు. తాము వుత్పత్తి చేస్తున్న ఉన్ని దుస్తుల్ని ఆసియాదేశాల్లో విక్రయించి, ఆసియాలో వ్యాపార సంబంధాల్ని వృద్ధి చేసుకునేందుకు ఇంగ్లండు కూడ మక్కువ చూపింది కాని క్రీ శ 17వ శతాబ్ది వరకు వివిధ కారణాలవల్ల తూర్పు దేశాలతో వ్యాపారాల్ని ఇంగ్లాండు చేపట్టలేక పోయింది సుదూర సముద్రయానానికి తగిన నౌకా సంపత్తి లేకపోవడం, అట్లాంటిక్ సముద్రం భౌగోళికంగా ఇంగ్లాండు దేశాన్ని మధ్యధరా సముద్రంలో సాగే యూరపు వ్యాపారానికి దూరంగా వుంచడం ఈ వెనుక బాటు తనానికి ముఖ్య కారణాలుగ చెప్పవచ్చు. కాని 16వ శతాబ్దాంతానికి ఇంగ్లాండు తనకు కల్గిన అవరోధాల్ని అధిగమించ కల్గింది తన నౌకాయాన సామర్థ్యాన్ని పటిష్టం చేసుకో కల్గింది హిందు మహాసముద్రం,

అట్లాంటిక్ సముద్రాల్లో ప్రవేశం అవరోధ రహితం కావడంతో సముద్రాంతర మార్గాల విషయంలో తన భౌగోళిక స్థితిని వుపయోగించుకోడానికి సకల విధాల ప్రయత్నించింది

స్పెయిన్ దేశంతో విరోధం వల్ల తద్విరుద్ధమైన విదేశీ విధానాన్ని పాటించేందుకు ఇంగ్లాండు వలసరాజ్యస్థాపకు, వ్యాపారాన్ని విస్తృతం చేసేందుకు ప్రయత్నించింది క్రీ శ 1574లో ఇంగ్లీషు నావికుడైన ఫ్రాన్సిస్ డ్రేక్ మొలుక్కాస్‌లోని టెర్నేట్‌ను సందర్శించాడు ఇతడు తన ప్రయాణంలో ఉపయోగించిన అతివేగంగా నడిచే తేలిక పాటి నౌకలు సముద్రయానానికి అనువైనవని తేలడంతో ఇంగ్లాండుకు ఆత్మస్థైర్యం కల్గింది దీనికి తోడు లండను వర్తకులు తూర్పు దేశాలతో వ్యాపారానికి తమ సంసిద్ధతను వ్యక్త పరిచారు. కాని గుడ్ హోప్ అగ్రంగుండా సముద్ర ప్రయాణం ప్రమాద పూరితమైంది కావడంతో మొదటి ఎలిజబెత్తు రాణి తన అనుమతిని ఇచ్చి తగిన విధంగా ప్రోత్సహించలేక పోయింది

1583లో రాల్ఫ్ ఫిచ్ అను ఆంగ్లేయుడు పర్షియా గల్ఫ్ ప్రాంతం చేరుకున్నాడు. ఇతనిని పోర్చుగీసువారు బందించి గోవాకు తీసుకువచ్చారు కాని ఇతడు చెరనుండి తప్పించుకుని మలక్కా దీవికి వచ్చి అక్కడినుండి మాతృభూమికి చేరుకున్నాడు. భారత దేశ సంపదను గురించి ఇతడు అందజేసిన వివరాలతో తూర్పు దేశాలతో వ్యాపారం నిర్వహించాలన్న బ్రిటీషు వర్తకుల వాంఛ ద్విగుణీకృతమైంది. క్రీ శ. 1588లో స్పెయిన్ దేశంపై ఇంగ్లండు విజయం సాధించడంతో ఈ వర్తకుల్లో కొత్త ఆశలు చిగురించాయి. డచ్చి ప్రయాణీకుడైన వాన్ లిన్స్ కొటెన్ ప్రచురించిన రెండు పుస్తకాలు అందజేసిన వివరాలతో బ్రిటీషు వర్తకులకు సముద్రయానాన్ని గురించిన భయాలు తొలగిపోయాయి. దీంతో లండను వర్తకులంతా కలసి తూర్పు దేశాలతో వ్యాపారం నిర్వహించేందుకు అనుమతిని ఇవ్వవలసిందిగా ఎలిజబెత్తురాణికి విన్నవించుకొన్నారు దీనికి రాణి అంగీకరించడంతో 1600 సంవత్సరపు చివరి రోజున ఇంగ్లీషు ఈస్టిండియా వర్తక సంఘం ఏర్పాటయింది. గుడ్‌హోప్ అగ్రంనుండి మెగల్లాక్ జలసంధి వరకు గల ప్రాంతంపై వ్యాపార నిర్వహణలో 15 సంవత్సరాలపాటు గుత్తాధిపత్యం లభించింది కంపెనీ పాలనా వ్యవహారాల్ని నిర్వహించేందుకు ఒక గవర్నరు, 24 మంది సభ్యులు గల ఒక కమిటీని నియమించడం జరిగింది కాని తర్వాత ప్రతి సంవత్సరం కంపెనీ

వాటాదారులచే పాలకవర్గం ఎన్నుకో బడుతుంది ఈ కమిటినే తర్వాతి దశలో 'కోర్టు ఆఫ్‌డైరెక్టర్సు'గా అభివృద్ధి చెందింది ఈ కోర్టు డైరెక్టర్ల పనిని కంపెనీ వాటాదారులతో కూడిన 'జనరలు కోర్టు' పర్యవేక్షించేది ఈ జనరలు కోర్టే తర్వాత కాలంలో కోర్టు ఆఫ్ ప్రొప్రైటర్సుగా పరిణితి చెందింది

జేమ్స్ లంకాస్టర్ ఆధ్వర్యంలో సాగిన మొదటి వర్తక నౌకాయానానికి ఈష్టిండియా కంపెనీ 68,000 పౌన్ల మొత్తాన్ని సమకూర్చ కల్గింది ఈ మొదటి నౌకాయాత్ర క్రీ శ 1602 జూన్ నెలలో ఇండోనీషియాలోని 'ఆచిన్' నౌకా కేంద్రానికి చేరుకో గల్గింది 'బాంతమ్'లో ఒక ఫ్యాక్టరీని నెలకొల్పారు తూర్పు దీవుల్లో ఆంగ్లేయ వ్యాపారానికి బాంతమ్ ప్రధాన కేంద్రంగా మారింది తూర్పు దేశాలతో ఇదివరకు వ్యాపార సంబంధాల్ని కల్గివున్న డచ్చివారు ఆంగ్లేయుల వ్యాపారాన్ని వ్యతిరేకించలేదు.

ఇంగ్లీషు ఈష్టిండియా కంపెనీ రెండవ నౌకా యాత్ర హెన్రీ మిడిల్టను ఆధ్వర్యంలో సాగింది. సుగంధద్రవ్యాల్ని ఉత్పత్తి చేసే అంబాయనా, బండా ద్వీపాలతో ప్రత్యక్షసంబంధాల్ని నెలకొల్పుకోవాలని ఇంగ్లీషు ఈష్టిండియా కంపెనీ కోరుకుంది యూరోపులో సుగంధ ద్రవ్యాలకు గిరాకీ చాల పరిమితంగా వుండడంతో డచ్చివారు బ్రిటీషు వారితో అనుసరించవలసిన పద్ధతిని మార్చుకున్నారు కాబట్టి అంబాయనా వంటి ప్రాంతాలలో బ్రిటీషు వారి ప్రవేశానికి అయిష్టత చూపారు. అదీగాక సుగంధ ద్రవ్యాల వ్యాపారంలో ఎటువంటి ప్రమాదాన్నైనా ఎదుర్కొని గుత్తాధి పత్యాన్ని సంపాదించాలని డచ్చివారు ప్రయత్నించారు

## ఆంగ్లేయుల మూడవ నౌకా యాత్ర

ఆంగ్లేయులు మొదటి సారిగ 1608 లో సూరత్ లో అడుగుపెట్టడం వల్ల ఈ మూడవ యాత్ర చిరస్మరణీయమైందని చెప్పవచ్చు. ఇంగ్లీషు కమాండరు కేప్టన్ హాకిన్స్ మొగలు చక్రవర్తియైన జహంగీరు ఆస్థానాన్ని సందర్శించాడు హాకిన్స్‌కు ఘనస్వాగతం లభించింది. సూరతులో స్థావరం ఏర్పాటు చేసుకొనేందుకు ఆంగ్లేయులకు అనుమతి దొరికింది. కాని ఈ అనుమతి పోర్చుగీసు వత్తిడివల్ల ఉపసంహరించడం జరిగింది. ఈ విధంగా తూర్పు దీవుల్లో డచ్చివాళ్ళ వ్యతిరేకతను, భారత దేశంలో పోర్చుగీసుల వ్యతిరేకతను ఆంగ్లేయులు ఎదుర్కోవలసి వచ్చింది.

ఆగ్నేయాసియాలో తమ ఉన్ని దుస్తులకు గిరాకి లేకపోవడం, భారతీయ వస్త్రాలకు విపరీతమైన గిరాకీ వుండడం ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ గ్రహించింది. దీని వల్ల పోర్చు గీసు వ్యతిరేకతను ఎదుర్కొని అయినా సరే భారత దేశంతో వస్త్ర వ్యాపారాన్ని నిర్వహించాలని ఇంగ్లీషు కంపెనీ నిర్ణయించింది.

## 'గ్లోబు' నౌకాయాత్ర

బంగాళాఖాతంలోను, సయాం గల్ఫ్ ప్రాంతంలోను వ్యాపారం నిర్వహించేందుకు 'గ్లోబు' అనే ప్రసిద్ధిచెందిన నౌకను హిప్పన్ నాయకత్వంలో ఇంగ్లీషు కంపెనీ పంపింది. 1611 జనవరిలో 'గ్లోబు' మచిలీపట్నం చేరుకుంది. తీరాంధ్రంలో వ్యాపార సౌకర్యాన్ని పొందేందుకు గోల్కొండ నవాబుతో కంపెనీ సంప్రదింపులు జరిపింది. 1622 లోనే మచిలీపట్నం వద్ద ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు కంపెనీకి అనుమతిలభించింది. ఈ విధంగా ఈ గ్లోబు యాత్ర ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాంది పల్కింది. ఈ యాత్ర మచిలీపట్నంలో ఫ్యాక్టరీ నెలకొల్పడానికే కాక సయాం, బర్మా దేశాలతో వ్యాపార సంబందాల్ని ఏర్పరచుకొనేందుకు కూడ దోహదం చేసింది.

ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికి, తూర్పు దేశాలతో వ్యాపారాన్ని నిర్వహిస్తూనే వచ్చింది. 1612లో సూరతు సమీపంలోని స్వాలి వద్ద పోర్చుగీసు నౌకల్ని ఓడించడంతో బ్రిటీషు కంపెనీకి మంచి భవిష్యత్తు కన్పించింది. దాని ఫలితంగా మొగలు ఆస్థానంలో ఆంగ్లేయుల కీర్తి పెరిగింది. తర్వాత సూరతు వద్ద శాశ్వతంగా ఒక ఫ్యాక్టరీని నిర్మించేందుకు 1613లో జహంగీరు కంపెనీకి అనుమతి ఇచ్చాడు 1615లో మరోసారి ఆంగ్లేయులు పోర్చుగీసుల్ని ఓడించారు. ఈ విజయాల్ని ఆసరాగ తీసుకుని భారతదేశంలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు ఇంగ్లీషు కంపెనీ నిర్ణయించింది. దీనికై మొగలు ఆస్థానానికి ఒక రాయబారిని పంపమని తమ ప్రభుత్వంపై కంపెనీ ఒత్తిడి తెచ్చింది. దీని ఫలితంగానే 1615లో ఇంగ్లాండు రాజైన మొదటి జేమ్స్ తన రాయబారిగ సర్ థామస్ రో ను జహంగీరు ఆస్థానానికి పంపాడు. కంపెనీకి శాశ్వతమైన వ్యాపార సౌకర్యాల్ని కల్గించేందుకు ప్రయత్నించమని ఇంగ్లాండు రాజు థామస్ రోను ఆజ్ఞాపించాడు.

పోర్చుగీసులు పన్నిన వ్యూహం వల్ల చక్రవర్తితో వ్యాపార సంబంధమైన సంధి కుదుర్చు కోవడానికి సర్ థామస్ రో కు సాధ్యపడలేదు. కాని మొగలు సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో ఫ్యాక్టరీలు నెలకొల్పు కునేందుకు అనుమతిని సంపాదించ గల్గాడు. భారత దేశంలో ఆంగ్లేయులకై ఆయన పాటించిన విధానం వల్ల థామస్‌రో కంపెనీ చరిత్రలో చిరస్మరణీయుడయ్యాడు. ఆయన శాంతి యుతమైన వ్యాపార విధానాల్ని ప్రోత్సహించాడు. తూర్పు దేశాల్లో పోర్చుగీసు, డచ్చివారు పాటించిన ఘర్షణ సిద్ధాంతాన్ని వ్యతిరేకించాడు. అందుకే "యుద్ధమూ, వ్యాపారం ఒకే చోట సహ జీవనం చేయలేవు" అని రో అభిప్రాయపడ్డాడు సముద్రంలోను, శాంతియుత వ్యాపారంలోను లాభాల్ని ఆర్జించమని తన దేశస్థులకు సలహా ఇచ్చాడు.

మరి కొంత కాలానికే పోర్చుగీసు వ్యతిరేకతను ఇంగ్లీషు కంపెనీ అదిగమించ గల్గింది క్రీ.శ. 1620లో జాస్క్ సమీపాన పర్షియా తీరంలోని పోర్చుగీసు నౌకలు ఓడించబడ్డాయి. తర్వాత రెండేళ్ళకే పర్షియా రాజైన షా పోర్చుగీసుల నుండి ఆర్మజ్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఈ ఓటములతో భారతదేశంలో పోర్చుగీసుల ప్రాబల్యం క్షీణించడం ప్రారంభమయింది. ఇదే సమయంలో సూరతు మొదలగు ప్రాంతాల్లో గల ఇంగ్లీషు కంపెనీ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత పెరిగింది. గోవాలోని పోర్చుగీసు ప్రభుత్వం సూరతు లోని ఇంగ్లీషు కంపెనీ అధ్యక్షునితో సంధి కుదుర్చుకుంది.

## ఆంగ్లో-డచ్చి దేశీయుల ఆధిపత్యపు పోరాటం

సుగంధ దీవుల్లో (మలయా, జావా, సుమిత్ర మొదలైన దీవులు) ఆంగ్లేయుల కంటే డచ్చివాళ్ళఅధికారం పటిష్టంగా రూపొందింది. క్రీ.శ. 1610 నుండి డచ్చి కంపెనీ ఇంగ్లీషు కంపెనీతో అనుసరించవలసిన విధానాన్ని మార్చుకుంది. వ్యాపారంలో గుత్తాధిపత్యానికి ప్రయత్నించింది. డేవిడ్ మిడిల్టన్ నాయకత్వంలో ఇంగ్లీషు కంపెనీ ఐదవ నౌకాదళం బాండానైరా చేరుకున్నపుడు డచ్చికంపెనీ ప్రతిఘటించి వెనుదిరిగి పొమ్మని ఆజ్ఞాపించింది. అందువల్ల మిడిల్టన్ వాయుద్వీపానికి తరలి పోయాడు. ఈ వాయుద్వీపం డచ్చివాళ్ళ అధీనంలో లేదు.

ఈ పరిస్థితుల్లో ఇంగ్లీషు కంపెనీ తమ ప్రభుత్వ సహాయాన్ని కోరింది హేగ్‌లోని బ్రిటిషు రాయబారి ప్రయత్న ఫలితంగా లండనులోను (1613), హేగ్‌లోను (1615) రెండు సమావేశాలు ఇంగ్లీషు-డచ్చి ప్రభుత్వాల మధ్య జరిగాయి తూర్పు ఇండియా దీవుల్లో పోర్చుగీసుల్ని తరిమి వేయడంలో విశేషంగా శ్రమకు, ఖర్చుకు గురైనందున, సుగంధ ద్రవ్యాల వ్యాపారంలో గుత్తాధిపత్యం కావాలని డచ్చి ప్రభుత్వం పట్టుపట్టింది కాని ఇంగ్లీషు ప్రభుత్వం పై ఖర్చులోని కొంత భాగాన్ని ఇచ్చేందుకు కూడ అంగీకరించలేదు.

ఇంగ్లీషు కంపెనీ తూర్పు ఇండియా దీవుల్లో తమ వ్యాపారాన్ని నిర్వహించడానికే నిర్ణయించింది డచ్చివారి వ్యతిరేకతను లెక్కచేయలేదు డచ్చివాళ్లతో పోటీపడి వ్యాపారాన్ని నిర్వహించడానికే ఇంగ్లీషు కంపెనీ నిర్ణయించింది తమ నిర్ణయాన్ని అమలు చేసేందుకు వర్జీనియాలో తన పాలనా సామర్థ్యాన్ని చూపిన ధామస్ డేలె అను ఆంగ్లేయుని పంపింది. ఆయన ఆరు ఓడలతో సుగంధ దీవుల్ని చేరుకున్నాడు సూరతు తప్ప మిగిలిన అన్ని కంపెనీ ఫ్యాక్టరీలపై ఆయనకు అధికారం ఇచ్చింది ఇదే సమయంలో డచ్చి ప్రభుత్వం కూడ జాన్ పీటర్సన్ కొయన్ అను డచ్చి దేశీయుని గవర్నరు జనరలుగా నియమించింది. ఇతడు ధామస్ డెలె కంటె కడు సమర్థుడుగ నిరూపించుకొన్నాడు

1619 సంవత్సరం ప్రారంభంలో జకర్తాలోని డచ్చి ఫ్యాక్టరీ నుండి డచ్చివాళ్లను డేలె తరిమి వేయగల్గాడు కాని మరికొంత కాలానికే కొయన్ డచ్చి అధికారాన్ని జకర్తాలో తిరిగి స్థాపించ గల్గాడు దీంతో డెలె బాంతాంలోని కంపెనీ వస్తువులన్నింటిని కోరమాండలు తీరానికి పంపేశాడు మచిలీపట్నం నుండి డచ్చి నౌకలపై దాడి చేయడానికి నిర్ణయించాడు కాని తన ఆరునౌకల్ని కూడ డచ్చివారు నాశనం చేయగల్గారు. డేలె 1619 ఆగస్టులో మచిలీపట్నంలో మరణించాడు. ఈ విధంగా ఇంగ్లీషు కంపెనీ తన నిర్ణయాన్ని అమలు చేయలేక పోయింది కాని యూరపులోని రాజకీయ పరిస్థితులు తూర్పు ఇండియా దీవుల్లోని ఇంగ్లీషు కంపెనీ మనుగడను కాపాడగల్గాయి.. రెండు కంపెనీలు తమ ప్రభుత్వాల ఆదేశం మేరకు 1619 జూలైలో సంప్రదింపులు జరిపి సంధి కుదుర్చుకున్నాయి ఈ సంధి ప్రకారం మలక్కా దీవుల్లో నిర్వహించబడే మూడోవంతు సుగంధ వ్యాపారాన్ని ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీకి ఇచ్చేందుకు డచ్చి కంపెనీ అంగీకరించింది కాని

కొయన్ మాత్రం మలక్కా దీవుల్లోని ఒక యిసుకరేణువుపై కూడ ఇంగ్లీషు వారికి అధికారం లేదని భావించాడు ఈ సంధిని ఆచరణలో పెట్టడానికి సాధ్యం కాలేదు దీంతో అంబాయనా సమీపంలోని 'రున్' దీవి నుండి ఇంగ్లీషు వారిని డచ్చి కంపెనీ బహిష్కరించింది 1623 ప్రారంభంలోనే మలక్కా, బాండా, అంబాయనా దీవుల్లో తమ వ్యాపారానికి స్వస్తి చెప్పాలని ఇంగ్లీషు కంపెనీకూడ నిర్ణయించింది దీని కనుగుణంగా ఆజ్ఞలు గూడ జారీచేశారు కాని వారు తూర్పు ఇండియా దీవుల్ని చేరకముసుపే 'అంబాయనా హత్యాకాండ' జరిగింది 1623 ఫిబ్రవరిలో అంబాయనాలోని డచ్చికోటను స్వాధీనం చేసుకునేందుకు రహస్య సమాలోచనలు చేస్తున్నారన్న ఆరోపణపై 10 మంది ఆంగ్లేయుల్ని, తొమ్మిదిమంది జపాను దేశస్థుల్ని, ఒక పోర్చుగీసు దేశస్థుణ్ణి డచ్చి కంపెనీ విచారించి ఉరితీయడం జరిగింది ఈ సంఘటనే అంబాయనా' హత్యాకాండగ ప్రసిద్ధి చెందింది ఈ సంఘటన తర్వాత ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ తూర్పు ఇండియా దీవుల్లో డచ్చి కంపెనీతో తమ పోటీ వ్యాపారాన్ని వదలుకుని, భారతదేశంపై తన దృష్టిని కేంద్రీకరించింది ఆగ్నేయాసియాలోని మార్పిడి ఆర్థిక విధానంలో భారతదేశపు వస్త్రాలు ఎటువంటి కీలకమైన పాత్ర వహించాయో ఇంగ్లీషు కంపెనీ గ్రహించింది భారత దేశంలోని వస్త్రాల్ని కొని ఆగ్నేయాసియా మార్కెట్టులోని సుగంధ ద్రవ్యాలకు మార్చుకోవడానికి కంపెనీ నిర్ణయించింది ఆంధ్ర దేశంలో తయారయ్యే కాలికో గుడ్డలకు, రంగు బట్టలకు, పీతాంబరాలకుఆగ్నేయాసియా దేశాల్లో మంచి గిరాకి వుండేది

## ఆంగ్లేయులు – మద్రాసు స్థాపన

క్రీ శ 1612 నాటికే సూరతువద్ద ఆంగ్లేయులు ఒక ఫ్యాక్టరీని స్థాపించారు భారతదేశపు తూర్పు తీరంలో గోల్కొండ రాజ్యంలో ప్రసిద్ధి చెందిన రేవు పట్టణమైన మచిలీపట్నం వద్ద మరో ఫ్యాక్టరీని స్థాపించారు. నౌకా యానానికి అనువైన కేంద్రంగానే కాక గోల్కొండ రాజ్యంలో లభించే వజ్రాలు, పగడాలకు ముఖ్యవ్యాపార కేంద్రంగా కూడ మచిలీపట్నం ప్రసిద్ధి చెందింది. దీంతో పాటు వస్త్ర వ్యాపారం కూడ ఈ కేంద్రంలో విశేషంగా జరిగేది. ప్రసిద్ధి చెందిన రంగు వస్త్రాలు కలంకారీలు మచిలీపట్నానికి చుట్టు ప్రక్కల ప్రాంతాలలో విశేషంగా తయారుచేసేవారు. కోరమాండల్ తీరంలో ఆంగ్లేయ స్థావరాలకు మచిలీ పట్నం

కేంద్రస్థానంగా మారడంలో ఆశ్చర్యంలేదు. కాని మచిలీపట్నంలో బ్రిటీషువారి స్థానం గురించిఅంతగా అసూయపడనవసరం లేదు. డచ్చి, పోర్చుగీసుల వ్యతిరేక తనే గాక గోల్కొండ సుల్తాను యొక్క మహమ్మదీయ అధికారుల అణచివేత చర్యల్ని కూడ భరించాల్సి వచ్చింది. వస్త్ర వ్యాపారం లాభదాయకంగా వుండడంతో కొంతకాలం పాటు ఆంగ్లేయులు స్థానిక ఉద్యోగులు పెట్టే బాధల్ని సహించగల్గారు. ఈ విషయమై గొల్కొండ సుల్తానుకు అనేక విన్నపాల్ని కూడ సమర్పించారు. కాని లాభంలేక పోయింది. దీంతో అడుగడుగునా బాధలు ఎక్కువయ్యాయి ఇక చేసే దేమీ లేకపోవడంతో ఆంగ్లేయులు మచిలీపట్నంలోని తమ ఫ్యాక్టరీని వదలుకోవడానికి నిశ్చయించారు. గోల్కొండ రాజ్యాధీనంలో లేని ప్రాంతంలో మరో ఫ్యాక్టరీని నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు క్రీ.శ 1621లో డచ్చి స్థావరమైన పులికాట్ వద్ద ఒక ఫ్యాక్టరీని స్థాపించారు. డచ్చివారి ఈర్ష్యా ద్వేషాలకు గురి కావడంతో దాన్ని కూడ వదలుకొని క్రీ. శ. 1626లో నెల్లూరు జిల్లాలోని పులికాట్‌కు 35 మైళ్ళు ఉత్తరాన అరుముగం అనుచోట ఒక ఫ్యాక్టరీని స్థాపించారు. కాని అరుముగం మంచి నౌకా కేంద్రం కాదు అదీగాక అరుముగం చుట్టు పక్కల ప్రాంతాల్లో లభ్యమయ్యే వస్త్రాలు కూడ విదేశీ మార్కెట్టులో అమ్ముడు పోయేంత నాణ్యత కలవికావు. అదీగాక అరుముగం లేక అర్మగోవాన్ కర్ణాటక రాజ్యంలో వుండేది కాని కర్ణాటక రాజ్యంలో పరిస్థితులు అస్తవ్యస్థంగా తయారయ్యాయి మరల తీరప్రాంతంలో ఒక ఫ్యాక్టరీని స్థాపించేందుకు అనువైన స్థలంకోసం వెదకడం ప్రారంభించారు గోల్కొండ రాజ్యంలో నవాబు పరిపాలన స్థిరంగా వుండడంతో మరల మచిలీపట్నానికి పోయేందుకు సిద్ధపడ్డారు. అదీగాక గోల్కొండ నవాబు కూడ కొన్ని వ్యాపార రాయితీలు ఆంగ్లేయులకు కల్పించాడు అందువల్ల అర్మగోవాన్‌ను వదలి మరల మచిలీపట్నం చేరారు. కాని మచిలీపట్నం చేరిన తర్వాత ఆనౌకా కేంద్రం వస్త్రవ్యాపారానికి మునుపటివలె అనువైన ప్రదేశం కాదని ఆంగ్లేయులు గ్రహించారు ఆ ప్రాంతంలో విపరీతమైన కరవు రావడంతో చాలమంది నేతగాండ్రు చనిపోవడమో లేక జీవనార్థమై ఇంకో చోటుకు వలస వెళ్ళడమో జరిగింది

మచిలీపట్నంలో ఆంగ్లేయుల ప్రతినిధిగ థామస్ క్లార్క్ వుండేవాడు. ఈయన సహోద్యోగిగ ఫ్రాన్సిస్‌డే ఆర్మగోవాన్‌లో వుండేవాడు క్రీ శ 1638–

39 లో కంపెనీ డైరెక్టర్లు ఆర్మగోవాన్ లోని ఫ్యాక్టరీని వదలి వేయడానికి నిర్ణయించారు దీంతో ఫ్రాన్సిస్‌డే ఇంగ్లీషు ఫ్యాక్టరీకి అనువైన స్థలాన్ని వెదికేందుకు పాండిచ్చేరి, దాని చుట్టుప్రక్కల ప్రాంతాల్ని సందర్శించాడు అర్మగోవాన్ కు దక్షిణంగా ఫ్యాక్టరీని స్థాపించాలన్న ఆంగ్లేయుల ఉద్దేశాన్ని గమనించిన చంద్రగిరి రాజు సామంతుడైన దామెర్ల వెంకటాద్రి చంద్రగిరి రాజ్యంలోని మద్రాస పట్నం వద్ద ఫ్యాక్టరీని స్థాపించమని కోరాడు. వెంకటాద్రి సోదరుడు అయ్యప్ప మద్రాసుకు పశ్చిమంగా వున్న పూనమల్లెలో నివసిస్తూ ఆతీర ప్రాంతాన్ని సంరక్షిస్తూ వుండేవాడు ఈ ఇద్దరు సోదరులు శ్రీ కాళహస్తిలోని వెలుగోటి వంశానికి చెందినవారు ఈ ప్రాంతంలో వస్త్రోత్పత్తి ఎక్కువగా వుండడంతో ఇంగ్లీషువారు ఫ్యాక్టరీ స్థాపిస్తే తమకు కూడ లాభదాయకంగా వుంటుందని వీరు భావించారు

1639 లో వేసవికాలంలో ఫ్రాన్సిస్‌డే మద్రాసు దాని పరిసర ప్రాంతాల్ని సందర్శించాడు. అక్కడ తయారయ్యే వస్త్రాల నాణ్యతను పరిశీలించాడు నాణ్యతగల వస్త్రాలు తక్కువరేటుకు దొరకడం గమనించాడు దామెర్ల సోదరులతో సంప్రదింపులు జరిపి 1639 జూలై రెండవ తేదీన మద్రాస పట్నం వద్ద కోటను నిర్మించుకునేందుకు చంద్రగిరి రాజు నుండి అనుమతి పొందాడు ఈ అనుమతి ప్రకారం ఆంగ్లేయులు స్వయంగా నాణేలు ముద్రించుకోవచ్చు అదీగాక నౌకాకేంద్రం ద్వారా లభించే ఆదాయంలోను పన్నుల్లోను సగభాగాన్ని ఆంగ్లేయులు పొందవచ్చు ఈ రాయితీలే గాక తగినంత వస్త్రోత్పత్తిని చూపించని పక్షంలో ఆంగ్లేయులు నేతగాండ్ర కిచ్చిన డబ్బు మొత్తాన్ని తిరిగి వాపసు చేయగలమని చంద్రగిరి రాజు హామీ గూడ ఇచ్చాడు

భారత దేశపు తూర్పు తీరంలోని ఇంగ్లీషు ఫ్యాక్టరీలపై అధికారమున్న సూరతు కౌన్సిలు 1640 జనవరి 8న మద్రాసును స్వాధీనం చేసుకొమ్మని ఫ్రాన్సిస్‌డేకు ఒక అనుజ్ఞ చేసింది. అర్మగోవాన్ లోని ఫ్యాక్టరీని వదలి పెట్టి ఫ్రాన్సిస్‌డే 1640 ఫిబ్రవరి 20న మద్రాస పట్నం చేరుకున్నాడు మార్చి 1న సెయింటు జార్జి కోట నిర్మాణం ప్రారంభం అయింది చాలమంది నేతగాండ్రు ఈ ప్రాంతంలో స్థిరపడి తమ ప్రాంతానికి దామెర్ల వెంకటాద్రి తండ్రి దామెర్ల చెన్నప్ప జ్ఞాపకార్థం చెన్నప్ప పట్నం అని పేరు పెట్టారు. చెన్నపట్నం, మద్రాసు పట్నం వేరువేరు ప్రాంతాలు ఆంగ్లేయులు 1639-40లో తమ స్థావరంగా ఏర్పరచుకోక

ముందే మద్రాస పట్న గ్రామం వుండేది అనతి కాలంలోనే ఈ రెండు గ్రామాలు అభివృద్ధి చెంది ఒకే పట్నంగా కలసి పోయాయి ఈ రెండు గ్రామాల్ని ఆంగ్లేయులు మద్రాస పట్నమని పిలువగా, భారతీయులు మాత్రం చెన్నపట్నంగా వ్యవహరించారు తర్వాత కొంత కాలానికి ఈ రెండు గ్రామాలు విపరీతంగా అభివృద్ధి చెందడంతో వాటి ఉనికి ఇతమిద్ధమని చెప్పడం కూడ కష్టమైంది రాను రాను మద్రాస పట్నానికి ప్రాధాన్యత హెచ్చడంతో అది 'మద్రాసు'గ వ్యవహరింప బడింది 1641 సెప్టెంబరు 24న తూర్పు తీరంలోని ఇంగ్లీషు ఫ్యాక్టరీలకు మద్రాసు కేంద్రస్థానంగా రూపొందింది

1647లో మీర్ జుమ్లా మద్రాసు పరిసర ప్రాంతాల్ని ఆక్రమించినపుడు ఆంగ్లేయులు అనుభవిస్తున్న రాయితీల్ని శాశ్వతం చేశాడు 1684లో మద్రాసును ఒక ప్రెసిడెన్సీ కేంద్రంగా మార్చారు 1688లో మద్రాసు మునిసిపాలిటి స్థాయికి ఎదిగింది ఈ మునిసిపాలిటికి ఒక మేయరు, 10 మంది సభ్యులు నియమింపబడ్డారు ఈ పదిమందిలో ఏడుమంది భారతీయులకు స్థానం కల్పించడం విశేషం

## కొత్త కంపెనీ ఆవిర్భావం

మాతృదేశంలో ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ క్లిష్టసమస్యను ఎదుర్కోవలసి వచ్చింది 1635లో లండనులోని మరోవర్తక బృందం సర్ విలియం కోర్టెన్ నాయకత్వాన తూర్పు దేశాలతో వ్యాపారం నిర్వహించెందుకు మొదటి చార్లెసు నుండి అనుమతి పొందింది దీంతో మొదట ఏర్పడిన ఈస్టిండియా కంపెనీ ఏకస్వామ్యం దెబ్బతినింది ఈ రెండు కంపెనీల మధ్య వినాశకరమైన పోటీ పెరిగి పోవడంతో 1649లో ఈరెండింటిని ఒకే కంపెనీగ విలీనం చేశారు 1697లో క్రాంవెల్ ఒక చార్టరును కంపెనీకి మంజూరు చేసి శాశ్వత జాయింటు స్టాక్ పద్ధతిలో నడిపేందుకు అనుమతించాడు దీనివల్ల కంపెనీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది రెండవ చార్లెసు వివిధ చార్టర్ల ద్వారా కంపెనీకి స్వయం నిర్ణయాధికార ప్రతిపత్తిని కల్పించాడు. తర్వాత రెండవ జేమ్స్ స్వంత నాణేలు ముద్రించుకునేందుకు, భారత దేశంలోని ఆంగ్లేయుల్ని అదుపు చేసేందుకు, క్రైస్తవేతరులతో యుద్ధానికి, శాంతి కుదుర్చుకొడానికి కంపెనీకి అధికారమిచ్చాడు

## బొంబాయి స్వాధీనం

పోర్చుగీసు రాజకుమార్తెయైన కాథరిన్‌కు రెండవ చార్లెసుతో వివాహం జరిగింది ఈ సందర్భంలో పోర్చుగీసు రాజు తమ ఆధీనంలోని బొంబాయిని పెళ్ళి కానుకగా కాథరిన్‌కు ఇచ్చాడు ఈవిధంగా తన భార్య ద్వారా సంక్రమించిన బొంబాయిని 1688లో చార్లెసు కంపెనీకి స్వాధీనం చేశాడు కంపెనీ నుండి సంవత్సరానికి 10 పౌన్లను నామ మాత్రంగా తీసుకునేవాడు అనతి కాలంలోనే బొంబాయి ప్రాముఖ్యతను సంతరించుకున్నది సూరతుకు బదులుగా బొంబాయినే పశ్చిమతీరంలోని కేంద్రస్థావరంగా కంపెనీ రూపొందించింది

## కంపెనీ విధానంలో మార్పు

17వ శతాబ్ది చివరి దశకాల్లో కంపెనీ తన విధానాన్ని మార్చుకుంది దేశంలో రాజకీయ అస్థిరత చోటు చేసుకోవడంతో సర్ థామస్ రో ప్రతిపాదించిన శాంతియుత వర్తక విధానాన్ని వదలుకోవలసి వచ్చింది. మహారాష్ట్రులపై ఔరంగజేబు సాగించిన నిరంతర యుద్ధాలవల్ల దేశంలో అస్థిరత చోటు చేసుకుంది శివాజీ రెండు సార్లు సూరతుపై దండెత్తి అక్కడ గల ఆంగ్లేయుల ఫ్యాక్టరీని కూడ వశంచేసుకోగలనని బెదిరించాడు. దక్షిణ భారతంలో శివాజి జింజిని స్వాధీనం చేసుకుని మద్రాసు సమీప ప్రాంతానికి చేరుకున్నాడు బెంగాలు, గుజరాతులలో కంపెనీ ఔరంగజేబుతో అనేక వివాదాల్లో చిక్కుకుంది కాని 1690లో సంధి కుదరడంతో ఔరంగజేబు ఆంగ్లేయుల వ్యాపారాన్ని అనుమతించాడు

17వ శతాబ్దాంతానికి మరల కంపెనీకి మాతృదేశంలో చిక్కులు ఎదురయ్యాయి 1698లో మరో కొత్త కంపెనీ ఏర్పాటయింది మరల రెండు కంపెనీల మధ్య ఆత్మహత్య సదృశ్యమైన పోటీ ప్రారంభమైంది. కాని 1708లో ప్రకటించిన గోదాల్ఫిన్ అవార్డు'తో ఈ రెండు కంపెనీల మధ్యగల తగాదాలు సమసిపోయాయి ఈ రెండు కంపెనీలు ఒకే కంపెనీగ ఆవిర్భవించింది ఈ కంపెనీయే ఈస్టిండియా కంపెనీగ ప్రసిద్ధి చెంది 1857లో చెలరేగిన సిపాయిల తిరుగుబాటు వరకు తన మనుగడను కొనసాగించింది.

## ఫ్రెంచి కంపెనీ స్థాపన

17వ శతాబ్దపు మధ్య కాలంలోనే ఇంగ్లీషు కంపెనీ వ్యాపారంలో తన ఆధిక్యతను నిరూపించుకొని డచ్చి ప్రాబల్యాన్ని పూర్తిగ తగ్గించి వేయగల్గింది. ఈ సమయంలోనే ఫ్రెంచి దేశస్థులు గూడ ఒక కంపెనీని ఏర్పాటు చేసి భారతదేశంలో తమ వ్యాపార స్థావరాల్ని ఏర్పాటు చేశారు. మచిలీపట్నం (1669), పాండిచ్చేరి (1673), చంద్రనాగూర్ (1690)లలో తమ స్థావరాలు స్థాపించారు. తర్వాత కాలంలో మహే, కారైకల్, యానాంలలో కూడ ఫ్రెంచి స్థావరాలు వెలిశాయి

## 18వ శతాబ్దిలో ఆంధ్ర దేశపు ఆర్థిక పరిస్థితులు

1687లో గోల్కొండ రాజ్యం ఔరంగజేబు వశం అయింది దీనిఫలితంగా తెలంగాణా ప్రాంతం, తీరాంధ్రంలోని అధిక భూభాగం మొగలు సామ్రాజ్యంలో కలిసి పోయింది కాని ఔరంగజేబు మహా రాష్ట్రులతో యుద్ధంలో మునిగివున్నందున తాను జయించిన దక్కను ప్రాంతంలో సుస్థిరత సాధించలేక పోయాడు దీంతో ప్రభుత్వ నిర్వహణలో అలసత్వం ఏర్పడి శాంతి భద్రతలు కరువయ్యాయి 1707లో ఔరంగజేబు మరణించాడు దీంతో మొగలు సామ్రాజ్యం యొక్క పతనం ప్రారంభమయింది ఈ అస్తవ్యస్త పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతింది యూరోపియను వర్తకులు తమ వుత్పత్తుల్ని ముందుగనే కొనడంవల్ల ఆంధ్రదేశంలో చేనేతపని వారు, ఇతర వృత్తుల్లో జీవించేవారు తమ జీవనాన్ని కొన సాగించగల్గారు

### వస్త్ర పరిశ్రమ

ఆంధ్ర దేశంలో తయారయ్యే వస్త్రాలపై ఆగ్నేయాసియా దేశాల ప్రజలేకాక ఇంగ్లాండు, ఫ్రాన్స్, పర్షియా మొదలగు దేశాల ప్రజలు కూడ విపరీతమైన మోజును చూపించేవారు ఉతికిన కొద్దీ అందంగా నిగనిగలాడుతూ వుండడం మచిలీపట్నంలో తయారయ్యే గుడ్డల ప్రత్యేక లక్షణం అందువల్ల కాలికో గుడ్డలకు, రంగు గుడ్డలకు ఇంగ్లాండులో విపరీతమైన గిరాకి వుండేది దీనితో ఇంగ్లాండులో స్థానిక వస్త్ర పరిశ్రమలు జబ్బులో పడ్డాయి అందువల్ల ఆంగ్ల ప్రభుత్వం 1700లోను, 1721లోను దిగుమతుల్ని నిషేధిస్తూ అనేక చట్టాలు చేసింది కాలికో వస్త్రాల

ధారణను కూడ నిషేదించింది కాని ఈ నిషేదం వల్ల పెద్ద నష్టం కలుగలేదు యూరపులోను, ఆగ్నేయాసియాలోను ఈ వస్త్రాలకు విపరీతమైన గిరాకీ వుండేది

18వ శతాబ్దిలో రాజకీయంగా పరిస్థితులు అనుకూలించక పోయినా ఆంధ్ర దేశంలో వస్త్ర పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది డచ్చి, పోర్చుగీసు, ఫ్రెంచి వర్తకులు నేత గాండ్రకు ఉదారంగా డబ్బులిచ్చి నాణ్యత లేకపోయినా వస్త్రాల్ని కొనేవారు వీరితో పోలిస్తే ఆంగ్లేయ వర్తకులిచ్చే డబ్బు చాలతక్కువగా వుండేది ఇదేగాక నాణ్యతను కూడ కోరేవారు దీనివల్ల ఆంగ్లేయులకు వస్త్రాల్ని సరఫరా చేసేందుకు నేతగాండ్రు ఇష్టపడేవారు కారు అదీగాక ఇంగ్లీషు ఏజంట్లకు మంచిపేరుకూడ వుండేది కాదు దీంతో ఇంగ్లీషు ఏజంట్లు కొన్ని ప్రత్యేక రాయితీలకై హైదరాబాదు సుబేదారుపై ఒత్తిడి తెచ్చారు కాని సుబేదారు ఆంగ్లేయులకు ప్రత్యేకమైన రాయితీలు కల్పించబోమని ఖచ్చితంగా చెప్పేశాడు డచ్చి, ఫ్రెంచి, పోర్చుగీసువారు ఈ ప్రత్యేక రాయితీల్ని గురించి అడిగేవారు కారు అందువల్ల వారినుండి ఎటువంటి ఇబ్బందులు ఎదురయ్యేవి కావు కాబట్టి వీరిని ఎక్కువగా ఆంధ్రుల వస్త్రాలు కొనమని సుభేదారు ప్రోత్సహించేవాడు దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడ పెరుగు తుంది మచిలీపట్నంలో డచ్చివారికోసం 5000 మంది నేతగాండ్రు పనిచేసేవారు ప్రతిఫలంగా వీరికి డచ్చివారు 5 వేల మద్రాసు పగోడాలు, తక్కువ ఖరీదు చేసే చిల్లర సామానులు ఇచ్చేవారు ఇంజారంలో డచ్చివారికై 2000 మంది, ఇంగ్లీషువారికై 700 మంది పని చేసేవారు ఇంగ్లీషు వారికి ఇంజారంలో నేగాక, మద్దెపాలెం, బండమూరిలంక, తుని, కాకినాడ, కోరింక, గొల్లపాలెం, విశాఖపట్నాలలో కూడ ఫ్యాక్టరీలు వుండేవి ఈ ప్రాంతాలన్నింటిల్లోను ఇంగ్లీషు వారు తక్కువ రేటుకు నాణ్యత గల గుడ్డలు కావాలనేవారు దీనివల్ల ఆంగ్ల వర్తకులు మిగిలిన యూరోపియను వర్తకుల నుండి తీవ్రమైన పోటీ ఎదుర్కొనవలసి వచ్చింది ముఖ్యంగా డచ్చి, పోర్చుగీసుల నుండి ఈ పోటీ తీవ్రంగా వుండేది. అడిగినంత డబ్బు ఇచ్చేవారు. కాబట్టి డచ్చివర్తకులకు మంచి పేరుండేది. బరంపురం, భీమునిపట్నం, విశాఖపట్నం, తుని ప్రాంతాల్లో తయారయ్యే వస్త్రాలన్నీ డచ్చివారికే అమ్మేవారు. ఈ పరిస్థితులవల్ల ఆంగ్లేయులు వస్త్ర పరిశ్రమపై గుత్తాధిపత్యం సంపాదించడానికి ప్రయత్నించారు

ఆంధ్రదేశంలో వస్త్ర పరిశ్రమ విశేషంగా అభివృద్ధి చెందింది కాని మంచి నాణ్యత గల వస్త్రాలు మాత్రం పట్టణాల్లోనే తయారయ్యేవి సిల్కు వస్త్రాలకు

బరంపురం ప్రసిద్ధి చెందగా, మస్లిన్ గుడ్డలకు శ్రీకాకుళం పేరు గాచింది రంగు గుడ్డలకు, పీతాంబరాలకు మచిలీపట్నం ప్రపంచ ప్రసిద్ధిని పొందింది

తీరాంధ్ర దేశంలో కేంద్రాధికారాన్ని ధిక్కరించి స్వతంత్రంగా వుంటున్న చాల మంది జమీందార్లు ఉండేవారు వీరిలో మూడు వర్గాలుండేవి మొదట తెలంగాణా ప్రాంతీయులై తర్వాత ముస్లిం సేనలచే కర్ణాటక నుండి తరుమగొట్ట బడి కృష్ణా నదీతీరంలో స్థిరపడ్డ వారు మొదటి వర్గం మైదానాల నుండి బలవంతంగా గోదావరి ఉత్తర ప్రాంతంలోని కొండ ప్రాంతాలకు తరుమబడ్డ ఒరిస్సాకు చెందిన రాచవారులు రెండో వర్గం ఒరిస్సాలో గజపతుల రాజ్యం పతనం తర్వాత ఒరిస్సా వదలి వచ్చి శ్రీకాకుళంలో స్థిరపడ్డవారు మరో వర్గం

జమీందారుల సైనిక వ్యవస్థకూడ మూడు రకాలుగ వుండేది జీతాన్ని నగదు రూపాన గ్రహించి పనిచేసే రోజువారీ భటులు మొదటి రకం జీతంకు బదులుగా కొంత భూమిని తీసుకుని పని చేసే భటులు రెండో రకం మూడవ రకం మనోవర్తి భటులు వీరు సైన్యాన్ని తమ అదుపులో వుంచుకుని అవసర సమయాల్లో సైన్యాన్ని సమాయత్త పరచడం వీరి బాధ్యత.

ఉత్తర సర్కారుల్లోని భూమి మొత్తం రెండు భాగాలుగా విభజింప బడ్డది ఒకటి జమీందారీ భూమి రెండవది హవేలి లేక ప్రభుత్వం భూమి ఉత్పత్తిలో అయిదో భాగం భూమి శిస్తుగ వసూలు చేశేవారు రైతుల్ని అణచివేయడంలో జమీందారులు నిరంకుశంగా వ్యవహరించేవారు వ్యాపారసంబంధమైన వస్తూత్పత్తులైన ఆహారం, పశుసంపద, ఉప్పు మొదలగు వాటిపై కూడ పన్నులు విధించేవారు వీటినే సుంకాలనే పేరుతో అప్పుడప్పుడు వసూలు చేసేవారు. వీటివల్ల పరిశ్రమలు వ్యాపారము దెబ్బతిన్నాయి. దీనితోపాటు ఇతర రకాల పన్నులు గూడ విధించేవారు మోతుర్భా లేక రాట్నపు పన్నును కూడ వసూలు చేసేవారు

సర్కారు ప్రాంతంలో వరి విపరీతంగా పండేది. ఈ ప్రాంతపు అడవుల్లోని కలప చాల శ్రేష్టమైంది ఈ కలపను నౌకా నిర్మాణంలో కూడా వినియోగించేవారు కోరింకలోని నౌకానిర్మాణ పరిశ్రమ బయటినుండి ఏర్పడిన పోటీని కూడ తట్టుకో కల్గింది. నేపల పరిశ్రమ కూడ విపరీతంగా అభివృద్ధి చెందింది స్వదేశీ వర్తకం, విధేశాలకు ఎగుమతులు మొత్తం కలపి ఈ ప్రాంతంలో సంవత్సరానికి దాదాపు 75 లక్షల వ్యాపారం జరిగేది

# 3

# నైజాం ప్రభువు – ఈస్టిండియా కంపెనీ

## హైదరాబాదు రాష్ట్ర స్థాపన (1724)

క్రీ.శ. 1707 లో ఔరంగజేబు మరణం తర్వాత మొగలు సామ్రాజ్యం చాల బలహీనమయింది వివిద రాష్ట్రాల సుబేదారులు స్వతంత్రతను ప్రకటించేందుకు ప్రయత్నించారు. మీర్ కమరుద్దీన్ ఖాన్ చిన్‌కులిచ్ ఖాన్ దక్కను ప్రాంతానికి సుబేదారుగ వుండేవాడు. ఇతడు నిజాం వుల్ ముల్క్ బిరుదును వహించి ప్రసిద్ధుడైనాడు. తాను దక్కను ప్రాంతపు సుబేదారుగనున్న రెండేళ్ళలో (1713–15) ఆ ప్రాంతంలో శాంతి భద్రతల్ని చేకూర్చగల్గాడు. కాని ఈ యన్ను 1715లో డిల్లీపాలకులు వెనుకకు రప్పించి ఇతని స్థానంలో సయ్యద్ హుస్సేన్ ఆలీఖాన్‌ను హైదరాబాదు సుబేదారుగ నియమించారు. డిల్లీ ఆస్థానంలో కీలకపాత్ర వహించిన సయ్యదు సోదరులు 1720 లో నిజాం వుల్‌ముల్క్‌ను మాల్వా సుబేదారుగ నియమించారు. కాని 1720 ఏప్రిల్ నెలలో కమరుద్దీన్ ఖాన్ (నిజాం వుల్‌ముల్క్) మాల్వాను వదిలిపెట్టి దక్కనుప్రాంతం వైపు నడచి మార్గమధ్యంలో వున్న అసీర్‌ఘర్ బుర్హాన్‌పూర్ ప్రాంతాల్ని స్వాధీనం చేసుకున్నాడు దిలావర్ ఆలీఖాన్, ఆలం ఆలీఖాన్‌ల నాయకత్వంలో సయ్యదు సోదరులు పంపిన రెండుసైన్యాల్ని కమరుద్దీన్ ఖాన్ ఓడించాడు. ఇంతలోనే దక్కను సుబేదారైన సయ్యద్‌హుస్సేన్ ఆలీఖాన్ చంపబడ్డాడు. ఈ సంఘటన నిజాం వుల్‌ముల్క్ స్థానానికి మరింత బలం చేకూర్చింది కేంద్రపాలకులు నిజాంకు మంత్రి పదవిని కట్టబెట్టి బుజ్జగించారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ళు మాత్రమే కొనసాగారు రాజధానిలోని కుట్రల రాజకీయాలకు విసుగుచెంది 1724లో డిల్లీని వదలిపెట్టి హైదరాబాదు చేరుకున్నాడు

1724 అక్టోబరు 11న దక్కను సుబేదారైన ముబారజ్ ఖాన్ ను షాహర్ ఖేడవద్ద ఓడించాడు ఈ యుద్ధం దక్కనులో నైజాం రాజుల వంశ పారంపర్య పాలనకు దారితీసింది. మొగలు చక్రవర్తి యైన మహమ్మదుషా నిజాం వుల్ ముల్క్ స్థానాన్ని గుర్తించి దక్కను ప్రాంతానికి శాశ్వత సుబేదారుగ నియమించాడు. దీంతో పాటు అసఫ్‌జా అనే బిరుదును కూడ ప్రసాదించాడు

## నిజాం వుల్‌ముల్క్ (1724–1748)

దక్కను ప్రాంతపు సుబేదారుగ నిజాం వుల్ ముల్క్ అసఫ్‌జా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, ఒరిస్సాలలోని కొన్ని ప్రాంతాలపై కూడ తన అధికారాన్ని చెలాయించాడు మహారాష్ట్రులు విధించిన 'చౌత్' పన్నును కట్టడానికి నిరాకరించడంతో అసఫ్‌జా రెండు సార్లు (1727,1729) వారితో వివాదానికి దిగాల్సి వచ్చింది. కాని 1731లో మహారాష్ట్రులచే ఓడింపబడి 'చౌత్' పన్నుకు ఒప్పుకున్నాడు 1737 లో చక్రవర్తికి సహాయ పడేందుకు డిల్లీ వెళ్లాడు. దీనికి ప్రతిఫలంగా చక్రవర్తి అసఫ్‌జా పెద్ద కూమారుడైన ఘజీయుద్దీన్‌కు గుజరాతు, మాల్వా రాష్ట్రాల్ని ప్రసాదించాడు కాని 1739లో జరిగిన నాదిర్ షా దండయాత్ర వల్ల మొగలు సామ్రాజ్యం ఇంకెంతో కాలం మన జాలదని అసఫ్‌జా గ్రహించాడు అందువల్ల మరల 1744లో హైదరాబాదుకు తిరిగి వచ్చాడు అప్పటినుండి మద్రాసులోని ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీతో మంచి సంబంధాల్ని ఏర్పరచు కోడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. తన తర్వాత ఆరుమంది కుమారుల్ని ఇంకా అనేకమంది మనుమల్ని వదలిపెట్టి 1748 లో తన 78వ ఏట మరణించాడు

## ఆంగ్లో–ఫ్రెంచి కంపెనీలు – పరస్పర స్పర్ధలు

ఫ్రెంచి కంపెనీ కంటె ఇంగ్లీషు కంపెనీ మంచి ఆర్థికస్తోమతను కలిగివుండేది అదీగాక వ్యాపారంలో చురుకుగా పాల్గొని లాభాలు గడించేది దీనికి కారణం బ్రిటీషు కంపెనీ ప్రైవేటు సంస్థ కావడమే ఫ్రెంచి కంపెనీ ప్రభుత్వ సంస్థ కావడంతో వ్యాపార కార్య కలాపాలు చురుకుగా జరిగేవి కావు అందువల్ల ఇంగ్లీషు కంపెనీ ఫ్రెంచి కంపెనీ కంటె ఎక్కువ ఆర్థిక స్థోమతను కలిగి వ్యాపారాన్ని శ్రద్ధగా నిర్వహించేది. 1744–48 మధ్యకాలంలో ఆంగ్లో–ఫ్రెంచి కంపెనీల మధ్య కర్ణాటక ప్రాంతంలో మొదటిసారిగ వివాదం తలెత్తింది. నిజానికిది యూరపులో 1740లో ప్రారంభమైన

ఆస్ట్రియా వారసత్వయుద్ధం యొక్క విస్తరణే అని చెప్పవచ్చు ఈ యుద్ధంలో ఫ్రాన్స్-ఇంగ్లాండు దేశాలు తమతమ మిత్రపక్షాలవైపు నిలిచి పోరాడాయి. అందువల్ల భారతదేశంలోని ఈ దేశాల కంపెనీలు కూడ పరస్పరం విరోధ భావం వహించి పోరాటానికి సన్నద్ధమయ్యాయి. ఈ సమయంలోనే తన అధీనంలోని ప్రాంతాల్లో ఫ్రెంచివారుగాని, ఆంగ్లేయులుగాని, యుద్ధం చేయకూడదని కర్నాటక నవాబు ఆజ్ఞను జారీచేశాడు. కాని ఈ ఆజ్ఞను ఫ్రెంచివారు దిక్కరించడంతో వీరిపైకి అతిపెద్దసైన్యాన్ని నవాబు పంపాడు. ఫ్రెంచిసైనికులు సంఖ్యాపరంగా తక్కువైనా సుశిక్షితులైనవారు కావడంతో క్రమశిక్షణలేని నవాబు సైన్యాన్ని అడయారువద్ద అతిసునాయాసంగ ఓడించగల్గారు. దీంతో ఫ్రెంచి కంపెనీకి తన బలాధిక్యతపై విశ్వాసం ఎక్కువైంది. అప్పటినుండి భారతీయపాలకుల మధ్య జరిగే ప్రతి చిన్న యుద్ధంలోను ఫ్రెంచివారు జోక్యం చేసుకోవడం ప్రారంభించారు.

1748 లో ఏ-లా-షాపెల్ (Aix La Chapple) ఒడంబడికతో ఆస్ట్రియా వారసత్వపు యుద్ధం ముగిసినా, భారతదేశంలో ఆంగ్లో-ఫ్రెంచి కంపెనీల మధ్య సరికొత్త వివాదాలు మొదలయ్యాయి. 1748 జూన్ 2న హైదరాబాదు పాలకుడైన నైజాము మరణించాడు. దీనితో ముజఫర్ జంగ్, నాసిర్ జంగ్ ల మధ్య సింహాసనం కోసం తగువులాట ప్రారంభమైంది. వీరిలో ముజఫర్ జంగ్ నైజాం మనవడు (కూతురుఉ బిడ్డ) కాగా నాసిర్ జంగ్ నైజాంకుమారుడు. ఇటువంటి తగాదాయే కర్నాటక సింహాసనం కోసం చాంద్ సాహెబ్, అన్వరుద్దీనుల మధ్య తలఎత్తింది. ఫ్రెంచివారు ముజఫర్ జంగ్, చాంద్ సాహెబు పక్షాన నిలువగా, ఆంగ్లేయులు నాసిర్ జంగ్, అన్వరుద్దీన్ కుమారుడు మహమ్మదు అలీ పక్షాన నిలిచారు. అన్వరుద్దీను 1749 లో అంబూరు వద్ద చందాసాహెబుతో జరిగిన యుద్ధంలో మరణించాడు. అంబూరు యుద్ధం ఆంధ్రదేశ చరిత్రలో ముఖ్యమైన ఘట్టము. పాండిచ్చేరిలోని ఫ్రెంచి గవర్నరయిన డూప్లే సహాయంతో చాందాసాహెబు కర్నాటక నవాబు అయ్యాడు. తన మిత్రుడైన చాందా సాహెబుకు చేసన సహాయానికి కృతజ్ఞతా సూచకంగా ముజఫర్ జంగ్ మచిలీపట్నం, దివి ప్రాంతాల్ని ఫ్రెంచివారికిచ్చాడు. ముజఫర్ జంగ్ కూడ ఫ్రెంచివారి సహాయంతోనే హైదరాబాదు నిజాం పదవిని అలంకరించ గల్గాడు. ముజఫర్ జంగ్ తో పోటీపడిన నాసిర్ జంగ్ కడప,కర్నూలు నవాబుల కుట్ర ఫలితంగా చంపబడ్డాడు.

ముజఫర్ జంగ్ నైజాం పదవిని చేపట్టిన తర్వాత ఫ్రెంచి కంపెనీకి కృతజ్ఞతలు తెల్పుతూ డూప్లేని కృష్ణానది దక్షిణ ప్రాంతానికి గవర్నరుగా నియమించాడు. కాకినాడ సమీపంలోవున్న యానాంను కూడ ఫ్రెంచివారి ఆధీనం చేశాడు

ముజఫర్ జంగ్ కూడ పాండిచ్చేరి నుండి హైదరాబాదుకు ప్రయాణం చేసేటపుడు కడప, కర్నూలు నవాబుల కుట్ర ఫలితంగా రాయచోటివద్ద హత్య చేయబడ్డాడు. ఫ్రెంచి జనరలు బుస్సీ పరిస్థితుల్ని తన అదుపులో వుంచుకుని నాసిర్‌జంగ్ సోదరుడైన సలాబత్ జంగ్‌ను, కొత్త నైజాంగ ప్రకటించాడు బుస్సీ కొత్త నైజాంను హైదరాబాదు వరకు అనుసరించి సింహాసనాధిష్టుని చేశాడు. కొత్త నైజాం సలాబత్ జంగ్ ఫ్రెంచివారికి యిదివరకు కల్పించిన రాయితీల్ని శాశ్వతం చేస్తూ మచిలీపట్నం చుట్టుప్రక్కల గల గ్రామాల్ని కూడ ఫ్రెంచివారికి ధారాదత్తం చేశాడు. ఈ గ్రామాలేగాక నిజాంపట్నం, కొండవీడు, నరసాపూరు ప్రాంతాల్ని కూడ ఫ్రెంచివారి స్వాధీనం చేశాడు. *

1751నుండి 1758వరకు బుస్సీ హైదరాబాదులోనే మకాంపెట్టి తన పదవిని సుస్థిరం చేసుకోవడంలో సలాబత్ జంగ్ కు సాయపడ్డాడు. మహారాష్ట్రులతో జరిపిన యుద్ధాల్లోను, మైసూరు రాజుతో నిర్వహించిన సంబంధాల్లోను బుస్సీ సలాబత్ జంగ్‌కు సాయపడ్డాడు. దీనికి ప్రతిఫలంగానే 1752లో మచిలీపట్నం సమీపంలోని కొండవీడు సర్కారును సలాబత్‌జంగ్ ఫ్రెంచివారికిచ్చాడు ఈ సర్కారులో తయారయ్యే వస్త్రాలకు యూరోపులో మంచి గిరాకీ వుండేది ఇంతకంటె ముఖ్యమైన ప్రాంతం కూడ ఫ్రెంచివారి అధీనమయ్యింది హైదరాబాదులో మకాం పెట్టిన ఫ్రెంచిసైన్యానికి నెలకు రెండులక్షల రూపాయల ఖర్చును భరించేందుకు నైజాం ఒప్పుకున్నాడు ఈ ఒప్పందం క్రింద గంజాంనుండి గుంటూరు వరకు గల తీరాంధ్రప్రాంతం మొత్తాన్ని ఫ్రెంచివారి అధీనంలో వుంచాడు దీంతో శ్రీకాకుళం , రాజమండ్రి, ఏలూరు, ముస్తఫనగరు (కొండపల్లి) సర్కారులు ఫ్రెంచి వారి అధీనంలోకి వచ్చాయి.

ఫ్రెంచి కంపెనీ ఉత్తర సర్కారుల్ని స్వాధీనం చేసుకున్నా స్థానిక ఫౌజుదార్లు, రాజులు, జమీందార్ల వ్యతిరేకతవల్ల ఫ్రెంచివారు తమ ప్రభావాన్ని ఆయాప్రాంతాలపై చూపలేకపోయారు. శ్రీకాకుళంలో నైజాం ఫౌజుదారుడైన జాఫర్ ఆలీ సర్కారుల్ని ఫ్రెంచివారి వశం చేయడాన్ని వ్యతిరేకించి తిరుగుబాటు చేశాడు. ఆప్రాంతంలో

విశేష ప్రాబల్యంకల విజయనగరం రాజా జాఫర్ ఆలీకి మద్దతు తెలిపాడు. వీరిద్దర్ని ఎదుర్కోవడం కష్టమైన పనిగా తలచి మచిలీపట్నంలోని ఫ్రెంచి ప్రతినిధి విజయనగరం రాజాను తనవైపుకు తిప్పుకోగల్గాడు. దీనికి ప్రతిఫలంగా శ్రీకాకుళం, రాజమండ్రి ప్రాంతాల్ని రాజావారికి గుత్తకు ఇవ్వగలనని వాగ్దానం చేశాడు దీంతో జాఫర్ ఆలీ నాగపూర్‌లోని మహారాష్ట్రుల సాయాన్ని అర్థించారు. మహారాష్ట్రులు విజయనగర జమీందారీని కొల్లగొట్టారు కానివారు అనకాపల్లి సమీపంలోని తుమ్మపాలెం వద్ద ఫ్రెంచి వాళ్ళచేతిలో ఓడిపోయారు.

1756లో కొంతకాలం పాటు బుస్సీ సేవల్ని వినియోగించుకోవడం నైజాం ఆపేశాడు దీంతో తీరాంధ్ర దేశ మంతటా ఫ్రెంచికి వ్యతిరేకంగా తిరుగుబాట్లు తలెత్తాయి. కాని సమయానికి బుస్సీ తిరిగివచ్చి హైదరాబాదులో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు తర్వాత ఉత్తర సర్కారుల్లోని స్థానిక జమీందార్ల తిరుగుబాట్లను అణచివేసేందుకు బయలు దేరాడు ఈ నేపథ్యంలోనే 1757లో విజయనగర సంస్థానాధీశుడైన విజయరామరాజును రెచ్చగొట్టి బొబ్బిలిపై దాడి చేయించాడు ఈ యుద్ధంలో బొబ్బిలి సేనల వీరోచిత పోరాటం బొబ్బిలికోట ఫ్రెంచివారి స్వాధీనం కావడము, విజయ రామరాజు మరణము ఆంధ్రదేశపు ప్రజలు ఈనాటికీ గుర్తుంచుకోవడం తెలిసిందే బొబ్బిలి యుద్ధం ఆంధ్రదేశ చరిత్రలో ప్రసిద్ధమైన ఘట్టంగా నిలిచిపోయింది. బొబ్బిలి పతనం మిగిలిన జమీందార్లకు ఒక హెచ్చరిక అయింది. వారు ఫ్రెంచి ఆధిపత్యాన్ని మారుమాట్లాడకుండా అంగీకరించారు 1758 ప్రారంభంలో బుస్సీ తిరిగి హైదరాబాదు చేరుకున్నారు

1758లోనే మూడవ కర్నాటక యుద్ధం ప్రారంభమైంది. వెంటనే బుస్సీని హైదరాబాదునుండి వెనుకకు రప్పించారు దీంతో ఫ్రెంచి అధికారానికి పతన దశ ప్రారంభమైంది విజయనగరం పాలకుడైన అనందగజపతిరాజు శ్రీకాకుళంపై దండెత్తి దాన్ని ఆక్రమించుకొన్నాడు. మద్రాసులోని బ్రిటీషు అధికారులతోను, బెంగాలులోని రాబర్ట్ క్లైవుతోను ఆనందగజపతిరాజు మంతనాలు జరిపాడు. ఈ మధ్యలోనే రాజు విశాఖపట్నాన్ని ఆక్రమించి, దాన్ని ఆంగ్లేయుల స్వాధీనం చేసేందుకు వాగ్దానం చేశాడు.

1757లో జరిగిన ప్లాసీ యుద్ధం తర్వాత క్లైవు బెంగాలులో ఆంగ్లేయుల అధికారాన్ని సుస్థిరం చేశాడు. విజయనగరరాజు పంపిన ఆహ్వానానికి అనుకూలంగా స్పందించి వెంటనే ఆనందగజపతి రాజును కలవమని కల్నల్ ఫోర్డును పంపాడు. 1758 డిశంబరు 21న విజయనగర రాజు, బ్రిటీషు ఈస్టిండియా కంపెనీల మధ్య ఒక ఒప్పందం కుదిరింది ఈ ఒప్పందం ప్రకారం దోచుకున్న సంపదను సమానంగా పంచుకోవాలి ఆక్రమించిన భూభాగాన్ని గజపతిరాజు పరంచేయాలి నదీముఖద్వారాల్లో వున్న పట్టణాల్ని, ఓడ రేవుల్ని మాత్రం కంపెనీ అధీనంలో వుంటాయి

ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత ఆనందగజపతిరాజు, కల్నల్ ఫోర్డు సేనలు కలసి రాజమండ్రి వైపు నడిచాయి 1759 డిశంబరు 7న తూర్పుగోదావరి జిల్లాలోని చందుర్తివద్ద ఫ్రెంచి సేనల్ని ఓడించాయి భారతదేశచరిత్ర గమనాన్ని నిర్దేశించిన యుద్ధాల్లో చందుర్తి యుద్ధాన్ని కూడ ప్రధానమైందిగ పేర్కొనవచ్చు. చాలకొద్ది యుద్ధాలు మాత్రమే అద్భుతమైన ఫలితాన్ని సాధిస్తాయని కల్నల్ మల్లేసన్ అభిప్రాయపడ్డారు ఈ చందుర్తి యుద్ధం సర్కారులనుండి ఫ్రెంచివారిని పూర్తిగ తొలగించింది 1759 ఏప్రిల్ 8న ఫోర్డు మచిలీపట్నాన్ని ఆక్రమించాడు. ఫ్రెంచివారి బలహీనతను తెలుసుకున్న సలాబత్ జంగ్ ఆంగ్లేయులతో సంధి కుదుర్చుకున్నాడు. 1759 మే నెల 14న నైజాంపట్నాన్ని మచిలీపట్నం, కొండపల్లి సర్కారుల్లోని కొంతభాగాన్ని బ్రిటీషువారికి దత్తం చేశాడు. పక్షం రోజుల్లో ఫ్రెంచి సేనలు నైజాం రాజ్యంనుండి వైదొలగవలసిందిగా ఆజ్ఞాపించాడు 1762లో సలాబత్ జంగ్ సోదరుడైన నిజాం ఆలీ సింహాసనాన్ని ఆక్రమించాడు.

## నిజాం ఆలీ (1762–1803)

నిజాం ఆలీఖాన్ నిజాం వుల్ ముల్క్ నాల్గవ కుమారుడు. హైదరాబాదులో ఫ్రెంచి పెత్తనాన్ని వ్యతిరేకించాడు. 1757నుండి బేరారు గవర్నరుగా వుండేవాడు. ఇతడు మహారాష్ట్రుల చేతుల్లో రెండుసార్లు ఓడిపోయాడు. మొదటిసారి 1757 డిశంబరులో సిందాఖేడ్ వద్ద, రెండవసారి 1760జనవరిలో ఉద్గిరి వద్ద ఓడింపబడ్డాడు. నల్దుర్గం, అహమ్మదునగరు, దౌలతాబాదు, బుర్హాన్‌పూర్, బిజాపూర్ మహారాష్ట్రుల స్వాధీనమయ్యాయి. ఈ మధ్యలో హైదరాబాదులో ఫ్రెంచి పెత్తనం తగ్గుముఖం

పట్టింది. ఇదివరకే చెప్పినట్లు కల్నల్ ఫోర్డ్ మచిలీపట్నాన్ని ఆక్రమించి బ్రిటీషుకంపెనీ స్వాధీనం చేశాడు. దీంతో చిక్కుల్లో బడ్డ సలాబత్ జంగ్‌ను పదవీచ్యుతుని చేసి నిజాం ఆలిఖాన్ హైదరాబాదు ప్రభువయ్యాడు మహారాష్ట్రులనుండి రక్షణ కల్పించినట్లయితే ఆంగ్లేయులకు మధ్యాంధ్రలోని మూడు సర్కారుల్ని బ్రిటాషువారి కివ్వడానికి నిజాం ఆలీ సంసిద్ధతను వ్యక్తం చేశాడు కాని కర్నాటక వ్యవహారాలలో తలమునకలై వున్న బ్రిటీషువారు నిజాంఆలీ ప్రతిపాదనల్ని అంగీకరించలేదు 1763లో మూడవ కర్నాటక యుద్ధం ముగిసిన తర్వాత బ్రిటీషువారు నిజాం ఆలీ ప్రతిపాదనల్ని అంగీకరించడానికి సముఖత వ్యక్తం చేశారు కాని నిజాం ఆలీ తన నిర్ణయాన్ని మార్చుకోవడంతో ఈ వ్యవహారం తెరమరుగైంది

1765లో రాబర్ట్ క్లైవు రెండవసారి బెంగాలు గవర్నరుగా నియమింపబడ్డాడు ఈ కాలంలోనే మొగలు చక్రవర్తి యైన షా ఆలంను మచ్చిక చేసుకుని ఉత్తర సర్కారులన్నింటిని బ్రిటీషువారికి దత్తం చేసినట్లు చక్రవర్తినుండి ఒకఫర్మానాను క్లైవు సంపాదించగలిగాడు. నైజాం ఈఫర్మానాను ఒప్పుకోలేదు. దీంతో మచిలీపట్నంలో ఈస్టిండియా కంపెనీ ప్రతినిధిగ ఉన్న జాన్‌పైబస్ కంద్రేగులు జోగి పంతుల్ని హైదరాబాదు పంపి నిజాం ప్రభవుతో రాయబారం సాగించాడు.

ఉత్తర సర్కారుల్లో పేరుమోసిన దుబాషిగా అందరికి పరిచయమున్న వ్యక్తి జోగిపంతులు. హైదరాబాదులో మంచి పరపతి గలిగి వుండేవాడు. నిజాం దివానైన రుక్నుద్దౌలాకు జోగిపంతులంటే మంచి గౌరవం వుండేద. జోగిపంతులు హైదరాబాదుకు వచ్చినైజాంతో సంప్రదింపులు ప్రారంభించాడు. కాని నైజాం తనరాజ్యంలో అక్కడక్కడ అల్లర్లు చోటు చేసుకోవడంతోజోగిపంతులు ప్రతిపాదనలకు సుముఖంగా స్పందించలేదు. అయినా జోగిపంతులు తన పట్టు వదలలేదు. దివాను, నైజాం కలసి రాజమండ్రికి బయలుదేరగా జోగిపంతులు వారిని వెంబడించాడు ఈసమయంలో గొల్లపూడిలోని నిజాంసైన్యం తమ జీతం బకాయిలకోసం తిరుగబాటు చేసింది. ఈ అవకాశాన్ని జోగిపంతులు చక్కగా వినియోగించుకుని 15లక్షల రూపాయల గుత్తకు అయిదు ఉత్తర సర్కారుల్ని కంపెనీ వశంచేయడానికి నిజాంను ఒప్పించగల్గాడు. నిజాం సోదరుడైన బసాలత్‌జంగ్ అధీనంలోవున్న గుంటూరు సర్కారును గూడ గుత్తకు ఇచ్చేందుకు నిజాంను ఒప్పించాడు.

చివరకు 1766లో కుదిరిన ఒప్పందం ప్రకారం సర్కారు జిల్లాలన్నీ ఈస్టిండియా కంపెనీ వశమైనాయి గుంటూరు సర్కారు మాత్రం బసాలత్ మరణించే వరకు ఆయన అధీనంలో వుండేటట్టు అంగీకారం కుదిరింది. 1782లో బసాలత్ మరణించిన తర్వాత ఆరు సంవత్సరాలకు గుంటూరు సర్కారును ఆంగ్లేయులు తమస్వాదీనం చేసుకోగల్గారు సుదీర్ఘమైన చర్చల తర్వాత 1787 సెప్టెంబరు 18న గుంటూరు సర్కారును నైజాం కారన్ వాలీస్ స్వాధీనం చేశాడు. ఈ విధంగా అయిదు ఉత్తర సర్కారులు ఆంగ్లేయుల అధీనంలోకి వచ్చాయి

1767లో నిజాం మైసూరు నవాబైన హైదరాలీతో చేతులు కలిపి కర్ణాటకపై దండెత్తాడు కాని వీరు తిరుచినాపల్లి వద్ద పరాజయం పొందారు 1766 ఒడంబడికను శాశ్వతం చేస్తూ నిజాం ఆలీ మద్రాసువద్ద సందికి అంగీకరించాడు 1766 వడంబడిక ప్రకారం అయిదు సర్కారు జిల్లాలు ఆంగ్లేయుల వశం కావడం మనకిది వరకే తెలుసు

పీష్వా నారాయణరావు మరణం తర్వాత 1733లో నిజాం ఆలీ మహారాష్ట్రుల వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నాడు. కొత్తగా పీష్వాపదవిని చేపట్టిన రఘునాధరావుకు తనమద్దతు తెలిపాడు మొదటి మహారాష్ట్ర యుద్దం (1744-82) ముగిసిన తర్వాత కుదిరిన సాల్బాయి సంధికి (1782) తన అంగీకారం తెలిపి మహారాష్ట్రులతో స్నేహసంబంధాల్ని కొనసాగించాడు. 1784లో మహారాష్ట్రలో గొప్పరాజనీతిజ్ఞుడైన నానాపడ్నావిసును కలుసుకుని టిప్పుసూల్తానుకు వ్యతిరేకంగా సంధి కుదుర్చు కొన్నాడు.

## త్రైపాక్షిక సంధి (1790)

1789లో కారన్ వాలీసు నిజాం ఆలీతో ఒక వప్పందం కుదుర్చుకున్నాడు. ఈ వప్పందం ప్రకారం అవసరమైనప్పుడు నైజాం ప్రభువుకు సైనిక సహాయం చేయడానికి ఈస్టిండియా కంపెనీ అంగీకరించింది కాని ఈ వప్పందం కంపెనీ మిత్రులైన మహారాష్ట్రులు, కర్నాటక నవాబు, తంజావూరు, తిరువాన్కూరు రాజుల విషయంలో మాత్రం వర్తించదు. తర్వాత 1790లో మహారాష్ట్రులు, నైజాం, ఈస్టిండియా కంపెనీలమధ్య మైసూరు ప్రభువైన టిప్పుసుల్తానుకు వ్యతిరేకంగా త్రైపాక్షిక సంధి ఏర్పడింది 1790లో ప్రారంభమైన మూడవ మైసూరు యుద్ధం

1792లో టిప్పుసుల్తాను ఓటమితో ముగిసింది. టిప్పుసుల్తాను రాజ్యంలో దాదాపు సగభాగాన్ని శత్రువుల స్వాధీనం చేయవలసి వచ్చింది నిజాం ఆలీకి తన వాటాగ గుత్తి, కడప మొదలగు ప్రాంతాలతోపాటు ఒకకోటి రూపాయల నగదు కూడ సంక్రమించింది.

మూడవ మైసూరు యుద్ధంలో నైజాము, మహారాష్ట్రులు మిత్రపక్షాలుగ కలసి యుద్ధం సాగించినా, వారి సంబంధాలు మాత్రం అంతంతమాత్రంగానే వుండేవి మహారాష్ట్రులు చౌత్, సర్దేశిముఖి వంటిపన్నుల్ని విధించడం నిజాం వ్యతిరేకించాడు. చర్చల ద్వారా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇరుపక్షాలు యుద్ధానికి దిగారు 1795 ఖార్దా వద్ద జరిగిన యుద్ధంలో నైజాం ఓడిపోయాడు మూడు కోట్ల రూపాయల చౌతును, రెండు కోట్ల రూపాయల నష్టాన్ని చెల్లించవలసి వచ్చింది.

ఖార్దా ఓటమిని చవిచూచిన కొన్నాళ్ళకే నిజాం ఆలికి మరోసమస్య ఎదురైంది. తన కుమారుడైన ఆలీఝా తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటుకు మెదక్ జమీందారైన సదాశివరెడ్డి మద్దతునిచ్చాడు కాని తిరుగుబాటు అణచివేయ బడింది ఆలీఝా ఔరంగాబాదువద్ద పట్టుబడ్డాడు అయితే ఆలీఝా ఆత్మహత్య చేసుకున్నాడు ఫ్రెంచి దేశస్థుడైన మన్సియోర్ రేమండ్ వద్ద శిక్షణ పొందిన నైజాం సైన్యం తిరుగుబాటును సులభంగా అణిచి వేయగల్గింది

## సైన్యసహకార ఒడంబడిక (1800)

మైసూరు పాలకుడైన టిప్పుసుల్తాను తుది సమరానికి సన్నద్ధం అవుతున్న సమయంలో హైదరాబాదులో ఫ్రెంచిపెత్తనం ఎక్కువ కావడం ఈస్టిండియా కంపెనీకి తలనొప్పిగా పరిణమించింది అందువల్ల హైదరాబాదులోని బ్రిటీషు ప్రతినిధియైన కేప్టన్ అచిల్లెస్ కిర్క్‌ప్యాట్రిక్ నైజాంకు సైనిక సహాయాన్ని ఎరగా చూపి ఆయన మద్దతు కోసం ప్రయత్నించాడు. దీని ఫలితంగా నైజాం ఈస్టిండియా కంపెనీతో సైన్యసహకార ఒడంబడికకు ఒప్పుకున్నాడు. దీని ప్రకారం ఫ్రెంచి సైన్యాన్ని తన సంస్థానం నుండి తొలగించడానికి నిజాం ఆలీ అంగీకరించాడు దీనికి ప్రతిఫలం హైదరాబాదులో శాశ్వత సైన్యాన్ని ఉంచడానికి కంపెనీ అంగీకరించింది. ఈసైన్యానికి అయ్యే ఖర్చు నైజాం భరించాల్సి వుంటుంది. ఈ ఒడంబడికవల్ల

హైదరాబాదులో ఫ్రెంచివారి పరిస్థితి దిగదుడుపైంది ఆంగ్లేయుల స్థానం బలీయంగా మారింది టిప్పుసూల్తానుతో జరిగిన నాల్గవ మైసూరు యుద్ధంలో నైజాం ఈస్టిండియా కంపెనీకి మద్దతు తెలిపాడు ఈ యుద్ధంలో టిప్పుసుల్తాను మరణించాడు దీంతో ఆయన నిర్మించిన సామ్రాజ్యం కూడ పతనమయింది.

చివరిదైన ఈ నాల్గవ మైసూరు యుద్ధం తర్వాత 1800 అక్టోబరులో నైజాం ఈస్టిండియా కంపెనీతో ఒక కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు శత్రురాజ్యంపై దండయాత్రకు, స్వరాజ్య సంరక్షణకు ఉద్దేశించిన ఈ వడంబడికనే సైన్యసహకార ఒడంబడిక అంటారు ఈ ఒడంబడిక ప్రకారం హైదరాబాదులో ఇదివరకున్న సైన్యాని కంటె ఎక్కువ సైన్యాన్ని వుంచడానికి అంగీకారం కుదిరింది. ఈ సైన్యపు ఖర్చులకు గాను మైసూరు యుద్ధంలో తాను ఆక్రమించిన తుంగభద్రనదికి దక్షిణానగల ప్రాంతమంతటిని నైజాం ఈస్టిండియా కంపెనీకి ఇచ్చాడు. వీటినే సీడెడ్ జిల్లాలంటారు. వీటినే ఈనాడు రాయలసీమగ వ్యవహరిస్తున్నారు

1803లో నిజాం ఆలీఖాన్ చనిపోయాడు ఇతని కుమారుడైన సికందర్ ఝా సింహాసనాన్ని అదిష్టించాడు ఆంధ్రదేశచరిత్రలో 1762నుండి 1803వరకు జరిగిన సదీర్ఘమైన నిజాం ఆలీఖాన్ పరిపాలన ముఖ్యమైంది ఈ కాలంలో బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ నైజాంపై తన పట్టును సాధించి ఆయనతో దాదాపు ఆరు ఒడంబడికల్ని కుదుర్చుకోగల్గింది 1766, 1788, 1800 లలో కుదిరిన ఒప్పందాలవల్ల వరుసగా ఉత్తర సర్కారులు, గుంటూరు, సీడెడ్ జిల్లాలు కంపెనీ స్వాధీనమయ్యాయి. ఇదీకాక వంశపారంపర్యంగా వచ్చిన 'నైజాం' బిరుదును వాడుకొన్న మొదటి వ్యక్తినిజాం ఆలీఖాన్ కావడం విశేషం.

## సికందర్ ఝా(1803–1829)

నైజాం, ఈస్టిండియా కంపెనీల సంబందాల్లో 1800 సంవత్సరం ప్రాముఖ్యతను సంతరించు కొన్నదని చెప్పవచ్చు సైన్య సహకార ఒడంబడికతో నైజాం ఈస్టిండియా కంపెనీ చేతిలో కీలుబొమ్మగ మారవలసి వచ్చింది. తనకున్న స్వతంత్రాధికారాన్నిపోగొట్టుకున్నాడు. కంపెనీకి తెలియకుండా ఇతర పాలకులతో ఎలాంటి ఒడంబడికలు కుదుర్చుకోడానికి వీలులేకుండా పోయింది. ఇదేగాక ఆంతరంగిక వ్యవహారాల్లో కూడ నైజాం అధికారాలకు చాలా పరిమితులు

విధించబడ్డాయి. తన స్వంత ప్రధానమంత్రి లేక దివాన్ను నియమించడానికి కూడ కంపెనీ అనుమతిని పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

1803లో నిజాం మరణం తర్వాత ఆయన కుమారుడు సికందర్ ఝా సింహాసనాన్ని అధిష్టించాడు. ఇతడు పరిపాలన చేపట్టిన కొంత కాలానికే మహారాష్ట్రులు, ఈస్టిండియా కంపెనీల మధ్య రెండవ మహారాష్ట్ర యుద్ధం ప్రారంభమైంది. మహారాష్ట్ర సైన్యానికి సింధియా, భోన్స్లేలు నాయకత్వం వహించారు. ఈ యుద్ధంలో నైజాం కంపెనీకి తన పూర్తి సహకారాన్ని అందించలేదు. బేరారు గవర్నయిన రాజామహీపత్ రాం నైజాం సైన్యాన్ని నడిపించాడు. మహీపత్ రాం నైజాంకు సన్నిహిత మిత్రుడే గాక, ముఖ్యసలహాదారుడు కూడ. కాని మహీపత్‌రాంకు ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకత వుండేది. నైజాం పూర్తి సహకారాన్ని అందించలేకపోయినా, 1803 సెప్టెంబరు 23న అసా యె వద్ద జరిగిన యుద్ధంలో కంపెనీ మహారాష్ట్ర సైన్యాన్ని ఓడించింది. నైజాం ప్రవర్తనను గవర్నరు జనరలైన వెలస్లీ తీవ్రమైనదిగ భావించి 1803 డిశంబరు 15న బలవంతంగ మరో ఒడంబడికను నైజాంతో కుదుర్చుకొన్నాడు. ఈ ఒప్పందం ప్రకారం ఇది వరకున్న ఒప్పందాల్ని శాశ్వతం చేయడమే గాక యుద్ధ సమయాల్లో నైజాం సైన్యాన్నంతా కంపెనీ అధీనంలో వుంచడానికి నైజాం అంగీకరించాడు. ఈ ఒప్పందం కుదిరిన తర్వాత నైజాం దివానుగ పనిచేస్తున్న అరిస్తోఝా (అజీం వుల్ వుమర) 1804 ఎప్రిల్ 12న మరణించాడు. దీంతో హైదరాబాదులోని బ్రిటీషు ప్రతినిధి మీర్ ఆలంను దివానుగ నియమించాల్సిందిగ నైజాంకు సిఫార్సు చేశాడు. మీర్ ఆలం అన్ని ఆంగ్లో-మైసూరు యుద్ధాల్లోను కంపెనీకి విశ్వాసపాత్రుడుగ వుండేవాడు. కంపెనీకి నమ్మకస్తుడైన మీర్ ఆలం అంటే తన కిష్టం లేకపోయినా, నైజాం కంపెనీ సిఫార్సును త్రోసి పుచ్చలేకపోయాడు. మీర్ ఆలం పెత్తనాన్ని అదుపు చేయడానికి తనస్నేహితుడైన మహీపతిరాంను పేష్కారు లేక డిప్యూటి దివానుగ నియమించడానికి ప్రయత్నించాడు. అయినా లాభం లేకపోయింది. మీర్ ఆలం తన అల్లుడైన మునీర్ వుల్ ముల్క్‌ను పేష్కారుగ నియమించాలని భావించాడు. దీంతో 1805 అక్టోబరులో హైదరాబాదుకు వచ్చిన మహీపత్‌రాంను తిరిగి బేరారు సుబాకు పంపించమని కొత్తగా వచ్చిన కేప్టెన్ సైడన్ హాం పై వత్తిడి తెచ్చారు. అయితే కేప్టన్ సైడన్ హాం మీర్ ఆలం అల్లుడిని కాకుండ రాజా చందూలాల్‌ను పేష్కారుగా నియమించాడు. మహీపత్ రాంను తిరిగి బేరారు వెళ్లవలసిందిగా కోరాడు.

1808 ఫిబ్రవరి 28న మీర్ ఆలం మరణించాడు. దీంతో మరల నిజాం, బ్రిటీషు ప్రతినిధుల మధ్య దివాను నియామకంలో వివాదం తలెత్తింది. కాని చివరకు మీర్ ఆలం అల్లుడైన మునీర్ వుల్‌ముల్క్‌ను దివానుగ నియమించడం జరిగింది. కాని నిజమైన అధికారాలన్నీ కంపెనీకి విశ్వాస పాత్రుడైన రాజాచందూలాల్ చేతిలోకి వచ్చాయి

## చందులాల్

చందూలాల్ లాహూరులోని ఖాత్రికుటుంబానికి చెందినవాడు 1776లో హైదరాబాదులో జన్మించాడు. అక్బరుపాలనలో రెవెన్యూమంత్రిగ పేరు మోసిన రాజాతోడరుమల్లు వంశానికి చెందిన వాడనని చందూలాల్ చెప్పుకున్నాడు.

1806లో పేష్కారుగా నియమింపబడడంతో చందూలాల్ మొదటిసారిగా వెలుగులోనికి వచ్చాడు. ఈ పేష్కారు ఉద్యోగం దివానుకంటె ఒక మెట్టు తక్కువది. పేష్కారు ప్రభుత్వ లెక్కల్ని నిర్వహిస్తూ ప్రభుత్వ ఖజానాపై అదుపును కల్గివుండేవాడు. చందూలాల్ ఏపరిస్థితుల్లో పేష్కారుగ నియమింప బడ్డాడోమనం ఇదివరకే తెలుసుకున్నాం. సికందర్ ఝా తన స్నేహితుడైన మహీపతిరాంను పేష్కారుగ నియమించాలని భావించగా మీర్ ఆలం తన అల్లుడైన మునీర్-వుల్-ముల్క్‌ను నియమించాలని అడ్డుపడ్డాడు ఈనేపధ్యంలోనే చందూలాల్ పేష్కార్ పదవిని చేపట్టాడు. త్వరలోనే చందూలాల్ కంపెనీకి నమ్మిన బంటుగ మారాడు. అందువల్ల 1808లో మీర్ ఆలం మరణం తర్వాత కొత్త దివాన్ను నియమించాల్సి వచ్చినప్పుడు హైదరాబాదులోని కంపెనీ ప్రతినిధి కేప్టన్ సైడన్‌హాం 1809 ఫిబ్రవరి 17న గవర్నరు జనరల్ మింటోకు ఒక వుత్తరం వ్రాశాడు ఈ ఉత్తరం ఇలా ఉంది

"ప్రధానమంత్రి లేక దివాను ఎవరైనప్పటికి మన శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వ వ్యవహారాల్లో చందూలాల్‌కు విశేషాధికారాలు ఉండాలి నైజాం విషయంలో చందూలాల్ మనకు విశ్వాస పాత్రుడుగ వున్నంత వరకు ఈ సంస్థానంలోమన శ్రేయస్సుకు ఎలాంటి ముప్పు ఏర్పడదని గట్టిగా నమ్మవచ్చు"[7].

దీనిని బట్టి నైజాం సంస్థానంలో చందూలాల్ ఎటువంటి కీలకపాత్ర నిర్వహించాడో మనకు స్పష్టమౌతుంది. తర్వాత మునీర్ వుల్‌ముల్క్ దివానుగ

నియమితుడైనా చందూలాల్ మాత్రం పేష్కారుగనే కొనసాగాడు. ఈస్టిండియా కంపెనీకి, నైజాంకు మధ్య వారధిలా మారడంతో చందూలాల్ స్థానం మరింత బలపడింది

1810లో బ్రిటీషు ప్రతినిధి కెప్టెన్ సైడన్ హాం పదవీ విరమణ చేశాడు. దీంతో చందూలాల్‌ను దెబ్బతీయాలని నైజాం ప్రయత్నించాడు 1806లో చందూలాల్ పదవిని స్వీకరించినప్పటినుండి ప్రభుత్వ లెక్కల్ని చూపమని నైజాం అడిగాడు. కాని ఈస్టిండియా కంపెనీ చందూలాల్‌ను ఆదుకోడానికి ముందుకు వచ్చింది కొత్త బ్రిటీషు ప్రతినిధియైన హెన్రీ రస్సెల్ 1811లో నైజాంను కలిసి చందూలాల్ పట్ల చూపిస్తున్న నిరాదరణకు తన నిరసన తెలిపాడు ఈ పరిస్థితుల్లో నైజాం సికందర్ ఝా తన పరిస్థితిని గ్రహించి ప్రభుత్వ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనడం మానేశాడు. దీనితో 1811 నుండి బ్రిటీషు ప్రతినిధే నిజమైన పాలకుడయ్యాడు. చందూలాల్ బ్రిటీషు ప్రతినిధి చేతిలో కీలు బొమ్మగ మారాడు

## నైజాం సైన్యం

నైజాం దళాలు అన్ని కలిపి మిశ్రమ సైన్యంగా వుండేది. ఈ సైన్యం ముగ్గురు ప్రత్యేక స్వతంత్ర అధికారాలు గల వారి నాయకత్వంలోవుండేది. అంటే నిజాం నాయకత్వంలోను, దివాను నాయకత్వంలోను, ప్రభువర్గంలో ముఖ్యుడైన షాంఘుల్ ఉమర లేక అమీర్ కబీర్ నాయకత్వంలోను విడివిడిగా సైన్యం వుండేది.

1800లో ఈస్టిండియా కంపెనీలో సైనికఒప్పందం కుదుర్చుకున్న తర్వాత సరీఫ్-యి-ఖస్ పేరుతో వ్యవహరింపబడుతున్న తన సైన్యాన్ని గురించి నైజాం అంతగా పట్టించుకోలేదు అందుకే 1803లో జరిగిన రెండవ మహారాష్ట్ర యుద్ధంలో నైజాం సైన్యంలో సామర్థ్యం, క్రమశిక్షణలోపించడం స్పష్టంగా కన్పిస్తుంది

దివాను సైన్యంలో అనేకరకాల వారు ఉండేవారు. వీరిలో దక్కనులో స్థిరపడ్డ అరబ్బు జాతీయులు మొదట పేర్కొన దగినవారు. ఉత్తరభారతంలోని ఔద్, సింధు, బెలూచిస్థాన్, మొదలైన ప్రాంతాలనుండి వచ్చి సైన్యంలో చేరిన ముస్లింలు తర్వాతివారు. వీరినే 'రొహిల్లాలు' అని వ్యవహరిస్తారు ఈ దళాలతో పాటు 'లైన్-వాలాలు' అని వ్యవహరించబడే ఇతర దళాలు కూడ వుండేవి. వీరు నైజాం కోసం యూరోపియనులు సమకూర్చిన సైన్యంలో మిగిలిన దళాలు

## రస్సెల్ బ్రిగేడ్ లేక రస్సెల్ సైన్యం

1811 మార్చిలో హైదరాబాదులో బ్రిటీషు ప్రతినిధిగ హెన్రీ రస్సెల్ నియమింప బడ్డాడు. తాను పదవిలో చేరిన తర్వాత గ్రామప్రాంతాలలోని అస్తవ్యస్త పరిస్థితుల్ని గమనించాడు. శాంతిభద్రతలు కరువయ్యాయి. నైజాం సేనల బలహీనతను గమనించిన పిండారీలు, భిల్లులు, స్థానిక జమీందార్లు ప్రజల్ని దోచుకుంటూ వారిలో భయభ్రాంతుల్ని సృష్టించారు. కాని వీరిని అణచేందుకు సైనిక ఒడంబడిక క్రింద సమకూర్చిన సైన్యాన్ని వినియోగించడం ఒడంబడిక దృష్ట్యా ఆమోద యోగ్యం కాదు. అందువల్ల రస్సెల్ రాజ్యంలో పరిస్థితుల్ని చక్కబెట్టడానికి ఒక కొత్తసైన్యాన్ని సమకూర్చాలని ప్రయత్నించాడు. 1816లో తన ప్రయత్నానికి భారత ప్రభుత్వ అనుమతి రావడంతో రస్సెల్ ప్రభుత్వఖర్చుతో ఒక సైన్యాన్ని సమకూర్చాడు దీనినే రస్సెల్ బ్రిగేడ్ లేక రస్సెల్ సైన్యము అని అంటారు. తర్వాతి కాలంలో దీనినే హైదరాబాదు కంటింజెంటుగ వ్యవహరించారు 1817లో జరిగిన పిండారీ యుద్ధంలోను, 1818 లో జరిగిన మహారాష్ట్ర యుద్ధంలోను ఈ సైన్యం పాల్గొనింది 1818-26 మధ్యకాలంలో చెలరేగిన జమీందార్ల తిరుగుబాటును అణచివేయడానికి గూడ ఈ సైన్యాన్ని వాడారు.

ఈ రస్సెల్ బ్రిగేడ్‌పై ఖర్చు విపరీతంగా పెరిగి పోయింది ఎక్కువమంది అధికార్లను నియమించడం, బ్రిటీషు అధికార్లకు ఎక్కువ జీతాలివ్వడమే ఈ ఖర్చుకు కారణంగా భావించవచ్చు . దీని ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై అధిక భారం పడింది. రాజ్యం యొక్క ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. దీంతో రస్సెల్ బ్రిగేడ్‌లోని అధికారులకు సైన్యానికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని అధిగమించడానికి రస్సెల్ ఒక కొత్త పద్ధతిని అనుసరించాడు సైన్యం జీతాలు భరించేందుకు పామర్ అండ్ కంపెనీతో ఒక ఒప్పందం కుదుర్చుకోమని చందూలాల్‌పై ఒత్తిడి తెచ్చాడు.

## పామర్ అండ్ కంపెనీ

19వ శతాబ్ది ప్రారంభంనుండి దాదాపు అర్ధశతాబ్దం వరకు హైదరాబాదు రాజ్యం యొక్క ఆర్థిక పరిస్థితి చాల క్లిష్టమైన పరిస్థితిలో వుండేది. దీనికి గల కారణాలు కూడ వెతుక్కోనక్కరలేదు. ప్రభుత్వ నిర్వహణకు సంబంధించిన

ఆదాయం గురించిగాని, ఖర్చును గురించిగాని ఒక అంచనా వంటిది లేక పోవడం మొదటికారణంగా చెప్పవచ్చు చాలసంవత్సరాలుగ కేంద్రీకృత ప్రభుత్వ ఖజానా లేకపోవడం రెండవకారణం దఫ్తర్దార్ వంటి పనిలేని అధికారులు ఎక్కువ కావడంతో రాజ్యం యొక్క ఆదాయంలోని చాల భాగం వీరిపై ఖర్చుకు సరిపోయేది

దీనిఫలితంగా ప్రభుత్వం ఎడతెగని ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఒక్కొక్కప్పుడు రోజువారి ఖర్చులకు సైతం స్థానికంగవున్న భారతీయ, యూరోపియను వడ్డీ వర్తకులవద్ద అధిక వడ్డీతో అప్పులు తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కోసారి డబ్బులకోసం రాజ్యపు నగల్నిసైతం కుదువపెట్టేవారు. ఈనేపథ్యంలోనే వ్యాపార సంస్థయైన పామర్ అండ్ కంపెనీ నుండి ప్రభుత్వం అప్పును తెచ్చింది.

ఈ కంపెనీ వ్యవస్థాపకుడు విలియం పామర్. ఇతని తండ్రి జనరలు పామర్. ఈయన పూనాలోని పీష్వా ఆస్థానంలో బ్రిటీషు ప్రతినిధిగ పని చేసేవాడు ఇతని తల్లి లక్నో బేగం అయిన ఒక ముస్లిం వనిత విలియం పామర్ 1799లో హైదరాబాదు వచ్చి 1812లో నిజాం సైన్యంలో ప్రవేశించాడు. ఆ తర్వాత పామర్ అండ్ కంపెనీ అను వ్యాపార సంస్థను ప్రారంభించాడు ఇతని సోదరుడు జాన్ పామర్ కలకత్తాలో పేరుమోసిన వర్తకుడు.

హైదరాబాదులో వ్యాపార కార్యకలాపాల్ని నిర్వహించేందుకు పామర్ అండ్ కంపెనీ 1814మార్చి నెలలో గవర్నరు జనరల్ అనుమతి కోరింది దీనికి సంబంధించిన వనతి పత్రంపై హెన్రీరస్సెల్ తన పూర్తి సిఫార్సును వ్రాయడంతో గవర్నరు జనరల్ తన అనుమతిని ఇచ్చాడు. ఇక్కడ మనం గమనించాల్సిన ముఖ్యవిషయం ఏమిటంటే బ్రిటీషు ప్రతినిధియైన హెన్రీరస్సెల్తో పాటు చాలమంది ఆయన సహోద్యోగులు కూడ ఈ సంస్థలో తమ పెట్టుబడుల్ని పెట్టి విశేషమైన సంపదను ఆర్జించారు

హైదరాబాదులో తమ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభం అయినప్పటినుండి ఈ పామర్ సంస్థ నైజాంను దోచుకోవడం ప్రారంభించింది. బ్రిటీషు ప్రతినిధి స్వయంగా ఈ సంస్థలో భాగస్వామి కావడంతో చందూలాల్ ఆ కంపెనీ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాడు. 25శాతం వడ్డీపై నైజాం ప్రభుత్వం ఈ కంపెనీ నుండి అప్పు తీసుకుంది.

1816 మార్చినెలలో మద్రాసు గవర్నరు కుమారుడైన సర్ విలియం రుంబోల్డు త్వరగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో ఈ పామర్ అండ్ కంపనీలో వాటాదారు డయ్యాడు. రుంబోల్డు అప్పటి గవర్నరు జనరలు లార్డ్ హేస్టింగ్స్‌కు అల్లుడుకావడం కూడ విశేషం. గవర్నరు జనరలు అల్లుడు ఈ సంస్థలో చేరడంవల్ల దానికి ప్రాముఖ్యత వచ్చింది. ఈ సంస్థ నైజాంకునెలకు రెండులక్షల చొప్పున అప్పు మంజూరు చేసింది దీనికి బదులుగా ప్రభుత్వం సంవత్సరానికి 30లక్షల ఆదాయాన్ని చేకూర్చి పెట్టే కొన్ని బేరారు జిల్లాల్ని అప్పుతీరేవరకు పామర్‌సంస్థ అధీనంలో వుంచేందుకు సమ్మతించింది ఈ విధంగా సంవత్సరానికి పామర్ సంస్థకు 6 లక్షల లాభం లభించింది దీంతోపాటు నెలకు 80,000 రూపాయలు ప్రభుత్వ ఖజానా నుండి పామర్ కుటుంబ సభ్యులకు పెన్షన్ రూపంలో అందేవి

1820లో సర్ చార్లెసు మెట్‌కాఫ్ బ్రిటీషు ప్రతినిధిగ హైదరాబాదు వచ్చాడు పామర్ అండ్ కంపెనీ చేస్తున్న దోపిడీని గ్రహించడానికి మెట్‌కాఫ్‌కు ఎంతోకాలం పట్టలేదు కలకత్తాలోని ఒక సంస్థవద్ద 6శాతం వడ్డీకి అప్పుతీసుకుని పామర్ కంపెనీకి నిజాం కట్టవలసిన అప్పును తీర్చివేయాలని మెట్‌కాఫ్ ప్రయత్నించాడు కాని ఈ ప్రతిపాదనను గవర్నరు జనరలు అయిన లార్డ్‌హేస్టింగ్స్ ఆమోదించలేదు దీనికి కారణం పామర్ కంపెనీ నామరూపాలు లేకుండా పోతుందన్న భయమే కాని మెట్‌కాఫ్ తన ప్రయత్నాల్ని వదలలేదు. 1822లో మునుపటి ప్రతినిధి యైన రస్సెల్, అతని సహోద్యోగి సాల్‌బై పామర్ కంపెనీ సభ్యులయి విపరీతమైన లాభాల్ని ఆర్జిస్తున్నారని తెలుసుకున్నాడు 1823 జూలై నెలలో లార్డుహేస్టింగ్స్ భారతదేశం వదలిపోవడంతో కౌన్సిల్‌లోని సీనియరు సభ్యుడైన జాన్ ఆదమ్ తాత్కాలికంగ గవర్నరు జనరలు పదవి చేపట్టాడు.

జాన్ ఆదమ్ బ్రిటీషు ప్రతినిధి ఖజానానుండి పామర్ కంపెనీకి ఇవ్వవలసిన 80లక్షల రూపాయల్ని నైజాంకు మంజూరు చేసి అప్పు తీర్చేయమన్నాడు దీంతో పామర్ అండ్‌కంపెనీ ఒక సంవత్సరం లోపు కాలంలోనే దివాలా తీసింది. విలియం పామర్ 1867లో తన 87వ ఏట హైదరాబాదులో మరణించాడు.

## మెట్ కాఫ్ సంస్కరణలు

1820లో మెట్‌కాఫ్ బ్రిటీషు ప్రతినిధి పదవిని చేపట్టే నాటికి హైదరాబాదు రాజ్యం యొక్క ఆర్థిక పరిస్థితి చాల క్లిష్ట దశలో వుండేది. గ్రామప్రాంతాల్లో

సక్రమమైన పాలన ఉండేది కాదు రెవెన్యూ అధికారుల వేధింపు చర్యల్ని తట్టుకోలేక ప్రజలు కంపెనీ పాలనలో వున్న ప్రాంతాలకు వలస వెళ్ళారు దీంతో వ్యవసాయ భూముల్ని సాగుచేసేవాళ్ళు కరువయ్యారు. ఈ పరిస్థితి రాజ్య ఆర్థిక పరిస్థితి మరింత దిగజారడానికి కారణమైంది దీనికి తోడు 1814నుండి ప్రభుత్వం పామర్ కంపెనీ వంటి స్థానిక వ్యాపారసంస్థలనుండి అప్పు తీసుకోవడంతో మరిన్ని కష్టాలు ప్రారంభం అయ్యాయి ఈ అప్పు తీర్చేందుకు కొన్ని రెవిన్యూ ప్రాంతాల ఆదాయాన్ని పామర్ కంపెనీకి యిచ్చారు అదీగాక ఎక్కువ ఆదాయం కోసం శిస్తువసూలును వేలం పద్ధతిపై కాంట్రాక్టర్లకు ఇవ్వడం జరిగింది దీంతో కాంట్రాక్టర్లు త్వరగా ఎక్కువ డబ్బు సంపాదించాలన్న తాపత్రయంలో రైతుల్ని వేదించడం ప్రారంభించారు మామూలు పన్నుకంటె ఎక్కువ కట్టమని బలవంతం చేశారు ఈ విధంగా రైతుల కష్టాలు ఎక్కువకావడంతో హెన్రీ రస్సలు కొన్ని సంస్కరణల్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించాడు. అనవసరమైన ఉద్యోగులపై ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేశాడు కాని ఈ సంస్కరణల్ని హృదయపూర్వకంగ చేయకపోవడంతో అనుకున్న ఫలితాలు సాధించ లేక పోయాడు

కాని రస్సలు తర్వాత వచ్చిన మెట్‌కాఫ్ ఈ సంస్కరణల్ని సరియైన అవగాహనతో కొనసాగించాడు. మొదట ప్రభుత్వ ఆదాయ వ్యయాల్ని గూర్చి వివరణ ఇవ్వవలసిందిగా చందూలాల్‌ని కోరాడు దీనివల్ల ప్రభుత్వానికి ఎంతలోటు బడ్జెట్ వుందో తెలుస్తుంది. లోటు తెలియడంతో ప్రభుత్వవ్యయాన్ని ఎలా తగ్గించాలో ఆలోచించవచ్చు సంవత్సరానికి 10లక్షల రూపాయల లోటు వున్నట్టు మెట్‌కాఫ్ తెలుసుకోగల్గాడు.

రాజ్యం అంతా జిల్లాలుగ విభజింప బడింది ఒక్కొక్క జిల్లాను ఒక బ్రిటీషు అధికారి పర్యవేక్షణలో వుంచారు. ఈ జిల్లా అధికారులకు స్థానిక రెవెన్యూ ఉద్యోగులపై అదుపు వుంటుంది స్థానిక రెవెన్యూ అధికారుల వేధింపును తొలగించేందుకు రైతులు ఎంతపన్ను కట్టాలో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది.

చందూలాల్‌కు ఈ సంస్కరణలు ఇష్టంలేదు. ఒక రూపాయి ప్రభుత్వాదాయంలో 3అణాలు (రూపాయికి 16 అణాలు) కమీషను రూపంలో చందూలాల్‌కు అందేవి. ఎక్కువ ఆదాయం వస్తే ఎక్కువ కమీషను వచ్చేది. ఈ సంస్కరణం వల్ల

కమీషను తగ్గిపోతుందని భావించాడు. అందుకే సంస్కరణలకు విఘాతం కల్గించాలని ప్రయత్నించాడు. 1825లో మెట్‌కాఫ్ పదవీ విరమణచేసి హైదరాబాదు విడిచి వెళ్ళాడు. కొత్తప్రతినిధిగా మార్టిన్ నియమితుడయ్యాడు. నైజాం రాజ్యవ్యవహారాల్లో కంపెనీ జోక్యం ఎక్కువైందన్న సాకు చెప్పి చందూలాల్ ఈ సంస్కరణల్ని మార్టిన్ చేత ఆపుచేయించాడు

1829 మే నెల 21న సికందర్ ఝా మరణించగా అతని పెద్దకుమారుడైన నజీరుద్దౌలా సింహాసనాన్ని అదిష్టించాడు

## నసీరుద్దౌలా (1829–57)

నసీరుద్దౌలా కాలంలో జరిగిన వహాబీ ఉద్యమం, బేరారు దత్తత మొదలైన సంఘటనలు హైదరాబాదు రాజ్యంపై విపరీతమైన ప్రభావాన్ని చూపాయి. స్థానిక సంస్థానాల విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచిదికాదన్న ఉద్దేశంతో వున్న లార్డ్ బెంటింగ్ (1828-35) మెట్‌కాఫ్ సంస్కరణల్ని ఉపసంహరించుకోవడానికి బ్రిటీషు ప్రతినిధికి అనుమతి ఇచ్చాడు. ఇటువంటి అనాలోచిత చర్య మూలంగా తొమ్మిది సంవత్సరాల పాటు సాగిన క్రమబద్ధమైన, సుస్థిరమైన పాలనకు తుది ఘడియలు దాపురించాయి. మరో సారి ప్రభుత్వంలో అస్తవ్యస్తస్థితి చోటు చేసుకుంది. సైన్యపు ఖర్చు భరించడంలో మరల ప్రభుత్వం విఫలమైంది

జిల్లాల నుండి బ్రిటీషు అధికారుల్ని వెనక్కు రప్పించిన తర్వాత వీరి స్థానంలో అమీనులు లేక మనసబుదారులనే భారతీయ అధికారుల్ని ప్రభుత్వం నియమించింది ఈ అధికారులు ప్రభుత్వ వ్యవహారాల్ని సమర్థవంతంగా నిర్వహించ లేకపోయారు ఈ అసమర్థతను ఆసరాగ తీసుకొని వెంకట నరసింహారావు (అమ్మపాళెం), కాప నరసింహారావు (చింతగని), జగన్నాథరావు(మునగల) వంటి స్థానిక జమీందార్లు ప్రభత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు కాని ఈ తిరుగుబాటుల్ని హైదరాబాదు కంటింజెంట్ సైన్యం (రస్సెల్ సైన్యం) అణచి వేసింది. 1843లో హైదరాబాదు రాజ్యపు ఆర్థికపరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. దీంతో చందూలాల్ ఒక కోటి రూపాయల అప్పుకై బ్రిటీషుప్రతినిధికి విన్నపాలు పంపాడు. కాని ఈ ప్రయత్నం నెరవేరకపోవడంతో చందూలాల్ 1843లో రాజీనామా చేశాడు. 1845లో చందూలాల్ మరణించాడు చందూలాల్

రాజీనామా చేసిన 10సంవత్సరాల్లో చాలమంది దివానులుగ పని చేశారు వారిలో చందూలాల్ మేనల్లుడైన రాజా రాంబక్ష్ (1843-46), మునీర్-వుల్-ముల్క్ కుమారుడైన నవాబు సిరాజ్ వుల్ ముల్క్ (1846-48), అంజాద్ వుల్ ముల్క్ మరియు షంషుల్ వుమర (1849) ముఖ్యులు.

## వహాబీ ఉద్యమం

19వ శతాబ్దపు ద్వితీయ దశకంలో సయ్యద్ అహ్మద్ బ్రెయిల్వీ నాయకత్వంలో యూరోపియనులకు, సిక్కులకు వ్యతిరేకంగా ఒక ముస్లిం ఉద్యమం ప్రారంభం అయింది ఈ ఉద్యమం చాలవరకు ఉత్తర భారతదేశానికే పరిమితమైంది కాని 1831లో ఈ ఉద్యమ నాయకుడు బ్రెయిల్వీ మరణించిన తర్వాత ఈ ఉద్యమం దక్షిణ భారతానికి కూడ వ్యాపించింది నైజాం సికందర్ ఝా మూడవ కుమారుడైన ముబారిజుద్దౌలా వహాబీ ఉద్యమంలో చురుకుగా పాల్గొనేవాడు 1815లో బ్రిటీషువారికి వ్యతిరేకమైన కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడంటూ ప్రభుత్వం ముబారిజుద్దౌలాను బందించి గోల్కొండ కోటలోని చెరశాలలోవుంచింది. 1820లో చెరనుండి విముక్తుడైనా బ్రిటీషు వ్యతిరేకవిధానాన్ని మాత్రం మార్చుకోలేదు.

1839-42 మధ్య జరిగిన మొదటి ఆఫ్ఘన్ యుద్ధంలో బ్రిటీషు కంపెనీ మునిగి వుండగా, వహాబీలు తమకార్యకలాపాల్ని ఉధృతం చేసి ముబారిజుద్దౌలాను తమ నాయకుడిగ గుర్తించారు కర్నూలు నవాబైన గులాంఖాన్ ఈ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 1838లో కొత్తగా హైదరాబాదులో బ్రిటీషు ప్రతినిధిగ నియమింపబడ్డ జనరలు ఫ్రాజర్‌ను నెల్లూరు జిల్లా మాజిస్ట్రేటుగ పనిచేస్తున్న స్టోన్ హౌస్ వహాబీ కుట్రను గురించి హెచ్చరించాడు. వెంటనే ఫ్రాజర్ తగిన చర్యలు తీసుకొని ముబారి జుద్దౌలాను అరెస్టు చేయించి గోల్కొండ దుర్గంలోని జైలులో పెట్టాడు 1854 జూన్ 25న ముబారి జుద్దౌలా జైలులోనే మరణించాడు. కర్నూలు నవాబును కూడ అరెస్టు చేయించి తిరుచిరాపల్లి జైలుకు పంపాడు. నవాబు జాగీరు కూడ బ్రిటీషు వారి స్వాధీనమై 'అనియుత రాష్ట్రం' గ పరిపాలింప బడింది ఈ విధంగా సిపాయిల తిరుగుబాటుకు ప్రారంభసూచకమనదగిన ఈ వహాబీ ఉద్యమాన్ని బ్రిటీషువారు సులభంగా అణచివేయ గల్గారు.

## బేరారు దత్తత

మెట్ కాఫ్ సంస్కరణల్ని ఉపసంహరించిన తర్వాత హైదరాబాదు రాజ్యం యొక్క ఆర్థిక పరిస్థితి దిగజారి పోయింది. అందువల్ల 1830–38 మధ్య కాలంలో బ్రిటీషు ప్రతినిధిగ పనిచేసిన కల్నల్ స్టెవార్ట్ నైజాం ప్రభుత్వంలో బ్రిటీషు అధికారుల్ని నియమించాలని ప్రయత్నించాడు కాని ఇతని ప్రతిపాదనల్ని గవర్నరు జనరలు ఆమోదించలేదు. ఆర్థిక దివాలాకు ప్రధాన కారణం హైదరాబాదు కంటింజెంట్ సైన్యాన్ని పోషించడమే. రాజకీయ ప్రయోజనం కోసమే ఈ సైన్యాన్ని పోషిస్తున్నా అందుకు తగ్గ ఫలితాలు కన్పించడం లేదు

చందూలాల్ రెవెన్యూ బాధ్యతల్నుండి బ్రిటీషు అదికారుల్ని తప్పించ గల్గినా హైదరాబాదు కంటింజంట్ సైన్యాన్ని తొలగించ లేక పోయాడు. దీనికి ప్రధాన కారణం బ్రిటీషువారి కోపానికి గురికాకూడదన్న చందూలాల్ తాపత్రయమే. అదీగాక చందూలాల్ పదవిలో కొనసాగడం బ్రిటీషు ప్రతినిది యొక్క ఇష్టాయిష్టాలపై ఆధారపడివుంది. దీనివల్ల చందూలాల్ నోరువిప్పలేక పోయాడు

1848 లో గవర్నరు జనరలుగ వచ్చిన లార్డు డల్హౌసి దేశంలోని సంస్థానాల్ని ఆక్రమించు కోవడం ప్రారంభించాడు తాను పదవీ బాధ్యతల్ని స్వీకరించిన వెంటనే తన దృష్టిని ఉత్తర భారతదేశంపై కేంద్రీకరించాడు 1850 సంవత్సరానికల్లా హైదరాబాదు ప్రభుత్వం ఈస్టిండియా కంపెనీకి 64 లక్షల రూపాయలు బాకీపడ్డది. 1850 డిశంబరు 31 వ తేదీలోపల మొత్తం బాకీని చెల్లించ వలసిందిగా దల్హౌసీ నైజాంను కోరాడు. కాని నైజాం మొత్తం బాకీని చెల్లించలేడని దల్హౌసీకి బాగా తెలుసు. అందువల్ల తగిన అదను చూసుకొని నైజాం రాజ్యంలోని కొన్ని ప్రాంతాల్ని స్వాధీనం చేసుకోవడానికి దల్హౌసీ తన ప్రయత్నాల్ని ప్రారంభించాడు. సంవత్సరానికి 35 లక్షల ఆదాయం వచ్చే జిల్లాల్ని పేర్కొనవలసిందిగా బ్రిటీషు ప్రతినిధియైన ఫ్రాజర్‌ను డల్హౌసి అడిగాడు డల్హౌసీ ఆక్రమణ సిద్ధాంతం నచ్చని ఫ్రాజర్ 1853లో తన పదవికి రిజీనామా చేశాడు ఫ్రాజర్ స్థానంలో కల్నల్ లో బ్రిటీషు ప్రతినిధిగా నియమింపబడాడు.

1851 ఆగష్టుకంతా బ్రిటీషు కంపెనీకి చెల్లించవలసిన అప్పును దాదాపు సగానికి పైగా నైజాం తీర్చేశాడు. మిగిలిన మొత్తాన్ని సంవత్సరం చివరికంతా

తీర్చేయగలనని హామీ ఇచ్చాడు కాని నైజాం తన వాగ్దానాన్ని నిలుపుకోలేక పోయాడు అందువల్ల 1853 మే 21న అయిష్టంగానే నైజాం బేరారు ఒడంబడికపై సంతకం పెట్టాడు ఈ ఒడంబడిక ప్రకారం బేరారు రాష్ట్రంతో పాటు, ధారాశివ్ (ఉస్మానాబాద్), రాయచూర్ జిల్లాల్ని కూడ నైజాం ఈస్టిండియా కంపెనీకి దత్తం చేశాడు. ఈ ఒప్పందం తర్వాత నైజాం సైన్యాన్ని 'హైదరాబాదు కంటింజెంటు' గ రూపొందించి బ్రిటీషు భారతీయ సైన్యానికి అనుబంధ దళంగా చేశారు ఈ బేరారు ఒడంబడికను కంపెనీ ఒత్తడితోను, మోసంతోను కుదుర్చుకుంది నైజాం రాజ్యాన్ని ధ్వంసం చేస్తామన్న బెదిరింపుతో నైజాం సంతకం తీసుకోగల్గారు ఈ ఒడంబడిక కుదిరిన తర్వాత అయిదు రోజులకే (1853 మే నెల 26వ తేదీన) మానసిక వేదనతోను, అవమానంతోను దివాను సిరాజ్ వుల్ ముల్క్ తన ప్రాణాలు విడిచాడు. సిరాజ్ తర్వాత 24 ఏళ్ళ వయస్సుగల తన మేనల్లుడైన తురాబ్ ఆలీఖాన్ 1853 మే 31న దివాను పదవిని స్వీకరించాడు. ఈ తురాబ్ ఆలీఖాను తర్వాత 'సాలార్ జంగ్' బిరుదుతో ప్రసిద్ధి చెందాడు.

# 4

# కంపెనీ పాలనలో ఆంధ్రదేశం

## ఆంగ్లేయులపై తిరుగుబాట్లు

ఆంధ్రదేశంలో ఈస్టిండియా కంపెనీ స్వాధీనం చేసుకున్న ప్రాంతాల్లో అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు దాదాపు 50 నుండి 60 సంవత్సరాలు పట్టింది. తీరాంధ్ర దేశంలో స్థానిక జమీందార్ల నుండి విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. రాయలసీమలోని పాలేగార్లు బ్రిటీషు పాలనను వ్యతిరేకించారు.

గంజాం జిల్లాలోని ఘుంసూరు, పర్లకిమిడి జమీందార్ల తిరుగుబాటును ఈస్టిండియా కంపెనీ ఎదుర్కోవలసి వచ్చింది. ఈ ప్రాంతాలు ఇప్పుడు ఒరిస్సా రాష్ట్రంలో ఉన్నాయి. విజయనగరం జిల్లాలోని అతిపెద్ద జమీందారైన విజయనగరం రాజా నుండి కూడ వ్యతిరేకత ఎదురైంది. ఆనందగజపతిరాజు ఏ విధంగా కల్నల్ ఫోర్డుతో కలసి విశాఖపట్నం, రాజమండ్రి, మచిలీపట్నం నుండి ఫ్రెంచి వారిని తరిమివేశారో మనం ఇదివరకే తెలుసుకున్నాం. ఆనందగజపతిరాజు తర్వాత విజయరామరాజు విజయనగరం జమీందారయ్యాడు 1760 నుండి 1794 వరకు పాలించాడు. తన సవతి తమ్ముడైన సీతారామరాజు దివానుగ పనిచేసేవాడు సీతారామరాజు నడవడిక మంచిది కాకపోవడంతో ఆయన పరిపాలనకు కూడ చాలా చెడ్డ పేరు వచ్చింది. 1784లో సీతారామరాజు దివాను పదవి నుండి తొలగించబడినాడు. కాని ఆయన మద్రాసు గవర్నరుకు, కౌన్సిలు సభ్యులకు లంచమిచ్చి దివాను పదవిని తిరిగి చేపట్టినాడు. అయితే కంపెనీ డైరెక్టర్లు రాజా తరపున జోక్యం చేసుకుని దివాను పదవి నుండి సీతారామరాజును తొలగించారు.

దివాను పదవి నుండి సీతారామరాజును తొలగించిన తర్వాత కూడ విజయరామరాజు ప్రభుత్వాన్ని సక్రమంగా నిర్వహించలేకపోయాడు. కంపెనీకి చెల్లించవలసిన 'పేష్కుష్'ను కూడా చెల్లించలేకపోయాడు. ఈ విధంగా కంపెనీకి చెల్లించవలసిన బకాయిలు ఎక్కువ కావడంతో విజయనగర సంస్థానాన్ని జప్తు చేయించి రాజాకు పెన్షను ఇవ్వవలసిందిగా మద్రాసు ప్రభుత్వం ఆజ్ఞలు జారిచేసింది. 1783 ఆగష్టు రెండవ తేదీన విజయనగరం దుర్గాన్ని కంపెనీ స్వాధీనం చేసుకుంది. తర్వాత ఈ ప్రాంతాన్ని మూడు జిల్లాలుగ విభజించి వాటి పాలనకై అధికారుల్ని నియమించింది. విజయనగరం రాజాను 1,200 రూపాయలు పెన్షనుతో మచిలీపట్నంలో నివసించవలసినదిగా కంపెనీ ఆదేశించింది. అయితే విజయరామరాజు మద్రాసు ప్రభుత్వాన్ని ఎదిరించేందుకు సిద్ధపడ్డాడు. విజయనగరం, భీముని పట్నాలకు మధ్య గల ప్రాంతమైన పద్మనాభంవైపు తన సైన్యంతో నడిచాడు. దీంతో కంపెనీ కూడ తన సైన్యాన్ని విజయరామరాజు పైకి పంపింది. 1794 జూలై 10న పద్మనాభం వద్ద జరిగిన యుద్ధంలో విజయ రామరాజు ఓడిపోవడమే కాక తన ప్రాణాలు కూడా కోల్పోయాడు.

విజయరామరాజు మరణం తర్వాత అతని ఎనిమిదేళ్ళ కుమారుడు నారాయణబాబు విశాఖ జిల్లాలోని మక్కువ అనే కొండ ప్రాంతంలో తలదాచు కున్నాడు. చాలమంది స్థానిక ప్రభువులు, కొండజాతివారు నారాయణబాబు చుట్టు చేరారు. అడవి ప్రాంతంలోకి సైన్యాన్ని పంపడానికి కంపెనీకి ఇష్టం లేదు. అందువల్ల నారాయణ బాబుతో చర్చలు ప్రారంభించింది. నారాయణబాబు కంపెనీకి చెల్లించవలసిన అయిదు లక్షల రూపాయల బకాయిలు చెల్లించడానికి అంగీకరించడంతో, కంపెనీ విజయనగర సంస్థానాన్ని నారాయణబాబుకు అప్పగించింది. 1802లో శాశ్వత శిస్తు పద్ధతిని అమలు చేయడంతో విజయ నగరం జమీందార్లు చెల్లించవలసిన 'పేష్కుష్' సంవత్సరానికి అరు లక్షల రూపాయలుగ నిర్ణయింపబడింది.

ఈ జమీందార్ల తిరుగాబాట్లతో పాటు కొండజాతి ప్రజలు కూడ కొన్ని పితూరీలు లేవదీశారు. విశాఖ జిల్లాలోని గులుగొండ కొండజాతి ప్రజలు కంపెనీని వ్యతిరేకించారు. 1845 నుండి 1848 వరకు ఈ కొండజాతి ప్రజలు ప్రభుత్వానికి ఇబ్బందులు కల్గించారు. 1848 లో కొండజాతి తిరుగుబాటుదార్లకు

క్షమాభిక్ష పెట్టడానికి, వారి నాయకుడైన చిన్న భూపతికి జీవనభృతి కల్పించడానికి కంపెనీ ప్రభుత్వం అంగీకరించడంతో సద్దు మణిగింది. మరల 1857–58 లో మరో పితూరీ తలెత్తగా కంపెనీ ప్రభుత్వం దాన్ని సులభంగా అణచివేసింది. మిగిలిన కోస్తా జిల్లాల్లో చెలరేగిన స్థానిక జమీందార్ల తిరుగుబాటును కూడ ప్రభుత్వం అణచివేయగల్గింది.

కాని రాయలసీమ ప్రాంతంలోని స్థానిక పాలెగార్ల నుండి కంపెనీకి గడ్డు సమస్య ఎదురైంది 1800 నాటికి రాయలసీమలో 80 మంది పాలెగార్లు ఉండేవారు. వీరందరు బ్రిటీషు ఆదిపత్యాన్ని అంగీకరిచేందుకు సుముఖంగా లేరు. అందువల్ల ఈ ప్రాంతానికి ప్రిన్సిపలు కలెక్టరు అయిన థామస్ మన్రో ఆయుధాలు విడిచిపెట్టి, కంపెనీకి 'పేష్‌కుష్' కట్టవలసిందిగా స్థానిక జమీందార్లందరికి ఆదేశాల్ని పంపాడు. చాలమంది జమీందార్లు మన్రో ఆదేశాల్ని లెక్కపెట్టలేదు. పైగా వారు తమ నిరసనను కూడ వ్యక్తం చేసారు. అందువల్ల పాలెగాళ్ళను తన అదుపులోకి తెచ్చుకునేందుకు మన్రోకు దాదాపు 18 నెలలు పట్టింది అయినా కూడ పరిస్థితులు పూర్తిగా చక్కబడలేదు. 1846 లో కూడ కర్నూలు జిల్లాలోని నరసింహారెడ్డి అనే పాలెగాడు కంపెనీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. నరసింహారెడ్డి కోయిలకుంట్లలోని ప్రభుత్వ ఖజానాపై దాడిచేసి కంభం వైపు నడిచాడు. మూండ్లపాడువద్ద జరిగిన యుద్ధంలో కేప్టెన్ నాట్ చేతిలో ఓడిపోయాడు. కాని నరసింహారెడ్డి తప్పించుకుని నిజాం భూభాగంలో తలదాచుకున్నాడు. అయితే తరువాత ఆరువారాలకే కర్నూలు జిల్లాలో తిరిగి అడుగుపెట్టాడు. ఈసారి మాత్రం బ్రిటీషువారి చేతుల్లో చిక్కుకున్నాడు. కోయిలకుంట్ల వద్ద బహిరంగంగా ఉరితీయబడ్డాడు మన్రో ఈ జమీందారీని స్వాధీనం చేసుకుని ఈ ప్రాంతంలో శాశ్వత శిస్తుపద్ధతిని ప్రవేశపెట్టాడు. రాజులు, జమీందార్లు, పాళెగార్లు చేసిన ఈ తిరుగుబాట్లు, ఆంధ్రదేశంలో ఆంగ్లేయులపై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయి.

### కంపెనీ పరిపాలన – ప్రభావాలు

19వ శతాబ్ది ప్రధమార్ధం కల్లా కంపెనీ ప్రభుత్వం ఆంధ్రదేశంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. పాలనాపరమైన మార్పుల్ని ప్రవేశపెట్టింది.

ఆంధ్రదేశాన్నంతా వివిధ జిల్లాలుగ విభజించింది. ఈ జిల్లాల పాలనా బాధ్యతల్ని నిర్వహించేందుకు కలెక్టర్లని నియమించింది. శిస్తును వసూలు చేయడమే ఈ జిల్లా అధికారి యొక్క ప్రధాన బాధ్యత తీరాంధ్ర ప్రాంతాన్నంతా కూడ అయిదు కలెక్టరేట్లుగా (జిల్లాలు) విభజించారు. ఇవి 1 గంజాం 2 విశాఖపట్నం 3. గోదావరి 4. కృష్ణ 5 నెల్లూరు 1800 లో నైజాం చేత కంపెనీకి దత్తత చేయబడ్డ రాయలసీమ జిల్లాలన్నింటిని కలిపి ఒకే కలెక్టరేటుగ చేశారు అనంతపురం జిల్లా ప్రధాన కేంద్రం అయింది. 1800 అక్టోబరు 24న థామస్ మన్రో ప్రిన్సిపాలు కలక్టరుగ నియమితులయ్యారు. ఆయన క్రింద నలుగురు సబ్ కలక్టర్లు ఉండేవారు. వీరికి హర్పనహల్లి, ఆదోని, కడప, కంభం, అధికార కేంద్రాలుగ ఉండేవి 1808లో ఈ ప్రాంతం బళ్ళారి, కడప అను రెండు జిల్లాలుగ (కలక్టరేట్లు) విభజింపబడింది. తర్వాత 1858లో కర్నూలు జిల్లా, 1882లో అనంతపురం జిల్లా, 1911లో చిత్తూరు జిల్లా ప్రత్యేకంగా ఏర్పాటుచేయబడ్డాయి.

పరిపాలనలో కీలకమైన పాత్ర వహించే ఉద్యోగి కలెక్టరు. కాని చాలమంది కలెక్టర్లకు, ఇతర ఉద్యోగులకు తెలుగు భాషలో ప్రవేశం లేదు గ్రామ ప్రాంతాల ప్రజల పరిస్థితులుగూడ వారికి తెలియవు. ఈ అధికార్లు చాలవరకు స్థానికాధికారులపైన ఆధారపడి నిర్ణయాలు తీసుకునేవారు కాని చాల మంది స్థానికాధికారులు అవినీతిపరులుగ, అసమర్థులుగ ఉండేవారు. ఇంగ్లీషు కలెక్టర్లలో ఒక థామస్ మన్రో తప్ప మిగిలిన వారందరూ వీరిపై ఆధారపడినవారే. థామస్ మన్రోకు తెలుగుబాషలో మంచి ప్రవేశం ఉండడంతో దుబాషీల సహాయం లేకనే పరిపాలన సాగించాడు.

## భూమి శిస్తు

కొత్తగా కంపెనీ స్వాధీనం అయిన ప్రాంతాల్నుండి గరిష్ఠస్థాయిలో శిస్తు వసూలు చేయాలని లండనులోని కంపెనీ డైరెక్టర్లు భావించారు. జమీందారీ పద్ధతి, రైత్వారీ పద్ధతి అను రెండు ముఖ్యమైన భూమిశిస్తు పద్ధతుల్ని కంపెనీ ప్రవేశపెట్టింది. తీరాంధ్రదేశంలో చాలమంది జమీందార్లు, భూస్వాములు ఉండేవారు జమీందార్ల నుండి 'పేష్కుష్' మొత్తాన్ని చాల ఎక్కువగా

నిర్ణయించడంతో చాలమంది జమీందార్లు నాశనమయ్యారు. రాయలసీమ ప్రాంతంలో మాత్రం రైత్వారీ పద్ధతి ప్రవేశపెట్టారు ఈ పద్ధతి ప్రకారం స్వంత భూమిని కలిగియున్న రైతునుండే నేరుగా శిస్తు వసూలు చేసేవారు. ఈ పద్ధతి కూడ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. సహజంగా దయాస్వభావం, ఉదార గుణం కల మన్రో కూడ శిస్తును మొదట ఎక్కువగా నిర్ణయించి తర్వాత కొంతకాలానికి తగ్గించాడు ఇదేకాక భూముల్ని సరిగా సర్వే చేయలేదు. సరిహద్దులు గూడ సక్రమంగా నిర్ణయించలేకపోయారు. 1857 తర్వాత ఇంగ్లండు రాణి పాలన ప్రారంభం అయిన తర్వాతనే ఈ సర్వే, సెటిల్‌మెంటు పనులు పూర్తి అయ్యాయి. శిస్తును మాత్రం చాల ఖచ్చితంగా వసూలు చేసేవారు. పన్ను ఎగవేతకు అవకాశమే లేకపోయింది. దీంతోపాటు పన్నును నగదు రూపంలోనే కట్టవలసి ఉండడంతో రైతులకు మరిన్ని కష్టాలు ఎదురయ్యాయి. 1834 నుండి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవడమే ఈ నష్టాలకు మూలకారణం.

## నీటిసాగు పద్ధతులు

నీటిసాగు పద్ధతుల్ని అభివృద్ధి చేసేందుకు కంపెనీ ఎటువంటి చర్య తీసుకోలేదు. చెఱువుల్ని, కాలవల్ని, అభివృద్ధి చేసేందుకు ఉన్నవాటిని మరమత్తు చేసేందుకు తగిన చర్యల్ని చేపట్టలేదు. 1847 లో గోదావరి నదిపైన, 1853లో కృష్ణానదిపైన కట్టిన ఆనకట్టలు తప్ప మరేవీ కంపెనీ కాలంలో చేపట్టలేదు. అయితే ఈ రెండు ఆనకట్టలు ఆయా డెల్టా ప్రాంతంలో అభివృద్ధికి ఎంతగానో దోహదం చేశాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు. కాని ఆంధ్రదేశంలోని మిగిలిన ప్రాంతాల్లో నీటిసాగు పద్ధతిలో ఎటువంటి పురోభివృద్ధి జరగలేదు. అందువల్ల కంపెనీ పాలనలో ఆంధ్రదేశం అనేక కరువు కాటకాలకు గురికావడంలో ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. 1805 నుండి 1807 వరకు ఆంధ్రప్రాంతమంతా తీవ్రమైన కరువుకు గురిఅయింది దీని ఫలితంగా కొన్ని గ్రామాలకు గ్రామాలే వలస వెళ్ళాయి. 1811లో నెల్లూరు జిల్లా తీవ్రమైన కరువుకు గురి అయింది. 1823 నాటి కరువు ఆంధ్రదేశంలోని చాలా ప్రాంతాలపై తన ప్రభావాన్ని చూపింది. 1833లో గుంటూరు జిల్లా అది వరకు కనివిని ఎరుగని రీతిలో కరువుకు గురయింది. 1839 లో

ఆంధ్రదేశమంతా పంటలు విఫలమయ్యాయి. ప్రభుత్వం మాత్రం ప్రజల కష్టాల్ని పట్టించుకోలేదు. తరుచుగ వస్తున్న కరువుల్ని నివారించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం కరువు నివారణకు తగిన చట్టాల్ని కూడ రూపొందించలేదు.

## చేతివృత్తులు

వ్యవసాయంతో పాటు చేతివృత్తులు కూడ క్షీణించడం ప్రారంభించాయి వ్యవసాయేతర రంగాల్లో పనిచేస్తున్న వర్గాలకు ఈ చేతివృత్తులు జీవన భృతిని కల్పించేవి వ్యవసాయం తర్వాత వస్త్రపరిశ్రమ చాల మందికి ఆధారమైంది ఈ పరిశ్రమను ఇంటిలోనే కొనసాగించవచ్చు ఘోషా అవలంబించే స్త్రీలు సైతం ఈ వృత్తిని స్వీకరించవచ్చు రాయలసీమలోని నేతగాండ్రు బహుభార్యాత్వాన్ని అవలంబించి వారిని వృత్తిలోకి దింపి తమ ఆదాయాన్ని పెంచుకునేవారు. ఈ నేతపని అంత కష్టం కాకపోవడంతో ముసలివాళ్లు, చిన్న పిల్లలు సైతం ఈ వృత్తిలో పాలుపంచుకునేవారు. కాని కుటుంబ సభ్యులందరు పనిచేసినా కూడ నేతగాళ్ళ ఆర్థిక పరిస్థితిలో పురోభివృద్ధ కన్పించలేదు. సంపాదించిన ధనాన్ని తాగుడుకు, జూదమాడడానికి, కోడిపందాలకు ఖర్చు పెట్టడం వల్ల వారి ఆర్థిక స్థితిలో ఎలాంటి మార్పు లేకపోయింది.

వస్త్ర పరిశ్రమ చాలవరకు దెబ్బతింది. పాత రోజుల్లో బరంపురం సిల్కువస్త్రాలకు, శ్రీకాకుళం మస్లిను గుడ్డలకు, మచిలీపట్నం రంగు గుడ్డలకు నెల్లూరు రుమాళ్ళకు యూరపులో మంచి గిరాకీ ఉండేది. 17వ శతాబ్దిలోను, 18వ శతాబ్ది ప్రథమార్ధంలోను ఈస్టిండియా కంపెనీ ఎగుమతి చేసే వస్తువుల్లో పై వస్త్రాలు ముఖ్యంగా చోటు చేసుకునేవి.

యంత్రాల సహాయంతో ఇంగ్లాండులో తయారయ్యే వస్త్రాలు అతి చౌకగా దొరకడంతో భారతదేశపు వస్త్ర పరిశ్రమ బాగా దెబ్బతింది. వ్యాపారంలో పోటీ పడలేక పోయింది. విశాఖపట్నం నుండి సంవత్సరానికి దాదాపు 7 లక్షల రూపాయల విలువ గల వస్త్రాలు ఎగుమతి అయ్యేవి. కాని 19వ శతాబ్దపు తృతీయ దశకానికి కల్లా ఒక లక్ష రూపాయలకు పడిపోయింది. 19వ శతాబ్దంలోని ద్వితీయ దశకంలో సుమారు 30 లక్షల రూపాయల విలువ చేసే

ఎగుమతులుండేవి. కాని 1843–44 నాటికి ఈ ఎగుమతుల విలువ 2,750 రూపాయలకు పడిపోయింది. నెల్లూరు పరిస్థితి కూడ ఇదే విధంగా ఉండేది. 1817 – 18 లో నెల్లూరు నుండి ఎగుమతులు 1,80,000 రూపాయల వరకు ఉండేవి. 1842–43 నాటికి వాటి విలువ కేవలం 360 రూపాయలకు చేరుకుంది.

భారతీయ వస్త్ర పరిశ్రమ విదేశీ మార్కెట్టునే గాక స్థానిక మార్కెట్టును కూడ పోగొట్టుకుంది. దీనికి (స్థానిక మార్కెట్టు విషయమై) కంపెనీ అనుసరించిన లోపభూయిష్ట విధానమే ప్రధాన కరాణం. బ్రిటీషు వస్త్రాలకు విపరీతమైన ప్రోత్సాహాన్ని ఇచ్చింది అదే సమయంలో స్థానిక పరిశ్రమపై రవాణా పన్నుల్ని, మోతుర్పా వంటి మగ్గపు పన్ను విధించి స్థానిక వ్యాపారాన్ని దెబ్బ తీసింది. అదీగాక జమీందార్ల నాశనం కావడంతో స్థానిక పరిశ్రమల్ని పోషించేవారు కరువయ్యారు. దీని ఫలితంగా చాలమంది నేతగాండ్రు శ్రీలంక, బర్మా, మారిషస్ వంటి దేశాలకు కూలీలుగా వలస వెళ్ళారు

## పట్టు (సిల్కు) వస్త్రాలు

బరంపురం, పెద్దాపురం, ధర్మవరం ఆంధ్రదేశంలో పట్టుపరిశ్రమకు ముఖ్య కేంద్రాలుగ ఉండేవి. ఈ పట్టు వస్త్రాలు చాల విలువైనవిగ పరిగణింప బడడం వల్ల ధనవంతులు వీటిపై ఎక్కువ మోజు చూపేవారు. పోర్చుగీసువారు భారత దేశంలోని పట్టు వస్త్రాల్ని యూరపులో విక్రయించేవారు. ఈస్టిండియా కంపెనీ కూడ కొన్ని రకాల పట్టు వస్త్రాల్ని ఎగుమతి చేసేది. 19 వ శతాబ్ది మధ్య కల్లా ఈ పరిశ్రమ క్షీణించడం ప్రారంభించింది. యూరోపు మార్కెట్టులో చైనా, జపాను దేశాల పట్టు వస్త్రాలకు పోటీగా నిలువలేకపోయింది. ఉన్నతవర్గమైన జమీందార్ల వంటివారు క్షీణించడంతో స్వదేశంలో కూడా పట్టు పరిశ్రమకు స్థానం లేకుండా పోయింది. ఈ సిల్కు పరిశ్రమ కేవలం ధనవంతులు, మధ్యతరగతిలో ఉన్నతులైన వారిపై ఆధారపడి పట్టణ పరిశ్రనుగా అభివృద్ధి చెందింది. దీనివల్ల ఈ పరిశ్రమకు ఒక పరిమితి ఏర్పడి అభివృద్ధి చెందడానికి అవకాశం లేకపోయింది. ఆంధ్రదేశం లోని పట్టు వస్త్ర నేతగాండ్రు చాల వరకు దేవాంగ, పద్మశాలి, సాతాని, మాల (హరిజన) ముస్లిం వర్ణాలకు చెందినవారు.

తివాచీల తయారీ

ఏలూరు తివాచీలు, కర్నూలు రంగు రగ్గులు మరియు దుప్పట్లు అంతర్జాతీయ విపణిలో చాల ప్రసిద్ధి చెందాయి ఆంధ్రదేశం ముస్లింల అధీనం అయినపుడు పర్షియా నుండి వలస వచ్చి స్థిరపడ్డవారు ఏలూరులో తివాచీలు తయారు చేయడం ప్రారంభించారు 1851లో లండనులో ఏర్పాటయిన వస్తు ప్రదర్శనలో ఏలూరు తివాచీలు ఒక ప్రత్యేక ఆకర్షణను కలిగి ఉండేవి ఈ తివాచీలు పూర్తిగ స్వదేశీ ఉన్నితోనే తయారు చేయబడ్డాయి కృష్ణా, గోదావరి జిల్లాల్లో దొరికే ఉన్ననే ఈ తివాచీల తయారీలో ఉపయోగించేవారు ఈ తివాచీల తయారీలో రెండు రకాల నమూనాలు ఉండేవి. ఒకటి ఫరీష్కాని, రెండవది అమ్మన్కాని. బుల్ బంది, నబాష్కాని, గోహ్లావు ఖానీ వంటి ఇతర రకాలు కూడ ఉండేవి

రాయలసీమలో కర్నూలుతో పాటు ఆదోని, బళ్ళారి కూడ ఈ పరిశ్రమకు ప్రసిద్ధి చెందాయి ఈ ప్రాంతాల్లో తయారయ్యే తివాచీలు దేశంలోని మార్కెట్టు అవసరాలకు సరిపోయేవి ఇవి ఏలూరు లేక మచిలీపట్నంలో తయారయ్యే తివాచీలకు సమానమైన నాణ్యతను కల్గి ఉండేవి కావు 19 వ శతాబ్దపు మధ్య భాగాని కల్లా ఈ పరిశ్రమకు చెడ్డ రోజులు దాపురించాయి దీనికి కారణం నేతగాండ్ర పనితనంలోని లోపం మాత్రం కాదు ప్రభుత్వం నుండి, ప్రజల నుండి తగిన ప్రోత్సాహం లభించకపోవడమే ముఖ్యకారణం

నౌకా నిర్మాణం వంటి ఇతర పరిశ్రమలకు కూడ ఇదే పరిస్థితి ఎదురైంది గంజాం నుండి నెల్లూరు వరకు గల తీరాంధ్ర దేశంలోని అన్ని పట్టణాల్లో నౌకా నిర్మాణ పరిశ్రమ లుండేవి

ఈ విధంగా పరిశ్రమలు, చేతిపనులు క్షీణించడంతో చాలమంది ప్రజలు తమ జీవనాధారాన్ని కోల్పోయారు దీంతోపాటు కంపెనీ పాలనలో అసమర్థత, అవినీతి చోటు చేసుకోవడంతో ప్రజలకు మరిన్ని కష్టాలు ఎదురయ్యాయి న్యాయ విభాగంలో ఈ అసమర్థత అవినీతి ఎక్కువగా కన్పించేవి చాలమంది న్యాయాదిపతులకు న్యాయశాస్త్రంలో తగినంత ప్రవేశం ఉండేది కాదు. రెవెన్యూ శాఖలో అసమర్థులుగా పేరొందినవార్ని న్యాయశాఖలోకి మార్చి న్యాయాధిపతులుగ

నియమించడం జరిగింది కంపెనీ న్యాయశాఖను చాలమంది 'అనాధుల శరణాలయం'గ అభివర్ణించేవారు

## విద్య

విద్యావిషయంలో ఆంధ్రదేశాన్ని కంపెనీ పాలకులు పట్టించుకోలేదు 1813లో ప్రభుత్వం ఒక లక్ష రూపాయల్ని విద్యకు కేటాయించింది కాని ఉన్నత విద్యావ్యాప్తికి కంపెనీ ఎటువంటి చర్యను తీసుకోలేదు

మన్రో మద్రాసు గవర్నరుగా ఉండేటప్పుడు మద్రాసు ప్రెసిడెన్సీ మొత్తం మీద 40 జిల్లా పాఠశాలలు, 300 తాలూకా పాఠశాలల్ని స్థాపించాల్సిందిగా ప్రతిపాదనలు పంపాడు దీని ఫలితంగా కంపెనీ డైరెక్టర్లు తగిన నిధులు మంజూరు చేశారు. కాని వీటి నిర్వహణ పూర్తిగ విఫలమయినట్లు 1839లో ప్రకటించారు తర్వాత 1841లో మద్రాసులో సెంట్రల్ కాలేజియేట్ ఇన్‌స్టిట్యూషన్‌ను స్థాపించారు ఈ సంస్థను కూడ ప్రజల నుండి వచ్చిన విరాళాలతోను, విద్యార్థులు చెల్లించే ఫీజు డబ్బుల తోను నిర్వహించేవారు. మద్రాసు ప్రభుత్వం ప్రారంభించిన ఒకే ఒక విద్యాసంస్థ ఇది ఇందులో సరాసరి 160 మంది విద్యార్థులు ఉండేవారు. మద్రాసులో తప్ప మిగిలిన ప్రెసిడెన్సీలోని ప్రాంతాల్ని గురించి పట్టించుకోలేదు క్రైస్తవ మతంలోకి విద్యార్థుల్ని మార్చాలన్న ఉద్దేశంతో చాల క్రైస్తవ మత సంస్థలు విద్యాలయాల్ని ప్రారంభించాయి ఈ సంస్థలకు ప్రభుత్వ పరంగా ధన సహాయాన్ని అందిస్తూ వాటి మత కార్యకలాపాలకు కంపెనీ అండగా ఉండేది. వారసత్వపు చట్టాల్లో కూడ తలదూర్చేది మతం మార్చుకున్నవారి విషయంలో ఉదార గా ఉండేది న్యాయాధిపతులు కూడ హిందువుల ప్రయోజనాల్ని దెబ్బతీసే విధంగా అక్రమమైన తీర్పులు ఇచ్చేవారు.

కంపెనీ పరిపాలన మరింత తలనొప్పిగా మారడంతో మద్రాసు పుర ప్రజలు 'మద్రాసు స్థానిక సంఘం' (Madras Native Association) అన్న పేరుతో 1852 ఫిబ్రవరి 26న ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని తమ కష్టాల్ని గురించి వివరిస్తూ ఒక వినతిపత్రాన్ని ప్రభుత్వానికి సమర్పించారు పరిపాలనలోని లోపాల్ని సరిదిద్దేందుకు కొన్ని సూచనల్ని కూడా చేశారు అవి 1 గవర్నరు కౌన్సిలులో ప్రభుత్వ అధికారుల అనధికారుల సంఖ్య సమాన సంఖ్యలో

ఉండాలి 2. కార్యనిర్వాహక సభ కంటె భిన్నమయిన శాసనసభను ఒకదానిని ఏర్పాటు చేయాలి 3 ఈ సూచనలతో పాటు గవర్నరు యొక్క, అధికారుల యొక్క జీతాల్ని తగ్గించడం, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికులను నియమించడం వంటి సూచనలు కూడ ఈ పత్రంలో చోటు చేసుకున్నాయి ఈ పత్రంలోనే ఐ.సి ఎస్‌ను నిషేధించాలని కూడ విన్నవించారు.

కంపెనీ కాలంలో ఆంధ్రదేశం యుద్ధాలకు దూరంగా ఉండేది సుస్థిరత చేకూరింది ఈ ఒక్క ప్రయోజనం తప్ప కంపెనీ కాలంలో ఆంధ్రదేశానికి జరిగిన మేలేదీలేదు

ఒక్క మాటలో చెప్పాలంటే కంపెనీ పాలనలో ఆంధ్రుల స్థితి ఆర్థికంగా దిగజారిపోయి, సాఫీగా సాగిపోతున్న జీవితాలు అస్తవ్యస్తం కావడంతో సాధారణ జీవితానికి కూడ సానుకూల పరిస్థితులు కరువయ్యాయని నిస్సందేహంగా చెప్పవచ్చు

## సర్‌ధామస్ మన్రో

ఆంధ్రుల స్మృతి పథంలో చెరగని ముద్రవేసిన ముగ్గురు ఈస్టిండియా కంపెనీ అధికారుల్లో ధామస్ మన్రో ఒకరు కృష్ణా, గోదావరి నదులపై ఆనకట్టల నిర్మాణానికి మూలకారకుడైన సర్ ఆర్థర్ కాటను మహాశయుడు రెండవవాడు కాగా తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేసిన చార్లెస్ ఫిలిప్ బ్రౌను పండితుడు మూడవవాడు

1761 మే 27న గ్లాస్కోలో ధామస్ మన్రో జన్మించాడు అతని తండ్రి అలెగ్జాండర్ మన్రో ఒక వర్తకుడు. ధామస్ మన్రో గ్లాస్కో విశ్వవిద్యాలయంలో ఉన్నతవిద్యను అభ్యసించాడు ఈస్టిండియా కంపెనీలో ఒక మిలిటరీ ఉద్యోగిగా చేరి 1780 జనవరి 15న మద్రాసు వచ్చాడు. మన్రో మద్రాసు గవర్నరుగా ఉంటూ కర్నూలు జిల్లాలోని పత్తి కొండ వద్ద 1827 జూలై 6న మరణించాడు

ధామస్ మన్రో ఇండియాలో గడపిన జీవతాన్ని మూడుభాగాలుగాచేసి చూడవచ్చు 1780 నుండి 1792 వరకు మొదటి దశగా భావించవచ్చు. ఈ పన్నెండేళ్ళ కాలం మన్రో సైనిక జీవితాన్ని గడిపాడు మైసూరు పాలకులైన

హైదరు అలీ, టిప్పు సుల్తానులతో కంపెనీ సాగించిన యుద్ధాలలో మన్రో పాల్గొన్నాడు 1792 నుండి 1807 వరకు గల కాలాన్ని రెండవ దశగా భావించవచ్చు ఈ కాలంలో మన్రో సివిలు ఉద్యోగిగా నియమింపబడ్డాడు 1792 నుండి 1799 వరకు ఈనాటి సేలం జిల్లాలోని బారామహల్‌లో పనిచేశాడు. మరల 1800 నుండి 1807 వరకు సీడెడ్ జిల్లాలకు (రాయలసీమ జిల్లాలు) ప్రిన్సిపాల్ కలెక్టరుగ పనిచేశాడు ఈ జిల్లాల్ని హైదరాబాదు నవాబు నుండి కంపెనీ స్వాధీనం చేసుకుంది. 1807లో మన్రో ఇంగ్లాండుకు వెళ్లాడు. మరల 1814లో ఇండియాకు వచ్చి నాలుగేళ్ళ పాటు గడిపాడు ఈ నాలుగేళ్ళ మన్రో జీవితాన్ని (1814-1818) మూడవదశగా చెప్పవచ్చు ఈ కాలంలో మన్రో 'జుడీషియల్ కమీషను'కు అధ్యక్షుడుగ వ్యవహరించాడు తర్వాత 1820 జూన్ 8 నుండి 1827 జూలై 27 వరకు మన్రో మద్రాసు గవర్నరుగా పనిచేశాడు ఈ కాలాన్నే నాల్గవ దశగా భావించవచ్చు.

## బారామహల్ కలెక్టరుగ థామస్‌మన్రో

1792లో కుదిరిన శ్రీరంగపట్నం సంధితో, మూడవ మైసూరు యుద్ధం ముగిసింది దీని ప్రకారం టిప్పు సుల్తాను తన రాజ్యంలోని దాదాపు సగ భాగాన్ని కంపెనీకి, కంపెనీ మిత్రులైన హైదరాబాదు నైజాంకు, మహారాష్ట్రులకు దత్తత చేశాడు పశ్చిమ తీరంలోని మలబారు జిల్లాను, బారామహల్‌ను (ఈనాటి సేలం జిల్లాలోనిది), ధర్మపురిని, మధురై జిల్లాలోని కొంత భాగాన్ని కంపెనీ తన వాటాగా స్వీకరించింది

బారామహల్ పాలనా బాధ్యతల్ని నిర్వహించేందుకు అప్పటి గవర్నరు జనరలైన కారన్‌వాలిస్ కేప్టన్ రీడ్‌ను రెవెన్యూ సూపరింటెండ్‌గ నియమించాడు. రీడ్‌కు సహాయంగా ఉండేందుకు థామస్ మన్రోతో పాటు మరో ఇద్దరు మిలిటరీ అధికారులు కూడ నియమింపబడ్డారు. ఏడు సంవత్సరాల పాటు (1792-1799) బారామహల్‌లో మన్రో తన ఉద్యోగ బాధ్యతల్ని నిర్వర్తించాడు.

## భూమిశిస్తు విధానం – రైత్వారీ పద్ధతి

హైదరు అలీ, టిప్పు సుల్తానుల కాలంలో బారామహల్ పరిపాలన చాల నిరంకుశంగా సాగేది భూమిశిస్తు నిర్ణయంలోను, వసూలు చేసే విధానంలోను

గల లోపాల్ని సవరించడం తమ మొదటి బాధ్యతగ కేప్టన్ రీడ్, థామస్ మన్రోలు భావించారు. కంపెనీకి, రైతుకు లాభదాయకంగా ఉండేటట్లు మన్రో ఒక భూమి శిస్తు వసూలు పద్ధతిని ప్రవేశపెట్టాడు ఈ పద్ధతే తర్వాత రైత్వారీ పద్ధతిగా ప్రసిద్ధి చెందింది ఈ పద్ధతిలో కంపెనీ అధికారులు రైతు నుండే నేరుగ భూమిశిస్తును వసూలు చేసేవారు. తాను సాగు చేస్తున్న భూమిపై రైతుకు పూర్తి హక్కులుండేవి తన భూమిని కౌలుకు ఇవ్వడానికి, అమ్ముకోవడానికి, కుదువ పెట్టడానికి రైతుకు స్వేచ్ఛ ఉండేది ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తున్నంత కాలం భూమి రైతు స్వాధీనంలోనే ఉంటుంది.

## థామస్‌మన్రో – దత్తత జిల్లాలు

1800లో హైదరాబాదు నైజాం ఈస్టిండియా కంపెనీతో సైన్య సహకార ఒడంబడికను కుదుర్చుకున్నాడు. ఈ ఒడంబడిక ప్రకారం హైదరాబాదులో తన సైన్యాన్ని ఉంచి నైజాంకు సాయపడేందుకు కంపెనీ అంగీకరించింది ఈ సైన్యానికి అయ్యే ఖర్చు భరించడానికి మైసూరు పాలకుడైన టిప్పు సుల్తానుతో కుదిరిన రెండు ఒడంబడికల ప్రకారం (1792, 1799) తనకు సంక్రమించిన భూభాగాల్ని నైజాం కంపెనికి దత్తత చేశాడు. ఈ భూభాగాలే బళ్ళారి, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలు. ఈ ప్రాంతాన్నే ఈనాడు రాయలసీమగా వ్యవహరిస్తున్నారు. 1800 నవంబరులో ఈ జిల్లాలకు ప్రిన్సిపాల్ కలెక్టరుగా థామస్ మన్రోను నియమించారు

మన్రో పిన్సిపాల్ కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించేనాటికి ఈ దత్తత జిల్లాల్లో పరిస్థితి అస్తవ్యస్తంగా ఉండేది. ఈ ప్రాంతంలో మొత్తం 80 మంది పాలేగాండ్రు ఉండేవారు. వీరు తమ 30 వేల సాయుధ బలంతో గ్రామాల్ని దోపిడీ చేసి భయభ్రాంతుల్ని సృష్టించారు.

అందువల్ల మొదట మన్రో తన దృష్టిని పాలెగాండ్రపై మళ్ళించి వారిని అణచివేయడానికి సంకల్పించాడు కాని మద్రాసు ప్రభుత్వం పాలేగాండ్ర బలాన్ని ఎక్కువగా అంచనా వేసి వారిపై చర్య తీసుకోవడానికి వెనుకాడింది అయితే మన్రో ప్రభుత్వానికి నచ్చచెప్పి పాలెగాండ్రపై చర్య తీసుకోడానికి సమ్మతింపచేశాడు జనరల్ క్యాంప్‌బెల్ సహాయంతో పాలెగాండ్రను, వారి సాయుధ బలగాన్ని మన్రో అణచివేయగల్గాడు

శాంతి భద్రతలు చేకూరిన తర్వాత భూమిని సర్వే చేయించి శిస్తును నిర్ణయించే కార్యక్రమాన్ని మన్రో చేపట్టాడు 1802లో ప్రారంభమైన దత్తత జిల్లాల సర్వే 1807 లో పూర్తిఅయింది సాగులో ఉన్న భూమి అంతా సర్వే చేయించబడింది ఒక్కొక్క క్షేత్రానికి ఒక్కొక్క నంబరు కేటాయించి ఆ భూమిని సాగు చేస్తున్న రైతు పేరిట రిజిష్టరు చేయించి కట్టవలసిన పన్నును నిర్ణయించడం జరిగింది ఇటువంటి పని మన్రోకు కొత్త అయినా 5 సంవత్సరాలలోనే పూర్తి చేయగల్గడం ఆయన సామర్ధ్యానికి నిదర్శనమని చెప్పవచ్చు మొత్తం మీద మన్రో చేపట్టిన ఈ కార్యం సమగ్రంగాను, ఆచరణాత్మకంగాను రూపొందిందని చెప్పవచ్చు ఈనాటికి గ్రామ తగాదాల్లో మన్రో పద్ధతి పరిష్కార మార్గంగా కన్పిస్తున్నది. సర్వే పూర్తి అయిన తరువాత తానిదివరకే బారామహల్ లో 1792-99 మధ్య కాలంలో అమలు జరిపిన రైత్వారీ పద్ధతినే ఇక్కడ కూడ మన్రో ప్రవేశపెట్టాడు రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టకముందు మన్రో గ్రామవారీ పద్ధతిని ప్రవేశపెట్టాడు ఈ పద్ధతిలో గ్రామం మొత్తానికి కలిపి శిస్తు నిర్ణయిస్తారు ఈ శిస్తుకు ఆ గ్రామ రైతులందరు బాధ్యత వహించాల్సి ఉంటుంది 1801-02లో వ్యవసాయం ప్రారంభం కాకముందే మన్రో రైతులకు కావలసిన ఋణ సహాయాన్ని అందించాడు ఈ ఋణాలు విత్తనాలు, పనిముట్లు, ఎద్దుల కొనుగోలుకు పాతబావుల మరమ్మత్తుకు కొత్తబావుల తవ్వకానికి మంజూరు చేయబడ్డాయి దీనిని బట్టి రైతులంటే మన్రోకు ఎంత మక్కువో స్పష్టమవుతోంది. 1802లో దత్తత జిల్లాలు అనావృష్టితో కరువు కాటకాలకు గురయ్యాయి 1803లో అతివృష్టికి గురయ్యాయి. ఒక్క కడప జిల్లాలో మాత్రం 100 చెరువులకు, 800 కాలవలకు గండ్లు పడ్డాయి ఈ విపత్కర పరిస్థితిలో ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూడకనే పాడైన చెరువుల్ని, కాలువల్ని మన్రో బాగు చేయించాడు. మరమ్మత్తులు చాల త్వరగా జరగడంతో ఆ మరుసటి సంవత్సరం పంట పుష్కలంగా చేతికి అందింది. నూటికి నూరు శాతం పన్నులు వసూలు అయ్యాయి. 1807 అక్టోబరులో మన్రో తన పదవికి రాజీనామా చేసి స్వదేశానికి వెళ్ళాడు.

## జుడిషియల్ కమీషన్ అధ్యక్షుడుగా మన్రో

1814 జూన్‌లో జుడిషియల్ కమీషను అధ్యక్షుడుగ పదవీ బాధ్యతల్ని స్వీకరించేందుకు మన్రో రెండవ సారి భారతదేశానికి వచ్చాడు బెంగాలు, మద్రాసు రాష్ట్రాల్లో న్యాయ, పోలీసు శాఖ పరిపాలనను సమీక్షించి వాటి సామర్ధ్యాన్ని పెంచేందుకు తగిన సూచనల్ని చేయవల్సిందిగా థామస్ మన్రోను కంపెనీ డైరెక్టర్లు కోరారు మన్రో తన రిపోర్టును 1816 ఏప్రిలులో సమర్పించాడు మన్రో తన రిపోర్టులో చేసిన సిఫార్సులు చాలవరకు ఆమోదింపబడ్డాయి పోలీసుశాఖపై పర్యవేక్షణ అధికారాన్ని న్యాయాధిపతి నుండి కలెక్టరుకు మార్చడం, చిన్న చిన్న దొంగతనాల్ని విచారించేందుకు గ్రామాధికారుల్ని నియమించడం వంటి సూచనల్ని కూడ ప్రభుత్వం ఆమోదించింది

## మద్రాసు గవర్నరుగా థామస్ మన్రో (1820 - 27)

1820లో మద్రాసు గవర్నరుగా పదవీ స్వీకారం చేసేందుకు మన్రో మూడవసారి భారతదేశానికి వచ్చాడు ఆయన కర్నూలు జిల్లాలో అధికారిక పర్యటనలో ఉండగా కలరా సోకడంతో పత్తి కొండవద్ద 1827 జూలై 6న మరణించాడు మన్రో చనిపోయి దాదాపు 154 సంవత్సరాలు గడిచినా రాయలసీమ ప్రాంత ప్రజలు ఈనాటికీ మన్రోను తమ స్మృతిపథం నుండి తొలగించలేదు మన్రో అతి సామాన్యుడుగ వ్యవహరించి ప్రజల బాగోగులు కోసం అహర్నిశలు శ్రమించడంతో ఆయనను సామాన్య ప్రజలు సైతం మరువ లేకపోయారు ఆయన్ని 'మాండవఋషి'గ అభివర్ణించడంలో ఆశ్చర్యం లేదనిపిస్తుంది మన్రో జ్ఞాపకార్థం ఆ ప్రాంతపు ప్రజలు తమ బిడ్డలకు 'మన్రోలప్ప' వంటి పేర్లు పెట్టి సదా స్మరిస్తూనే ఉన్నారు

# సర్ ఆర్థర్ కాటన్ (1803 – 1899)

బ్రిటిష్ కంపెనీ పాలనలో ఆంధ్రదేశం తరచు కరవుకాటకాలకు గురవుతుండేది. 1833–34లో సంభవించిన గుంటూరు కరువు ప్రజలకు అనేక కష్టనష్టాల్ని తెచ్చిపెట్టింది. గుంటూరు ప్రాంతంలోని దాదాపు 40 శాతం ప్రజలు కరువు పరిస్తితులకు తాళలేక మరణించారు. గుంటూరుతో పాటు, మచిలీపట్నం, రాజమండ్రి ప్రాంతాల్లో సైతం తీవ్రమైన క్షామ పరిస్థితులు నెలకొన్నాయి. విపరీతమైన జననష్టంతో పాటు ప్రభుత్వాదాయం కూడ పడిపోయింది. దీంతో కంపెనీ ప్రభుత్వానికి గోదావరి, కృష్ణా నదులపై ఆనకట్టలు కట్టవలసిన అవసరం ఏర్పడింది. ప్రజల అవసరాల్ని గుర్తించి గోదావరిపై ఆనకట్ట కట్టడానికి నడుం బిగించిన మహోన్నత వ్యక్తి సర్ ఆర్థర్ కాటన్. గోదావరిపై ఆనకట్ట కట్టడంలో ఆ ప్రాంత ప్రజలంతా ఆర్థికంగా పుంజుకుని కరువుకు శాశ్వతంగా దూరమయ్యారు. అందువల్లే ఆంధ్రులు సర్ ఆర్థర్ కాటన్‌ను ఈనాటికీ స్మరిస్తూ తమ కృతజ్ఞతల్ని తెలుపుకుంటారు.

ఆర్థర్ కాటన్ 1803 మే 15న జన్మించాడు. ఈయన తండ్రి హెన్రీ కాల్‌వెలీ కాటన్ తన తండ్రిలాగే కాటన్ కూడ తన తల్లిదండ్రులకు పదవ సంతానం. చిన్నప్పటినుండి కాటన్ కాలువ నిర్మాణపు పనుల్లో ఆసక్తి కనపరిచేవాడు. కంపెనీ ఇంజనీరింగు సర్వీసులో చేరిన కాటన్‌కు మద్రాసు రాష్ట్ర ప్రధాన ఇంజనీరు కార్యాలయంలో ఉద్యోగాన్ని కల్పించారు మద్రాసులో చేరిన నాటినుండి ఆయన రాష్ట్రంలోని అన్ని నీటిసాగు నిర్మాణాల్ని గూర్చి శ్రద్ధగా పరిశీలన జరిపాడు. ఇందులో ముఖ్యంగా కావేరీ పరివాహ ప్రాంతంలోని ఆనకట్టల్ని గూర్చి క్షుణ్ణంగా తెలుసుకున్నాడు. అటు తర్వాత కాటన్ సూపరింటెండింగు ఇంజనీరుగా విశాఖపట్నం వచ్చాడు. విశాఖపట్టణ ఉజ్జ్వల భవిష్యత్తును గురించి ఊహించిన కాటన్ ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధికి అనేక చర్యల్ని చేపట్టాడు. గోదావరి నీటిసాగు నిర్మాణాల్లో తన ఆసక్తిని కనపరిచాడు. 1844 నాటికే ఆయన రాజమండ్రి వద్ద గోదావరిపై ఆనకట్ట కట్టవలసిన

అవసరాన్ని గూర్చి ఒక వివరమైన రిపోర్టును ప్రభుత్వ రెవెన్యూ బోర్డుకు పంపాడు. ఈ రిపోర్టుకు మద్రాసు ప్రభుత్వం అనుకూలంగా స్పందించడమే గాక బోర్డు డైరెక్టర్లు కూడా ఈ ప్రతిపాదనను ఆమోదించి రాజమండ్రి దగ్గర ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్ట కట్టడానికి 1846 చివరలో తన అనుమతిని మంజూరుచేసింది. ఈ ఆనకట్ట నిర్మాణ బాధ్యతను సర్ ఆర్థర్ కాటన్‌కే అప్పగించింది ఈ మహనీయుని కృషివల్ల 1847లో ప్రారంభమైన ఆనకట్ట నిర్మాణం 1852 ఏప్రిలు నాటికి పూర్తయింది ఇంతటి బృహత్తరమైన ఆనకట్టను కాటన్ అతి తక్కువ ఖర్చుతో (£ 1,50,000) పూర్తి చేయగల్గాడు అతి తక్కువతో గూడిన ఈ నిర్మాణం తోటి ఇంజనీర్లకే గాక, కంపెనీ ప్రభుత్వానికి కూడ ఆశ్చర్యాన్ని కల్గించింది అందుకే కాటన్ ఆనాడు, అతి తక్కువ ఖర్చుతో బృహత్తర నిర్మాణాల్ని చేపట్టగల ఇంజనీరింగు విభాగానికి ఆదర్శ ప్రాయుడుగ ప్రపంచ మంతటా కీర్తించ బడ్డాడు.

గోదావరిపై కట్టిన ఆనకట్ట వల్ల ఆ ప్రాంతమంతా సస్య శ్యామలమై ఆర్థికంగా పరిపుష్టిని సాధించింది. దాదాపు 140 సంవత్సరాల క్రితంనుండి ఈనాటి వరకు ఈ ప్రాంత ప్రజలు కాటన్‌ను తమ ఆత్మబంధువుగా కొనియాడుతున్నారు. ఇంతటి చరిత్రగల ఈ ఆనకట్ట ఈనాటి అవసరాలకు తగ్గట్టు లేకపోవడం వల్ల దీని స్థానంలో మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కొత్త ఆనకట్టను నిర్మించడమేగాక దీనికి 'సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి' అని పేరుపెట్టి ఆ మహానుభావునికి ఘనంగా నివాళులర్పించింది.

## వీనం వీరన్న

ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మాణంలో సర్ ఆర్థర్ కాటన్‌కు సహకరించిన భారతీయ అధికారుల్లో ప్రథమంగా పేర్కొనదగ్గవాడు వీనం వీరన్న. ఈయన ప్రాజెక్టులో పనిచేసే కొన్ని వేలమంది సామాన్య కూలీలను అదుపుచేసి వారిచేత చాకచక్యంతో పనిచేయించేవాడు. భారతీయ అధికారుల్లో వీరన్నకు సాటియైన మరోవ్యక్తి లేడని కాటన్ మహాశయుడు ఘనంగా శ్లాఘించాడు. ప్రభుత్వం వీరన్నను 'రావు బహదూర్' బిరుదుతో సత్కరించడమేగాక, అసిస్టెంట్ ఇంజనీరుగా ప్రమోషను ఇచ్చింది వీరన్న పేరును ఆనకట్టలోని ఒక గోడపై శాశ్వతంగా

చెక్కించింది.

## కృష్ణానదిపై ఆనకట్ట

విజయవాడ వద్ద కృష్ణానదిపై నిర్మించిన ఆనకట్ట పనిలోకూడ కాటన్ తన సహాయ సహకారాల్ని అందించాడు. అయితే 1850లోనే ప్రారంభమైన ఆనకట్ట నిర్మాణ నిర్వహణ బాధ్యతను కెప్టెన్ ఓర్‌కు అప్పగించడం జరిగింది. ఈ ఆనకట్ట 1855 అక్టోబరులో పూర్తయింది. ధవళేశ్వరం ఆనకట్టలాగే ఈ ఆనకట్ట కూడా కృష్ణా ప్రాంత ప్రజలకు ఎనలేని సంపదను చేకూర్చి పెట్టింది. ఈ పుణ్య నదుల జ్ఞాపకార్థం రాజమండ్రి, మచిలీపట్టణ జిలాల్ని వరుసగా గోదావరి, కృష్ణా జిలాలుగ పరిగణించడం జరిగింది. తరువాత గోదావరి జిల్లాను తూర్పు, పశ్చిమ గోదావరులని రెండు జిల్లాలుగ విభజించారు.

## 1857 – 58లో ఆంధ్రదేశం

1857 వ సంవత్సరాన్ని భారతదేశ చరిత్రలో అతి క్లిష్టమైనదిగా భావించవచ్చు. ఈ సంవత్సరంలో జరిగిన సిపాయిల తిరుగుబాటు ఆంగ్ల ప్రభుత్వ పునాదుల్ని కదిలించి వేసిందని చెప్పవచ్చు. ఉత్తర భారతంలో ఈ తిరుగుబాటు ఉధృతంగా సాగింది ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహారు రాష్ట్రాల్లో ఈ సిపాయిల తిరుగుబాటు తీవ్రస్థాయిలో జరిగింది. కాని దక్షిణ భారతంలో మాత్రం ఇటువంటి తిరుగుబాట్లు తలెత్తలేదు. అయితే ఉత్తర భారతంలో జరిగిన సిపాయిల తిరుగుబాటు ప్రభావం మాత్రం దక్షిణ భారతంలోని ఔరంగాబాదు, హైదరాబాదు, కడప, మచిలీపట్నం మొదలగు ప్రాంతాల్లో కన్పిస్తుంది.

హైదరాబాదు రాష్ట్రంలో ముస్లింల శాతం ఎక్కువగా ఉండడం వల్ల సహజంగానే ఉత్తర భారతంలోని ముస్లిం తిరుగుబాటుదారులవైపు తన మొగ్గను చూపారు. అయితే రాష్ట్రాధినేతయైన నైజాం, అతని ప్రధానమంత్రి బ్రిటీషు వారి విధేయులుగ ఉండేవారు. అయినప్పటికీ ముస్లింల్లోని కొన్ని వర్గాలు ఉత్తర

భారతంలోని తిరుగుబాటుదారులకు తమ మద్దతు తెలిపారు. ఇదేకాక హైదరాబాదు రాష్ట్రంలో బ్రిటీషువారికి వ్యతిరేకత ఆనాటిది కాదు అంతకుముందు కూడ ఉండేది 1800లో నైజాం కంపెనీతో సైన్యసహకార ఒడంబడికను అంగీకరించినప్పటి నుండి బ్రిటీషువారిపై వ్యతిరేకత మొదలయింది. 1839 నాటికి ఈ వ్యతిరేకతే వహాబీ ఉద్యమంగా రూపొంది బ్రిటీషు ప్రభుత్వాన్ని పడగొట్టాలని ప్రయత్నించింది. 1839లో ఉత్తర భారతం నుండి వహాబీలు హైదరాబాదుకు వచ్చి బ్రిటీషు వారిపై 'జహాద్' ప్రకటించమని ప్రబోధించారు ఈ వహాబీ ఉద్యమకారులకు హైదరాబాదు నైజాం నసీరుద్దౌలా సోదరుడైన ముబారిజుద్దౌలా ప్రోత్సాహం, మద్దతు లభించింది ఎటువంటి విపరీతపరిణామాలు జరగకముందే కంపెనీ ప్రభుత్వం ముబారిజుద్దౌలాను అరెస్టు చేసి 1854లో అతడు చనిపోయేవరకు గోల్కొండ కోటలో బందీగా ఉంచింది. వహాబీలతో రహస్యమంతనాలు జరుపుతున్నాడన్న నెపంతో కర్నూలు నవాబైన గులాం రసూలు ఖాన్‌ను తిరుచునాపల్లి జైలుకు పంపారు. అతని జాగీరుని కంపెనీ తన వశం చేసుకొని 'అనియుత రాష్ట్రం'గా పాలించింది దీని పాలనా బాధ్యతల్ని నిర్వహించేందుకు ఒక కమీషనరు, కమీషనరుకు సహాయకంగా ఒక మిలిటరీ అధికారి నియమింపబడ్డారు. 1858లో ఈ జాగీరును కర్నూలు జిల్లాలో విలీనం చేశారు.

హైదరాబాదులో మకాం పెట్టిన బ్రిటీషు సైన్యం ఖర్చు కోసం బేరారు, రాయచూరు, ఉస్మానాబాదు జిల్లాల్ని నైజాం నుండి బలవంతంగా కంపెనీ స్వాధీనం చేసుకున్నప్పుడు (1853, మే నెల) బ్రిటీషు వారిపై మరింత వ్యతిరేకత పెరిగింది. 1857 మే నెల 10న మీరటు వద్ద సిపాయిల తిరుగుబాటు చేసినపుడు బ్రిటీషువారిపై గల ఈ వ్యతిరేకత బహిరంగమైంది. తిరుగుబాటు ప్రారంభమైన ఒక వారంలోనే 1857 మే 16న నైజాం నసిరుద్దౌలా మరణించాడు దీంతో ఇతని కుమారుడైన అఫ్జలుద్దౌలా నైజాం పదవిని చేపట్టాడు. ఈ కొత్త నైజాం 1853లో ప్రధానమంత్రి పదవిని స్వీకరించిన మొదటి సాలారుజంగును ఆ పదవిలోనే కొనసాగించాడు.

ఉత్తరభారతంలోని ఉద్యమకారులకు ప్రారంభంలోనే విజయం చేకూరడంతో హైదరాబాదు రాష్ట్రంలోని ముస్లింల్లో కూడ ఉత్సాహం పెల్లుబికింది.

మసీదుల వద్ద ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలు ఇచ్చారు. బ్రిటీషు వారిపై జీహాద్ (పవిత్రయుద్ధం) ప్రకటించమని ప్రజల్ని రెచ్చగొట్టారు. సికిందరాబాదు, బొలారంలోని కంపెనీ సైన్యాన్ని కూడ తమవైపుకు తిప్పుకునేందుకు ప్రయత్నాలు సాగించారు. ఒక ఫకీరు నగరమంతా తిరుగుతూ ప్రజల్ని బ్రిటీషువారిపై తిరగబడమని రెచ్చగొట్టారు. ఈ తిరుగుబాటులో సికిందరాబాద్, బొలారంలోని సైన్యం కూడ చేరుతుందని ప్రజలకు తెలియజేశాడు. అల్లాఉద్దీను వంటి ముస్లిం మౌల్వీలు హైదరాబాదు మక్కా మసీదు వద్ద ఇచ్చిన మతోపన్యాసాల్లో బ్రిటీషువారిని ఇస్లాం మత శత్రువులుగ చిత్రించి వారిని మన దేశాన్నుండి తరిమి కొట్టాల్సిందిగా ప్రభోదించారు

## ఔరంగాబాదు తిరుగుబాటు - జూన్ 1857

ఒకవైపు హైదరాబాదు నగరంలో ఉద్రిక్తతనెలకొని ఉండగా ఔరంగాబాదులో కొన్ని అనుకోని పరిణామాలు సంభవించాయి. అదివరకే కంపెనీ సైన్యంలో తీవ్రమైన అసంతృప్తి నెలకొని ఉంది. ఉత్తర భారతంలో బ్రిటీషు వారు ఎదురు దెబ్బలు తినడంతో వీరికి ఉత్తేజం కలిగింది. ఉద్యమకారుల్ని అణచేందుకు తమను ఢిల్లీ పంపుతారేమోనన్న భయం వీరిలో కలిగింది. అందువల్ల వీరికి కంపెనీ సైన్యంలో పనిచేయడానికి అయిష్టత ఏర్పడింది. ఇంతలో ఔరంగాబాదు సైన్యంలో నెలకొన్న అసంతృప్తిని పసికట్టిన కంపెనీ అధికారులు 1857 జూన్ 23న 90 మంది సిపాయిల్ని నిరాయుధుల్ని చేసి జైలుకు పంపారు తమ సహచరుల్ని అరెస్టు చేయడంతో సిపాయిల్లో తీవ్రమైన బ్రిటీషు వ్యతిరేకత వ్యక్తమయింది. మీర్‌ఫైదాఆలీ అనే దఫేదారు కేప్టెన్ అబ్బాట్‌ను కాల్చి చంపడానికి ప్రయత్నించాడు. కాని మీర్‌ఫైదా ఆలీని ఉరి తీయడంతోపాటు అతనికి సహాయపడ్డారన్న నెపంతో చాలామంది సిపాయిల్ని అరెస్టు చేశారు. అశ్విక దళంలోని చాలమంది సిపాయిల్ని తొలగించారు. ఈ సంఘటనలు ఔరంగాబాదు సైన్యపు తిరుగుబాటుకు కారణమయ్యాయి. అయితే ఈ తిరుగుబాటును కంపెనీ అధికారులు సులభంగా అణచివేయగల్గారు. 1857లో ఉత్తరభారతంలో సిపాయిల తిరుగుబాటు తలెత్తిన కొన్ని వారాల్లోనే హైదరాబాదు

రాష్ట్రంలో మొదటిసారిగ ఇంతటి తీవ్రమైన ఉద్యమం తలెత్తడం చెప్పుకోదగ్గ విశేషంగ భావించవచ్చు.

హైదరాబాదు బ్రిటీషు కార్యాలయంపై దాడి - జూలై 1857

ఔరంగాబాదు సంఘటనలు జరిగిన కొద్ది రోజులలోనే హైదరాబాదు నగరంలో మరికొన్ని పరిణామాలు సంభవించాయి. 1857 జూలై 17న రోహిల్లా జమేదారైన తురాబజ్ ఖాన్ 5000 మందిని ప్రోగుచేసుకుని హైదరాబాదులోని బ్రిటీషు కార్యాలయంపై దాడి చేశాడు. కాని ఈ దాడిని బ్రిటీషు ప్రతినిధియైన కల్నల్ డేవిడ్‌సన్ తన సుశిక్షితులైన కంపెనీ సైనికుల సహాయంతో సమర్థవంతంగా త్రిప్పికొట్టగల్గాడు

బ్రిటీషు కంపెనీ విధేయుడుగ ఉన్న నైజాం తురాబజ్ ఖాన్, మౌల్వీ అల్లా ఉద్దీనులతో పాటు వీరి సహచరుల్ని కూడా అరెస్టు చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశాడు. తురాబజ్ ఖాన్‌ను విచారించి జీవితఖైదు శిక్ష విధించి ద్వీపాంతరంపంపారు. అయితే తురాబజ్ ఖాన్ జైలునుండి తప్పించుకున్నాడు. రెండవసారి అరెస్టు చేసే సమయంలో తురాబజ్ ఖాన్ పారిపోవడానికి ప్రయత్నించగా కాల్చి చంపబడ్డాడు. ఇతని శవాన్ని హైదరాబాదు నగరంలో బహిరంగంగా వేలాడదీశారు. హైదరాబాదు సమీపంలోని మంగలపల్లి గ్రామంలో మౌల్వీ అల్లాఉద్దీన్ను అరెస్టు చేశారు. ఇతనికి జీవితఖైదు విధించబడింది అల్లాఉద్దీన్ 1884లో అండమాను జైల్లో మరణించాడు.

ఈ సంఘటనల్ని మినహాయించితే హైదరాబాదు నగరంలోను, రాష్ట్రంలోను చాలవరకు శాంతిభద్రతలు నెలకొన్నాయని చెప్పవచ్చు. నైజాం అఫ్జల్ ఉద్దౌలా, అతని ప్రధానమంత్రి మొదటి సాలార్‌జంగ్‌లు కంపెనీకి పూర్తి విధేయులుగ ఉండడం వల్లనే ఈ ప్రశాంతత సాధ్యమయిందని చెప్పవచ్చు. జనాభాలో అత్యధికశాతంగా ఉన్న హిందువులు ఉత్తరభారతంలోని పరిణామాలకు స్పందించకపోవడమే కాక బ్రిటీషువారికి తమ మద్దతును తెలిపారు.

ఆంధ్రప్రాంతంలో ముస్లింలు ఎక్కువగా ఉన్న కడప, విశాఖపట్నం, మచిలీపట్నం వంటి పట్టణాల్లో కొన్ని చిన్న చిన్న సంఘటనలు జరిగాయి.

1857 ఆగష్టు 28న కడపలో షేక్‌పీర్ సాహెబు అనే వ్యక్తి బ్రిటీషుకు వ్యతిరేకంగా జీహాద్‌ను (పవిత్రయుద్ధం) ప్రభోదించాడు. కడప పట్టణంలోని ముస్లింలు మొగలు చక్రవర్తి విజయం కోసం మసీదుల్లో ప్రార్థనలు జరిపినట్లు కూడ తెలుస్తున్నది. ఉన్న పట్టణాన్ని ధ్వంసం చేసి దానికి మోహారం పండుగ సందర్భంగా మహమ్మదు పట్నంగా పేరుపెట్టాలని ముస్లింలను రెచ్చగొడుతూ విశాఖపట్నంలో ఒక తెలుగు పోస్టరు కూడా వెలసింది.

ముస్లింలు పాల్గొన్న ఈ సంఘటనలేకాకుండా ఏజన్సీ ప్రాంతాలైన గంజాం, గోదావరి జిల్లాల్లోని గిరిజనుల్లో సైతం కొన్ని తిరుగుబాట్లు తలెత్తాయి. గంజాం జిల్లాలోని పర్లాకిమిడి ప్రాంతంలోని సవరజాతి గిరిజనులు కంపెనీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటును అణచివేయడమే కాక, తిరుగుబాటు నాయకుడైన దుండసేనుడనే వ్యక్తిని బంధించి ఉరితీశారు. దుండసేనునిని మరణం తర్వాత ఈ ప్రాంతంలో ప్రశాంతత నెలకొంది

గోదావరి జిల్లా గిరిజనుల తిరుగుబాటుకు కోరటూరు గ్రామపెద్దయైన కోరుకొండ సుబ్బారెడ్డి నాయకత్వం వహించాడు. సుబ్బారెడ్డిని కూడ పట్టుకొని ఉరితీశారు బ్రిటీషువారిని తరిమి కొట్టడానికి పెద్ద సైన్యంతో నానాసాహెబు వస్తున్నట్లు, బ్రిటీషువారికి వ్యతిరేకంగా పోరాడిన వారికి నానాసాహెబు బహుమతులు ఇవ్వనున్నట్లు గాలి వార్తలు విని తాను తిరుగుబాటు చేసినట్లు విచారణ సమయంలో సుబ్బారెడ్డి తన పశ్చాత్తాపాన్ని ప్రకటించాడు. సుబ్బారెడ్డి మరణం తర్వాత మరల ఆ ప్రాంతంలో ఎలాంటి ఉద్యమమూ తలెత్తలేదు. చాల కొద్ది చోట్ల మాత్రమే జరిగిన ఈ చిన్న చిన్న సంఘటనలు తప్పితే ఆంధ్రప్రాంతమంతా బ్రిటీషు వారికి విధేయంగా ఉండిందని చెప్పవచ్చు. వివిధ పట్టణాల్లోని విద్యావంతులు బ్రిటీషువారికి తమ విధేయతను ప్రకటించడంలో పోటీపడ్డారనడంలో సందేహం లేదని చెప్పవచ్చు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు వంటి ముఖ్యపట్టణాల్లో బహిరంగ సభలు జరిపించి ప్రభుత్వానికి తమ మద్దతును తెలియజేశారు.

ఈ విధేయతా ఉపన్యాసాల్లో వెలిబుచ్చిన అభిప్రాయాలు స్వచ్ఛమైనవిగానే భావించాలి కంపెనీ పాలన చేతిపనివారల వినాశనానికి దారితీసినా దేశానికి ఒక

సుస్థిరమైన ప్రభుత్వాన్ని అందించిందని చెప్పవచ్చు. కంపెనీ పాలనలో ఆంధ్రప్రాంతంలో యుద్ధాలు కాని, అల్లకల్లోలాలు గాని చెలరేగలేదు సుస్థిరమైన పాలనను అందించిన కంపెనీకి ప్రజలు కృతజ్ఞులుగా ఉండేవారు. ముస్లిం పాలనలో విసిగిపోయిన ప్రజలకు కంపెనీ పాలనలో ఊపిరి పీల్చుకోవడానికి అవకాశం కల్గింది అందువల్ల బ్రిటీషుపాలనను అంతమొందించాలని వారు ప్రయత్నించలేదు ప్రజలపై అదుపును గలిగి సహజమైన నాయకులుగ చలామణియైన జమీందార్లు సైతం బ్రిటీషు పాలనలో సంతృప్తిచెందారు. శాశ్వత శిస్తు పద్ధతి ఈ జమీందార్ల పాలిటి వరప్రసాదంగా మారి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడమే కాక భూమిపై శాశ్వత హక్కులను కూడ కలుగజేసింది ఏది ఏమైనప్పటికీ దక్షిణ భారతంలోని సిపాయిల విధేయత భారతదేశంలోని కంపెనీ ప్రభుత్వాన్ని పూర్తిగ రక్షించిందని చెప్పవచ్చు.

# బ్రిటీషు రాణి పాలనలో ఆంధ్రదేశం

## బ్రిటీషురాణి ప్రకటన

1857 లో జరిగిన సిపాయిల తిరుగుబాటు ఫలితంగా భారతదేశంలో కంపెనీపాలన అంతమొంది బ్రిటీషు రాణిపాలన మొదలయింది 1858 నవంబరు 1న అధికారాన్ని స్వీకరిస్తూ విక్టోరియా మహారాణి ఒక ప్రకటన చేసింది. ఈ ప్రకటనలో కొత్త ప్రభుత్వం అనుసరించబోయే విధానాల్ని గూర్చి వివరింపబడింది ఈ ప్రకటనలోనే అనేక వాగ్దానాలు కూడ చేయబడ్డాయి భారతీయులు, యూరోపియనుల మధ్య ఎలాంటి భేదాలు చూపక సమానంగా గౌరవిస్తామన్న మొదటి వాగ్దానం ఇలాసాగింది

"(ఇదివరకే) మాపాలనలో వున్న ప్రజలపట్ల విధి నిర్వహణలో ఎటువంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నామో అదే బాధ్యతల్ని "భగవదాశీర్వాదంతో భారతీయులపట్ల కూడ చూపగలమని మనస్సాక్షిగా ప్రకటిస్తున్నాము"

మతవిషయంలో నిష్పక్షపాతంగా వుండగలమని చేసిన రెండవ వాగ్దానం ఇలావుంది.

"మానమ్మకాల్ని మా ప్రజలపై రుద్దే అధికారాన్ని, ఉద్దేశాన్ని మేము వదలుకుంటాము ఒకమతాన్ని లేక ఒక ఆచారాన్ని ఆచరిస్తున్నారన్న కారణంగా మేమెవరికీ ప్రత్యేక సదుపాయాల్ని కల్పించడంగాని, వారికి ఉపద్రవం లేక వారిప్రశాంతతకు భంగం కలిగించడం గాని జరగదని మేము సంతోషంగా మనఃపూర్వకంగా ప్రకటిస్తున్నాము చట్టంద్వారా అందరు నిష్పక్షపాతంగా

సమానమైన రక్షణను పొందగలరు. మన 'ఏలికలోని' ఏ ప్రజలయొక్క మతవిశ్వాసాల్లోగాని, పూజావిధానంలో గాని మాకు మానసిక క్షోభ కలిగించే విధంగా తలదూర్చవద్దని మాపాలనలోని అధికారవర్గాన్ని ఆదేశిస్తున్నాము."

ప్రభుత్వంలోని అన్ని శాఖల్లోను భారతీయులకు ప్రవేశం కల్పిస్తామన్న మూడో వాగ్దానం ఇలా సాగింది

"మాప్రజలు ఏ జాతికి, వంశానికి చెందిన వారైనా నిష్పక్షపాతంగా అన్ని ప్రభుత్వ శాఖల్లోను వారి వారి అర్హతల్ని అనుసరించి ప్రవేశాన్ని కల్పించడం మాయొక్క మరో అభిమతం"

ప్రభుత్వమే పరిశ్రమల్ని ప్రోత్సహించి ప్రజోపయోగమైన పనులు చేపట్టి అభివృద్ధికి దోహదపడగలదన్నది ప్రకటనలోని నాల్గవ వాగ్దానం.

చివరగా విక్టోరియా మహరాణి ప్రకటన ఈ విధంగా అంత మౌతుంది

"వారికి కలిగే సుఖసంతోషాలే మాబలం, వారి సంతృప్తే మాకురక్ష వారి కృతజ్ఞతా భావమే మాకు చక్కటి బహుమతి ప్రజా సంక్షేమం కోసమై అమలుచేయాలన్న మా ఈ కోరికల్ని ఆచరణలో పెట్టేందుకు భగవంతుడు సదా మాకు, మా అధికార వర్గానికి తగిన శక్తిని సమకూర్చుగాక!"

ఈ ప్రకటనలోని వాగ్దానాల్ని ఆచరణలో పెట్టలేదు బ్రిటీషు అదికారులు గాని, సామన్యులైన ఆంగ్లేయ ప్రజలుగాని ఈ వాగ్దానాలను అమలుపరచడంలో సుముఖులుగా లేరు 1857 తిరుగుబాటు తర్వాత భారతదేశానికి వచ్చిన ఆంగ్లేయులు భారతీయుల్ని అనాగరిక జాతిగా భావించి వారిని అన్నివిధాలుగా ఏవగించుకునేవారు స్థానికులతో కలిసి మెలసి వుండడం సభ్యతకాదని భావించి వారికై ప్రత్యేకమెన క్లబ్బులు స్థాపించుకున్నారు

ఇంకా అనేక ఇతర విషయాలలో కూడ ఆంగ్లేయులు వివక్షతను పాటించారు. భారతీయులు ఆయుధాలు కలిగివుండకూడదని ఒక ఆయుధ చట్టాన్ని అమలులోకి తెచ్చారు. ఇదే నిషేదాన్ని యూరోపియనులపై గాని ఆంగ్లో-ఇండియనులపై గాని విధించలేదు 1883 లో ఇల్బర్టు బిల్లు వివాదం చెలరేగినపుడు ఆంగ్లోయులు చేపట్టిన ఉద్యమం వల్ల అధికులమన్న భావనతో

వారు వున్నారని స్పష్టమైంది. వైస్రాయి అయిన లార్డు రిప్పన్ యూరోపియను నేరస్థుల్ని విచారించే అధికారం భారతీయులైన న్యాయమూర్తులకు కూడ కల్గించడమే ఈ అలజడికి ముఖ్యకారణం ఈ విధంగా మహరాణి ప్రకటనలోని సమాదరణ సిద్ధాంతం ఆచరణలోకి రాక వాగ్దానంగానే మిగిలిపోయింది

ప్రభుత్వోగాలన్నింటిలోను భారతీయులకు ప్రవేశం కల్పించడం ప్రకటనలోని రెండవ వాగ్దానం సివిలు సర్వీసుల్లోని అన్ని ఉద్యోగాల్లోను భారతీయులకు ప్రవేశం కల్పిస్తామని వాగ్దానం చేయడం జరిగింది కాని ఈ వాగ్దానాన్ని కూడ అమలులో పెట్టలేదు ఐ సి యస్ పరిక్షలు లండనులో నిర్వహించి ఈ పరీక్ష ప్రవేశానికి 19ఏళ్ళ వయోపరిమితిని విధించారు ఈ విధంగా భారతీయుల ఐ సి యస్ ప్రవేశానికి అన్నిరకాల అడ్డంకుల్ని కల్పించారు. కాకినాడ సాహితీసంస్థతో పాటు దేశంలోని చాలా ప్రజాసంస్థలు ఐ సి.యస్ వయోపరిమితిని పెంచమని లండనులోని భారతదేశపు సెక్రటరీకి విన్నపాలు చేశాయి కాని ఈ విన్నపాల వల్ల ఫలితం లేకపోయింది ఇదేవిధంగా పోలీసు, ఇంజనీరింగు, వైద్యశాఖల్లోని ఉన్నతోద్యాగాలకు భారతీయుల్ని ఎంపిక చేసేవారు కాదు 1861లో ఇంగ్లాండులోని భారతదేశపు సెక్రటరీ (Sectary of state for India) భారత ప్రభుత్వ వైస్రాయికి వ్రాసిన లేఖలో సైన్యం వైద్యశాఖల్లోని ఉద్యోగ నియామకాలకు భారతీయులు అర్హులు కారని స్పష్టం చేశారు

మత విషయంలో ఎటువంటి వివక్షత చూపబోమన్నది మహారాణి ప్రకటనలోని మరో వాగ్దానం ఈ వాగ్దానాన్ని కూడ నెరవేర్చలేక పోయింది బ్రిటీషు ప్రభత్వం క్రైస్తవ మత సంస్థలచే నడుపబడే పాఠశాలలకు ప్రభుత్వ సహాయాన్ని అందించడం న్యాయంకాదని మద్రాసు స్థానికుల సభ తన వ్యతిరేకతను తెల్పింది ఈ పాఠశాలలు మతబోధనకు, క్రైస్తవమత వ్యాప్తికి ప్రాముఖ్యత ఇవ్వడంవల్ల ప్రభుత్వసహాయం దుర్వినియోగం అవుతుందనేది స్పష్టమైంది. ఇదేగాక ప్రభుత్వాధికారులు క్రైస్తవమత సంస్థలతో సన్నిహిత సంబంధాల్ని కలిగివుండడాన్ని కూడ మద్రాసు స్థానికుల సభ వ్యతిరేకించింది

మద్రాసు స్థానికుల సభ (Madras Native Association) సమర్పించిన ఒక వినతి పత్రాన్ని గూర్చి చెబుతూ అప్పటి మద్రాసు గవర్నరయిన ట్రెవెల్యాన్

మత సంస్థలచే నడుపబడే పాఠశాలలకు ప్రభుత్వసహాయం (Grants-in-Aid) సరియైందేనని సమర్థించుకున్నాడు అదీకాక ఈపద్ధతి ఇంగ్లాండులో అమలులో వుందని, ప్రభుత్వానికి స్వంతంగా పాఠశాలల్ని నడిపే స్తోమతు లేనందువల్ల ప్రైవేటు పాఠశాలలకు కొంతవరకు సహాయాన్ని అందిస్తున్నట్లు వివరించాడు భారతదేశంవంటి పేదదేశంలో ప్రజలు ప్రైవేటు పాఠశాలలు స్థాపించే స్తోమతులేనివారు కావడంతో ప్రభుత్వసహాయమంతా అధికవనరులున్న క్రైస్తవమతసంస్థలకే అందుతుందన్న వాదనను ట్రెవెల్యాన్ అంగీకరించలేదు ఆంధ్రదేశంలో క్రైస్తవమత సంస్థలు 19వ శతాబ్ది ప్రారంభం నుండే తమకార్యకలాపాల్ని కొనసాగించాయి 1805లో లండన్ మిషన్ విశాఖపట్నంలో తన కార్యక్రమాల్ని చేపట్టింది 1822లో కడపకు కూడ విస్తరింప చేసింది మచిలీపట్నంలో నోబెల్ అను క్రైస్తవ మతగురువు నాయకత్వంలో చర్చి మిషనరీ సొసైటి తన పనిని ప్రారంభించింది చాలమంది బ్రాహ్మణులతోపాటు ఇతర ఉన్నతకులాలవారిని సైతం క్రైస్తవమతంలో చేర్పించడంలో నోబెల్ విజయం సాధించాడు ఇదేసమయంలో గుంటూరులోని అమెరికను మిషను తన కార్యక్రమాల్ని తీవ్రతరం చేసింది 1866 లో ఒంగోలులో అమెరికను బాప్టిస్టుమిషను స్థాపించబడింది 1876లో వచ్చిన తీవ్రమైన కరువువల్ల రోజుకు సుమారు వందమంది చొప్పున చాలమంది ప్రజలు క్రైస్తవంలో చేరినట్లు తెలుస్తున్నది

మహారాణి ప్రకటనలోని ఇతర వాగ్దానాలైన పరిశ్రమల అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడం వంటి విషయాల్ని గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు దీంతో ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి చోటు చేసుకుంది ఈ అసంతృప్తినే ప్రజలు అనేక విన్నపపత్రాల ద్వారా ప్రభుత్వానికి నివేదించుకున్నారు

## మద్రాసు స్థానికుల సభ—విజ్ఞాపన పత్రాలు

మనం ఇదివరకే చెప్పుకున్నట్లు మద్రాసు ప్రెసిడెన్సీలో 1852 జనవరి 26న 'మద్రాసు స్థానికుల సభ' ను స్థాపించారు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వదృష్టికి తేవడమే ఈ సభ యొక్క ముఖ్య ఉద్దేశము మొదట ఈ సభ కలకత్తాలోని బ్రిటీషు ఇండియా అసోసియేషన్ (British India Association) అనుబంధసంస్థగా పనిచేయ్యాలని సంకల్పించింది కాని కొన్ని

అభిప్రాయభేదాల కారణంగ కలకత్తా సంఘంతో సంబంధాన్ని తెంచుకుని ఒక స్వతంత్ర సంస్థగా రూపొందింది మద్రాసు స్థానికుల సభ ఏర్పడిన మొదటిరోజే మద్రాసు రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధసమస్యల్ని వివరిస్తూ వాటిని పరిష్కరించవలసిందిగా ప్రభత్వానికి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించింది

మహారాణి పాలనలోకి వచ్చిన తర్వాత 1859లోను, 1861లోను ఈ సభ రెండు విజ్ఞాపన పత్రాల్ని ప్రభుత్వానికి సమర్పించింది: ఈ రెండు పత్రాల్లోను ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపడమే కాక ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు పరిష్కారం చూపాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరడం జరిగింది 1859లో సమర్పించిన విజ్ఞాపన పత్రంలో మిషనరీ పాఠశాలలకు ప్రభుత్వ సహాయాన్ని కల్పించడం వల్ల ఉత్పన్నమయ్యే వివిధసమస్యల్ని వివరించడం జరిగింది ప్రభుత్వమే పాఠశాలల్ని స్థాపించడంవల్ల ప్రజలందరికి విద్య అందుబాటులో వుంటుందని మద్రాసు స్థానికుల సభ అభిప్రాయపడింది ప్రభత్వాధికారులు క్రైస్తవమత సంస్థలతో ఎటువంటి సన్నిహిత సంబంధాల్ని కలిగి వుండకూడదని ఈ పత్రంలో పేర్కొనడం జరిగింది

## 1861లో సమర్పించిన విజ్ఞాపన పత్రం

1861 లో మద్రాసు స్థానికుల సభ మరో విజ్ఞాపనపత్రాన్ని ప్రభుత్వానికి సమర్పించింది ఈ పత్రంలో ప్రభుత్వ వైఫల్యాల వల్ల ప్రజలు ఎటువంటి బాధలకు గురి అవుతున్నారో స్పష్టంచేశారు

ఈ పత్రం రెవిన్యూశాఖలోని లోపాల్ని ఎత్తి చూపింది రైత్వారీ పద్ధతిలోని శిస్తుల భారాన్ని గూర్చి వివరించింది పెంచిన పన్నుల్ని కట్టలేనప్పుడు రైతులయొక్క ఇంటిపైకప్పుల్ని తీసివేయడం, వారి నాగళ్ళను, ఎద్దుల్ని, ధాన్యాన్ని పశువులమేతను బలవంతంగా స్వాధీనం చేసుకొని వేలం వేయడం వంటి చర్యల్ని ప్రభుత్వం చేపట్టుతున్నదని ఈ పత్రం నిశితంగా విమర్శించింది వేలంద్వారా ప్రభుత్వానికి రావలసిన డబ్బులు రాకపోయినపుడు రైతుల్ని అరెస్టు చేయడం కూడ జరిగిందని ఈ పత్రంలో పేర్కొనడం జరిగింది ఇదేకాకుండ ఇంకా అనేక పద్ధతుల్లో రైతుల్ని వేదించేవారని, పన్నుకట్టలేని రైతుల కుటుంబ సభ్యుల్ని చెరువుల నుండి, బావులనుండి నీరు తెచ్చుకోనిచ్చేవారు కాదనికూడ ఈ పత్రం వివరించింది

జమిందారీ పద్ధతి అమలులో వున్న గంజాం, విశాఖపట్నం, కృష్ణావంటి జిల్లాల్లో కూడ భూమి శిస్తు విధానంలో చాల లోపాలుండేవి ఈ జమిందారీ పద్ధతిలో మొత్తం ఆదాయంలో 35 శాతాన్ని ప్రభుత్వానికి చెల్లించేవారు మిగిలిన 65 శాతంలో 15శాతం జమీందార్లు వుంచుకొని 50శాతం ఆదాయాన్ని రైతుకు వదలిపెట్టేవారు ఈ ఆదాయంలోనే రైతు భూమిపై పెట్టేపెట్టుబడితో సహా అన్ని ఖర్చుల్ని సరిపెట్టుకోవాలి దీంతోపాటు దర్బారు పన్నును, జమీందారుకు అయ్యే ఇతర ఖర్చులుకూడ రైతులే భరించాలి

ఈ విధంగా రైత్వారీ, జమీందారీ పద్ధతుల్లో చాలలోపాలున్నందువల్ల గ్రామపద్ధతిని ప్రవేశపెట్టమని మద్రాసు స్థానికుల సభ కోరింది ఈ పద్ధతిలో వ్యక్తులుకాక గ్రామం మొత్తం కలిసి పన్ను చెల్లించాల్సి వుంటుంది జమీందార్ల, మధ్యవర్తుల, ప్రభుత్వాధికారుల వేదింపులు ఉండకూడదు ఈ పద్ధతి వల్ల ప్రభుత్వానికి లాభం కలుగుతుంది రైత్వారీ పద్ధతిలో చోటుచేసుకున్న నష్టము, అవినీతి కూడ తగ్గిపోతాయి అని ఈ సభ అభిప్రాయ పడింది

తర్వాత 'మోతుర్బా' అనుపన్నువల్ల కలిగే ఇబ్బందుల్ని ఈ పత్రం వివరించింది 'మోతుర్బా' అనేది వృత్తి వ్యాపారాలపై విధించేపన్ను ఈ పన్నును చిన్న చిన్న వ్యాపార వస్తువులపై కూడ విధించేవారు ఈ పన్నుతో పాటు ఆదాయాన్ని పెంచే మిషతో ఇతర పన్నులు కూడ విధించేవారు అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చుకొనే వారిపైన, అడవిలో పశువుల్ని మేపే వారిపైన పన్నులు విధించి పేద ప్రజలకు కూడ ప్రభుత్వం అసౌకర్యాన్ని కలుగజేసింది ఇదే గాక పశువుల పేడ సేకరణపైన, తమ ఇంటికప్పులకోసం కోసుకునే గడ్డిమీద గూడ ప్రభుత్వం పన్ను విధించింది పేదల్లో అతిపేదలైనవారు కూడ పన్ను చెల్లించే పరిస్థితి కల్పించింది ప్రభుత్వం ఇందువల్ల 'మోతుర్బా' తో పాటు ఇతర పన్నుల్ని కూడ రద్దుచేయమని ఈ విజ్ఞాపన పత్రం కోరింది

ఈ విజ్ఞాపన పత్రంలోనే ఉప్పు అమ్మకంలో ఈష్టిండియా కంపెనీ ఆదాయం కోసం ప్రవేశపెట్టిన గుత్తాధిపత్యాన్ని ప్రశ్నించడం జరిగింది ఉప్పు తయారు చేయడాన్ని వేలంపాట ద్వారా కొంతమంది కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది అందువల్ల ఉప్పుపై గుత్తాధిపత్యాన్ని రద్దుచేయాలని ఈ వినతి

పత్రంలో కోరడం జరిగింది పేదప్రజల్లో సారాయివాడకం ఎక్కువయి వారి జీవితాలు నాశనం అవుతుండడం వల్ల ప్రభుత్వం తన డిస్టిల్లరీలలో సారాయి తయారుచేయడం మానుకోవాలని కూడ ఈ పత్రం భావించింది

తర్వాత ఈ పత్రం ప్రజాపనుల శాఖలోని (Public Works Department) అసమర్థతను, అవినీతిని గూర్చి ఎత్తి చూపింది కాలువలు, చెరువులు, ఇతరసాగు నిర్మాణాల్ని మరమ్మత్తు చేయక పోవడంతో వ్యవసాయం క్షీణించి పోతుందని విమర్శించింది తహసీల్దారు వంటి రెవెన్యూ అధికారులకు సాగునీటి నిర్మాణ బాధ్యతల్ని అప్పచెప్పడం సరియైన పద్ధతి కాదని తనవ్యతిరేకతను తెల్పింది సాంకేతికపరమైన నైపుణ్యం లేని ఈ అధికారులు నిర్మాణాల్ని ఆలస్యం చేయడమేకాక కావలసినంత డబ్బును దుర్వినియోగం చేయడానికి అవకాశం వుంది. రోడ్ల నిర్మాణంలో కూడ ప్రభుత్వం శ్రద్ధచూపడం లేదని ఈ పత్రంలో విమర్శించబడింది ప్రభుత్వ ఆదాయంలో ఒకశాతంకంటె తక్కువ మొత్తాన్ని ఈరోడ్ల నిర్మాణంలో ఖర్చుపెడుతున్నారు పేదరైతులు స్వంత ఖర్చుతోనే రోడ్లను నిర్మించుకోవాలని బలవంతం చేయడం తగనిపని అని చెప్పడం జరిగింది

తర్వాత చట్టాల్ని అమలుపరిచే కోర్టుల నిర్వహణలో కూడ అనేక లోపాలున్నాయని ఈపత్రంలో పేర్కొనడం జరిగింది న్యాయ సంబంధమైన శిక్షణపొందకనే చాలమంది న్యాయమూర్తులుగ నియమితులయ్యారు అదీగాక వీరు రెవెన్యూశాఖకు చెందిన ఉద్యోగులు కావడంతో వారికి చట్టసంబందమైన పరిజ్ఞానం ఉండేది కాదు తమ విధుల్ని నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కోర్టుల్లో సుశిక్షితులైన న్యాయమూర్తుల్నే నియమించాలని ఈ పత్రం కోరింది

పోలీసును ప్రత్యేకమైన శాఖగా చేయాలని ఈ విజ్ఞాపన పత్రం కోరింది పోలీసులు రెవెన్యూశాఖ అధీనంలో వుండడంవల్ల వారిని అధికారులు శిస్తువసూళ్ళవంటి పనులకు వినయోగించేవారు అందువల్ల ప్రజల ఆస్తులు, జీవితాలకు రక్షణ కల్పించే విషయంలో ఉదాసీనంగా వుండేవారు

చివరగా ఐ సి యస్‌ను రద్దుచేయాలని, ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నతోద్యోగాలకు భారతీయుల్ని ఎంపిక చేయాలని ఈ పత్రం కోరింది

## పరిపాలన

1856 నాటికి ఆంధ్రదేశంలో ఎనిమిది జిల్లాలుండేవి వీటినే కలక్టరేట్లు అనేవారు ఇవి (1) గంజాం (2) విశాఖపట్నం (3) గోదావరి (4) కృష్ణా (మచిలీపట్నం) (5) నెల్లూరు (6) బళ్ళారి (7) కడప (8) కర్నూలు జిల్లాలు

ఆంధ్రదేశంలోని ఉత్తర ప్రాంతంలో చివరిది గంజాం జిల్లా ఇందులో ఈనాటి ఒరిస్సా రాష్ట్రంలోని గంజాల జిల్లా, ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లాలుండేవి శ్రీకాకుళం సర్కారులో ఒక భాగంగా వుండిన గంజాంజిల్లా, 1766 లో బ్రిటిషువారి స్వాధీనమైంది ఈ జిల్లా రెండు భౌగోళిక ప్రాంతాలుగ విభజింపబడింది ఒకటి మైదానాలు, రెండు కొండప్రాంతాలు, గిరిజనులు నివసించే ఈ కొండప్రాంతాల్నే పాలనా పరంగా ఏజన్సీ ప్రాంతం అనిపిలిచేవారు. 1839 చట్టం ప్రకారం గంజాం కలెక్టరే గవర్నరు ప్రతినిధిగ ఏజన్సీప్రాంతంపై అధికారాన్ని చెలాయించేవాడు భూమిశిస్తు విషయంలో మాత్రం ఈ జిల్లాను రెండు ప్రత్యేక ప్రాంతాలుగ గుర్తించారు ఒకటి జమిందారీ ప్రాంతం కాగా రెండవది రైత్వారీ మరియు ఇనాందారీ ప్రాంతం

1813లోను, 1832లోను ఈజిల్లా రాజకీయమైన అలజడులకు గురియైంది 19వ శతాబ్దపు మూడవదశకంలో పిండారీలు ఈజిల్లాను దోపిడీ చేశారు 1836లో గోండులతోపాటు ఇతర కొండజాతి ప్రజలు తిరుగుబాటు చేయగా జార్జిరస్సెల్ అణచివేయగల్గాడు 19వ శతాబ్ది చివరలో కోరమల్లయ్య నాయకత్వంలో మరో తిరుగుబాటు జరిగింది మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు, వడ్డీ వ్యాపారస్తులు అవలంబించిన దోపిడీవిధానంవల్ల, అవినీతిపరులైన అధికారుల నిరంకుశ ప్రవర్తనవల్ల గిరిజనులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటును లేవదీశారు ఈతిరుగబాటును అణచివేసి మల్లయ్యను అరెస్టుచేశారు. మల్లయ్య జైలులోనే తన ప్రాణాల్ని వదిలాడు

విశాఖపట్నం, గోదావరి జిల్లాల్లోకూడ ఏజన్సీప్రాంతాలు వుండేవి 1766లో ఉత్తరసర్కారుల్ని స్వాధీనం చేసుకున్నపుడే గోదావరి జిల్లా ఈస్టిండియా కంపెనీ అధికారంలోకి వచ్చింది 1802లో రాజమండ్రి కాకినాడ కలక్టరేట్లను రెండింటిని కలిపి రాజమండ్రి జిల్లాగ ఏర్పాటు చేశారు. విక్టోరియా మహారాణి

పరిపాలనా బాధ్యతల్ని చేపట్టినప్పుడు రాజమండ్రి, మచిలీపట్నం, కృష్ణాజిల్లాల్ని కలిపి గోదావరి, కృష్ణా అను రెండు జిల్లాలుగ ఏర్పాటు చేశారు 1874లో మధ్య రాష్ట్రంనుండి భద్రాచలం తాలూకాను విడదీసి గోదావరి జిల్లాలో విలీనం చేయడం జరిగింది

ఆంధ్రదేశంలోని అత్యధిక ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు వరిముఖ్యమైన ఆహారపు పంట కంపెనీపాలకులు వ్యవసాయాభివృద్ధికి తగినంతప్రోత్సాహం ఇవ్వలేదు తమపాలన చివరి రోజుల్లో మాత్రమే కృష్ణా, గోదావరి నదులపై ఆనకట్టల్ని నిర్మించగల్గారు సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని నిర్విరామకృషివల్ల ధవళేశ్వరం వద్ద గోదావరినదిపై ఒక ఆనకట్టను 1849లో పూర్తి చేయడం జరిగింది 1833లో తీవ్రమైన కరువుకు గురైన ఈ జిల్లాకు ఈ ఆనకట్టవల్ల మంచి భవిష్యత్తు చేకూరింది ఇదేవిధంగా 1854లో విజయవాడవద్ద కట్టబడ్డ ఆనకట్టకూడ ఈ జిల్లాలో అభివృద్ధికి ఎంతగానో దోహదం చేసింది.

మహారాణి పాలనలోకి వచ్చిన తర్వాత నీటి సాగు నిర్మాణాల్ని చేపట్టడంలో ప్రభుత్వం తగిన శ్రద్ధచూపలేదు ఈకాలంలో ఆంధ్రదేశంలో జరిగిన ఒకేఒక ముఖ్య నిర్మాణం కర్నూలు-కడప కాలువ

అత్యధికమైన పన్నులతోపాటు కౌలు చట్టాలలో లొసుగులున్నందువల్ల రైతుల సామాన్యమైన పరిస్థితులు కూడ దుర్భరంగా తయారయ్యాయి సాగు భూమిలోని మూడవవంతు పైగా జమీందార్ల స్వాధీనంలో వుండేది రైతులు చెల్లించాల్సిన కౌలు మొత్తాన్ని నిర్ణయించకపోవడంతో వారుసాగుచేస్తున్న భూమినుండి జమీందార్లు ఎప్పుడైనా ఖాళీచేయించే పరిస్థితి ఏర్పడింది 1884కు ముందుగ జమీందారీ రైతుల రక్షణకు ఎటువంటి చట్టమూ రూపొందలేదు రైత్వారీపద్ధతి అమలులోవున్న ప్రాంతాల్లో పైతం రైతుల పరిస్థితి అంతంత మాత్రంగానే వుండేది 1885కుముందే సర్వేచేయడం, భూమిహద్దుల నిర్ణయం జరిగినా భూసారాన్ని, పెట్టుబడిని, ధరల్ని దృష్టిలో వుంచుకొని పన్నుల్ని విధించడానికి ఎటువంటి ప్రయత్నమూ జరుగలేదు రైతులపై పన్నులభారం చాల ఎక్కువగా వుండేది 1875 అక్టోబరులో లోకరంజని అనే తెలుగు పత్రిక రైతుల పరిస్థితి మహారాణి పాలనలో కంటె కంపెనీపాలనలోనే చక్కగా వుండేదని వ్యాఖ్యానించింది

రైతులపట్ల ప్రభుత్వం చూపిన ఉదాసీన వైఖరివల్ల ఆంధ్రదేశం తరచుగా కరువుకాటకాలకు గురవుతుండేది

కరువులు

19వ శతాబ్దిలో ఆంధ్రదేశం తీవ్రమైన కరువులకు గురైంది ఈ కరువుల్లో మరింత తీవ్రమైన గంజాం కరువు 1865-66 ప్రాంతంలో ఏర్పడింది 19వశతాబ్దపు ప్రారంభకాలంలోనే గంజాం జిల్లా 1799-1801 లోను, 1836-39 లోను కరువులకు గురైంది ఈ కరువులు మాత్రం పాక్షికంగా జిల్లాలో జరిగిన రాజకీయ అలజడులవల్ల ఏర్పడినవి ఊహాజనితమైన అంచనాలు తారుమారు కావడంతో ఈ కరువు ఏర్పడింది 1861-65లో అమెరికా అంతర్యుద్ధంలో మునిగివున్నపుడు బ్రిటను ముడిపత్తిని దిగుమతి చేసుకునేది దీనివల్ల పత్తిధరలు పెరిగాయి ధరలు పెరగడంతో లాభదాయకంగా వుంటుందని రైతులు పత్తి పంటకు ప్రాముఖ్యత నిచ్చారు దీంతో రైతులకు లాభాలు వచ్చాయి కాని అమెరికాలో అంతర్యుద్ధం ముగియడంతో బ్రిటను అమెరికా నుండి పత్తిని దిగుమతిచేసుకోవడం ప్రారంభించింది మార్కెట్లో పత్తినిల్వలు పెరిగిపోయాయి పత్తిధరలు విపరీతంగా పడిపోయాయి దీంతో గంజాం జిల్లాలోని పత్తిరైతులకు తీవ్రమైన నష్టం సంభవించింది పత్తిని కొనేవారు లేకపోవడంతో రైతుల పరిస్థితులు తారుమారైనాయి తనుపెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరైంది ఇదివరకు వరిని పండించే పొలాల్లో పత్తిని పండించడంతో బియ్యానికి కొరత ఏర్పడింది ఈ బియ్యం కొరత అన్నివర్గాల ప్రజలపై తన ప్రభావాన్ని చూపింది. వేలకొలది ఆకలిచావులు సంభవించాయి చాలమంది ప్రజలు దక్షిణాఫ్రికా, మారిషస్, ఫిజివంటి దేశాలకు వలసవెళ్ళి కూలీలుగ స్థిరపడ్డారు

సరియైన నీటిసాగు సౌకర్యాలు లేకపోవడంతో ఇతర జిల్లాల్లో కూడ కరువు ఏర్పడింది రాయలసీమ ప్రాంతం కరువులకు నిలయంగా మారిపోయింది 19వ శతాబ్ది ఉత్తరార్థంలో దాదాపు 11కరువులు సంభవించాయి కర్నూలు, కడప జిల్లాల్లో వేలకొలది ప్రజలు రోడ్ల ప్రక్కనే మరణించారు విశాఖ పట్నం జిల్లాలో కూడ కరువు సంభవించింది కాని ఇది రాయలసీమలో సంభవించినంత

తీవ్రమైంది మాత్రం కాదు ఈ జిల్లాకు వరి విపరీతంగా పండే కృష్ణా, గోదావరి జిల్లాలకు రైలుమార్గం వల్ల సంబంధం ఏర్పడడంవల్ల కావలసినంత బియ్యాన్ని దిగుమతి చేసుకోవడం జరిగింది ఇదేకాక బెంగాలునుండి, బర్మానుండి స్టీమర్ల ద్వారా ఈ జిల్లాకు బియ్యం దిగుమతులు జరిగేవి దీంతోపాటు ఈ జిల్లాకు వరిని ఎక్కువగా పండించే జయపూర్, మధ్యభారత రాష్ట్రాలతో చక్కటి రోడ్డు సౌకర్యాలు ఏర్పడ్డాయి ఈ కరువుల ఫలితంగా 19వ శతాబ్దపు ఏడు,ఎనిమిది దశకాల్లో రాయలసీమ ప్రాంతంలోను, గుంటూరు, గంజాం జిల్లాలోను జనాభా సంఖ్య తగ్గిపోవడం జరిగింది ఈ కరువులు నేరాల సంఖ్యపై కూడ తమ ప్రభావాన్ని చూపాయి ఆంధ్రజిల్లాల్లో దొంగతనాలు ఎక్కువ కావడంతో వీటిని అణచేందుకు సైన్యాన్ని పంపవలసి వచ్చింది నీటి సాగు సౌకర్యాల్ని ప్రభుత్వం కొంతవరకైనా కల్పించివుంటే కరువు తీవ్రత ఇంతగా వుండేది కాదు కనీసం కరువు చట్టాన్ని కూడ ప్రభుత్వం రూపొందించలేకపోయింది ఈ కరువుల వల్ల ఆంధ్రదేశంలో ఇంకో నష్టం కూడ జరిగింది విదేశీమతసంస్థలు కరువు సహాయ కేంద్రాల్ని ప్రారంభించడంతో ముఖ్యంగా గుంటూరు, కడప జిల్లాల్లోని చాలమంది ప్రజలు క్రైస్తవ మతంలో చేరిపోయారు

## చేతిపనుల క్షీణత

ఆంధ్రదేశం మహారాణి పాలనలోకి రావడంతో చేతివృత్తి కారుల జీవితాలు అయోమయంగా తయారయ్యాయి యంత్రసహాయంతో తయారయ్యే వస్తువుల పోటీకి చేతితో తయారుచేసిన వస్తువులు నిలువలేక పోయాయి దీంతో చాలమంది చేతిపనులవారు నిరాశ్రయులయ్యారు వీరిని ఆదుకునేందుకు కొత్త పరిశ్రమలు ఏవీ ప్రారంభం కాలేదు అందువల్ల చాలమంది చేతిపనివారు బర్మా, మలేసియా మొదలగు దేశాలకు కూలీలుగ వలస వెళ్ళారు

## రవాణ సౌకర్యాలు

రోడ్లు, వంతెనలు, రైల్వేల నిర్మాణంలో ఆంధ్రదేశం తగినంత అభివృద్ధికి నోచుకోలేదు దేశరక్షణ కోసం అవసరమైన రాకపోక సౌకర్యాల్ని మాత్రమే ప్రభుత్వం కల్పించింది విదేశీ దాడుల భయంవల్ల ఉత్తర భారతంలో రోడ్డు, రైలు సౌకర్యాల్ని ప్రభుత్వం కల్పించింది కాని దక్షిణ భారతాన్ని పూర్తిగా

అలక్ష్యం చేయడం జరిగింది ఆంధ్రదేశంలో రైల్వేల నిర్మాణం 1862లో ప్రారంభమైంది 1862 సెప్టెంబరులో పుత్తూరు రేణిగుంటల మధ్య ఒకరైలు మార్గం ప్రారంభమైంది ఈవిధంగా పై చెప్పిన విషయాలవల్ల బ్రిటీషు ప్రభుత్వం విక్టోరియా మహారాణి ప్రకటనలోని వాగ్దానాల్ని అమలుపరిచేందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదని స్పష్టమౌతుంది అందువల్లనే 1858-85 మధ్యగల కాలాన్ని వాగ్దానాల భంగపుకాలంగ (Period of broken Pledges) చెప్పుకోవడం జరిగింది

## రంప తిరుగుబాటు, 1879.

గోదావరి జిల్లాలోని చోడవరం డివిజను లోనిది రంపగ్రామం ఇదే జిల్లాలోని భద్రాచలం తాలూకా లోనిది, రేకపల్లి గ్రామం ఈ గ్రామాల్లో 1879లో వివిధ కారణాలవల్ల తిరుగుబాటు చెలరేగింది

రంపగ్రామం చుట్టుప్రక్కల ప్రాంతమంతా గోదావరి జిల్లాలోని ఏజన్సీ ప్రాంతంలోని ఒకభాగం 1813లో ఈ ప్రాంతలో కంపెనీ ప్రభుత్వం రెవెన్యూ పరిష్కారాన్ని చేసింది ఈ ప్రాంతంలో శాంతి భద్రతల్ని కాపాడే ముఖ్యమైన నాయకుడిని మనసబుదారు అని వ్యవహరించే వారు ఈ మనసబుదారుకు ముత్తాదారులనే కొండజాతి ముఖ్యులు సహాయంగా వుండేవారు. 1835లో మనసబుదారైన రమాభూపతిదేవుడు చనిపోవడంతో రంపాప్రాంతంలో అలజడి ప్రారంభమైంది చనిపోయిన ఈ మనసబుదారుకు ఒక కూతురు, అక్రమసంతానమైన మాధవతి రమాభూపతి దేవుడనే ఒక కుమారుడు వుండేవారు అందువల్ల ముత్తాదార్లు రమాభూపతి దేవుని కుమార్తెనే అతని వారసురాలిగా గుర్తించారు దీంతో ఆమెకూడ జీవితాంతం కన్యగ వుంటానని ప్రకటించింది కాని 1840లో ఆమె శీలాన్ని శంకించి ఆమెను గ్రామంనుండి తరుమగొట్టారు అందువల్ల మద్రాసు ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని కొంతమంది అధికారుల రక్షణలో వుంచింది తర్వాత 1848లో ఈ ప్రాంతాన్ని మాజీమనసబుదారు అక్రమసంతానమైన మాదవతి రమా భూపతి దేవునికి అప్పగించింది ముత్తాదార్లు కూడ ఈయన నాయకత్వాన్ని అంగీకరించారు అయితే కొత్త మునసబుదారు పాతకౌలునే వసూలు చేయాలనే ముత్తాదార్ల షరతును అంగీకరించాడు

అతి కొద్దికాలంలోనే కొత్త మనసబుదారు ముత్తాదార్లను రెచ్చగొట్టే విధంగా అనేక అక్రమ చర్యల్ని చేపట్టాడు ముత్తాదార్లకు చెందిన భూముల్ని ఆక్రమించుకోవడమే గాక వారిని అనేకపద్ధతుల్లో అణచివేయడం ప్రారంభించాడు మనసబుదారు నుండి లంచాలు తీసుకున్న పోలీసులు, స్థానిక అధికారులు ప్రజల సమస్యల్ని పట్టించుకునేవారు కారు కొండజాతి ప్రజలు తిరుగు బాటు చేసినపుడు మాత్రం వారిని పోలీసులు నిర్దాక్షిణ్యంగా అణిచివేసేవారు ఎనిమిది మంది ముత్తాదార్ల భూమిని స్వాధీనం చేసుకొని మనసబుదారు నిరంకుశంగా ప్రవర్తించాడు ఇదేగాక అధవిసుం.., వంట చెరుకును తీసుకునే వారిపైన, పశువులు మేపుకునేవారిపైన ..నధికారికంగా పన్నులు విధించాడు ఇటువంటి చట్టవ్యతిరేకపనుల వల్ల మనసబుదారుకు తగినంత ఆదాయం వచ్చేది తానుచేసే ప్రతిపనికి ప్రభుత్వం యొక్క ఆమోదం వుందని ప్రజల్ని నమ్మించేవాడు మనసబుదారు చేసే అక్రమాల్ని స్థానిక అధికారులు ప్రభుత్వానికి తెలియ జేయక పోవడంతో కొండజాతి ప్రజల అసంతృప్తి పై అధికారులకు తెలిసేది కాదు

ఇ..టిలో వాడుకునేందుకు కల్లుతియడాన్ని నిషేదిస్తూ ప్రభుత్వం కొత్త అబ్కారీ నిబంధనల్ని ప్రవేశ పెట్టడంతో గిరిజనుల్లో ఇదివరకే చోటుచేసుకున్న అసంతృప్తి మరింత తీవ్రమైంది వేలంలో ఎక్కువ మొత్తానికి పాటపాడిన వారికి కల్లు తీసేహక్కును ప్రభుత్వం కల్పించింది దీంతో ఈపాట దారులు కల్లుతీసే గిరిజనులపై చిగురుపన్నును విధించేవారు దీంతోపాటు మొదలు పన్ను పేరుతో చిగురపన్నులో సగం లేక అంతకంటె ఎక్కువ పన్నును మనసబుదారు వసూలు చేసేవాడు ఈ రెండు పన్నులు 1879లో తలెత్తిన రంప తిరుగుబాటుకు మూలకారణాలయ్యాయి ఈ పన్నుల వసూళ్ళలో కల్లు కాంట్రాక్టర్లకు, మనసబుదారుకు తోడ్పడుతున్న పోలీసులపై వున్న అసంతృప్తి కూడ ఈ ఉద్యమ ఆవిర్భావానికి మరోకారణంగా మనం భావించవచ్చు

1879లో ప్రారంభమయిన ఈ ఉద్యమం 5000 మైళ్ళ పర్యంతం కొండ ప్రాంతంలోను, అడవి ప్రాంతంల్లోను వ్యాపించింది ఈ తిరుగుబాటును అణచేందుకు ఆరు రెజిమెంట్లు మద్రాసు కాల్బలాన్ని, రెండు కంపెనీల సాపర్స్

అండ్ మైనర్స్‌దళాన్ని, అశ్విక దళంలోని ఒక విభాగాన్ని, హైదరాబాదు కంటింజెంటు కాల్బలంలోని ఒక విభాగాన్ని ప్రభుత్వం తరలించింది

చంద్రయ్య, సర్దార్ జంగం పులికంటి సాంబయ్య, కరు తమ్మన్న దొర, బొదలూరు నివాసియైన అంబుల్ రెడ్డి ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు 1879 ఏప్రిల్ 29న సాంబయ్య అరెస్టు చేయబడ్డాడు మేనెల ప్రారంభంలో ఎల్లవరం డివిజన్‌లో చాలచోట్ల చంద్రయ్య విజయాల్ని సాధించడమేగాక అడ్డతీగల పోలీసు స్టేషన్ను పూర్తిగ తగులబెట్ట గల్గాడు ఈ అసంతృప్తి జ్వాలలు రేకపల్లె, దుచ్చర్తి ప్రాంతాలకు వ్యాపించాయి పోలవరం గిరిజనులు కూడ ఈ తిరుగుబాటులో చేరగలరని వదంతులు వ్యాపించాయి అందువల్ల ప్రభుత్వం తన సైన్యాన్ని అన్నివైపులా మోహరించింది రంపకు ఉత్తర, తూర్పు ప్రాంతాల్ని సైన్యం ఆక్రమించడమే గాక గోదావరి శబరి నదీ తీరాల్లో సైన్యపు గుడారాల్ని ఏర్పాటు చేయడం జరిగింది ఇదేసమయంలో రెవెన్యూబోర్డులో ప్రథమ సభ్యుడైన సుల్లివాన్ తిరుగుబాటుకు దోహదం చేసిన కారణాల్ని తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వానికి తగు సూచనలు చేసేందుకు ఈ ప్రాంతాన్ని సందర్శించాడు ఈ నేపథ్యంలోనే మనసబుదారుని తొలగించడమూ, ప్రభుత్వంతో ప్రత్యక్ష సంబంధాన్ని పెట్టుకోవచ్చని మూత్తాదార్లకు వాగ్దానం చేయడమూ జరిగింది ఈ చర్యలు తిరుగుబాటును కొంతవరకు అదుపులో పెట్టగలిగాయి 1879 ఆగష్టు కల్లా దాదాపు 70మంది చంద్రయ్య మనుషుల్ని బంధించడంతో రంప ప్రాంతంలో మామూలు పరిస్థితులు నెలకొన్నాయి ఇదే సమయానికి రేకపల్లెలో కూడ ప్రశాంతత నెలకొంది పోలవరంలో తిరుగుబాటు తలెత్తనున్నదన్న వదంతులు కార్యరూపం దాల్చలేదు 1879 నవంబరులో అంబుల్ రెడ్డి బంధీ అయ్యాడు 1880లో చంద్రయ్య చంపబడ్డాడు 1880 నవంబరుకంతా రేకపల్లెలో కూడ మామూలు పరిస్థితులు నెలకొన్నాయి

## రేకపల్లె

1879లో తలెత్తిన రంప ఉద్యమంలో రేకపల్లె కూడ చేరడంతో ప్రభుత్వానికి సంకట పరిస్థితి ఎదురైంది ఈ ఉద్యమానికి గల కారణాలు రంపతిరుగుబాటుకు గల కారణాల కంటే భిన్నమైనవి ఈ ప్రాంతం

మధ్యభారతరాష్ట్రం (Central Provonce) అధీనంలో ఉన్నప్పుడు 'పోడు' వ్యవసాయంపై పరిమితులు వుండేవి కావు ఒక్కొక్క గొడ్డలికి నాల్గణాల పన్నును మాత్రం విధించేవారు 1874లో ఈ ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో విలీనమైనపుడు మద్రాసు ప్రభుత్వం అడవులు నాశనం అయిపోతాయన్న వుద్దేశంతో పోడు వ్యవసాయంపై పన్నును మూడింతలు పెంచింది ఇదేగాక రిజర్వు అడవుల్లోని కొన్ని వెల్లనుండి లభించే సుగంధ ద్రవ్యాల్ని సేకరించడం కూడ నిషేదించింది ఈ విధంగా కొత్తపన్నులు విధించడం, ఆంక్షలు పెట్టడం వంటివి తమజీవిత విధానంపై దెబ్బతీసే సమస్యలుగ గిరిజనులు భావించేవారు రంప ఉద్యమకారులు ఈ సమస్యల్ని ఆసరాగ తీసుకొని రేకపల్లె ప్రజల్ని కూడ ఉద్యమంలో చేరమని రెచ్చగొట్టారు 1879 జూలై 10న అంబుల్ రెడ్డి నాయకత్వంలోని రంప తిరుగుబాటుదారులు రేకపల్లె గిరిజనుల సహాయంతో వడ్డె గూడెం పోలీసు స్టేషనుపై దాడిచేశారు కాని ఈ దాడి విఫలమయింది అయితే కాపలా పోలీసు బృందాన్ని పట్టుకోవడంలో ఉద్యమకారులు విజయం సాధించారు తర్వాత ప్రభుత్వం సైన్యాన్ని పంపడంతో ఈ ప్రాంతంలో ప్రశాంతత నెలకొంది సెప్టెంబరు నెలకల్లా మామూలు పరిస్థితులు నెలకొన్నాయి 1880 అక్టోబరులో తమ్మన్నదొర కొన్ని గ్రామాలపై దాడిచేసి దోపిడీ చేయడంతో రేకపల్లెలో మరల అలజడి చెలరేగింది కాని ప్రభత్వం కొద్దికాలం లోనే ఈ ప్రాంతంలో శాంతి భద్రతల్ని చేకూర్చ గల్గింది

రంప, రేకపల్లె తిరుగుబాట్లు చాల చిన్న సంఘటనలు కావడంతో వాటివల్ల భారతదేశంలోని బ్రిటీషు అధికారానికి ఎటువంటి ముప్పు ఏర్పడలేదు

# 6

# 1857 – 1911 మధ్య కాలంలో హైదరాబాదు రాష్ట్రం

1853లో సంపన్నమై, సారవంతమైన బేరారు, రాయచూరు, ధారాశివ (ఉస్మానాబాదు) జిల్లాల్ని బ్రిటీషు ప్రభుత్వం ఒత్తిడివల్ల అప్పటినైజాం నాసిరుద్దౌలా (1829-1857) ఈస్టిండియా కంపెనీకి దత్తతు చేయవలసి వచ్చింది ఈ ఒప్పందంపై సంతకంచేసిన తర్వాత నైజాం దివాను అయిన సిరాజ్‌వుల్ ముల్క్ మరణించాడు తర్వాత 1853 మేనెల 31న సిరాజ్ మేనల్లుడైన 24 ఏళ్ళ తురాజ్ అలీఖాన్‌ను కొత్తదివానుగ నైజాం నియమించాడు దివాను పదవితో పాటు సాలార్‌జంగ్ అనుబిరుదును కూడ నైజాం తురాజ్ అలీఖాన్‌కు ప్రసాదించాడు 1883 ఫిబ్రవరి 8న తాను మరణించే వరకు సాలార్‌జంగ్ దివాను పదవిలో కొనసాగాడు ముగ్గురు నైజాంల కిందపనిచేసిన ఖ్యాతి సాలార్‌జంగ్‌కే దక్కింది నాసిరుద్దౌలా (1829-1857), అఫ్జల్ వుద్దౌలా (1857-1869), మీర్ మహబూబ్ అలీఖాన్ (1869-1911) అనువారే ఈ ముగ్గురు నైజాంలు 19వ శతాబ్దిలోని చక్కటి భారతీయ పాలకుల్లో ఒకడుగ ప్రసిద్ధి చెందాడు సాలార్‌జంగ్. తన పరిపాలనా సామర్థ్యంచేత మొగలుల భూస్వామ్య వ్యవస్థలో వుండిన హైదరాబాదు రాష్ట్రాన్ని ఆధునిక రాష్ట్రంగా తీర్చిదిద్దిచక్కటి పరిపాలనా పద్ధతిని ప్రవేశపెట్ట గల్గాడు

## ఆర్థిక సంస్కరణలు

సాలార్‌జంగ్ మొదట తన దృష్టిని ఆర్థిక సంస్కరణలపై కేంద్రీకరించి రాష్ట్రం యొక్క ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచి వీలైనంత వరకు ఋణభారాన్ని

తగ్గించాలని ప్రయత్నించాడు దీనికోసం ఆయన రెండుపద్ధతుల్ని అవలంబించాడు మొదట రాజ్యం యొక్క శిస్తువసూళ్ళపై అదుపు గల్గిన దఫ్తర్దారుల యొక్క అధికారాల్ని తగ్గించాడు శిస్తువసూళ్ళకు నెలజీతంపై పనిచేసే తాలూకాదార్లను నియమించాడు ఇదివరకు శిస్తువసూళ్ళను వేలం పద్ధతిపై కాంట్రాక్టర్లకు అప్పగించేవారు వీరు ప్రజల్ని అణచివేసి నిర్దాక్షిణ్యంగా దోచుకొనేవారు ఈ రెండు పద్ధతులవల్ల రాజ్యపు శిస్తు వసూళ్ళలో చాలమార్పు వచ్చింది ఆశించిన ఫలితాలు దక్కాయి దీంతో కుదువపెట్టిన రాష్ట్ర ప్రభుత్వ ఆభరణాల్ని సాలార్‌జంగ్ విడిపించగల్గాడు తక్కువ వడ్డీతో కొత్త ఋణాల్ని సేకరించి రాష్ట్రం యొక్క ఋణభారాన్ని చాలవరకు తగ్గించగల్గాడు

తన ఆర్థిక సంస్కరణల్లో భాగంగా 'హాలిసిక్కా' రూపాయిని ప్రవేశపెట్టాడు. కొత్తనాణేల్ని విడుదల చేసేందుకు వీలుగా హైదరాబాదులో కేంద్రద్రవ్య ముద్రణాలయాన్ని స్థాపించాడు గద్వాలు, నారాయణపేటల్లో వున్న జిల్లా ద్రవ్యముద్రణాలయాల్ని ఇది అదుపులో పెట్టగల్గింది

## న్యాయపరమైన సంస్కరణలు

న్యాయవిభాగంలోని సంస్కరణల్లో భాగంగా జిల్లాల్లో మునిసిఫ్, మీర్ ఆదిల్ వంటి న్యాయాధికారుల్ని నియమించారు ఈ అధికారులపై హైదరాబాదు హైకోర్టులయిన 'మహ్‌కాయ-ఇ-సాదర్' కు పర్యవేక్షణ అధికారం వుండేది హైకోర్టుకుపైన అపీలు చేసేందుకు సుప్రీంకోర్టు వుండేది దీన్నే 'మజ్లిస్-ఇ-మురఫా' అని వ్యవహరిస్తారు హైదరాబాదు నగరంలో బుజుంగ్ దివానీ అదాలత్, కుర్ద్ దివానీ అదాలత్ అను రెండు సివిలు కోర్టులు స్థాపించబడ్డాయి 'ఫౌజుదారీ అదాలత్' అను ఒక క్రిమినల్ కోర్టుకూడ స్థాపించబడింది ప్రధాన న్యాయమూర్తిని 'నాజిమ్' అని పిలిచేవారు

ఇవేగాక దారుల్ ఖాజీ లేక ఖాజీ కోర్టు అనేది కూడ వుండేది ఈ కోర్టులో ముస్లిం చట్టాన్ని అమలు పరిచేవారు మహ్‌కాయ-ఇ-సదారత్ అనుమరో కోర్టులో మత సంబంధమైన వివాదాల విషయమై విచారణలు జరిపేవారు

వీటితోపాటు వివిధ కోర్టుల కార్యక్రమాల్ని సమన్వయపరిచేందుకు ఒక ప్రత్యేకమైన న్యాయవిభాగాన్ని ఏర్పాటుచేశారు.

## పాలనా సంబంధమైన సంస్కరణలు

[illegible] రాజ్యాన్ని ఆరు ప్రాంతాలుగ విభజించారు వీటినే 'సుబా'లంటారు ఒక్కొక్క సుబాను వివిధ సర్కారులుగను, మరల ఒక్కొక్క సర్కారును వివిధ తాలూకాలుగను విభజించడం జరిగింది సర్కారును ఈనాటి రెవెన్యూడివిజను తోను, తాలూకాను జిల్లాతోను పోల్చవచ్చు ఒక్కొక్క సుబా ఒక సుబేదారు అధికారంలో వుండేది 19వ శతాబ్దపు మొదటి దశకంలో ఈసుభాల్ని రద్దు చేశారు

ఒక్కొక్క తాలూకా ఒక తాలూకాదారు అధికారం క్రింద వుంచారు ఈ తాలూకాదారు బ్రిటిషు ఇండియాలోని కలెక్టరుతో సమానం ఈతాలూకాదార్లకు ప్రభుత్వం జీతం ఇచ్చేదికాదు దీనికి బదులుగ శిస్తువసూళ్ళపై కమిషను వుండేది ఈ తాలూకా దార్లను వారి హోదానుబట్టి, పలుకుబడిని బట్టి నియమించేవారు ఈ నియామకానికి వీరు 'నజరు'ను సమర్పించవలసి వుంటుంది ఇది ఈనాటి లంచం తప్ప మరొకటికాదు ఒక్కొక్క సారి ఈనజరు సంవత్సరాదాయం కంటేమించి వుంటుంది తాలూకా దార్లు జిల్లా కేంద్రాల్లో వుండవలసిన అవసరంలేదు వీరు సామాన్యంగా శిస్తు వసూళ్ళను 'నాయిబ్' అనే తమ క్రింది అధికార్లకు అప్పచెప్పి తాము మాత్రం హైదరాబాదు నగరంలోనే వుండేవారు ఈపద్ధతిలో చాల లోపాలుండడంవల్ల హైదరాబాదులోని బ్రిటీషుప్రతినిధియైన మెట్‌కాఫ్ తాలూకా దార్ల పనిని పర్యవేక్షించేందుకు బ్రిటీషు అధికారుల్ని నియమించాడు కాని 1830లో ఈ బ్రిటీషు అధికారుల్ని తొలగించి వారి స్థానంలో అమీను'అనే స్థానికాధికారుల్ని నియమించారు ఈ అమీనులు కూడ అసమర్థులుగ ఋజువు కావడంతో 1840లో వీరిని కూడ తొలగించారు

1855లో సాలార్ జంగ్ రెవిన్యూ కాంట్రాక్టర్ల స్థానంలో నెలజీతంపై పనిచేసే తాలూకా దార్లను నియమించాడు

1865లో 'జిలా బంది' పద్ధతిని ప్రవేశ పెట్టడం జరిగింది ఈ పద్ధతిలో రాష్ట్రాన్ని 14 జిల్లాలుగ విభజించారు ఒక్కొక్క జిల్లాకు పాలనా బాధ్యతల్ని నిర్వహించేందుకు ఒక 'అవల్ తాలూకాదారు' అను ఉద్యోగిని నియమించారు

ఈ ఉద్యోగి బ్రిటీషు ఇండియాలోని జిల్లా కలెక్టరుతో సమానం ఈ అవల్ తాలూకాదారుకు సహాయపడేందుకు దోయం తాలూకాదార్లు (సబ్ కలెక్టర్లు) నియమింపబడ్డారు ఇక సోయమ్ తాలూకా దార్లు మూడవ తరగతి ఉద్యోగులు. వీరుకూడ బ్రిటీషు ఇండియాలోని తహసీల్దార్లతో సమానంగా అధికారాన్ని చెలాయించేవారు

తాలూకా దార్ల పనిని పర్యవేక్షించేందుకు మజ్లిస్-ఇ-మల్ గుజారి అనే పాలనా సంస్థను 1865లో ఏర్పాటు చేశారు అయితే ఈ సంస్థ రెండేళ్ళు కూడా పని చేయకుండా రద్దు చేయబడింది ఈ సంస్థను రద్దు చేసిన తర్వాత 14 జిల్లాల్ని కలిపి 5 ప్రాంతీయ విభాగాలుగ ఏర్పాటు చేశారు ఒక్కొక్క ప్రాంతీయ విభాగాన్ని పాలించేందుకు ఒకసాదర్ తాలూకా దారును నియమించారు ఈ సాదర్ తాలూకాదారు పదవి బ్రిటీషు ఇండియాలోని రెవెన్యూ కమీషనర్ తో సమానమైంది

## పోలీసు

1865కు ముందు హైదరాబాదు రాష్ట్రంలో సక్రమమైన పోలీసు విధానాన్ని అమలు పరచలేదు తెలంగాణా ప్రాంతంలో వంశపారంపర్యంగా వచ్చే గ్రామ కాపలాదార్ల పద్ధతి వుండేది హైదరాబాదు, ఔరంగాబాదు వంటి పట్టణాల్లో కొత్వాళ్ళు (పోలీసు కమీషనరు) వుండేవారు కాని కాలక్రమంలో ఈపోలీసు విధుల్ని రెవెన్యూ అధికారులే నిర్వహించే ఆచారం నెలకొనింది.

సాలార్ జంగ్ 'మహకామ-ఇ-కొత్వాలి' అనే పోలీసు డిపార్టుమెంటును ఏర్పాటు చేశాడు 'నిజామత్' అను పేరుతో ఒక పోలీసు దళాన్ని కూడ ఏర్పాటు చేశాడు పోలీసు సూపరింటెండెంటును మహతామీన్ అని, ఇన్స్పెక్టరును అమీను అని వ్యవహరించేవారు పోలీసు స్టేషన్లను చౌకీలని పిలిచేవారు

## విద్య

రాష్ట్రప్రభుత్వ యంత్రాంగంలో సుశిక్షితులైన ఉద్యోగుల్ని నియమించేందుకు అనుగుణంగా విద్యావిధానంలో అనేక మార్పుల్ని ప్రవేశపెట్టాడు సాలార్ జంగ్. 1855లో దారుల్ వులుమ్ ఉన్నత పాఠశాల స్థాపనతో రాష్ట్రంలో

పాశ్చాత్య విద్యాబోధన ప్రారంభమైంది. ఈ పాఠశాల పద్ధతియను, ఉర్దూ భాషల్లోనేకాక ఆంగ్ల భాషలో సైతం విద్యాబోధనను చేపట్టింది. తర్వాత నైజాం అఫ్జలుద్దౌలా పరిపాలన కాలంలో విద్యా విషయంలో ఎటువంటి అభివృద్ధి జరుగలేదు. 1869లో సాలార్ జంగ్ సహరాజ ప్రతినిధి (Co-Regent) అయినప్పటికీ ఆంగ్ల భాషా బోధనకు, పాశ్చాత్య విద్యావ్యాప్తికి చాల పాఠశాలల్ని నెలకొల్పాడు. నగర ఉన్నత పాఠశాల (City High School) చందేర్ ఘాట్ ఉన్నత పాఠశాలలు వరుసగా 1870, 1872లో స్థాపించబడ్డాయి. ప్రజాపనుల శాఖ (Public Works Dept.) లో పనిచేసేందుకు కావలసిన సాంకేతిక సిబ్బందిని తయారు చేసేందుకు 1870లో ఇంజనీరింగు పాఠశాల నెలకొల్పబడింది. ప్రభువుల (Nobles) బిడ్డలకోసమై 1873లో మద్రాస-ఎ-అలియా స్థాపించబడింది. రాజకుంటుంబంలోని వ్యక్తుల కోసం 1878లో మద్రాస-ఎ-ఐజ్జాను ప్రారంభించారు. ఈ పాఠశాలలు ఏర్పడిన ఫలితంగా హైదరాబాదులో కొద్దిమందే అయినా గొప్పవాగ్ధాటి గల మేదావి వర్గం ఏర్పడడానికి అవకాశం కలిగింది. సాలార్ జంగు మరణించిన కొద్ది సంవత్సరాలకే 1887లో చాందేర్ ఘాట్ ఉన్నత పాఠశాలలోని ఇంటర్మీడియట్ తరగతుల్ని మద్రాస-ఎ-అలియాలో విలీనం చేస్తూ నైజాం కాలేజి ఏర్పాటు చేయబడింది. హైదరాబాదులో విద్యాసంస్థల్ని నెలకొల్పడమే కాకుండా ఆలీఘర్ లో విద్యాసంస్థల్ని స్థాపించేందుకు సర్ సయ్యదు అహమ్మదు ఖాన్ కు ఆర్థిక సహాయాన్ని అందజేశాడు సాలార్ జంగ్. వికార్-ఫుల్ ముల్క్, మొహిసిన్-ఫుల్ ముల్క్ అను ఇద్దరు హైదరాబాదుకు చెందిన అధికారులు ఆలీఘర్ కాలేజి ఏర్పాటులో చురుకుగా పాల్గొన్నారు.

## రాకపోక సౌకర్యాలు

1868లో హైదరాబాదు-షోలాపూర్ రోడ్డు, మద్రాసు-బొంబాయి రైల్వేలైనుపూర్తి కావడంతో హైదరాబాదు రాష్ట్రంలో రాకపోక సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రాష్ట్రంలోని ముఖ్యపట్టణాలైన గుల్బర్గా, వాడిల గుండా మద్రాసు-బొంబాయి రైల్వేలైను పోయేది. హైదరాబాదును వాడితో కలిపే రైల్వేలైను 1878లో పూర్తి అయింది.

## ప్రభుత్వ ఉద్యోగాలు

ప్రభుత్వం యొక్క పరిపాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన తెలివి తేటలుగల వ్యక్తుల్ని ఉద్యోగాలకోసం సాలార్ జంగ్ ఎంపిక చేశాడు ఉత్తర భారతానికి చెందిన చాలమంది ముస్లింలు కాయస్థులు హైదరాబాదు ప్రభుత్వోద్యోగాల్లో చేరారు వీరిలో సయ్యద్ హుస్సేన్ బిల్ గ్రామి, సయ్యద్ అలీబిల్ గ్రామి, మెహిబ్ హుస్సేను, సయ్యద్ మెహ్దిఆలీ, మొహిన్ ముల్క్ అనువారు చక్కని పరిపాలనా సామర్థ్యం గలవారుగ పేరును గడించారు బెంగాలునుండి అఘోరనాథ చటోపాధ్యాయ వంటి వ్యక్తులు నగరంలోని విద్యాసంస్థల్లో చేరారు చాలమంది స్థానికేతరుల్ని ప్రభుత్వోద్యోగాల్లో నియమించడంవల్ల తర్వాత స్థానికులకు, స్థానికేతరులకు మధ్య వివాదాలు తలెత్తాయి ఈ వివాదమే ముల్కీ ఉద్యమానికి దారితీసింది

## కొత్త మంత్రిత్వ శాఖలు

1868 లో సాదర్-ఉల్-మహంలనే నలుగురు మంత్రుల్ని సాలార్ జంగ్ నియమించాడు వీరిలో ముగ్గురు మంత్రులకు కొత్తగ ఏర్పాటు చేసిన పోలీసు, రెవెన్యూ, న్యాయశాఖల్ని అప్పగించడం జరిగింది ఇక నాల్గవ మంత్రి విద్య, ఆరోగ్యశాఖ మొదలైనే వాటిపై అజమాయిషీ చలాయించేవాడు ఈ మంత్రులు దివాను లేక ప్రధానమంత్రి నేతృత్వంలో పని చేసేవారు. మంత్రి మండలి వంటిది ఏదీ ఏర్పాటు కాలేదు

## భూమి శిస్తు

తెలంగాణా ప్రాంతంలో రైత్వారీ పద్ధతి అమలులో వుండేది అయినప్పటి మునగల, అమరచింత, గద్వాలు వంటి జమిందారీ సంస్థానాలు చాల వుండేవి ప్రతి గ్రామానికి వంశపారంపర్యంగా అధికారాన్ని చెలాయించే పటేల్ అనే అధికారి వుండేవాడు ఒక్కొక్కసారి నేరస్థుల్ని అణచివేసి శాంతి భద్రతల్ని కాపాడేందుకు పటేలుకు సహాయంగా పొజుదారీ పటేల్ అను ఉద్యోగి వుండేవాడు. గ్రామ లెక్కలు చేసే వ్యక్తిని పట్వారీ లేక పాండ్య అని వ్యవమహరించేవారు. దేశ్‌ముఖ్, దేశ పాండ్యల నాయకత్వంలో గ్రామాల్ని కొన్ని వలయాలుగ విభజించారు శిస్తులో జమిందార్లకు వాటా వుండేది దీనినే రుసుము అనేవారు.

భూమి శిస్తు తర్వాత వాణిజ్య పన్నులు, అబ్కారీ పన్నులు రాష్ట్రానికి ముఖ్యమైన ఆదాయమార్గాలుగ వుండేవి ఇవేగాక దేశ్ పతి అనే స్థానిక పన్ను, స్థానిక రాజాలు సమర్పించే పేష్కుష్‌లు, స్థానిక ముఖ్యులు పదవులు చేపట్టకముందు చెల్లించే నజ్రానాలు ప్రభుత్వానికి ఇతర ఆదాయాలుగ వుండేవి

## సాలార్‌జంగ్ వ్యక్తిత్వం

1857 లో సిపాయిల తిరుగుబాటు తర్వాత సాలార్‌జంగ్ తన శక్తి సామర్థ్యాలతో హైదరాబాదు రాష్ట్రానికి ఎనలేని సేవచేశాడు

1859 తర్వాత సాలార్‌జంగ్ నిజాం విశ్వాసం కోల్పోవడంతో 1860లోను, 1867 లోను సాలార్‌జంగ్‌ను తొలగించడానికి నిజాం ప్రయత్నించాడు అయితే హైదరాబాదు లోని బ్రిటీషు ప్రతినిధులు సాలార్‌జంగ్ పదవిని రక్షించగల్గారు 1857-58 లో సాలార్‌జంగ్ బ్రిటీష్ వారి కందించిన సేవల్ని బ్రిటీషు ప్రతినిధులు బాగా గుర్తించారు అందువల్ల 1860లో హైదరాబాదులోని బ్రిటీషు ప్రతినిధియైన కల్నల్ డేవిడ్‌సన్ జోక్యం చేసుకోవడంతో నైజాం సాలార్‌జంగ్‌ను పదవినుండి తొలగించలేక పోయాడు ఇదేవిధంగా 1867 లో కూడ బ్రిటీషు ప్రతినిధి యూల్ సహాయంతో సాలార్‌జంగ్ తనపదవిని నిలుపుకో గలిగాడు 1869 ఫిబ్రవరిలో నైజాం అఫ్జలుద్దౌలా మరణించాడు దీంతో అతని మూడుసంవత్సరాల కుమారుడైన మీర్ మహబూబ్ ఆలీఖాన్‌ను సింహాసనాధిష్టుని చేశారు నైజాం యుక్త వయస్సుకు వచ్చేవరకు పాలనా బాధ్యతల్ని నిర్వహించేందుకు సాలార్‌జంగ్‌ను, అమీర్-ఎ-కబీర్ బహదూర్‌లను సహరాజ ప్రతినిధులుగా (Co-Regents) బ్రిటీషు ప్రభుత్వం నియమించింది ఈ నియామకం వల్ల సాలార్‌జంగ్‌కు ప్రభుత్వ నిర్వహణలో కావలసినంత స్వేచ్ఛదొరికింది ఆచరణలో తానే నిజమైన పాలకుడుగ రూపొందాడు సాలార్ జంగ్ తన పదవిని ప్రభుత్వం యొక్క పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు వినియోగించుకున్నాడు

సాలార్ జంగ్‌యొక్క నిర్విరామకృషివల్లే 1860లో దారాశివ్, రాయచూర్ జిల్లాలు తిరిగి నైజాంకు దక్కాయి బేరారు జిల్లాను కూడ తిరిగి దక్కించుకునేందుకు కృషిచేసి హైదరాబాదు రాష్ట్రప్రతిష్టను ఇనుమడింపజేయాలని

ప్రయత్నించాడు బేరారును తిరిగి పొందడంలో తాను విఫలుడైనప్పుడు బ్రిటీషు ప్రభుత్వంతో చర్చలు జరిపే నిమిత్తం ఇంగ్లాండు వెళ్ళాడు తన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అసంతృప్తితో భారతదేశానికి తిరిగి వచ్చారు సాలార్ జంగ్ ఇంగ్లాండు వెళ్ళి రావడాన్ని బ్రిటీషు ప్రభుత్వం తీవ్రమైన చర్యగా భావించి అతని అధికారాన్ని తగ్గించేందుకు వికార్-ఉల్-ఉమరను సహరాజ ప్రతినిధిగ నియమించింది ఇతడు 1877 ఏప్రిల్లో చనిపోయిన మాజీసహరాజ ప్రతినిధియైన అమీర్-ఎ-కబీర్‌కు సోదరుడు వికార్-ఉల్-ఉమర సాలార్ జంగ్‌తో కలిసి మెలసి పనిచేసేవాడుకాదు అందువల్ల రాజీనామా చేయక తప్పదని సాలార్ జంగ్ ప్రభుత్వాన్ని బెదిరించినప్పుడు ప్రభుత్వం అందుకు సంసిద్ధతను వ్యక్తపరిచింది దీంతో సాలార్ జంగ్ మెత్తబడి నిజాం యుక్తవయస్సుకు వచ్చేంతవరకు బేరారు విషయాన్ని గూర్చి ప్రస్తావించనని అంగీకరించవలసి వచ్చింది బేరారును తిరిగి పొందేందుకు సాలార్ జంగ్ చేసిన ప్రయత్నాలు లార్డ్ లిట్టనును కలవర పరిచాయి హైదరాబాదులోని బ్రిటీషు ప్రతినిధికి లిట్టను తాను రాసిన లేఖలో సాలార్ జంగ్‌ను గూర్చి ఈ విధంగా అభిప్రాయపడ్డాడు

"సర్ సాలార్ జంగ్ చేసే కుతంత్రాలు నాపాలనలో భారతదేశంపైగల బ్రిటీషు అధికారానికి చాల ప్రమాదకరంగా పరిణమించాయని నేను భావిస్తున్నాను ఈ ప్రమాదం యుద్ధం కంటే, క్షామం కంటె చాల తీవ్రమైంది. ఈ అపాయం తప్పేది కాదు అయితే దీన్నించి ప్రజలకుగాని, పార్లమెంటుకుగాని తెలియలేదంటే ఈ విషయాన్ని అతిసామాన్యంగా, సమర్ధవంతంగా పరిష్కరించారనే చెప్పాలి సంక్లిష్టమైన ఆదేశాల్ని సైతం ధైర్యంతో సమర్ధవంతంగా నీవు నడిపంచడం వల్ల మరోసారి అటువంటి ప్రమాదం తలెత్తే అవకాశం తప్పింది"

## మధ్యంతర ప్రభుత్వం, 1883-84

సాలార్ జంగ్ హఠాత్తుగ మరణించడంతో రాష్ట్ర పరిపాలనలో తీవ్రమైన అస్తవ్యస్తత చోటుచేసుకుంది. సాలార్ జంగ్ సంస్కరణలు పరిపాలనను కేంద్రీకృతం చేయడమే గాదివాన్ యొక్క అధికారాన్ని,హోదాను చాలవరకు పెంచాయి. నైజాం మైనరు కావడం వల్ల అధికారయంత్రాంగంలో ముల్కీ,

నాన్-ముల్కీల మధ్య వివాదాలు తలెత్తడం వల్ల పరిపాలనలో పూర్తి స్తబ్దత ఏర్పడింది అందువల్ల భారత ప్రభుత్వం సాలార్ జంగ్ కుమారుడైన మీర్ లాయిక్ అలీఖాన్‌ను, రాజానరేంద్ర బహదూర్‌ను రాష్ట్రానికి సంయుక్త పాలకులుగ నియమించింది దివాను పదవిని ఖాళీగ వుంచారు. ఈ సంయుక్త పాలకులకు పరిపాలనలో సహాయపడేందుకు ఒక రక్షక సమితిని ఏర్పాటు చేశారు. ఈ సమితిలో రాష్ట్రంలోని ప్రభువర్గానికి చెందిన ముఖ్యులు సభ్యులుగ వుండేవారు ఈ సమితికి నిజాం అధ్యక్షుడుగ వ్యవహరించేవాడు ఈ సమితి సామాన్యమైన విధాన నిర్ణయాలు తీసుకునేది కాని రోజువారీ కార్యక్రమాల్ని మాత్రం సంయుక్త పాలకులు నిర్వహించేవారు సంయుక్త పాలకులిద్దరి మధ్య వివాదాలు తలెత్తడంతో ఈ కొత్త పద్ధతి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేక పోయింది

## దివాను పదవిలో రెండవ సాలార్‌జంగ్ (1884–1887)

1884 సంవత్సరానికి నైజాం మీర్ మహబూబ్ అలీఖాన్‌కు 18 ఏళ్ళ వయస్సు వచ్చింది ఫిబ్రవరి 5న వైస్రాయి అయిన లార్డురిపను హైదరాబాదు సందర్శించాడు ఈ సందర్భంగా చౌమహల్లా భవనంలో ఏర్పాటు చేసిన అతిశోభాయమానమైన దర్బారులో హైదరాబాదు రాష్ట్రం యొక్క పూర్తిపాలనాధికారాల్ని నైజాంకు లార్డు రిపను అప్పజెప్పాడు ఆ సాయంత్రమే లాయిక్ అలీ రెండవ సాలార్ జంగ్ బిరుదుతో దివానుగ నియమింపబడ్డాడు. లాయిక్ అలీ దివానుకావడం అధికార యంత్రాంగంలోని నాన్ ముల్కీ వర్గం యొక్క విజయంగా భావింపబడింది బ్రిటీషు ప్రభుత్వం సాలార్ జంగ్ కుటుంబంతో మరల మామూలు సంబంధాలు ఏర్పరచుకొన్నట్లు లాయిక్ అలీ నియామకంద్వారా స్పష్టం అవుతుంది

తన తండ్రి తలపెట్టిన కొన్ని సంస్కరణల్ని రెండవ సాలార్ జంగ్ అమలులోకి తెచ్చాడు హైకోర్టుయొక్క అధికార పరిమితిని పెంచడంతోపాటు సివిలు, క్రిమినలు చట్టాల్ని ఎప్పటికప్పుడు యథాతథం చేయగల్గాడు పర్షియను భాషా స్థానంలో ఉర్దూభాషను రాజభాషగ ప్రకటించాడు అయితే అధికార యంత్రాంగంలోని నాన్-ముల్కీ వర్గం చేతుల్లో కీలుబొమ్మగ మారి నిజాంకు దూరంకావడంతో రెండవసాలార్ జంగ్ దివాను పదవిలో మూడేళ్ళ కంటె

ఫెక్కువ కాలం కొనసాగలేక పోయాడు 1887 ఏప్రిల్ నెలలో తన పదవికి రాజీనామా చేశాడు ఈయన స్థానంలో 1887 నుండి 1893 వరకు నవాబు అస్మాన్ జా దివాను పదవీ బాధ్యతల్ని నిర్వహించాడు.

## హైదరాబాదులో ప్రజా చైతన్యం

### చందా రైల్వే ఆందోళన

19 వ శతాబ్దపు ఉత్తరార్ధంలో హైదరాబాదులో జరిగిన సంఘటనల్లో చెప్పుకోదగ్గది చందారైల్వే ఆందోళన. ఈ ఉద్యమ ఆవిర్భావం ఈ క్రింది విధంగా జరిగింది. 1870లో భారత ప్రభుత్వం, హైదరాబాదు ప్రభుత్వం మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం మద్రాసు-బొంబాయి మార్గంలో వాడినుండి హైదరాబాదువరకు ఒక రైల్వేలైను నిర్మించాలి. ఈ మధ్యలోనే నైజాం ఆధీనంలో వున్న సింగరేణిలో శ్రేష్టమైన బొగ్గు కనుగొనబడింది. రైల్వేల విస్తరణతో బొగ్గుకు గిరాకీ పెరగడంవల్ల ఈ రైల్వేలైనును బొగ్గుగనులున్న ప్రాంతాలైన డోర్నకల్లు, ఎల్లాందులకేగాక విజయవాడవరకు విస్తరించడానికి నిర్ణయించారు మరల ఉత్తరాన గల చందాలో (ఈ నాటి మహారాష్ట్రలోని చంద్రపూర్) బొగ్గు నిక్షేపాలున్నాయని తెలియడంతో రైల్వేలైను చందావరకు పొడిగించడానికి నిర్ణయించారు ఈ ప్రతిపాదనలు మొదటిసాలార్‌జంగ్ కాలంలోనే ఆమోదించబడ్డాయి ఈ రైల్వేలైన్ల నిర్మాణానికి బ్రిటీషు రైల్వే కంపెనీ (Nizams's Guaranteed State Railway Company) 3 లక్షల పౌన్ల పెట్టుబడిని సమకూర్చింది నైజాం ప్రభుత్వం కూడ పెట్టుబడిని సమకూర్చాలని మొదటి సాలార్‌జంగ్‌పై ఒత్తిడి తెచ్చారు ఈ రైల్వే నిర్మాణం వివరాల్ని ప్రజలకు తెలియజేయకుండా గోప్యంగా వుంచారు ఈచందా రైల్వేస్కీము మొదటి సాలార్‌జంగ్ కాలంలో ఆమోదించబడినా రక్షక సమితి (Council of Regency) పాలనా కాలంలో అమలులోకి తేబడింది ఈ రైల్వే నిర్మాణం లాభదాయకం కాదని, రాష్ట్రానికి తీరని నష్టం కల్గిస్తున్న వదంతి వ్యాపించింది. 1880 నాటికి హైదరాబాదులో కొద్ది మందైనా చక్కటి వాగ్దాటిగల ఒక మేధావి వర్గం ఏర్పడింది. వీరు ప్రజాసమస్యల గూర్చి చర్చించేందుకు ఉత్సాహాన్ని చూపేవారు చందా రైల్వే స్కీమును అమలులో పెట్టబోయే సమయంలోనే

ఈ స్కీము పూర్వాపరాలను క్షుణంగా పరిశీలించేందుకు ఈ మేధావి వర్గం ఒక కమిటీ ఏర్పాటుచేసింది. హైదరాబాదు కాలేజి ప్రిన్సిపాలైన డాక్టరు అఘోరనాథ చటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ ఖయూమ్ అనువారు ఈ కమిటీలోని ముఖ్యులైన సభ్యులు ఈ స్కీముకు సంబంధించిన అన్ని వివరాల్ని ప్రజల ముందుంచమని కమిటీ కోరింది నిరంకుశంగా వ్యవహరించే నైజాం ప్రభుత్వానికి ఇటువంటి విన్నపం చేయడం ఇదే మొదటి సారి కావడం విశేషం ఈవిన్నపాన్ని రక్షకసమితి తీవ్రమైనదిగా భావించింది అఘోరనాద చటోపాధ్యాయను ఉద్యోగం నుండి సస్పెండు చేయడమే కాకుండా 1883 మే 20న రాష్ట్రం నుండి బహిష్కరించారు చటోపాధ్యాయ బహిష్కరణతో ఉద్యమం చల్లబడిపోయింది దీంతో చందారైల్వే స్కీమును ఆచరణలో పెట్టగల్గారు టైమ్స్ ఆఫ్ ఇండియా, ది బాంబే గెజిట్ వంటి పత్రికలు ఈ సంఘటనకు విపరీతమైన ప్రచారాన్ని ఇచ్చాయి. రెండు సంవత్సరాల తర్వాత 1885లో డాక్టరు చటోపాధ్యాయ హైదరాబాదుకు వచ్చి నైజాం కాలేజి ప్రిన్సిపాలుగ చేరడానికి ప్రభుత్వం అంగీకరించింది హైదరాబాదులో ప్రజాచైతన్యానికి చందారైల్వే ఆందోళన నాంది పల్కిందని చెప్పవచ్చు.

## 1893 సంస్కరణలు

1893లో కనుంచా-ఇ-ముబారక్ అను ఫర్మాను ద్వారా కొన్ని రాజ్యాంగపరమైన, పాలనా పరమైన సంస్కరణలు ప్రవేశ పెట్టబడ్డాయి ఈ సంస్కరణల ఫలితంగానే పరిపాలనలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ (Legislative, Executive, Judiciary) అను మూడు విభాగాలు ఏర్పడ్డాయి ప్రభుత్వాధికారులు సభ్యులుగా ఒక శాసనసభ ఏర్పాటు చేయబడింది. దివాను అధ్యక్షుడిగా, పేష్కారు సభ్యుడుగా గల ఒకమంత్రి మండలి కూడ ఏర్పాటయింది సైన్యం, సివిలు సర్వీసుల్ని పేష్కారు అధీనంలో వుంచారు

తన అధికారాల్ని తగ్గించారన్న భావం కలగడంతో అశ్వన్ ఝాకు ఈ సంస్కరణలు నచ్చలేదు. అందువల్ల సంస్కరణలు ప్రవేశపెట్టిన కొంతకాలానికే తన పదవికి రాజీనామా చేశాడు. 1893 నుండి 1901 వరకు నవాబు విక్కార్-ఫుల్-వుమరా దివాను పదవిని నిర్వహించాడు ఇతని తర్వాత కిషన్ ప్రసాద్ దివాను పదవిని చేపట్టి 1912 వరకు కొనసాగాడు. 1911లో నైజాం మీర్

మహబూబ్ అలీఖాన్ మరణించడంతో ఉస్మాన్ అలీఖాన్ (1911-1948) నైజాంపదవిని అలంకరించాడు  అలీఖాన్ అసఫ్ ఝూ వంశంలో ఏడవవాడే కాక చివరివాడుకూడా.

# 7

# ఆంధ్రదేశంలో ప్రజాచైతన్యం

19వ శతాబ్ది ఉత్తరార్ధంలో ఆంధ్రుల ఆలోచనల్లో కొత్తభావాలు మొలకెత్తాయి. 1857లో మద్రాసు విశ్వవిద్యాలయం స్థాపించడంతో ఆంధ్రదేశంలో ఉన్నత విద్య అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. 1843లో పాశ్చాత్య విద్యాబోధనకు నోబెల్ నాయకత్వంలో చర్చిమిషనరీ సొసైటి మచిలీపట్టణంలో ఒక పాఠశాలను స్థాపించింది. 1864లో ఈ పాఠశాల ఒక కళాశాల స్థాయికి ఎదిగింది. 1873లో మద్రాసు ప్రభుత్వం రాజమండ్రిలో ఒక సెకండరీ గ్రేడు కళాశాలను స్థాపించింది. 1877లో ఈ కళాశాలనే డిగ్రీ కళాశాలగ మార్చారు. 1878లో విశాఖపట్నంలో హిందూకళాశాల (ఈ నాటి ఎ వి ఎన్ కాలేజి) స్థాపించబడింది. 1879లో బరంపురంలో కళ్ళికోట కళాశాలను స్థాపించారు. ఆంధ్రదేశంలో జరిగిన ఆంగ్లవిద్యావ్యాప్తివల్ల ముఖ్యంగా సర్కారు జిల్లాల్లో పాశ్చాత్యుల స్వేచ్ఛా భావాల్ని అలవరచుకున్న ఒక కొత్త విద్యావంతుల వర్గం ఏర్పడింది. వీరు సనాతన సాంప్రదాయాలతో కూడివున్న ఆనాటి హిందూ సమాజంలో ఇమడలేక పోయారు. అందువల్ల ఆనాటి అధికారవర్గాన్ని అసంబద్ధమైన మతాచారాల్ని విమర్శించకుండా ఉండలేక పోయారు. దీంతో వీరు ఆనాడు తలెత్తిన రాజకీయ సాంఘికోద్యమాలకు మూలపురుషులయ్యారు.

## కందుకూరి వీరేశలింగం పంతులు (1848–1919)

వీరేశలింగం పంతులు గారిని గూర్చి చాలమంది ప్రముఖులు తమ అభిప్రాయల్ని వెలిబుచ్చారు.

"వీరేశలింగం పంతులు మధ్యయుగపు మత్తునుండి ఆంధ్రుల్ని కదిలించాడు వారి మూర్ఖత్వంపై కొరడా ఝళిపించాడు, అంధ విశ్వాసాలనుండి వారికి విముక్తిని ప్రసాదించాడు వారి జీవితాలకు, ఆలోచనలకు ఆధునికమైన అభ్యుదయకరమైన మానవత్వపు విలువలుగల ఒకమలుపును చూపగల్గారు" (వి ఆర్ నార్ల)

"వీరేశలింగం పంతులు వారిలో చైతన్యాన్ని కల్గించనట్లయితే, ఆంధ్రదేశము, ఆంధ్ర ప్రజలు ఈ నాడు వున్న స్థితిలో వుండేవారుకారు. సూక్ష్మబుద్ధి, ఎనలేని ధైర్యం, బహుముఖ ప్రజ్ఞకలిగిన ప్రముఖులైన భారతీయుల్లో వీరేశలింగం ఒకరు. అసత్యంపై యుద్ధాన్ని ప్రకటించి స. ాజాభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేశాడు" (రాజాజీ)

"సమాజంలో తీవ్రమైన మార్పులు రావాలని కోరి అందుకోసమై నిర్విరామంగా కృషి చేసిన వీరేశలింగం పంతుల్ని దక్షిణ భారతంలోని మొదటి సంఘ సంస్కర్తల్లో ఒకరుగ బావించవచ్చు. అయితే ఆనాడు అందరు సంస్కర్తల లాగానే పంతులు గారు కూడ అపార్థాలకు వేదింపులకు గురయ్యారు సాంఘిక పునరుజ్జీవనం కోసం ఎన్నో అవహేళనల్ని, అపాయాల్ని తట్టుకొని కృషి స. ్రన పంతులుగారి ఆదర్శానికి మనమెంతో ఋణపడి వున్నాము". (సర్వేపల్లి రాధ కృష్ణన్)

"ఆధునిక ఆంధ్రలోకంలో వీరేశలింగం పంతులు చాల గొప్ప వ్యక్తి వీరేశలింగం తన జీవిత చరిత్రలో యుగ వికాసాన్ని గూర్చి ఇలా వివరిస్తాడు. చాలమంది ప్రజలు తామునివసిస్తున్న యుగపు వెలుగుల్ని ప్రసరింపజేయకనే తమ జీవితాల్ని కొనసాగిస్తారు వారు వెలుగును ప్రసాదించనూలేరు, గ్రహించనూలేరు ఎవడైతే వెలుగుని పట్టుకుని నవచైతన్యాన్ని సృష్టించి సమాజంలో మార్పుకు అభివృద్ధికి కారకుడౌతాడో అతనే నిజమైన నాయకుడు. సమాజంలో మార్పు, అభివృద్ధి జరగకపోతే మనిషి జీవితంలో జడత్వము, ఆందోళన చోటుచేసుకుంటాయి నవసమాజ నిర్మాతల్లో ఒకడు కావడంచేత వీరేశలింగం ఆదునిక యుగానికి అద్దంపట్టాడని చెప్పవచ్చు. పంతుల్ని సృష్టికర్త అన్నారంటే దీనికి కారణంఆయనకూడ సృష్టిలో ఒకప్రాణి కావడం వల్లే ఎవరైతే తాము నివసించే కాలతత్వాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారో వారికే సృష్టిచేసే శక్తి కూడ వుంటుంది" (కట్టమంచి రామలింగారెడ్డి)

ఈ విధంగా ప్రముఖుల ప్రశంసలు వీరేశలింగం వ్యక్తిత్వాన్ని మనకు స్పష్టంచేస్తాయి 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో వీరేశలింగం జన్మించాడు అతని తండ్రి సుబ్బారాయుడు ఒకపేద బ్రాహ్మణుడు అతని తల్లి పూర్ణమ్మ. పంతులు తన నాలుగేళ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోయాడు

పేదరికంలో మగ్గుతున్నా తన కుమారునికి చక్కటి విద్యాజ్ఞానాన్ని కలిగించాలని పూర్ణమ్మ సంకల్పించింది అందువల్ల ఆమె వీరేశలింగంను ప్రభుత్వ జిల్లా పాఠశాలకు పంపింది. 1869లో వీరేశలింగం మెట్రిక్యులేషను పరీక్ష పాసయ్యాడు కోరంగిలో ఉపాధ్యాయుడుగను, రాజమండ్రిలో సీనియరు తెలుగు పండితుడుగను వీరేశలింగం పనిచేశాడు

## పంతులుగారి సాహితీ వ్యాసంగాలు

పంతులుగారి సాహితీ వ్యాసంగాలు బహుముఖంగా వుండేవి తెలుగులో మొదటి నవలయైన 'రాజశేఖర చరిత్ర'ను రచించాడు తెలుగులో నాటకాల్ని వ్రాయడంలో కూడ వీరేశలింగం పంతులుగారే ఆద్యులు ప్రకృతి శాస్త్రాల్లోను, చరిత్రలోను మొదటిసారిగ తెలుగులో పుస్తకాల్ని రచించగల్గాడు స్త్రీల కోసం ప్రత్యేకంగా వచన కవిత్వంరాయడంలో కూడ పంతులు గారే మొదటివారు. ఆంధ్రదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి జన్మనిచ్చిన తండ్రిగా వీరేశలింగాన్ని భావించవచ్చు

# సాంఘిక సంస్కరణలు

## స్త్రీవిద్య

1870వ దశకంలో ఆంధ్రదేశంలో వెలువడుతున్న 'ఆంధ్రభాషా సంజీవని', 'పురుషార్థ ప్రదాయిని' అను పత్రికల్లో స్త్రీ విద్యను గూర్చి వివాదం చెలరేగింది. 'ఆంధ్ర భాషా సంజీవని' పత్రికకు మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నం పంతులు సంపాదకుడుగ ఉండేవారు ఈయన సంప్రదాయవాది. 'పురుషార్థ ప్రదాయిని' పత్రికను మచిలీపట్టణ వాసియైన ఉమారంగ నాయకులు నాయుడుగారు నడిపేవారు

1871లో ప్రారంభింపబడ్డ 'ఆంధ్రభాషా సంజీవని' పత్రిక గ్రాంధిక భాషను సమర్థిస్తూ వ్యావహారిక భాషావాదాన్ని విమర్శించేది ఈ నేపథ్యంలోనే వీరేశలింగంపంతులు స్త్రీవిద్యను సమర్థిస్తూ పైవివాదంలో భాగస్వామి అయ్యాడు. తాను నమ్మిన సిద్ధాంతాల్ని సమర్థవంతంగా ప్రచారం చేసేందుకు 'వివేకవర్ధిని' అనే పత్రికను 1874లో రాజమండ్రిలో ప్రారంభించాడు స్త్రీవిద్యను వ్యతిరేకించేవారిని అపహాస్యం చేస్తూ కవిత్వాన్ని చెప్పడమేగాక నాటికల్ని కూడ రచించాడు ఇతని రచనయైన 'బ్రహ్మవివాహం' బాల్యవివాహాల్ని, కన్యాశుల్కాన్ని తీవ్రంగా నిరసించింది

తన ఆశయాల్ని ఆచరణలో పెట్టేందుకు కందుకూరి 1874 సెప్టెంబరు నెలలో ధవళేశ్వరంవద్ద ఒక బాలికల పాఠశాలను స్థాపించాడు ఆంధ్ర దేశంలోని మొదటి బాలికల పాఠశాల కూడ ఇదే కావడం విశేషం మల్లాది అచ్చన్న శాస్త్రి ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు 1881లో రాజమండ్రిలోని ఇన్నీస్‌పేటలో మరో బాలికల పాఠశాలను వీరేశలింగం స్థాపించాడు. సంఘ సంస్కరణ కార్యకలాపాల్లో తనకు చేదోడు వాదోడుగ వుంటుందని తన భార్య రాజ్య లక్ష్మికి కూడ చదువు నేర్పినాడు బాలికల పాఠశాలలేకాక హరిజన పాఠశాలలు, శ్రామికులకై రాత్రి పాఠశాలల్ని స్థాపించింది కూడ వీరేశలింగంగారే ఆంధ్రదేశంలో సహవిద్యను మొదట ప్రోత్సహించింది కూడ పంతులుగారే వీరు తాను స్థాపించిన పాఠశాలల్లో బాలికల్ని కూడ చేర్చుకునేవారు

## వితంతు పునర్వివాహాలు

వీరేశలింగం పంతులుగారికి సంఘసంస్కర్తగా కంటె స్త్రీ జనోద్ధారకుడుగ విశేషఖ్యాతి లభించింది

1874లో మద్రాసులో వితంతు పునర్వివాహ సంఘాన్ని చాల ఆడంబరంగా ప్రారంభించారు దివాన్ బహదూర్ ఆర్. రంగనాదరావు, పి చెంచలరావు వంటి మద్రాసు నగర ప్రముఖులు సభ్యులుగ ఉండేవారు కాని ప్రారంభించిన రెండేళ్లకే ఈ సంఘం కనుమరుగైంది. 1875లో విశాఖపట్నవాసియైన మహామహోపాధ్యాయ పరవస్తు వెంకట రంగాచార్యులు వితంతు వివాహాన్ని సమర్థిస్తూ 'పునర్వివాహ సంగ్రహం' అన్న గ్రంధాన్ని రచించాడు దీన్ని చూసిన కొక్కొండ

వెంకట రత్నం పంతులుకు కంపరం పుట్టింది రంగాచార్యులకు వ్యతిరేకంగా ప్రచారం సాగించాడు వీరేశలింగంతో సంబంధాలు లేనప్పటికీ ఆయన సహాయాన్ని అర్థించాడు కాని వీరేశలింగం హృదయం వితంతువులపైనే వుంది అయినప్పటికీ వితంతువివాహం గూర్చి వాదోపవాదాలతోనే సరిపెట్టుకోవడం ఆయనకు ఇష్టంలేదు ఆశయాల్ని ఆచరణలోకి తేవాలని ఆయన ఆరాటం అందుకే ఎవరి పక్షమూ వహించకుండా కొంతకాలం గడిపాడు

1875 కల్లా వీరేశలింగం పంతులు బ్రిటీషు ఉన్నతాధికారులతోను, మద్రాసునగర ప్రముఖులతోను, మద్రాసు రాష్ట్ర ఇతర పట్టణాల్లోని ప్రముఖులతోను సంబంధబాంధవ్యాల్ని పెంచుకున్నాడు రాజమండ్రి ప్రభుత్వకళాశాల ప్రధానాధికారి ఇ పి మెట్‌కాఫ్ వీరేశలింగం చేపట్టే కార్యక్రమాల్లో ఉత్సాహం చూపడమేకాక పంతులుగారి 'వివేకవర్ధిని' పత్రికకు చందాదారుడయ్యాడు. పంతులుగారి కార్యక్రమాలకు తగిన ప్రోత్సాహాన్నిచ్చాడు 1878 సెప్టెంబరు నెలలో రాజమండ్రిలో 'సంఘసంస్కరణ సమాజం' స్థాపించబడింది

కొక్కొండ వెంకటరత్నం పంతులు, వేదం వెంకటరాయ శాస్త్రి వంటి సంప్రదాయవాదుల్ని ఒప్పించడానికి సభలు, సమావేశాలు జరిపించి ప్రాచీన దర్మశాస్త్రాలు వితంతువివాహాన్ని నిషేధించలేదని స్వయంగా ఉపన్యాసాలిచ్చాడు ధర్మశాస్త్రాల్లోనికొన్ని శ్లోకాల్ని ఉదహరించి వితంతు వివాహం శాస్త్ర సమ్మతమేనని నిరూపించాడు 1879 ఆగష్టు 3న మహారాజా బాలికల పాఠశాలలో వితంతు వివాహంపై మొదటి సారిగ ఉపన్యాసమిచ్చాడు. ఈ ఉపన్యాసం ఆంధ్రదేశం అంతా సంచలనం పుట్టించింది. ఇక్కడే అక్టోబరు 12న గూడ మరో ఉపన్యాసం ఇచ్చాడు దీంతో సాంప్రదాయవాదుల్లో కలవరం పుట్టింది వీరేశలింగం వాదనల్ని ఎదుర్కోవడానికి రాజమండ్రి, కాకినాడలలో పోటీ సమావేశాల్ని ఏర్పాటు చేశారు. కాని వితంతు వివాహం శాస్త్ర సమ్మతంకాదని నిరూపించలేకపోయారు. దీంతో వీరికి ఆవేశం ఎక్కువైంది. వీరేశలింగంను కొట్టించడానికి రౌడీలను ఉపయోగించారు. అయితే వీరేశలింగం శిష్యబృందం ఉక్కుకవచంలా ఆయన్ను కాపాడింది.

1880లో తన స్నేహితులైన చల్లపల్లి బాపయ్య, బసవరాజు, గవర్రాజుల సహకారంతో 'వితంతుపునర్వివాహ సంఘాన్ని' పంతులుగారు స్థాపించారు. తనకనుకూలమైన వాతావరణాన్ని కల్పించుకుని, వీరేశలింగం తన ఆశయాల్ని ఆచరణలో పెట్టడానికి ఉపక్రమించాడు వితంతువుల్ని వివాహం చేసుకునే వ్యక్తుల కోసం అన్వేషణ ప్రారంభించాడు తన శిష్య బృందాన్ని మారుమూల ప్రాంతాలకు పంపి వీరికోసం వెతికించాడు కాని వితంతువుల తల్లిదండ్రుల్ని ఒప్పించడం చాల కష్టసాధ్యమైంది చివరకు ఒక వితంతువు తల్లి తన కుమార్తెకు వివాహం చేయడానికి ఉత్సాహం చూపింది. వెంటనే తన శిష్యుల్ని ఆ వితంతువు నివసించే పల్లెకు పంపి అతి కష్టంమీద ఆమెను రాజమండ్రికి తీసుకొచ్చారు. ఆ వితంతువు పేరు సీతమ్మ 1881 డిశంబరు 11న రాజమండ్రిలో గోగులపాటి శ్రీరాములుతో సీతమ్మ వివాహం జరిగింది ఈ విధంగా ఆంధ్రదేశంలో మొదటి వితంతు వివాహం అగ్రకులంలోనే జరిపించడం విశేషం. ఈ పెళ్ళి కూడ సవ్యమైన వాతావరణంలో జరుగలేదు రాజమండ్రిలోని సాంప్రదాయవాదులు ఈ పెళ్ళిని చెడగొట్టడానికి తీవ్రంగా ప్రయత్నించారు పంతులుతోపాటు ఆయన శిష్య బృందంకూడ ఏ పరిణామాన్నైనా ఎదుర్కోడానికి సిద్ధపడ్డారు వివాహం జరిగే ప్రాంతం చుట్టుప్రక్కల పోలీసు బందోబస్తు చేయబడింది. తమ ప్రయత్నంలో విఫలులైన సాంప్రదాయవాదులు పెళ్ళిలో పాల్గొన్న 31 కుటుంబాల్ని కులం నుండి వెలివేశారు.

మొదటి వితంతు వివాహం జరిగిన నాలుగు రోజులకే (డిశంబరు 15న) రెండో వితంతువివాహం జరిపించాడు వీరేశలింగం రత్నమ్మ అనే వితంతువును రాచర్ల రామచంద్రయ్య వివాహం చేసుకున్నాడు 1892 నాటికి ఇరవై వితంతు వివాహాల్ని జరిపించాడు వీరేశలింగం కార్యకలాపాలన్నింటిలోను ఆర్థికంగా ఆదుకున్న వ్యక్తి కాకినాడ వ్యాపారవేత్త పైడా రామకృష్ణయ్య వివిధ సందర్భాల్లో మొత్తం ముప్పైవేల రూపాయలిచ్చి వీరేశలింగాన్ని ప్రోత్సహించాడు పెళ్ళికాని వితంతువులకు, తల్లిదండ్రులచే విడువబడ్డ వితంతువులకు మద్రాసులోను (1897), రాజమండ్రిలోను (1905)వితంతు శరణాలయాల్ని కట్టించాడు వీరేశలింగం. 1883లో స్త్రీలకు ప్రత్యేకంగా 'సతిహిత బోధిని' అను మాస పత్రికను ప్రారంభించాడు.

వీరేశలింగంగారి కార్యకలాపాల్ని గూర్చిన వార్తలు దేశంలోని వివిధ ప్రాంతాలకు వ్యాపించాయి. ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మహదేవ గోవింద రనడే, ఎన్ జి. చంద్రావార్కర్, మహర్షి డి కె. కార్వే వంటి మత, సాంఘిక సంస్కర్తలు వీరేశలింగం సేవల్ని కొనియాడారు వీరేశలింగం పేరు ప్రఖ్యాతులు దేశంలోనే గాక విదేశాల్లో సైతం వ్యాపించాయి బ్రిటన్ దేశస్థురాలైన మానింగ్ అనే యువతి వీరేశలింగం స్థాపించిన వితంతు శరణాలయానికి యాభైపౌండ్లు చెందేటట్లు తన వీలునామాలో రాసిపెట్టింది వీరేశలింగం సేవలకు మెచ్చి ప్రభుత్వం 1893లో 'రావు బహదూర్ బిరుదును ప్రధానం చేసింది 1898లో మద్రాసులో జరిగిన భారత సంఘ సంస్కరణ సభకు అధ్యక్షత వహించి దేశంలోనే అత్యున్నతమైన గౌరవాన్ని పొందాడు ఈ సభలోనే మహదేవ గోవింద రనడే వీరేశలింగాన్ని 'దక్షిణ దేశ ఈశ్వర చంద్ర విద్యాసాగరుడు'గ అభివర్ణించాడు 1899లో మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో మొదటి తెలుగు పండితుడుగ వీరేశలింగం నియమింపబడ్డాడు 1904లో ఉద్యోగ విరమణచేసి తిరిగి రాజమండ్రి చేరాడు ఉద్యోగ విరమణ తర్వాత కూడ వితంతు శరణాలయాల్ని, అనాద శరణాలయాల్ని స్థాపిస్తూ తన కార్యక్రమాల్ని కొనసాగించాడు 1905 డిశంబరు 15న తాను స్థాపించిన వివిధ సంస్థల నిర్వహణకై 'హితకారిణి సమాజం' అను కేంద్ర సంస్థను స్థాపించాడు. 1908 మే 2న హితకారిణి సమాజాన్ని రిజిష్టరు చేయించి దాదాపు యాభైవేల రూపాయల విలువగల తన యావదాస్తిని సమాజానికి దత్తం చేశాడు

వీరేశలింగం దేవదాసీ పద్ధతిపై అవినీతిపరులైన ఉద్యోగులపై ధ్వజమెత్తాడు. సంఘంలోని ఉన్నతవర్గాలవారు వేశ్యల్ని ఉంచుకోవడం గౌరవంగా భావించేవారు వీరి ఇళ్ళల్లోనే అధికార, అనధికార నిర్ణయాలుకూడ జరిగేవి అధికారుల నిర్ణయాలు తమకనుకూలంగా వుండేందుకు కొంతమంది ఈ దేవదాసీల్ని సాధనంగా వాడుకొనేవారు. వివాహ సందర్భాల్లో దేవదాసీలచేత నాట్యం చేయించేవారు వీరేశలింగం ఈదేవదాసీ పద్ధతిని నైతికవిలువల్ని దిగజార్చేదిగ వుందని భావించి తీవ్రంగా వ్యతిరేకించాడు. రాజమండ్రిలోని అవినీతి పరులైన అధికారుల గుట్టు బట్ట బయలు చేసి అధికారయంత్రాంగంలో భయోత్పాతాన్ని సృష్టించాడు వీరేశలింగం. ఈయన బయటపెట్టిన అవినీతికి భయపడి ఒక జిల్లా మునిసిఫ్ ఆత్మహత్య చేసుకున్నాడు.

1910 ఆగస్టు 11వ తేదీన వీరేశలింగం తన జీవిత భాగస్వామియైన రాజ్యలక్ష్మిని కోల్పోయాడు భార్య పోవడంవల్ల వీరేశలింగం పంతులు మానసికంగా కృంగిపోయారు అందుకు ముందే (1909లో) తన ఆప్తమిత్రుడైన దేశిరాజు పెద బాపయ్య మరణించాడు ఇటువంటి సమయంలో వీరేశలింగంపై ఆయన శత్రువులు లేనిపోని అపనిందలు వేశారు దీంతో పాటు ఆయనపై పరువు నష్టం దావాలు కూడ వేశారు అయితే వీటన్నింటి నుండి వీరేశలింగం విజయవంతంగ బయట పడ్డాడు కాని జీవితం పట్ల తనకిదివరకున్న ఆసక్తిని కోల్పోయాడు 1919 మే 27న మద్రాసులో తన అంతిమ శ్వాసను విడిచాడు

## పత్రికారంగం – పురోభివృద్ధి

1858–1905 మధ్య కాలంలో తెలుగు పత్రికారంగం పురోభివృద్ధివైపు పయనించింది బళ్ళారి క్రైస్తవ సంఘం 'సత్యదూత' అనే మొదటి పత్రికను ప్రచురించింది 1905 నాటికి దాదాపు 20 పత్రికలు తెలుగులో ప్రచురణకు నోచుకున్నాయి వీటన్నింటిలోను 'ఆంధ్రప్రకాశిక', 'శశిలేఖ', 'కృష్ణా పత్రిక', 'వివేక వర్ధిని', 'దేశాభిమాని', 'రసికోల్లాసిని' అను పత్రికలు మిక్కిలి ప్రచారాన్ని పొందాయి పాలనారంగంలోని వైఫల్యాలకు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించేవి ఈ పత్రికలు. జాతీయ భావాన్ని, ప్రజాస్వామ్య భావాల్ని వ్యాప్తి చేసేందుకు ఈ పత్రికలు విపరీతంగా దోహదం చేశాయి

## జాతీయ భావ వికసనం – వివిధ సంఘాలు, సంఘటనలు

విద్యావ్యాప్తితో పాటు తెలుగు పత్రికా రంగం పురోభివృద్ధి చెందడంతో తీరాంధ్ర దేశంలోని ప్రజా జీవితం శీఘ్ర గతిన మార్పుకు లోనయింది రాజకీయ ప్రయోజనాల కోసమేగాక ఇతర ప్రయోజనాల్ని ఆశించి గూడ చాల సంఘాలు స్థాపించబడ్డాయి 1884 మే 16న మద్రాసు మహాజనసభ ఆవిర్భవించింది. ఈ సభకు పి రంగయ్యనాయుడు అధ్యక్షుడు కాగా పి ఆనందాచార్యులు కార్యదర్శిగ పనిచేశాడు ఈ సభ మొదటి సమావేశానికి తెలుగు జిల్లాల నుండి చాలమంది ప్రతినిధులు హాజరయ్యారు ఆనాటి సాహితీ సభల్లో కాకినాడ సాహితీ సభ విశేషమైన పేరును గడించింది ఈ సభ ప్రజాసమస్యల్ని చర్చించడంలో ఉత్సాహాన్ని చూపేది ఐ సి యస్ పరీక్షల

వయోపరిమితిని పెంచాలని కోరుతూ ఇంగ్లండులోని భారతదేశపు సెక్రటరీకి ఈ సభ రెండు మహాజర్లను సమర్పించింది 1885లో బొంబాయిలో భారతజాతీయ కాంగ్రెసు ఆవిర్భవించినపుడు ఆంధ్రదేశంలోని బరంపురం, మచిలీపట్నం, కడప, బళ్ళారి, అనంతపురం మొదలగు ప్రాంతాలనుండి చాల మంది ప్రతినిధులు హాజరయ్యారు వారిలో పి రంగయ్యనాయుడు, పి ఆనందాచార్యులు, ఎన్. సుబ్బారావు ముఖ్యులు 1886 లో కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెసు సభకు ఆంధ్రదేశం నుండి 21 మంది ప్రతినిధులు హాజరయ్యారు 1891లో నాగపూర్ లో జరిగిన కాంగ్రెస్ మహాసభకు .పి. ఆనందాచార్యులు అధ్యక్షత వహించాడు మిగిలిన ఆంధ్ర ప్రముఖులైన పి. రంగయ్యనాయుడు, 'ఆంధ్ర ప్రకాశిక' సంపాదకుడైన ఎ.సి పార్థసారధి నాయుడు, రాజమండ్రికి చెందిన న్యాపతి సుబ్బారావు నాగపూర్ కాంగ్రెస్ చర్చల్లో చురుకుగ పాల్గొన్నారు

1885లో ఆవిర్భవించిన భారత జాతీయ కాంగ్రెసు వివిధ జిల్లా సభలు ఏర్పడడానికి మార్గదర్శకమైంది 1892లో కృష్ణా జిల్లా సభ ఏర్పడింది ఇలాంటి సభ ఏర్పడడం మద్రాసు రాష్ట్రంలోనేగాక భారత దేశంలోనే ప్రధమం అని చెప్పవచ్చు. 1892 జూలైలో భారత జాతీయ కాంగ్రెసులో క్రియాశీలక సభ్యుడైన రామస్వామి గుప్త కృష్ణా జిల్లా సభ మొదటి సమావేశాన్ని గుంటూరులో జరిపించాడు గుంటూరు అప్పట్లో కృష్ణా జిల్లాలో భాగంగా వుండేది.

రెండవ సమావేశం 1893 జూన్ లో మచిలీపట్నంలో జరిగింది 1894లో కృష్ణా జిల్లా రైతులు నీటితీరువా హెచ్చింపుకు నిరసనగా అప్పటి కృష్ణా జిల్లాలో భాగమైన ఏలూరులో సమావేశం జరిపి నీటితీరువా తగ్గించేవరకు భూమిని సాగు చేయడానికి నిరాకరించారు అయితే 1905లో వందేమాతరం, స్వదేశీ ఉద్యమాలు దేశం మొత్తాన్ని ఒక్క కుదుపు కుదిపే వరకు ఆంధ్ర దేశంలో నిజమైన రాజకీయ చైతన్యం కలుగలేదు.

20వ శతాబ్ది ప్రారంభంతో భారత దేశంలోని జాతీయోద్యమం సరికొత్త జీవంపోసుకుని ముందుకు సాగింది 1905 వరకు భారత జాతీయ కాంగ్రెసు రాజ్యాంగ పరమైన సంస్కరణల కోసం ప్రభుత్వానికి మహాజర్లు సమర్పించడం

వరకే తన కార్యకలాపాల్ని పరిమితం చేసుకుంది  ఇండియా కౌన్సిలు రద్దు, కేంద్రంలోను, రాష్ట్రాల్లోను శాసన సభావిస్తరణ మరియు సంస్కరణ, ఐ సి యస్ పరీక్షల్ని ఇంగ్లాండులోను, ఇండియాలోను ఒకే సారి జరిపించడం, ఆయుధ చట్టాన్ని సులభతరం చేయడం వంటి కోరికల్ని ప్రభుత్వం ఆమోదించాలని జాతీయ కాంగ్రెసు కోరేది  కాంగ్రెసు సమర్పించిన విన్నపాల్ని, మహజర్ని బ్రిటీషు అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకుండా వుండేసరికి ఆంగ్లేయుల ఉదారవాదంలో నమ్మకమున్న కాంగ్రెసు నాయకులకు సైతం అసంతృప్తి కలిగింది.  విద్యావంతుల్లోని ఒక వర్గం బాలగంగాధర తిలక్ నాయకత్వంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో ఒక కొత్త చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించింది  మహారాష్ట్రలో గణేశ ఉత్సవాల్ని, శివాజీ పండుగల్ని జరిపించి ప్రజల్లో జాతీయ భావాన్ని రేకెత్తించగల్గాడు తిలక్.

తిలక్ ద్వారా వ్యక్తమయిన ఆందోళన, అసంతృప్తి జ్వాలలు ఆంధ్ర దేశంతో పాటు దేశంలోని చాల ప్రాంతాల్లో విస్తరించాయి  ఆసియా దేశమైన జపాను రష్యాపై సాధించిన విజయం భారతీయుల్లో జాతీయ భావం ఉద్భృతం కావడానికి మూలకారణమని చెప్పవచ్చు  ఈ విజయంతో తాము కూడ ఏదోఒకరోజు స్వాతంత్ర్యాన్ని సాధించగలమన్న ఆత్మవిశ్వాసం భారతీయులకు కలిగింది  జపాను సాధించిన విజయంవల్ల ఆదేశంపై ఆంధ్రదేశంలో కూడ ఆసక్తి పెరిగింది. ఆనాటి ప్రసిద్ధ సంఘ సంస్కర్తయైన అడిపూడి సోమనాధరావు జపానుదేశ చరిత్రను తెలుగులో రచించి మునగలరాజాకు అంకితం చేశాడు  శ్రీరాం వీరబ్రహ్మం 'జపానీయము' అను తెలుగు నాటికను రచించాడు  జపాను సైన్యాధిపతి 'తోగో' పేరును, నావికాదళాధిపతి 'నోగి' పేరును మునగలరాజా తన కుమారుల కిద్దరికి పెట్టాడు.

పాలనా పరమైన సౌకర్యంమిషతో 1905లో ప్రభుత్వం చేపట్టిన బెంగాలు విభజన భారత జాతీయోద్యమానికి ఒక కొత్త రూపు నిచ్చిందని చెప్పవచ్చు. బెంగాలులోని విద్యావంతుల ఐక్యమత్యాన్ని దెబ్బతీసి హిందు ముస్లింల మధ్య భేదాభిప్రాయాల్ని సృష్టించడమే బెంగాలు విభజన యొక్క ముఖ్య ఉద్దేశము.

మొదట ఉద్దేశించిన బెంగాలు విభజన ప్రణాళికలో ఒరియా భాషను మాట్లాడే ప్రాంతాలన్నింటిని ఒకే పాలనలోకి తేవాలన్న ప్రతిపాదన కూడా

వుంది ఇందువల్ల గంజాం జిల్లాలో కొన్ని ప్రాంతాల్ని విశాఖపట్నం జిల్లాలోని ఏజన్సీ ప్రాంతాన్ని మద్రాసు రాష్ట్రం నుండి వేరు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది ఈ ప్రాంతాల్ని వదలు కోవడానికి ఆంధ్రులు విముఖతను చూపడమే కాక మొత్తం బెంగాలు విభజన ప్రతిపాదననే వ్యతిరేకించారు ఒరియా ప్రాంతాలన్నింటిని కలిపి ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ఆంధ్రులు వ్యతిరేకులు కాకపోయినా గంజాం జిల్లాలోని తెలుగు ప్రాంతాల్ని వదలుకోడానికి ఇష్టపడలేదు 1903 డిసెంబరులో భారత జాతీయ కాంగ్రెసు బెంగాలు విభజనను, గంజాంజిల్లా మొదలగు ప్రాంతాల్ని మద్రాసు రాష్ట్రంనుండి వేరు చేసే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది మద్రాసు ప్రభుత్వం కూడ ఉత్తర జిల్లాలవేర్పాటుకు తన వ్యతిరేకతను తెల్పింది హిందూ, మద్రాసు స్టాండర్డు, స్వదేశమిత్రన్, షామ్సుల్ అక్బర్ వంటి ప్రముఖ పత్రికలు కూడ బెంగాలు విభజనను, గంజాం మొదలైన ప్రాంతాల్ని మద్రాసు రాష్ట్రంనుండి వేరు చేయడాన్ని వ్యతిరేకించాయి బెంగాలు గవర్నరయిన సర్ ఆంధ్రూ ఫ్రాజర్ కూడ గంజాం మొదలయిన ప్రాంతాల్ని మద్రాసు రాష్ట్రం నుండి వేరు చేయడాన్ని వ్యతిరేకించాడు ఈ ప్రాంతాల్లో తెలుగు మాట్లాడే ప్రజలు అత్యధికులు ఉన్నందువల్ల బెంగాల్ రాష్ట్రంలో సైతం వీరి ప్రయోజనాలకు దెబ్బ తగులు తుందని ఫ్రాజర్ భావించాడు ఈ విధంగా గంజాం మొదలైన ప్రాంతాల మార్పిడికి తీవ్రమైన వ్యతిరేకత ఎదురవడంతో భారత ప్రభుత్వం ఈ క్రింది అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ గంజాం మార్పిడి ప్రతిపాదనను విరమించుకుంది

"ఈ మార్పిడి భాష, జాతి పరమైన తీవ్రసమస్యలకు తావు కల్పించేప్రమాదం వుంది భౌగోళిక వైరుధ్యం వల్ల న్యాయపరమైన ఏర్పాట్లలో అస్తవ్యస్తత చోటు చేసుకోవచ్చు ఈ ప్రాంతానికి ప్రత్యేక భూమి శిస్తు వుండడంవల్ల అది ఏనియమాలపై ఆధారపడి పని చేస్తున్నదో తెలియని అధికారులకు విధినిర్వహణలో సమస్యలు తలెత్తవచ్చు అదీగాక శిస్తుకు సంబందించిన రికార్డులు చాలవరకు స్థానిక భాషలోనే వుండడంవల్ల వాటి వివరాలు తెలుసు కోవడం కూడ భాషరాని ఈ అధికారులకు కష్టమైన పని భవిష్యత్కార్య కలాపాల్ని స్థానిక భాషలో నిర్వహించడం కూడ వీరికి సాధ్యం కాదు"

బీహారు, ఒరిస్సా సంయుక్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత గంజాంలోని ఒరియా నాయకులు గంజాం మొదలగు ప్రాంతాల్ని మద్రాసు నుండి వేరు చేసి కొత్త రాష్ట్రంలో కలపాలని ఆందోళన సాగించారు కాని 1912లో భారత ప్రభుత్వం ఈ ప్రాంతాల్ని కలిపే ప్రతిపాదన 'అనవసరమే కాక కోరదగింది కూడ కాదని' నిర్ద్వందంగా ప్రకటించింది తర్వాత ఒరియా నాయకులు సర్ ఆర్థర్ లాలీ, లార్డు కార్‌మైకేల్, లార్డు పెంట్‌లాండ్ వద్దకు రాయభారం వెళ్లగా వారుకూడ ఈ విషయాన్ని తిరిగి పరిశీలించే ప్రశ్నలేదని చెప్పారు ఈ విషయమై సచ్చిదానంద సిన్హ కేంద్ర అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ప్రవేశ పెట్టినప్పుడు భారత ప్రభుత్వం దీన్ని పరిశీలించడానికి హామీ ఇచ్చిందేగాని తీర్మానాన్ని ఆమోదించలేదు

## ఆంధ్రదేశంలో వందేమాతరం ఉద్యమం

1905 బెంగాలు విభజనతో భారత స్వాతంత్ర్యోద్యమము ఒక కొత్త మలుపు తిరిగింది బెంగాలు విభజనను రద్దు చేయాలంటూ బెంగాలులో సురేంద్రనాథ బెనర్జీ నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమైంది అంగళ్ళముందు పికెటింగు జరపడం, విదేశీ వస్త్రాల్ని తగుల బెట్టడం వంటి కార్యక్రమాలు సాధారణమైపోయాయి ఈ ఉద్యమమే స్వదేశీ ఉద్యమంగా ప్రసిద్ధి చెందింది. బాగంగాధర తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ వంటి కొత్త నాయకులు జాతీయ రంగంపైకి వచ్చి స్వరాజ్యోద్దేశాన్ని ప్రజల ముందుంచగల్గారు. దేశం నలుమూలలా వందేమాతరం నినాదాలు మారు మ్రోగాయి ఈ గీతాన్ని ప్రసిద్ధ బెంగాలీ రచయిత బంకిం చంద్ర చటర్జీ రచించాడు ఈ గీతాన్ని పుండుపై చల్లిన కారంగా ప్రభుత్వం భావించింది

1906-11 మధ్య కాలంలోని ఆంధ్ర రాజకీయాలపై వందేమాతరం ఉద్యమం తన ప్రభావాన్ని చూపింది స్వదేశీ ఉద్యమ ఆదర్శాల్ని, స్వదేశీ వస్తువుల విక్రయాన్ని గూర్చి ప్రచారం చేసేందుకు 1906లో మద్రాసులోని కొందరు ప్రముఖులు పరిశ్రమల సంఘాన్ని (Industrial Association) స్థాపించారు ఒక స్వదేశీ సమితిని కూడ ఏర్పాటు చేశారు ఈ సమితి న్యాయవాదియైన న్యాపతి సుబ్బారావు, జర్నలిస్టు అయిన కె.వెంకటమరణరావును

ఆంధ్ర దేశంలో స్వదేశీ ఉద్యమ ఆశయాల్ని ప్రచారం చేసేందుకు పంపింది గ్లాసులు తయారు చేసే విధానాన్ని నేర్చుకు నేందుకు ఒక విద్యార్థిని జపాను దేశానికి పంపడానికి కర్నూలులో చందాలు వసూలుచేశారు 1906లో బెంగాలులోని బారీసాల్‌లో ఒక సమావేశానికి హాజరవుతున్న సురేంద్రనాథ బెనర్జీని అరెస్టు చేయడంవల్ల దేశంలో చాల ఉద్రిక్తత నెలకొనింది ఆంధ్రదేశంలోని రాజమండ్రి, కాకినాడ, విజయనగరం, గుత్తి వంటి పట్టణాల్లో బెనర్జీ అరెస్టు పట్ల నిరసన వ్యక్తం చేస్తూ సభలు, సమావేశాలు నిర్వహించారు ఈ సభల్లోనే వందేమాతరం-మనదేరాజ్యం వంటి నినాదాలు పుట్టడం, వందేమాతరం గీతం ఆంధ్రదేశం అంతా ప్రచారం పొందడం జరిగింది

## ఆంధ్రదేశంలో బిపిన్ చంద్రపాల్ పర్యటన

1907 ఏప్రిల్లో బిపిన్ చంద్రపాల్ తీరాంధ్ర దేశంలో పర్యటించడంతో ఆంధ్రదేశంలో వందేమాతరం ఉద్యమం ఊపు అందుకుంది మచిలీపట్నం నుండి వెలువడే కృష్ణాపత్రిక సంపాదకుడు ముట్నూరి కృష్ణారావు ఆధ్వర్యంలో పాల్ పర్యటన జరిగింది బిపిన్ చంద్రపాల్ మొదట విజయనగరం, విశాఖ పట్నాలని సందర్శించాడు అయితే ఈ పట్టణాల ప్రజల్ని అంతగా ప్రభావితం చేయలేక పోయాడు తర్వాత ఏప్రిల్ 17న కాకినాడను సందర్శించాడు అక్కడ తన మొదటి ఉపన్యాసాన్ని వేదాంతంపైన, రెండవ ఉపన్యాసాన్ని స్వరాజ్యాన్ని గూర్చి ఇచ్చాడు స్వరాజ్యమే జాతీయ ఉద్యమోద్దేశమని, స్వరాజ్య సాధనలో బహిష్కారం అనేది ఒక పనిముట్టు అని పాల్ సెలవిచ్చాడు

బిపిన్ చంద్రపాల్ ఏప్రిల్ 19 నుండి 24 వరకు రాజమండ్రిలోనే వుండి అయిదు ఉపన్యాసాల్ని ఇచ్చాడు రాజమండ్రి సాంస్కృతిక కేంద్రం కావడంచేత పాల్‌కు అక్కడ విశేషమైన ఆదరణ లభించింది రాజకీయంగా కూడ రాజమండ్రి అగ్రస్థానం వహించింది 1907 ఫిబ్రవరిలో రాజమండ్రి పట్టణ యువత స్వదేశీ ఉద్యమాన్ని విశేషంగా ప్రచారం చేసేందుకు బాలభారతి సమితిని స్థాపించింది. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుసోదరుడు గంట లక్ష్మన్న, కంచుమర్తి రామచంద్రరావు, చిలుకూరి వీరభద్రరావు వంటి పట్టణ ప్రముఖులు బాలభారతి సమితిలో సభ్యులుగ వుండేవారు. రాజమండ్రి కరణమైన గున్నేశ్వరరావు

కూడ ఈ సమితిలో సభ్యుడై దీని కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవాడు బిపిన్ చంద్రపాల్ స్వరాజ్యం, స్వదేశీ, బహిష్కరణ, బ్రహ్మ సమాజం వంటి విషయాలపై ఉపన్యాసాలివ్వడమేకాక గోదావరి స్వదేశీ స్టోరును ప్రారంభించాడు రాజయండ్రిలో ఒక జాతీయ పాఠశాలను ప్రారంభించి దీన్ని బెంగాలు జాతీయ విద్యాకేంద్రానికి అనుబంధ సంస్థగ రూపొందించేందుకు గున్నేశ్వరరావు 1000/- రూపాయల విరాళాన్ని బిపిన్ చంద్రపాల్‌కు ఇచ్చాడు.

పాల్ రాజమండ్రి నుండి విజయవాడకు చేరుకుని అక్కడ మునగల రాజా అతిధిగా వుంది రెండు సభల్లో ప్రసంగించాడు మొదటి సభలో వేదాంతాన్ని గూర్చి, స్వాతంత్ర్య సందేశాన్ని గూర్చి వివరించాడు. రెండవ సభలో స్వదేశీ ఉద్యమాన్ని గూర్చి ఉపన్యసించాడు

తర్వాత పాల్ మచిలీపట్నం వెళ్ళాడు. అక్కడ ఆయనకు ఘనమైన స్వాగతం లభించడమే గాక ఆయన ఉపన్యసించిన సభలకు వేలసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు ఆయన స్వదేశీ, బహిష్కరణ, జాతీయ విద్య, స్వరాజ్యం వంటి అంశాలపై ఉపన్యసించాడు చివరిదైన 'మాతృమూర్తి' అనే ఉపన్యాసంలో వందేమాతరం పుట్టుక గూర్చి, ఆగీతం యొక్క అర్థాన్ని గురించి వివరించాడు కాళి, దుర్గల పూజా విధానంలోని గూఢార్థాన్ని కూడ వివరించాడు తన వుపన్యాసాన్ని ముగిస్తూ రాజమండ్రిలో ఏర్పాటయిన ఆంధ్ర జాతీయ విద్యాకమిటీకి ఉదారంగ విరాళాలివ్వాలని విజ్ఞప్తి చేశాడు ఎందేమాతరం బ్యాడ్జీలను ధరించి నందుకు రాజమండ్రి ప్రభుత్వ కళాశాల నుండి బహిష్కరింపబడిన విద్యార్థులకై జాతీయ పాఠశాలను, కళాశాలను స్థాపించడం కోసం ఈ ఆంధ్రజాతీయ విద్యాకమిటి ఏర్పడింది

పాల్ పర్యటన రెండు మంచి ఫలితాల్నిచ్చింది ఒకటి 'యువకుల స్వరాజ్య సమితి' ఏర్పాటు కావడం, మరొకటి మచిలీపట్నంలో జాతీయ పాఠశాల ఏర్పాటుకు ఒక కమిటీ ఏర్పడడం తర్వాత ఆంధ్రజాతీయ కళాశాల ఏర్పడడం, దీనికి ప్రిన్సిపాలుగ కోపల్లి హనుమంతరావును నియమించడం జరిగింది. ఆంధ్రదేశపర్యటన ముగించుకున్న తర్వాత పాల్ మే 1న మద్రాసుకు బయలుదేరి వెళ్ళాడు పాల్ ఆంధ్రదేశపర్యటన గొప్ప విజయంగా బావించవచ్చు.

తీరాంధ్ర దేశంలోని రాజకీయ వా‌ా పరగానికి మరింత వేడెక్కించి వెళ్ళాడు పాల్ పర్యటన తర్వాత రాజమండ్రి ... ీపట్నాలు ఆంధ్రదేశంలోని స్వదేశీ ఉద్యమానికి ముఖ్య కేంద్రాలుగా రూ... ...ాయి

## రాజమండ్రి కాలేజి సంఘటన

బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలు రాజమండ్రి విద్యార్థులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి వందేమాతరం బాడ్జీలను ధరించడం ద్వారాను, 'వందేమాతరం' అని ఒకరికొకరు అభివందనం చేసుకోవడం ద్వారాను విద్యార్థులు తమ జాతీయ భావాల్ని ప్రకటించారు రాజమండ్రి ప్రభుత్వ కళాశాల మరియు ట్రెయినింగ్ కళాశాల ప్రిన్సిపాలుఅయిన మార్క్ హంటర్ ఆ కాలంలోని ఇతర ఆంగ్లేయుల్లాగానే వందేమాతరంకు రాజకీయ ప్రాధాన్యం గలదని బావించాడు పాల్ పర్యటనకు దాదాపు ఒకనెలకు ముందే 1907 మార్చి 19న విద్యార్థుల్ని సమావేశపరచి వందేమాతరం బ్యాడ్జీలు ధరించడం గాని, నినాదాలు ఇవ్వడంగాని చేయకూడదని ఆదేశించాడు

అయినప్పటికి ట్రెయినింగు కాలేజి విద్యార్థి అయిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఏప్రిల్ 24న పాల్‌కు స్వాగతోపన్యాసాన్ని సమర్పించాడు తన ఆదేశాల్ని ధిక్కరించినందుకు విద్యార్థులకు గుణపాఠం చెప్పాలని మార్క్ హంటర్ నిర్ణయించాడు కాలేజీలోని 222 మంది విద్యార్థుల్లో 138 మంది విద్యార్థుల్ని రెండుసంవత్సరాల పరీక్షలు రాయడానికి అనర్హులుగ ప్రకటించాడు ప్రిన్సిపాలు చర్యను గవర్నరు కూడ ఆమోదించాడు హరి సర్వోత్తమరావును ప్రభుత్వ సంస్థలో గాని ప్రభుత్వ సహాయం పొందే సంస్థలోగాని టీచరు ఉద్యోగానికి అనర్హుడుగ ప్రభుత్వం ప్రకటించింది తర్వాత కొన్నాళ్ళకు ప్రభుత్వంలోని ఏ ఉద్యోగానికి అర్హుడు కాదని ప్రకటించింది దీంతో హరిసర్వోత్తమరావు ప్రజాజీవితంలోకి ప్రవేశించి గ్రంధాలయోద్యమానికి, వయోజన విద్యావ్యాప్తికి ఎనలేని సేవలందించారు ఆంధ్ర విద్యార్థుల భారత జాతీయోద్యమ ప్రవేశానికి రాజమండ్రి కాలేజి సంఘటన చక్కటి ప్రారంభంగ పరిణమించింది

వందేమాతరం ఉద్యమం ఆంధ్రదేశంలో రాజకీయ చైతన్యాన్ని కలిగించడమే కాక జాతీయ విద్యా సంస్థల స్థాపనకు దోహదపడింది పారిశ్రామిక శిక్షణ

పొందేందుకు చాల మంది యువకులు జపాను దేశాన్ని పర్యటించి వచ్చారు దేశంలోని వివిధ ప్రాంతాల్లో రహస్య తీవ్రవాద సంస్థలు ఏర్పడడం ఈ ఉద్యమ ప్రభావ ఫలితమేనని చెప్పవచ్చు అయితే ఆంధ్రదేశంనుండి ఒక్క దర్శి చెంచయ్య మాత్రం కొన్నాళ్ళ పాటు గద్దరు పార్టీ సభ్యుడుగ కొనసాగాడు

1910 కల్లా వందేమాతరం, స్వదేశీ ఉద్యమాలు తమ ఉద్యమ స్ఫూర్తిని కోల్పోసాగాయి ఇప్పటినుండి జాతీయోద్యమానికి మితవాదులు నాయకత్వం వహించారు. అతివాద జాతీయోద్యమాన్ని నడిపిన తిలక్, పాల్, అరవింద వంటి వారు తెరమరుగయ్యారు తిలక్‌ను ప్రభుత్వం మాండలే జైలులో వుంచింది. బిపిన్ చంద్రపాల్ కూడ అరెస్టు చేయబడ్డాడు అరవింద పాండిచ్చేరిలో స్థిరపడి ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపాడు ఆంధ్రదేశంలో సైతం రాజకీయ నాయకత్వం కొండా వెంకటప్పయ్య, బి ఎన్ శర్మ వంటి మిత వాద నాయకుల చేతుల్లోకి వచ్చింది

# 8

# ఆంధ్రోద్యమం – ఆవిర్భావం

వందేమాతరం, స్వదేశీ ఉద్యమాలు ఆంధ్రుల్లో వారి భాషా సాహిత్యాలపైనా, గత చరిత్రపైన జిజ్ఞాసను కలిగించాయి. 1910లో విజ్ఞాన చంద్రికా మండలి 'ఆంధ్రుల చరిత్రము' అనే గ్రంథాన్ని ప్రచురించింది ఈ గ్రంథం విశేష ప్రచారంలోకి వచ్చింది రాజ్యస్థాపనలోగాని, మేధాసంపత్తిలోగాని, నాగరికతలో గాని తమ పూర్వీకులు ఇతరులకంటె ఏమాత్రం తక్కువవారు కాదని ఆంధ్రులు గ్రహించగల్గారు

తమ పూర్వీకుల గొప్పతనాన్ని తెలుసు కోవడమే కాక నేటి తమవెనుక బాటు తనాన్ని కూడ ఆంధ్రులు గ్రహించారు మద్రాసు రాష్ట్రంలోని 40 శాతం ప్రజలు, 58 శాతం భూభాగం తెలుగు జిల్లాలకే చెందినప్పటికి ఈ ప్రాంతపు రాజకీయాల్లో తెలుగు వారికి ప్రాధాన్యత లేకపోయింది తమ వెనుక బాటు తనంతోపాటు తమిళుల ఎత్తిపొడుపు మాటలు కూడ ఆంధ్రుల మనస్సును నొప్పించాయి. ఒక ఆంధ్ర పట్టణం నుండి మద్రాసుకు వెళుతున్న ఒక తమిళ ప్రయాణీకుడు తనతోటి ఆంధ్ర ప్రయాణీకుడితో అన్నమాటలు ఆంధ్రుల్ని కలవర పరచాయి తెలుగువారు వెనుకబడిన జాతి అని, వారికి తెలివి తేటలు సున్నఅని, భాష్యం అయ్యంగార్, ముత్తు స్వామి అయ్యరు వంటి ప్రముఖులు తెలుగువారిలో మచ్చుకైనా లేరని తమిళ ప్రయాణీకుని మాటల సారాంశము. 1911 ఏప్రిల్ నెల ద్వితీయార్థంలో తెలుగు ప్రజల సమకాలీన పరిస్థితిని వివరిస్తూ ఒక పత్రికా రచయిత 'హిందూ పత్రిక'లో ఆరువ్యాసాల్ని వరుసగా ప్రకటించాడు. ఈవ్యాసాల్లో మద్రాసు రాష్ట్రంలోని సివిలు సర్వీసు ఉద్యోగాల్లో

ఆంధ్రేతరులు 56 మంది వుండగా తెలుగువారి సంఖ్య కేవలం 8 మాత్రమే. న్యాయవిభాగంలో 19 మంది ఆంధ్రేతర జిల్లా న్యాయమూర్తులుండగా తెలుగువారు ఒక్కరు కూడ లేరు అదీగాక బాపట్ల, మచిలీపట్నం, నరసాపురం, రాజమండ్రి, విశాఖపట్టణం, పర్లాకిమిడి వంటి ఆంధ్రపట్టణాల్లో వున్న విద్యాకేంద్రాల అధికారులు కూడ ఆంధ్రేతరులేనని ఆపత్రికా రచయిత స్పష్టంచేశాడు దీనికి ఆయన ఆంధ్ర నాయకుల్నే తప్పుపట్టాడు. ఈ పత్రికా రచయిత ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని ప్రత్యక్షంగా ప్రబోధించకపోయినా, తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడే ఆంధ్రుల వారి అభివృద్ధిపైనమ్మకం వుంచుకోవచ్చని ఆ వ్యాసాల ద్వారా స్పష్టంచేశా ు.

ఈ వ్యాసాల ప్రచురణకు, రెండు నెలల ముందు గుంటూరు నుండి వెలువడే 'దేశాభిమాని' అనే ఒక ఆంగ్లో-ఇండియను వారపత్రిక ఒక పెద్ద సంపాదకీయాన్ని వ్రాస్తూ తెలుగు ప్రజల్లో ఐక్యమత్యాన్ని సాధించేందుకు, వారి సమస్యల్ని చర్చించేందుకు ఒక ప్రత్యేక రాజకీయ సమావేశాన్ని ఏర్పాటు చేయడం అత్యవసరం అని భావించింది.

'దేశాభిమాని'లోని సంపాదకీయము, హిందూ పత్రికలో వెలువడిన వ్యాసాలు ఆంధ్రుల్లో గొప్ప చైతన్యాన్ని కల్గించాయి. మద్రాసు రాష్ట్రంలో తమ భవిష్యత్తు ఏమిటో గ్రహించగల్గారు. 1911 చివరికల్లా ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలనే వారి సంఖ్య పెరిగిపోయింది. 1911 డిశంబరులో ఒక పత్రికా రచయిత 'దేశాభిమాని' ద్వారా తన అభిప్రాయాన్ని ఇలా ప్రకటించాడు.

"తెలుగు మేధా సంపత్తి త్వరగా నశించిపోతున్నది. ఈసంపత్తి పూర్తిగ తెరమరుగు కాకుండా ప్రభుత్వం తన బాధ్యతల్ని నిర్వహించాలి. ఈ కార్యం తెలుగువారికి ప్రత్యేక ప్రభుత్వం ఏర్పడినప్పుడే సాధ్యమౌతుంది".

పై అభిప్రాయం వెలువడిన మరోవారం రోజులకే సి. శేషగిరిరావు అను పత్రికా రచయిత 'దేశాభిమాని'కి అనేక వ్యాసాలు వ్రాస్తూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటును గట్టిగ సమర్థించాడు. "మనసులోని భావాన్ని వ్యక్తం చేసేది భాష. ఒక ఉమ్మడి భాష మనుషుల స్వతంత్ర భావప్రవాహానికి తోడ్పడటమేగాక ప్రేమాభిమానాల్ని పెంపొందించి వారిని కలిసి కట్టుగ ఉంచుతుంది ఒక భాషా

సాహిత్యం అభివృద్ధి చెందడం అంటే ఆ భాషను మాట్లాడే ప్రజలు కూడ అభివృద్ధిని సాధించినట్లే లెక్క. అయితే ప్రతివిషయమూ అభివృద్ధికి దోహదం చేయగల పరిస్థితులపై ఆధారపడి వుంటుంది

కాబట్టి ఆంధ్రుల అభివృద్ధికి కూడ సానుకూల పరిస్థితుల్లేవని ఆయన అభిప్రాయపడ్డాడు మద్రాసు రాష్ట్రరాజధానియైన మద్రాసు నగరం ఆంధ్రదేశానికి అవతలి ప్రాంతంలో వుండడమే అభివృద్ధికి ప్రతికూల పరిస్థితి అని ఆయన భావించాడు ఇదేగాక ఆంధ్రులు మరో రెండు రకాలుగ నష్ట పోయారని చెప్పవచ్చు తమను పాలించే అధికారులకు తెలుగు భాష పూర్తిగ తెలియక పోవడం మొదటిది కాగా ఈ అధికారులకు సహాయకులుగానియమింపబడ్డ ఉద్యోగులంతా ఆంధ్రేతరులు కావడం రెండవది. ఈ విధంగా తెలుగు ప్రజల కష్టసుఖాల్ని ప్రభుత్వ దృష్టికి తెచ్చేవారే లేకపోయారు. శేషగిరిరావు ఇంకా ఇలా అభిప్రాయపడ్డాడు.

"ఆంధ్రులకు అవకాశాలు కల్పించి అభివృద్ధి పథంవైపు నడిపించే వరకు వారు గొప్ప జాతిగ రూపొందలేరు దక్షిణ రాష్ట్రంలోని వివిధ జాతుల్లో తాము ఒక్కరుగ వున్నంత వరకు ఆంధ్రులు పురోభివృద్ధి చెందలేరు. వారికి ఒక ప్రత్యేకమైన అస్థిత్వాన్ని ఇతరులు గుర్తించేటట్టు చేయాలి బెంగాలీలవలె, మహారాష్ట్రుల వలె అభివృద్ధి చెందాలంటే ఆంధ్రులకు కూడ వారికున్న అవకాశాల్ని, సౌకర్యాల్ని కల్పించాలి. . తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసి తెలుగు జిల్లాల మధ్య భాగంలో రాజధానిని ఏర్పాటు చేయడమే తక్షణ కర్తవ్యంగ భావించాలి".

శేషగిరిరావు తన వ్యాసాల్ని ముగిస్తూ తెలుగు పత్రికలు ఈ విషయాన్ని సరియైన అవగాహనతో స్వీకరించి తమ అభిప్రాయల్ని ప్రకటించగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు కృష్ణా, గోదావరి జిల్లాల సంయుక్త సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి ఒక తీర్మానాన్ని ఆమోదించాలని కూడ ఆయన కోరాడు.

శేషగిరిరావుగారి వ్యాసాలు అనుకున్న ఫలితాన్నిసాధించాయని చెప్పవచ్చు. బొంబాయి నుండి వెలువడే ఆంధ్ర పత్రిక, మచిలీపట్నం నుండి వెలువడే కృష్ణా పత్రికవంటి ముఖ్య పత్రికలు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోరికను బల

పరిచాయి 1912 నుండి ఆంధ్రోద్యమం కొత్త శక్తిని పుంజుకుంది. కేవలం ప్రత్యేక రాష్ట్రం కావాలని అభిప్రాయం వ్యక్తం చేసినంత మాత్రాన ఫలితాన్ని సాధించలేమని భావిస్తూ కార్యసాధనలో చేపట్టాల్సిన వివిధ పద్ధతుల్ని, కార్యక్రమాల్ని, 'దేశాభిమాని' వివరించింది:

"పాలకులు మన కోరికను సమంజసమైనదని భావించే విధంగా మన కోర్కెను వ్యక్తపరచాలి ఆంధ్రదేశమంతా ఆందోళనా కార్యక్రమాల్ని చేపట్టాలి సభలు ఏర్పాటు చేయాలి ఈ కోర్కెను సమావేశాల్లో సరియైన దృక్పథంతో చర్చించాలి పలుకుబడిగల ఆంధ్ర ప్రజా ప్రతినిధి వర్గం ప్రభుత్వంతో రాయబారం నడపాలి ఇటువంటి అత్యవసర కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఒక తీర్మానాన్ని ఆమోదించాలని మనజిల్లా సభను మేము కోరుతున్నాము రాబోయే కృష్ణా-గుంటూరు జిల్లా సభా సమావేశంలో పరిశీలించేందుకు ఈ విషయాన్ని సభముందుంచాలని కూడ మేము కోరుతున్నాము ఈ విషయమై తెలుగు పత్రికలు తనకేమీ పట్టనట్లు వ్యవహరించవని నమ్ముతున్నాము ఈ ప్రతికలు సామ్రాజ్యవాద, ప్రపంచ రాజకీయాలకు ఇచ్చే ప్రాధాన్యతను తగ్గించి, ఆంధ్రుల అభివృద్ధిని దెబ్బతీస్తున్న విషయంపై తమ దృష్టిని మళ్ళించగలవని కూడ మేము నమ్ముతున్నాము తమ కర్తవ్య నిర్వహణలో పూర్తి బాధ్యతను నిర్వహించలేక పోవడం వల్లనో లేక షేక్స్పియరు కథానాయకుడైన హామ్లెట్ వలె , చేద్దామా వద్దా అనే సందిగ్ధావస్థలో పడడం వల్లో మన తెలుగు పత్రికలు ధారాళంగా తమ అభిప్రాయాల్ని వ్యక్తీకరించలేక పోతున్నాయి"

" ఈ విషయంలో మనం మన బీహారు సోదరుల నుండి నేర్చుకోవలసింది ఎంతైనా వుంది. తమ కంటూ ప్రత్యేకమైన హై కోర్టు, విశ్వవిద్యాలయం వంటివి ఏర్పాటు చేయాలని చైతన్య పూరితమైన ఉత్సాహంతో తమ సహజమైన ఉద్రేకాన్ని పత్రికాముఖంగా, సభావేదికలమీద ప్రదర్శిస్తున్నారు మన ఆంధ్రసోదరులు తమ బద్ధకాన్ని వదలి అభివృద్ధి పథం వైపు నడుస్తున్న భారత దేశంలో తమ కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోగలరని ఆశిస్తున్నాను".

పత్రికా ముఖంగా విశేషంగా చర్చించబడి ప్రాచుర్యాన్ని పొందడంతో 1912 మే నెలలో వి రామదాసు అధ్యక్షతన నిడుదవోలులో ఏర్పాటు చేసిన

గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల సంయుక్త సమావేశంలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర విషయం ప్రస్తావనకు వచ్చింది అయితే ఈ అంశానికి సంబంధించిన తీర్మానం సక్రమంగా లేదని సభాధ్యక్షుడు భావించాడు ఈ అంశం ఆంధ్రులందరికి సంబంధించింది కాబట్టి ఇటువంటి ప్రాంతీయ సమావేశాల్లో చర్చించ కూడదని సమావేశపు ప్రతినిధుల్లో ఒకరైన సి నరసింహారావు భావించాడు మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలన్నింటికి ప్రాతినిధ్యం వహించే విధంగా ఒక ఆంధ్ర సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన భావించారు కొండా వెంకటప్పయ్యతో సహా చాలమంది ప్రతినిధులు నరసింహారావు సలహాను ఆమోదించారు గుంటూరుకు తిరిగివచ్చిన తర్వాత కొండా వెంకటప్పయ్య ఈ ఆంధ్ర సమావేశాన్ని గూర్చి స్థానిక ప్రముఖులైన వి భావనాచార్యులు, ఉన్నవ లక్ష్మీనారాయణ, సి శేషగిరిరావు, జె గురునాథం వంటి వారితో చర్చించారు దీని ఫలితంగా వారు అఖిలభారత ఆంధ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు ఈ నిర్ణయాన్ని అమలుచేయడానికి కొండా వెంకటప్పయ్య కార్యదర్శిగ ఒకస్థాయీ సంఘం ఏర్పాటయింది ఈ సంఘం మొదటి ఆంధ్ర సమావేశాన్ని 1913 మే నెలలో బాపట్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది

సమావేశం తర్వాత ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర విషయమై ఇంగ్లీషు, తెలుగు వార్తాపత్రికల్లో ఆసక్తికరమైన చర్చ కొనసాగింది ఈ చర్చవల్ల స్పష్టమైన ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడింది తెలుగ, తమిళ అధికారుల మధ్య పరస్పరం ద్వేషభావం ఉండడంవల్ల ప్రత్యేక ఆంధ్రోద్యమానికి సరియైన సమయం ఆసన్నం కాలేదని కృష్ణా పత్రిక వ్యాసరచయిత ఒకరు భావించారు ఈ ఉద్యమం ద్వేషభావాన్ని మరింతగ పెంచుతుందేమోనన్న భయాన్ని ఆయన వ్యక్తం చేశాడు అందువల్ల అధికారంలోవున్న తమిళుల విషయమై ఇంకా ఐక్యమత్యం సాధించని ఆంధ్రులు జాగ్రత్తగ వ్యవహరించాలని హెచ్చరించాడు అయితే ఈ వాదనతో మరో పత్రికా విలేకరి ఏకీభవించలేదు. ఆంధ్రుల అభివృద్ధి ప్రయత్నాలపట్ల తమిళులు ఈర్ష్యను వహిస్తే అదివారి కుసంస్కారాన్ని చాటుతుంది. ఎటువంటి కవ్వింపులేకుండానే తమిళులు ఆంధ్రులకు అన్యాయం తలపెడితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని ఆయన భావించాడు.

'దేశమాత' అనే తెలుగు పత్రిక ఈ ప్రశ్నను సుదీర్ఘంగా చర్చించి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు సమంజసమైన కోరికే అని అభిప్రాయపడింది. ఆంధ్ర రాష్ట్రం తక్షణమే ఏర్పడకపోవచ్చు అయితే ఆంధ్రులు తమ ప్రయత్నాల్లో పట్టుదలను ప్రదర్శించాలి. పట్టుదలగల ప్రజలకు అసాధ్యమంటూ ఏదిలేదని కూడ ఈ పత్రిక అభిప్రాయపడింది.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కోరిక రానురాను బలం పుంజుకోవడంతో తమిళుల్లో రకరకాల ప్రతిస్పందనలు చోటు చేసుకున్నాయి. అనేక రకాల అడ్డుగోడలతో ఇప్పటికే భారతీయుల ఐకమత్యం దెబ్బతిన్న దన్న భావంతో హిందూ పత్రిక ప్రత్యేక ఆంధ్రోద్యమాన్ని బలపరచలేదు. కొంతమంది తమిళులు ఈ ఉద్యమాన్ని ఉద్యోగాల కోసం చేపట్టిందిగా అవహేళన చేయడానికి ప్రయత్నించారు. ఒక తమిళ పత్రికా విలేకరి హిందూ పత్రికలో ఇలా ప్రశ్నించాడు:

"ఈ ఆంధ్రరాష్ట్రానికి ఉన్నతాధికారుల్ని ఎక్కడ నుండి తెచ్చుకుంటారు? ఈ రోజు రాష్ట్రం ఏర్పాటు చేస్తే హైకోర్టు జడ్జీలను, కార్యనిర్వాహక సభ్యుల్ని ఎక్కడనుండి తెచ్చుకోగలరు? ఒకవేళ అందుబాటులో వున్నవారిని తీసుకుంటే వారు ఈనాడు అధికారంలో వున్నవారితో సమానంగా తమ శక్తి సామర్థ్యాల్ని ప్రదర్శించగలరా? అందువల్ల తమకంటూ ఒక చిన్న రాష్ట్రం కావాలని కోరుకోవడం కంటె ఆంధ్రులు తమ ప్రాంతం నుండి హైకోర్టు జడ్జీలను, కార్యనిర్వాహక సభ్యుల్ని మద్రాసు వంటి పెద్ద రాష్ట్రానికి అందించడం మంచిది"

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రావతరణకు తమ వ్యతిరేకతను తెలిపిన ఆంధ్రులుకూడ లేకపోలేదు. ఒక వేళ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే అది చిన్నదే కాకుండా ఒక చీఫ్ కమిషనరు అధికారంలోకి వస్తుందికాబట్టి దీన్ని వ్యతిరేకించాలని న్యాపతి సుబ్బారావు భావించాడు దీనకంటె గవర్నరు పాలనలోనే వుండడం మంచిదన్నాడు. ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడంవల్ల మిగిలిన భాషా ప్రాంతాలవారు కూడ అటువంటి కోరికలే కోరే ప్రమాదముందని సుబ్బారావు అభిప్రాయపడ్డాడు. అయితే డా॥ బి పట్టాభి సీతారామయ్య సుబ్బారావు అభిప్రాయంతో ఏకీభవించక-

'లార్డ్ లాండ్ హర్ట్స్, సర్ ఆర్థర్ లాలీ వంటి గవర్నర్ల పాలనలో వుండే కంటే సర్ హెన్రీకాటన్, లెఫ్టినెంట్ గవర్నరు సర్ జాన్ హెవెట్, సర్ ఆంతోనీ మాక్ డోనెల్, సర్ జేమ్స్ మెస్టన్ వంటి చీఫ్ కమీషనర్ల పాలనలో వుండడానికే నేను ఇష్టపడతాను" అని భావించాడు భాషా ప్రాతిపదికపైన రాష్ట్రాల ఏర్పాటుకు కూడ ఆయన స్వాగతం పల్కాడు మనల్ని, మనం నేర్చుకున్న భౌగోళిక స్థితిని తారుమారు చేసేవిధంగా మనదేశం యొక్క పాపటాన్ని గీయక తప్పదని ఆయన స్పష్టం చేశాడు

ఆంధ్ర సమావేశంలో ప్రస్తావనకు రాబోయే వివిధ అంశాల్ని వివరిస్తూ స్థాయీ సంఘం సంయుక్త కార్యదర్శులు 1912 సెప్టెంబరులో ఒక సర్క్యులర్ విడుదల చేశారు ఈ సర్క్యులరులో వివాదరహిత అంశాలైన ఆంధ్రుల ప్రయోజనార్థమై ఒక ఆంగ్ల దిన పత్రికను ప్రారంభించడం, ఆంధ్ర జిల్లాలకు ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయ స్థాపన, సైన్యంలో తెలుగు వాళ్ళ ప్రవేశాన్ని నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి నివేదించడం వంటివి చోటు చేసుకున్నాయి ఈ సర్క్యులరులో ఆంధ్ర రాష్ట్ర నిర్మాణాన్ని గూర్చి ఎటువంటి ప్రస్తావన చేయలేదు

## బాపట్ల ఆంధ్ర సమావేశం, 1913

అప్పటి మద్రాసు శాసన సభ్యుడైన బి ఎన్ శర్మ అధ్యక్షతన 1913మే 26న బాపట్లలో మొదటి ఆంధ్ర సమావేశం జరిగింది మద్రాసు రాష్ట్రంలోని అన్ని తెలుగు జిల్లాల నుండి దాదాపు 2000 మంది ప్రేక్షకులు, 800 మంది ప్రతినిధులు మొదటి సమావేశానికి హాజరయ్యారు హైదరాబాదు, వరంగల్లు, నాగపూర్ నుండి గూడ ప్రతినిధులు హాజరుకావడం విశేషం తన అధ్యక్షోపన్యాసంలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటును గూర్చి ప్రస్తావిస్తూ ఆంధ్రోద్యమంవల్ల ప్రస్తుతానికి మేలుకంటె కీడు జరిగేఅవకాశం ఎక్కువగా వుందని భావించాడు సబ్జెక్టు కమిటీ సమావేశంలోను, బహిరంగ సమావేశంలోను ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుపై తీవ్రమైన చర్చలు జరిగాయి. బహిరంగ సమావేశంలో ఆంధ్ర రాష్ట్రఏర్పాటును కోరుతూ వి రామదాసు ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు ఈ ప్రతిపాదనను ఎన్ సుబ్బారావు, ఎమ్ ఆదినారాయణయ్య

ఎమ్ రామచంద్రరావు వంటి వృద్ధులు వ్యతిరేకించారు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనడం తొందరపాటు చర్యగా వారు భావించారు మూడు గంటల పాటు సాగిన తీవ్రమైన చర్చలో ప్రత్యేక ఆంధ్ర విషయాన్ని వచ్చే సమావేశంలో చర్చించవలసిందిగా తీర్మానానికి సవరణ తెచ్చారు. ఈ సవరణ తీర్మానం దాదాపు రెండు సంవత్సరాలుగ ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నిర్విరామంగా ప్రచారం చేస్తున్న కృష్ణ, గుంటూరు జిల్లాల ప్రతినిధులకు చాల అసంతృప్తిని కలిగించింది

ఈ సమావేశం వల్ల ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు రాయలసీమ జిల్లా ప్రతినిధులకు ఉత్తర జిల్లాలైన గంజాం, విశాఖపట్నం నుండి వచ్చిన ప్రతినిధులకు అంతగా ఇష్టంలేన్నట్లు స్పష్టమైంది అందువల్ల కొండా వెంకటప్పయ్య, డా పట్టాభి సీతారామయ్య, ఎమ్ కృష్ణారావు (కృష్ణా పత్రిక సంపాదకుడు), వి సూర్యనారాయణ రావులతో కూడిన ఒక కమిటి రాయలసీమ జిల్లాల్లో పర్యటించి నంద్యాల, గుత్తి, అనంతపురం, బళ్ళారి, చిత్తూరు, కడప, నెల్లూరు, పట్టణాల్లో బహిరంగ సభలు నిర్వహించి ఉపన్యాసాలు ఇచ్చారు ఈపర్యటనవల్ల ఈ ప్రాంత ప్రజలు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సుముఖులుగానే వున్నారని పైకమిటి సభ్యులకు అర్థమైంది మద్రాసు నగరంతో తమ సంబంధాల్ని వదలుకోవడం ఇష్టంలేని కొంతమంది చిత్తూరు తమిళ న్యాయవాదులు మాత్రమే ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటును వ్యతిరేకించారు కొండా వెంకటప్పయ్య ఉత్తర జిల్లాలలో కూడ పర్యటించి బరంపురం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రిల్లో బహిరంగ ఉపన్యాసాల్ని ఇచ్చాడు

బాపట్లలో జరిగిన మొదటి ఆంధ్ర సమావేశం తర్వాత ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటువిషయం వివిధ జిల్లా సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చింది విశాఖపట్నం జిల్లా సమావేశంలో అధ్యక్షస్థానంలో వున్న ఎమ్ సూర్యనారాయణ (విజయనగరం నివాసి) ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా మాట్లాడారు అయితే నెల్లూరు జిల్లా సమావేశానికి అధ్యక్షత వహించిన గాదె రాఘవరావు (బరంపురం నివాసి) ప్రత్యేకాంధ్ర విషయమై చాల జాగ్రత్తగ ఆలోచించి విధాన నిర్ణయం చేయాలని భావించాడు ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటు జరిగితే తన జన్మస్థలమైన

బరంపురం భవిష్యత్తు ఏమౌతుందోనన్న భయం వల్లే ఆయన పైవిధంగా అభిప్రాయపడ్డాడు అయితే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడకమునుపే బరంపురంను మద్రాసు రాష్ట్రం నుండి విడదీసి 1936లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన ఒరిస్సాలో కలిపారు బరంపురంలో తెలుగు వాళ్ల శాతం అధికమైనప్పటికి దక్షిణ ఒరిస్సాలో తగిన కేంద్ర పట్టణం లేనందువల్ల ఈ విలీనం తప్పని సరి అయింది

రెండవ ఆంధ్ర సమావేశం ఎస్ సుబ్బారావు అధ్యక్షతన 1914 ఏప్రిలు 11న విజయవాడలో జరిగింది ఇప్పటినుండే ఆంధ్ర సమావేశాన్ని ఆంధ్ర మహాసభగ వ్యవహరించడం జరిగింది అధ్యక్షోపన్యాసం ప్రతినిధుల్లో ఆందోళనను అసంతృప్తిని కలిగించింది అయితే మద్రాసు రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాల్ని ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తూ ఎం సూర్యనారాయణ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు ఈ తీర్మానాన్ని వి రామదాసు బలపరచగా అత్యధిక మెజారిటీతో సభ ఆమోదించింది.

1914 మేనెల్లో బి వెంకటపతిరాజు అధ్యక్షతన విశాఖ పట్నం జిల్లా సమావేశం జరిగింది రాజు తన అధ్యక్షోపన్యాసంలో ఈ విధంగా వ్యాఖ్యానించాడు.

"ఆంధ్ర మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం అవసరం అని ప్రముఖ నాయకులతోబాటు అందరూ ఒప్పుకోవడం నాకు చాల సంతోషాన్ని కలిగించింది ఒప్పుకోవడం అంటే అది మన ఆదర్శంగా మారినట్లే లెక్క మన ఆదర్శాన్ని సాదించే ఉద్యమాన్ని వాయిదా వేయడం అవివేకమే అవుతుంది"

ఇటువంటి తీర్మానాన్నే 1914 జూన్‌లో జరిగిన గుంటూరు జిల్లా సమావేశం ఆమోదించి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని కోరింది 1914 సంవత్సరాంతానికల్లా ఆంధ్రదేశంలోని మొత్తం ప్రజాభిప్రాయమంతా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం వైపే మొగ్గు చూపింది

## ఆంధ్ర మహాసభ మూడవ సమావేశం

1915 మే నెలలో రాజా పానుగంటి రామరాయ నింగార్ అధ్యక్షతన విశాఖ పట్నంలో జరిగిన మూడవ ఆంధ్ర మహాసభ సమావేశంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోర్కెను పునరుద్ఘాటించడమే కాక సెకండరీ పాఠశాలలన్నింటిలోను మాతృ

భాషలో విద్యా బోధన జరగాలని కోరడం జరిగింది సెకండరీ పాఠశాలల్లో మాతృభాషలో విద్యాబోధన జరగాలన్న కోర్కెకు మద్రాసు నుండి వెలువడే 'స్వదేశ మిత్రన్' అను తమిళ పత్రిక స్వాగతం పల్కింది ఆంధ్ర మహాసభ సమావేశాలు తెలుగులోనే ఉపన్యాసాలిచ్చే అలవాటును బహుళవ్యాప్తిలోకి తెచ్చాయి ఆంధ్ర మహాసభ నాల్గవ సమావేశం 1916 మే నెల్లో మోచర్ల రామచంద్రరావు అధ్యక్షతన కాకినాడలో జరిగింది రామచంద్రరావు కూడా న్యాపతి సుబ్బారావు లాగానే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సుముఖుడుకాడు విశాఖపట్నం నివాసియైన సి వి నరసింహరాజు "తెలుగు జిల్లా లన్నింటిని కలిపి పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి, అధికారాలుగల ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడం అవసరమే కాక న్యాయ సమ్మతమైందన్న తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా, "ప్రపంచయుద్ధం తర్వాత వీలయినంత త్వరలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరాల"ని మరో సవరణ ఎదురైంది ఈ సవరణ ఆమోదింపబడింది ఎ ఎస్ కృష్ణారావు (నెల్లూరు), నెమలి పట్టాభిరామారావు (కడప) మొదట తీర్మానాన్ని వ్యతిరేకించగా మూడు సంవత్సరాలకు ముందు నెల్లూరు జిల్లా సమావేశపు అధ్యక్షుడుగ ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటును వ్యతిరేకించిన గాడె రాఘవరావు (బరంపురం) ప్రత్యేక రాష్ట్ర తీర్మానానికి తన మద్దతు తెలిపారు అనంతపురం ప్రతినిధియైన ఎ శంకరరావు కూడ తీర్మానానికి మద్దతు ప్రకటించాడు.

1917 జూన్ 1 న కొండా వెంకటప్పయ్య అధ్యక్షతన ఆంధ్ర మహాసభ అయిదవ సమావేశం నెల్లూరులో జరిగింది ఈ సమావేశంలో తీవ్రమైన అలజడి రేగడంతో రాయసీమ, సర్కారుల మధ్యగల భేదాభిప్రాయాలు వెలుగులోకి వచ్చాయి ఆంధ్రోద్యమం ప్రారంభంనుండి కూడ నెల్లూరు, రాయలసీమ జిల్లాల ప్రజలు ప్రత్యేక ఆంధ్ర విషయమై పట్టీ పట్టనట్లు వుండేవారు నెల్లూరు జిల్లా ప్రజలకు మద్రాసు నగరం చాల దగ్గరలో ఉండడంవల్ల ఆనగరంతో సంబంధాలు తెంచుకోడం వారి కిష్టం లేదు. ప్రత్యేక ఆంధ్రలో భాగంగా మద్రాసును కలుపకపోతే అది ఆంధ్ర దేశానికి దూరమౌతుందని వారి భయం. రాయలసీమలో నాయకత్వం గుత్తికి చెందిన కేశవపిళ్ళె (అనంతపురం జిల్లా), నంద్యాలకు చెందిన ఏకాంబర అయ్యరు (కర్నూలు జిల్లా) వంటి తమిళుల

చేతుల్లో వుండేది తెలుగ జిల్లాలపై తమిళుల ఆధిక్యం తగ్గిపోతుందన్న భయంతో వారు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు సుముఖులుగ లేరు రాయలసీమలోని కర్నూలు జిల్లాకు చెందిన హరిసర్వోత్తమరావు వంటి తెలుగు నాయకులు మాత్రం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును బలపరిచారు

ఈ అయిదవ సమావేశంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తీర్మానాన్ని ఓడించాలని వ్యతిరేక వర్గం నిర్ణయించింది దీనికి కారణం 740 మంది ప్రతినిధుల్లో దాదాపు 480 మందికి పైగా నెల్లూరు జిల్లాకు చెందినవారు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సుముఖంగా లేని నెల్లూరు జిల్లానుండి వచ్చిన ప్రతినిధులందరూ ఓటింగులో పాల్గొంటే తీర్మానం వీగిపోవడం ఖాయమనిపించింది.

అందువల్ల హరి సర్వోత్తమరావు ఓటింగు జిల్లాల వారీగా జరగాలని, ఒక్కొక్క జిల్లాకు ఒక ఓటు అనుమతించాలని ఒక ప్రతిపాదన పెట్టాడు ఓటింగు జరిగేసమయానికి సర్కారులనుండి చాలమంది కొత్త ప్రతినిధులు సమావేశానికి హాజరుకావడంతో హరి సర్వోత్తమరావు ప్రతిపాదనను అమలులో పెట్టారు. దీంతో ప్రత్యేక రాష్ట్ర వ్యతిరేక వర్గం అసంతృప్తి చెంది టౌనుహాలులో ప్రత్యేకంగా సమావేశమై మద్రాసు నగరంతో కూడిన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఒక తీర్మానాన్ని ఆమోదించారు అయితే బి ఎన్ శర్మ వంటి నాయకులు చొరవతీసుకుని అసంతృప్తి వర్గం అపోహల్ని తొలగించడంతో మరుసటిరోజు సమావేశపు కార్యక్రమాలకు వారు హాజరయ్యారు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరాలనే ఒక తీర్మానాన్ని ఎ ఎస్ క్రిష్ణారావు వంటి ప్రముఖ నెల్లూరు నాయకులు వ్యతిరేకించినా సభ ఆమోదించింది ఆంధ్ర రాష్ట్రం రాజధానిగ మద్రాసు నగరం వుండాలని అసంతృప్తి వర్గం ప్రవేశపెట్టిన సవరణ తీర్మానం తిరస్కరించబడింది అయితే ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి రాయలసీమవాసుల సహకారం పొందడం అంతసులభంకాదనే సత్యాన్ని మాత్రం సర్కారు నాయకులు గ్రహించగల్గారు ఈ ప్రాంత ప్రజల భయాల్ని, అపోహల్ని తొలగించడం తక్షణ కర్తవ్యంగా వారు భావించారు

1916 నుండి జాతీయ ప్రాధాన్యతగల కాంగ్రెసు ఐక్యత, కాంగ్రెసు-ముస్లింలీగు పరస్పర సహకారం, స్వయం పరిపాలన వంటి విషయాలు ప్రాముఖ్యతను

సంతరించుకున్నాయి దీంతో ఆంధ్ర నాయకులు కూడ తమ దృష్టిని జాతీయ సమస్యలపై కేంద్రీకరించడం వల్ల ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నినాదం తెరమరగున పడిపోయింది

## ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెసు శాఖ

1885లో భారత జాతీయ కాంగ్రెసు ఏర్పడినప్పటినుండి ఆంధ్రదేశంలోని కాంగ్రెసు నాయకులు కాంగ్రెసు కార్యకలాపాల్లో చురుకుగ పాల్గొనేవారు 1891 నాటికే పి ఆనందాచార్యులు కాంగ్రెసు అధ్యక్షపీఠాన్ని అలంకరించగల్గాడు న్యాపతి సుబ్బారావు కొన్ని సంవత్సరాల పాటు కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగపని చేశాడు బరంపురం నుండి వి వి జోగయ్య, గాదె రాఘవరావు, ఎ పి పాత్రో, విశాఖ పట్నం నుండి బి ఎన్ శర్మ, రాజమండ్రినుండి న్యాపతి సుబ్బారావు, ఏలూరు నుండి మోచర్ల రామచంద్రరావు, కె వి రెడ్డి నాయుడు, నెల్లూరు నుండి ఎ వి కృష్ణా రావు, గుత్తి నుండి కేశవ పిళ్ళై, మద్రాసు నుండి ఎ సి పార్థ సారధినాయుడు వంటి ఇతర ఆంధ్ర ప్రముఖులు కూడ కాంగ్రెసు కార్యకలాపాల్లో తరచుగ పాల్గొనేవారు

1914 లో మద్రాసులో కాంగ్రెస్ మహాసభ జరిగినప్పుడు ఆంధ్ర దేశం నుండి 256 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు అయినా కాంగ్రెసు వర్కింగు కమిటీలో ఒక ఆంధ్రునికి కూడ చోటు లేకపోయింది ఇదే గాక ఈ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర విషయాన్ని చర్చించేందుకు తమిళులనుండి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది ఈ సంఘటనవల్ల తమ విషయాల్లో తమిళుల పలుకుబడిని తగ్గించాల్సిన అవసరాన్ని ఆంధ్రులు గ్రహించగల్గారు నంద్యాలకు చెందిన ఏకాంబర అయ్యరు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర విషయాన్ని కేవలం ఆంధ్రుల నిర్ణయానికే వదలకూడదని, 1915 మేలో నెల్లూరులో జరగనున్న మద్రాసు రాష్ట్ర సమావేశంలో ఈ విషయాన్ని పరిశీలనకు చెపట్టాలని విశేషంగా ప్రచారం చేశాడు అయితే రాష్ట్ర కాంగ్రెసు ఈ విషయాన్ని పరిశీలనకు తీసుకోలేదు.

తమిళుల కార్యకలాపాలవల్ల ఆంధ్ర దేశానికి ఒక ప్రత్యేక కాంగ్రెసు శాఖను ఏర్పాటు చేయడం తక్షణ కర్తవ్యంగా ఆంధ్రులు భావించారు దీనివల్ల ఆంధ్రులకు తమ కార్యకలాపాల్ని చర్చించుకునేందుకు తగిన స్వేచ్ఛను

కలిగించినట్లవుతుంది అందువల్ల మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాన్నింటికి కలిపి ఒక ప్రత్యేక కాంగ్రెసు శాఖను ఏర్పాటు చేయాలని ఆంధ్రులు అడగడం ప్రారంభించారు వారు ఒకటికంటె ఎక్కువ కాంగ్రెసు శాఖలున్న బీహారు, ఒరిస్సా వంటి రాష్ట్రాల్ని ఉదాహరణగా ఎత్తిచూపారు

భవిష్యత్తులో ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఒక పనిముట్టుగా వుపయోగించుకోవచ్చునన్న ఉద్దేశంతో ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెసు శాఖకోసం ఆంధ్రనాయకులు తమ ప్రయత్నాల్ని తీవ్రంచేశారు. ఈ విషయాన్ని అఖిలభారత కాంగ్రెసు కమిటి దృష్టికి తేవాలని ఆంధ్ర మహాసభ నాల్గవ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. సింధు ప్రాంతానికి చెందిన కార్యకర్తలు కూడ తమకు ప్రత్యేక కాంగ్రెసుశాఖ కావాలని కోరారు. దీంతో 1916 డిశంబరు 30న లక్నోలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు సమావేశం ఆంధ్ర, సింధు కాంగ్రెసు శాఖల ఏర్పాటు విషయమై ఆయా రాష్ట్ర కాంగ్రెసు కమిటీల (మద్రాసు, బొంబాయి) అభిప్రాయాన్ని కోరింది మద్రాసు రాష్ట్ర కాంగ్రెసు కమిటికి ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెసు శాఖ ఏర్పాటు చేయడం ఇష్టం లేకపోవడం వల్ల తన అభిప్రాయాన్ని తెలుపకుండా ఆలస్యం చేసింది అయితే ఈ మధ్యలో జరిగిన కొన్ని ఇతర సంఘటనలవల్ల ఆంధ్ర కాంగ్రెసు శాఖ ఏర్పడే సుమూహర్తం దగ్గర పడింది. దేశంలోని కాంగ్రెసు కార్యకర్తలందరికీ 'భారత రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ' అనే పేరుతో ఒక కర పత్రం పంచబడింది ఈ కరపత్ర రచయితలైన కొండా వెంకటప్పయ్య, డా. బి పట్టాభి సీతారామయ్యలు ఆంధ్ర కాంగ్రెసు శాఖ విషయమై స్పష్టమైన, సంతృప్తికరమైన వివరణ ఇచ్చారు. 1916లో బహుళ ప్రజాదరణ పొందిన హెూంరూలు లీగు కూడ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థించింది ఈ విషయమై సబ్జక్టు కమిటీలో తీవ్రమైన చర్చలు జరిగాయి మాంటేగు సంస్కరణల్ని ప్రవేశపెట్టిన తర్వాత పైవిషయాన్ని పరిశీలించడం మంచిదని మహాత్మాగాంధీ అభిప్రాయపడ్డాడు. ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయ్యాలంటే భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తప్పనిసరి అని తమిళ నాయకులు కూడ అభిప్రాయ పడ్డారు. మద్రాసు రాష్ట్రంలోని11 తెలుగు జిల్లాలకు కలిపి ఒక కాంగ్రెసు శాఖను ఏర్పాటు చేయాలని ఒక సంతృప్తికరమైన వివరణను డా॥ పట్టాభి ఇవ్వగల్గాడు. 1918 జనవరి 22న న్యాపతి

సుబ్బారావు అధ్యక్షుడుగ, కొండా వెంకటప్పయ్య కార్యదర్శిగ కొత్త ఆంధ్ర కాంగ్రెసు శాఖ ఏర్పాటయింది ఆంధ్రోద్యమాన్ని చేపట్టిన వారికి ఇది మొదటి విజయంగా భావించవచ్చు

## హోం రూలు ఉద్యమం

సూరత్ చీలిక తర్వాత తొమ్మిదేళ్లకు మార్లె మింటో సంస్కరణలతో సంతృప్తి చెందిన మితవాదనాయకులు కాంగ్రెసుపై తమ ఆధిపత్యాన్ని చెలాయించ గల్గారు అయితే 1909 సంస్కరణలు ఆచరణలో సత్ఫలితాన్ని సాధించలేక పోయాయి విస్తృతమైన శాసనసభల నిరంకుశాధికారం ఇంకా కొనసాగుతూనే వుంది ముస్లింలకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఇవ్వడంతో పొంచివున్న ప్రమాదాలు బహిర్గతమయ్యాయి అయితే 1914లో మొదటి ప్రపంచయుద్ధ ప్రారంభంకావడంవల్ల భారతీయులు బ్రిటిష ప్రభుత్వాన్ని ఆదుకునేందుకు సిద్ధమయ్యారు బ్రిటీషువారి కష్టాల్ని తమ స్వప్రయోజనాలకు వాడుకోవడం కోసం భారతీయులెన్నడూ ప్రయత్నించలేరు

1915లో గోపాలకృష్ణ గోఖలే మరణించి నప్పటి నుండి 1920 లో గాంధీమహాత్ముడు తలెత్తేవరకు భారత జాతీయోద్యమాన్ని ఉధృతం చేసే ప్రయత్నంలో 'హోంరూలు లీగ్' పేరుతో రెండు సంస్థలు ఏర్పడ్డాయి. ఈ రెండు హోంరూలు లీగులు 1916లో అనిబిసెంటు, తిలక్‌లచే స్థాపించబడ్డాయి

1914లో జైలునుండి బయటపడ్డాక తిలక్‌లో చాలమార్పు కన్పించింది ఇప్పుడు ఆయన సంపూర్ణ స్వరాజ్యం కావాలని పట్టుపట్టలేదు స్వపరిపాలనతో సంతృప్తి చెందాడు 1916 ఏప్రిల్ 28న ఆయన హోంరూలు లీగును స్థాపించాడు రాజ్యాంగ బద్ధంగా బ్రిటీషు సామ్రాజ్య ఆధీనంలోనే స్వపరిపాలన సాధించేందుకు దేశప్రజల్ని సమాయత్తం చేయడమే తన హోంరూలు లీగు స్థాపన ముఖ్యోద్దేశమని తిలక్ వివరించాడు

ఇదే సమయంలో మద్రాసులోని అడయారు కేంద్రంగా గల దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షురాలైన అనిబిసెంట్ అనే ఐరిషువనిత 1916 సెప్టెంబరులో మద్రాసులో హోంరూలు లీగును స్థాపించింది తిలక్, అనిబిసెంటు ఇద్దరూ

కాంగ్రెసు ఐక్యతకై కృషి చేశారు ఈ కృషి ఫలితంగానే 1916 డిశంబరులో తిలక్‌తో పాటు మిగిలిన అతివాద నాయకులు కూడ కాంగ్రెసులో తిరిగి చేరారు 1916వ సంవత్సరంలో కాంగ్రెసు ముస్లిం లీగుల మధ్యకూడ పూర్తి సహకారంనెలకొని వుండడం ఒక విశేషంగా భావించవచ్చు

ఆందోళన ద్వారా తప్ప ఇతరత్రా భారతీయ సమస్యల్ని ఇంగ్లాండు దృష్టికి తీసుకురాలేమన్న అభిప్రాయానికి వచ్చిన అనిబిసెంటు హోంరూలు ఉద్యమాన్ని నడపడానికి నిశ్చయించింది స్వపరిపాలనా సంబంధమైన అన్ని విషయాల్ని ప్రజలకు విడమర్చి చెప్పి వారిలో చైతన్యం కలిగించేందుకు 'కామన్‌వీల్' అనే ఆంగ్ల పత్రికను 1914 జనవరిలో మద్రాసులో అనిబిసెంట్ ప్రారంభించింది మరల 1914 జూలైలో 'మద్రాసు స్టాండర్డ్' అనే ఆంగ్ల దినపత్రికను తన స్వంతంచేసుకుని దానికి 'న్యూఇండియా' అని పేరు మార్చింది ఈ రెండు పత్రికల ద్వారా స్వపరిపాలన సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి అనిబిసెంటు ప్రయత్నించింది

అనిబిసెంటు హోంరూలు ఉద్యమం మద్రాసు నగరంలోను, కొంతవరకు ఆంధ్ర దేశంలోను విశేషంగా ప్రజాదరణ పొందింది ఈ ఉద్యమాన్ని తెలుగు జిల్లాలో ప్రచారం చేసేందుకు గాడిచర్ల హరి సర్వోత్తమ రావు కార్యదర్శిగ ఒక ప్రత్యేక హోంరూలు లీగ్ శాఖ ఏర్పాటయింది కొండా వెంకటప్పయ్య, కె నాగేశ్వరరావు, కె వి రెడ్డి నాయుడు వంటి ప్రముఖ ఆంధ్ర నాయకులు హోంరూలు లీగ్‌లో చేరారు ఉద్యమాల్లోని వివిధ అంశాల్ని గూర్చి వివరిస్తూ 'స్వపరిపాలన పరమోద్దేశము' వంటి అనేక కరపత్రాల్ని హరిసర్వోత్తమరావు విడుదల చేశాడు

లక్నో కాంగ్రెసు మహాసభ తర్వాత అనిబిసెంటు ఆంధ్రదేశంలో పర్యటించి కాకినాడ, రాజమండ్రి, ఏలూరు పట్టణాల్లో బహిరంగ ఉపన్యాసాలిచ్చింది ఏలూరుకు చెందిన మోచర్ల హనుమంతరావు తదితర మితవాద నాయకులు అనిబిసెంటు ఆంధ్రపర్యటన విజయవంతం కావడానికి కృషి చేశారు 'స్వపరిపాలన' అనేది వివిధ జిల్లా సభల్లో ముఖ్యమైన చర్చనీయాంశమైంది గంజాం, విశాఖపట్నం, గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లా సమావేశాల్లో స్వపరిపాలనకు

అనుకూలంగా తీర్మానాలు ఆమోదించబడ్డాయి నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభ అయిదవ సమావేశంలో స్వపరిపాలన విషయం ప్రస్తావనకు వచ్చింది కొండా వెంకటప్పయ్య తన అధ్యక్షోపన్యాసంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు అవసరాన్ని గూర్చి వక్కాణిస్తూ స్వపరిపాలన ప్రాధాన్యతను గూర్చి కూడ వివరించాడు 1917వ సంవత్సరం మధ్య కల్లా ఆంధ్రదేశంలో దాదాపు 52కు పైగా హోంరూలులీగు శాఖలు ఏర్పాటయ్యాయి.

హోంరూలు ఉద్యమానికి అనుబంధంగా అనిబిసెంటు జాతీయ విద్యా కార్యక్రమాన్ని చేపట్టింది. చిత్తూరు జిల్లాలోని మదనపల్లె ఆమె విద్యా కార్యకలాపాలకు కేంద్రంగా రూపొందింది అక్కడే 1916 మే నెల్లో జె హెచ్ కజిన్స్ అను పత్రికారచయిత నేతృత్వంలో జాతీయకళాశాలను స్థాపించింది ఈ కళాశాలే బీసెంట్ దివ్యజ్ఞాన కళాశాలగా అభివృద్ధి చెందింది

హోంరూలు ఉద్యమానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు ఓర్వలేక మద్రాసు ప్రభుత్వంవిచ్చలవిడిగా అణచి వేత చర్యల్ని చేపట్టింది విద్యార్థులు రాజకీయ సమావేశాలకు హాజరు కారాదంటూ ఒక సర్క్యులరును ప్రభుత్వం జారీ చేసింది బొంబాయి, మధ్యరాష్ట్రాలు, బీహారుల్లో అనిబిసెంటు పర్యటించకూడదని నిషేదాన్ని విధించారు అయితే ఆమె తన 'న్యూయిండియా' పత్రిక ద్వారా ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబడుతూ స్వయంపాలనను గూర్చి చాటి చెప్పింది దీంతో 1917 జూన్ 17న మద్రాసు ప్రభుత్వం అనిబిసెంటుతో పాటు హోంరూలు లీగులో ఆమె సహచరులైన బి పి వాడియా, అరుండలేల్లపై రాజకీయాల్లో పాల్గొనరాదంటూ నిషేదాన్ని విదిస్తూ వారిని ఊటిలో నిర్బంధించింది

అనిబిసెంటుతో పాటు ఆమె సహచరుల్ని అరెస్టు చేయడంతో భారత ప్రజలు ఆగ్రహవేశాలతో ఊగిపోయారు ప్రభుత్వ చర్యను విమర్శిస్తూ దేశమంతా సభలు సమావేశాలు నిర్వహించారు ముఖ్యంగా కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో హోంరూలు ఉద్యమం తీవ్రరూపం దాల్చింది మచిలీపట్నంలోని జాతీయ కళాశాలలోని ఉద్యోగులందరూ హోంరూలు ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు పాటు పడ్డారు మదనపల్లె జాతీయ కళాశాల ఉద్యోగులు

జాతీయశిభిరాల్ని నిర్వహించి స్వపరిపాలనను గూర్చి ప్రజలకు విడమర్చి చెప్పారు తెలుగు పత్రికారంగంలో ముఖ్యంగా 'దేశాభిమాని', 'దేశమాత', పత్రికలు అనిబిసెంటు అరెస్టును తీవ్రంగా నిరశించాయి హెూంరూలులీగు ప్రకోపదళం (Indignant Group) ఒకటి ఏర్పాటయింది మెడలో అనిబిసెంట్ బేడ్జిని ధరించి దేశంకోసం ఎటువంటి త్యాగాన్నైనా చేయగలమని ప్రతిజ్ఞ చేశారు ప్రభుత్వం ఒకవైపు అణచివేత చర్యల్ని కొనసాగిస్తూనే 'విభజించి పాలించు' అనే పద్ధతిలో ఉద్యమాన్ని నీరుకార్చాలని ప్రయత్నించింది. ఈ ఉద్యమం నుండి విడిపోవలసిందిగ బ్రాహ్మణేతరుల్ని ప్రోత్సహించింది

అఖిలభారత కాంగ్రెసు కమిటి, ముస్లింలీగ్ కౌన్సిలు కలిసి అనిబిసెంటును విడిపించేందుకు ఒక ప్రణాళికను సిద్ధం చేశాయి దీని ప్రకారం చంపారన్‌లో ఇండిగో వ్యవసాయ సమస్యల్ని పరిష్కరించేందుకు గాంధీజీ అనుసరించిన 'సాత్విక తిరుగుబాటును' (Passive Resistance) చేపట్టాలని నిర్ణయించాయి హెూంరూలులీగు కార్యకలాపాలు ప్రభుత్వ యుద్ధ నిధి సేకరణకు కూడ ఆటంకాలు కల్గించాయి దీంతో పాటు సాత్విక తిరుగుబాటు నిర్ణయం వల్ల అనిబిసెంటు నిర్బంధం ఇంకా కొనసాగించడం మంచిది కాదన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది 1917 ఆగస్టు 20న కామన్స్ సభలో తాను ప్రకటించిన విధానానికి అనిబిసెంటు నిర్బంధము వ్యతిరేకమని ఇంగ్లాండులోని భారతదేశపు సెక్రటరీ అయిన ఇ.యస్ మాంటేగు అభిప్రాయపడ్డాడు దీంతో 1917 సెప్టెంబరు 17న అనిబిసెంట్ తోపాటు ఆమె అనుచరుల్ని కూడ నిర్బంధం నుండి వదలి పెట్టారు దీంతో హెూంరూలు ఉద్యమం పూర్తిగ కనుమరుగైందని చెప్పవచ్చు

## మాంటేగు ప్రకటన, ఆగస్టు 20, 1917

భారత దేశంలో రాజకీయ అసంతృప్తి పెరుగుతుండడం వల్ల ప్రజాభిప్రాయాన్ని మన్నించేందుకు కొన్ని సంస్కరణల్ని ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని బ్రిటనులోని ప్రభుత్వ వర్గాలు గ్రహించాయి అదీగాక మొదటి ప్రపంచయుద్ధంలో బ్రిటనుకు భారతీయులు అందించిన సహకారంవల్ల ఈ అవసరం మరింత ఎక్కువైంది భారత ప్రభుత్వం ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్పు

చెందక మరింత జడత్వంతోను, కఠినంగాను, సంకుచితత్వం తోను వికేంద్రీకరణకు వ్యతిరేకంగాను వున్నదని మాంటేగు అభిప్రాయపడ్డాడు అందువల్ల ఆయన ఇంగ్లాండులో భారత దేశ సెక్రటరీ పదవిని అలంకరించిన తర్వాత భారత ప్రభుత్వ విధానంలో మార్పును సూచిస్తూ 1917 ఆగస్టు 20న ఒక ప్రకటన చేశాడు కామన్స్ సభలో ఆయన ఇలా అన్నాడు

"భారతీయులకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రవేశావకాశాల్ని ఎక్కువచేసి బ్రిటీషు సామ్రాజ్యంలో భాగంగా భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటుకై స్థానిక స్వపరిపాలనా సంస్థల్ని క్రమంగా అభివృద్ధి చేయాలన్న బ్రిటీషు ప్రభుత్వ విధానం.' భారత ప్రభుత్వం కూడ ఏకీభవించింది ఈ దిశగా పయనించేందుకు వీలయినంత త్వరలో తగు చర్యలు తీసుకోవాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయి ఇదిచాల ప్రధానమైన విషయం కావడంవల్ల ప్రాధమిక దశలో చేపట్టాల్సిన చర్యల్ని గూర్చి బ్రిటీషు ప్రభుత్వం, భారత ప్రభుత్వాల మధ్య స్వేచ్ఛాయుత వాతావరణంలో పరస్పర అభిప్రాయాలను తెలుసుకోవలసిన ఆవశ్యకత వుంది. అందువల్ల నేను వైస్రాయి ఆహ్వానాన్ని అంగీకరించి భారత దేశానికి వెళ్ళి ఆయనతో వివిధ విషయాల్ని కూలంకషంగా చర్చించి, స్థానిక ప్రభుత్వాల అభిప్రాయల్ని సేకరించి, ప్రజాసంఘాలువెుదలయి.. వాటి నుండి సలహాల్ని స్వీకరించాలని బ్రిటీషు ప్రభుత్వం నిర్ణయించింది"

మాంటెగు ప్రకటన ఆంధ్రుల్లో కొత్త ఆశల చిగురింప జేసింది ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం సమైక్యంగా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని వారు బావించారు 1917 చివరి కల్లా తెలుగు జిల్లాలన్నిటా ప్రజాభిప్రాయం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం వైపు మొగ్గుచూపింది

రాబోవు రాజ్యాంగ సంస్కరణల దృష్ట్యా ఆంధ్ర మహాసభ ప్రత్యేక సమావేశాన్ని విజయవాడలో ఏర్పాటు చేశారు ఈ సమావేశపు ఆహ్వాన సంఘానికి అయ్యదేవర కాళేశ్వరరావు చేర్మన్‌గా, సి వి యస్ నరసింహరాజజూ అధ్యక్షుడుగ వ్యవహరించారు ఈ సమావేశానికి 1200 మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు త్వరలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిన అవసరంపట్ల ప్రతినిధులందరు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు న్యాపతి

సుబ్బారావు కూడ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు సుముఖతను వ్యక్తం చేశాడు మాంటేగు మద్రాసు రాష్ట్ర పర్యటన సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర విషయమై ఆయన్ని కలిసి ఒప్పించేందుకు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపాలని సుబ్బారావు మహాసభను కోరాడు మరో తీర్మానంలో మద్రాసు రాష్ట్ర శాసనసభలో బ్రాహ్మణేతరులకు కొన్నిసీట్లను ప్రత్యేకంగకేటాయించాలని కూడ ఈ మహాసభ కోరింది స్వయం పరిపాలన బ్రాహ్మణ వర్గానికి మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుందన్న బ్రాహ్మణేతరుల భయాన్ని తొలగించడానికే పై తీర్మానాన్ని ఆంధ్రమహాసభ ఆమోదించింది మాంటెగు ప్రకటన తర్వాత స్వయం పాలనకు వ్యతిరేకంగా వీలైనన్ని ప్రదర్శనల్ని నిర్వహించమని మద్రాసు ప్రభుత్వం బ్రాహ్మణేతర వర్గాన్ని ప్రోత్సహించింది దీంతో ఆంధ్ర దేశంలో బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరుల మధ్య యిదివరకు నెలకొన్న సుహృద్భావ సంబంధాలకు విఘాతం కలిగింది

ఆంధ్రమహాసభ ప్రత్యేక సమావేశం జరిగిన తర్వాత స్వపరిపాలనను ఆకాంక్షిస్తున్న బ్రాహ్మణేతరులు నెల్లూరు జిల్లాకు చెందిన పానకాపట్టాభిరామరెడ్డి అధ్యక్షతన విజయవాడలో ఒక సమావేశం ఏర్పాటు చేశారు ఆంధ్రమహాసభ ప్రత్యేకసమావేశంలో చేసినటువంటి తీర్మానాలనే వీరుకూడా చేశారు. త్రిపురనేని రామస్వామి చౌదరి, కేశవపిళ్ళై, రంగనాద మొదలియార్ మొదలగు బ్రాహ్మణేతర వర్గ నాయకులు పై సమావేశపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు

## మాంటెగు వద్దకు ఆంధ్రప్రతినిదివర్గ రాయబారం

భారతదేశంలో ప్రవేశ పెట్టబోయే రాజ్యాంగ సంస్కరణల విషయమై ప్రజాప్రతినిధుల సభలు మొదలయిన వాటినుండి సలహాల్ని స్వీకరించేందుకు తాను భారతదేశ పర్యటనకు వస్తున్నానని 1917 ఆగస్టు 20 నాటి తన ప్రకటనలో మాంటేగు స్పష్టంచేశాడు అయితే ఆంధ్రమహాసభకు, గోదావరి-కృష్ణా జిల్లా సభకు మాంటెగును కలుసుకునేందుకు వీలులేకుండా మద్రాసు ప్రభుత్వం తన అనుమతి నిరాకరించింది దీంతో ఆంధ్ర ప్రజలు కోపోద్రిక్తులై మద్రాసు ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఆక్షేపిస్తూ మాంటెగుకు అనేక టెలిగ్రాములు పంపారు. చివరకు ప్రభుత్వం దిగివచ్చి అనుమతి ఇవ్వక తప్పలేదు

మందిగల ఆంధ్రుల ప్రతినిధి వర్గం న్యాపతి సుబ్బారావు నాయకత్వాన మాంటేగును, వైస్రాయిని కలిసింది. మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలన్నింటిని కలిపి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగ తక్షణం ఏర్పాటు చేయాలని ఈ ప్రతినిధి వర్గం మాంటేగును కోరింది మాంటేగు కూడ ఈ విషయాన్ని పరిశీలించగలనని హామీ ఇచ్చాడు

కలకత్తాలో అనిబిసెంటు అధ్యక్షతన జరిగిన కాంగ్రెసు మహాసభ వార్షిక సమావేశంతో 1917వ సంవత్సరం ముగిసింది ఈ సమావేశంలోనే ఆంధ్ర ప్రాంతానికి ప్రత్యేకంగా కాంగ్రెసు శాఖ ఏర్పాటు చేయడం జరిగింది

## బి. ఎన్. శర్మ తీర్మానం

1918 ఫిబ్రవరి 6న కేంద్ర శాసనసభలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. బ్రిటీషు ఇండియాలో స్వపరిపాలనా సంస్థలు విజయవంతంగా పనిచేసేందుకు వీలుగ రాష్ట్రాలను పునర్విభజన చేయడం, ఒక ప్రత్యేక భాషను మాట్లాడే అత్యధిక ప్రజలు కోరినట్లయితే అవకాశం వున్న చోట్ల భాషా ప్రాతిపదికపై ఆయా ప్రాంతాల పునర్నిర్మాణం చేయడం వంటివి జరగాలని పై తీర్మానంలో శర్మగారు కౌన్సిలులోని గవర్నరు జనరలుకు సిఫార్సు చేశారు

అయితే ఈ తీర్మానంపై సానుకూలత అంతగా వ్యక్తం కాలేదు. కె వి.రంగస్వామి అయ్యంగార్ వంటి మద్రాసు సభ్యులు అనుకూలత వ్యక్తం చేశారు. కాని మహమ్మదాలీ జిన్నా, వి యస్ శ్రీనివాస శాస్త్రి వంటి అనధికార సభ్యులు ఈ తీర్మానాన్ని వ్యతిరేకించారు. ఈ తీర్మానం ద్వారా శర్మగారు తన ప్రజలనుండి చౌకబారు అభిమానాన్ని సంపాదించాలని ప్రయత్నించాడని జిన్నా అభిప్రాయపడ్డాడు. శ్రీనివాస శాస్త్రి ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు మాత్రం తన సుముఖతను తెలుపుతూ దేశమంతా రాష్ట్రాల పునర్నిర్మాణం జరగాలనడం సబబు గాదని భావించాడు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు సమయం ఆసన్నంకాలేదని సురేంద్రనాధ బెనర్జీ భావించాడు. ఈ తీర్మానం ఆంధ్ర రాష్ట్రం వరకు పరిమితమై వుండి వుంటే తాను బలపరిచేవాడినని తేజ్ బహదూర్ సప్రూ అభిప్రాయపడ్డాడు.

## మాంటేగు – చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు, 1919

మాంటేగు – చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల్ని 1918 జూలైలో ప్రకటించారు ఈ సంస్కరణలు భారత ప్రభుత్వంలో గాని, ఇంగ్లాండులోని భారతదేశ సెక్రటరీ అధికారాల్లో గాని ఎటువంటి మార్పును తీసుకురాలేదు రాష్ట్రాల్లో ద్వంద్వపరిపాలన (Dyarchy) ప్రవేశ పెట్టబడింది అవి ఒకటి రిజర్వు చేయబడ్డ శాఖ, రెండు బదలాయించబడిన శాఖ ఈ రిజర్వు చేయబడ్డ శాఖ విషయాల్ని గవర్నరు చూచేవాడు అయితే ఈ విషయాల్లో శాసనసభకు గవర్నరు జవాబుదారీకాదు కేవలం కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంటుకు జవాబుదారీ అవుతాడు బదలాయింపు శాఖకు సంబందించిన విషయాల్ని మంత్రుల సహాయంతో గవర్నరు నిర్వహించేవాడు ఈ మంత్రులను రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన సభ్యులనుండి గవర్నరు ఎంచుకుంటాడు

ఈ సంస్కరణలపై తమ తీవ్ర అసంతృప్తిని ప్రకటించడానికి విజయవాడ, కడప వంటి పట్టణాల్లో బహిరంగ సభలు నిర్వహించారు ఈ సంస్కరణలు బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటుకు ఏవిధంగాను దోహదపడవని విజయవాడ సమావేశం అభిప్రాయపడింది ఇటువంటి తీర్మానాన్ని గంజాం, కృష్ణ, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ప్రత్యేక సమావేశంలో కూడ ఆమోదించడం జరిగింది

1918 ఆగష్టు 17న కాశీనాధుని నాగేశ్వరరావు అధ్యక్షతన గుంటూరులో ఆంధ్ర మహాసభ ప్రత్యేక సమావేశం జరిగింది ఈ సమావేశానికి బి ఎన్ శర్మ, బి. వెంకటపతిరాజు, టి ప్రకాశం, బి పట్టాబి సీతారామయ్య, జి హరి సర్వోత్తమరావు, ఎ కాశేశ్వరరావు, వి రామదాసు వంటి ప్రముఖ రాజకీయ నాయకులు హాజరయ్యారు సంస్కరణల్ని పూర్తిగ తిరస్కరించాలని చాలమంది సభ్యులు భావించారు అయితే కొన్ని మార్పులు, చేర్పులతో సంస్కరణల్ని అంగీకరించాలని బి ఎన్ శర్మ అభిప్రాయపడ్డాడు చాల తీవ్రస్థాయిలో జరిగిన చర్చల అనంతరం కాంగ్రెసు-ముస్లింలీగు స్కీము ప్రాతిపదికగా సంస్కరణల్ని అమలు చేయాలనే ఒక తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది దేశీయమైన విషయాల్లో భారత శాసనసభకు పూర్తి ఆధిపత్యం వుండాలని కాంగ్రెసు-లీగు

స్కీము ప్రతిపాదించింది తీర్మానాన్ని బి ఎన్ శర్మ ప్రతిపాదించగా, టి ప్రకాశం బలపరచారు

సంస్కరణలు భారతీయులకు నిజమైన అధికారాల్ని అప్పగించలేక పోయాయని తెలుగు పత్రికారంగం విమర్శించింది కృష్ణా పత్రిక 1918 జూలై 13 నాటి తన సంపాదకీయంలో ఇలా లభిప్రాయ పడింది

"కొండను త్రవ్వి ఎలుకను పట్టడం జరిగింది ఇంతకాలం దేశం అడిగింది ఒకటైతే ఇచ్చింది మరొకటి ఆర్థిక విషయంపై కేంద్ర శాసన సభకు ఆదిపత్యం వుండాలని మేము కోరాము అయితే మా కోర్కెను మన్నించలేదు కంటి తుడుపు చర్యగా పేరుకు మాత్రం కొన్ని సంస్కరణల్ని ప్రవేశ పెట్టినట్లు కన్పిస్తున్నది ప్రజల ఆశలకు ఆశయాలకు గౌరవమిచ్చి వాటిని పరిగణనలోకి తీసుకోలేదు మార్పులు చేసినట్లు గొప్పగ చిత్రించారు వారి రాజకీయ యంత్రాంగ నైపుణ్యాన్ని మెచ్చుకోకుండా వుండలేము అన్ని అధికారాలు కుడి చేత్తో ఇచ్చి ఎడమ చేత్తో తీసుకున్నట్లు కన్పిస్తుంది యంత్రానికి అనేక చక్రాలు అమర్చారు కాని ప్రతి చక్రము వెనక్కు తిరిగేదే"

సంస్కరణల్ని పరిశీలించేందుకు 1918 ఆగస్టు 28, 29 తేదీల్లో హసన్ ఇమాం అధ్యక్షతన బొంబాయిలో భారతజాతీయ కాంగ్రెసు ప్రత్యేక సమావేశం జరిగింది ఈ సమావేశం సంస్కరణలపై తన అసంతృప్తిని ప్రకటిస్తూ చాల మార్పుల్ని సూచించింది ఇంగ్లాండులోని పార్లమెంటరీ జాయింటు కమిటీ ముందు తన అభిప్రాయాల్ని వ్యక్తం చేసేందుకు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపాలని గూడ సమావేశం నిర్ణయించింది ఈ సంస్కరణలపై కల్గిన భేదాభిప్రాయం వల్లే మితవాదులు, అతివాదులు చివరి సారిగ విడిపోయారు మితవాదులు సురేంద్రనాధ బెనర్జీ అధ్యక్షతన తమకు తామే ఒక సంస్థను ఏర్పాటు చేసుకుని దానికి 'ఇండియన్ నేషనల్ లిబరల్ ఫెడరేషన్' అని పేరుపెట్టారు ప్రభుత్వం తన అణచివేత విధానాన్ని కొనసాగించింది కేవలం అనుమానంతోనే వేలమంది ప్రజల్ని అరెస్టు చేయడం జరిగింది అరెస్టు చేయబడ్డ వారిలో చదువుల నిమిత్తం అమెరికాకు వెళ్ళి కొంతకాలం పాటు గద్దరు పార్టీ సభ్యుడుగ కొనసాగిన దర్శి చెంచయ్య కూడ వున్నాడు

మొదటి ప్రపంచయుద్ధం 1918 నవంబరు 11న ముగిసింది అన్ని దేశాలకు స్వయం నిర్ణయాధికార సూత్రాన్ని వర్తింపచేయాలన్న అమెరికా అధ్యక్షుడైన విల్సన్ ప్రకటన ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది ఈ స్వయం నిర్ణయాధికార సూత్రాన్ని భారత దేశంలో ఎంతవరకు బ్రిటీషు ప్రభుత్వం వర్తింప జేస్తుందోనని భారతరాజకీనాయకులు ఆతృతతో ఎదురు చూశారు ఇటువంటి వాతావరణంలోనే 1918 డిశంబరు 8న అఖిలభారత కాంగ్రెసు కమిటి విజయవాడలో సమావేశమయి రాబోవు కాంగ్రెసు సమావేశాన్ని లండనులో నిర్వహించాలని భావించింది ఫ్రాన్ లో (వర్సైల్సు) జరిగే శాంతి సమావేశానికి తిలక్ ను ప్రతినిధిగా పంపాలని ఈ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది

కాంగ్రెసు మహాసభ వార్షిక సమావేశం మదన మోహన్ మాలవ్య అధ్యక్షతన ఢిల్లిలో జరిగింది మాంటేగు - చెమ్స్ ఫర్డు సంస్కరణల్లో అనేక మార్పుల్ని చేయాలని, వర్సైల్స్ శాంతి సమావేశంలో భారత దేశానికి ప్రాతినిద్యం వుండాలని ఈ సమావేశం కోరింది తిలక్, గాంధి, హసన్ ఇమాంలను కాంగ్రెస్ ప్రతినిధులుగ శాంతి సమావేశానికి పంపాలని కోరింది ఇవేగాక భారత దేశ విషయాన్ని స్పష్టంగా విపులీకరించేందుకు ఇంగ్లాండుకు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపాలని గూడ పై సమావేశం నిర్ణయించింది

౯

# భారత జాతీయోద్యమం – ఆంధ్రదేశం

## గాంధీజీ రాజకీయ రంగ ప్రవేశం

భారతజాతీయోద్యమ చరిత్రలో 1919వ సంవత్సరానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది ఈ సంవత్సరంలోనే గాంధీ మహాత్ముడు రాజకీయ రంగంలో ప్రవేశించి 1947లో మనకు స్వాతంత్ర్యం వచ్చే వరకు తిరుగులేని నాయకుడుగ చలామణి అయ్యాడు భారత జాతీయోద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం విశేషాధికారాలతో సర్వసన్నద్ధమౌతున్నపుడు గాంధీజీ వంటి నాయకుడు రంగప్రవేశం చేయడం దేశానికి ఎంతో అవసరమైంది.

## రౌలతు చట్టం

1919లో ప్రభుత్వం రౌలతు చట్టాన్ని ఆమోదించింది ఈ చట్టం వ్యక్తుల్ని నిర్బంధించడం, పత్రికారంగ స్వేచ్ఛను హరించడం, రాజకీయ ఖైదీల్ని విచారించేందుకు ప్రత్యేక న్యాయస్థానాల్ని ఏర్పాటు చేయడం వంటి విషయాల్లో ప్రభుత్వానికి తిరుగులేని అధికారాన్ని కట్టబెట్టింది ఈ అణచివేత చర్యలు దేశం మొత్తం మీద విమర్శకు గురయ్యాయి. తెలుగు పత్రికారంగంలో ముఖ్యంగా ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రికలు రౌలతు చట్టానికి వ్యతిరేకంగా తీవ్రమైన ఆక్షేపణల్ని తెలిపాయి. పౌరుని ప్రాథమిక హక్కుల్ని కాలరాసేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని కృష్ణాపత్రిక భావించింది. అయితే రౌలతు చట్టానికి వ్యతిరేకంగా గాంధీజీ స్పందించిన తీరు దేశ రాజకీయ రంగంలో గొప్ప మార్పులు తీసుకువచ్చింది. రౌలతు బిల్లును చట్టంగా ఆమోదించవద్దని గాంధీ

చేసిన విన్నపాన్ని వైస్రాయి లెక్క పెట్టకపోవడంతో గాంధీజీ రంగంలోకి ప్రవేశించి ప్రభుత్వాన్ని సవాలు చేస్తూ సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించాడు 1919 ఏప్రిలు 6న ఉపవాస దినంగ, ప్రార్థనాదినంగ, జాతి అవమాన దినంగా పాటించాలని మహాత్మాగాంధీ దేశప్రజలకు పిలుపునిచ్చాడు అహింసాయుత పద్ధతిలో చట్టాన్ని ధిక్కరించమని ఆయన ప్రజలకు ప్రబోధించాడు

గాంధీజీ ఇచ్చిన సత్యాగ్రహ పిలుపుకు ఆంధ్రదేశం ఉత్సాహంతో ప్రతిస్పందించిది విశాఖపట్నం, రాజమండ్రి, నర్సాపూర్ ఏలూరు, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు వంటి చాల పట్టణాల్లో ఏప్రిలు ఆరవ తేదీన ప్రార్థన, ఉపవాసాల దినంగా పాటించారు విజయవాడ తాలూకా రైతులు కోలవెన్ను వద్ద సమావేశం జరిపి రౌలతు చట్టానికి వ్యతిరేకంగా తమ ఆక్షేపణ తెలిపారు ఈ సత్యాగ్రహ దినం ఆంధ్రదేశంలో ప్రశాంతంగా గడచిపోయినప్పటికీ, దేశంలోని చాలా ప్రాంతాల్లో ప్రజాప్రదర్శనలు, సమ్మెలు, దొమ్మీలు జరిగాయి పంజాబులోని గుజ్రాన్‌వాలాలోను, అమృతసర్‌లోను, అల్లర్లు చెలరేగాయి పంజాబు ప్రభుత్వం తీవ్రమైన అణచివేత విధానాన్ని అవలంబించింది లెఫ్టినెంట్ గవర్నరయిన మైకెల్ ఒడయ్యరు పంజాబు ప్రజలకు గుణపాఠం చెప్పి రాష్ట్రాన్ని రాజకీయ అల్లర్లకు దూరంగా ఉంచాలని నిర్ణయించుకున్నాడు

## జలియను వాలాబాగ్ మారణకాండ

ఢిల్లీ, పంజాబుల్లోకి గాంధీజీ ప్రవేశాన్ని నిషేధిస్తూ 1919 ఏప్రిలు 8న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది 1919 ఏప్రిల్ 13న జలియనువాలాబాగ్‌లో సమావేశమైన దాదాపు 20 వేల మంది ప్రజలపై జనరలు డయ్యరు తన సైనిక బలాన్ని వినియోగించి కాల్పులు జరపడంతో పరిస్థితులు విషమించాయి జలియను వాలాబాగ్‌లో గల ఒకే ఒక దారిని సైనికులు మూసివేయడంతో ప్రజలు తప్పించుకోడానికి దారిలేకపోయింది మందుగుండు సామగ్రి అయిపోవడంతో కాల్పులు నిలిపారే కాని లేకపోతే ఇంకా ఎక్కువమంది చనిపోయి ఉండేవారు

పంజాబు మారణకాండ దేశం మొత్తం మీద భయోత్పాతాన్ని సృష్టించింది ఈ మారణకాండను తీవ్రంగా ఆక్షేపిస్తూ రవీంద్రనాథ ఠాగూర్ ప్రభుత్వం తన

కిచ్చిన 'నైట్' బిరుదును ప్రభుత్వానికి తిరిగిచ్చేశాడు గంజాం, గోదావరి, కృష్ణాజిల్లా సమావేశాలు ఈ మారణకాండను తీవ్రంగా విమర్శించాయి గంజాం జిల్లా సమావేశంలో వైస్రాయి అయిన చెమ్సుఫర్డ్‌ను బ్రిటీషు ప్రభుత్వం వెనక్కు పిలిపించాలన్న ప్రతిపాదన పరిశీలనకు వచ్చింది మార్షల్ లా పాలనలో ఉన్న పంజాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన ప్రజా ఉద్యమం వల్ల కలిగిన ముఖ్య పరిణామం ప్రాథమిక హక్కుల్ని ప్రకటించాల్సిందిగా కోరడం అని చెప్పవచ్చు 1919 సెప్టెంబరులో జరిగిన నెల్లూరు జిల్లా సమావేశానికి అధ్యక్షత వహించిన టి ప్రకాశం ప్రాథమిక హక్కుల్ని ప్రకటించాల్సిందిగా సూటిగా అడిగాడు

## ఖిలాఫతు ఉద్యమం

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత టర్కీ భవితవ్యాన్ని గూర్చి భారతదేశంలోని ముస్లింలు ఆందోళన చెందారు ఇంగ్లాండు, దాని మిత్రపక్షాలకు వ్యతిరేకంగా జర్మనీతో కలిసి టర్కీ పోరాడింది టర్కీ సామ్రాజ్యం ముక్కచెక్కలయింది ముస్లిం ప్రపంచానికి మత గురువుగా (ఖలీఫ్) పరిగణింపబడుతున్న టర్కీ సుల్తానుకు జరిగిన అవమానం వల్ల భారతదేశంలోని ముస్లింల మతభావాలకు విఘాతం కల్గింది అందువల్ల భారతీయ ముస్లింలు షౌకత్ ఆలీ, మహమ్మదు ఆలీ, సోదరుల నాయకత్వంలో ఖిలాఫతు ఉద్యమాన్ని ప్రారంభించి ఇంగ్లాండుకు వ్యతిరేకంగా తమ అసంతృప్తిని ప్రకటించారు ఈ ఉద్యమంలో గాంధీజీ చేరి వారికి తన సానుభూతిని ప్రకటించాడు ఇంతేకాక 1919 నవంబరు 24న ఢిల్లీలో జరిగిన ముస్లిం సమావేశానికి అధ్యక్షుడుగ తన బాధ్యతల్ని నిర్వహించాడు ఈ సమావేశంలోనే అహింసాయుత సహాయ నిరాకరణ సిద్ధాంతానికి రూపకల్పన చేయడం జరిగింది

1919 వ సంవత్సరపు భారత జాతీయ కాంగ్రెసు వార్షిక సమావేశం అమృతసర్‌లో మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగింది ఈ సమయానికి మాంటేగు-చెమ్సుఫర్డ్ సంస్కరణలు చట్టంగా రూపొందడం, సంస్కరణలు అమలుకు వీలుగా రాజకీయ ఖైదీలందర్ని విడుదల చేయడం జరిగింది ఈ సంస్కరణలు అసమగ్రంగాను, అసంతృప్తికరంగాను, నిరాశా జనకంగాను ఉండడం వల్ల వాటిని తిరస్కరించాలని సి ఆర్ దాసు, తిలక్ అభిప్రాయపడ్డారు గాంధీజీ,

మాలవియాలు మాత్రం వాటిని ప్రయోగాత్మకంగా అమలు చేసి చూడాలని భావించారు చివరికి అందరూ ఒక అంగీకారానికి వచ్చారు దీనికనుగుణంగానే సంస్కరణలు అసమగ్రంగాను, అసంతృప్తికరంగాను, నిరాశాజనకంగాను, ఉన్నాయని, అయితే ఇదే సమయంలో స్వయం నిర్ణయాధికార సూత్రం ఆధారంగా భారతదేశంలో పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పార్లమెంటును కోరుతూ ఒక తీర్మానాన్ని సభ ఆమోదించింది

## సహాయ నిరాకరణోద్యమం

మాంటేగు-చెమ్సుఫర్డ్ సంస్కరణల్ని అమలు చేసేందుకు వీలుగ పార్లమెంటు 1919 భారత ప్రభుత్వ చట్టాన్ని ఆమోదించింది ఈ చట్టం నియోజక వర్గాల పరిమితిని పెంచడం, వివిధ వర్గాలకు, జిల్లాలకు సీట్లను పంచడం వంటి చాల విషయాల్ని భారత ప్రభుత్వ నిర్ణయానికి వదిలేసింది కొత్త చట్టం ప్రకారం శాసనసభ ఎన్నికలు 1920 నవంబరులో జరగాలి అందువల్ల ఆంధ్రులు తమ ప్రయోజనాల్ని కాపాడుకునేందుకు ఆసక్తిని కనపరిచారు ఆంధ్ర మహాసభ స్థాయీసంఘం జనవరిలోను, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటి ఫిబ్రవరిలోను తమ తమ సమావేశాల్ని జరిపాయి ఈ సమావేశాలు 1 ఎన్నిక సీట్లు మొత్తంలో సగానికంటె తక్కువ కాకుండా తెలుగు జిల్లాలకు కేటాయించాలని 2. మద్రాసు విశ్వ విద్యాలయానికి కేటాయించిన రెండు సీట్లలో ఒకదాన్ని ఉత్తర జిల్లాలకు ప్రత్యేకించి కేటాయించాలని 3. మద్రాసు రాష్ట్రానికి కేటాయించిన కేంద్ర కౌన్సిల్ (State Council) లోని నాల్గు సీట్లలో రెండింటిని తెలుగు జిల్లాలకు ప్రత్యేకించి కేటాయించాలని భారత ప్రభుత్వానికి ప్రతిపాదించాయి

1920 సెప్టెంబరులో కాంగ్రెసు ప్రత్యేక సమావేశం కలకత్తాలో జరిగింది కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్య, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఎ కాళేశ్వరరావు, పేట బాపయ్య వంటి ప్రముఖ ఆంధ్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు ఈ సమావేశంలోనే గాంధీజీ ప్రతిపాదించిన అహింసాయుత సహాయ నిరాకరణను చేపట్టాలనే తీర్మానం అత్యధిక మెజారిటీతో ఆమోదించ బడింది. సహాయనిరాకరణలో భాగంగా ప్రభుత్వ బిరుదుల్ని వదులుకోవడం, శాసనసభల్ని, కోర్టుల్ని, ప్రభుత్వ పాఠశాలల్ని, కళాశాలల్ని బహిష్కరించడం

వంటి కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. ఈ తీర్మానాన్ని వ్యతిరేకించిన ముప్ఫై మంది ఆంధ్ర ప్రతినిధుల్లో కొండా వెంకటప్పయ్య కూడా వున్నాడు. అయితే తీర్మానానికిబద్ధుడై మద్రాసు శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు.

పై తీర్మానం ఫలితంగా దేశ రాజకీయ పరిస్థితి మారిపోయింది శాసనసభలకు, ఇతర స్థానిక సంస్థలకు పోటీ చేస్తున్న చాలమంది తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు నవంబరులో జరగబోయే ఎన్నికల్ని బహిష్కరించాలని చాలసభలు, సమావేశాలు నిర్వహించారు. సెప్టెంబరు 28న రాజమండ్రిలో జరిగిన ఒక సమావేశంలో గ్రాడ్యుయేటు ఓటర్లందరూ ఓట్లు వేయకూడదని విన్నవించడం జరిగింది. ఎన్నికల్ని బహిష్కరించవలసిందిగా ప్రచారం చేస్తూ కొండా వెంకటప్పయ్య అనేక జిల్లాల్లో పర్యటించాడు ఈ విధంగా జరిగిన ప్రచారం వల్ల అతి తక్కువమంది మాత్రమే ఎన్నికల్లో ఓటు చేశారు గుంటూరులో 15 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి రాజమండ్రిలోని 120 మంది ముస్లిం ఓటర్లలో ఒక్కరు మాత్రం ఓటింగులో పాల్గొన్నాడు ఇతడు ప్రభుత్వ ఉద్యోగి కావడం విశేషం. చిత్తూరులో 534 ఓట్లకు 135 ఓట్లు, గ్రీమ్సు పేటలో 500 ఓట్లకు 60 మాత్రమే పడ్డాయి

కాంగ్రెసు ఎన్నికల్ని బహిష్కరించిన కారణంగా బ్రాహ్మణేతర వర్గ ప్రయోజనాల్ని కాపాడడానికి ఆవిర్భవించిన జస్టిసు పార్టీ విజయాన్ని సాధించింది ఈ పార్టీ మద్రాసు శాసనసభలోని మొత్తం 98 ఎన్నిక సీట్లలో 63 సీట్లను గెల్చుకుంది సుబ్బరాయులు రెడ్డియార్ ముఖ్యమంత్రిగా మొదటి జస్టిసు పార్టీ మంత్రివర్గం 1920 డిశెంబరు 17న ఏర్పాటయింది పానగల్లు రాజా అయిన రామరాయనింగార్, ఏలూరుకు చెందిన కె వి రెడ్డి నాయుడు మంత్రివర్గంలోని మిగిలిన సభ్యులు

1920 డిశెంబరులో సి విజయరాఘవాచారియార్ అధ్యక్షతన నాగపూర్‌లో కాంగ్రెసు వార్షిక సమావేశం జరిగింది ఈ సమావేశంలోనే కాంగ్రెసు తన విధానాన్ని మార్చుకుంది ఇది వరకు పాటించినట్లు రాజ్యాంగ బద్ధంగా కాక న్యాయమైన, శాంతియుతమైన పద్ధతుల ద్వారా పూర్ణస్వరాజ్యాన్ని సాధించడమే కాంగ్రెసు లక్ష్యమని ఈ సమావేశం ప్రకటించింది సహాయ నిరాకరణ ద్వారా స్వరాజ్యాన్ని సంపాదించగలనని గాంధీజీ వాగ్దానం చేశాడు.

గాంధీజీ పిలుపుకు ఆంధ్రదేశం అమితోత్సాహంతో ప్రతిస్పందించింది సహాయ నిరాకరణోద్యమంలో పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమాన్ని, పల్నాడు అడవి సత్యాగ్రహాన్ని, చీరాల–పేరాల సత్యాగ్రహాన్ని చేపట్టి గుంటూరు జిల్లా మిగతా జిల్లాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది

## ఆంధ్రదేశంలో సహాయనిరాకరణోద్యమం

1921–31 మధ్య కాలాన్ని ఆంధ్రదేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో ఒక వీరోచితమైన గొప్ప అధ్యాయంగా భావించవచ్చు ఈ కాలంలోనే ఆంధ్రులు గాంధీజీ నాయకత్వాన్ని శిరసావహించి దేశస్వాతంత్ర్యం కోసం అనేక త్యాగాలు చేశారు. దేశభక్త కొండా వెంకటప్పయ్య, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు, డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటి ప్రముఖ వ్యక్తులు చైతన్య పూరితమైన నాయకత్వాన్ని అందించారు

## విజయవాడ అఖిల భారత కాంగ్రెసు కమిటి సమావేశం ఏప్రిలు 1921

1921 మార్చి 31 నుండి ఏప్రిల్ 1 వరకు విజయవాడలో అఖిల భారత కాంగ్రెసు కమిటి సమావేశమైంది ఈ సమావేశం ఆధునిక ఆంధ్ర చరిత్రలో కూడ చాల ముఖ్యమైన ఘట్టం. మహాత్మాగాంధీ, మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్ దాస్, మహమ్మదు ఆలీ, షౌకత్ ఆలీ మొదలయిన ప్రముఖ జాతీయ నాయకుల్ని దర్శనం చేసుకునేందుకు ఆంధ్రదేశంలోని అన్ని జిల్లాల నుండి వేలాది మంది జనం హాజరయ్యారు తిలకు స్వరాజ్యనిధికై కోటి రూపాయల్ని సేకరించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు ఈ సమావేశంలోనే పింగళి వెంకయ్య కాంగ్రెస్ త్రివర్ణపతాకానికి రూపకల్పన చేశాడు కొన్ని మార్పులతో గాంధీజీ ఈ పతాకాన్ని అంగీకరించాడు తర్వాత ఈ పతాకమే మరికొన్ని మార్పులతో మన జాతీయ పతాకంగా రూపొందింది

అఖిల భారత కాంగ్రెసు కమిటి సమావేశం తర్వాత గాంధీజీ ఆంధ్రదేశ పర్యటన గావించి కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, చీరాల, నెల్లూరు మొదలగుచోట్ల బహిరంగోపన్యాసాల్ని ఇచ్చాడు గాంధీజీ పర్యటన

ప్రజల్లో గొప్ప ప్రభావాన్ని కలుగజేసింది ముఖ్యంగా ఇది వరకు ప్రజా ఉద్యమాలకు దూరంగా ఉన్న స్త్రీలు గాంధీజీ పర్యటనతో విపరీతంగా ప్రభావితులైనారు దువ్వూరు సుబ్బమ్మ, పొనకా కనకమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ వంటి వారు చక్కటి వక్తలుగా, రాజకీయ చతురులుగా ప్రసిద్ధి చెందారు అఖిల భారత కాంగ్రెసు కమిటి ఆదేశానుసారంగా వేల్సు యువరాజు పర్యటనను ఆంధ్రదేశం బహిష్కరించింది. ఈ సందర్భంగానే విజయవాడలో ప్రజలు పూర్తి హర్తాళ్‌ను స్వచ్ఛందంగా నిర్వహించారు.

## దుగ్గిరాల గోపాల కృష్ణయ్య – చీరాల, పేరాల ఉద్యమం

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య కృష్ణాజిల్లా, నందిగామ తాలూకాలోని పెనుగ్రంచిప్రోలు గ్రామంలో 1889 జూన్ రెండో తేదీన జన్మించాడు గోపాకృష్ణయ్య పుట్టిన మూడు రోజులకే తన తల్లి సీతమ్మ మరణించింది మూడు సంవత్సరాల తర్వాత అతని తండ్రి కోదండరామస్వామి మరణించాడు దీంతో అనాథయైన గోపాలకృష్ణయ్యను అతని పినతండ్రి శివరామయ్య పెంచి పెద్ద చేశాడు. గోపాలకృష్ణయ్య కూచినపూడిలోను, గుంటూరులోను తన విద్యాభ్యాసాన్ని సాగించాడు

1905-11 మధ్య కాలంలో ఆంధ్రదేశంలో వందేమాతరం ఉద్యమం ఉదృతమైంది తీరాంధ్ర దేశంలోని చాలమంది విద్యార్థుల లాగానే గోపాలకృష్ణయ్య కూడ ఉద్యమంలోకి ఉరికాడు 1909లో మచిలీపట్నంలో జరిగిన రెండవ ఆంధ్ర విద్యార్థుల సమావేశంలో పాల్గొన్నాడు

మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడైన తర్వాత గోపాలకృష్ణయ్య బాపట్లలోని తాలూకాఫీసులో కొన్ని నెలలపాటు గుమస్తాగా పనిచేశాడు తర్వాత ఈ ఉద్యోగానికి రాజీనామా చేసి గుంటూరులోని క్రైస్తవమిషను పాఠశాలలో ఉపాధ్యాయుడుగ పనిచేశాడు 1911లో ఉన్నతవిద్యకై ఇంగ్లాండుకు వెళ్ళాడు.

గోపాలకృష్ణయ్య ఎడిన్బరో విశ్వవిద్యాలయంలో చేరి 1916లో ఆర్థికశాస్త్రంలో ఎం ఎ ఆనర్స్ డిగ్రీ పుచ్చుకున్నాడు గోపాలకృష్ణయ్య ఇంగ్లాండులో ఉన్నప్పుడు 'ఎడిన్బరో ఇండియన్ అసోషియేషన్'కు కార్యదర్శిగ

పనిచేశాడు డాక్టరు కె ఆనందకుమారస్వామితో పరిచయమేర్పరచుకొని భారతీయ కళ, సాహిత్యం, తత్వశాస్త్రాల్ని గూర్చి విశేషంగా తెలుసుకోగల్గాడు గాంధీజీ 1915లో ఇంగ్లాండును సందర్శించినపుడు డా॥ కుమారస్వామి గోపాలకృష్ణయ్యను లండనుకు తీసుకుని వచ్చి 'ఉజ్వల భవిష్యత్తు గల మీ దేశపు వ్యక్తి ' అని గాంధీజీకి పరిచయం చేశాడు

స్వదేశానికి తిరిగి వచ్చిన తరువాత గోపాలకృష్ణయ్య రాజమండ్రిలోని ప్రభుత్వ ట్రైనింగు కాలేజీలో చరిత్ర, ఆర్థిక శాస్త్రం ఆచార్యుడుగ చేరాడు అక్కడ కేవలం తొమ్మిది నెలలు మాత్రమే పనిచేశాడు 1918లో మచిలీపట్నంలోని ఆంధ్రజాతీయ కళాశాలలో వైస్- ప్రిన్సిపాలుగ చేరి 8 నెలలు మాత్రమే పనిచేశారు ఈ రెండు కళాశాలల్లో అమలు జరుగుతున్న విద్యావిధానం ఆయనకు నచ్చలేదు అందువల్ల చీరాల వద్ద ఆంధ్రవిద్యా పీఠగోష్ఠి' అనే సంఘాన్ని గోపాలకృష్ణయ్య ప్రారంభించాడు

## చీరాల – పేరాల ఉద్యమం

స్వాతంత్రోద్యమ చరిత్రలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఘట్టం చీరాల-పేరాల ఉద్యమం చీరాల-పేరాల అనేవి ప్రకాశం జిల్లా, బాపట్ల తాలూకాలోని రెండు ఇరుగు పొరుగు గ్రామాలు 1921 సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం ఈ రెండు గ్రామాల్లో దాదాపు 15 వేల జనాభా ఉండేవారు ఈ రెండు గ్రామాల్తోపాటు జాండ్రపేట, వీరరాఘవపేట గ్రామాలు కలిపి చీరాల యూనియనుగ ఏర్పాటు చేశారు ఈ చీరాల యూనియను నుండి సంవత్సరానికి 4,000 రూపాయలు పన్ను రూపంలో వసూలయ్యేది. 1919లో మద్రాసు ప్రభుత్వం చీరాల, పేరాల గ్రామాల్ని కలిపి పురపాలక సంఘంగా ఏర్పాటు చేసి మిగిలిన గ్రామాలైన జాండ్రపేట, వీరరాఘవ పేటలను చీరాల యూనియనుగానే కొనసాగించింది పురపాలకసంఘంగా ఏర్పడడంతో చీరాల-పేరాల ప్రజలపై 40,000 రూపాయల పన్నుల భారం పడింది అయితే దీనికి తగ్గట్టుగ సౌకర్యాల్ని కూడ కల్పించలేదు. చాలనుంది ప్రజలు తక్కువ ఆదాయవర్గానికి చెందిన నేతపనివారు, చిన్న చిన్న రైతులు కావడంతో పెంచిన పన్నులు భారమనిపించింది అందువల్ల ప్రజలు తమ గ్రామాలు ముందు మాదిరిగానే

చీరాల యూనియనులోనే కొనసాగాలని ప్రభుత్వానికి అనేక విన్నప పత్రాలు సమర్పించారు.

1919 సంస్కరణల ప్రకారం స్థానిక పరిపాలనాంశం బదలాయింపు శాఖ క్రిందికి వచ్చింది. అందువల్ల ఈ స్థానిక పరిపాలనను జస్టిసు పార్టీ ముఖ్యమంత్రియైన రాజారామరాయనింగార్ తన ఆధ్వర్యంలో ఉంచుకున్నారు జస్టిసు పార్టీ, కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకం కావడం ఇక్కడగమనించాల్సిన విశేషం 1921 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చీరాల సందర్శించినపుడు ప్రజలు మునిసిపాలిటీని రద్దు చేయమని కోరారు. అయితే ఈ ప్రజలకు నాయకత్వం వహించిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య బ్రాహ్మణుడే కాక కాంగ్రెసు పార్టీ సభ్యుడు కావడం చేత ముఖ్యమంత్రి ప్రజల కోరికను తిరస్కరించాడు

తాము సమర్పించిన అనేక విన్నపాల వల్ల ఫలితం లేకపోగా, చీరాల పేరాల ప్రజలు గోపాలకృష్ణయ్య నాయకత్వంలో పన్నుల నిరాకరణోద్యమాన్ని ప్రారంభించి తమపై విధించిన పురపాలక పన్నులను కట్టకుండ తిరస్కరించారు. 1921 మార్చిలో పన్నుల్ని చెల్లించేందుకు నిరాకరించిన 12 మందిని అరెస్టు చేశారు. వీరిలో ఒక వయసు మళ్ళిన మహిళ కూడ ఉండడం విశేషం ఈమె బహుశా భారతదేశంలోనే మొట్టమొదటి మహిళా రాజకీయ ఖైది అయిఉంటుదని భావించవచ్చు ప్రజల అవసరాల్ని చూసేందుకు 'రామదండు' అను స్వచ్ఛంద సేవాదళాన్ని ఏర్పాటు చేశారు ఏప్రిల్ 30న గోపాలకృష్ణయ్య విజయవాడ వెళ్ళి అఖిల భారత కాంగ్రెసు కమిటి సమావేశానికి వచ్చిన గాంధీజీని కలుసుకున్నాడు ఏప్రిలు 6న చీరాలకు వచ్చిన గాంధీజీ పన్నుల నిరాకరణోద్యమాన్ని శాంతియుతంగా సాగించమని ప్రజలకు ఉద్బోధించాడు అవసరమైతే ప్రజలు తమ ఇళ్ళను కూడ ఖాళీ చేసినట్లయితే మునిసిపాలిటీ కనిపించకుండా పోతుందని గాంధీజీ సలహా ఇచ్చాడు ఈ సలహాను తు.చ తప్పకుండ పాటించిన చీరాల పేరాల ప్రజలు 1921 ఏప్రిలు 25న అర్ధరాత్రి తమ ఇళ్లను ఖాళీ చేసి గ్రామశివార్లలో 'రామ్‌నగర్' అనే పేరుతో ఒక గృహసముదాయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 15,326 మందిగల మొత్తం జనాభాలో 13,752 గ్రామస్తులు తమ ఇళ్ళను ఖాళీ చేయడం ఉద్యమ తీవ్రతను స్పష్టం చేస్తుంది తర్వాత 11 నెలలపాటు వారు 'రామనగరు'లోనే ఉండిపోయారు 1921 వేసవిలో ఉష్ణోగ్రత 120 డిగ్రీల

ఫారన్‌హీటు చేరుకుంది ఇదేగాక జూలై, ఆగస్టు నెలల్లో కుంభవర్షం కురిసింది కొన్ని వారాల్లోనే 10 5 అంగుళాల వర్షం నమోదయింది

ప్రజలు తమ ఇళ్ళను ఖాళీ చేయడం వల్ల వారి వ్యాపారం దెబ్బతింది దీనితో ఆర్థికపరమైన సమస్యలు ఎదురయ్యాయి విరాళిచ్చేందుకు చాల కొద్ది మంది మాత్రమే ముందుకు వచ్చారు 1921 సెప్టెంబరులో బరంపురంలో జరిగిన ఆంధ్రమహాసభ సమావేశానికి గోపాలకృష్ణయ్య హాజరయ్యాడు హాజరు కావడమే కాక చందాలు కూడ వసూలు చేయాలని సంకల్పించాడు అయితే గోపాలకృష్ణయ్యను అరెస్టు చేసి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడన్న నేరంపై విచారించి ఒక సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్ష విధించారు

గోపాలకృష్ణయ్యను అరెస్టు చేయడంతో ప్రజల నైతిక బలం దెబ్బతింది వారికి నాయకత్వం వహించడానికి ఏ కాంగ్రెసు ప్రముఖుడూ ముందుకు రాలేదు అందువల్ల ప్రజలకు తమ ఇళ్ళకు చేరుకోవడం తప్పని సరి అయింది

## చీరాల ఉద్యమం విఫలం కావటానికి కారణాలు

గోపాలకృష్ణయ్యకు ప్రజల్లో గొప్ప ఆదరణ లభించడం, ఆయన చేపట్టిన కార్యక్రమాలు కాంగ్రెసు నాయకుల్లో ఈర్ష్యను కలిగించాయి కొండా వెంకటప్పయ్య, పట్టాభిసీతారామయ్య వంటి నాయకులు సైతం ఈ ఉద్యమం కొనసాగడానికి సహకరించలేకపోయారు 1921 అక్టోబరులో గోపాలకృష్ణయ్య అరెస్టు కావడంతో ప్రజల్ని నడిపించే నాయకుడు కరువయ్యాడు ఇదేగాక తగిన ఆర్థికస్తోమతు కూడ లేకపోవడంతో ఈ ఉద్యమం కొనసాగడానికి వీలు లేకపోయింది 1921లో బార్డోలీ సత్యాగ్రహాన్ని నడిపేందుకు గాంధీజీ 10 లక్షలు ఖర్చు పెట్టగా, తిలకు స్వరాజ్యనిధికి 8000 రూపాయల్ని సమకూర్చిపెట్టిన చీరాల ప్రజలకు కనీసం 4000 రూపాయల్ని కూడ సహాయం చేయలేకపోయింది ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటి

## చీరాల పేరాల ఉద్యమంపై గాంధీజీ అభిప్రాయం

చీరాల పేరాల ఉద్యమాన్ని గూర్చి గాంధీజీ తన 'యంగ్ ఇండియా' పత్రికలో ఈ విధంగా అభిప్రాయపడ్డాడు

"నిజానికి చీరాల – పేరాల ఒకే గ్రామం సముద్రానికి అల్లంత దూరంలో చక్కటి వాతావరణంతో 15,000 మంది జనాభాను కల్గి ఉంది వీరిపై పురపాలక సంఘాన్ని రుద్దాలని ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది అయితే ప్రజలు దీనికి వ్యతిరేకంగా తమ నిరసన తెలిపారు వీరి దృష్టిలో పురపాలక సంఘం అంటే ఏంటో చూద్దాం చక్కటి పరిశుభ్రత కోసమా? కాదు ప్రజలు ఇదివరకే సహాయ నిరాకరణోద్యమంలో మునిగి ఉన్నారు ఇది కేవలం ఎక్కువ పన్నుల్ని గుంజడం కోసం, ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాల్లో జోక్యం చేసుకోవడం కోసమే ఇది ప్రజలు సహించలేని ఒక దుష్పరిణామం.

## పల్నాడు అటవీ సత్యాగ్రహం

ఆంధ్రదేశంలో సాగిన సహాయ నిరాకరణోద్యమంలో చెప్పుకోదగ్గ ముఖ్య సంఘటన పల్నాడు అటవీ సత్యాగ్రహం పల్నాడు గుంటూరు జిల్లాలోని ఒక వెనుకబడిన ప్రాంతం ఈ ప్రాంత ప్రజలకు స్థానికాధికారుల వల్ల, ముఖ్యంగా అటవీశాఖాధికారుల వల్ల చాల ఇబ్బందులు ఎదురయ్యాయి అటవీ శాఖలోని క్రింది స్థాయి ఉద్యోగులు ప్రజల్ని నానావిధాలుగ పీడించేవారు తమ పశువుల్ని మేపుకోవడం కోసం, వంట చెఱకు తెచ్చుకోవడం కోసం లంచం ఇవ్వందే పేద ప్రజల్ని అడవిలోకి రానిచ్చేవారు కారు అధికారుల కోర్కెలు తీర్చని వారిని అటవీ చట్టం క్రింద నిర్బంధించేవారు 1921లో వర్షాలు లేకపోవడంతో పశువుల మేతకు తీవ్రమైన కొరత ఏర్పడింది తమ పశువుల్ని అడవిలో మేపుకునేందుకు అనుమతించాల్సిందిగా ఛాలమంది ప్రజలు ప్రభత్వానికి విన్నవించారు తమ విన్నపానికి ఎటువంటి సమాధానం లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందారు అందువల్ల వారు సహాయనిరాకరణోద్యమం వైపు ఆకర్షితులయ్యారు తమ బాధల్ని వ్యక్తపరిచేందుకు ఈ ఉద్యమంలో చేరడం తప్ప అన్యదా ప్రజలకు గత్యంతరం లేకపోయింది

పల్నాడు ప్రాంతంలోని ముఖ్యమైన పట్నమైన మాచర్లలో ప్రజలు అధికారుల్ని సాంఘిక బహిష్కారణకు గురిచేశారు చాకలి, మంగలి వంటివారు తమ సేవల్ని అందించడం మానివేయడమే కాకుండ వ్యాపారస్థులు సైతం ప్రభుత్వోద్యోగులకు సరకులు అమ్మడానికి తిరస్కరించారు ఈ ప్రాంతంలో

ముఖ్యఅధికారియైన తహసీల్దారు వంటి వ్యక్తికి కూడ పిల్లలకు కావలసిన పాలు కరువైంది. సాంఘిక బహిష్కరణ గూర్చిన వార్త అందేసరికి, కలెక్టరు ఆ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని స్వయంగా సమీక్షించాడు. అయితే ఆయనకు కూడా అదే విధమైన సాంఘిక బహిష్కరణ ఎదురైంది. తనకు పోలీసు సూపరింటెండెంటుకు కావలసినవిగాని, చివరకు వాహన సౌకర్యం కూడ పొందలేక పోయారు కలెక్టరు తన ఆదేశాల్ని తండోరా వేయించాలని ప్రయత్నించినపుడు ఊరిలోని, పొరుగూరిలోని డప్పులన్నీ చెడిపోయాయనే సమాధానం ఎదురైంది. సాంఘిక బహిష్కరణ పూర్తిగ విజయవంతం అయింది.

1921 జూలైలో గుంటూరు జిల్లాలో ముఖ్య నాయకులైన ఉన్నవ లక్ష్మీనారాయణ, వేదాంతం నరసింహాచారి పరిస్థితిని స్వయంగా అధ్యయనం చేసేందుకు ఈ ప్రాంతానికి వచ్చారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కలెక్టరు వీరిద్దరు తమ ప్రవర్తనపై జామీను పత్రాలు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ప్రజలు ఈ ఇద్దరు నాయకుల్ని తీసుకుని గొప్ప ఊరేగింపుగా కలెక్టరు బసకు వెళ్ళారు. ఈ ఊరేగింపులో డప్పులు కూడా వాయించారు. దీంతో కలెక్టరు కోపంతో ఊగిపోయాడు. ఆ ఉదయమే తాను డప్పుల కోసం కబురంపినపుడు ఒక్కటి కూడ లేదనే సమాధానం ఎదురైంది. ఇందువల్ల ఈ ఇద్దరి నాయకులకు ఒక సంవత్సరం పాటు జైలుశిక్ష పడింది. ఈ నాయకుల అరెస్టుకు నిరసనగా గుంటూరులో ఒక వారం రోజులపాటు హర్తాళ్ జరిగింది.

లక్ష్మీనారాయణ, నరసింహాచారులను అరెస్టు చేయడంతో పల్నాడులో పరిస్థితి విషమించింది ఈ సాంఘిక బహిష్కరణ పన్నుల నిరాకరణోద్యమంగా మారిపోయింది ప్రజలు అటవీ చట్టాల్ని ఉల్లంఘించడం ప్రారంభించారు. తమ పశువుల్ని రిజర్వు అడవులలోకి తోలారు. ఈ ఉద్యమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అటవి చట్టాల్ని ఉల్లంఘిస్తూ ఉత్సాహంతో ముందుకు ఉరుకుతున్న ప్రజలముందు కాంగ్రెసు నాయకులు తమ బలహీనతల్ని ప్రదర్శించారు. 1921 ఆగస్టులో జరిగిన పల్నాడు తాలూకా రాజకీయ సమావేశంలో పాల్గొంటూ అఖిల భారత కాంగ్రెసు కమిటి అమోదం పొందలేదుకాబట్టి ఈ పన్నుల నిరాకరణోద్యమం అనధికారమైందని కొండా వెంకటప్పయ్య భావించాడు సాంఘిక బహిష్కారాన్ని మాత్రం అమలు చేస్తూ, అటవి చట్టాల్ని ఉల్లంఘించడం

మానేయాలని చెపుతూ ప్రజల ఉత్సాహానికి అడ్డు తెరలు వేయాలని కాంగ్రెసు నాయకులు ప్రయత్నించారు.

ప్రజలు వీరి సలహాల్ని పట్టించుకునే స్థితిలో లేరు పన్నుల నిరాకరణోద్యమాన్ని ఉధృతం చేశారు. ప్రజలకు, అటవీ గార్డులకు మధ్య ఘర్షణలు మామూలై పోయాయి శాంతిభద్రతల్ని కాపాడడం కోసం అధిక సంఖ్యలో రంగంలోకి దిగిన పోలీసులు ప్రజల్లో భయభ్రాంతుల్ని సృష్టించడానికి ప్రయత్నించారు 1922 ఫిబ్రవరిలో పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం తీవ్రదశకు చేరుకోవడంతో పరిస్థితులు విషమించాయి చాల గ్రామాల్లో పోలీసుల్ని తరిమి కొట్టడం జరిగింది వెల్దుర్తి గ్రామంలో పోలీసులుంటున్న బంగళాను చుట్టుముట్టడం జరిగింది పోలీసులు అతి కష్టం మీద చీకటి రాత్రిలో తప్పించుకోగల్గారు జల్లిపాలెం అనే మరో గ్రామంలోని ప్రజలు పోలీసుల చేతుల్లో ఉన్న పశువుల్ని బలవంతంగా విడిపించారు ఈ గ్రామాల్లో పరిస్థితులు విషయమించడంతో కలెక్టరు, పోలీసు సూపరింటెండెంటు జల్లిపాలెం గ్రామాన్ని స్వయంగా సందర్శించి చాలమంది ప్రజల్ని నిర్బంధంలోకి తీసుకున్నారు. మించాలపాడు అనే గ్రామ సమీపంలో చాల తీవ్రమైన సంఘటన జరిగింది అక్రమంగా పశువుల్ని మేపడం, అటవీ శాఖాధికారుల్ని హింసాయుత పద్ధతుల్లో ఎదుర్కోవడం వంటి తీవ్రమైన విషయాలు ఈ సంఘటనలో చోటు చేసుకున్నాయని కలెక్టరు స్వయంగా అంగీకరించాడు ఈ ప్రాంతంలోని ఉద్యమానికి కన్నుగంటి హనుమంతు నాయకత్వం వహించాడు. 1922 ఫిబ్రవరి 26న పోలీసులు, అటవీ శాఖాధికారులు 50 మేకల్ని, 125 గేదెల్ని పట్టుకొని ముట్కూరు చెరువు వైపుకు తోలుకెళ్ళారు అయితే మార్గ మధ్యంలో 300 మంది పురుషులు, స్త్రీలు దాడి జరిపి పశువుల్ని రక్షించుకోగల్గారు దీంతో పోలీసులు కాల్పులు ప్రారంభించడంతో కన్నుగంటి హనుమంతుతో పాటు మరో ఇద్దరు మరణించారు. దీంతో ప్రజలు చెల్లా చెదురయ్యారు. మరసటి రోజు కలెక్టరు, పోలీసు సూపరింటెండెంటు మించాలపాడు గ్రామాన్ని సందర్శించి చాలమంది ప్రజల్ని అరెస్టు చేశారు.

తమ నాయకుడు చనిపోవడమూ, కాంగ్రెసు ఉదాసీన వైఖరి ప్రజల్ని నైతికంగా దెబ్బతీసింది. అందువల్ల వారు ఉద్యమాన్ని విరమించడం జరిగింది. 1922 మార్చి 1 కల్లా ఈ ప్రాంతంలో మామూలు పరిస్థితులు నెలకొన్నాయి.

## పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం

ఆంధ్రదేశంలో సాగిన సహాయనిరాకరణోద్యమ చరిత్రలో మరో ముఖ్యమైన సంఘటన గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా, పెదనందిపాడు ఫిర్కాలో సాగిన పన్నుల నిరాకరణోద్యమం ఈ ఉద్యమ విజయాన్ని మద్రాసు గవర్నరయిన లార్డ్ వెల్లింగ్టన్ ఒప్పుకుంటూ ఈ ఉద్యమం భారతదేశంలోని బ్రిటిషు సామ్రాజ్యపు పునాదుల్ని కదలించి వేసిందని వ్యాఖ్యానించాడు ఒక విశేషమేమిటంటే ఈ ఉద్యమం కాంగ్రెసు ఆధ్వర్యంలో జరుగలేదు. అయితే గుంటూరుజిల్లా నాయకులైన కొండా వెంకటప్పయ్య, గొల్లపూడి సీతారామశాస్త్రి (తర్వాత స్వామి సీతారాం) వంటివారు ఉద్యమానికి తమ మద్దతు తెలిపి అది కొనసాగడానికి సహకరించారు

ఈ ఉద్యమ ఆవిర్భావం రాజకీయమైంది కాదు. గ్రామాధికారుల ఉద్యోగరీత్యా ఉత్పన్నమైన సమస్యల వల్ల ఈ ఉద్యమం ప్రారంభించబడింది రెవిన్యూ బోర్డుకు, ప్రభుత్వానికి గ్రామాధికారుల సంఘం పెట్టుకున్న అనేక విన్నపపత్రాల తర్వాత కూడ వీరి ఉద్యోగస్థితిగతుల్లో మెరుగుదల కన్పించలేదు తక్కువ జీవతమిచ్చి ఎక్కువ పని చేయించుకోవడం అన్నది గ్రామాధికారుల ప్రధాన సమస్య గ్రామోద్యోగుల్ని తగ్గించడం వంటివి ఇతర సమస్యలు సహాయ కరణం, సహాయక గ్రామాధికారి, వెట్టి, మొహతాదు వంటి ఉద్యోగాల్ని ప్రభుత్వం పాదుపుపేర రద్దు చేసింది తమ సమస్యల్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెద్దనందిపాడుకు చెందిన గ్రామాధికారులు తమ రాజీనామాల్ని సమర్పించారు. దీని ఫలితంగా శిస్తు వసూళ్ళు నిలిచిపోయాయి. రాజీనామా చేసిన వారి స్థానంలో ఇతరుల్ని నియమించకపోవడంతో ప్రభుత్వం యొక్క ప్రతిష్ఠ పూర్తిగ దెబ్బతింది.

ఈ పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమానికి నాయకత్వం వహించింది పర్వతనేని వీరయ్య చౌదరి. వీరయ్య చౌదరి పాఠశాల చదువుకు కూడ

నోచుకోకపోయినా సంఘటిత శక్తికి, నిష్కల్మషానికి మరోపేరుగ భావించవచ్చు ఆయన పుట్టుకతోనే నాయక లక్షణాల్ని పుణికి పుచ్చుకున్న వ్యక్తి అందువల్లే ఆ ప్రాంతం ప్రజలు చౌదరి మాటను వేదవాక్కుగ పరిగణించేవారు గ్రామాధికారులకు మద్దతు తెలుపుతూ ప్రజలు ప్రభుత్వానికి పన్నులు కట్టడం నిలిపేశారు. పోలీసులు, ఇతర అధికారులు లొంగిపొమ్మని నాయకుల్ని బెదరించినపుడు ప్రజలు ప్రభుత్వాధికారులందర్ని సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. పరిస్థితుల్ని చక్కబెట్టేందుకు రెవిన్యూబోర్డు సభ్యుడైన హారిస్‌ను ప్రభుత్వం పెదనందిపాడుకు పంపింది గ్రామాధికారుల సమస్యల్ని సత్వరమే పరిష్కరించగలమని హారిస్ హామీ ఇచ్చినా వారి రాజీనామాల్ని మాత్రం ఉపసంహరింపజేయ లేకపోయాడు పరిస్థితుల తీవ్రతను గ్రహించిన హారిస్ – "ఈ ఉద్యమాన్ని తరుచుగ సహాయనిరాకరణ ఉద్యమంగాను లేక శాసనోల్లంఘనోద్యమంగాను వ్యవహరిస్తారు దీన్ని ప్రయత్న పూర్వకంగ చేపట్టిన విప్లవంగా భావించవచ్చు ప్రస్తుతమున్న ప్రభుత్వాన్ని కూలదోయడమే దీని ముఖ్యోద్దేశం" అని ప్రభుత్వానికి నివేదించాడు గుంటూరు కలెక్టరు కూడ ఇదే విధంగా భావిస్తూ – "ప్రస్తుతానికి శాంతియుతంగా సాగినా, ఈ ఉద్యమాన్ని బహిరంగ తిరుగుబాటుగ భావించవచ్చు" అని ప్రభుత్వానికి తెలియజేశాడు

గ్రామాధికారుల రాజీనామాల్ని ఉపసంహరింపజేసేందుకు ప్రభుత్వం శతవిధాల ప్రయత్నించింది వారి వంశపారంపర్య హక్కుల్లో ప్రభుత్వ జోక్యం ఉండదని, వారి ఉద్యోగ స్థితిగతుల్ని మెరుగుపరచగలమని హామీలు ఇచ్చింది ఈ ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ప్రభుత్వం బెదిరింపు చర్యలకు దిగింది రాజీనామా చేసిన వారి స్థానంలో కొత్తవారిని నియమించింది అయితే ఈ ప్రయత్నం కూడ విఫలమయింది ఈ ప్రాంతపు ప్రజలు 'శాంతిసేన' అనే ఒక స్వచ్ఛంద సేవాదళాన్ని ఏర్పాటు చేసుకున్నారు ఈ శాంతిసేన కొత్త అధికారుల్ని ఉద్యోగంలో చేరకుండా అడ్డుకోగల్గింది

చివరకు ప్రభుత్వం మరో ఎత్తుగడతో ప్రజల్లో చీలికలు తేవాలని ప్రయత్నించింది ముస్లింలను ఈ ఉద్యమం నుండి విడదీసేందుకు ఒక ముస్లిం సబ్-ఇన్‌స్పెక్టరును ఈ ప్రాంతంలో నియమించింది రైతులు ఎక్కువగ కమ్మకులస్థులు కావడం చేత వారిని ఒప్పించి పన్నులు కట్టించేందుకు సహకార

శాఖలోని ఒక కమ్మ కులస్థుడైన ఇన్‌స్పెక్టరును డిప్యూటీ కలెక్టరుగ నియమించింది. అయితే ఈ ప్రయత్నాలన్నీ కూడ విఫలం కావడంతో ప్రభుత్వం ఈ ప్రాంతంలో సైన్యాన్ని దించింది దీనివల్లకూడ శిస్తు వసూళ్లు జరుగలేదు. ఈ విధంగా ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో ఉండగా కాంగ్రెసు వారిలో తలెత్తిన విభేదాలు ఈ సమస్య పరిష్కారానికి దోహదం చేశాయి

మొదటి నుండి ఈ ఉద్యమానికి మహాత్మాగాంధి తన సుముఖతను వ్యక్తం చేయలేదు ఇది స్వచ్ఛందంగా సాగే ప్రజా ఉద్యమం కావడం వల్ల జిల్లా కాంగ్రెసు నాయకులు పన్నుల నిరాకరణకు చేదోడు వాదోడుగ ఉన్నారు ఈ ఉద్యమం ఉన్నత దశకు చేరుకున్నప్పుడు కొండా వెంకటప్పయ్యకు వ్యతిరేకులైన ఆంధ్ర కాంగ్రెసు నాయకులు కొంతమంది ఉద్యమతీరును పరిశీలించేందుకు ఒక ఉపసంఘాన్ని నియమించాలని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీపై ఒత్తిడి తెచ్చారు దీనికనుగుణంగానే ఈ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితుల్ని నివేదించేందుకు కె నాగేశ్వరారావు, టంగుటూరి ప్రకాశం, డి నారాయణ రాజులతో గూడిన ఒక ఉపసంఘాన్ని నియమించడం జరిగింది ఈ ప్రాంతంలో పర్యటించిన ఉపసంఘం ఉద్యమం సాగే తీరు పట్ల తన సంతృప్తిని వ్యక్తం చేసింది అయితే ప్రభుత్వం అణచివేత చర్యల్ని చేపడితే మాత్రం ఈ ఉద్యమం హింసాయుతంగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది

1922 ఫిబ్రవరి 10న జరిగిన గుంటూరు జిల్లా కాంగ్రెసు సమావేశంలో ఉపసంఘ నివేదిక పరిశీలనకు వచ్చింది అయితే సరిగ్గా ఇదే సమయంలోనే బార్డోలి సత్యాగ్రహ ఫలితాలు అందేవరకు పెదనందిపాడు ఉద్యమాన్ని ఆపేయాల్సిందిగా మహాత్మాగాంధీ ఒక ఉత్తరాన్ని కొండా వెంకటప్పయ్యకు పంపాడు ఈ ఉత్తరం ఆంధ్ర కాంగ్రెసు నాయకుల్ని కలవరపెట్టింది అత్యున్నత దశలో సాగుతున్న ఉద్యమాన్ని విరమిస్తే కాంగ్రెసు ప్రతిష్ట దెబ్బతినడమే కాక ప్రభుత్వం తీవ్రమైన అణచివేత చర్యలకు పాల్పడవచ్చునని కాంగ్రెసు వారికి బాగా తెలుసు. అయినప్పటికి ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా మహాత్మాగాంధీ పట్ల విధేయతతో ఈ ఉద్యమాన్ని కాంగ్రెసు నాయకులు విరమించారు. నాయకులు ఊహించిన విధంగానే ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడింది. తుపాకితో కాల్చి చంపుతామన్న బెదిరింపుతో వీరయ్య చౌదరి తన పాశ్చాత్తాపాన్ని

ప్రకటించాల్సి వచ్చింది 1922 మార్చి చివరికల్లా ఆంధ్రదేశంలో సహాయనిరాకరణోద్యమం సద్దు మణిగింది బ్రిటీషు ప్రభుత్వం తన అధికారాన్ని మునుపటిలాగానే పటిష్టం చేసుకోగల్గింది

## అల్లూరి సీతారామరాజు – రంప ఉద్యమం

ఆంధ్రదేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు సాగించిన విప్లవం ఒక ప్రధాన ఘట్టం రంప ఉద్యమంగా ప్రసిద్ధి చెందిన ఈ ఉద్యమం కాంగ్రెసు ఆధ్వర్యంలో జరగకపోవడం విశేషం ఇదేగాక ఈ ఉద్యమం 1922 జనవరి నుండి 1924 మే నెల వరకు దాదాపు రెండు సంవత్సరాల అయిదు నెలలు కొనసాగింది తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితమైన ఈ ఉద్యమం సహాయ నిరాకరణోద్యమం కంటె ఎక్కువగా ప్రభుత్వానికి ఇబ్బందుల్ని కల్గించింది

రంప ఉద్యమ నాయకుడైన అల్లూరి సీతారామరాజు 1897లో పశ్చిమ గోదావరి జిల్లాలోని మొగ్గల్లు గ్రామంలో జన్మించాడు 1921 నాటికి సహాయ నిరాకరణోద్యమంవైపు ఆకర్షితుడయ్యాడు బ్రిటీషు ప్రభుత్వాన్ని పడగొట్టాలని భావించాడు అయితే గాంధీజీ ప్రబోధించిన అహింసా పద్ధతిలో ఆయనకు నమ్మకం కుదరలేదు సహజంగా క్షత్రియుడు కావడంతో తన కోర్కె నెరవేరడానికి యుద్ధమే శరణ్యమని నమ్మాడు 1921 జూలైలో చిట్టగాంగుకు వెళ్ళి అక్కడ జరిగిన బెంగాలు విప్లవకారుల రహస్య సమావేశంలో పాల్గొన్నాడు చిట్టగాంగ్ నుండి తిరిగి వచ్చిన తరువాత తూర్పుగోదావరి జిల్లాలోని గూడెం కొండల్ని తన కార్యకలాపాలకు స్థావరంగా ఎన్నుకున్నాడు దీనికి కారణం ఇక్కడి గిరిజనులు స్థానిక తహసిల్‌దారు బాస్టియన్ అక్రమ చర్యల వల్ల ముఠాదారీ పద్ధతి వల్ల, ప్రభుత్వం యొక్క అడవుల రిజర్వ విధానం వల్ల ఎన్నో కష్టనష్టాలకు గురై అసంతృప్తితో ఉండడమే అసంతృప్తులైన ఈ గిరిజనుల్ని సులభంగా ఉద్యమంవైపు ఆకర్షించవచ్చునని ఆయన భావం. ఉద్యమాన్ని నడపడం కోసం కావలసిన సామగ్రిని సమకూర్చుకోవడం రాజుకు ప్రధాన సమస్య అయింది అందువల్ల ఆయన పోలీసు స్టేషన్లపై దాడిచేయడం ప్రారంభించాడు 1922 ఆగష్టు 22న చింతపల్లి పోలీసుస్టేషనుపై తన మొదటి

దాడిని నిర్వహించాడు రాజుకు 'గంసోదరులు'గ పిలువబడే గంమల్లుదొర, గం గంటదొర అనువారు నమ్మినబంట్లుగా ఉండేవారు రాజు తన కార్యకలాపాల్ని ఇరుగుపొరుగు ప్రాంతాలకు కూడ విస్తరింపజేసి కృష్ణదేవుపేట, రాజవొమ్మంగి మొదలగు పోలీసు స్టేషన్లపై దాడి నిర్వహించాడు పరిస్థితుల తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం స్కాట్ కవార్డ్, హైటస్‌ల నాయకత్వంలో సాయుధ పోలీసు దళాన్ని పంపింది సాయుధ పోలీసుల తరలింపును ముందుగనే తెలుసుకున్న రాజు దామనపల్లి ఘాట్ వద్ద పొంచిఉండి పోలీసులపై మెరుపుదాడి జరిపి స్కాట్ కవార్డ్, హైటస్‌లను చంపేశాడు రాజు ధాటికి తట్టుకోలేక తమ ఆయుధ సామగ్రినంతా వదలిపెట్టి పోలీసులు వెనకకు మళ్ళారు

రాజు దాడుల్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం మలబారునుండి ప్రత్యేక పోలీసు దళాన్ని రప్పించింది 1922 డిశెంబరు 6న పెద్దగడ్డపాలెం వద్ద పోలీసులు రాజుపై ఆకస్మిక దాడిని నిర్వహించారు అయితే రాజు తప్పించుకున్నాడు తర్వాత కొంతకాలం పాటు రాజు జాడ తెలియకపోయేసరికి ప్రభుత్వం మలబారు పోలీసుల్ని వెనక్కు రప్పించింది అయితే 1923 ఏప్రిలు 18న రాజు అన్నవరం పోలీసు స్టేషనుపై దాడి జరిపి తన కార్యకలాపాల్ని తిరిగి ప్రారంభించాడు ఇక్కడ ఆయుధ సామగ్రి లాంటిది ఏదీ లభించలేదు అయితే స్థానిక ప్రజలే కాకుండా ప్రభుత్వాధికారులైన డిప్యూటీ తహసీల్దారు, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు వంటివారు కూడ రాజుకు విజయోత్సాహంతో స్వాగతం పల్కారు

1923 సెప్టెంబరు 18న నడింపల్లి గ్రామం వద్ద గంమల్లుదొర పట్టుబడడంతో రాజుకు మొదటిసారిగా ఎదురుదెబ్బ తగిలింది పోలీసు స్టేషన్లలో ఆయుధ సామగ్రి ఉంచకుండా ప్రభుత్వం జాగ్రత్త పడడంతో పోలీసు స్టేషన్లపై దాడి చేయడం వల్ల రాజుకు ప్రయోజనం లేకపోయింది ప్రభుత్వం రెండు అస్సాం రైఫిల్సు దళాల్ని రప్పించింది రూథరుఫర్డ్‌ను ప్రత్యేక కమీషనురుగ నియమించి రాజును పట్టుకునే బాధ్యతను ఆయనకు అప్పగించింది. ఇన్ని విధాల ప్రభుత్వం కట్టుదిట్టం చేసినా రాజు తన కార్యకలాపాల్ని నిరాటంకంగా కొనసాగించాడు 1924 మే 6న రాజు సన్నిహిత సహచరుడు, అగ్గిరాజుగా ప్రసిద్ధి చెందిన పేరిచర్ల సూర్యనారాయణ మద్దేరు వద్ద ప్రభుత్వానికి పట్టుబడ్డాడు మరునాటి రోజే జమేదారు కుంచుమీనన్ రాజును బంధించగల్గాడు రాజును

క్రొయ్యూరుకు తెచ్చి అక్కడ కాల్చి చంపారు దీంతో రంప ఉద్యమం అంతమైంది

రంప ఉద్యమం ఆంధ్రప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసింది రాజుయొక్క వీరగాధను ఈనాటికీ ప్రజలు వేనోళ్ళ కొనియాడుతారు అయితే సమకాలీన కాంగ్రెసు నాయకులు రాజుపైగాని, రాజు నడిపించిన ఉద్యమంపైగాని ఎటువంటి సానుభూతి చూపలేదు అదీగాక ఉద్యమాన్ని అణచివేసే చర్యల స్వాగతం పల్కారు 1924 అక్టోబరులో జరిగిన కాంగ్రెసు కమిటి వార్షిక సమావేశంలోగాని, ఆంధ్ర మహాసభ వార్షిక సమావేశంలోగాని రాజు యొక్క దేశభక్తిని, త్యాగనిరతిని ప్రశంసిస్తూ ఎటువంటి తీర్మానాన్ని ఆమోదించలేదు రాజుయొక్క మరణం సందేహాస్పదంగా ఉండడం వల్లే తీర్మానాన్ని ఆమోదించ లేదని సంజాయిషీ చెప్పారు.

1922 ఫిబ్రవరి 12న బార్డోలీలో జరిగిన కాంగ్రెసు కమిటి సమావేశంలో సహాయ నిరాకరణోద్యమాన్ని విరమించినట్లు తీర్మానం చేశారు. దీని ఫలితంగా ఆంధ్రదేశంలో రాజకీయ స్తబ్దత ఏర్పడింది.

## సైమను కమీషన్

1919 సంస్కరణల్ని సమీక్షించేందుకు సర్ జాన్ సైమన్ అధ్యక్షతన ఒక చట్టపరమైన కమీషన్ను ఏర్పాటు చేస్తున్నట్లు 1927 నవంబరు 8న ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది ఈ కమీషనులో ఒక్క భారతీయునికి కూడ సభ్యత్వాన్ని కల్పించకపోవడంతో అన్ని రాజకీయ పార్టీలు దీన్ని బహిష్కరించాలని నిర్ణయించాయి ఆంధ్రమహాసభ కూడ సైమను కమీషన్ను బహిష్కరించాలని నిర్ణయించింది అయితే బరంపురంలోని ఒరియా నాయకులు, ఉత్కళ సమ్మిళిని మాత్రం ఒరిస్సా రాష్ట్రాన్ని తొందర్లో ఏర్పాటు చేయాలని ఒక మహజరును సమర్పించడం జరిగింది

తిరుపతి, కర్నూలు, విజయవాడ, ఏలూరు, శ్రీకాకుళం పురపాలక సంఘాలు సైమను కమీషన్ను బహిష్కరించాలని తీర్మానించాయి న్యాపతి సుబ్బారావు వంటి ఉదారవాదులు కూడ సైమను కమీషన్ను బహిష్కరించడానికే నిర్ణయించారు 1928 ఫిబ్రవరి 3న అన్ని ఆంధ్ర పట్టణాల్లో హర్తాళ్‌ను

నిర్వహించారు. ఆంధ్రదేశంలో గుంటూరు, ఒంగోలు పట్టణాల్ని కమీషను పర్యటనకై ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రకాశం, రామదాసు, వి వి జోగయ్య ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేస్తూ సైమను కమీషన్ను బహిష్కరించాల్సిందిగా ఆంధ్రప్రజలకు (ముఖ్యంగా ఒంగోలు గుంటూరు పట్టణాల ప్రజలకు) ప్రబోధించారు. సైమను బృందం గుంటూరు వెడుతూ విజయవాడలో ఆగినపుడు పురపాలక సంఘ బహిష్కరణ తీర్మానాన్ని కల్గి ఉన్న ఒక కవరును, 'సైమను గోబాక్' అని వ్రాసి ఉన్న ఒక కాగితాన్ని మునిసిపాలిటికి చెందిన ఒక జవాను సైమనుకు అందజేశాడు. కమీషనుకు గుంటూరు, ఒంగోలు పట్టణాల్లో నల్లజెండాలు ఎదురయ్యాయి.

సైమను కమీషను 1928 ఫిబ్రవరి 26న మద్రాసు నగరాన్ని సందర్శించాలి. అందువల్ల రాజకీయ ప్రచారాలేవీ చేపట్టకూడదంటూ చీఫ్ ప్రెసైడింగ్ మాజిస్ట్రేట్ నిషేధాజ్ఞలు జారీ చేశాడు. మద్రాసు నగరంపై ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాల కాంగ్రెసు కమిటీలకు అధికారం ఉండేది. ఆంధ్ర కాంగ్రెసు కమిటి నిషేధాజ్ఞలు ఉల్లంఘించడానికి నిర్ణయిస్తే, మద్రాసు రాష్ట్ర కాంగ్రెసు కమిటి మాత్రం తద్విరుద్ధంగా నిర్ణయించింది. అయినప్పటికి మద్రాసులో సైమను కమీషను ఉన్నంతకాలం పూర్తి హర్తాళ్‌ను నిర్వహించడం జరిగింది. ముందుగనే టంగుటూరి ప్రకాశం మద్రాసు నగరంలో సైమను కమీషనుకు వ్యతిరేకంగా విశేషంగా ప్రచారం చేశాడు. అక్కడక్కడ కొన్ని అలజడులు చెలరేగాయి. పోలీసు కాల్పుల్లో ఒక వ్యక్తి మరణించడం జరిగింది. చనిపోయిన వ్యక్తిని చూసేందుకు ప్రకాశం తన అనుచరులతో బయలుదేరినపుడు పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో గిప్పిపోయిన ప్రకాశం రొమ్ము విరుచుకుని "మేము ముందుకు సాగిపోయి మా సోదరుడి శవాన్ని చూడడానికే నిర్ణయించాం. కావాలంటే నన్ను కాల్చండి" అని స్పష్టం చేశాడు. దీంతో పోలీసులు వెనక్కు జరిగిపోయి ప్రకాశాన్ని ముందుకు సాగనిచ్చారు. ఇటువంటి ధైరసాహసాల్ని ప్రదర్శించినందుకే ప్రకాశాన్ని "ఆంధ్రకేసరి" అని పిలిచారు.

1930 మే నెలలో సైమను కమీషను తన నివేదికను ప్రకటించింది. ఒరిస్సా, సింధు, రాష్ట్రాల ఏర్పాటుకు సైమను కమీషను సిఫార్సు చేసింది. ఈ నివేదికలో ఆంధ్రరాష్ట్రాన్ని ప్రస్తావించకపోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు.

ఎందుకంటే ఆంధ్రనాయకులు సైమను కమీషను బహిష్కరణలోను, నల్లజెండాల ప్రదర్శనలోను ప్రముఖ పాత్ర వహించారు అయితే ఒరియా నాయకులు మాత్రం ఒక మహాజరును సమర్పించి సైమను కమీషను సానుభూతిని చూరగొన్నారు.

కమీషను నివేదికను ప్రకటించిన తర్వాత మద్రాసు రాష్ట్రంలోని ఒరియా ప్రాంతాన్ని కొత్తగా ఏర్పాటు చేయబోయే ఒరిస్సా రాష్ట్రంలో కలపడం ఒక చిన్న భౌగోళిక సర్దుబాటుగ భావించి మద్రాసు ప్రభుత్వం తన వ్యతిరేకతను ఉపసంహరించుకుంది

## మొదటి రౌండుటేబుల్ సమావేశం

సైమను కమీషన్ నివేదికను ప్రకటించిన తర్వాత, భారతదేశానికి ఒక రాజ్యాంగాన్ని రూపొందించేందుకు భారత రాజకీయపక్షాల రౌండు టేబుల్ సమావేశాన్ని బ్రిటీషు ప్రభుత్వం లండనులో ఏర్పాటు చేసింది అయితే కాంగ్రెసు పార్టీ మాత్రం ఈ సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది గాంధీజీ 1930 ఏప్రిలు 6న శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించాడు మొదటి రౌండుటేబుల్ సమావేశం 1930 నవంబరులో లండనులో ప్రారంభమయింది ఈ సమావేశాన్ని కాంగ్రెసు పార్టీ బహిష్కరించడం వల్ల, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని కోరేందుకు ఒక్క ఆంధ్రుడు కూడ సమావేశానికి హాజరు కాలేదు. ఈ సమావేశం ఒరిస్సా, సింధు రాష్ట్రాల ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించింది

## రెండవ రౌండుటేబుల్ సమావేశం

1931 సెప్టెంబరు 7న ప్రారంభమైన రెండవ రౌండు టేబులు సమావేశానికి గాంధీజీ హాజరయ్యాడు తమ తప్పిదం వల్లే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని కోరే హక్కు పోగొట్టుకున్నామని ఆంధ్రనాయకులు గ్రహించగల్గారు అయితే తర్వాత కూడ పరిస్థితిని సరిదిద్దేందుకు తగిన చర్యల్ని వారు చేపట్టలేదు. గాంధీజీపైనే తమ ఆశల్ని పెట్టుకున్నారు గాంధీజీ లండనుకు బయలు దేరే ముందు పట్టాభిసీతారామయ్య, కాశేశ్వరరావులు ఆయన్ని కలుసుకుని ప్రత్యేక ఆంధ్ర విషయాన్ని ప్రస్తావించారు అయితే స్వరాజ్యం వచ్చిన తర్వాత

ఏర్పాటు చేయవచ్చునని గాంధీజీ వారికి వాగ్దానం చేశాడు వి వి గిరి, ఎ పి పాత్రో, ఎం రామచంద్రరావు, బొబ్బిలి రాజా వంటి ఆంధ్రనాయకులు ఇంగ్లండులోని భారతదేశపు అండర్ సెక్రటరీ అయిన లార్డ్ లోథెన్‌ను కలిసి కొత్త రాష్ట్రాల ఏర్పాటులో ఆంధ్రదేశాన్ని కూడ చేర్చాలని విన్నవించారు కొత్త రాష్ట్రాల ఏర్పాటు చేయడానికి వీలుగా కొత్త రాజ్యాంగంలో నియమాలు రూపొందించాలని వారు ఒక మెమోరాండంను కూడ పంచిపెట్టారు ఆంధ్రనాయకుల వలె గాక ఒరియా నాయకులు పర్లకిమిడి మహారాజా నాయకత్వంలో సంఘటితంగా ప్రయత్నించి ప్రత్యేక ఒరిస్సా రాష్ట్రాన్ని సాధించారు రెండవ రౌండు టేబులు సమావేశం పూర్తి కాగానే ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటుచేసే విషయం ముసుపటి లాగానే తెరమరుగైంది అయితే ఆంధ్రనాయకులు ధైర్యాన్ని కోల్పోలేదు రాష్ట్రాల ఏర్పాటు విషయాన్ని మరచిపోయి గాంధీజీ భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత 1932 జనవరి 3న ప్రారంభమయిన శాసనోల్లంఘనోద్యమంలో ఆంధ్రులు మనస్ఫూర్తిగా పాల్గొన్నారు

రెండవ రౌంటు టేబులు సమావేశం నుండి తిరిగి వచ్చిన తర్వాత 1932 నవంబరులో బొబ్బిలి రాజా మద్రాసు రాష్ట్రముఖ్యమంత్రి పదవిని అలంకరించాడు శాసనసభ రాజ్యాంగ సంస్కరణల్ని గూర్చిన చర్చను ప్రారంభించినపుడు హరిసర్వోత్తమరావు ఆంధ్రరాష్ట్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఒక సవరణ తీర్మానాన్ని ప్రతిపాదించాడు అయితే ఆ తీర్మానాన్ని అనుమతించలేదు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం బ్రిటీషు అధికారుల ముందు వాదించిన బొబ్బిలి రాజా ముఖ్యమంత్రి అయిన తర్వాత తన అభిప్రాయాల్ని మార్చుకున్నాడు అందరూ భారతీయుల్లాగ ప్రవర్తించాలని, కొత్త సంస్కరణల అమలుకు వీలు కల్పించాలని ఆయన శాసనసభ ముందు చెప్పాడు ఈ సమాధానం చాలమంది ఆంధ్ర సభ్యులకు కోపం తెప్పించింది 15 మంది ఆంధ్ర సభ్యులు కొత్త రాజ్యాంగ సంస్కరణల్ని అమలు చేయిడంతో పాటు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని కూడ ఏర్పాటు చేయాలని తీర్మానపు నోటీసుల్ని అందజేశారు దీంతో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని సభ ఆమోదించింది ఈ తీర్మానంపై ఎటువంటి వ్యాఖ్యానం చేయకుండా మద్రాసు ప్రభుత్వం భారత ప్రభుత్వానికి పంపింది

## ఆంధ్రదేశంలో శాసనోల్లంఘనోద్యమం

1930 ఏప్రిల 6న ఉప్పు చట్టాల్ని ఉల్లఘించేందుకు 78 మంది సహచరులతో దండికి బయలు దేరడంతో గాంధీజీ శాసనోల్లంఘనోద్యమానికి శ్రీకారం చుట్టాడు ఈ ఉద్యమమే దేశమంతా జరిగిన మొదటి ప్రజా ఉద్యమము. ఆంధ్రప్రాంతంలో సత్యాగ్రహాన్ని నడిపించేందుకు ఆంధ్ర కాంగ్రెసు కమిటి కొండా వెంకటప్పయ్యను డిక్టేటరుగ నియమించింది వెంకటప్పయ్యకు సలహా ఇచ్చేందుకు ఒక్కొక్క జిల్లాకు ఒక డిక్టేటరు, ఒక యుద్ధ సమితి ఏర్పడింది. ఒక్కొక్క జిల్లాకు ఒక్కొక్క శిభిరాన్ని ఏర్పాటు చేశారు మద్రాసు నగరంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో ప్రధానంగా పాల్గొన్న వారు ఆంధ్రులే (శాసనోల్లంఘనోద్యమమే ఉప్పు సత్యాగ్రహంగా ప్రసిద్ధి చెందింది) వీరిలో కె నాగేశ్వరరావు, వి యల్ శాస్త్రి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, గాడె రంగయ్యనాయుడు, టి ప్రకాశం వంటి వారు ముఖ్యులు.

ఉప్పు సత్యాగ్రహంలో వేలకొలది స్త్రీలు పాల్గొనడం విశేషంగా చెప్పవచ్చు. చాలమంది స్త్రీలు జైలుకు పంపబడ్డారు వీరిలో శ్రీమతి భారతీదేవి రంగా, వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ, దిగుమర్తి జానకమ్మ, కమ్మంపాటి మాణిక్యాంబ వంటి వారు ముఖ్యులు కమ్మంపాటి మాణిక్యాంబ తన ఆరునెలల పసిబిడ్డతో సహా జైలుకు వెళ్లడం చెప్పుకోదగ్గది

1932 జనవరి 15న బరంపురంలో సత్యాగ్రహులపై పోలీసులు కాల్పులు జరిపారు చాలమంది గాయపడ్డారు 1933 మే 8న మహాత్మాగాంధీ జైలునుండి విడుదలయ్యాడు 1933 జూలై 14న గాంధీజీ ఉద్యమాన్ని విరమింపచేశాడు

## వామపక్ష పార్టీలు

శాసనోల్లంఘనోద్యమం విఫలం కావడం సోవియట్ రష్యా పర్యటన నుండి తిరిగి వచ్చిన తర్వాత సోషలిజంపై నెహ్రూ వ్రాసిన వ్యాసాలు చాలమంది ఆంధ్రులపై తమ ప్రభావాన్ని చూపడం, వామపక్షపార్టీలు ఏర్పడడానికి దోహదం చేశాయి 1935 తర్వాత ఆంధ్రదేశంలో మూడు ప్రధాన వామపక్ష పార్టీలు ఏర్పడ్డాయి అవి 1. కమ్యూనిస్టు పార్టీ 2. కాంగ్రెసు సోషలిస్టు పార్టీ

3 ఎం ఎన్ రాయ్ స్థాపించిన రాడికల్ డెమోక్రటిక్ పార్టీ ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని చేపట్టిన మొదటి వ్యక్తి పి సుందరయ్య మెల్లిమెల్లిగా కమ్యూనిస్టు భావాల వైపు ఆంధ్ర యువకులు ఆకర్షింప బడింది కమ్యూనిజంపైనా, సోవియట్ రష్యాపైనా చాల పుస్తకాలు తెలుగులో ప్రచురింపబడ్డాయి 1934 ప్రాంతంలో మాక్సింగోర్కీ రచించిన 'మదర్' లనే గ్రంధాన్ని కె లింగరాజు తెలుగులోకి అనువదించాడు. ఇదే సమయంలో శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) 'మహాప్రస్థానం' అను తెలుగు గేయ సంపుటిని ప్రచురించాడు. ఈ మహాప్రస్థాన గ్రంధం ఆంధ్రయువతపై విశేష ప్రభావాన్ని చూపింది మార్క్సు సిద్ధాంతాల్ని ప్రచారం చేసేందుకు మహాప్రస్థానం దోహదం చేసింది కొంపెల్ల జనార్దనరావు ప్రచురించిన 'ఉదయిని,' శివశంకర శాస్త్రి నడిపిన 'ప్రతిభ' అను సాహిత్య పత్రికలు తెలుగు పద్య రచనలతో కొత్త పుంతలు తొక్కి సనాతనవాదుల్ని సవాలు చేశాయి అనంతపురం నుండి వెలువడే 'నవ్య సాహిత్యమాల' ద్వారా విద్వాన్ విశ్వం, తరిమల నాగిరెడ్డి సోషలిస్టు సిద్ధాంతాల్ని ప్రచారం చేశారు

తెనాలిలో ఎం ఎన్ రాయ్ సిద్ధాంతాలకు విశేష ఆదరణ లభించింది. టి గోపీచంద్, ఎం గోపాల కృష్ణమూర్తి, కోగంటి రాధాకృష్ణమూర్తి, ఎం వి శాస్త్రి, జి వి కృష్ణారావు వంటి పట్టణయువకులు తమ రచనల ద్వారా యువతరాన్ని విపరీతంగా ప్రభావితం చేశారు 'ప్రజామిత్ర' లో రచనలు చేస్తూ గోపీచంద్ మార్క్సు సిద్ధాంతాల్ని ప్రచారం చేశాడు అయితే తన జీవిత తర్వాతి దశలో గోపీచంద్ చాల మార్క్సు సిద్ధాంతాల్ని వదులుకున్నాడు 'అసమర్దుని జీవితయాత్ర' అనే నవలను రచించి తెలుగు సాహిత్యంలో తన కంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకున్నాడు

ఆచార్య ఎన్ జి రంగా తన రాజకీయ జీవితాన్ని వామపక్ష వాదిగానే ప్రారంభించాడు ఆంధ్రదేశంలో రైతు ఉద్యమాన్ని పటిష్టం చేయడంలో రంగా ప్రముఖపాత్ర వహించాడు తన అనుచరులైన పుల్లెల శ్యామసుందరరావు, గౌతు లచ్చన్నల సమర్ధవంతమైన నాయకత్వంలో శ్రీకాకుళం జిల్లా రైతులు అనేకసార్లు జమీందార్లపై పోరాటం సాగించి విజయం సాధించారు ఆచార్యరంగా అధ్యక్షుడుగ, మద్దూరి అన్నపూర్ణయ్య కార్యదర్శిగ 1934 జూన్ లో సోషలిస్టు పార్టీ ఆంధ్ర శాఖ విజయవాడలో ఏర్పాటయింది అల్లూరి సత్యనారాయణరాజు, కె లింగరాజు,

పి సుందరయ్య, సి రాజేశ్వరరావులు మిగిలిన ప్రముఖ సోషలిస్టు పార్టీ సభ్యులు పి సుందరయ్య, సి రాజేశ్వరరావు తర్వాతికాలంలో కమ్యూనిస్టు పార్టీలో చేరారు

హైదరాబాదు నగరంలో 'కామ్రేడ్ అసోషియేషన్' పేరుతో ఒక యువజన సంస్థ ఏర్పాటు కావడంతో తెలంగాణాలో వామపక్ష సిద్ధాంతాలు వ్యాప్తిలోకి రావడం ప్రారంభమైంది ఈ సంస్థ కార్యకలాపాల్లో మక్దుం మొహియుద్దీన్, రాజ బహదూర్ గౌర్, సయ్యద్ ఇబ్రహీంలు చురుకుగా పాల్గొనేవారు. ఈ సంస్థ కార్యకలాపాలకు బూర్గుల రామకృష్ణారావు కూడ మద్దతు తెలిపాడు. వందేమాతర ఉద్యమంలో పాల్గొన్న డి.వెంకటేశ్వరరావు, ఎస్.రామనాధన్ లకు కూడ వామపక్ష సిద్ధాంతాలపై సానుభూతి ఉండేది ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే రావినారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల నరసింహారెడ్డి వంటి వారు గూడ మార్క్స్ సిద్ధాంతాల వల్ల ప్రభావితులయ్యారు 1929లోనే నైజాం రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది ఆంధ్ర కమ్యూనిస్టు నాయకుడైన సి రాజేశ్వర రావు హైదరాబాదు కమిటి మొదటి రాజకీయ శిక్షణ శిబిరాన్ని నిర్వహించాడు మొదటి నుండి ఆంధ్ర, తెలంగాణ కమ్యూనిస్టుల మధ్య సన్నిహిత సంబంధాలు నెలకొని ఉండేవి

## 'క్విట్ ఇండియా' ఉద్యమం

1939 నవంబరులో కాంగ్రెసు ప్రభుత్వాలు రాజీనామా చేశాయి. 1941-42 నాటికి యూరోపులోను, ఆసియాలోను ఉన్న రెండవ ప్రపంచ యుద్ధ పరిస్థితులు మిత్రపక్షాలకు అనుకూలంగాలేదు ఈసమయంలో భారతీయుల సహాయ సహకారాల అవసరాన్ని గుర్తించిన బ్రిటీష ప్రభుత్వం భారతదేశంలో నెలకొన్న రాజకీయ స్తబ్దతను తొలగించేందుకు 1942 మార్చిలో సర్ స్టాపర్డ్ క్రిప్సును భారతదేశానికిపంపి రాయబారం నడిపేందుకు నిర్ణయించింది క్రిప్స్ వివిధ రాజకీయ పార్టీలతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి భారత దేశపు సరిహద్దుల్లోకి జపాను సేనలు చొచ్చుకు వస్తున్న సమయంలో క్రిప్స్ రాయబారం విఫలం కావడం భారతీయులకు మనస్తాపాన్ని కలిగించింది 1942 ఆగస్టు 6న బొంబాయిలో సమావేశమైన అఖిల భారత కాంగ్రెసు కమిటి 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించింది. దీంతో భారత ప్రభుత్వం గాంధీజీని,

కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యుల్ని అరెస్టు చేసింది ఈ అరెస్టులు ప్రజల్లో ఆగ్రహావేశాలు రేకెత్తించడంతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో అలజడులు జరిగాయి

తీరాంధ్ర దేశంలో వివిధ పట్టణాల్లో దొమ్మీలు జరిగాయి ఆగస్టు 12న తెనాలిలో జరిగిన పోలీసు కాల్పుల్లో 9 మంది మరణించారు ఆగస్టు 13న గుంటూరులోను, 17న భీమవరంలోను కాల్పులు జరిగాయి

# 10

# మద్రాసు రాజకీయాల్లో ఆంధ్రదేశం

## జస్టిస్ పార్టీ

ఆంగ్లంలోను, తెలుగులోను, తమిళంలోను పత్రికల్ని నడిపి వాటిద్వారా బ్రాహ్మణేతరుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు పిట్టి త్యాగరాయ శెట్టితో పాటు మరో 30 మంది మద్రాసు రాష్ట్ర బ్రాహ్మణేతర నాయకులు కలిసి 1916 నవంబరులో 'దక్షిణ భారత ప్రజా సంఘాన్ని' (South Indian People's Association) ఏర్పాటు చేశారు. ఈ సంఘం 1917 ఫిబ్రవరి 26న 'జస్టిసు' అనే ఒక ఇంగ్లీషు దిన పత్రికను ప్రారంభించింది. దీనికంటె ముందు 1916 డిశంబరులో బ్రాహ్మణేతరుల ప్రయోజనాల్ని కాపాడడం కోసం 'దక్షిణ భారత లిబరల్ ఫెడరేషన్' ఒకటి ప్రారంభమయింది. అనతికాలంలోనే ఈ ఫెడరేషన్ జస్టిసు పార్టీగా రూపొందింది. ఆంధ్రదేశంలో జస్టిసు పార్టీకి అంతగా బలం లేకపోయినా చాలమంది పార్టీ నాయకులు మాత్రం ఆంధ్రులు కావడం విశేషం. బ్రిటీషు ప్రభుత్వం 1919లో మాంటేగు-చెమ్స్‌ఫర్డు సంస్కరణల్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రాలలో ద్విపరిపాలనను ప్రవేశపెట్టడం ఈ సంస్కరణల్లోని ప్రధానాంశం. కొత్త సంస్కరణల ప్రకారం 1920లో రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు పార్టీ ఎన్నికల్ని బహిష్కరించింది. జస్టిసు పార్టీ మాత్రం బ్రిటీషు ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ ఎన్నికల్లో పోటీ చేసి విజయాన్ని సాధించింది. జస్టిసు పార్టీ నాయకుడు త్యాగరాజశెట్టి. డా. టి యం నాయర్ మరణం తర్వాత త్యాగరాజ శెట్టి పార్టీ నాయకుడైనాడు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని మద్రాసు ప్రభుత్వం పిట్టి త్యాగరాజశెట్టిని కోరినపుడు ఆయన అందుకు నిరాకరించాడు

అందువల్ల జస్టిసు పార్టీ సభ్యుడైన సుబ్బరాయలు రెడ్డియారు ముఖ్యమంత్రి అయ్యాడు. ఈయన దక్షిణ ఆర్కాటు జిల్లాకు చెందిన కడలూరు నివాసి అయితే రెడ్డియార్ అనారోగ్య కారణంగా 1921 ఏప్రిల్‌లో తన పదవికి రాజీనామా చేశాడు ఆ తర్వాత పి రామరాయనింగార్ ముఖ్యమంత్రి అయ్యారు ఆంధ్రుడైన కె వి రెడ్డినాయుడు మరో మంత్రి అయ్యాడు జస్టిస్ పార్టీలో ఆంధ్రుల ఆధిక్యత ఉండడం వల్ల ఆంధ్రులు, తమిళుల మధ్య తీవ్రమైన స్పర్ధ ఏర్పడింది ఈ శతాబ్దిలోని రెండు మూడు దశకాల్లో మద్రాసు రాజకీయాలు బ్రాహ్మణ, బ్రాహ్మణేతర, తెలుగు, తమిళ స్పర్ధలతోనే గడచిపోయాయి తెలుగు-తమిళుల స్పర్ధలు కొంతవరకు జస్టిసు పార్టీని బలహీనపరచిందని చెప్పవచ్చు 1923లో 98 ఎన్నిక సీట్లలో జస్టిసు పార్టీ 44 సీట్లు మాత్రం గెల్చుకోగల్గింది 1920 ఎన్నికల్లో ఇదే పార్టీ దాదాపు 63 సీట్లను గెలుచుకుంది అయినప్పటికి అధికార సభ్యుల మద్దతు ఉండడం వల్ల జస్టిసుపార్టీ శాసనసభలో మెజారిటిని కోల్పోలేదు

## జస్టిస్ పార్టీ – ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోర్కె

జస్టిసు పార్టీలో ఆంధ్రనాయకుల ఆధిక్యత ఉన్నా అది ఎప్పుడూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు తెల్పలేదు. దీనికి తగిన కారణం లేకపోలేదు ఆంధ్రదేశంలో జస్టిసు పార్టీకి నామమాత్రపు బలం కూడా లేకపోయింది కాంగ్రేసు పార్టీ మాత్రం బహుళ ప్రజాదరణను పొందింది. ఈ పార్టీ సహాయనిరాకరణోద్యమాన్ని తెలుగు జిల్లాల్లో ముఖ్యంగా గుంటూరు జిల్లాలో విజయవంతంగా నడిపింది జస్టిస్ పార్టీ లోని ఆంధ్ర నాయకులకు ఆంధ్రదేశంలో ఏ మాత్రం , పలుకుబడి లేకపోవడంతో వారు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని కోరలేదు 1922లో మద్రాసు రాష్ట్ర శాసనసభలో విశాఖ పట్నానికి చెందిన ఎం సూర్యనారాయణ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని మద్రాసు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుపై జస్టిసు పార్టీ మంత్రుల్లో ఉన్న భేదాభిప్రాయాలు ఈ తీర్మానం ప్రవేశపెట్టడంతో బహిర్గతమయ్యాయి విద్యాశాఖ మంత్రియైన ఎ పి పాత్రో ఈ తీర్మానంపై ఒత్తిడి చేయవద్దని సూర్యనారాయణకు నచ్చచెప్పగా కె.వి రెడ్డి నాయుడు మాత్రం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు తన మద్దతు తెలిపాడు. తాను వ్రాసుకున్న వివరణలో ఇలా అభిప్రాయపడ్డాడు:

"ఉత్తర సర్కారుల్లోని తెలుగు ప్రజలు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని ఎప్పుడూ కోరుతూనే ఉన్నారు. దత్తతు జిల్లాలోని ప్రజలు మాత్రం తమ సుముఖతను చూపలేదు ఏ విధంగాను వీరు తమ ఉత్సాహాన్ని చూపలేదు ఆంధ్రరాష్ట్రం అవసరం అనే అభిప్రాయం నాకెపుడూ ఉంటుంది అయితే బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడం వల్ల నా ఆలోచనల్లో కొంతమార్పు వచ్చింది అయినప్పటికి కొత్తగ ఏర్పాటు చేయబోయే ఆంధ్రరాష్ట్రం లోని శాసనసభలోను, ప్రభుత్వ సర్వీసుల్లోను మెజారిటీ బ్రాహ్మణేతరులకు చట్టపరమైన హామీలను కల్పించినట్లయితే నేను ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును ఇప్పుడు కూడా ఆమోదిస్తాను "

## ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపన

మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు బాషా సాహిత్యాలకు తగినంత ప్రాధాన్యతను ఇవ్వలేదని భావించి ఆంధ్రదేశానికి ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని 1913లో జరిగిన ఆంధ్రమహాసభ మొదటి సమావేశం కోరింది అదీగాక మద్రాసు విశ్వవిద్యాలయంలో తమిళుల ఆధిక్యత ఉండడం వల్ల ఆంధ్ర విద్యార్థులకు ప్రవేశం దొరకడం కష్టంగా ఉండేది యుద్ధం ముగిసిన తర్వాత ఆంధ్రప్రాంతానికి ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని బి వెంకటపతిరాజు 1917 లో మద్రాసు శాసనసభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు ఈలోగా ఆంధ్రప్రాంతంలో అదనపు కాలేజీలను ఏర్పాటు చేయాలని ఆయన సలహా ఇచ్చాడు

మద్రాసు రాష్ట్రంలోని ఆయా భాషా ప్రాంతాలకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాల్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని 1920 అక్టోబరులో మద్రాసు విశ్వవిద్యాలయ సెనేటు గుర్తించింది 1919 సంస్కరణల కనుగుణంగా జస్టిసు పార్టీ ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ప్రత్యేక ఆంధ్ర విశ్వ విద్యాలయం ఏర్పాటును కోరుతూ విశాఖపట్నానికి చెందిన ఎం సూర్యనారాయణ శాసనసభలో ఒక తీర్మానాన్ని ప్రవేశ పెట్టాడు ఈ తీర్మానాన్ని తమిళ శాసనసభ సభ్యులు వ్యతిరేకించారు ఆంధ్రదేశానికి స్పష్టమైన రూపురేఖలు నిర్ణయించ లేమని చెపుతూ సి నటేశ మొదలియారు పై తీర్మానాన్ని వ్యతిరేకించారు అదీగాక

ఆంధ్ర విశ్వవిద్యాలయం వల్ల బ్రాహ్మణేతర ఉద్యమం బలహీనపడుతుందని కూడ ఆయన అభిప్రాయపడ్డాడు అయితే మరో తమిళ సభ్యుడు తీర్మానాన్ని బలపరుస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు వల్ల తమిళ ప్రాంతానికి మరో విశ్వవిద్యాలయం ఏర్పడే అవకాశం ఉందని భావించాడు 1921 సెప్టెంబరు 2న ఈ తీర్మానం ఆమోదించబడింది అయితే విద్యాశాఖమంత్రి అయిన ఎ పి పాత్రో మద్రాసు విశ్వవిద్యాలయ పునర్వ్యవస్థీకరణకు ఒక బిల్లును ప్రవేశపెట్టాడు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఏర్పాటును పడగొట్టేందుకే ఈ బిల్లును ప్రవేశపెట్టాడని చాలమంది ఆంధ్రులు భావించారు బిల్లు ఆమోదించబడింది ఆంధ్ర ప్రాంతానికి చెందిన జి వందనం అనే సభ్యుడు "మద్రాసు విశ్వవిద్యాలయ పునర్వ్యవస్థీకరణ బిల్లుకు ఆమోదం తెల్పిన సభ్యులందరూ త్వరలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మాకు సహాయపడగలరు" అని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు

చివరకు 1925 ఆగష్టు 20న ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ ఒక బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. తర్వాత ఈ బిల్లును సెలక్టు కమిటి పరిశీలనార్థం పంపారు సెలక్టు కమిటీలో కొంతమంది రాయలసీమ సభ్యులు ఆంధ్రవిశ్వవిద్యాలం పరిధి నుండి తమ ప్రాంతాన్ని మినహాయించాలని కోరారు. కడపకు చెందిన టి ఎం నరసింహాచార్యులు అనే సభ్యుడు రాయలసీమ జిల్లాల్ని (దత్తతు జిల్లాల్ని) ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిధి నుండి మినహాయించాలని ఒక సవరణ తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు ఎస్ సత్యమూర్తి బళ్లారి జిల్లాను మినహాయించాలని కోరాడు బళ్ళారి జిల్లాకు చెందిన టి మల్లేశప్ప బళ్ళారి జిల్లాలోని కన్నడ తాలూకాల్ని మినహాయించాలని కోరాడు అయితే అన్ని సవరణ తీర్మానాలు వీగిపోయాయి 'ఆంధ్ర విశ్వవిద్యాలయం'లోని 'ఆంధ్ర' అను పదాన్ని ఉపయోగించడానికి కొంతమంది తమ వ్యతిరేకతను తెల్పారు కె వి.రెడ్డినాయుడు 'ఆంధ్ర'కు బదులు 'తెలుగు' అనే పదాన్ని వాడి తెలుగు విశ్వవిద్యాలయంగా వ్యవహరించాలని అన్నాడు. 'ఆంధ్ర' అనే పదం ఆర్యుల నుండి గ్రహించబడ్డదని భావించాడు ఆయన ఇంకా ఇలా చెప్పాడు:

"తెలుగువారు ఎప్పుడూ ద్రవిడులుగనే గుర్తింపబడ్డారు తెలుగువారి పేరుతో ఈ బిల్లును రూపొందించమని నేను అడిగినందువల్ల మీరు మాకంటె

వేరని ద్రవిడులైన తమిళ స్నేహితులు, కన్నడ స్నేహితులు, మళయాల స్నేహితులు మాతో దూరం కాకండి" రెడ్డినాయుడు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు స్పందిస్తూ ఇదివరకు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఏర్పాటును వ్యతిరేకించిన నటేశ మొదలియార్ "తెలుగువారిని తమిళుల నుండి ఎవరూ వేరు చేయలేరు మన మంతా ద్రవిడులము మనమెప్పుడూ విడిపోము" అని తన ఉద్వేగాన్ని వ్యక్తం చేశాడు కొత్త విశ్వవిద్యాలయం సంస్కృత అధ్యయనానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ద్రవిడ సంబంధ విషయాల్ని అధ్యయనం చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు 26-24 ఓట్ల తేడాతో రెడ్డినాయుడు ప్రతిపాదించిన తెలుగు విశ్వవిద్యాలయ తీర్మానం వీగిపోయింది 1926 ఏప్రిలు 26న విజయవాడలో ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలన్నీ ఈ విశ్వవిద్యాలయం పరిధిలోకి వచ్చాయి కట్టమంచి రామలింగా రెడ్డి మొదటి వైస్-ఛాన్స్‌లర్‌గా నియమితులయ్యారు

## విశ్వవిద్యాలయ ప్రధాన కేంద్ర నిర్ణయం

ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రధాన కేంద్రాన్ని నిర్ణయించడంలో అనేక వివాదాలు తలెత్తాయి. ఈ వివాదం వల్ల ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న సర్కారులు రాయలసీమ మధ్య సంబంధాలు మరింతగా క్షీణించాయి. విశ్వవిద్యాలయం చట్టంలో విశ్వవిద్యాలయ పరిపాలనా విభాగం మాత్రం విజయవాడలో ఉండాలని ప్రతిపాదించారు పరిపాలనా కార్యాలయం, బోధనాశాఖలు దూరంగా ఉండడం వల్ల విశ్వవిద్యాలయ పాలనా సామర్థ్యం దెబ్బతింటుందని భావించిన ప్రభుత్వం రాజమండ్రిలోని బోధనాశాఖల్ని విజయవాడకే తరలించేలా విశ్వవిద్యాలయ సెనేటుకు సిఫార్సు చేయాలని 1927 ఏప్రిలు 7న నిర్ణయించింది ఈ నిర్ణయం పెద్ద వివాదానికి దారితీసింది చాలమంది శాసనసభ్యులు చట్టంలో సవరణ తేవాలని నోటీసులు ఇస్తూ విశ్వవిద్యాలయ పరిపాలనా కార్యాలయాన్ని, బోధనాశాఖల్ని ఒకేచోట ఉంచేందుకు వివిధ పట్టణాల్ని ప్రధాన కేంద్రాలుగ సూచించారు. విశ్వవిద్యాలయ ప్రధాన కేంద్రం తమ ప్రాంతంలో ఉండాలని రాయలసీమ వాసులు కోరారు వీరి కోరికకు స్పందించిన యూనివర్శిటి సెనెటు 35-20 ఓటింగుతో అనంతపురంను విశ్వవిద్యాలయ ప్రధాన కేంద్రంగా నిర్ణయించింది విశ్వవిద్యాలయ ప్రాంతంలో

ఒక మొదటిగ్రేడు కాలేజీని ఏర్పాటు చేయాలని సెనేటు సిఫార్సు చేసింది మద్రాసు శాసనసభ సెలెక్టు కమిటీ కూడ అనంతపురంపై తన ఆమోదాన్ని తెలిపింది అందర్నీ సంతృప్తి పరిచే విధంగా ఈ వివాదం సద్దు మణిగిందని భావించే తరుణంలో అప్పటి ముఖ్యమంత్రియైన డా సుబ్బరాయన్ 1928 సెప్టెంబరులో పై వివాదాన్ని తిరగదోడి రాజమండ్రిని కేంద్రస్థానంగా చేయాలని సలహా ఇచ్చాడు దీంతో మరల ప్రాంతీయ వివాదాలు తలెత్తాయి విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నాల్ని ప్రధాన కేంద్రంగా చేయాలని చాల సలహాలు వచ్చాయి 1928 డిసెంబరులో సుబ్బరాయన్ ప్రభుత్వం విశాఖపట్నాన్ని కేంద్రస్థానంగా చేయాలని మరో సలహా ఇచ్చింది ఇదేగాక విశ్వవిద్యాలయం యూనిటరీ పద్ధతిలో ఉండాలని కూడా సలహా ఇచ్చింది యూనిటరీ పద్ధతిలో ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంతంలో ప్రస్తుతమున్న కళాశాలన్నింటిని మద్రాసు విశ్వవిద్యాలయానికి తిరిగి అనుబంధం చేయాల్సి ఉంటుంది ఈ వివాదానికి తోడుగ చిత్తూరుకు చెందిన బొల్లిన మునస్వామి నాయుడు ఆంధ్రవిశ్వవిద్యాలయ పరిధి నుండి రాయలసీమను మినహాయించాలని ఒక సవరణ తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు చివరగా శాసనసభ సవరణ తీర్మానాల్ని ఆమోదిస్తూ విశాఖపట్నాన్ని విశ్వవిద్యాలయ ప్రధానకేంద్రంగా చేసి దాని పరిధి నుండి రాయలసీమను మినహాయించింది రాయలసీమ సర్కారుల మధ్య ఆంధ్ర విశ్వవిద్యాలయ వివాదం సృష్టించిన మనస్పర్థలే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రఏర్పాటునుకొన్ని సంవత్సరాల పాటు వెనక్కు నెట్టాయని నిస్సందేహంగా చెప్పవచ్చు 1927 ఆగస్టులో సుబ్బరాయను మంత్రి వర్గానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టబడిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చాలమంది ఆంధ్ర సభ్యులు ఓటు చేశారంటే పై వివాదంలో సుబ్బరాయను చూపిన పక్షపాత ధోరణికి ఎవరూ ఆశ్చర్యపడనవసరం లేదు

## జస్టిస్ పార్టీ పతనం

1919 సంస్కరణల్లో భాగంగా మద్రాసు రాష్ట్రంలో 1920లో జరిగిన ఎన్నికల్లో జస్టిసు పార్టీ విజయాన్ని సాధించి అధికారాన్ని చేపట్టిందని మనం ఇదివరకే తెలుసుకున్నాం. ఎన్నికలు జరిగిన కొంతకాలానికే పార్టీలో అభిప్రాయభేదాలు తలెత్తాయి. పార్టీ నాయకులైన త్యాగరాయ శెట్టి, పానగల్లు రాజా వంటి వారిని తెలుగు వారి పక్షపాతులుగ నిందించారు బీదవర్గంలో చేరిన

హరిజనుల వంటి వారి అభ్యున్నతికి తమ పార్టీ ఎటువంటి కార్యక్రమమూ చేపట్టలేకపోయిందని జస్టిసు పార్టీ సభ్యుడైన నటేశ మొదలియార్ అభిప్రాయ పడ్డాడు. 1920లో 63 సీట్లు గెల్చుకున్న జస్టిసు పార్టీ 1923లో జరిగిన ఎన్నికల్లో 44 స్థానాల్ని మాత్రమే గెల్చుకుంది నామినేట్ చేయబడ్డ సభ్యుల మద్దతుతోనే జస్టిసు పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది మాజీ జస్టిసు పార్టీ సభ్యుడు, మద్రాసు విశ్వవిద్యాలయ ప్రతినిధి అయిన కట్టమంచి రామలింగారెడ్డి 1923 నవంబరు 28న జరిగిన శాసనసభ సమావేశంలో మంత్రివర్గానికి వ్యతిరేకంగా ఒక అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు తీర్మానం వీగిపోయినా జస్టిసు పార్టీ మునుపటి పరిస్థితిలో లేదని మాత్రం స్పష్టమైంది 1925 ఏప్రిలు 28న త్యాగరాయ శెట్టి మరణించడంతో పార్టీ మనుగడకు తీవ్ర విఘాతం కలిగింది. ఈ పార్టీ స్వరాజ్య పార్టీ ఆవిర్భావాన్ని అరికట్టలేకపోయింది సహాయ నిరాకరణోద్యమ విరమణ తర్వాత స్వరాజ్య పార్టీ జాతీయ రంగంపై విశేష ప్రభావాన్ని చూపించింది 1926 మద్రాసు రాష్ట్ర ఎన్నికల్లో స్వరాజ్య పార్టీ 41 స్థానాల్ని గెల్చుకుంది జస్టిసు పార్టీ 22 స్థానాల్ని మాత్రం గెల్చుకుంది దాదాపు 36 మంది అభ్యర్థులు స్వతంత్రంగా పోటీ చేసి ఎన్నికయ్యారు శాసనసభలోని స్వరాజ్యపార్టీ నాయకుడైన సి.వి ఎస్ నరసింహరాజు తమ పార్టీ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేందుకు వ్యతిరేకం కాబట్టి గవర్నరు ఆహ్వానాన్ని తిరస్కరించాడు స్వరాజ్య పార్టీ సభ్యులు పెద్ద ప్రతిపక్షంగా ఉండడంతో జస్టిసు పార్టీ నాయకుడైన పానగల్లు రాజా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేందుకు తన అశక్తతను తెలియజేశాడు చివరికి స్వతంత్ర అభ్యర్థియైన డా॥పి సుబ్బరాయన్ నేతృత్వంలో మంత్రివర్గం ఏర్పాటయింది 1928 డిశంబరు 16న పానగల్లు రాజా మరణించాడు దీంతో జస్టిసు పార్టీ ఒక గొప్ప నాయకుడ్ని కోల్పోయింది తర్వాత 1930లోను, 1936లోను వరుసగా బి మునస్వామి నాయుడు, బొబ్బిలి రాజాల నాయకత్వంలో జస్టిసు పార్టీ మంత్రివర్గాలు ఏర్పడినా, పానగల్లు రాజా మరణంతోనే పార్టీ అంతరించిందని చెప్పవచ్చు

## శ్రీబాగ్ ఒప్పందం

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంలో తమకు తగినంత ప్రాతినిధ్యం లభించక పోవచ్చుననే రాయలసీమ ప్రజల సందేహాలు ఆంధ్రవిశ్వవిద్యాలయ వివాదంతో

మరింత బలపడ్డాయి రాయలసీమ ప్రాంత ప్రజల ప్రయోజనాల్ని కాపాడేందుకు సి ఎల్ నరసింహారెడ్డి, కె సుబ్రమణ్యం వంటి న్యాయవాదులు 1934లో 'రాయలసీమ మహాసభ' అనే సంఘాన్ని ఏర్పాటు చేశారు 1934 జనవరి 28న మద్రాసులో రాయలసీమ మహాసభ మొదటి సమావేశం జరిగింది ఈ సమావేశానికి కడపకు చెందిన నెమలి పట్టాభిరామారావు అధ్యక్షత వహించగా, ఆంధ్ర రాష్ట్ర వ్యతిరేకి అయిన సత్యమూర్తి సమావేశాన్ని ప్రారంభించాడు ఈ సమావేశం రాయలసీమ ప్రాంతాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకురావాలన్న కోస్తా జిల్లాల శాసనసభ సభ్యుల ప్రయత్నాల్ని వ్యతిరేకించింది ఇంకో తీర్మానంలో తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపించాలని ఈ సమావేశం కోరింది అయితే ఈ సమావేశానికి రాయలసీమకు చెందిన ప్రముఖ కాంగ్రేసు నాయకులెవరూ హాజరు కాలేదు

రాయలసీమ మహాసభ రెండవ సమావేశం 1935 సెప్టెంబరు మొదటి వారంలో కడపపట్టణంలో ఏర్పాటయింది కె కోటిరెడ్డి, జి హరిసర్వోత్తమరావు, పి రామాచారి వంటి ప్రముఖ రాయలసీమ కాంగ్రేసు నాయకులు ఈ సమావేశానికి హాజరు కాలేదు ఈ సమావేశం ప్రజలపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయింది నరసింహారెడ్డి, సుబ్రమణ్యం వంటి రాయలసీమ మహాసభ నాయకులు 1937 లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి కాంగ్రేసు అభ్యర్థుల చేతుల్లో ఓడిపోయారు

1937లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రేసు పార్టీ విజయాన్ని సాధించి సి రాజగోపాలాచారి నేతృత్వంలో 1937 జూలై 14న అధికారాన్ని చేపట్టింది ఎన్నికలు పూర్తయిన కొంతకాలానికే ఆంధ్రులు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని ఒత్తిడి చేయడం ప్రారంభించారు 1937 ఆగస్టులో ఆంధ్రరాష్ట్ర కాంగ్రేసు కమిటి అధ్యక్షుడైన డా॥పట్టాభి సీతారామయ్య ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును కోరుతూ ఒక తీర్మానం చేయాలని అఖిల భారత కాంగ్రేసు కమిటీని కోరాడు బి బ్రహ్మయ్య, బులుసు సాంబమూర్తి మొదలయిన నాయకులు కూడ ప్రత్యేక రాష్ట్రాన్ని తొందర్లో ఏర్పాటు చేసేందుకు తమ ప్రయత్నాల్ని తీవ్రతరం చేశారు జాతీయ అంతర్జాతీయ సమస్యలపై తమ దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం లేకపోవడంతో ఆంధ్రులు తమ తక్షణ సమస్యలపై శ్రద్ధ చూపగల్గారు

ఆంధ్ర మహాసభ రజతోత్సవాల్ని తమ పట్టణంలో జరుపాలని కోరుతూ ఆంధ్ర మహాసభను ఆహ్వానించాలని విజయవాడ పౌరులు నిర్ణయించారు ఆంధ్రదేశంలో ప్రతిచోటా తక్షణం ఏదో సాధించాలన్న తపన కన్పించింది. తమ చిరకాలపు ఆంధ్ర రాష్ట్ర కోర్కెను సాధించేందుకు రాయలసీమ ప్రజల సహాయ సహకారాల్ని పొందాల్సిన అవసరాన్ని సర్కారు నాయకులు గుర్తించారు

ఆంధ్ర నాయకుల కార్యకలాపాల్ని ప్రముఖ తమిళ నాయకుడైన రాజగోపాలాచారి గమనిస్తూనే ఉన్నాడు అంతక్రముందే 1935 మే నెలలో ప్రజాజీవితం నుండి స్వచ్ఛందంగా విరమించుకుంటున్నట్లు ఆయన ప్రకటించాడు. అయితే కాంగ్రెసు అధిష్టాన వర్గం సురక్షితమైన విశ్వవిద్యాలయ నియోజకవర్గం నుండి పోటీ చేయమని ఆయనపై వత్తిడి తెచ్చింది. ప్రకాశంను మద్రాసు ముఖ్యమంత్రిగ చేయ కూడదనే ఉద్దేశంతోనే అధిష్టానవర్గం ఈ ప్రయత్నానికి పాల్పడిందని చాలమంది ఆంధ్రనాయకులు భావించారు గాంధీజీకి ఆంధ్రులు గొప్పవారు కావడం ఇష్టంలేక పోవడం వల్ల ప్రకాశం ముఖ్యమంత్రి అయ్యేందుకు గాంధీ అనుమతించడం లేదని శ్రీపాద సుబ్రహ్మణ్యం సంపాదకత్వంలో నడిచే 'ప్రబుద్ధాంధ్ర' మాసపత్రిక తన 1937 సెప్టెంబరు సంచికలో స్పష్టం చేసింది

రాజగోపాలాచారి ముఖ్యమంత్రి కాగానే రాయలసీమ, సర్కారుల మధ్య ఐక్యతా ప్రయత్నాల్ని సాగిస్తున్న ఆంధ్రనాయకుల ప్రయత్నాల్ని వమ్ము చేయాలని ఒక తెలివైన పని చేశాడు తన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేటపుడు రాజగోపాలాచారి సర్కారు ప్రాంతానికి చెందిన ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి, వి వి గిరిని మంత్రులుగ ఎన్నుకున్నాడు. రాయలసీమ జిల్లాలకు ఎటువంటి ప్రాతినిధ్యమూ ఇవ్వలేదూ దీంతో ఆంధ్రనాయకులు మంత్రివర్గంలో తమకు ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రయత్నించలేదని రాయలసీమ నాయకులు భావించారు ఈ విధంగా రాయలసీమ – సర్కారుల మధ్య గల్గిన అభిప్రాయభేధాల్ని అసరాగా చేసుకుని, రాజగోపాలాచారి, సత్యమూర్తి, టి ఎస్ ఎస్ రాజన్ వంటి తమిళనాయకులు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రానికి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడడం ప్రారంభించారు. ఇందువల్లే పట్టాభి "ఈ తమిళ మంత్రులు మనకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చేముందుగనే బ్రిటీషు వాళ్ళు మనకు స్వాతంత్ర్యాన్ని ఇవ్వగలరు" అని వ్యాఖ్యానించాడు. చివరికి ఆయన వ్యాఖ్యానమే నిజమైంది

ఇటువంటి సందేహాలు నిరాశలతో కూడిన వాతావరణంలో 1937 అక్టోబరు చివరి వారంలో ఆంధ్రమహాసభ రజతోత్సవాలు విజయవాడలో జరిగాయి ఈ రజతోత్సవ సమావేశాన్ని హాలహర్వి సీతారామరెడ్డి ప్రారంభించగా, కడప కోటిరెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించాడు. వీరిద్దరు గూడ రాయలసీమకు చెందిన శాసనసభ్యులు కావడం విశేషం వీరు రాయలసీమ వాసుల సందేహాల్ని వివరించారు ఈ ప్రాంతానికి కొన్నిప్రత్యేక హామీలు యిచ్చి రాయలసీమ వాసుల విశ్వాసాన్ని తిరిగి పొందాలని ఆంధ్ర నాయకులకు వీరు సలహా ఇచ్చారు ఈ హామీలు ముఖ్యంగా రాజధాని నిర్ణయం, రాయలసీమ సర్కారుల మధ్య మంత్రి వర్గంలో సమాన ప్రాతినిధ్యం, తుంగభద్ర వంటి నీటి పారుదల పథకాల్ని చేపట్టడం వంటి విషయాలకు సంబంధించినవి

సర్కారు నాయకులు కూడ రాయలసీమ ప్రజల నిజమైన భయాల్ని అభినందిస్తూ వాటిని తొలగించేందుకు కొన్ని ఖచ్చితమైన హామీలు ఇవ్వాలని నిర్ణయించారు తాము జాతీయ సమస్యల్లో మునిగి ఉండడం వల్ల ఏ విధంగా నిజమైన తెలుగు ప్రాంతాలైన పర్లాకిమిడి, బరంపురం, ఛత్రపూర్, జైపూర్‌లను 1937లో ఏర్పడిన ఒరిస్సా ప్రాంతానికి వదలి వేయవలసి వచ్చిందో సర్కారు నాయకులు గుర్తించారు అభిప్రాయ భేదాలకు స్వస్తి చెప్పి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం సమైక్యంగా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని వారు భావించారు

1937 నవంబరు 16న రాయలసీమ, సర్కారులకు చెందిన నాయకులు కె కోటిరెడ్డి, హెచ్ సీతారామరెడ్డి, కల్లూరు సుబ్బారావు, జి హరిసర్వోత్తమరావు, కొండా వెంకటప్పయ్య, దేశి రాజు హనుమంతరావులు మద్రాసులోని కాశీనాధుని నాగేశ్వరరావు స్వగృహమైన 'శ్రీ బాగ్'లో కలుసుకుని ఒక ఒడంబడికను కుదుర్చుకున్నారు ఈ ఒడంబడికయే 'శ్రీబాగ్ ఒడంబడిక' గ ప్రసిద్ధి చెందింది. ఒడంబడికలో ఈ క్రింది విషయాలు పొందుపరిచారు.

## విశ్వవిద్యాలయం

ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రెండు విశ్వవిద్యాలయ కేంద్రాల్ని – ఒకటి వాల్తేరులోను, రెండవది అనంతపురంలోను ఏర్పాటు చేయాలి.

దీనివల్ల ఆంధ్రదేశం మొత్తానికి సాంస్కృతిక కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లవుతుంది ఇదేగాక పరస్పర సాంఘిక, సాంస్కృతిక అవగాహనకు వీలు కల్పించినట్లవుతుంది. ఆయా ప్రాంతాలకు సంబంధించిన విషయాల అధ్యయనం కోసం కొన్ని కళాశాలల్ని కూడ ఈ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చు.

## నీటి పారుదల ప్రాజెక్టులు

కోస్తా జిల్లాలతో సమానంగా రాయలసీమ, నెల్లూరు జిల్లాల వ్యవసాయిక, ఆర్థికపరమైన సత్వరాభివృద్ధికి పది సంవత్సరాలు లేక అవసరాన్ని బట్టి అంతకంటె ఎక్కువ కాలం పాటు నీటిపారుదల ప్రాజెక్టుకుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యంగా తుంగభద్ర, కృష్ణ, పెన్నానది జలాల వినియోగం విషయంలో ఈ ప్రాంతాలకు ప్రయోజనకరమైన ప్రాజెక్టులపై పది సంవత్సరాల పాటు ప్రత్యేక శ్రద్ధను చూపాలి

ఎప్పుడైనా నదీజలాల పంపిణీ ప్రశ్న తలెత్తినపుడు పై చెప్పిన ప్రాంతాల అవసరాల్ని ముందుగ తీర్చాలి ఈ విధానాన్ని రాష్ట్ర పాలనలో ఈ రోజు నుండే అమలు చేయాలి.

## శాసనసభ

శాసనసభలోని సాధారణ స్థానాల విషయంలో జిల్లా ప్రాతిపదికపై సమానమైన పంపిణీ జరగాలి

విశ్వవిద్యాలయము, హైకోర్టు ప్రధానకేంద్రాలు ఒకేచోట కాకుండా అందరికీ ప్రయోజనకరంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని అంగీకరించబడింది.

ఈ అంగీకారానికి అనుగుణంగానే విశ్వవిద్యాలయం మాత్రం ఇప్పుడున్న చోటనే యధాతదంగా కొనసాగాలని, హైకోర్టు, రాష్ట్ర రాజధానుల్ని మాత్రం సర్కారు, రాయలసీమ జిల్లాల్లో అనువైన ప్రాంతాల్లో ఏర్పాటు వేయాలని, ఈ రెండింటిలో ఏది కావాలో ఎంచుకునే అవకాశం రాయలసీమకే వదిలేయాలని నిర్ణయించబడింది

ఈ ఒడంబడికలోని నిబంధనల్ని అందరి ఆమోదంతో సవరించేందుకు అవకాశం కల్పించబడింది.

శ్రీబాగ్ ఒడంబడికపై సంతకం చేసిన తర్వాత మద్రాసు శాసనసభలోని ఆంధ్ర సభ్యులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు ఆంధ్రవ్యతిరేక చర్యల్ని చేపట్టడంలో దిట్టయైన రాజగోపాలాచారి ఆంధ్ర, మద్రాసు, కేరళ, మైసూరు రాష్ట్రాల ఏర్పాటుకు ఒక సమగ్ర తీర్మానాన్ని మద్రాసు శాసనసభ చేత ఆమోదింపచేసి ఆంధ్రనాయకుల్ని యుక్తిగా మోసపుచ్చాడు మొదటి చర్యగా ఆంధ్ర రాష్ట్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్న కె వి రెడ్డి నాయుడి సవరణ తీర్మానం త్రోసిపుచ్చబడింది ఈ తీర్మానాన్ని 1938 ఏప్రిలు 21న భారత ప్రభుత్వ పరిశీలనార్థం పంపడం జరిగింది ఇంతలోనే మే నెల 2వ తేదీన భారతదేశంలో కొత్త రాష్ట్రాల్ని ఏర్పాటు చేయడం లేదని కామన్స్ సభలో బ్రిటీషు ప్రభుత్వం ప్రకటించింది ఈ ప్రకటన ఆంధ్రుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీసింది. రాజగోపాలాచారి సలహా మేరకే బ్రిటీషు ప్రభుత్వం పై విధంగా ప్రకటించి ఉంటుందని చాలమంది అనుమానాన్ని వ్యక్తం చేశారు మద్రాసు శాసనసభ స్పీకరు పదవికి రాజీనామా చేసి ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని బులుసు సాంబమూర్తి భావించాడు అయితే ఏ కాంగ్రేసు నాయకుడూ ఆంధ్రోద్యమంలో పాల్గొనకూడదన్న కాంగ్రెసు అధిష్టావర్గం ఆదేశాన్ని శిరసావహించవలసి వచ్చింది ఇంగ్లాండులోని భారతదేశపు సెక్రటరీ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును తిరస్కరించాడని 1939 మార్చి 25న రాజగోపాలాచారి మద్రాసు శాసనసభకు తెలియజేశాడు 1939 సెప్టెంబరులో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం అయింది 1939 నవంబరులో కాంగ్రేసు మంత్రివర్గాలు రాజీనామా చేశాయి. దీంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సమస్య మరోమారు తెరమరుగైంది.

## నర్ విజయ – ఆంధ్ర మహాసభ

ఆంధ్ర మహాసభలో కాంగ్రేసు వారి ఆధిక్యత ఎక్కువ కావడంతో ఇది అన్ని విధాల బలహీనంగా తయారయింది అయితే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించడంలో కాంగ్రేసు ప్రయత్నాలు విఫలం కావడంతో, ఆంధ్ర మహాసభలో ఆంధ్రేతరుల్ని చేర్చుకుని మరింత పటిష్టంగా రూపొందించాలని చాలమంది ఆంధ్రులు అభిప్రాయపడ్డారు 1941 నవంబరులో ఆంధ్ర మహాసభ విశాఖపట్నంలో తన వార్షిక సమావేశాన్ని జరుపుకుంది. ఈ సమావేశానికి

బెనారసులో నివాసముంటున్న విజయనగరానికి చెందిన సర్ విజయానంద్ అధ్యక్షత వహించారు. ఆయన్ని అందరూ సర్ విజయ అని పిలిచేవారు ఆయన మంచి క్రికెట్ ఆటగాడు స్థానిక రాజుల వద్ద, అధికార వర్గాల్లోను మంచి పలుకుబడి కలిగి ఉండేవాడు 1937 లో ఉత్తరప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రేసు అభ్యర్ధిని ఓడించగల్గాడు. సర్ విజయ అధ్యక్షపదవిని చేపట్టిన తర్వాత ఆంధ్ర మహాసభ తిరిగి జీవం పోసుకుంది సర్ విజయ మొదట రాయలసీమ వాసుల భయాల్ని తొలగించడానికి ప్రయత్నించాడు అయితే శ్రీ బాగ్ ఒడంబడిక తర్వాత చాలమంది రాయలసీమ నాయకులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికి తమ మద్దతు తెలిపారు ఆర్ సూర్యనారాయణరావు, ఎన్.ఎం శాస్త్రి వంటి కొంతమంది బళ్ళారి నాయకులు మాత్రం 1938 లో మరో రాయలసీమ మహాసభను ఏర్పాటు చేశారు ఈ కొత్త రాయలసీమ మహాసభ మొదటి సమావేశం ఆదోనిలో జరిగింది ఈ సమావేశం పాలకపరమైన ఆర్థిక, రాజకీయ కారణాల వల్ల ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించింది

సర్ విజయ రాయలసీమ అంతటా పర్యటించి ఆ ప్రాంతపు కరువు బాధితుల సహాయార్థం విరాళాల్ని వసూలు చేశాడు కరువు సహాయనిధికి ఎక్కువ మొత్తాన్ని మంజూరు చేయాలని గవర్నరును కలుసుకుని విజ్ఞప్తి చేశాడు బ్రిటీషు అధికారుల్ని కలుసుకుని ఆంధ్రుల కష్టనష్టాల్ని వారి దృష్టికి తెచ్చాడు. 1942 ఏప్రిలు 2న సర్ స్టాఫర్డ్ క్రిప్పును కలుసుకుని ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని కోరుతూ ఒక మహజరును సమర్పించాడు

1943లో ఆంధ్ర మహాసభ వార్షిక సమావేశం బళ్ళారిలో జరిగింది ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసంపోరాడుదామని ప్రతిజ్ఞ చేసిన వారినే శాసనసభ ఎన్నికల్లో గెలిపించాలని సర్ విజయ ప్రజలకు సలహా ఇచ్చాడు ఇంకోరకంగా చెప్పాలంటే ఆంధ్ర మహాసభను ఒక రాజకీయ సంస్థగా రూపొందించాలని ఆయన కోరాడని చెప్పవచ్చు 1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది 1946 ఏప్రిల్ లో జరిగిన మద్రాసు రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రేసు అధికారాన్ని కైవశం చేసుకుంది 1946 చివర్లో అనారోగ్య కారణంగా ఆంధ్ర మహాసభ అధ్యక్ష పదవికి సర్ విజయ రాజీనామా చేశాడు. దీంతో ఆంధ్రమహాసభ కార్యకలాపాలు పూర్తిగ కనుమరుగైనాయి

# 11

# తెలంగాణాలో రాజకీయ చైతన్యం

ఆంధ్రప్రాంతంతో పోలిస్తే తెలంగాణాలో రాజకీయ చైతన్యం చాల ఆలస్యంగా తలెత్తిందని చెప్పవచ్చు దీనికి ఆశ్చర్యపడవలసిన పనిలేదు ఎందుకంటే దేశంలోని మిగిలిన సంస్థానాల్లోలాగానే హైదరాబాదు సంస్థానంలో కూడ నిరంకుశాధికారం రాజ్యం చేసేది హైదరాబాదు ప్రభుత్వం ప్రజల బాగోగుల్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతోపాటు ప్రభువు ముస్లిం కావడంతో ఉర్దూభాషను పాలనాభాషగాను, విద్యాసంస్థల్లో బోధనాభాషగాను అమలు చేశాడు. ప్రజల భాషలో విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కూడ అనుమతి ఇవ్వలేదు ఈ సంస్థానంలోని ప్రజలకు పౌరునికుండవలసిన ప్రాథమిక హక్కులు కూడ కరువయ్యాయి వ్యవసాయ కౌలుదార్ల పరిస్థితి దుర్భరంగా తయారయింది. మక్తేదార్లు, పత్తేదార్లు అనబడే పెద్ద భూస్వాములు కౌలుదారీ రైతుల్ని బాగేలా, వెట్టి చాకిరి అనబడే దాస్యానికి, బానిసత్వానికి గురిచేశారు.

ఇటువంటి దుర్భర వాతావరణంలో సహజంగానే తెలుగు భాషా పాండిత్యాల్ని ఆదరించేవారే కరువయ్యారు ఇటువంటి క్లిష్టపరిస్థితిలో 1901లో కొమర్రాజు లక్ష్మణరావు హైదరాబాదు నగరంలో 'శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం' ను స్థాపించాడు ఇదే తెలంగాణాలో వెలసిన మొట్టమొదటి గ్రంథాలయం మునగల రాజా అయిన ఎన్ వెంకటరావు, హైదరాబాదు మునసబుదారైన రావిచెట్టు రంగారావుగార్లు ఇచ్చిన ఆర్థిక, నైతిక ప్రోత్సాహం వల్లే లక్ష్మణరావు ప్రయత్నాలు సఫలీకృతం అయ్యాయి తర్వాత హనుమకొండలో 'శ్రీరాజ

రాజ ఆంధ్ర భాషా నిలయం' (1904), సికిందరాబాదులో 'ఆంధ్ర సంవర్ధినీ గ్రంథాయలం' (1905) వంటి తెలుగు గ్రంథాయలయాలు ఏర్పాటు చేయబడ్డాయి. శాస్త్ర, మానవీయ విజ్ఞానాన్ని అందించే తెలుగు పుస్తకాల ప్రచురణను చేపట్టాలని 1906లో లక్ష్మణరావు 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి' అను సాహితీ సంస్థను ఏర్పాటు చేశాడు. ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నంలో ఈ సంస్థ పనిచేస్తున్నదని నైజాం ప్రభుత్వానికి సందేహం రావడంతో మండలి తన ప్రధాన కేంద్రాన్ని మద్రాసుకు తరలించవలసి వచ్చింది. ఈ విధంగా లక్ష్మణరావు తెలంగాణాలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి పునాదులు వేయడమే గాక, ఆంధ్ర, తెలంగాణాల మధ్య సాంస్కృతిక సంబంధాల్ని తిరిగి నెలకొల్పాడు.

మద్రాసు రాష్ట్రంలోని తెలుగువారు వందేమాతరం ఉద్యమం నాటికే చైతన్యం పొందగా, తెలంగాణాలోని వారి సోదరులు 1920 నాటికి గాని రాజకీయంగా చైతన్యులు కాలేక పోయారు ఒక చిన్న సంఘటన హైదరాబాదు రాష్ట్రంలోని ఆంధ్రుల్ని సంఘటిత పర్చింది. 1921 నవంబరు 11, 12 తేదీల్లో హైదరాబాదులో హైదరాబాదు రాష్ట్ర సాంఘిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గొప్ప సంఘ సంస్కర్త, ఎస్.ఎన్ డి.టి మహిళా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడైన మహర్షి కార్వే పండితుడు అధ్యక్షత వహించాడు సమావేశపు కార్యక్రమాలన్నీ ఆంగ్లం, ఉర్దూ, భాషల్లో కొనసాగాయి సమావేశ ప్రతినిధిగా వచ్చిన హైదరాబాదు న్యాయవాది ఆలంపల్లి వెంకట రామారావు ఒక తీర్మానంపై తెలుగులో మాట్లాడడానికి ప్రయత్నించగా సమావేశంలోని ఒక వర్గం అల్లరి చేసి ఆయన నోరు మూయించింది ఈ సంఘటన సమావేశంలో ఉన్న తెలుగు ప్రేక్షకులకు తీరని అవమానాన్ని కలిగించింది తెలంగాణాలోని ప్రధాన నగరంలో తెలుగు భాషకు ఎదురైన అధ్వాన్న పరిస్థితిని చూడమని తెలుగువారిని మేల్కొలిపింది అందువల్ల ఆ రాత్రికి రాత్రే ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు, బి.రామకృష్ణారావు, ఎం నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావులతో కలిపి 11 మంది సభ్యులు గల ఒక సంఘాన్ని 'ఆంధ్రజనసంఘం' అనే పేరుతో ఏర్పాటు చేశారు. అనతికాలంలోనే ఈ సంఘంలోని సభ్యుల సంఖ్య 100కు పెరిగింది. 1922 ఫిబ్రవరి 14న ఆంధ్రజనసంఘం మొదటి సమావేశం హైదరాబాదులో కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలోనే

ఆంధ్రజనసంఘం పేరును 'నైజాం రాష్ట్ర ఆంధ్ర జనసంఘం'గా మార్చారు సంఘం కార్యదర్శిగా ఎన్నుకోబడ్డ మాడపాటి హనుమంతరావు సంఘ భవిష్యత్తును తీర్చిదిద్ది తెలంగాణా ఆంధ్రుల సాంస్కృతికాభివృద్ధికి ఎనలేని సేవచేశాడు

తెలంగాణా ప్రజల్ని సాంఘిక, ఆర్థిక, సాంస్కృతికాభివృద్ధివైపు నడపడమే ఆంధ్రజన సంఘం యొక్క పరమోద్దేశము తెలంగాణాలోని వివిధ ఆంధ్ర సంఘాల కార్యకలాపాల్ని సమన్వయ పరిచేందుకు 'ఆంధ్ర జన కేంద్ర సంఘం' అను ఒక కేంద్ర సంస్థను ఏర్పచారు ఈ సంస్థకు మాడపాటి హనుమంతరావు కార్యదర్శిగ పనిచేశారు ఈ సంస్థ 'వెట్టిచాకిరి', 'వర్తక సంఘం' అను కరపత్రాల్ని విడుదల చేసింది

తెలుగు పాఠశాలల్ని గ్రంథాలయాల్ని ప్రారంభించడం, తెలుగు పుస్తకాల్ని ప్రచురించడం, చారిత్రక పరిశోధనకు దోహదం చేయడం వంటివి 'ఆంధ్ర జన సంఘం' చేపట్టిన కొన్ని కార్యక్రమాలు 'నిజాం ఆంధ్ర రాష్ట్ర ప్రశంస', 'నిజాం ఆంధ్ర రాష్ట్ర ఆంధ్రులు' మొదలైన పుస్తకాలు ప్రచురింపబడ్డాయి సంఘం యొక్క మొదటి నాలుగు సమావేశాలు హైదరాబాదు (1923), నల్గొండ (1924), మధిర (1925), సూర్యాపేట (1928)ల్లో జరిగాయి

కేంద్ర సంఘం కార్యకలాపాల్లో తెలంగాణా గ్రంథాలయోద్యమం తన కార్యకలాపాల్ని సమన్వయ పరిచింది అయితే 1925లో మొదటి గ్రంథాలయ సమావేశం జరిగిన తర్వాత దీని కార్యకలాపాలపై ప్రభుత్వానికి సందేహం కలిగింది. దీంతో 1926లో రెండవ సమావేశం జరుపుకోడానికి నైజాం ప్రభుత్వం తన అనుమతిని నిరాకరించింది. కొమర్రాజు లక్ష్మణరావు జ్ఞాపకార్థం 'లక్ష్మణరాయ పరిశోధక మండలి' అను పేరుతో ఒక చారిత్రక పరిశోధన సంఘాన్ని జన సంఘం ఏర్పాటు చేసింది కొమర్రాజు లక్ష్మణరావు హైదరాబాదులో కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయస్థాపనకు, విజ్ఞాన చంద్రికా మండలి స్థాపనకు ముఖ్య కారకులని మనకందరికి విదితమే. 'కాకతీయుల చరిత్ర' అనే అంశంపై చర్చించేందుకు 1930లో వరంగల్లులో చరిత్రకారులు, పండితులతో కూడిన ఒక సమావేశం ఏర్పాటయింది ఈ సందర్భంగా ఆంధ్రుల చరిత్ర, సంస్కృతిపై రాసిన వివిధ రచనలు కల్గిన ఒక సంపుటిని కాకతీయ సంచిక పేరుతో విడుదల చేయడం జరిగింది

జనసంఘం 1928 నుండి స్త్రీ విద్యావ్యాప్తికి విశేషంగ కృషి చేసింది. ఈ కృషిలో భాగంగానే హైదరాబాదులో ఆంధ్ర బాలికోన్నత పాఠశాలను స్థాపించింది తెలుగు మీడియంలో చదివిన మొదటి బాలికల బృందం 1934లో మెట్రిక్యులేషను పరీక్షకు కూర్చొంది. బాలికల పాఠశాలను గుర్తించేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నిరాకరించడంతో విద్యార్థినులు బొంబాయిలోని కార్వే విద్యాలయంలో పరీక్షలకు కూర్చున్నారు

## నైజాం ఆంధ్రమహాసభ ఏర్పాటు

మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర నాయకులు తమ తక్షణ సమస్యల్ని కూడ పట్టించుకోక ఉదాసీనతను వహించి ఉంటే, వారి తెలంగాణా సోదరులు మాత్రం తమ ప్రయోజనాల్ని కాపాడుకునేందుకు నడుం కట్టారు 1930లో మెదక్ జిల్లాలోని జోగిపేటలో జరిగిన సమావేశంలో ఆంధ్రజనసంఘం 'ఆంధ్ర మహాసభ'గ పేరు మార్చుకుంది. ఆంధ్ర మహాసభ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసే కార్యకలాపాలకు పాల్పడవచ్చునని హైదరాబాదు ప్రభుత్వం సందేహించింది. 'ఆంధ్ర' అనే పదము ప్రమాదకరంగా పరిణమిస్తుందన్న భావం ప్రభుత్వానికి కలిగింది. అయితే తెలంగాణా నాయకులు మాత్రం 'ఆంధ్ర' పదానికే కట్టుబడ్డారు 'తెలుగు' లేక 'తెలంగాణా' పదాల్ని ఉపయోగించడానికి వారు అంగీకరించలేదు ఆంధ్ర మహాసభ మొదటి సమావేశానికి సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించాడు. రెండవ సమావేశం 1931లో బి రామకృష్ణారావు అధ్యక్షతన దేవరకొండలో జరిగింది. ఈ సమావేశంలో చాలమంది ప్రతినిధులు తెలుగులోనే ప్రసంగించారు. దీంతో హైదరాబాదు రాష్ట్రంలో తెలుగు బాషాభివృద్ధికి ఆంధ్రజనసంఘం చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాల్ని సాధించాయని స్పష్టమైంది రెండవ సమావేశం తరువాత హైదరాబాదు ప్రభుత్వం ఆంధ్ర మహాసభ వ్యతిరేకధోరణిని అనుసరించింది మూడవ సమావేశం జరుపుకునేందుకు సభ మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వ అనుమతి కోసం వేచి ఉండవలసి వచ్చింది. చివరికి 1934లో ఖమ్మంలో ఆంధ్రమహాసభ మూడవ సమావేశం జరిగింది ప్రభుత్వంతోపాటు అనేక ప్రతీఘాతశక్తులు సమావేశాన్ని భగ్నం చేయాలని ప్రయత్నించాయి అయితే

మాడపాటి హనుమంతరావు ప్రదర్శించిన నేర్పు వల్ల అన్నీ సవ్యంగా సాగిపోయాయి సమావేశానికి పులిజాల వెంకట రంగారావు అధ్యక్షత వహించాడు

నాల్గవ సమావేశం 1935లో సిరిసిల్లలో మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన ఏర్పాటయింది హనుమంతరావు భార్య మహిళా సదస్సుకు అధ్యక్షత వహించింది అయిదవ సమావేశం షాద్‌నగర్‌లో కొండావెంకట రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది

## నైజాం ఆంధ్ర మహాసభలో చీలిక

1941 నుండి ఆంధ్ర మహాసభ వామపక్ష నాయకుల చేతుల్లోకి వచ్చింది సభ ఏడవ సమావేశం హైదరాబాదు జిల్లాలోని మల్కాపురంలో 1940లో జరిగింది ఎం రామచంద్రారావు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ప్రవేశపెట్టబోయే రాజ్యాంగ సంస్కరణల్ని గూర్చిన చర్చ ప్రధానాంశమైంది రావినారాయణరెడ్డి, కాళోజీ నారాయణరావు, ఎన్.కె రావు, పొల్కంపల్లి వెంకటరామారావుల మద్దతుతో సంస్కరణల్ని పూర్తిగ బహిష్కరించాలనే తీర్మానం ఆమోదించబడింది 'బహిష్కరణ' అనే పదాన్ని తీసివేయాలని కె వి రంగారెడ్డి, ఎం హనుమంతరావు, పులిజాల వెంకటరంగారావు మొదలైన మితవాదులు ప్రతిపాదించిన తీర్మానం వీగిపోయింది యువతరానికి చెందిన వామపక్ష నాయకులు ఆంధ్ర మహాసభపై అదుపును సంపాదించగల్గారని పై విషయం స్పష్టంగా తెలియజేస్తుంది

1941లో హుజూర్‌నగర్ తాలూకాలోని చిలకలూరులో ఎనిమిదవ సమావేశం జరిగింది ఈ సమావేశానికి కమ్యూనిస్టు పార్టీ కార్డు గ్రహీత అయిన రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. తన అధ్యక్షోపన్యాసంలో రావినారాయణరెడ్డి అనేక అంతర్జాతీయ, జాతీయ సమస్యల్ని గురించి ప్రస్తావించారు తొమ్మిదవ సమావేశం వరంగల్లు జిల్లాలోని ధర్మవరంలో మాదిరాజు రామకోటేశ్వరరావు అధ్యక్షతన 1942లో జరిగింది పదవ సమావేశం 1943లో హైదరాబాదులో జరిగింది. అధ్యక్ష పదవికి జరిగిన తీవ్రమైన పోటీలో కె.వి.రంగారెడ్డి గెలుపొందగా బద్దం ఎల్లారెడ్డి ఓడిపోయాడు. తెలంగాణా సరిహద్దుల్ని స్పష్టంగా నిర్వచించాలని, తెలుగు తాలూకాలైన గద్వాలు,

ఆలంపూర్ లను, రాయచూర్ జిల్లాను, కోడగల్ ను తెలంగాణా జిల్లాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈసమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించారు

1944లో రావినారాయణరెడ్డి అధ్యక్షతన భువనగిరిలో 11వ సమావేశం జరిగింది ఈసారి మాత్రం సభ కమ్యూనిస్టుల అదుపులోకి వచ్చింది చండ్రరాజేశ్వరరావుతో పాటు మిగిలిన ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు కూడ ఈ సమావేశానికి హాజరయ్యారు ఈ సమావేశానికి పదివేలకు పైగా జనం హాజరైనారు ఇది ఆనాటికి గొప్ప రికార్డును సృష్టించిందని చెప్పవచ్చు. కె.వి రంగారెడ్డి, ఎం రామచంద్రరావులు ఈ సమావేశాన్ని కమ్యూనిస్టు పార్టీ సభగ ఆక్షేపించారు ఇంతేకాక 'జాతీయ ఆంధ్ర మహాసభ' పేరుతో ఒక పోటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ జాతీయ మహాసభ 1945లోను, 1946లోను రెండు సమావేశాల్ని నిర్వహించింది తర్వాత తన తోటి సంస్థలైన మహారాష్ట్ర పరిషత్తు, మైసూరు పరిషత్తులతోపాటు హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసులో విలీనం కావాలని నిశ్చయించింది కమ్యూనిస్టుల అదుపులో ఉన్న సభ తన 12వ సమావేశాన్ని 1945లో ఖమ్మంలో ఏర్పాటు చేసింది ఈ సమావేశానికి రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించాడు నలభై వేల మందికి పైగా జనం ఈ సమావేశానికి హాజరయ్యారు. 1946 డిశంబరు 3న కమ్యూనిస్టు పార్టీ నిషేధానిక గురికావడంతో ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు కూడ ముగింపు దశకు చేరుకున్నాయి.

12

# తెలంగాణాలో స్వాతంత్ర్యోద్యమం

భారతదేశంలోని సంస్థానాల్లో హైదరాబాదు సంస్థానం ఒక ప్రముఖ స్థానాన్ని అలంకరించింది ఇది ఫ్రాన్సు దేశం కంటె పెద్దదే కాక రాజకీయంగాను, సైనికంగాను కీలకమైన స్థానాన్ని సంపాదించింది అత్యవసర పరిస్థితుల్లో ఈ ప్రాంతం ఉత్తర భారతాన్ని దక్షిణ భారతదేశం నుండి పూర్తిగ విడదీయగలుగుతుంది. 1857 లో సిపాయిల తిరుగుబాటు జరిగినపుడు హైదరాబాదు బ్రిటీషువారికి రక్షకవలయంగ పనిచేసింది హైదరాబాదు దివాను అయిన సాలార్‌జంగ్ ఉద్యమకారులకు వ్యతిరేకంగా ఈస్టిండియా కంపెనీకి మద్దతు ఇవ్వడానికి నైజాంను ఒప్పించగల్గాడు ఉద్యమాన్ని అణచివేయడమే కాకుండా బ్రిటీషువారు ఒక గుణపాఠాన్ని కూడా నేర్చుకున్నారు దీంతో బ్రిటీషు కంపెనీ హైదరాబాదులో తన బలాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించింది బ్రిటీషు ప్రతినిధే నిజమైన పాలకుడుగ పెత్తనం చెలాయించాడు

హైదరాబాదు రాష్ట్ర ప్రజలు రెండు విధాలుగ నష్టపోయారు వారు బ్రిటీషు వారి అధికార దర్పంతోపాటు నైజాం నిరంకుశ పాలనను కూడ భరించాల్సి వచ్చింది నైజాం పర్షియను వంశానికి చెందినవాడు కావడంతో 88 శాతం ఉన్న హిందువుల జాతీయ, సాంస్కృతిక ఆశయాలపై ఎటువంటి సానుభూతిని చూపలేకపోయాడు.

రాష్ట్రంలో ఈ విధమైన ప్రతికూలవాతావరణం ఎదురైనా హైదరాబాదు నగరవాసులు ముఖ్యంగా ఇంగ్లీషు విద్యను అభ్యసించిన ఒక చిన్న బృందం - బ్రిటీషు ఇండియాలోని సాంఘిక, రాజకీయ పరిణామాలకు స్పందించకుండా

ఉండలేకపోయారు 1883లో జరిగిన చందా రైల్వే ఆందోళనతో హైదరాబాదు రాష్ట్రంలోని ప్రజా చైతన్యానికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన అఘోరనాథ చటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ కయాం, న్యాయవాది రామచంద్ర పిళ్ళైవంటివారు భారతజాతీయ కాంగ్రెసు ఆవిర్భావానికి (1885) స్వాగతం పలికారు ముల్లా అబ్దుల్ కయాం కాంగ్రెసులో చేరి మద్రాసు, బెనారసులలో జరగిన వార్షిక సమావేశాలకు హాజరయ్యాడు

జాతీయ భావాల్ని కలిగిఉన్న 'హైదరాబాదు రికార్డు' వంటి వార్తాపత్రికలు బ్రిటీషు ప్రతినిధుల (British Residents) అధికార దుర్వినియోగాన్ని విమర్శించేవి బ్రిటీషు ప్రతినిధి కోపానికి గురైన ఈ 'హైదరాబాదు రికార్డు' పత్రిక చాలకాలం కొనసాగలేకపోయింది దీని ప్రచురణ 1892లో ఆగిపోయింది స్వతంత్ర పత్రికా రంగ అభివృద్ధిని దెబ్బతీసేందుకు రాష్ట్రానికి వెలుపల ప్రచురితమయ్యే పత్రికలపై నైజాం ప్రభుత్వం అనేక ఆంక్షల్ని విధించింది హైదరాబాదుకు చెందిన బారిష్టరు, 'ది పయనీర్' పత్రికా రచయితయైన రుద్ర అనే ఆయన ప్రభుత్వాన్ని విమర్శించినందుకు నగర బహిష్కారానికి గురయ్యాడు ఇదే విధంగా హైదరాబాదుకు చెందిన న్యాయవాది 'హిందుపత్రిక' రచయితయైన పి.రామచంద్రపిళ్ళై తన కక్షిదారులైన ఆర్య సమాజ నాయకులు విశ్వనాథ్ సరస్వతి, నిత్యానంద బ్రహ్మచార్లను పరామర్శించేందుకు జైలును సందర్శించినందు వల్ల రెండు గంటలపాటు పోలీసు నిర్బంధంలో ఉండవలసి వచ్చింది

ప్రభుత్వం పూర్తిగ మత వివక్షతను పాటించడమేగాక ప్రభుత్వం అందించే విద్యార్థి భృతిపై పైచదువులకు ఇంగ్లాండుకు వెళ్లే తెలివిగల హిందూ విద్యార్థులకు ఆటంకాలు కల్పించేందుకు ప్రయత్నించింది ఇంగ్లాండుకు వెళ్లే విద్యార్థులు తప్పనిసరిగా పర్షియను, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం సంపాదించాలని ఆంక్షల్ని విధించింది ప్రభుత్వం నియమించిన కమిటీ నుండి అనుమతిని పొందాలని నిర్దేశించింది ఈ కమిటీలో హిందూ మత ఛాందసుల్ని సభ్యులుగా నియమించింది సముద్రం ద్వారా విదేశీ ప్రయాణం తమ కులానికి, మతానికి విరుద్ధం కాబట్టి ఈ కమిటీ సభ్యులు హిందూ విద్యార్థులకు అనుమతిని ఇవ్వరని ప్రభుత్వానికి స్పష్టంగా తెలుసు

## ఆర్య సమాజ కార్యకలాపాలు

ఈ విధంగా హైదరాబాదు రాష్ట్రంలోని హిందువులు సాంస్కృతికంగా, రాజకీయంగా వివక్షతకు గురవుతుండడంతో వీరి ప్రయోజనాల్ని కాపాడేందుకు 1892లో హైదరాబాదులో ఆర్యసమాజ శాఖను ఏర్పాటు చేశారు బ్రిటీషు ఇండియాలోవలె గాక హైదరాబాదులోని ఆర్యసమాజం కార్యకలాపాలు రాజకీయరంగును పులుముకున్నాయి హిందువుల హక్కుల్ని రక్షించేందుకు ఆర్య సమాజం కంకణం కట్టుకుంది కేశవరావు కొరాట్కర్, దామోదర్ సత్యాలేకర్, డాక్టరు అఘొరనాథ చటోపాధ్యాయ వంటి హైదరాబాదు నగర ప్రముఖులు ఆర్య సమాజ కార్య కలాపాలకు మద్దతు ఇచ్చారు తర్వాతి కాలంలో హైదరాబాదు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని అలంకరించిన కేశవరావు కొరాట్కర్ 1896లో ఆర్య సమాజంలో చేరి 1932 మే 21న తాను మరణించేవరకు సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దాడు కేశవరావు 1906లో వామనరావు నాయక్, గణపత్ రావు హార్టికార్ లతో కలసి వివేకవర్ధిని పాఠశాలను స్థాపించాడు ఈ పాఠశాల తర్వాతి కాలంలో 'వివేకవర్ధిని' విద్యాసంస్థ పేరుతో గొప్ప సంస్థగా రూపొందింది మహారాష్ట్ర పౌరులు ఈ విధమైన కార్యకలాపాల్లో మునిగిఉండగా హైదరాబాదు ఆంధ్రులు కూడా వారికే మాత్రం తీసిపోక హైదరాబాదులో శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం (1901), విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి (1906) వంటి గ్రంథాలయాల్ని, సాంస్కృతిక సంస్థల్ని ఏర్పాటు చేయడంలో ఉత్సాహాన్ని ప్రదర్శించారు

## స్వదేశీ ఉద్యమం

స్వదేశీ ఉద్యమం హైదరాబాదు నగరంలో కూడ తన ప్రభావాన్ని చూపించింది. ఆర్య సమాజం, గణేశ ఉత్సవ సంఘం వంటి సంస్థలు స్వదేశీ ఉద్యమ తత్వాన్ని వ్యాప్తిలోకి తెచ్చేందుకు ప్రయత్నించాయి యువకుల శరీర దారుఢ్యాన్ని పెంపొందించి వారిలో ఆత్మ విశ్వాసాన్ని కలుగుజేసేందుకు వ్యాయామశాలల్ని స్థాపించాయి దామోదర్ సత్వాలేకర్, అప్పాజీ తుల్జా పుర్కార్ వంటి వారు సభలు సమావేశాలు జరిపించి స్వదేశీ ఉద్యమాన్ని వ్యాప్తి లోకి తెచ్చేందుకు విశేషంగా కృషి చేశారు వీరి కార్యకలాపాలు ప్రభుత్వ దృష్టికి

రావడంతో వారు రాష్ట్రం నుండి బహిష్కరించబడ్డారు కేశవరావు కొరాట్కర్, వామన నాయక్ వంటివారు భారత జాతీయ కాంగ్రెసు సమావేశాలకు హాజరవుతూ బ్రిటీషు ఇండియాలో జరిగే వివిధ పరిణామాల్ని గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేవారు

## నైజాం ప్రభుత్వ ప్రతీఘాత చర్యలు

రాష్ట్రంలోని హిందూ పౌరుల్లో పెరుగుతున్న సాంస్కృతిక, రాజకీయ చైతన్యాన్ని చూచి నైజాం ప్రభుత్వం కలవరపాటు చెందింది తన నిరంకుశత్వాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు రాష్ట్రంలో హిందూ సంస్కృతికి ఒక పద్ధతి ప్రకారం సమాధి కట్టాలని నిర్ణయించింది ఈ పద్ధతిలో భాగంగానే ఎలగండల, పాలమూరు, ఇందూరు, మెతుకు వంటి జిల్లాల పేర్లను 1905లో వరుసగా కరీంనగర్, మహబూబ్ నగర్, నిజామాబాదు, మెదక్ లుగా మార్చింది మనుకోట, భువనగిరి, పట్టణాల పేర్లను వరుసగా మహబూబాబాద్, భోంగీర్ లుగ మార్చింది ఇదే విధంగా 'పాడు' అను పదంతో అంతమయ్యే స్థలనామాలకు 'పహాడ్'ను చేర్చింది (ఉదాహరణకు "బూర్గంపాడు'ను 'బూర్గం పహాడ్'గా మార్చింది) ఇదే సమయంలో హైదరాబాదు రాష్ట్రాన్ని ఇస్లామిక్ రాజ్యంగా ప్రకటిస్తూ ఒక ప్రకటనను కూడ జారీ చేశారు 1911లో మీర్ మహబూబ్ అలీఖాన్ మరణించగా మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-1948) నైజాం పదవిని అలంకరించాడు ఈయన అసఫ్ ఝూ వంశావళిలో ఏడవవాడే గాక చివరి వాడు కూడ కావడం విశేషం

ఉస్మాన్ అలీఖాన్ పాలనాకాలంలో హైదరాబాదు రాజ్యాన్ని ముస్లిం రాజ్యంగా మార్చే ప్రయత్నాలు ముమ్మరమైనాయి ప్రభుత్వ ప్రోత్సాహంతో 'మజ్లిస్-ఇ-ఇత్తేహాదుల్-ముస్లిమీన్' అనే మతోన్మాద సంస్థను స్థాపించడం జరిగింది ఈ సంస్థ 'అంజుమన్ తబ్లి గులిస్తాన్ అనే మరో సంస్థతో కలిసి హిందువుల్ని ఇస్లాం మతంలోకి మార్పించే 'తబ్లిక్' ఉద్యమాన్ని ప్రారంభించింది ఈ సంస్థల కార్యకలాపాల్ని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ఆర్య సమాజం 'శుద్ధి' ఉద్యమాన్ని చేపట్టి ఇస్లాంలో చేరిన హిందువుల్ని తిరిగి హిందూమతంలో చేర్పించే కార్యక్రమం ప్రారంభించింది.

## ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపన (28 ఆగస్టు 1915)

1915లో హైదరాబాదు రాష్ట్ర మొదటి విద్యా సమావేశం ఏర్పాటు చేయబడింది ఈ సమావేశ ఏర్పాటుకు మూలపురుషుడు హైదరాబాదు ఉర్దూ దినపత్రిక 'సాహిఫా' సంపాదకుడైన మీర్ అక్బరు ఆలీ'. హైదరాబాదులో ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని ఈ సమావేశం కోరింది ఈ కోరిక ఉర్దూ భాషకు ఒక గౌరవస్థానాన్ని కలిగించేందుకు నైజాంకు ఒక మంచి అవకాశాన్ని కల్గించింది దీనికితోడు 1914లో మూడవ సాలార్‌జంగ్ అయిన నవాబ్ మీర్ యూసుఫ్ ఆలీఖాన్ తన ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేయడంతో నైజాం ప్రభుత్వాధికారాన్నంతా పూర్తిగ తన అధీనంలో ఉంచుకుని దాదాపు అయిదు సంవత్సరాల పాటు ప్రధానమంత్రి లేకుండానే పరిపాలన సాగించాడు.

ఉర్దూ భాష ద్వారా ఉన్నత విద్యను బోధించేందుకు 1919 ఆగస్టు 28న ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని చాల ఆడంబరంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఉర్దూ భాషద్వారానే విద్యా బోధన జరగాలన్న నిర్ణయం రాజకీయ దురుద్దేశంతో కూడుకుందనేది సుస్పష్టం. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని 88 శాతం హిందువులు వ్యవహరిస్తున్న తెలుగు, మరాఠి, కన్నడ భాషల్ని చావుదెబ్బతీసింది ప్రభుత్వం. ఈ చర్య వల్ల హిందువుల సంస్కృతీ వికాసానికి కూడ అడ్డుకట్ట వేసింది ప్రభుత్వం తెలుగు భాషలో విద్యాబోధన చేయడం వల్ల నారాయణగూడలోని ఆంధ్రబాలికోన్నత పాఠశాలకు గుర్తింపునివ్వకుండా నిరాకరించింది ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ పాఠశాలే ఈనాడు మాడపాటి హనుమంతరావు బాలికోన్నత పాఠశాలగ పేరు మార్చుకుంది

## కార్యనిర్వాహక సమితి అధ్యక్షుడుగ సర్‌ఆలీ ఇమాం నియామకం

రౌలతు చట్టాన్ని ఆమోదించడం, జలియను వాలాబాగ్ మారణకాండ వల్ల బ్రిటిషు ఇండియాలో చెలరేగిన అశాంతి హైదరాబాదు రాష్ట్రంలోకి కూడ వ్యాపించింది. ఈ కొత్త పరిణామాన్ని ఎదుర్కొనేందుకు నైజాం 1919 చివరి కల్లా తన వ్యక్తి పాలనకు స్వస్తి చెప్పి సర్‌ఆలీ ఇమాం అధ్యక్షతన ఒక కార్యనిర్వాహక సమితినిఏర్పాటు చేశాడు. సర్ ఆలీ ఇమాం బీహారు, ఒరిస్సా రాష్ట్ర కార్యనిర్వాహక సమితిలో సభ్యుడు. అయితే యుక్తులు, కుయుక్తులతో

గూడిన హైదరాబాదు వాతావరణం ఆలీ ఇమాంకు నచ్చలేదు అందువల్ల ఆయన అధ్యక్ష పదవిని స్వీకరించిన రెండేళ్ళకే రాజీనామా చేశాడు

## ఖిలాఫతు ఉద్యమం

ఖిలాఫతు ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించాల మహాత్ముని నిర్ణయం హైదరాబాదు ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసింది ఖాదీ బ... ధరించడం, స్వదేశీ ప్రచారం విశేషంగా వ్యాప్తిలోకి వచ్చింది 1921 అక్టోబరు 2న మహాత్ముని 53వ జన్మదినోత్సవాన్ని జరుపుకునేందుకు హైదరాబాదులో ఒక బహిరంగ సమావేశం జరిగింది బ్రిటీషుకు వ్యతిరేకంగా ముస్లింలను విశేషంగా పురికొల్పిన ఖిలాఫతు ఉద్యమం వైపు నైజాం కూడ ఆకర్షితుడవుతాడేమోనని భారత ప్రభుత్వం ఆందోళన చెందింది. నైజాం ఖిలాఫతు ఉద్యమాన్ని నడపాలని ముస్లింలు కోరారు ఇదేగాక ఆయనకు, 'మొహివుల్ మిల్లత్-ఇ-వద్దీన్' అనే బిరుదును ఇవ్వడానికి కూడ ముస్లింలు సిద్ధపడ్డారు అయితే నైజాం ఈ ఉద్యమాన్ని తన రాజకీయ ప్రయోజనాల్ని సాధించేందుకు వినియోగించుకోవాలని ప్రయత్నించాడు. అందువల్లే 1920 జూన్ 13న వైస్రాయి చెమ్స్‌ఫర్డుకు వ్రాసిన ఉత్తరంలో "శాంతి ఒప్పందంలోని షరతుల్ని మరింత సరళతరం చేయమని కోరడానికి ప్రస్తుత పరిస్థితుల్లో నేను వెనుకాడను" అని నైజాం స్పష్టం చేశాడు అయితే ఈ ఉత్తరంలో తన్ను తాను 'బ్రిటీషు స్నేహితుడుగా, ప్రభువుగ' అభివర్ణించుకున్నాడు. మరల నైజాం బ్రిటీషు సామ్రాజ్య విధానాన్ని గురించి ఇలా ఉచిత సలహా ఇచ్చాడు:

"మహమ్మదీయుల అభిప్రాయాన్ని అటుంచి బ్రిటీషు సామ్రాజ్య వాద విధానాన్ని మరింత పటిష్టంగా రూపొందించాల్సిన విషయం ఆలోచిస్తే సమీపప్రాచ్యంలో (Near East) 'బోల్షివిక్కు' లాంటి ఇస్లాం వ్యతిరేక ఉద్యమాలు తలెత్తకుండా అదుపులో పెట్టగల ఒక శక్తివంతమైన స్వతంత్ర ముస్లిం రాజ్యం రూపొందాల్సిన అవసరాన్ని గురించి ఎంతైనా చెప్పవలసి ఉంటుంది" ఈ సలహాలో నైజాం ఉద్దేశం ఏమిటో మనకు స్పష్టమయింది

1920 మార్చి, ఏప్రిలు నెలల్లో హైదరాబాదు నగరంలోను, కరీంనగరు, మెదక్, జంగోవాన్ వంటి రాష్ట్ర పట్టణాల్లోను ఖిలాఫతు దినాన్ని (యోవున్-

ఇ-ఖిలాఫతు) పాటించారు జమీందార్, సియాసత్, జమానావంటి ఉర్దూ పత్రికలు ఖిలాఫతు భావాల్ని ప్రచారం చేశాయి 1920 జూలై 8న నైజాం వైస్రాయికి వ్రాసిన ఉత్తరంలో "బ్రిటీషు ఇండియాలోని ఉర్దూ పత్రికా రంగం నాకు, నా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నా ప్రజల మనస్సుల్లో చిచ్చు రేపడానికి బహిరంగంగా పనిచేస్తున్నది"అని మొరపెట్టుకున్నాడు

## హైదరాబాదు రాజకీయ సమావేశాలు – మొదటి సమావేశం (కాకినాడ, 1923)

1923 డిసెంబరు చివరి వారంలో భారత జాతీయ వార్షిక సమావేశము, ఖిలాఫతు సమావేశము కాకినాడలో జరిగాయి బెంగాలు – నాగపూర్ రైల్వేలోని తూర్పు కోస్తా లైనుకు గండ్లు పడడంతో బెంగాలు నుండి, ఉత్తరభారత దేశం నుండి వచ్చే ప్రతినిధులు హైదరాబాదు ద్వారా కాకినాడకు రావలసి వచ్చింది షౌకత్ అలీ, మహమ్మదాలీ, సి ఆర్ దాసు, వల్లభాయ్‌పటేల్, సరోజినీ నాయుడు వంటి ప్రముఖ జాతీయ నాయకులు నైజాం రాష్ట్ర రైల్వే మార్గంలోని అనేక స్టేషన్లలో తమను చూసేందుకు ఎక్కువ సంఖ్యలో గుమికూడిన ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగాలు చేశారు హైదరాబాదు నుండి సుమారు 25 మంది ప్రతినిధులు 500 మంది ప్రేక్షకులు కాకినాడ సమావేశానికి హాజరైనారు వీరిలో మాడపాటి హనుమంతరావు, రాఘవేంద్రరావు శర్మ, వామన నాయక్ వంటి ప్రముఖ నాయకులున్నారు ఈ నాయకులు ఈ సమావేశాన్ని అవకాశంగా తీసుకుని హైదరాబాదు నుండి వచ్చిన ప్రతినిధుల, ప్రేక్షకుల సమావేశాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు ఈ సమావేశానికే 'హైదరాబాదు రాజకీయ సమావేశం' అన్న పేరు స్థిర పడింది ఈ హైదరాబాదు రాజకీయ సమావేశానికి బేరారులోని ఏవత్మాల్‌కు చెందిన మాధవరావు అనెయ్ అధ్యక్షత వహించినాడు హైదరాబాదుకు చెందిన సరోజినీ నాయుడు జాతీయ కాంగ్రెసు సబ్జక్టు కమిటీ సమావేశంలో తలమునకలై ఉన్నందువల్ల పై సమావేశానికి మాధవరావు అధ్యక్షత వహించాల్సి వచ్చింది ఈ సమావేశాన్నే హైదరాబాదు రాష్ట్ర వెలుపలి సమావేశంగా పిలిచేవారు అయితే 'గస్తీ నెం 53' అని పిలువబడే ఒక నిషేధాజ్ఞ ప్రకారం హైదరాబాదు రాష్ట్రంలో రాజకీయ సమావేశాల్ని జరపడాన్ని నైజాం ప్రభుత్వం నిషేధించింది

రెండవ హైదరాబాదు సమావేశం బొంబాయిలో 1926 నవంబరు చివరి వారంలో జరిగింది ఈ సమావేశానికి బేరారుకు చెందిన వై ఎం కాలే అను ప్రసిద్ధ పండితుడు అధ్యక్షత వహించాడు ఆయన నైజాం ఇస్లాం మత, సంస్కృతులకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి, హిందూ సంస్కృతిని కాలరాయడాన్ని తీవ్రంగా విమర్శించాడు

మూడవ హైదరాబాదు రాజకీయ సమావేశం పూనాలో ఎన్ సి కాల్కర్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో కాల్కర్ ప్రసంగిస్తూ రాష్ట్రం వెలుపల ఉండి ఉద్యమాన్ని సాగించడం మంచి పద్ధతి కాదని హైదరాబాదులోనే సమావేశాలు నిర్వహించుకోవాలని హైదరాబాదు ప్రజలకు ఆయన సలహా ఇచ్చాడు చివరిదైన నాల్గవ సమావేశం 1931లో అకోలాలో జరిగింది

## మహాత్మగాంధీ హైదరాబాదు పర్యటన (మార్చి, 1934)

1931 నుండి 1937 వరకు హైదరాబాదులో ఎటువంటి రాజకీయ సందడి కనిపించలేదు ఈకాలంలో జరిగిన ఒకే ఒక ముఖ్యమైన సంఘటన మహాత్మాగాంధీ హైదరాబాదు పర్యటన మహాత్మాగాంధీ హరిజనోద్ధరణలో భాగంగా 1934 మార్చి 9న హైదరాబాదును సందర్శించాడు కాచిగూడలోని ఎగువ బస్తీ అనే ప్రాంతానికి హరిజన బస్తీ అని పేరు పెట్టడం జరిగింది ఈ పర్యటన వల్ల ఎటువంటి రాజకీయ ప్రయోజనం చేకూరలేదు

## ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'వందేమాతరం' ఆందోళన

1932 నుండి నిశ్శబ్దంగా ఉన్న హైదరాబాదు రాజకీయ రంగంలో 1938లో అకస్మాత్తుగా గొప్ప అలజడి చెలరేగింది ఇంతవరకు ప్రజల మనస్సులో అణగారిఉన్న జాతీయ, సాంస్కృతిక భావాలు ఆర్య సమాజం, హిందూ మహాసభ, ప్రజా మండలి, కొత్తగా ఏర్పాటయిన హైదరాబాదు రాష్ట్ర కాంగ్రేసు వంటి అనేక సంస్థలు చేపట్టిన ఉద్యమాల ద్వారా ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. 1938 సంవత్సరంలో జరిగిన ఉద్యమాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని హిందూ విద్యార్థులు చేపట్టిన వందేమాతం ఉద్యమం చెప్పుకోదగ్గది

హిందూ సంస్కృతిని నామరూపాలు లేకుండా చేయాలన్న తలంపుతో ప్రారంభించబడిన ఉస్మానియా విశ్వవిద్యాలయం సహజంగానే ముస్లిం మతోన్మాదుల స్థావరంగా మారిపోయింది హిందు విద్యార్థులు అనేక కష్టాల్ని, ఆంక్షల్ని ఎదుర్కోవలసి వచ్చింది వారి మతాన్ని, సంస్కృతిని బహిరంగంగా ఎగతాళి చేసే పరిస్థితి ఏర్పడింది 1937 లో విశ్వవిద్యాలయ హాస్టల్లో జరిగిన మిలాద్-ఉద్-నబీ ఉత్సవాల సందర్భంగా 'దినియాత్' శాఖ ఆచార్యుడైన మౌల్వి సజారుల్ హసన్ జిలాని ముస్లిం విద్యార్థులను ఉద్దేశించి ఇలా హితోపదేశం చేశాడు:

"ఇంకా ఈ దేశంలో గోమలాన్ని పూజించే 22 కోట్ల మంది (హిందువులు) మనుగడకు అవకాశం కల్పించిన ముస్లింల అలసత్వాన్ని చూస్తే నాకు బాధ కలుగుతుంది"

తాను చేసే ఈ వ్యాఖ్యానం వల్ల ఉత్సవానికి హాజరయిన హిందు విద్యార్థులకు బాధ కలుగుతుందనే విషయం ఆచార్య జిలానికి స్పష్టంగా తెలుసు అయినా కావాలనే ఆయన పై విధంగా మాట్లాడాడు ఇదే విధంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం ఏర్పాటు చేసిన ఉత్సవ సభలో ఎం ఎం జిన్నా ప్రసంగిస్తూ "నా ముస్లిం విద్యార్థుల్లారా" అని సంభోదించాడు అయితే 1938 సెప్టెంబరులో హాస్టల్లో నివసించే హిందూ విద్యార్థులు తమ ప్రార్థనా మందిరాల్లో 'వందేమాతరం' గీతాన్ని పాడకూడదని విశ్వవిద్యాలయ అధికారులు ఒక ఆజ్ఞను జారీ చేయడంతో పరిస్థితులు విషమించాయి.

వందేమాతరం ఉద్యమ పుట్టుపూర్వోత్తరాలు ఇలా ఉన్నాయి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మూడు హాస్టళ్ళు ఉన్నాయి ఒక్కొక్క హాస్టల్లోను రెండు ప్రార్థనా మందిరాలుండేవి ఒకటి ముస్లిం విద్యార్థుల కోసం కాగా, రెండవది హిందూ విద్యార్థుల కోసం హిందూ విద్యార్థులు వందేమాతరం గీతాన్ని పాడుతున్నారంటూ కొంతమంది ముస్లిం విద్యార్థులు బి-హాస్టలు వార్డెనుకు ఫిర్యాదు చేశారు. దీంతో హిందూ విద్యార్థుల ప్రార్థనా మందిరాన్ని మూసివేయాలని వార్డెను ఆదేశాలు జారీ చేశాడు ప్రార్థనా మందిరాన్ని కొంతకాలం పాటు మాత్రమే మూస్తారన్న ఉద్దేశంతో హిందూ విద్యార్థులు ఏ మాత్రం ఆక్షేపించలేదు ఇంతలో రంజాను శెలవులు రావడంతో విశ్వవిద్యాలయాన్ని మూసివేశారు.

దాదాపు ఒకనెల రోజుల శెలవు తర్వాత 1938 నవంబరు 28న విశ్వవిద్యాలయాన్ని తెరిచారు ఆ రోజు సాయంత్రమే విశ్వవిద్యాలయ ఆవరణలోని హాస్టళ్లలో నవంబరు 28 నుండి విద్యార్థులు వందేమాతరం గీతాన్ని పాడకూడదంటూ ఒక నోటీసును జారీ చేయడం జరిగింది

దీంతో హిందూ విద్యార్థులు 'వందేమాతరం' గీతాన్ని పాడడంపై నిషేధాన్ని ఎత్తివేయాలని విశ్వవిద్యాలయ ప్రో-వైస్-ఛాన్స్‌లర్‌ను అభ్యర్థించారు ఇదేగాక వందేమాతరం గీతం రాజకీయమైందిగాని, వివాస్పదమైందిగాని కాదని, ఈ గీతాన్ని పాడడం వల్ల ఏ విధంగాను మత సామరస్యం దెబ్బతినదని విద్యార్థులు విన్నవించారు

విద్యార్థుల విన్నపాన్ని తిరస్కరించడమే గాక ఆ విద్యార్థుల్ని సస్పెండు చేస్తూ 1938 నవంబరు 29న ఆదేశాలు జారీ చేశాడు ప్రొ-వైస్-ఛాన్సలర్ ఇంతే కాకుండా ఈ విద్యార్థులు వెంటనే హాస్టలు గదుల్ని ఖాళీ చేయాలని కూడ ఆదేశంలో పేర్కొన్నాడు హాస్టలు నుండి హిందూ విద్యార్థుల్ని బలవంతంగా ఆ రాత్రికి రాత్రే ఖాళీ చేయించేందుకు అధికారులుకొన్ని అమానుషపద్ధతుల్నికూడా అవలంబించారు ఈ విషయాన్ని తెలుసుకున్న నగర హిందూ విద్యార్థులు కోపోద్రిక్తులయ్యారు హాస్టలు విద్యార్థులపై సానుభూతిని ప్రకటిస్తూ వారు సమ్మెను ప్రారంభించారు ఒక రసాయన శాస్త్ర ఆచార్యుడు బస్సులు ఆగే చోట వాహనాల కడ్డంగా పడుకొని పికెటింగు చేస్తున్న విద్యార్థుల్ని దుర్భాషలాడాడు పడుకుని ఉన్న విద్యార్థుల మీదుగా కారును పోనివ్వమని తన డ్రైవరును ఆజ్ఞాపించాడు ఆ ఆచార్యుడు అయితే ఆచార్యునికంటె తెలివైన ఆ డ్రైవరు తన యజమాని మాటను పట్టించుకోలేదు విశ్వవిద్యాలయం విద్యార్థులయూనిఫామ్ అయిన నీలి షేర్వాని, పైజామాను ధరించడాన్ని కూడ హిందూ విద్యార్థులు వ్యతిరేకించారు తెల్లటి చొక్కా, పంచను ధరించగలమన్న వారి ఉద్దేశాన్ని ప్రొ-వైస్ ఛాన్సలర్‌కు తెలియజేశారు అయితే ప్రో-వైస్ ఛాన్సలర్ హిందూ విద్యార్థుల విన్నపాన్ని తిరస్కరిస్తూ పాలకుల సంస్కృతినే విద్యార్థులు పాటించాలని, ఇష్టం లేనివారు కళాశాలను వదలిపోవచ్చునని స్పష్టం చేశాడు అరబిక్, ఉర్దూ, పర్షియను భాషలకు ప్రత్యేక శాఖలు ఏర్పాటు చేసినట్లు తెలుగు,మరాఠీ ,కన్నడ, సంస్కృత భాషలకు కలిపి ఒక స్నాతకోత్తర శాఖను

ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు హిందూ విద్యార్థులు 'అబ్లా కియత్' పద్ధతిని వ్యతిరేకించారు ఈ పద్ధతిలో హిందూ విద్యార్థులు హిందువులు కాని వారి రచనలు చదవాలి ముస్లిం విద్యార్థులు మాత్రం ముస్లిం రచయితలు వ్రాసిన పుస్తకాలే చదవాలి

హిందూ విద్యార్థుల సమ్మె 1938 నవంబరు 29 నుండి డిశంబరు 10 వరకు కొనసాగింది రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని హైస్కూలు, కాలేజి విద్యార్థులు కూడ సమ్మెలో చేరారు డిశంబరు 12న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 350 మందిని, సిటీ కాలేజి నుండి 7 మందిని, మహబూబ్ నగర్ హైస్కూలు నుండి 120 మందని బహిష్కరించడం జరిగింది ఈ విద్యార్థుల్ని ఇతర విశ్వవిద్యాలయాల్లో చేర్చుకోకూడదని ఇంటర్ యూనివర్శిటి బోర్డును ఉస్మానియా విశ్వవిద్యాలయం అభ్యర్థించింది అయితే నాగపూర్ విశ్వవిద్యాలయం ముందుకు వచ్చి తన పరిధిలోని వివిధ విద్యాలయాల్లో ఈ విద్యార్థుల ప్రవేశానికి అనుమతించింది బహిష్కరణకు గురైన విద్యార్థుల్లో పి వి నరసింహారావు, హయగ్రీవాచారి, అరుట్ల రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, నూకల రామచంద్రారెడ్డి వంటి వారున్నారు వీరు తర్వాతి కాలంలో రాష్ట్ర రాజకీయాల్లోనే కాక దేశ రాజకీయాల్లో కూడ ప్రముఖ పాత్ర వహించారు హైదరాబాదులో జరిగిన వందేమాతరం ఉద్యమం దేశవ్యాప్తంగా అనేకుల దృష్టిని ఆకర్షించింది జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వి డి సవార్కార్ వంటి నాయకులు ఉద్యమాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థులకు ఉత్తరాలు వ్రాశారు. ప్రార్థనా మందిరాల్లో వందేమాతరం గీతాన్ని పాడుకునేందుకు విద్యార్థులకు సర్వ హక్కులూ ఉన్నాయని మహాత్మాగాంధీ విద్యార్థులకు ఒక సందేశాన్ని పంపారు

## హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు స్థాపన

ఈ శతాబ్దంలోని నాలుగవ దశకానికల్లా హైదరాబాదు రాష్ట్ర ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులయ్యారు. రాష్ట్రంలోని ఒక్కొక్క భాషా ప్రాంతం ఒక్కొక్క ప్రాంతీయ సంఘాన్ని ఏర్పాటు చేసుకుంది ఈ విధంగా ఏర్పడ్డవే ఆంధ్ర మహాసభ, మహారాష్ట్ర పరిషత్తు, మైసూరు పరిషత్తులు వీటితోపాటు ఇత్తేహాదుల్ ముస్లిమీన్, ఆర్య సమాజం వంటి మత సంస్థలు కూడ వెలిశాయి రాష్ట్రమంతటికీ ప్రాతినిధ్యం వహించే ఒక మత ప్రసక్తి లేని లౌకిక రాజకీయ సంస్థను

ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది  అందువల్ల 1938 లో హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసును ఏర్పాటు చేయడం జరిగింది

హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు స్థాపనకు శ్రీకారం చుట్టింది మహారాష్ట్ర పరిషత్తు సభ్యుడైన స్వామి రామానంద తీర్థ  1938 జనవరిలో లాటూరులో జరిగిన పరిషత్తు సమావేశం తర్వాత రాష్ట్ర కాంగ్రెసు ఏర్పాటు విషయమై స్థానిక నాయకులతో చర్చించేందుకు రామానంద తీర్థ హైదరాబాదు వచ్చాడు  1938 జనవరి నుండి జరిగిన అనేక పరిణామాలు రామానంద నిర్ణయాన్ని అమలులో పెట్టేందుకు త్వరితం చేశాయి  1938 జనవరిలో మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన హైదరాబాదు ప్రజల సమావేశం ఒకటి జరిగింది  ఈ సమావేశం అరవమూడు అయ్యంగారు కమిటి చేసిన సిఫార్సులపై తన అసంతృప్తిని ప్రకటించింది  హైదరాబాదు రాష్ట్రంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కూడా ఈ సమావేశం నైజాంను కోరింది  ఇక్కడ మనం ఒక విషయాన్ని చెప్పుకోవాలి  రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ అసంతృప్తిని తట్టుకునేందుకు వీలుగా తగిన రాజకీయ సంస్కరణల్ని సూచించేందుకు 1932లో స్థానిక న్యాయవాదియైన అరవమూడు అయ్యంగారు అధ్యక్షతన ఒక కమిటీని నియమించాడు నైజాం  ఈ కమిటి ప్రజలు ఆశించిన రీతిలో సంస్కరణల్ని సూచించలేకపోయింది. నిజానికి ఈ కమిటీ సభ్యుడైన కాశీనాథరావు వైద్య కమిటి నివేదికతో ఏకీభవించక తన అసమ్మతిని రాతమూలకంగా తెలిపాడు

రామానందతీర్థ 1938 జూన్ 9న హైదరాబాదు చేరుకుని స్థానిక నాయకుల్ని కలుసుకున్నాడు  మతోన్మాదాన్ని అరికట్టి జాతీయ భావాల్ని పెంపొందింపచేయాలన్న ప్రజల దృఢసంకల్పాన్ని రామానంద గ్రహించగల్గాడు జూలై నెలలో ఒక తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేసి అందులో 1200 మంది సభ్యుల్ని చేర్పించడం జరిగింది  కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకునేందుకు కమిటి నియమావళిని ఆమోదించేందుకు 1938 సెప్టెంబరు 9న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది  హైదరాబాదు ప్రధానమంత్రి అక్బరు హైదరీ రాష్ట్ర కాంగ్రెసును మతోన్మాద విప్లవ సంస్థగ భావించాడు  అందువల్ల ప్రభుత్వం సెప్టెంబరు 8న రాష్ట్ర కాంగ్రెసు ఏర్పాటును నిషేధిస్తూ ఒక ప్రకటనను జారీ చేసింది

## ఐక్యతాచర్చలు

కాంగ్రెసుపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసేందుకు రాష్ట్ర కాంగ్రెసు నాయకులు ప్రభుత్వంలో పలుకుబడి గల్గిన ముస్లిమీన్ పార్టీ నాయకుడైన బహదూర్ యార్ జంగ్‌తో చర్చలు ప్రారంభించారు. కాంగ్రెసు నాయకులకు, ఇత్తేహదుల్ ముస్లిమీన్ నాయకులకు మధ్య జరిగిన చర్చలనే 'ఐక్యతా చర్చలు' (unity Talks) అని అందరూ వ్యవహరిస్తారు.

ఐక్యతా చర్చలు తప్పక విజయవంతమౌతాయన్న వాగ్దానాన్ని ఇవ్వమని నవాబ్ అలీ యవార్ జంగ్ కాంగ్రెసు నాయకుల్ని కోరాడు. దీన్నే ఇంకోరకంగా చెప్పాలంటే రాష్ట్ర కాంగ్రెసుపై విధించిన నిషేధాన్ని రద్దు పరచడం జరగదని పై కోరిక ద్వారా ప్రభుత్వం స్పష్టం చేసిందని చెప్పవచ్చు.

## రాష్ట్ర కాంగ్రెసు సత్యాగ్రహము

ప్రభుత్వం విసిరిన కొత్తసవాలును ఎదుర్కొనేందుకు కాంగ్రెసు నాయకులు 1938 అక్టోబరు 24న హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు కమిటి ఏర్పాటును ప్రకటించారు. గోవిందరావు నానల్‌ను అధ్యక్షుడుగను, రామకృష్ణ దోత్‌ను కార్యదర్శిగను నియమించారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్ర కాంగ్రెసును చట్టవిరుద్ధ సంస్థగ ప్రకటించింది.

నిషేధాన్ని రద్దు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సుల్తాను బజారు, కాచిగూడ రైల్వే స్టేషను, అబిడ్సు పోలీసు స్టేషను పతేర్ ఘట్టి మొదలయిన ప్రాంతాల్లో అక్టోబరు 27న కాంగ్రెసు నాయకులు సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. దాదాపు 400 మంది 18 బృందాలుగ ఏర్పడి సత్యాగ్రహాన్ని నిర్వహించారు. సత్యాగ్రహంలో పాల్గొన్న వారిలో రావి నారాయణ రెడ్డి, కాళోజీ నారాయణరావు, ఎల్లాప్రగడ సీతాకుమారి వంటి ప్రముఖులు కూడ ఉన్నారు. మహాత్మాగాంధీ సలహాను పాటించి డిశంబరు 24న సత్యాగ్రహాన్ని విరమించారు.

1939-1940 మధ్యకాలంలో కాంగ్రెసుపై విధించిన నిషేధాన్ని రద్దు చేయించేందుకు చాల ప్రయత్నాలు జరిగాయి. రాష్ట్ర కాంగ్రెసు పేరును "హైదరాబాదు జాతీయ సభ"గ మార్చుకోవడానికి కూడ కాంగ్రెసు నాయకులు

సిద్ధపడ్డారు రాష్ట్రంలోని వివిధ మతాలకు చెందినవారు ఈ సంస్థకు తమ మద్దతు తెలుపకపోవడం వల్ల 'జాతీయ' అనే పదం తప్పుదారి పట్టించే విధంగా ఉందని ప్రభుత్వం మరో కొత్త ఆక్షేపణను లేవనెత్తింది

దీంతో రామానందతీర్థ మరోసారి సత్యాగ్రహాన్ని చేపట్టాలని నిర్ణయించాడు దీంతో ప్రభుత్వం తలవొగ్గి రాష్ట్ర కాంగ్రెసు కొత్త పేరు మీదుగ నిషేధాన్ని రద్దు చేసేందుకు సిద్ధమైన తరుణంలో ఇత్తేహాదుల్ ముస్లిమీన్ పార్టీ కాంగ్రెసు నాయకులకు వ్యతిరేకంగా ప్రత్యక్ష చర్యకు పూనుకుంటామని బెదిరిస్తూ 1940 డిశంబరు 1న ఒక తీర్మానాన్ని ఆమోదించింది ఇంతలో 'క్విట్ ఇండియా' ఉద్యమం తర్వాత తలెత్తిన జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు రాష్ట్ర కాంగ్రెసుపై విధించిన నిషేధాన్ని రద్దు చేయాలన్న కోర్కెను తెరమరుగున పడేశాయి

## హైదరాబాదులో 'క్విట్ ఇండియా' ఉద్యమం

1942 ఆగస్టులో ప్రారంభమైన 'క్విట్ ఇండియా' ఉద్యమం హైదరాబాదు రాష్ట్రంపై కూడ తన ప్రభావాన్ని చూపగల్గింది స్వామి రామానందతీర్థ, బి రామకృష్ణారావు , పద్మజా నాయుడు, కాళోజీ నారాయణరావు వంటి నాయకుల్ని ప్రభుత్వం అరెస్టు చేసింది

## రాష్ట్ర కాంగ్రెసుపై నిషేధం రద్దు (1946 జూలై)

బ్రిటీషు కాబినెట్ మిషను పర్యటన తర్వాత దేశంలో సంభవించిన రాజకీయ పరిస్థితుల మార్పు వల్ల 1946 జూలైలో హైదరాబాదు ప్రభుత్వం రాష్ట్ర కాంగ్రెసు పైగల నిషేధాన్ని రద్దు చేసింది. రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ సంఘాలైన ఆంధ్రమహాసభ (జాతీయ వాదులు), మహారాష్ట్ర పరిషత్తు, మైసూరు పరిషత్తులు రాష్ట్ర కాంగ్రెసులో విలీనం కావాలని నిర్ణయించాయి స్వామి రామానంద తీర్థ రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడుగ ఎన్నికయ్యాడు

## 13

# హైదరాబాదుపై పోలీసు చర్య

# సెప్టెంబరు, 1948

1945 ఆగస్టులో జరిగిన బ్రిటీషు సాధారణ ఎన్నికల్లో అట్లీ నాయకత్వాన గల లేబరు పార్టీ అధికారంలోకి వచ్చింది మరింత ఆలస్యం చేయకుండా భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాల్సిన అవసరాన్ని అట్లీ గుర్తించాడు అందువల్ల 1946 మార్చిలో అట్లీ కాబినెట్ మిషన్ను భారతదేశానికి పంపాడు పెతిక్ లారెన్సు (ఇంగ్లాండులో భారత దేశవ్యవహారాల కార్యదర్శి), స్టాఫర్డ్ క్రిప్సు (ట్రేడ్ బోర్డు అధ్యక్షుడు), ఎ వి.అలెగ్జాండరు (ప్రధాన నావికాధికారి) కాబినెట్ మిషనులోని సభ్యులు ఈ కాబినెట్ మిషను కాంగ్రెసు నాయకులతోను, ముస్లిం లీగు నాయకులతోను అనేకసార్లు సమావేశమైంది ఈ మధ్యలో హైదరాబాదు, మైసూరు, త్రివాన్కూరు, జయపూర్, మొదలైన ముఖ్య సంస్థానాదీశులతో గూడ చర్చలు జరిపింది ఛత్తారి నవాబు (కార్య నిర్వాహక సమితి అధ్యక్షుడు), నవాబ్ ఆలీయావర్ జంగ్ (రాజ్యాంగ విషయాల సంఘం సభ్యుడు) వాల్టేర్ మాంక్టన్ (హైదరాబాదు ప్రభుత్వ రాజ్యాంగ విషయాల సలహాదారుడు) హైదరాబాదు ప్రతినిధి వర్గంలోని సభ్యులు.

### హైదరాబాదును మూడవ అదీన రాజ్యంగా చేయాలన్న పగటి కలలు

హైదరాబాదు ప్రభుత్వ రాజ్యాంగ విషయాల సలహా దారుడైన వాల్టేరు కాబినెట్ మిషను సభ్యుల్ని విడివిడిగా కలుసుకోవడమే గాక వైస్రాయిని, సైన్యాదిపతిని, జిన్నాను, ఇంకా ఇతర నాయకుల్నికూడ కలిశాడు. భవిష్యత్తులో

ఏర్పడబోయే స్వతంత్ర భారతదేశంలో హైదరాబాదు రాష్ట్ర స్థానాన్ని గూర్చి ఆయన కాబినెట్ మిషను సభ్యులతో చర్చించాడు భారత దేశం నుండి బ్రిటీషు వైదొలగితే దేశం ముక్క చెక్కలవుతుందని, అందువల్ల హైదరాబాదు రాష్ట్రాన్ని స్వతంత్రదేశంగా ప్రకటించడానికి ఇదే అనుకూల సమయమని హైదరాబాదు ప్రతినిధి వర్గం భావించింది భారతదేశాన్ని ఇండియా, పాకిస్తాన్ అని రెండు స్వతంత్ర రాజ్యాలుగా విభజిస్తున్నామని, వీటికి 1947 ఆగస్టు 15న అధికారం అప్పగించడం జరుగుతుందని 1947 జూన్ 3న మౌంట్ బాటన్ ప్రకటించాడు మౌంట్‌బాటన్ ప్రకటన వెలువడిన ఎనిమిది రోజులకే (1947 జూన్ 11న) నైజాం ఒక పర్మానాను జారి చేస్తూ 1947 ఆగస్టు 15న హైదరాబాదు రాష్ట్రాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించే హక్కు తనకున్నదని, అందువల్ల తాను భారత రాజ్యాంగ పరిషత్తుకు ప్రతినిధుల్ని పంపడం లేదని ప్రకటించాడు అయినప్పటికీ 1947 జూలై 9న బ్రిటీషు పార్లమెంటులో భారత స్వాతంత్ర్యపు బిల్లుల్ని ప్రవేశపెట్టడంతో నైజాం ఖంగుతిన్నాడు హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో గాని, లేక పాకిస్తాన్‌లో గాని ఒక భాగమని ఈ బిల్లు అభిప్రాయపడింది దీంతో ఒక నమ్మకమైన స్నేహితుడ్ని బ్రిటీషు పోగొట్టుకుందని నైజాం భావించాడు హైదరాబాదును మూడవ అధీన రాజ్యంగా చేయాలని నైజాం పట్టుపట్టాడు

## 'జాయిన్ ఇండియా' ఉద్యమం (1947–48)

హైదరాబాదు రాష్ట్రాన్ని భారతదేశం నుండి వేరుచేసి మూడవ రాజ్యంగా ఉంచేందుకు నైజాం చెస్తున్న కుతంత్రాలు రాష్ట్రంలో అధిక సంఖ్యాకులైన హిందువుల్ని కలవరపరచింది హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం కావాలని వారు భావించారు 1946 జూలైలో హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసుపై నిషేధాన్ని రద్దు చేసిన తర్వాత, నైజాం భారతదేశంలో చేరాలని వత్తిడి చేసేందుకు ప్రజాభిప్రాయాన్ని సేకరించే ప్రయత్నాల్ని కాంగ్రెసు ప్రారంభించింది 1947 మే నెలలో రాష్ట్ర కాంగ్రెసు బహిరంగ సమావేశాన్ని హైదరాబాదులో ఏర్పాటు చేశారు ఈ సమావేశంలోనే 'జాయిన్ ఇండియా' (భారతదేశంలో విలీనమవ్వాలి) ఉద్యమాన్ని ప్రారంభించాలని తీర్మానించడం జరిగింది రంగా వంటి ఆంధ్ర కాంగ్రెసు నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమయంలోనే జయప్రకాష్‌నారాయణ్ హైదరాబాదును సందర్శించి 'జాయిన్ ఇండియా' ఉద్యమానికి నైతిక మద్దతు తెలియజేశాడు

ఈ 'జాయిన్ ఇండియా' ఉద్యమం బహిరంగంగానే కాక రహస్యంగా కూడ కొనసాగింది కాంగ్రెసు పార్టీలోని మితవాద వర్గానికి చెందిన స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణ రావు వంటి సీనియరు నాయకులు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారు 1947 ఆగస్టు 7న 'జాయిన్ ఇండియా' దినాన్ని పాటించారు స్వాతంత్ర్యదినం దగ్గరపడేకొద్దీ నగరంలో ఉద్రిక్తత ఎక్కువ కాసాగింది జాతీయ జెండాను ఎగురవేసి భారత స్వాతంత్ర దినాన్ని పాటించాలని కాంగ్రెసు పార్టీ, నగరంలోని హిందువులు నిర్ణయించారు ఈ నిర్ణయాన్ని నైజాం, రజాకార్లు (ఇత్తేహాదుల్ ముస్లిమీన్ పార్టీ స్వచ్ఛంధసైనిక దళం) వ్యతిరేకించారు

1947 ఆగస్టు 13న తన స్వాతంత్రాన్ని ప్రకటిస్తూ నైజాం ఒక 'పర్మానా'ను జారీ చేశాడు భారత జాతీయ జెండాను ఎగురవేయడాన్ని హైదరాబాదు ప్రభుత్వం నిషేధించింది అయితే ప్రజలు ఈ నిషేధాన్ని ఉల్లంఘించి 1947 ఆగస్టు 15న ఒకరిపై ఒకరు పోటీపడి జాతీయ జెండాను ఎగురవేశారు పండిత నెహ్రూ స్వయంగా తనకిచ్చిన జాతీయ జెండాను స్వామి రామానాంద తీర్థ సుల్తాను బజారు కూడలి వద్ద ఆవిష్కరించాడు

## అజ్ఞాత ఉద్యమం

కాంగ్రెసు పార్టీలోని సీనియరు నాయకులంతా 'జాయిన్ ఇండియా' ఉద్యమాన్ని గాంధీజీ సత్యాగ్రహ సిద్ధాంతాన్ని అనుసరించి నడపగా యువకులైన సభ్యులు మాత్రం 1942లో సాగిన 'క్విట్ ఇండియా' ఉద్యమ పద్ధతిలో నడపాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని మూడు భాషా ప్రాంతాలకు మూడు ప్రాంతీయ కార్యాలయాల్ని ఏర్పాటు చేసుకున్నారు తెలంగాణా ప్రాంతీయ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేశారు ఈ మూడు ప్రాంతీయ కార్యలయాల కార్యకలాపాల్ని సమన్వయం చేసేందుకు బొంబాయిలో ఒక కేంద్ర కార్యాలయాన్ని స్థాపించారు వి బి రాజు, బొమ్మకంటి సత్యనారాయణ, టి హయగ్రీవాచారులకు విజయవాడలోని తెలంగాణా ప్రాంతీయ కార్యాలయాన్ని నడిపే బాధ్యతల్ని అప్పగించారు. ఈ ప్రాంతీయ కార్యాలయం చేపట్టిన కార్యక్రమాలకు ఆంధ్ర కాంగ్రెసు కమిటి తన సహాయ సహకారాల్ని అందిచడమే

కాక 'హైదరాబాదుడే'ను కూడ పాటించింది ఉద్యమాన్ని నిర్వహించి ఉద్యమ ఆశయాల్ని ప్రచారం చేసేందుకు పరిటాల, ఆదిలాబాదు, నెల్లమర్రి, కొక్కిరేని మొదలగు ప్రాంతాల్లో సరిహద్దు శిబిరాల్ని ఏర్పాటు చేశారు

'జాయిన్ ఇండియా' ఉద్యమం అనతికాలంలోనే నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగే ప్రజా ఉద్యమంగ పరిణమించింది ప్రజల నుండి ఎదురైన ఛ సవాలును ఎదుర్కొనేందుకు నైజాం హిందువుల్లో భయభ్రాంతుల్ని సృష్టించమని రజాకార్లను ప్రోత్సహించాడు ఇదే గాక రాష్ట్రంలోని హిందువుల్ని బలవంతంగా ఇస్లాంలో చేర్పించి, రాష్ట్రం వెలుపల ఉన్న ముస్లింలను రాష్ట్రంలో స్థిరపడేందుకు ఆహ్వానించమని కూడ ప్రోత్సహించాడు

## ఖాసిం రజ్వీ

ఇత్తేహాదుల్ ముస్లిమీన్ పార్టీని నవాబ్ సాదర్ ఆలీ జంగ్ అధ్యక్షతన 1927 లోనే స్థాపించినప్పటికీ 1946 లో ఖాసిం రజ్వీ అధ్యక్షుడైన తర్వాతనే ఈ సంస్థ తన వికృతరూపంతో ప్రసిద్ధి చెందింది రజ్వీ ఒక మతోన్మాది 'అసఫియా' జెండాను ఎర్రకోటపై ఎగురవేసి బంగాళాఖాతం జలాల్ని నైజాం పాద ప్రక్షాళనతో పునీతం చేసేందుకే తాను పుట్టానని రజ్వీ నమ్మేవాడు కొన్ని నెలల్లోనే తన మాటకారితనంతో రాష్ట్రంలోని ముస్లింలను మతోన్మాదుల్ని చేయడంలో సఫలీకృతుడయ్యాడు వేలకొలది ముస్లింలు రజాకార్లుగా చేరి దక్కను ముస్లిం ఆధిపత్యాన్ని నిలుపగలమని ప్రతిజ్ఞా చేశారు

రజాకార్లకు సైనిక శిక్షణ ఇచ్చారు వీరు ధరించే ఖాకీ దుస్తులు సైనికుల యూనిఫారంను పోలి ఉండేవి వీరు ప్రేలుడు ఆయుధాల్ని ధరించి వీధుల్లో తిరుగుతూ ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించేవారు రజాకార్లు తన రాజకీయ ఆశయాల్ని నెరవేర్చగలరని భావించిన నైజాం వీరి దుర్మార్గాల్ని ప్రోత్సహించే వాడు. కమ్యూనిస్టులను ఏరివేసే మిషతో రజాకార్లు గ్రామాలపై బడి దోచుకునేవారు పోలీసు కమీషనరులైన నావాబ్ దీన్ యార్ జంగ్ వంటి ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడ రజ్వీకి, రజాకార్లకు తమ మద్దతు తెలిపారు

'జాయిన్ ఇండియా' ఉద్యమాన్ని రజ్వీ వ్యతిరేకించాడు స్వాతంత్ర్యం ప్రకటించడం హైదరాబాదు రాష్ట్ర సహజమైన హక్కని, రాజ్యాధికారం ముస్లింల చేతుల్లోనే ఉంటుందని 1947 జూన్ 19న ఒక బహిరంగ సభలో ఇచ్చిన

ఉపన్యాసంలో రజ్వీ స్పష్టం చేశాడు ఇంతేగాక భారతదేశంలో విలీనమయ్యేందుకు సిద్ధపడితే నైజాం ప్రభుత్వంపై ప్రత్యక్ష చర్యకు పూనుకుంటామని కూడ రజ్వీ బెదిరించాడు 1947 ఆగస్టు 15న నైజాం భారతదేశంలో విలీనం కాలేదు దీనికి వ్యతిరేకంగా తాను 1947 ఆగస్టు 15న ఒక స్వతంత్ర ప్రభువు హోదాను వహించానని వివరిస్తూ 1947 ఆగస్టు 27న ఒక ఫర్మానాను జారీ చేశాడు ఇదే సమయంలో మౌంట్ బాటన్‌తో చర్చించేందుకు వాల్టేరు మాంక్టన్, చత్తరి నవాబు, సుల్తాను అహ్మదులతో కూడిన ఒక ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి పంపాడు ఇతర సంస్థానాధీశుల వలె తాను విలీనపు పత్రంపై సంతకం చేయబోనని నైజాం స్పష్టం చేశాడు సెప్టెంబరు చివరి వరకు చర్చలు కొనసాగాయి నైజాం సంతకానికి ఉద్దేశించిన యధాస్థితి ఒడంబడిక (Standstill Agreement) ముసాయిదా ప్రతిని తీసుకుని హైదరాబాదు ప్రతినిధి వర్గం ఢిల్లీ నుండి తిరిగి వచ్చింది తన కార్యనిర్వాహక సమితితో సుదీర్ఘంగా చర్చలు జరిపిన తర్వాత అక్టోబరు 27న యధాస్థితి ఒడంబడికై సంతకం చేసేందుకు నైజాం ఒప్పుకున్నాడు ఈ వార్త వినడంతో రజాకార్లు కోపోద్రిక్తులయ్యారు అక్టోబరు 27 ఉదయం 3 గంటలకల్లా దాదాపు 25000 మంది రజాకార్లు ఛత్తరి నవాబు తదితర ప్రతినిధి వర్గ సభ్యుల ఇండ్లను చుట్టుముట్టారు నైజాం సంతకంతో కూడిన ఒడంబడికను తీసుకుని తాము ఢిల్లీకి పోవడం లేదని ప్రకటించాలని ప్రతినిధి వర్గ సభ్యుల్ని రజాకార్లు బలవంతం చేశారు తర్వాత నైజాంను కలుసుకున్న రజ్వీ ప్రతినిధి వర్గాన్నే రద్దు చేయించాడు

## యధాస్థితి ఒడంబడిక (29 నవబంరు 1947)

మరల చర్చలు ప్రారంభించేందుకు రజ్వీ ఆమోదించిన ఒక కొత్త ప్రతినిధి వర్గాన్ని ఢిల్లీకి పంపాడు నైజాం మొయిన్ నవాబ్ జంగ్, ఇత్తేహాదు నాయకులైన అబ్దుల్ రహీం, నైజాం ఆస్థాన సభ్యుడైన పింగళి రామారెడ్డి అను ముగ్గురు ఈ కొత్త ప్రతినిధి వర్గంలోని సభ్యులు ఢిల్లీ చర్చలు విఫలమయ్యే పక్షంలో తాను పాకిస్తాన్‌లో విలీనమౌతానని అక్టోబరు 3న నైజాం బెదిరించాడు

చివరకు 1947 నవంబరు 29న భారతప్రభుత్వంతో కుదుర్చుకున్న యధాస్థితి ఒడంబడికపై నైజాం సంతకం చేశాడు. ఈ ఒప్పందం ప్రకారం దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు మాత్రం భారత ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి.

ఒప్పందం కుదిరిన తర్వాత రజ్వీ,మీర్ లాయిక్ ఆలీని ప్రధానమంత్రిగ చేయాలని నైజాంను బలవంతపెట్టాడు లాయిక్ ఆలీ రజ్వీకి సన్నిహితుడేగాక జిన్నాకు కూడ మంచి నమ్మకస్తుడు పింగళి వెంకటరామారెడ్డి ఉపప్రధాన మంత్రిగ నియమింపబడ్డాడు దీంతో రజ్వీపై ముస్లింలకు విపరీతమైన గౌరవభావం కల్గింది వీరు రజ్వీని పవిత్ర మత యుద్ధ యోధుడుగా భావించారు హైదరాబాదులో జరిగిన ఒక బహిరంగ సమావేశంలో తనను అభిమానించే ఒక ముస్లిం బృందం రజ్వీకి ఒక ఖురాను ప్రతిని, కత్తిని బహుకరించారు

## యథాస్థితి ఒడంబడిక ఉల్లంఘన

ఎటువంటి అడ్డు అదుపు లేకుండా యథాస్థితి ఒడంబడికను ఉల్లంఘించడం ప్రారంభించాడు నైజాం తన రాష్ట్రంలో భారతదేశ ద్రవ్యము చలామణి కాదని ప్రకటించాడు బంగారం ఎగుమతిపై నిషేధాన్ని విధించాడు లండనులోను, కరాచీలోను వర్తక ఏజెంట్లను నియమించాడు పాకిస్తాన్ ఆర్థికమంత్రి గులాం మహమ్మద్ హైదరాబాదును సందర్శించి మూడు శాతం నామమాత్రపు వడ్డీతో 200 మిలియన్ల రూపాయల ఋణాన్ని పొందగల్గాడు

## సిడ్నీ కాటన్ ఆయుధాల సరఫరా

సైనిక సామగ్రిని సమకూర్చుకునేందుకు కావలసిన వ్యవధి కోసమే నైజాం యథాస్థితి ఒడంబడికకు ఆమోదం తెలిపినట్లు స్పష్టమౌతుంది హైదరాబాదు రాష్ట్ర సర్వ సైన్యాధిపతియైన ఎల్ ఎద్రూస్ సైనిక విమానాల్ని కొనుగోలు చేసేందుకు జకోస్లొవేకియా, ఫ్రాన్స్ దేశాల్ని సందర్శించాడు పోర్చుగల్ నుండి గోవాను కొనేందుకు ప్రయత్నాలు జరిగాయి

ఆస్ట్రేలియాకు చెందిన సిడ్నీ కాటన్ ప్రపంచంలోని వివిధ దేశాల్నుండి ఆయుధాల్ని, ఆయుధ సామగ్రిని కొనుగోలు చేసి హైదరాబాదు రాష్ట్రానికి అక్రమంగా చేరవేసేవాడు కరాచి నుండి హైదరాబాదుకు తుపాకులు సరఫరా కావడం సర్వ సాధారణమై పోయింది. అయితే వందేమాతరం రామచంద్రరావు వ్యక్తిగతమైన ప్రమాదాన్ని కూడ లెక్కచేయకుండా సిడ్నీ కాటన్ నడిపే అక్రమ ఆయుధ వ్యాపారాన్ని గురించి తెలుసుకుని భారత ప్రభుత్వానికి తెలియజేశాడు

## ఏజెంటు-జనరలుగ కె.ఎం.మున్షీ నియామకం

యథాస్థితి ఒప్పందం నిబంధనల ప్రకారం భారత ప్రభుత్వం కె ఎం మున్షిని హైదరాబాదులో ఏజెంటు-జనరలుగ నియమించింది ఏజెంటు-జనరలు బ్రిటీషు ప్రతినిధి (British Resident) తో సమానమైన హోదా కాదని స్పష్టం చేసేందుకు సికిందరాబాదు సమీపంలోని బోలారం వద్ద గల రెసిడెన్సీ భవనంలో కె ఎం మున్షీ చేరేందుకు నైజాం ప్రభుత్వం అనుమతించలేదు 1948 జనవరి 3న హైదరాబాదు చేరుకున్న మున్షీ బొలారం లోని భారత ప్రభుత్వానికి చెందిన 'దక్కన్ హౌస్'ను తన నివాస గృహంగా చేసుకున్నాడు

## రైళ్ళపై దాడి

యథాస్థితి ఒడంబడిక తర్వాత రజాకార్లు తమ దుర్మార్గాల్ని ఎక్కువ చేయడమే కాక హైదరాబాదు రాష్ట్రం గుండా పోయే రైళ్లపై కూడా దాడి చేశారు మే నెల 23న మద్రాసు నుండి బొంబాయి వెళ్ళే 10-అప్ మెయిలు రైలుపై దాడి చేసి ఇద్దరు ప్రయాణికుల్ని చంపేశారు రజాకార్ల ఆగడాలు మితిమీరి పోవడంతో కృష్ణాజిల్లాలోని హైదరాబాదు రాష్ట్ర సంస్థానమైన పరిటాల ప్రజలు తామే స్వతంత్రించి హైదరాబాదు ప్రభుత్వానికి పన్నులు కట్టడానికి తిరస్కరించారు.

## రజ్వీ ఉపన్యాసాలు (31 మార్చి, 8 ఏప్రిలు 1948)

1948 మార్చి 31న రజ్వీ ఇత్తేహాదు ముస్లిమీన్ ప్రధాన కేంద్రం అయిన దార్-ఉ-సలాం వద్ద ఉపన్యసిస్తూ హైదరాబాదు రాష్ట్రం ఇస్లామిక్ రాజ్యమని, ఈ రాష్ట్ర సైన్యం ఢిల్లీని ఆక్రమించి ముస్లింల పరిపాలనను తిరిగి నెలకొల్పుతుందని ప్రకటించాడు దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ముస్లింలు హైదరాబాదు సైన్యానికి ఒయిదవ స్తంభంగా పనిచేస్తారని ఆయన ఊహించారు ఏప్రిలు 8న మరో ఉపన్యాసిస్తూ నైజాం దత్తతు ఒల్లార్ని, ఉత్తర సర్కారుల్ని స్వాధీనం చేసుకుంటాడని ప్రకటించాడు

## షోయి బుల్లాఖాన్ హత్య (21 ఆగస్టు 1948)

రజ్వీ, రజాకారుల చేష్టల్లో పెరిగిపోతున్న ఫాసిస్టు ధోరణుల పట్ల మానవతా భావాలు గల ముస్లింలు ఆందోళన చెందారు 'ఇమ్రోజ్' ఉర్దూ పత్రిక

యువ సంపాదకుడైన షోయిబుల్లాఖాన్ హిందువులపై రజాకార్ల అత్యాచారాల్ని ఖండించడమే కాక రజ్వీ మతోన్మాదాన్ని గూర్చి ధైర్యంగా విమర్శించాడు. ఇంతేకాక నైజాం ఇండియాలో కలసిపోవాలని ఒక ప్రకటన కూడ చేశాడు ఈ ప్రకటనను రజ్వీ ఆక్షేపించడమే కాక ముస్లింలకు వ్యతిరేకంగా పైకెత్తిన చేతిని దింపకపోతే కత్తిరించి వేయవలసి వస్తుందని హెచ్చరించాడు హెచ్చరించిన రెండు రోజులకే షోయిబుల్లా ఖాన్ చేతులు నరికి కాల్చి చంపారు

## ఐక్యరాజ్యసమితికి నైజాం విన్నపం

లాయిక్ ఆలీ రహస్యంగా కరాచీకి వెళ్ళి పాకిస్తాన్ ప్రధానమంత్రి అయిన లియాకత్ ఆలీఖాన్‌తో పాటు గులాం మహ్మదు, జఫ్రుల్లా ఖాన్ వంటి ఇతర నాయకుల్ని కూడా కలిశాడు ఈ నాయకులు హైదరాబాదు సమస్యను ఐక్యరాజ్యసమితిలోని భద్రతాసంఘానికి నివేదించమని లాయిక్ ఆలీకి సలహా ఇచ్చారు హైదరాబాదుకు తిరిగివచ్చిన తర్వాత లాయిక్ ఆలీ సెప్టెంబరు 10న మొయిన్ నవాజ్ జంగ్ నాయకత్వంలో ఒక ప్రతినిధి సంఘాన్ని ఐక్యరాజ్య సమితికి పంపాడు

## పోలీసు చర్య (13–18 సెప్టెంబరు, 1948)

1948 సెప్టెంబరు 13న భారత ప్రభుత్వం హైదరాబాదుపై పోలీసు చర్యను ప్రారంభించింది జె ఎన్ చౌదరి నాయకత్వాన భారతసైన్యం అయిదువైపుల నుండి హైదరాబాదు రాష్ట్రంలోకి ప్రవేశించింది సైనిక ప్రధాన కేంద్రంలో ఈ మలిటరీ చర్యకు 'ఆపరేషన్ పోలో' అనే కోడ్ పేరు పెట్టారు అయిదురోజుల్లోనే మిలిటరీ చర్య పూర్తయింది ఎల్ ఎడ్రూస్ నాయకత్వాన గల నైజాం సైన్యం సెప్టెంబరు 17న భారతీయ సైన్యానికి లొంగిపోయింది సెప్టెంబరు 18న భారత సైన్యం హైదరాబాదు నగరంలో ప్రవేశించింది పోలీసు చర్య పూర్తిగ విజయవంతం కావడంతో భారతదేశపు 'ఉదరంలో ఏర్పడ్డ పుండును' తొలగించినట్లయింది

సెప్టెంబరు 23న తన ఫిర్యాదును ఉపసంహరిస్తూ నైజాం భద్రతా సంఘానికి ఒక కేబిలును పంపాడు లాయిక్ ఆలీ, కాశిం రజ్వీలు అరెస్టు చేయబడ్డారు తర్వాత వీరిద్దరు పాకిస్తాన్‌కు తప్పించుకుని పారిపోయారు హైదరాబాదు మిలిటరీ గవర్నరుగ జె ఎన్ చౌదరి నియమించబడ్డాడు ఈ

పదవిలో చౌదరి 1949 చివరి వరకు కొనసాగాడు 1950 జనవరిలో ఒక సీనియరు సివిలు అధికారి అయిన ఎం ఎ వెల్లోడిని ముఖ్యమంత్రిగా నియమించి నైజాంకు 'రాజ్ ప్రముఖ్' అని పేరు మార్చడం జరిగింది 1952 సాధారణ ఎన్నికల తర్వాత బి రామకృష్ణారావు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్ర పాలనా బాధ్యతల్ని చేపట్టింది

# 14

# ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావం

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంతో తమ చిరకాల వాంఛితమైన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు త్వరలో జరుగుతుందని ఆంధ్రులు ఆశపడ్డారు వీరి ఆశకు 1946లో విడుదలైన కాంగ్రెసు ఎన్నికల ప్రణాళిక కొంతవరకు కారణం కావచ్చు ఈ ప్రణాళికలో బాషా, సంస్కృతుల ఆధారంగా దేశంలోని రాష్ట్రాలన్నింటిని పునర్వ్యవస్థీకరించవలసి ఉంటుందని ప్రకటించడం జరిగింది. ప్రకాశం, రంగా వంటి ప్రముఖ ఆంధ్రనాయకులు చాలమంది అప్పటి భారతదేశ ఉపప్రధాని, దేశీయ వ్యవహారాల మంత్రి అయిన సర్దారు వల్లభాయ్ పటేల్‌ను కలుసుకుని కొత్త రాజ్యాంగరచన జరగకముందే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలసిందిగా అభ్యర్థించారు పటేలు కూడ దీనికి సంబంధించిన చట్టపరమైన చిక్కుల్ని పరిశీలించగలమని హామీ ఇచ్చాడు. దీనికి తోడు 1947 నవంబరు 27న, భాషా ప్రయుక్త రాష్ట్రాల సూత్రాన్ని తమ ప్రభుత్వం అంగీకరించిందని ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ ప్రకటించాడు ఈ ప్రకటన వల్ల 1948 ఏప్రిలు కల్లా ఒక కౌన్సిలు ఆదేశం ద్వారా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తారన్న ఊహాగానాలు తలెత్తాయి ఈ ఆదేశాన్ని 1935 భారత ప్రభుత్వ చట్టంలోని 290 సెక్షను క్రింద జారీ చేయవచ్చు 1947 ఆగస్టు 14న జారీ చేసిన భారత రాష్ట్రీయ రాజ్యాంగం ఆదేశానుసారం 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని అవలంబించేందుకు అంగీకరించడం జరిగింది నిజానికి మొదటి షెడ్యూలులోని గవర్నరు రాష్ట్రాల్లో ఆంధ్రదేశాన్ని కూడ పేర్కొనడం జరిగింది. కాని తర్వాత ఇలా ప్రకటించారు:

"రాజ్యాంగానికి తుది ముసాయిదా రూపం ఇచ్చే ముందే ఆంధ్ర ప్రాంతాన్ని గాని మరి ఏ ఇతర ప్రాంతాన్ని గాని షెడ్యూలులో పేర్కొనవలసి వస్తే రాజ్యాంగం యొక్క ముసాయిదాను ఆమోదించకముందే 1935 భారత ప్రభుత్వ చట్టంలోని 290 సెక్షను క్రింద పై ప్రాంతాల్ని ప్రత్యేక గవర్నరు ప్రాంతాలుగ ఏర్పాటు చేసేందుకు సత్వర చర్యలు తీసుకోవలసి ఉంటుంది"

ఈ ప్రకటన ఆంధ్రులకు విపరీతమైన అసంతృప్తిని కల్గించింది ఆంధ్రులకు కల్గిన ఈ అసంతృప్తిని సొమ్ము చేసుకోడానికి కాంగ్రెసేతర పార్టీలు ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ ప్రయత్నించింది 1948 మార్చిలో నెహ్రూ విశాఖపట్నం సందర్శించినపుడు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును పరిశీలించేందుకు ఒక కమిటీని నియమిస్తున్నానని ప్రకటించి ఆంధ్రుల అసంతృప్తిని కొంతవరకు తగ్గించడానికి ప్రయత్నించాడు

## దార్ కమీషన్

1948 జూన్ 17 న రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షుడు భాషా రాష్ట్రాల ఏర్పాటుకు ఒక కమీషన్ను ఏర్పాటు చేశాడు అలహాబాదు హైకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన ఎస్ కె దార్ కమీషను అధ్యక్షుడుగ నియమింపబడ్డాడు అందువల్ల ఈ కమీషను ఆయన పేరుతోనే దార్ కమీషన్‌గ వ్యవహరించడం జరిగింది రిటైర్డు ఐ సి ఎస్ అధికారైన డా.పన్నాలాల్, రాజ్యాంగ పరిషత్తు సభ్యుడైన జగత్ నారాయణ్ లాల్ కమీషనులోని మిగిలిన సభ్యులు ఏయే కొత్త రాష్ట్రాల్ని ఏర్పాటు చేయాలో, వాటి ఏర్పాటు వల్ల తలెత్తే పాలనాపరమైన, ఆర్థిక పరిణామాలు ఎలా ఉంటాయో పరిశీలించి తెలియజేయవలసిందిగ ప్రభుత్వం కమీషన్‌ను కోరింది ఇది గాక కొత్త రాష్ట్రాల ఏర్పాటుతో వాటి ఇరుగు పొరుగు ప్రాంతాల్లో ఎటువంటి పాలనాపరమైన సమస్యలు తలెత్తుతాయో కూడ తెల్పమని కోరింది కమీషను పరిధిలోని పరిశీలనాంశాల్ని బట్టి కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు భాష ఒక్కటే ప్రాతిపదిక కాదని చెప్పవచ్చు పరిపాలనా సామర్థ్యం, ఆర్థిక పుష్టి మొదలయినవి ముఖ్య అవసరాలుగ పరిగణించబడ్డాయి.

కమీషను మద్రాసు పర్యటించినపుడు ఆంధ్ర మహాసభ విశాలాంధ్రను ఏర్పాటు చేయమని ఒక మహాజరును సమర్పించింది. అయితే సంజీవరెడ్డి భాషా

ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును వాయిదా వేయాల్సిందిగా రాయలసీమలోని 20 మంది శాసనసభ సభ్యుల తరపున ఒక విన్నపాన్ని కమీషనుకు సమర్పించాడు ఒకవేళ ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు జరిగితే రాయలసీమకు చట్టపరమైన కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పించాలని సంజీవరెడ్డి కోరాడు రాయలసీమ మహాసభకు బళ్లారి నాయకులైన ఎం ఎన్ శాస్త్రి, హెచ్ లింగారెడ్డి ప్రాతినిధ్యం వహించారు వీరు బాషా రాష్ట్రాల ఏర్పాటును వ్యతిరేకించారు ఒకవేళ ఆంధ్రరాష్ట్రం ఏర్పడినట్లయితే మద్రాసు రాజధానిగ రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగ ఏర్పాటు చేయాలని వీరు ప్రతిపాదించారు

1948 డిశెంబరు 10న కమీషను తన నివేదికను సమర్పించింది. ప్రస్తుతానికి కొత్త రాష్ట్రాల ఏర్పాటు అవసరం లేదని కమీషను తన నివేదికలో అభిప్రాయపడింది కేవలం బాషా ప్రాతిపదికపై ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల భారతదేశ దీర్ఘకాలిక ప్రయోజనాలకు దెబ్బ తగులవచ్చునని, అందువల్ల బాషా రాష్ట్రాల ఏర్పాటు అవసరంలేదని కమీషను అభిప్రాయపడింది

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రజలు చూపిస్తున్న ఉత్సాహాన్ని గూర్చి కమీషను ఇలా అభిప్రాయపడింది:

"ఈ భాషా రాష్ట్రాలనేవి మనదేశ ప్రజల మనోభావాల్ని గొప్పగా ఆకట్టుకుంటాయి వీటి ఏర్పాటుకు ప్రజల్లో విపరీతమైన మద్దతు ఉంది. మరి కోస్తా ఆంధ్రదేశంలో అయితే – ఒక ప్రత్యేక రాష్ట్రవాది మాటల్లో చెప్పాలంటే – " ఈ కోర్కె కోరదగిందా లేదా అన్న మీమాంస కసలు తావే లేకుండా వారి నిత్య ఆలోచనా విధానంలో భాగమై పోయింది " మేము పనిచేసే సమయంలో కమీషను చుట్టూ ఆవరించిన భావోద్రిక్తల్ని, ఆవేశకావేషాల్ని స్వయంగా చూడడం వల్ల వీటిని ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోర్కెలోని తీవ్రతకు చక్కటి ఉదాహరణలుగ భావించవచ్చు ఇటువంటి కోరికను తీర్చకపోవడం తీవ్ర అసంతృప్తికి గురి చేయడమే కాక గొప్ప సాహసమే అవుతుంది ఇలాంటి సాహసాన్ని ప్రదర్శించడం దేశ అత్యవసర ప్రయోజనాల దృష్ట్యా మాత్రం సమర్ధనీయమే "

దార్ కమీషను నివేదిక దేశమంతా ముఖ్యంగా ఆంధ్రదేశంలో తీవ్రమైన అలజడిని సృష్టించింది ఈ అలజడిని తట్టుకునేందుకు ప్రజల్ని శాంతింపజేసే

విధంగా భాషా రాష్ట్రాల ఏర్పాటును పరిశీలించేందుకు మరో కమిటిని ఏర్పాటు చేయాలని కాంగ్రెసు భావించింది దీంతో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్యలతో కూడిన ఒక కమిటిని ఏర్పాటు చేయడం జరిగింది సభ్యుల పేర్లలోని మొదటి అక్షరాలతో జె వి పి కమిటీగా ప్రసిద్ధి చెందిన ఈ త్రిసభ్య సంఘం 1949 ఏప్రిల్‌లో తన నివేదికను కాంగ్రెస్ వర్కింగు కమిటికి సమర్పించింది భాషా రాష్ట్రాల ఏర్పాటును కొన్ని సంవత్సరాల పాటు వాయిదా వేయాలని ఈ కమిటి సిఫార్సు చేసింది అయినప్పటికి ఆంధ్రులు మద్రాసు నగరాన్ని వదులుకునేటట్లయితే పై సిఫార్సు ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు ఏ విధంగాను ఆటంకం కాదని స్పష్టం చేసింది. కాని రాయలసీమ, సర్కారుల మధ్య మరల విభేదాలు తలెత్తకుండా మద్రాసు నగరాన్ని వదులుకోవడం ఆంధ్రనాయకులకు అసాధ్యమైన పనిఅని కాంగ్రెసు అదిష్టానవర్గానికి స్పష్టంగా తెలుసు

## ఆంధ్ర కాంగ్రెస్ రాజకీయాలు, 1946–53

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసులో రెండు వర్గాలుండేవి ఒక వర్గానికి ప్రకాశం నాయకుడు కాగా, రెండోవర్గానికి పట్టాభి సీతారామయ్య నాయకత్వం వహించాడు పట్టాభి సీతారామయ్య 1948 చివరిలో కాంగ్రెసు అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత తన నమ్మినబంటు అయిన కళావెంకట్రావు ద్వారా ఆంధ్ర రాజకీయాల్లో జోక్యం చేసుకునేవాడు 1946 ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ తెలుగు జిల్లాలన్నింటి లోను గొప్ప విజయాన్ని సాధించింది ప్రకాశం అధిష్టాన వర్గ నిర్ణయానికి వ్యతిరేకంగా పార్టీ నాయకత్వానికి పోటీపడి విజయం సాధించాడు ప్రకాశం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాయలసీమ శాసనసభ్యుల ప్రతినిధిగ కె కోటిరెడ్డిని తన మంత్రి వర్గంలో చేర్చుకున్నాడు తమ ఓట్లన్ని ప్రకాశానికే వేసిన రాయలసీమ శాసనసభ్యులు మంత్రివర్గంలో రాయలసీమకు రెండు స్థానాలుంటాయని ఆశించారు ఆశించిన విధంగా జరగకపోవడంతో వారు అసంతృప్తి చెందారు దీంతో పట్టాభివర్గం ఆంధ్రనాయకత్వం ఇష్టంలేని తమిళ సభ్యులతో చేతులు కలిపి 1947 మార్చిలో ప్రకాశం మంత్రివర్గాన్ని పడగొట్టారు అసెంబ్లీలో కాంగ్రెసు పార్టీ నాయకుడుగ ఎన్నికైన ఒ పి రామస్వామి రెడ్డియార్ మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసి 1949 వరకు అధికారంలో కొనసాగాడు

1948 జూన్‌లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటి ఎన్నికలు జరిగాయి ఎన్ జి రంగా, సంజీవరెడ్డి అధ్యక్షపదవికి పోటీపడ్డారు ప్రకాశం వర్గం రంగాను బలపరచగా, కళా వెంకట్రావు వర్గం సంజీవరెడ్డికి మద్దతు నిచ్చింది చాల తక్కువ మెజారిటితో రంగా గెలుపొందాడు రాయలసీమ సభ్యుల సహకారాన్ని పొందాల్సిన అవసరాన్ని రంగా గుర్తించాడు అందువల్ల ఆయన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడుగ పి తిమ్మారెడ్డిని, ప్రధాన కార్యదర్శిగ కె ఓబుల రెడ్డిని నియమించాడు దీంతో రాయలసీమలోను, రెడ్డివర్గంలోను సంజీవరెడ్డి పలుకుబడిని తగ్గించవచ్చునని రంగా భావించాడు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆంధ్ర రాజకీయాలు కుల, ప్రాంత ప్రాతిపదికపై నడచాయనేది మనం ఈ సందర్భంగా చెప్పుకోవాలి

1949 ఏప్రిల్లో మద్రాసు శాసనసభ నాయకత్వానికి పి. ఎస్ కుమారస్వామి రాజా, డా సుబ్బరాయన్ పోటీపడ్డారు కళావెంకట్రావు మరియు గోపాలరెడ్డి వర్గం కుమారస్వామి రాజాను బలపరచగా ప్రకాశం వర్గం సుబ్బరాయన్‌కు మద్దతు నిచ్చింది అయితే సుబ్బరాయను 89-105 ఓట్ల తేడాతో ఓడిపోయాడు తర్వాత ఏర్పడిన మంత్రివర్గంలో సంజీవరెడ్డికి స్థానం కల్పించడం జరిగింది మద్రాసులో ఇటువంటి పరిణామాలు సంభవిస్తున్న సమయంలోనే జె వి పి కమిటి తన నివేదికను సమర్పించింది ఈ నివేదిక మనం ఇదివరకు చెప్పుకున్నట్టే మద్రాసు ప్రసక్తి లేని ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసింది దీంతో అత్యధికులైన రాయలసీమ శాసనసభ సభ్యుల్ని కల్గిన కళా వెంకట్రావు-గోపాలరెడ్డి వర్గం సందిగ్ధావస్థలో పడింది రాయలసీమ సభ్యులు మద్రాసు నగరాన్ని వదులుకోడానికి సుముఖులుగాలేరు.

జె వి పి నివేదిక ఆంధ్రుల్లో తీవ్రమైన అలజడిని రేకెత్తించిందని తెలియడంతో మద్రాసు నగర విషయాన్ని గూర్చి వివరించడానికి పట్టాభి ప్రయత్నించాడు తెలుగువాళ్ళు మద్రాసును వదులుకోవడమంటే అది తమిళులకు చెందుతుందని అర్థం కాదని చెప్పాడు అంటే మద్రాసును ప్రత్యేక పాలనా విభాగంగా చేస్తామని అర్థం కాని ఈ వివరణ ఎవరినీ సంతృప్తి పరచలేదు అయితే ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటి మాత్రం వివాదం లేని తెలుగు జిల్లాల్ని కలిపి వెంటనే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని, మద్రాసు నగరాన్ని ఒక

ప్రత్యేక పాలనా విభాగంగ రూపొందించాలని భారత ప్రభుత్వాన్ని కోరింది తమిళనాడు కాంగ్రెసు కమిటితో పాటు మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం కూడ జె వి పి నివేదికను అంగీకరించాయి అయితే ఈ రెండూ కూడ మద్రాసును ఆంధ్ర రాష్ట్ర పరిధిలో లేదు కాబట్టి తప్పక తమిళనాడులో భాగం అవుతుందని భావించాయి

## విభజన సంఘం

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం కోసం మద్రాసు ప్రభుత్వం ఒక విభజన కమిటీని ఏర్పాటు చేసింది ముఖ్యమంత్రి అయిన కుమార రాజా విభజన సంఘానికి అధ్యక్షుడయ్యాడు ఈ సంఘంలో ఆంధ్రప్రాంతానికి ప్రకాశం, గోపాల రెడ్డి, కళా వెంకట్రావు, సంజీవరెడ్డి ప్రాతినిధ్యం వహించగా ఆంధ్రేతర ప్రాంతాలకు భక్తవత్సలం, టి.టి కృష్ణమాచారి, మాధవ మీనన్ ప్రాతినిధ్యం వహించారు

## ప్రకాశం అసమ్మతి వ్యాఖ్య

కొత్త రాజధాని, ఆంధ్ర హైకోర్టు కేంద్రాలు నిర్ణయమయ్యే వరకు ఆంధ్ర ప్రభుత్వం, హైకోర్టు మద్రాసులోనే ఉంటూ శాసనసభా కార్యక్రమాలతో పాటు అన్ని విధాలైన పాలనా కార్యకలాపాల్ని నిర్వహించగలవని ప్రకాశం భావించాడు అయితే ఇందుకు ఆంధ్రేతర సభ్యులు అంగీకరించలేదు కొత్తగా ఏర్పాటయ్యే ఆంధ్ర రాష్ట్ర పరిధిలోనే ఆంధ్రరాజధానిని ఏర్పాటు చేసుకుని ఆంధ్ర శాసనసభా కార్యక్రమాల్ని మద్రాసులో ఏర్పాటు చేసుకునేందుకు మాత్రం వారు అంగీకరించారు. రాజధాని ఏర్పాటు, ఆస్తులు, అప్పుల పంపకం మొదలయిన అతి ముఖ్య విషయాలపై మెజారిటి నిర్ణయంతో ఏకీభవించలేక ప్రకాశం ఒక అసమ్మతి వ్యాఖ్యను వ్రాసి సమర్పించాడు

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటులో అంతగా అసక్తి లేని భారత ప్రభుత్వం ప్రకాశం అసమ్మతిని ఆసరాగా తీసుకుని మొత్తం విషయాన్నే పక్కకు పెట్టింది.

కొత్త భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. అయితే ఆంధ్రరాష్ట్రసమస్య ఆచరణ రాజకీయాలకు దూరంగా ఉన్నట్లనిపించింది.

ప్రజాభీష్టాన్ని మరచిపోయి తమలో తాము కలహించుకుంటున్న ఆంధ్ర కాంగ్రెసు నాయకుల ధోరణి సామాన్య ఆంధ్ర జనీకానికి చాల బాధను కల్గించింది పట్టాభి కాంగ్రెసు అధ్యక్షుడుగా పదవీ విరమణ చేసే ముందు 1950 సెప్టెంబరు 3న ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీని రద్దు చేసి కమిటి నిర్వహణ బాధ్యతను యస్ కె పాటిల్‌కు అప్పగించి ఎన్నికల్ని జరిపించాల్సిందిగా కోరాడు 1951 ఏప్రిల్లో ఆంధ్రరాష్ట్ర కమిటి ఎన్నికలు జరిగాయి పట్టాభి వర్గం బలపరచిన సంజీవరెడ్డికి 87 ఓట్లు రాగా ప్రకాశం వర్గం మద్దతు లభించిన రంగాకు 82 ఓట్లు వచ్చాయి సంజీవరెడ్డి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు కావడంతో ప్రకాశం, రంగాలు కాంగ్రెసు నుండి వైదొలగారు

## స్వామి సీతారాం ఆమరణ నిరాహార దీక్ష

ఆంధ్రరాష్ట్రాన్ని సాధించాలంటే గాంధీ మార్గమే శరణ్యమని స్వామి సీతారాం (గొల్లపూడి సీతారామశాస్త్రి) భావించాడు అందువల్ల ఆయన 1951 స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు ప్రభుత్వాన్ని లొంగదీసేందుకు రాజ్యాంగేతర పద్ధతుల్ని అనుసరించడాన్ని నెహ్రూ తిరస్కరించాడు ఈ నిరాహార దీక్ష ఆంధ్రదేశంలో తీవ్రమైన పరిస్థితిని కల్పించడమే కాక కొన్ని దురదృష్ట సంఘటనలకు కూడ దారితీసింది దీంతో ఆచార్య వినోభాభావే కల్పించుకుని శాంతియుత వాతావరణంలో సమస్యను పరిష్కరించేందుకు వీలుగా నిరాహారదీక్షను విరమించమని సీతారాంకు సలహా ఇచ్చాడు ఈ సలహాను పాటించిన స్వామి సీతారాం తన 35 రోజుల నిరాహార దీక్షను 1950 సెప్టెంబరు 20 న విరమించాడు ఈ నిరాహారదీక్ష వల్ల ఎటువంటి ఫలితమూ లేకపోగా కాంగ్రెసు నాయకులపై మాత్రం ప్రజలకు ద్వేషం పెరిగింది

## పొట్టి శ్రీరాముల ఆమరణ నిరాహార దీక్ష – ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం

1952లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెసుపై గల అసంతృప్తిని వెల్లడి చేయగల్గారు. మద్రాసు రాష్ట్రం మొత్తం మీద గల 375 స్థానాల్లో కేవలం 152 స్థానాల్ని మాత్రం కాంగ్రెసు గెల్చుకోగల్గింది ఆంధ్రదేశంలోని 140 స్థానాల్లో 43 స్థానాల్ని మాత్రమే కాంగ్రెసు సంపాదించగల్గింది కమ్యూనిస్టులు దాదాపు 43 సీట్లను కైవశం చేసుకోగల్గారు ఓడిపోయిన కాంగ్రెసు నాయకుల్లో కళా

వెంకట్రావు, గోపాలరెడ్డి, సంజీవరెడ్డి వంటి అతిరధమహారధులు ఉన్నారు. కమ్యూనిస్టులు ప్రకాశం స్థాపించిన కిసాన్ మజ్దూరు ప్రజాపార్టీతో కలిసి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంటును ఏర్పాటు చేశారు. 164 మంది సభ్యుల మద్దతు గల డెమోక్రాటిక్ ఫ్రంటుకు ప్రకాశం నాయకుడుగ ఎన్నికయ్యాడు. అసెంబ్లీలో ఫ్రంటుకు ప్రకాశం నాయకుడుగ ఎన్నికయ్యాడు. అసెంబ్లీలో ఫ్రంటు ఆధిక్యత గల ఏకైక వర్గమైనా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నరు ప్రకాశాన్ని ఆహ్వానించలేదు. ఇందుకు విరుద్ధంగా సి రాజగోపాలాచారియార్‌ను శాసనమండలి సభ్యుడుగ నియమించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కోరాడు.

రాజగోపాలాచారియార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తన అధికారాన్ని వినియోగించి ఆంధ్రదేశాన్ని పణంగా పెట్టి తమిళనాడును అభివృద్ధి చేయడానికి ప్రయత్నించాడు తమిళనాడుకు కృష్ణానది నీటిని తరలించే కృష్ణా-పెన్నారు ప్రాజెక్టును ప్రారంభించి ఆంధ్రుల ప్రయోజనాల్ని దెబ్బతీయాలని ప్రయత్నించాడు ఈ ప్రాజెక్టుకు ఆంధ్రదేశంలో తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. ఇదే సమయంలో ఈ ప్రాజెక్టు సాంకేతిక పరమైన విషయాల్ని పరిశీలించిన ఖోస్లా కమిటీ ప్రాజెక్టును ప్రస్తుత రూపంలో కొనసాగించ కూడదని అభిప్రాయపడింది. దీనికి బదులుగా నందికొండ (నాగార్జున సాగర్) వద్ద ప్రాజెక్టును ప్రారంభించమని సలహా ఇచింది. ఇటువంటి పరిస్థితిలో పొట్టి శ్రీరాములు 1952 అక్టోబరు 19న మద్రాసులో అమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడు. నిరాహారదీక్ష 50వ రోజుకు చేరినప్పుడు కూడ నెహ్రూ శ్రీరాముల్ని విమర్శించాడు. అన్ని పక్షాల మధ్య అంగీకారం కుదిరి మద్రాసు నగరాన్ని వదలుకున్నట్లయితే భారత ప్రభుత్వం ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయగలదని మరల మరుసటి రోజు రాజ్యసభలో నెహ్రూ ప్రకటించాడు. స్వామి సీతారాం నిరాహార దీక్షసమయంలో నెహ్రూ ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టు కోలేక పోయాడన్న విషయం గుర్తుంచుకున్న పొట్టి శ్రీరాములు నెహ్రూ ప్రకటనను నమ్మి నిరాహార దీక్ష విరమించడానికి అంగీకరించలేదు. ఈ నిరాహారదీక్ష ఆంధ్రదేశంలో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించింది. చివరకు 1952 డిశంబరు 15న పొట్టి శ్రీరాములు తన అసువులు కోల్పోయి అమరజీవి అయ్యాడు శ్రీరాములు మరణ వార్త విన్న వెంటనే ఆంధ్రదేశమంతా హింసా

జ్వాల ప్రజ్వరిల్లింది మూడు రోజులపాటు ప్రజలు రైల్వే స్టేషన్లపై, ఇతర ప్రభుత్వ కార్యాలయాలపై దాడి చేశారు. అనకాపల్లి, విజయవాడ మొదలగు ప్రాంతాల్లో పోలీసులు కాల్పులు జరపవలసి వచ్చింది. ఈ కాల్పులలో ఏడు మంది మరణించారు. ఆంధ్రదేశంలో జరిగిన హింసాత్మక సంఘటనలతో ప్రభుత్వం మేల్కొంది మద్రాసును మినహాయించి వివాదాస్పదం కాని తెలుగు జిల్లాలతో ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు భారత ప్రభుత్వం నిర్ణయించిదని డిశంబరు 19న నెహ్రూ పార్లమెంటులో ప్రకటించాడు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుతో ఉత్పన్నమయ్యే ఆర్థిక, పాలనాపరమైన ఇబ్బందులే కాక ఇతర సమస్యల్ని కూడా పరిశీలించి ఒక నివేదిక సమర్పించేందుకు రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ కైలాసనాథ వాంఛూను ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగింది. 1953 ఫిబ్రవరి 7న వాంఛూ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాడు. భారత ప్రభుత్వం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుందని 1953 మార్చి 25న నెహ్రూ ప్రకటించాడు ఈ కొత్త రాష్ట్రంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలతో పాటు బళ్ళారి జిల్లాలోని ఆలూరు, ఆదోని, రాయదుర్గ తాలూకాలు కూడ ఉంటాయని పై ప్రకటనలో నెహ్రూ స్పష్టం చేశాడు అయితే బళ్ళారి తాలూకా విషయాన్ని మాత్రం తర్వాత పరిశీలించడం జరుగుతుందని ప్రకటించాడు మిగిలిన బళ్ళారి తాలూకాల్ని మాత్రం మైసూరు రాష్ట్రంలో విలీనం చేస్తారు. బళ్ళారి తాలూకా విషయాన్ని పరిశీలించేందుకు హైదరాబాదు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ ఎల్ ఎస్.మిశ్రాను నియమించారు. ఆయన బళ్ళారిని మైసూరు రాష్ట్రంలో కలపాలని సిఫార్సు చేశాడు భారత ప్రభుత్వం కూడ మిశ్రా సిఫార్సుల్ని అంగీకరించింది

భారత ప్రభుత్వం నిర్ణయం వెలువడిన తరువాత శ్రీ బాగ్ ఒడంబడిక ప్రకారం ఆంధ్రరాష్ట్ర రాజధానిని రాయసీమలో ఏర్పాటు చేయాలని రాయలసీమ శాసనసభ్యులు కోరారు దీంతో మరల రాయలసీమ సర్కారుల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి కమ్యూనిస్టులు విజయవాడను రాజధానిగా చేయాలని కోరారు. ఆంధ్ర శాసనసభ్యుల నాయకుడుగ ఎన్నికైన సంజీవరెడ్డి

కిసాన్ మజ్దూర్ పార్టీ నాయకుడైన ప్రకాశం మద్దతు పొందగల్గాడు ఈ పార్టీలో 20 మంది సభ్యులున్నారు రంగా నాయకత్వం వహించిన కృషికార్ లోక్ పార్టీలోని 15 మంది సభ్యులు కాంగ్రెస్ పార్టీ అసోషియేట్ సభ్యులుగ చేరడానికి నిర్ణయించారు కృషికార్ లోక్ పార్టీ తిరుపతిని రాజధానిగ చేయాలని కోరింది ఆంధ్రరాష్ట్ర తాత్కాలిక రాజధానిని నిర్ణయించేందుకు ఆంధ్ర శాసనసభ్యులు జూన్ మొదటి వారంలో మద్రాసులో సమావేశమయ్యారు కాంగ్రెసు పార్టీ, ప్రజా సోషలిస్టు పార్టీ, కృషి కార్ లోక్ పార్టీ నాయకులు కర్నూలును రాజధానిని చేసేందుకు అంగీకరించారు అయితే మద్రాసు శాసనసభలో ఆంధ్రరాష్ట్ర బిల్లును చర్చించే సమయంలో కృషికార్ లోక్ పార్టీ తన మునుపటి నిర్ణయాన్ని మార్చుకుని చిత్తూరు జిల్లాలో రాజధానిని ఏర్పాటు చేయాలని కోరింది కర్నూలుకు బదులుగ విజయవాడ-గుంటూరును రాజధానిని చేయాలని కమ్యూనిస్టులు ఒక సవరణను ప్రతిపాదించారు ఈ సవరణ ఒక ఓటు మెజారిటీతో వీగిపోయింది ఇక్కడ మనం ఒక విషయం చెప్పుకోవాలి ఆంధ్ర రాష్ట్ర స్థానిక శాసన సభ్యులు ఓటింగులో పాల్గొనకూడదని రాజగోపాలాచారి సలహా ఇచ్చాడు దీంతో 5 మంది ఆంధ్రేతరులు కర్నూలుకు అనుకూలంగా ఓటు వేశారు రాజగోపాలాచారి మాట వినకుండా ఓటింగులో పాల్గొన్నట్లయితే గంటూరు - విజయవాడ తాత్కాలిక రాజధాని అయిఉండేది

ప్రకాశం మద్దతు లేకుండా కాంగ్రెసు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అసాధ్యమని సంజీవరెడ్డికి తెలుసు ప్రజా సోషలిస్టు పార్టీ కూడ కమ్యూనిస్టుల్ని అధికారానికి రానివ్వకూడదని భావించింది అందువల్ల ఆ పార్టీ ప్రకాశంను అసోషియేట్ సభ్యుడుగ చేరేందుకు అనుమతించింది ప్రకాశం నాయకత్వంలో మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసేందుకు కాంగ్రెసు పార్టీ అంగీకరించింది సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రి అయ్యాడు సి ఎం త్రివేది గవర్నరుగ నియమితుడయ్యాడు 1953 అక్టోబరు 1న నెహ్రూ ఆంధ్రరాష్ట్రానికి ప్రారంభోత్సవం చేశాడు

## టంగుటూరి ప్రకాశం

భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన ప్రముఖ నాయకుల్లో ప్రకాశం ఒకరు తన అసాధారణ ధైర్యసాహసాల వల్ల త్యాగగుణం

వల్ల ప్రకాశం విశేషమైన ప్రజాభిమానాన్ని పొందాడు స్వాతంత్ర్య యోధుడుగా, పత్రికా సంపాదకుడుగ, రాజకీయ నాయకుడుగ ఆయన సాధించిన ఘనవిజయాల్నుండి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఉత్తేజాన్ని పొందారు

ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన టంగుటూరి ప్రకాశం ఒకప్పుడు గంటూరు జిల్లాలో ఉన్న కనుపర్తి గ్రామంలో 1872 ఆగస్టు 23న జన్మించాడు ప్రకాశం తండ్రి గోపాలకృష్ణయ్య ఒక గ్రామాధికారి ఆయన నెల్లూరు జిల్లాకు వలసి వచ్చి నెలకు 8 రూపాయల జీతంపై వెంకటగిరి సంస్థానంలో ఉద్యోగిగా చేరాడు

ప్రకాశం తన ప్రాథమిక విద్యను నాయుడు పేటలోపూర్తిచేశాడు ఎనిమిదేండ్ల వయసులో ఉన్న ప్రకాశం 1880లో తన తండ్రిని కోల్పోయాడు దీంతో ముగ్గురు చిన్న పిల్లలు గల సంసారాన్ని మోయడం తన తల్లి వంతయింది అయితే ప్రకాశం తల్లి చాల ధైర్యం గల స్త్రీయే కాక స్వతంత్ర ఆలోచన గల వ్యక్తి. తన సోదరునిపై ఆధారపడి జీవించడం ఇష్టం లేని ప్రకాశం తల్లి తన పిల్లలతో పాటు ఒంగోలుకు వలస వెళ్ళి అక్కడ మునిషిఫ్ కోర్టుకు ఎదురుగ పూటకూళ్ళ శాలను ప్రారంభించింది

ప్రకాశం ఒంగోలులోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు ఇక్కడే ప్రకాశం తన లెక్కల ఉపాధ్యాయుడైన ఇమ్మనేని హనుమంతరావు నాయుడు ప్రభావానికి లోనైనాడు ప్రకాశం జీవితాన్ని మలచడంలో నాయుడు గారు ప్రముఖపాత్ర వహించాడు హనుమంతరావు రాజమండ్రిలో కొత్త ఉద్యోగంలో చేరేందుకు ఒంగోలు వదలివెళ్ళినపుడు ప్రకాశం కూడ ఆయనతో పాటు రాజమండ్రికి వెళ్ళి అక్కడే తన చదువుల్ని కొనసాగించాడు.

ఆ రోజుల్లో రాజమండ్రి తెలుగు నాటకాల్ని వేయడంలో ప్రసిద్ధి చెందింది చిలకమర్తి నరసింహం రచించిన ప్రసిద్ధి నాటకాల్ని తరచు వేస్తుండేవారు ప్రకాశం కూడ నాటకరంగంవైపు ఆకర్షితుడయ్యాడు ప్రకాశం తన గురువుగారైన హనుమంతరావు నాయుడితోపాటు గయోపాఖ్యానం వంటి నాటకాల్లో ప్రముఖ పాత్రల్ని ధరించాడు వివిధ నాటక కంపెనీల వివాదాల్లో గూడ ప్రకాశం తలదూర్చేవాడు. ఈ కార్యకలాపాల వల్ల ప్రకాశానికి రౌడి అన్న పేరు రావడమే

కాక చదువుల్లో కూడ వెనుకబడ్డాడు దీంతో మెట్రిక్యులేషను పరీక్ష తప్పాడు అయితే ప్రకాశం రెండోసారి మెట్రిక్యులేషన్ పరీక్షలో విజయం సాధించాడు తర్వాత రాజమండ్రి ప్రభుత్వ కాలేజీలో ఎఫ్ ఎ క్లాసులో చేరాడు తన ,పందొమ్మిదో ఏట ఎఫ్ ఎ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు ప్రకాశం ప్లీడరు కావాలని ప్రయత్నించగా వయసు చాలదన్న నెపంతో ఆయన్ను పరీక్షకు కూర్చోనివ్వలేదు అందువల్ల ఆయన రెండేళ్లపాటు వేచిఉండి 1893లో మద్రాసు లా కళాశాలలో చేరాడు

1897 లో రాజమండ్రిలో న్యాయవాదవృత్తిని ప్రారంభించిన ప్రకాశానికి అదృష్టం కలిసి రావడం ప్రారంభమైంది ఆయన మునిసిపలు రాజకీయాల్లో దిగి రాజమండ్రి మునిసిపాలిటి ఛైర్మను అయ్యాడు 1903లో బారిస్టరు చదివేందుకు ఇంగ్లండుకు వెళ్ళాడు.

1906 లో భారతదేశానికి తిరిగి వచ్చిన ప్రకాశం 1907 లో మద్రాసులో న్యాయవాదవృత్తిని చేపట్టాడు మద్రాసులోని మైలాపూరు తమిళ న్యాయవాదుల ధాటికి తట్టుకోవడం కష్టమని ఆంధ్రదేశంలోనే ఎక్కడైనా చిన్న పట్టణంలో ప్రాక్టీసు ప్రారంభించమని జస్టిస్ వాలాస్ ప్రకాశానికి సలహా ఇచ్చాడు అయితే ప్రకాశం అతని సలహాను పాటించక తమిళ న్యాయవాదులతో పోటీ పడేందుకే నిర్ణయించుకున్నాడు రెండేళ్లకే న్యాయవాదుల సంఘంలో ప్రముఖ సభ్యుడై ఆంధ్ర జిల్లాల కేసులన్నింటిని తాను కైవసం చేసుకున్నాడు. ప్రకాశం దేశ రాజకీయాల్లో సైతం తన ఉత్సాహాన్ని ప్రదర్శించాడు ప్రకాశం 1907 లో మద్రాసులో ప్రాక్టీసు ప్రారంభించిన కొంతకాలనికే బిపిన్ చంద్రపాల్ తన ఉపన్యాస యాత్రలో భాగంగా మద్రాసును సందర్శించాడు పాల్ సభలకు అధ్యక్షత వహించేందుకు ఏ పుర ప్రముఖుడూ ముందుకు రాకపోవడంతో ప్రకాశం ముందుకు వచ్చి మద్రాసులో పాల్ ఉపన్యసించిన అన్ని సభలకు అధ్యక్షత వహించాడు తర్వాత పధ్నాలుగు సంవత్సరాలు ప్రకాశంకు తన వృత్తిలో విశేషమైన ప్రాక్టీసు ఉండేది. ఈ కాలంలోనే ఆయన 'లా టైమ్స్' అను పత్రికను తన సంపాదకత్వంలో నడిపాడు ప్రివీ కౌన్సిలు ముందు కేసుల్ని వాదించేందుకు ప్రకాశం రెండుసార్లు ఇంగ్లండు వెళ్లాడు.

## సహాయనిరాకరణోద్యమంలో ప్రకాశం

1921లో మహాత్మాగాంధీ సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించినపుడు మద్రాసు నగరంలో తమ వృత్తిని వదలి ఉద్యమంలో దూకిన న్యాయవాదుల్లో ప్రకాశం మొదటి వాడు అప్పుడు ఆయన తన ప్రాక్టీసుపై నెలకు 10,000/- రూపాయలు సంపాదించేవాడు (ప్రకాశం 1921లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడయి ఆ పదవిలో 1934 వరకు కొనసాగాడు ) తర్వాత రెండు దశాబ్దాల్లో తాను సంపాదించిన అనేక లక్షల రూపాయల్ని ఎటువంటి సంకోచం లేకుండా దేశం కోసం ఖర్చు చేశాడు

## స్వరాజ్య పత్రికా సంపాదకుడుగ ప్రకాశం

కాంగ్రెసు ఆదర్శాల్ని ప్రజలకు చాటేందుకు 'స్వరాజ్య' అను ఆంగ్లదిన పత్రికను 1921 అక్టోబరు 26న ప్రారంభించారు. ఈ పత్రిక తర్వాత 12 సంవత్సరాల పాటు దక్షిణ భారతంలో బహుళ ప్రజాదరణ పొంది స్వాతంత్రోద్యమానికి మద్దతు నిచ్చింది. జి వి కృపానిధి, కోటమ రాజు రామారావు, కోటమరాజు పున్నయ్య, ఖాసా సుబ్బారావు వంటి ప్రముఖ పత్రికా రచయితలు స్వరాజ్య సంపాదక వర్గంలో సభ్యులుగా చేరి సేవ చేశారు.

## కేంద్ర శాసన సభలో ప్రకాశం

1922లో గాంధీజీ సహాయనిరాకరణోద్యమాన్ని ఉపసంహరించుకోవడంతో చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ వంటి ప్రముఖ కాంగ్రెస్ నాయకులు అసంతృప్తి చెంది స్వరాజ్య పార్టీని స్థాపించారు. సి.ఆర్.దాసు, మోతీలాల్ నెహ్రూ రాజకీయ విధానాలతో ఏకీభవించిన ప్రకాశం స్వరాజ్య పార్టీలో చేరాడు కౌన్సిలు బహిష్కరణను విరమించి కౌన్సిల్లో చేరాలని స్వరాజ్య పార్టీ నిర్ణయించడంతో ప్రకాశం ఎన్నికల్లో పోటీ చేసి కేంద్ర శాసనసభకు ఎన్నికయ్యాడు. కేంద్ర శాసనసభలో ప్రకాశం ప్రవర్తించిన తీరుకు జిన్నా, మోతీలాల్, మాలవియా వంటి నాయకులు ముగ్ధులయ్యారు. 1929లో మరల రెండోసారి కేంద్ర శాసనసభకు పోటీ చేసి ప్రముఖ శాసనసభ్యుడు, రాజకీయ చతురుడు అయిన మోచర్ల రామచంద్రరావును ఓడించాడు అయితే 1931లో గాంధీజీ ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించడంతో ప్రకాశం కేంద్ర శాసన సభ్యత్వానికి రాజీనామా

## సైమను కమీషన్, 1928 – ప్రకాశం

1919 సంస్కరణలు పనిచేస్తున్న తీరును పరిశీలించేందుకు జాన్ సైమన్ అధ్యక్షతన ఒక చట్టబద్ధమైన కమీషన్ను ఏర్పాటు చేసినట్లు బ్రిటీషు ప్రభుత్వం 1928 నవంబరు 8న ప్రకటించింది ఈ కమీషనులో భారతీయుల కెవ్వరికి స్థానం కల్పించకపోవడంతో అన్ని రాజకీయ పార్టీలు కమీషన్ను బహిష్కరించేందుకే నిర్ణయించాయి ఆంధ్ర మహాసభ కూడ కమీషన్ను బహిష్కరించాలని నిర్ణయించింది అయితే బరంపురంకు చెందిన ఒరిస్సా నాయకులు, 'ఉత్కళ్ సమ్మిళని' మాత్రం త్వరలో ఒరిస్సా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ విన్నప పత్రాల్ని సమర్పించాయి.

తిరుపతి, కర్నూలు, విజయవాడ, ఏలూరు, శ్రీకాకుళం పురపాలక సంఘాలు సైమను కమీషన్ను బహిష్కరించాలని తీర్మానించాయి ఎన్. సుబ్బారావు వంటి ఉదారవాదులు కూడ బహిష్కరణకే సుముఖత చూపారు. 1928 ఫిబ్రవరి 3న ఆంధ్రదేశంలోని అన్ని పట్టణాల్లోను హార్తాళ్‌ను పాటించారు. కమీషను పర్యటన కోసం ఆంధ్ర దేశంలో గుంటూరు, ఒంగోలు, పట్టణాల్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. కమీషన్‌ను బహిష్కరించాలని ఆంధ్రదేశ ప్రజలకు ముఖ్యంగా ఈ రెండు పట్టణాల ప్రజలకు పిలుపు నిస్తూ ప్రకాశం, రామదాసు, వి.వి.జోగయ్య ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. సైమను బృందం గుంటూరు వెడుతూ విజయవాడ రైల్వే స్టేషనులో ఆగినప్పుడు బహిష్కరణ తీర్మానం కలిగి ఉన్న సీలు చేసిన కవరు, 'సైమను గ్యో బాక్' అని వ్రాసి పెట్టిన కాగితాన్ని విజయవాడ మునిసిపాలిటికి చెందిన ఒక జవాను సైమనుకు అందజేసాడు గంటూరులోను, ఒంగోలులోను కమీషనుకు నల్లజెండాలు ఎదురయ్యాయి.

1928 ఫిబ్రవరి 26న కమీషను మద్రాసును పర్యటించాల్సి ఉంది ఎటువంటి రాజకీయ ప్రచారాన్ని చేపట్టకూడదని రాష్ట్ర ప్రధాన మేజిస్ట్రేట్ నిషేధాజ్ఞల్ని జారీ చేశాడు మద్రాసు నగరంపై ఆంధ్ర, తమిళనాడు కాంగ్రెసు కమిటీలకు అధికారం ఉండేది ఆంధ్ర కాంగ్రెసు కమిటి నిషేధాజ్ఞల్ని

ఉల్లంఘించాలని తీర్మానించగా, తమిళనాడు కాంగ్రెసు కమిటి మాత్రం తద్విరుద్ధంగా నిర్ణయించింది. తమిళనాడు కాంగ్రెసు సహకరించనప్పటికి సైమను కమీషను మద్రాసులో ఉన్నన్నాళ్ళు నగరంలో పూర్తి హార్తాళ్ పాటించబడింది. కమీషన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో టంగుటూరి ప్రకాశం ప్రముఖపాత్ర నిర్వహించాడు. అక్కడక్కడా కొన్ని హింసాత్మక సంఘటనలు జరిగాయి. దీంతో పోలీసు కాల్పులు జరగగా ఒక వ్యక్తి మరణించాడు. కాల్పులు జరిగిన చోటుకు పోవాలని ప్రకాశం, అతనిఅనుచరులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో కోపోద్రిక్తుడయిన ప్రకాశం తన రొమ్మును విరిచి చూపి "మేము ముందుకు సాగడానికే నిర్ణయించుకున్నాము. మా సోదరుని మృతదేహాన్ని చూడదలిచాము. మీరు కావాలంటే నన్ను కాల్చండి" అని ప్రకటించాడు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గి ప్రకాశాన్ని ఆయన అనుచరుల్ని ముందుకు పోనిచ్చారు. ఈ విధమైన ధైర్యసాహసాల్ని ప్రదర్శించినందుకే ప్రకాశంకు 'ఆంధ్రకేసరి' అన్న బిరుదు వచ్చింది.

## ఉప్పు సత్యాగ్రహంలో ప్రకాశం (1930)

1930లో గాంధీజీ ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించడంతో ప్రకాశం కేంద్ర శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నాడు. తన కార్యకలాపాలకు మద్రాసు నగరాన్ని కేంద్రంగా చేసుకున్నాడు. కె. నాగేశ్వరరావు పంతులు, శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌లతో కలిసి ప్రకాశం 1930 ఏప్రిల్ 13న ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. ప్రకాశాన్ని అరెస్టు చేసి ఒక సంవత్సరం జైలులో ఉంచారు.

## రెవిన్యూ మంత్రిగ ప్రకాశం

1937లో మద్రాసు రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసు అత్యధిక మెజారిటితో గెలుపొందింది. అయితే పార్టీ నాయకుడుగా ప్రకాశం ఉండాలా లేక రాజగోపాలాచారి ఉండాలా అన్న ప్రశ్న తలెత్తింది. మొదటి సారిగ కాంగ్రెసుపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న తరుణంలో కాంగ్రెసులో చీలికలు రావడం ఇష్టం లేని ప్రకాశం పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నాడు. రాజగోపాలాచారి

ముఖ్యమంత్రికాగా, ప్రకాశం రెవిన్యూ మంత్రి అయ్యాడు  రెవెన్యూ మంత్రి హోదాలో ప్రకాశం జమీందారీ రద్దు సంఘానికి (Zamindari Abolition Committee) నాయకత్వం వహించాడు  ఈ సంఘం జమీందారీ వ్యవస్థను రద్దు చేయాలని సిఫార్సు చేస్తూ దున్నే వారికి భూమి దక్కాలని అభిప్రాయపడింది  అయితే 1939లో కాంగ్రెసు ప్రభుత్వాలు రాజీనామా చేయడంతో కమిటి సిఫార్సులను అమలు పెట్టేందుకు వీలులేకపోయింది

## 'క్విట్ ఇండియా' ఉద్యమంలో ప్రకాశం

'క్విట్ ఇండియా' ఉద్యమ సమయంలో బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటి సమావేశానికి హాజరయి తిరిగి మద్రాసు వస్తున్న ప్రకాశంను కడప రైల్వే స్టేషనులో 1942 ఆగస్టు 9న అరెస్టు చేశారు  ఆయన్ని మూడు సంవత్సరాల పాటు జైలులో ఉంచి 1945లో విడుదల చేశారు  ఇదే ఆయన చివరి జైలు జీవితం కూడ

## ప్రకాశం – గాంధీజీ

1945లో ప్రకాశం వేలూరు జైలు నుండి విడుదల కాగానే ఆంధ్రప్రజలు ఆయనకు 50 వేల రూపాయల నగదును బహూకరించారు  ఈ బహుమతిని ఆసరాగా చేసుకుని పట్టాభి, కళా వెంకట్రావు వంటి ప్రకాశం వ్యతిరేకులు రాజకీయ ప్రయోజనాల్ని పొందడానికి ప్రయత్నించారు  ప్రకాశం ప్రజాధనంతో జీవితం గడుపుచున్నాడని కళావెంకట్రావు గాంధీజికి ఫిర్యాదు చేశాడు  దీంతో గాంధీజీ 1946 ఏప్రిలు 3న ప్రకాశానికి వ్రాసిన ఒక ఉత్తరంలో ప్రకాశం ప్రజా జీవితాన్ని అవినీతిమయం చేస్తున్నాడని అభిప్రాయపడ్డాడు

ప్రకాశం గాంధీజీకి 1946 ఏప్రిలు 9న ప్రత్యుత్తరం ఇస్తూ "ప్రజాసేవలో నేను నిర్వర్తించవలసిన బాధ్యతల కోసం, ప్రస్తుత నా ఖర్చు కోసం ప్రజలు నాకు నగదు బహుమతి ఇచ్చారే కాని మరే ఇతర ప్రయోజనాల్ని ఆశించి కాదు" అని స్పష్టం చేశాడు  ఆయన ఇంకా ఇలా వివరించాడు: "నేను నా ప్రజల పట్ల, పితృదేవుల పట్ల, ఋషుల పట్ల, దేవతల పట్ల  నా విధుల్ని నిర్వర్తిస్తూనే ఉన్నాను  నేను స్వతంత్రుడను  నేను నా జాతిలో ఐక్యమయ్యాను  నాకు డబ్బులు అవసరంలేదు  నేను సంపాదించను  నేను కూడబెట్టను కూడా

ప్రజలు నాకు ప్రేమతో ఇచ్చిన డబ్బుతో నా నిరాడంబర నిత్యావసరాలకు పోను మిగిలిన డబ్బు తగిన సమయంలో మిక్కిలి నమ్మకస్థుల చేతుల్లో ఉంచబడుతుంది నమ్మకమైన శాశ్వతమైన ప్రయోజనాలకు వినియోగించబడుతుంది గతంలో నేనెప్పుడూ భయపడలేదు అపరిగ్రహానికి కట్టుబడిన వాడను భవిష్యత్తును గూర్చిన కోరికలు గాని, భయాలు గాని నాకు లేవు "

## మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకాశం

1946 మద్రాసు రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసుకు అత్యధిక మెజారిటి వచ్చింది రాజాజీని ముఖ్యమంత్రిని చేయాలన్న ఉద్దేశ్యంతో నాయకత్వం కోసం పోటీ పడవద్దని గాంధీజీ ప్రకాశానికి చెప్పాడు అయితే ప్రకాశం గాంధీ మాటను లెక్కపెట్టక పోటీ చేసి గెలుపొందాడు 1946 ఏప్రిల్ 29న ప్రకాశం ముఖ్యమంత్రి పదవిని స్వీకరించాడు ప్రకాశం మంత్రివర్గం 11 నెలల పాటు మాత్రం అధికారంలో కొనసాగింది ప్రకాశం అధికారంలో ఉండగా ఫిర్కా అభివృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టాడు ఈ పథకమే తర్వాత వచ్చిన సమాజాభివృద్ధి పథకానికి ప్రాతిపదిక అయింది పార్టీలోని కుతంత్రాల వల్ల ప్రకాశం 1947 మార్చి 23న తన పదవికి బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చింది

## 1947–53 మధ్య కాలంలో ప్రకాశం

మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత ప్రకాశం రాజకీయ జీవితం చాల మార్పులకు లోనైంది ప్రకాశం కాంగ్రెసు పార్టీని వదిలిపెట్టి ప్రజా సోషలిస్టు పార్టీలో చేరాడు తర్వాత కొన్నాళ్ళకు కృషిక్ మజ్దూర్ ప్రజాపార్టీలో చేరాడు మరల ఈ పార్టీని వదిలి ప్రజాపార్టీలో చేరాడు. ఈ విధంగా అనేకసార్లు ప్రకాశం పార్టీలు మార్చినా సామాన్య ప్రజానీకం మాత్రం అతన్ని దైవంగా భావించారు

## ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ప్రకాశం

1953 అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్రం అవతరించినపుడు శాసనసభలో కమ్యూనిస్టుల ఆధిక్యత ఉండేది అందువల్ల ప్రకాశం ప్రభుత్వాన్ని ఏర్పాటు

చేయాలని కాంగ్రెసు పార్టీ కోరింది  ఆంధ్ర రాష్ట్ర అవతరణోత్సవాన్ని ప్రారంభిస్తూ నెహ్రూ ఇలా ప్రకటించాడు:

"ఆంధ్ర రాష్ట్ర మంత్రివర్గం ఇప్పుడు పూర్తి ఆంధ్రత్వాన్ని పుణికి పుచ్చుకుంది  దీనికి కారణం ప్రకాశం నాయకత్వం వహించడమే తప్ప కేవలం ఒక పార్టీ ప్రతిష్ఠ మాత్రం కాదు "

కేవలం 13 నెలల పాటు అధికారంలో సాగిన ప్రకాశం మంత్రి వర్గం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ స్థాపన (2 సెప్టెంబరు 1954), నాగార్జున సాగర్ ప్రారంభం, కృష్ణా బ్యారేజీ (ఇప్పటి ప్రకాశం బ్యారేజి) నిర్మాణం వంటి అనేక ఘన విజయాల్ని సాధించింది

మద్యపాన నిషేధ కారణంగా 1954 నవంబరు 6న ప్రకాశం ప్రభుత్వం పడిపోయింది

1955 లో జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రకాశం ఒంగోలు నుండి పోటీ చేసి శాసనసభకు ఎన్నికయ్యాడు  ఆయన 1956 నవంబరు 1న విశాలాంధ్ర అవతరణను చూడగల్గాడు  1957 మే 20న తన 85 వ ఏట ప్రకాశం హైదరాబాదులో మరణించాడు

# 15

# ఆంధ్రప్రదేశ్ అవతరణ

## రాష్ట్రాల పునర్విభజన సంఘం

1953 అక్టోబరులో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తర్వాత భాషా రాష్ట్రాల ఏర్పాటు కోర్కె మరింత బలం పుంజుకుంది దీంతో భారతదేశంలోని రాష్ట్రాల పునర్విభజనను నిష్పక్షపాతంగా పరిశీలించేందుకు రాష్ట్రాల పునర్విభజన సంఘం (States Reorganisation Commission) నియమిస్తున్నట్లు నెహ్రూ 1953 డిశంబరు 22న లోక్‌సభలో ప్రకటించాడు ఈ ప్రకటన వెలువడిన వారానికే సంఘ సభ్యుల పేర్లను గూడ వెల్లడించడం జరిగింది వీరు సయ్యద్ ఫజల్ ఆలీ (అధ్యక్షుడు), హెచ్.ఎన్ కుంజ్రూ, కె ఎం పణిక్కర్

రాష్ట్రాల పునర్విభజన సంఘాన్ని ఏర్పాటు చేసినందుకు ఆంధ్రులు తమ హర్షామోదాన్ని వ్యక్తం చేశారు హైదరాబాదు రాష్ట్ర ప్రజలు తమ రాష్ట్రాన్ని మూడు భాగాలుగ విభజించేందుకు సుముఖులు కావడంతో ఆంధ్రులు ... కలలుగన్న విశాలాంధ్ర ఏర్పాటు కోరిక తొందర్లోనే నిజమౌతుందని విశ్వసించారు ఇదేగాక మైసూరు, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని తెలుగు ప్రాంతాల్ని విశాలాంధ్రలో విలీనం చేస్తారని కూడ ఆంధ్రులు భావించారు

హైదరాబాదు రాష్ట్రాన్ని మూడు భాగాలుగ చేసేందుకు ప్రజలు సుముఖత చూపినా, తెలంగాణా ప్రజల్లో మాత్రం తమ ప్రాంత భవిష్యత్తుపై అభిప్రాయ భేదాలు ఏర్పడ్డాయి హైదరాబాదు రాష్ట్ర రాజధానిగ ఏర్పాటయితే ఆంధ్రలో కలవడానికి కొంతమంది తమ సంసిద్ధతను వ్యక్తం చేసారు మరికొంతమంది

తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగాలని భావించారు కమ్యూనిస్టులు మాత్రం విశాలాంధ్రను ఏర్పాటు చేయాలని మొదటి నుండి కోరుతున్నారు హైదరాబాదు రాష్ట్ర కాంగ్రేసుతో సహా మిగిలిన పార్టీలన్నీ కూడ విశాలాంధ్ర విషయంలో భిన్నాభిప్రాయల్ని వ్యక్తం చేశారు

1948 సెప్టెంబరులో జరిగిన పోలీసు చర్య తర్వాత హైదరాబాదు రాష్ట్రంలో జె ఎన్ చౌదరి నాయకత్వాన మిలిటరీ ప్రభుత్వం ఏర్పడింది 1949లో ఎం కె వెల్లోడి అను ఐ సి ఎస్ అధికారి నాయకత్వాన హైదరాబాదులో పౌరప్రభుత్వం ఏర్పడింది 1950లో రాష్ట్ర కాంగ్రెసుకు చెందిన నలుగురు ప్రతినిధుల్ని మంత్రులుగ నియమించారు పోలీసు చర్య తర్వాత రజాకార్లబాధ తప్పింది కాని కమ్యూనిస్టు ఉద్యమం మాత్రం కొనసాగింది ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు భారత ప్రభుత్వం సైన్యాన్ని పంపవలసి వచ్చింది 1951లో కమ్యూనిస్టులు తమ వైఫల్యాల్ని గుర్తించి ఉద్యమాన్ని విరమించేందుకు అంగీకరించారు దీంతో కమ్యూనిస్టు పార్టీపై విధించిన నిషేధాన్ని ఎత్తివేశారు 1952లో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ తెలంగాణాలో చాలా స్థానాలకు పోటీ చేసింది అయితే రాష్ట్రంలోని మరాఠీ, కన్నడ ప్రాంతాల్లో కాంగ్రెసుకు మంచి మెజారిటి రావడంతో రాష్ట్రకాంగ్రెసు అధికారంలోకి రాగల్గింది తెలంగాణాలో కాంగ్రెసుకు మెజారిటి రాలేదు. అయినప్పటికీ రాష్ట్రంలోని జనాభాలో సగానికిపైగా తెలుగువారు కావడంతో తెలుగువారికే నాయకత్వ బాధ్యతను అప్పజెప్పాలని కాంగ్రెసు అధిష్టాన వర్గం భావించింది దీని ఫలితంగా బి రామకృష్ణారావు ముఖ్యమంత్రి అయ్యాడు

పోలీసు చర్య తర్వాత సర్కారు జిల్లాల్లో విశాలాంధ్ర ఏర్పాటు కోర్కెకు మరింత ఎక్కువగా ప్రచారం లభించింది 1949 నవంబరులో ఎ కాళేశ్వరరావు విజయవాడలో విశాలాంధ్ర మహాసభను ఏర్పాటు చేశాడు మెల్లమెల్లగా తెలంగాణాలో కూడ విశాలాంధ్ర ఏర్పాటుకు మద్దతు పెరగడం ప్రారంభం అయింది. 1949 సంవత్సరాంతంలో భారతదేశ గవర్నరు జనరలు అయిన సి రాజగోపాలచారి హైదరాబాదును సందర్శించి హైదరాబాదు రాష్ట్రం బహు బాషా రాష్ట్రంగా కొనసాగడమే మంచిదని అభిప్రాయపడ్డాడు అయితే ఇక్కడ మనం ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి 1950 జనవరిలో కొత్త రాజ్యాంగం

అమలులో రాకముందే 1949 సంవత్సరాంతం కల్లా ఆంధ్రరాష్ట్రం ఏర్పడునన్న అని తెలుగు ప్రజలు విశ్వసించారు. ఆంధ్ర రాష్ట్రానికి తగినంత అదనపు తెలుగు ప్రాంతాన్ని కలపడం, హైదరాబాదు వంటి నగరాన్ని రాజధానిగ చేయడం ఇష్టం లేకనే రాజగోపాలాచారి హైదరాబాదు రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా తన అభిప్రాయాన్ని వ్యక్తంచేసి ఉంటాడని భావించవచ్చు. ఇటువంటి "అభివృద్ధి నిరోధక ధోరణి"ని గమనించిన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ హైదరాబాదు రాజధానిగ విశాలాంధ్ర ఏర్పాటు కావడం తప్పదనే విశ్వాసాన్ని వ్యక్తపరిచింది.

1951 జూలైలో బెంగుళూరులో జరిగిన అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశంలో కాశేశ్వరరావు విశాలాంధ్ర విషయాన్ని ప్రస్తావించాడు. అయితే నెహ్రూ అనవసరమైన మాటలు మాట్లాడవద్దని కాశేశ్వరరావును వారించాడు. 1952లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రలోను, తెలంగాణాలోను కమ్యూనిస్టులు విజయం సాధించారు. అయితే 1953 అక్టోబరులో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు కాంగ్రెసుకు కృషికార్ లోక్ పార్టీ, ప్రజా సోషలిస్టు పార్టీలు తమ మద్దతును అందించడంతో కమ్యూనిస్టులు అధికారంలోకి రాలేకపోయారు. విశాలాంధ్రలో తమ పార్టీకి అధికారాన్ని స్థాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని భావించి కమ్యూనిస్టులు విశాలాంధ్ర ఉద్యమాన్ని తీవ్రం చేశారు.

రాష్ట్రాల పునర్విభజన సంఘం ఏర్పాటయిన తర్వాత విశాలాంధ్ర ఉద్యమానికి మంచి ఊపు వచ్చింది. వెంటనే ప్రత్యేక తెలంగాణా ఉద్యమం కూడా తలెత్తింది. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడైన కె.వి.రంగారెడ్డి, ఆయన మేనల్లుడైన డా. ఎం. చెన్నారెడ్డి ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. వీరిద్దరు మొదట విశాలాంధ్ర ఉద్యమానికి మద్దతు ఇచ్చిన వారే కావడం విశేషం.

1954 జూన్, జూలైలలో రాష్ట్రాల పునర్విభజన సంఘం హైదరాబాదు నగరాన్ని సందర్శించి వివిధ సంస్థల, వ్యక్తుల అభిప్రాయాన్ని తెలుసుకుని వారి నుండి మహజరులను స్వీకరించింది. 1955 సెప్టెంబరు 30 న విభజన సంఘం తన నివేదికను సమర్పించింది.

హైదరాబాదు రాష్ట్రాన్ని విభజించేందుకు రాష్ట్రంలోను, వెలుపలా ప్రజాభిప్రాయం బలంగా ఉన్నందున రాష్ట్రాన్ని విభజించాలని విభజన సంఘం

అభిప్రాయపడింది ఇదేగాక రెండు వందల సంవత్సరాల నుండి దక్కను ప్రాంతానికి ఒక ప్రత్యేక సంస్కృతి ఏర్పడిందని ఈ సంస్కృతే భారతదేశ ఐక్యతకు మిక్కిలిగ దోహదపడిందనే కారణాల్ని చూపుతూ విభజనను వ్యతిరేకిస్తున్న వారి వాదనల్ని విభజన సంఘం త్రోసిపుచ్చింది రాష్ట్ర ఐక్యతలాగే హైదరాబాదు రాష్ట్ర సంస్కృతి కూడ పాలకులు విధించిందే గాని మరొకటి కాదని విభజన సంఘం అభిప్రాయపడింది హైదరాబాదు రాష్ట్ర విభజనకు సిఫార్సు చేసిన విభజన సంఘం కన్నడ ప్రాంతాల్ని మైసూరు రాష్ట్రంలోను, మరాఠి ప్రాంతాల్ని బొంబాయి రాష్ట్రంలోను కలపాలని ప్రభుత్వానికి సలహా ఇచ్చింది

విశాలాంధ్ర ఏర్పాటు వల్ల కల్గే ప్రయోజనాల్ని విభజన సంఘం ఈ విధంగా వివరించింది:

"ప్రస్తుత ఆంధ్ర రాష్ట్రంలో తెలంగాణా విలీనం అయినట్లయితే 32 మిలియన్ల జనాభాతో పాటు విలువైన ముడిసరుకులు, కావలసినంత ఖనిజ సంపద, ఎక్కువ జల, విద్యుత్ వనరులు గల్గిన భూభాగంతో ఒక పెద్ద రాష్ట్రం ఏర్పాటవుతుంది. దీనివల్ల ఆంధ్రరాష్ట్ర రాజధాని సమస్య కూడ పరిష్కారమౌతుంది విశాలాంధ్ర రాజధానిగ జంటనగరాలైన హైదరాబాదు, సికిందరాబాదు చక్కగ సరిపోతాయి"

విశాలాంధ్ర ఏర్పాటువల్ల కృష్ణా-గోదావరి నదీ జలాల వినియోగం ఒకే అధికారంలోకి వస్తుంది భారత దేశంలోని మిక్కిలి ప్రయోజనాత్మక ప్రాజెక్టుల్లో కృష్ణా, గోదావరి ప్రాజెక్టులు అత్యున్నతమైనవి వివిధ సాంకేతిక, పాలనాపరమైన కారణాల వల్ల జరిగిన సుదీర్ఘకాలహరణం తర్వాత ఈ ప్రాజెక్టులు డెల్టా ప్రాంతంలో రూపుదిద్దుకున్నాయి అయితే కృష్ణా-గోదావరి లోయల పూర్తి ఏకీకరణ అసాధ్యమనే చెప్పాలి తెలంగాణాకున్న ప్రత్యేక రాజకీయాధికారాన్ని తీసివేయగల్గితే ఈ నదీ ముఖద్వారాలలో ఉన్న తూర్పు ప్రాంతాలకు అభివృద్ధి పథకాల్ని రూపొందించడానికి, అమలు పరచడానికి గొప్ప అవకాశాలు ఉంటాయి. విశాలాంధ్రలో భాగంగా తెలంగాణా ప్రాంతం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రయోజనాల్ని పొందుతుంది కాబట్టి తెలంగాణాను ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు

ఆంధ్రరాష్ట్రం, తెలంగాణా ప్రాంతాలకు గలిగే పరస్పర ప్రయోజనాలు కూడ ముఖ్యమైనవనే చెప్పాలి కరువు కాటకాది ఉపద్రవాలు ఏర్పడినపుడు తెలంగాణాలో ఆహార కొరత ఉంటుంది అయితే ఆంధ్రరాష్ట్రంలో ఎప్పుడూ అధిక ఆహారోత్పత్తికి వీలుంటుంది కాబట్టి మిగులు ఉత్పత్తిని తెలంగాణా ప్రాంతానికి వాడుకోవచ్చు ఇదే విధంగా ఆంధ్ర రాష్ట్రంలో బొగ్గు నిక్షేపాలు లేవు వీటిని తెంగాణాలోని సింగరేణి నుండి ఆంధ్రరాష్ట్రానికి చేరవేయవచ్చు ఇదేగాక ఆంధ్రరాష్ట్రంలో కలిసినట్లయితే తెలంగాణాకు పరిపాలనా సంబంధమైన వ్యయం కూడ ఉండదు

ఆంధ్రరాష్ట్రంలోను, తెలంగాణాలోను చాల మంది ప్రజలు, ప్రజా సంస్థలు చాలా కాలం నుండి విశాలాంధ్ర ఏర్పాటును మిక్కిలి ఆశతో నిరీక్షిస్తున్నారు తద్విరుద్ధమైన బలమైన కారణాలు లేనప్పుడు విశాలాంధ్ర ఏర్పాటును పరిశీలించవచ్చు "

తెలంగాణా విషయమై విభజన సంఘం ఈ క్రింది అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది:

" ఈ విధంగా విశాలాంధ్ర ఏర్పాటుకు అనుకూలంగా సాగిన వాదన చాల సమంజసంగా ఉంది అయితే ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న విషయాల్ని కూడ అంత సులభంగా కొట్టి పారేయలేము ఇప్పటి ఆంధ్రరాష్ట్రం ఆవిర్భవించింది మొదలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతోంది తెలంగాణాతో పోల్చినపుడు ఆంధ్ర రాష్ట్రంలో సగటు ఆదాయం చాల తక్కువ అందువల్ల తెలంగాణాకు ఆర్థిక ఇబ్బందులు ఎదరయ్యే అవకాశం చాల తక్కువ ఈ తేడాను తెలంగాణాలోని అత్యధిక భూమి శిస్తున్నూ, సంవత్సరానికి 5 కోట్ల ఎక్సైజు రాబడిన్నీ మనకు స్పష్టం చేస్తుంది. ఏది ఏమైన ప్పటికి విలీనం అంటూ జరిగితే తెలంగాణా ప్రాంతంలో అభివృద్ధి పథకాలకు ఉద్దేశించబడిన నిర్ణీతమైన ఆదాయాన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రరాష్ట్రంతో పంచుకోవాల్సి వస్తుందన్న భయం తెలంగాణా నాయకుల్లో ఉన్నట్లు తెలుస్తున్నది. తెలంగాణాను అభివృద్ధి చెందిన ప్రాంతంగా పరిగణించడం వల్ల పాలనా పరంగా చూసినా విలీనం తెలంగాణాకు ఎటువంటి ప్రయోజనాల్ని చేకూర్చదనే భావం చోటు చేసుకుంది

విశాలాంధ్రలో అభివృద్ధి పథకాల రూపకల్పనలో తమ ప్రాంతానికి తగినంత ప్రాధాన్యత లభించకపోవచ్చుననే భయం తెలంగాణా ప్రాంతీయులకు ఉంది తెలంగాణాయే గాక దేశం మొత్తం మీద చేపట్టిన ప్రాజెక్టుల్లో నందికొండ, కుష్టాపురం (గోదావరి) ప్రాజెక్టులు ముఖ్యమైనవి అయితే కోస్తాలోని డెల్టా ప్రాంతాలకు కూడ ఈ నదుల నీటిని వినియోగించే ప్రతిపాదన ఉంది అందువల్ల కృష్ణా, గోదావరి నదుల నీటిని వినియోగించుకోవడంలో తమకున్న స్వతంత్ర హక్కుల్ని వదులుకోవడానికి తెలంగాణా ఇష్టపడలేదు

విశాలాంధ్రను వ్యతిరేకించడంలో మరో ముఖ్యమైన కారణం కూడ ఉంది అభివృద్ధి చెందిన తీరాంధ్ర ప్రజలు విద్యా విషయంలో బాగా వెనుకబడిన తెలంగాణా ప్రజల్ని అన్ని రకాల దోపిడీకి గురిచేయవచ్చు హైదరాబాదు రాష్ట్రం తప్ప మిగిలిన తెలంగాణా జిల్లాల్లో విద్యాభివృద్ధి ఏ మాత్రమూ జరగలేదు అందువల్ల ఆంధ్ర ప్రజల కంటె తక్కువ చదువు ఉన్నప్పటికీ తెలంగాణా ప్రజలకు ఉద్యోగాలు దొరకుతాయి ఒకవేళ ఆంధ్ర రాష్ట్రంలో విలీనం అయితే ఆ రాష్ట్ర ప్రజలు విద్యావిషయంలో ఎక్కువ అభివృద్ధి చెంది యుండడంతో అన్ని ప్రయోజనాలు ఎక్కువ అర్హతలున్న వారికే దక్కుతాయని, దీంతో తెలంగాణా ప్రాంతం ఆంధ్రుల వలస రాజ్యంగ తయారవుతుందని వారు భయపడ్డారు

విశాలాంధ్ర, తెలంగాణా విషయాల్ని పరిశీలించిన తర్వాత "విశాలాంధ్ర ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు స్పష్టమైనవి కావడం వల్ల దీనిని సాధించేందుకు ఎటువంటి ఆటంకం కల్పించకూడదు " అని విభజన సంఘం అభిప్రాయపడింది

విభజన సంఘం చివరగా ఈ విధంగా అభిప్రాయపడింది:

"ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతానికి తెలంగాణా ప్రాంతాన్ని ఒక ప్రత్యేక రాష్ట్రంగ ఏర్పాటు చేసి దానికి హైదరాబాదు రాష్ట్రంగ పేరు పెట్టవచ్చు తరువాత 1961లో జరగబోయే ఎన్నికల ద్వారా ఏర్పడబోయే హైదరాబాదు రాష్ట్ర అసెంబ్లీలో 2/3 వంతు మెజారిటి సభ్యులు విలీనానికి ఒప్పుకుంటే విశాలాంధ్రను ఏర్పాటు చేసుకోవచ్చు. క్రింద పేర్కొన్న జిల్లాల్ని కలిపి హైదరాబాదు రాష్ట్రంగ ఏర్పాటు చేయవచ్చు

అవి 1 మహబూబ్ నగర్ 2. నల్గొండ 3. వరంగంల్ 4 ఖమ్మం 5. కరీంనగర్ 6 ఆదిలాబాద్ 7. నిజామాబాదు 8 హైదరాబాదు 9 మెదక్ 10 బీదర్

దీంతోపాటు ప్రస్తుత ఆంధ్ర రాష్ట్రంలోని కృష్ణాజిల్లాకు చెందిన మునగల జమీందారీని కూడ హైదరాబాదు రాష్ట్రంలో కలపవచ్చు (ఈ మునగల జమీందారీ నల్గొండ జిల్లాలోనిదైనా ఇది మొదటి నుండి ఆంధ్ర రాష్ట్రంలో భాగంగా ఉండేది )"

## పెద్దమనుష్యుల ఒప్పందం ( Gentlmen's Agreement)

రాష్ట్రాల పునర్విభజన సంఘం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేయడం ఇటు తెలంగాణా వాదుల్లోను, అటు విశాలాంధ్ర వాదుల్లోను తీవ్రమైన చర్చనీయాంశమైనది. ఈ విషయమై రాజీనామా చేసి మరల ఎన్నికల్లో పాల్గొనెందుకు సిద్ధంగా ఉన్నామని కమ్యూనిస్టులు ప్రకటించారు. తెలంగాణా కాంగ్రెసు నాయకులు కూడ కమ్యూనిస్టులతో గొంతు కలిపారు. రాష్ట్రాల పునర్విభజన సంఘం సిఫార్సులను కె.వి రంగారెడ్డి, ఎం.చెన్నారెడ్డి వంటి వారు అభినందించారు. అయితే తెలంగాణా కాంగ్రెసు శాసనసభ సభ్యుల్లోని అత్యధికులు, పది జిల్లా కాంగ్రెసు కమిటీల్లో ఏడు కమిటీలు విశాలాంధ్ర ఏర్పాటుకుతమ సుముఖతను వ్యక్తం చేశాయి హైదరాబాదు శాసనసభలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినపుడు సభలోని 174 మందిలో 147 మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు వీరిలో 103 మంది విశాలాంధ్రకు మద్దతు తెలపగా, 29 మంది మాత్రం ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేయాలని కోరారు. మిగిలిన 15 మంది తటస్థంగా ఉండిపోయారు. ఆంధ్ర రాష్ట్రంలోని నాయకులందరూ విశాలాంధ్ర ఏర్పాటుకు తమ సుముఖతను వ్యక్తం చేశారు. ఒక్క రంగా మాత్రం ఆ సమయంలో కాక అంతకుముందు ఎప్పుడో తన వ్యతిరేకతను తెలిపాడు.

విభజన సంఘం సిఫార్సుల్ని ప్రజలు సర్వత్రా ఆమోదించలేకపోయారు. కేరళ, మైసూరు రాష్ట్రాల ప్రజలు తప్ప మిగిలిన అన్ని ప్రాంతాల ప్రజలకు ఈ సిఫార్సులు ఆమోదయోగ్యంగా కనుపించలేదు. దేశంలోని చాల ప్రాంతాల్లో ప్రజలు హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు భాషా రాష్ట్రాలను ఏర్పాటు చేసే

తీరుపై చాలమంది తమ సందేహాల్ని వ్యక్తం చేశారు తమ రాష్ట్రాల్ని ఒకటిగా చేసి ద్విభాషా రాష్ట్రంగా రూపొందించాలని పశ్చిమబెంగాలు, బీహారు ముఖ్యమంత్రులు ప్రభుత్వానికి సలహా ఇచ్చారు చాలామంది ఈ సలహా దేశ ఐక్యతకు ద్రోహం చేస్తుందని అభివర్ణిస్తూ పై రాష్ట్రాల ముఖ్యమంత్రుల్ని అభినందించారు దక్షిణ భారతదేశంలోని సి రాజగోపాలచారి మద్రాసు, మైసూరు, కేరళ రాష్ట్రాల్నికలిపి దక్షిణ ప్రదేశ్‌గా ఏర్పాటు చేయాలని తన అభిప్రాయాన్ని ప్రకటించాడు ఈ సలహాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో మరిన్ని హింసాత్మ సంఘటనలు జరగడానికి దోహదపడ్డాయి దీంతో కాంగ్రెసు అధిష్టాన వర్గం వెనుకకు తగ్గి ద్విభాషా, బహుభాషా రాష్ట్రాల ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకున్నది

చివరకు విశాలాంధ్ర ఏర్పాటుకు కాంగ్రెసు అదిష్టాన వర్గం ఒప్పుకుంది హైదరాబాదు రాష్ట్ర ప్రజలు విశాలాంధ్ర ఏర్పాటుకు సుముఖంగా ఉండడం కూడ కాంగ్రెసు అదిష్టానవర్గాన్ని పాక్షికంగా ప్రభావితం చేసిందని చెప్పవచ్చు అయితే కె.వి రంగారెడ్డి, ఎం.చెన్నారెడ్డి వంటి ప్రత్యేక తెలంగాణా వాదులు తమ నిర్ణయాన్ని మార్చుకోలేదు అందువల్ల ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల మధ్య గల అభిప్రాయ భేదాల్ని తొలగించాలని కాంగ్రెసు అధిష్టానవర్గం భావించింది దీని ఫలితంగానే 1956 ఫిబ్రవరి 20న కాంగ్రెసు అదిష్టానవర్గం రెండు ప్రాంతాల నాయకుల్ని ఢిల్లీలో సమావేశపరిచింది.

ఆంధ్రప్రాంతానికి బి గోపాలరెడ్డి (ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి) ఎన్.సంజీవరెడ్డి, జి లచ్చన్న (మంత్రులు), ఎ సత్యనారాయణరాజు (ఆంధ్ర కాంగ్రేసు కమిటి అధ్యక్షుడు) ప్రాతినిధ్యం వహించగా తెలంగాణా ప్రాంతానికి బి రామకృష్ణారావు (హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి) కె వి రంగారెడ్డి, ఎం.చెన్నారెడ్డి (మంత్రులు), జె వి నరసింగరావు (హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు) ప్రాతినిధ్యం వహించారు ఈ సమావేశ ఫలితంగా విశాలాంధ్ర ఏర్పాటుకు ఒక ఒప్పందం కుదిరింది ఈ ఒప్పందంలో తెలంగాణా ప్రాంతానికి కొన్ని రక్షణలు కల్పించారు

సమావేశానికి హాజరయిన 8 మంది సభ్యులు ఒప్పందంపై సంతకాలు చేశారు దీనినే 'పెద్ద మనుషుల ఒప్పందం'గా వ్యవహరించారు అయితే ఈ

ఒడంబడిక్పై సంతకం పెట్టిన నాయకులందరూ కూడ కాంగ్రెసు నాయకులు కావడం విశేషం ఇతర పార్టీ నాయకులకు ఈ ఒప్పందంలో ప్రవేశం లేకపోయింది

## ఒప్పందపు నిబంధనలు

1 రాష్ట్ర ప్రభుత్వపు ముఖ్య, సాధారణ పరిపాలనా విభాగాలపై అయ్యే ఖర్చు తగు నిష్పత్తిలో రెండు ప్రాంతాలు భరించాలి తెలంగాణా ప్రాంతం నుండి వచ్చే మిగులు ఆదాయాన్ని ఆ ప్రాంతపు అభివృద్ధికే కేటాయించాలి ఈ నిబంధనను అయిదేళ్ల తర్వాత సమీక్షించి అసెంబ్లీలోని తెలంగాణా శాసనసభ్యులు కోరిన పక్షంలో మరల అయిదేళ్ళపాటు వర్తింపచేయాలి

2 తెలంగాణాలో మద్యపాన నిషేధాన్ని అసెంబ్లీలోని తెలంగాణా శాసన సభ్యులు కోరిన విధంగా అమలు చేయాలి

3 తెలంగాణాలో ప్రస్తుతం అమలులో ఉన్న విద్యా సౌకర్యాలన్నీ తెలంగాణా విద్యార్థులందరికి వర్తింపజేసి మరింతగా అభివృద్ధి చేయాలి తెలంగాణాలోని సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశం తెలంగాణా విద్యార్థులకే పరిమితం చేయాలి లేకపోతే రాష్ట్రం మొత్తం మీద 1/3 వంతు సీట్లను తెలంగాణా విద్యార్థులకు ప్రత్యేకంగా కేటాయించాలి అయితే ఈ రెండింటిలో తెలంగాణా వారికి ఏది ప్రయోజనమైతే దానినే ఎంచుకోవచ్చు

4 విశాలాంధ్రను ఏర్పాటు చేసినపుడు ఎక్కువైన ఉద్యోగుల్ని తీసివేయాల్సి వచ్చినపుడు ఆయా ప్రాంతాలకు తగిన నిష్పత్తిలోనే జరగాలి

5 ఉద్యోగ నియామకాల్లో మాత్రం ఆయా ప్రాంతాల జనాభాను ప్రాతిపదికగా తీసుకోవాలి

6 తెలంగాణాలోని సాధారణ పరిపాలన, న్యాయవిభాగాల్లో ఉర్దూ భాషకున్న ప్రస్తుత స్థానాన్ని మరో అయిదేళ్ళపాటు కొనసాగించాలి అయిదు సంవత్సరాల తర్వాత ప్రాంతీయ మండలి (Regional Council) పరిస్థితిని సమీక్షిస్తుంది ఉద్యోగ నియామకాలకు తెలుగు భాషా పరిజ్ఞానం తప్పనిసరి అనే నిబంధనను పెట్టకూడదు అయితే ఉద్యోగంలో చేరిన రెండేళ్ళకు ఉద్యోగులు నిర్వహించే తెలుగు పరీక్షలో తప్పక ఉత్తీర్ణుడు కావాలి.

7 తెలంగాణా ప్రాంతంలోని ఉద్యోగాల్లో చేరేందుకు 12 సంవత్సరాలు స్థానికుడై ఉండాలనే నిబంధన వంటి కొన్ని నియమాల్నికూడ రూపొందించాలి

8 తెలంగాణా ప్రాతంలోని వ్యవసాయిక భూముల అమ్మకం ప్రాంతీయ మండలి అధికార పరిధిలో ఉండాలి

9 తెలంగాణా ప్రాంతపు బహు ముఖాభివృద్ధికై ఒక ప్రాంతీయ మండలిని ఏర్పాటు చేయాలి

10 ప్రాంతీయ మండలిలో 20 మంది సభ్యులుండాలి వీరిలో 9 మంది అసెంబ్లీ సభ్యులై ఉండాలి వీరిని జిల్లాకు ఒక్కరు చొప్పున ఆయా జిల్లాల సభ్యులు ఎన్నుకుంటారు మరల 6 మంది సభ్యుల్ని అసెంబ్లీ నుండి గాని, పార్లమెంటు నుండి గాని తెలంగాణా అసెంబ్లీ సభ్యులు ఎన్నుకుంటారు మరో 5 మంది సభ్యులు బయటివారై ఉంటారు వీరిని తెలంగాణావారే ఎన్నుకుంటారు

11 ప్రాంతీయ మండలి ఈ క్రింది విషయాల్లో నిర్ణయాధికారాన్ని కల్గి ఒక చట్టబద్ధమైన సంస్థగ రూపొందాలి

(ఎ) తెలంగాణా ప్రాంతానికి సంబంధించినంతవరకు పై విషయాలతో పాటు సాధారణ ప్రణాళికలోని ప్రణాళిక, అభివృద్ధి విషయాలు, ఉద్యోగ నియామకాలపై అదుపును కలిగి ఉంటుంది

(బి) ఈ ఒప్పందాన్ని ముందుగానే సవరించితే తప్ప పదేళ్ళ తర్వాత సమీక్షించాలి

12 క్యాబినెట్ మంత్రుల నియామకం 60 40 నిష్పత్తిలో జరగాలి తెలంగాణాకు చెందిన మంత్రుల్లో ఒకరు ముస్లిం అయిఉండాలి

13 ముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతం వాడయితే, ఉప ముఖ్యమంత్రి తెలంగాణా ప్రాంతానికి చెందిన వాడై ఉండాలి ఒకవేళ ముఖ్యమంత్రి తెలంగాణా ప్రాంతానికి చెందిన వ్యక్తి అయితే ఉప ముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతానికి చెందినవాడై ఉండాలి హోంశాఖ, ఆర్థికశాఖ, రెవెన్యూ శాఖ ప్రణాళిక మరియు అభివృద్ధి శాఖ, వాణిజ్యము మరియు పరిశ్రమ శాఖా – వీటిల్లో ఏదేని రెండు శాఖలు తెలంగాణావారికి అప్పగించాలి

14 తెలంగాణాకు 1962 వరకు ప్రత్యేక కాంగ్రెసు కమిటి కావాలని హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు కోరాడు ఇందుకు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు కూడ తన ఆమోదాన్ని తెలిపాడు

పై విషయాన్ని బట్టి తెలంగాణా ప్రజల న్యాయమైన కోర్కెలు తీర్చడంలో ఆంధ్ర నాయకులు ఒకడుగు ముందే ఉన్నారని చెప్పవచ్చు రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఈ 'పెద్ద మనుషుల' ఒప్పందానికి స్థానం కల్పించి భారత ప్రభుత్వం చట్టబద్దమైన మద్దతు నిచ్చింది ముసాయిదా బిల్లులో కొత్త రాష్ట్రానికి 'ఆంధ్ర-తెలంగాణా' అని పేరు పెట్టారు అయితే ఈ పేరులో రెండు ప్రాంతాల మధ్య భేదం స్పష్టంగా కన్పిస్తున్నదని ఆంధ్రనాయకులు ఆక్షేపణ తెలియచేయడంతో జాయింటు సెలెక్టు కమిటి 'ఆంధ్రప్రదేశ్'గ మార్చింది

1956 నవంబరు 1న నెహ్రూ కొత్త రాష్ట్రానికి ప్రారంభోత్సవం చేశాడు సంజీవరెడ్డి మొదటి ముఖ్యమంత్రి కాగా సి ఎం త్రివేది మొదటి గవర్నరుగ నియమితులయ్యారు

## ఆంధ్రప్రదేశ్ హద్దులు

ఒరిస్సా, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లోని తెలుగు ప్రాంతాలపై ఆంధ్ర రాష్ట్రం తన హక్కులను ప్రకటించింది ఇదేవిధంగా పై రాష్ట్రాలు కూడ ఆంధ్రరాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలపై వాటి హక్కులను తెలియజేశాయి

## ఆంధ్ర – ఒరిస్సా

1936లో ఒరిస్సా రాష్ట్రం ఏర్పడినపుడు గంజాం, విశాఖపట్నం జిల్లాల్లోని తెలుగు మెజారిటి ఉన్న ప్రాంతాల్ని ఒరిస్సా రాష్ట్రంలో కలపడం జరిగింది. అప్పటి నుండి ఈ ప్రాంతాల్లోని ఆంధ్రులు ఒరిస్సాలో తమకు తగినంత ప్రాధాన్యత లభించదని భావించి తమ తమ ప్రాంతాల్ని ఆంధ్ర రాష్ట్రంలో కలపాలని ఆందోళన చేస్తూ వచ్చారు ఈ విషయాన్నే దార్ కమీషను గుర్తించి ఈ విధంగా అభిప్రాయపడింది:

"ఒకటి మాత్రం నిజం. ఒరిస్సా రాష్ట్రంలో విలీనం చేయబడ్డ తెలుగు ప్రాంతాల్లోని ప్రజలు చాల అసంతృప్తితో ఉన్నారు వీరి పరిస్థితిని భాషా రాష్ట్రాలు పెంచి పోషించే అసహనానికి, వారి హృదయాల్లో చోటు చేసుకున్న భయాలకు చక్కటి ఉదాహరణగ భావించవచ్చు."

గంజాం జిల్లాకు సంబంధించినంతవరకు ఆంధ్రులు 1 బంగాళాఖాతంను అనుసరించి ఉన్న సుమారు 40 మైళ్ళ పొడవు, 10 లేక 15 మైళ్ళ వెడల్పుతో ఉన్న తీర ప్రదేశాన్ని 2. పర్లకిమిడి పట్టణంతో పాటు, పర్లకిమిడి సంస్థానం లోని మైదాన ప్రాంతాన్ని తమదిగ భావించారు. ఒరిస్సాలోని కొన్ని ప్రాంతాలతో తమకు వ్యాపార సంబంధాలు ఉండడం వల్ల కొరాపుట్ జిల్లా మొత్తాన్ని తమపరం చేయాలని ఆంధ్రులు కోరారు అయితే కొరాపుట్ జిల్లా విషయంలో మాత్రం విభజన సంఘం ఆంధ్రుల వాదనను త్రోసి పుచ్చడమే కాక ఇంకా ఇలా అభిప్రాయపడింది "కొరాపుట్ జిల్లాలో ఒరియా మెజారిటి పూర్తిగ ఉందనేది స్పష్టం అందువల్ల దీన్ని ఆంధ్రప్రాంతమని చెప్పడానికి ఎటువంటి ఆధారమూ లేదు. ప్రస్తుత పరిస్థితిని మార్పు చేయాల్సిన స్థాయిలో వ్యాపార సంబంధాలు కూడ లేవు."

గంజాం జిల్లా విషయంలో కూడ ఆంధ్రుల వాదనను త్రోసి పుచ్చుతూ విభజన సంఘం ఇలా అభిప్రాయ పడింది:

"పర్లకిమిడి కొండ ప్రాంతాలతో పాటు పర్లకిమిడి సంస్థానాన్ని అంతటినీ ఒరిస్సా రాష్ట్రంలో విలీనం చేసినపుడే పూర్తిగ సమీక్షించడం జరిగింది. ఈ విలీనం పర్లకిమిడి జమీందారు తాను ఒరిస్సా రాష్ట్రంలోనే ఉండాలనే కోరికకు అనుగుణంగా జరిగినా, భాషా ప్రాతిపదికపై కూడ సమర్థించదగిందేనని భావించడం జరిగింది. అదేవిధంగా బరంపురం ప్రాంతాన్ని కూడ పూర్తిగ ఒరియా ప్రభావం గల ప్రాతంగానే గుర్తించడం జరిగింది. అప్పటి నిర్ణయాల్ని తిరిగి పరిశీలించడం, తద్విరుద్ధంగా నిర్ణయించడం సహేతుకమైన చర్య కాదు."

విభజన సంఘం ఇంకా ఇలా అభిప్రాయపడింది: " ఈ రెండు ప్రాంతాలు అంతర్భాగంగా ఉన్న గంజాం జిల్లా అంతటా కూడ ఒరియా భాషను అత్యధికులు వ్యవహరిస్తారు తెలుగు మాట్లాడేవారు కేవలం 15 శాతం మాత్రం ఉన్నారు "

అయితే మనం ఒక విషయం చెప్పుకోవాలి గంజాం జిల్లా మొత్తం తమకు కావాలని ఆంధ్రులు ఎప్పుడూ కోరలేదు తెలుగువారు అత్యధికులుగా ఉన్న బరంపురం, పర్లకిమిడీ తాలూకాల్ని మాత్రం వారు కోరారు 1936 లో ఒరిస్సా రాష్ట్రం ఏర్పడినప్పుడు బరంపురంలో తెలుగువారి మెజారిటి ఉంది దక్షిణ ఒరిస్సా ప్రాంతానికి తగిన ప్రధాన పట్టణం లేదనే మిషతో ఆ ప్రాంతాన్ని ఒరిస్సాలో కలపడం జరిగింది ఇదే విధంగా తెలుగువారు అత్యధికులుగా ఉన్న పర్లకిమిడి ప్రాంతాన్ని పర్లకిమిడి రాజాను సంతృప్తి పరచేందుకే ఒరిస్సాలో కలిపారు ఆంధ్రులు కోరినట్లే ఒరియా ప్రజలు కూడ ఆంధ్ర రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలపై తమ హక్కును తెలియజేశారు శ్రీకాకుళం జిల్లాలోని వంశధార నదివరకు గల ప్రాంతాల్ని తమ రాష్ట్రంలో కలపాలని ఒరియా ప్రజలు కోరారు అయితే శ్రీకాకుళం జిల్లాలో 89 శాతం తెలుగువారుండడం వల్ల విభజన సంఘం ఒరియా ప్రజల కోర్కెను తిరస్కరించింది

## ఆంధ్ర – కర్ణాటక

వివిధ ప్రాంతాల మధ్య తలెత్తిన వివాదాల పరిష్కారంలో ... చేపట్టిన ప్రాదేశికమైన మార్పుకు జిల్లాను ప్రాతిపదికగా చేసుకుంటామని విభజన సంఘం ప్రకటించింది

కర్నాటకలోని కోలారు జిల్లాలో 54 శాతం తెలుగువారుండగా కన్నడిగులు కేవలం 21 శాతం మాత్రమే ఉన్నారు సహజంగానే కోలారు జిల్లాను మైసూరులో యధాతధంగా ఉండేటట్టు విభజన సంఘం సిఫార్సు చేయ వల్సి వచ్చింది

బళ్ళారి విషయంలో మాత్రం విభజన సంఘం ఆంధ్ర ప్రభుత్వ వాదనను అంగీకరించి క్రింది విధంగా సిఫార్సు చేసింది

"రాకపోక సౌకర్యాల్లోను, ఇతర విషయాల్లోను బళ్ళారికి, రాయలసీమకు ఉన్న సన్నిహిత సంబంధం, వర్తక వ్యాపారాల్లో మైసూరు కంటె ఆంధ్రపై బళ్ళారి పట్టణం ఎక్కువగా ఆధారపడి ఉండడం, ఆ తాలూకాలకు మైసూరు కంటె ఆంధ్రరాష్ట్రతోటే ఎక్కువ సన్నిహిత సంబంధాలు ఉండడం దృష్ట్యా చూస్తే ఆంధ్ర ప్రభుత్వ వాదనలో ఎంతో బలం ఉందని భావించవచ్చు ...

150 సంవత్సరాల పాటు బళ్ళారి మిశ్రమ మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండేది ఈ కాలంలోనే బళ్లారి రాయలసీమకు అనధికార రాజధానిగ అభివృద్ధి చెందింది

బళ్ళారి పట్టణం రైలు, రోడ్డు మార్గాల ద్వారా రాయలసీమలోని ప్రధాన పట్టణాలతో కలపబడిఉంది ఇది బెంగుళూరు కంటె కర్నూలుకు చాల సమీపంలో ఉంది బళ్ళారి నుండి రైలుద్వారా బెంగుళూరుకు అతి తక్కువ కాలంలో చేరాలంటే ఆంధ్రప్రాంతంలోని మార్గం గుండానే పోవాలి "

అయితే భారత ప్రభుత్వం విభజన సంఘం సిఫార్సుల్ని మన్నించకుండా బళ్ళారిని మైసూరు రాష్ట్రంలో కలిపింది రెండు విధాల ఆంధ్ర రాష్ట్రానికి నష్టం కలిగింది

## ఆంధ్ర – మధ్యప్రదేశ్

బస్తరు దక్షిణప్రాంతంలో తెలుగువారు అత్యధికులు ఉండడం వల్ల ఆ ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంలో కలపాలని కోరడం జరిగింది ఇదేగాక ఈ ప్రాంతంతో ఆంధ్ర ప్రాంతానికి మంచి వర్తక సంబంధాలు ఉన్నాయి పాలనా పరంగా కూడ ఈ ప్రాంతం మొదట గోదావరి జిల్లాలో ఉండేది అయితే కమీషను ఆంధ్రరాష్ట్ర వాదనను అంగీకరించక ఈ ప్రాంతం మధ్యప్రదేశ్ లోనే కొనసాగాలని సిఫార్సు చేసింది భారత ప్రభుత్వం కూడ ఈ సిఫార్సును అంగీకరించింది చంధా జిల్లాలోని సిరోంచ తాలూకాలో 51 2 శాతం తెలుగువారు ఉన్నప్పటికి ఈ తాలూకాను తెలంగాణాలో విలీనం చేయాలని విభజన సంఘం సిఫార్సు చేయలేదు

## ఆంధ్ర – తమిళనాడు

ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్ర-తమిళనాడు మధ్యగల సరిహద్దు వివాదాల్ని హెచ్ వి పటాస్కర్ మధ్యవర్తిత్వానికి వదిలేశారు ఆయన చిత్తూరు జిల్లాలోని తిరుత్తణి తాలూకాకు చెందిన అత్యధిక ప్రాంతాన్ని తమిళనాడులో విలీనం చేయాలని సిఫార్సు చేశాడు అదే విధంగా తమిళనాడులోని పొన్నేరి, తిరవళ్లూరు తాలూకాల్లో అత్యధిక ప్రాంతాల్ని ఆంధ్రరాష్ట్రంలో విలీనం చేయాలని కోరాడు పటాస్కరు సిఫార్సుల్ని అంగీకరించడం జరిగింది తమిళనాడు నైరుతి

ప్రాంతంలోని ధర్మపురి జిల్లాకు చెందిన హొసూరు తాలూకాలో తెలుగువారు అత్యధికులు ఉండేవారు అయితే ఈ ప్రాంతం భౌగోలికంగా ఆంధ్రప్రాంతానికి సన్నిహితంగా ఉండకపోవడంతో ఆంధ్రరాష్ట్రంలో చేర్చాలని సిఫార్సు చేయలేదు ఈ విధంగా కోలారును పోగొట్టుకున్న ఆంధ్రరాష్ట్రం హొసూరును కూడ వదులుకోవాల్సి వచ్చింది

## 16

# కమ్యూనిస్టు పార్టీలు – హింసాయుత తిరుగుబాట్లు

1945 చివరికల్లా ఆంధ్ర, తెలంగాణాల్లోని కమ్యూనిస్టు పార్టీలు పూర్తిస్థాయి పార్టీలుగ రూపుదిద్దుకున్నాయి ఈ పార్టీలు అట్టడుగు స్థాయి నుండి తమ పలుకుబడిని పెంచుకోగల్గాయి దీనికి తమ పార్టీ అనుబంధ సంస్థలైన రైతు సంఘం (ఆంధ్ర), ఆంధ్రమహాసభ (తెలంగాణా) ఎంతగానో దోహదపడ్డాయి

1944 లో రావినారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన భువనగిరి ఆంధ్రమహాసభ సమావేశంలో నైజాం ఆంధ్ర మహాసభలోనికి కమ్యూనిస్టుల ప్రవేశం ప్రారంభమయింది హైదరాబాదు నగరంలోని విద్యావంతులైన యువతను చైతన్యవంతుల్ని చేసేందుకు మొదట హైదరాబాదులోని యువజన సంస్థయైన 'కామ్రేడ్స్ అసోసియేషన్'ను కమ్యూనిస్టులు చక్కగా వినయోగించుకున్నారు ఇదేగాక తమ కార్యకలాపాల్లో విద్యార్థుల్ని, కార్మికుల్ని పాల్గొనేటట్టు చేయగల్గారు మక్దూం మొహినుద్దీన్, డా॥ రాజబహదూర్‌గౌడ్, సాంబమూర్తి, లింగారెడ్డి, శ్రీనివాసలహోతి వంటి వారు హైదరాబాదులో కార్మిక సంఘాల్ని ఏర్పాటు చేయడంలో తమ పూర్తి కాలాన్ని, శక్తియుక్తుల్ని వినియోగించారు

తెలంగాణా కమ్యూనిస్టుల భవితవ్యాన్ని తీర్చిదిద్దుతున్న ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ తెలంగాణాలో భూస్వామ్య వ్యవస్థాపరంగా ఉత్పన్నమైన అనేక లొసుగులకు ఆలవాలమైన గ్రామాలపై తమ దృష్టి కేంద్రీకరించినట్లయితే పార్టీ పటిష్టంగా రూపొందగల్గుతుందని గ్రహించగల్గింది అందువల్ల నైజాం ఆంధ్రమహాసభలోని

కమ్యూనిస్టు భావాలు గల కార్యకర్తలకు చక్కటి శిక్షణ నిచ్చేందుకు నిర్మాణ దక్షత గల ఎన్.వి.కె ప్రసాదును పంపింది. కమ్యూనిస్టు భావాలు కల్గి ఆంధ్రమహాసభలో ప్రముఖ సభ్యులుగ చెలామణి అవుతున్న రావినారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, వి ఆళ్వార్ స్వామి, దేవులపల్లి వెంకటేశ్వరరావు వంటి వారు ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులైన పి సుందరయ్య, చంద్రరాజేశ్వరరావు, ఎం.బసవపున్నయ్య వంటి వారితో సన్నిహిత సంబంధాల్ని ఏర్పరచుకున్నారు

హైదరాబాదు రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ 1939లో అవతరించింది ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ నాయకుడైన చంద్ర రాజేశ్వరరావు తెలంగాణాలో రాజకీయ శిక్షణా పాఠశాలను నిర్వహించడమే కాక భువనగిరి ఆంధ్ర మహాసభకు హాజరయ్యాడు. తెలంగాణా రైతుల్ని ఆంధ్ర మహాసభ కార్యకలాపాల్లో పాల్గొనేటట్టు చేసేందుకు తగిన పథకాల్ని రూపొందించాడు. ఈ పథకాల్ని రూపొందించడంలో బలవంతపు లెవీ ధాన్యపు వసూళ్లలో ఉత్పన్నమైన సమస్యల్ని ప్రాతిపదిక చేసుకున్నాడు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఆహార కొరతను నివారించేందుకు రైతుల నుండి బలవంతంగా లెవీ ధాన్యాన్ని వసూలు చేయాలని హైదరాబాదు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది ఈ లెవీ పద్ధతిలో ప్రతి రైతు కూడ తాను పండించిన వరి ధాన్యంలో కొంత భాగాన్ని ప్రభుత్వం నిర్ణయించిన రేటుకే ప్రభుత్వానికి అమ్మాలి. అయితే పెద్ద పెద్ద జాగీరుదార్లు మాత్రం తమ అధికారంతోను, పలుకుబడితోను లెవినుండి తప్పించుకోగల్గారు. దీంతో చిన్న రైతులు మాత్రం ఈ పద్ధతికి బలికావడంతో ఎన్నో రకాల దుష్పలితాలు ఎదురయ్యాయి తమ స్వంత ఖర్చుతోనే ప్రభుత్వ మార్కెటు యార్డుల వద్దకు రైతులు ధాన్యాన్ని తీసుకురావాలని అధికారులు ఒత్తిడి తెచ్చారు ధాన్యాన్ని తూకం వేయడంలోను, డబ్బుల్ని ఇవ్వడంలోను అధికారులు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో కమ్యూనిస్టులు గ్రామాల్లోని రైతుల సాధక బాధకాల్ని, బియ్యం తదితర అత్యవసర వస్తువులకు పట్టణాల్లోని మధ్య తరగతి ప్రజలు పడే ఇబ్బందుల్ని వెలుగులోకి తెచ్చారు. కమ్యూనిస్టులు తమ సాంస్కృతిక సంస్థయైన ప్రజానాట్యమండలి ద్వారా బుర్రకథ వంటి పాతకాలపు సాంస్కృతిక కార్యక్రమాల్ని పునఃప్రారంభించారు. గ్రామాల్లోను, పట్టణాల్లోను విశేషంగా ఆదరింప బడుతున్న ఈ బుర్రకథల ద్వారా కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాల్ని ప్రచారం చేయడంలో సఫలీకృతులయ్యారు.

1944లో జరిగిన భువనగిరి సమావేశం తర్వాత వరంగల్లు జిల్లాలోని చాలగ్రామాల్లో ఆంధ్రమహాసభ శాఖల్ని ఏర్పాటు చేశారు ఈ శాఖల్నే సంఘాలని వ్యవహరించేవారు జనగామ తాలూకాలో 10 వేల ఎకరాలపైగా భూమిని కల్గి ఉన్న స్థానిక భూస్వామి విసునూరి రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా రైతుల్ని కూడగట్టి ఆందోళన జరపడంలో ఆంధ్రమహాసభ సభ్యుడైన ఆరుట్ల రామచంద్రారెడ్డి కృతకృత్యుడయ్యాడు భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన రైతు ఉద్యమానికి ఇది ప్రారంభం మాత్రమే తర్వాత 1946-1951 మధ్యకాలంలో ఈ రైతు ఉద్యమమే తెలంగాణా సాయుధ పోరాటంగా పరిణమించింది

1946 జూలై 4న ఆంధ్రమహాసభ కార్యకర్తలకు, విసునూరి రామచంద్రారెడ్డి గుండాలకు మధ్య తీవ్రమైన కొట్లాట జరిగింది ఈ కొట్లాటలో విసునూరి గూండాలు దొడ్డిమల్లయ్య, మంగలి కొమరయ్య అను ఇద్దరు రైతుల్ని కాల్చి చంపారు కమ్యూనిస్టులు హింసకు హింసతోటే జవాబు చెప్పారు ఈ సంఘటన ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు పార్టీల హింసాయుత తిరుగుబాట్లకు నాంది పల్కింది.

కొమరయ్య మరణం తెలంగాణా రైతుల్లోని ఆవేశాన్ని రగుల్కొల్పింది జాగీర్దారులకు, దేశ్ముఖ్ లకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు జనగామలో తలెత్తిన తిరుగుబాటు నల్గొండ జిల్లాలోని భువనగిరి, సూర్యాపేట, రామన్నపేట, హుజూర్ నగర్ తాలూకాలకు వ్యాపించింది ఈ ఉద్యమం యొక్క తీవ్రతకు భూస్వాములతోపాటు నైజాం ప్రభుత్వం కూడా కలవరపడింది. ఈ సమయం (జూలై 1946) భారతదేశానికి స్వాతంత్ర్యం రాబోవు సమయం కూడ కావడంతో నైజాం ప్రభుత్వం తన దృష్టిని ఇతర విషయాలపై కేంద్రీకరించింది. హైదరాబాదు రాష్ట్రాన్ని ఒక స్వతంత్ర రాజ్యంగా ప్రకటించి భారతదేశం మధ్య భాగంలో ఒక బలవత్తరమైన ముస్లిం రాజ్యాన్ని స్థాపించాలని నైజాం ప్రభుత్వం పథకాలు వేయడం ప్రాంభించింది. అందువల్ల సహజంగానే రాష్ట్రంలోని గ్రామాల్లో తలెత్తుతున్న తిరుగుబాట్లు గురించి నైజాం ప్రభుత్వం పట్టించుకోలేదు ఈ పరిస్థితుల్ని కమ్యూనిస్టులు తమ స్వప్రయోజనాలకోసం చక్కగ వినియోగించుకున్నారు రైతుల సమస్యల్ని చేపట్టి కమ్యూనిస్టులు గ్రామాలలో

బాగా ప్రసిద్ధి చెందారు దీనికి తగ్గట్టు గ్రామాలలోని ప్రజలందరు హిందువులు కావడంతో వీరిని కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాల వైపు సులభంగా ఆకర్షించగల్గారు రక్షణ కోసం నైజాం ప్రభుత్వాన్ని ఆశ్రయించిన దేశ్‌ముఖ్‌లను ప్రజాద్రోహులుగను, ప్రభుత్వ తొత్తులుగాను, ప్రజలు భావించారు దీంతో కమ్యూనిస్టులు భూమిలేని రైతులకే గాక మొత్తం హిందూ సమాజానికే రక్షకులుగ మారిపోయారు

ఆకునూరు, మాచిరెడ్డిపల్లి గ్రామాల్లో దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా తెలంగాణా రైతాంగం సాగించిన ఉద్యమం మహాత్మాగాంధీ వంటి దేశనాయకుల దృష్టిని సైతం ఆకర్షించింది ఈ సంఘటనల్ని పరిశీలించి వివరమైన నివేదికల్ని తయారు చేయమని గాంధీజీ పద్మజా నాయుడిని కోరారు

## దళాల ఏర్పాటు

రైతులు స్పందించిన తీరును చూచిన కమ్యూనిస్టులు అమితోత్సాహాన్ని పొందారు. వెంటనే తాము సాధించిన విజయాల్ని సుస్థిరం చేయాలని ప్రయత్నించారు. ప్రతిగ్రామంలోను, మారుమూల పల్లెల్లోను దళాల్ని ఏర్పాటు చేశారు ఒక్కొక్క దళంలో 20 నుండి 30 మంది వరకు పార్టీకి అంకితమైన కార్యకర్తలు ఉంటారు వీరు కమ్యూనిస్టు సిద్ధాంతాల్ని ప్రచారం చేయడంలో ఇచ్ఛికంగా ప్రాణాలర్పించడానికి కూడ సిద్ధపడుతారు వీరు రాజకీయంగా సుశిక్షితులే గాకుండా ప్రేలుడు ఆయుధాల్ని ప్రయోగించడంలోను, ఆరోగ్య సేవలందించడంలోనూ తర్ఫీదు పొందుతారు ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు కార్యకర్తలు సభ్యులుగా ఉన్న సంఘాలకు మహిళలు, గిరిజనులు కూడ మద్దతు తెలపడం విశేషమైన విషయంగా చెప్పవచ్చు

ఒకవైపు వరంగల్లు (ఈనాటి ఖమ్మం జిల్లాతో సహా) నల్గొండ జిల్లాల్లో భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణా కమ్యూనిస్టులు ఉద్యమాన్ని సాగించగా ఈ జిల్లాలకు ఆనుకుని ఉన్న మద్రాసు రాష్ట్రంలోని కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని భూమిలేని కూలీలను ఆంధ్ర కమ్యూనిస్టులు తమవైపు ఆకర్షించారు దీనికి తోడు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని విశేషంగా పోరాడుతున్న కమ్యూనిస్టులకు పట్టణ మధ్యతరగతి ప్రజల్లో విశేష ఆదరణ ఉంది ఈ విధంగా తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాల్లో అమరవీరులుగను, నాయకులుగను చలామణి కావడంతో కమ్యూనిస్టులు విజయం సాధించారు

## కమ్యూనిస్టు పార్టీపై నిషేధం

నల్గొండ, వరంగల్లు జిల్లాల్లో తెలంగాణా రైతాంగం సాగిస్తున్న ఉద్యమం కరీంనగర్ వంటి ఇతర జిల్లాలకు వ్యాపించింది దీంతో రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతంలో నెలకొని ఉన్న తీవ్రమైన ఉద్రిక్తతను నైజాం ప్రభుత్వం గుర్తించింది 1946 అక్టోబరులో నైజాం ప్రభుత్వం కమ్యూనిస్టులపై ఆకస్మిక దాడులు చేసి వి ఆళ్వార్‌స్వామి మొదలగు రెండవ శ్రేణి నాయకుల్ని అరెస్టు చేయడంలో విజయం సాధించింది అయితే రావినారాయణరెడ్డి, వెంకటేశ్వరరావు వంటి మొదటి శ్రేణి నాయకులు మాత్రం పోలీసుల నుండి తప్పించుకున్నారు 1946 అక్టోబరులో కమ్యూనిస్టుల హింసను అరికట్టేందుకు కల్లోలిత ప్రాంతాలైన నల్గొండ, వరంగల్లు జిల్లాల్లో నైజాం ప్రభుత్వం సైన్యపు శిబిరాల్ని ఏర్పాటు చేసింది పరిస్థితులు చాల విషమించడంతో ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీలు తమ ప్రధాన కేంద్రాల్ని విజయవాడకు తరలించాయి 1946 నవంబరులో నైజాం ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని విధించింది తమ పార్టీపై నిషేధాన్ని విధించడం, గ్రామాల్లో సైన్యపు శిబిరాల్ని ఏర్పాటు చేయడం వంటి చర్యల వల్ల తమ పార్టీ సిద్ధాంతాల్ని సుస్థిరం చేసేందుకు నైజాంకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టక తప్పదని కమ్యూనిస్టులు భావించారు నైజాం సేనలకు, భూస్వాముల సేనలకు వ్యతిరేకంగా పోరాడేందుకు తగిన ఆయుధాల్ని సేకరించడం, తగిన వ్యూహరచన చేయడమూ ప్రారంభించారు ప్రతీకార వాంఛతో నున్న సైన్యంపై ఒక్కసారిగ విరుచుకు పడే ముందు తాము చాల వరకు అణగిఉండడం మంచిదని కమ్యూనిస్టులు భావించారు 1947 ప్రారంభంలో ఎటువంటి ఉద్యమ సందడి లేక పోవడంతో ఉద్యమం చల్లబడిపోయిందని ప్రభుత్వం భావించింది. దీంతో గ్రామాల నుండి సైన్యాన్ని ఉపసంహరించుకుని తాను కలలు గంటున్న ప్రత్యేక ముస్లిం రాజ్యం ఏర్పాటు ప్రయత్నాల్లో ప్రభుత్వం మునిగిపోయింది

## హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం కావాలనే ఉద్యమం

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు తన రాష్ట్రం భారతదేశంలోను, పాకిస్తాన్‌లోను చేరక ప్రత్యేకంగా ఉంటుందని

హైదరాబాదు రాష్ట్ర ఏడవ నైజాం అయిన మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ (1911-48) ప్రకటించాడు అయితే భారతదేశంలో విలీనం కావాలని కోరుతున్న అత్యధిక ప్రజానీకానికి ఆలీఖాన్ ప్రకటన సహజంగానే ఆందోళన కలిగించింది ఈ ఆశయ సాధనకోసం స్వామి రామానంద తీర్థ నాయకత్వాన హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు 'జాయిన్ ఇండియా' (భారతదేశంలో విలీనం కావాలి) ఉద్యమాన్ని చేపట్టింది

ఈ మధ్యలో ఇత్తేహాదుల్ ముస్లిమీన్ అనే ముస్లిం మత సంస్థ మతోన్మాదియైన కాశిం రజ్వీ నాయకత్వాన 'రజాకార్లు' అనబడే పారా మిలిటరీ దళాన్ని ఏర్పాటు చేసి తద్వారా హిందువుల్లో భయభ్రాంతుల్ని సృష్టించాలని ప్రయత్నించి అనేక హింసాయుత చర్యలకు పాల్పడింది రజాకార్ల దుశ్చర్యల్ని కాంగ్రెసు పార్టీ బహిరంగంగా ఎదుర్కోలేకపోయింది రజాకార్లు పెట్టే బాధలకు గ్రామాల్లోని ప్రజలు తట్టుకోలేక పోయారు గ్రామాల్లో నిజానికి అన్ని ప్రభుత్వాధికారాల్ని రజాకార్లే నిర్వహించేవారు రాష్ట్ర కాంగ్రెసు పార్టీ పట్టణాలకే పరిమితం కావడం వల్ల పీడితులైన ప్రజల్ని ఏ విధంగాను ఆదుకోలేకపోయింది సహజంగానే గ్రామస్థులు పూర్వం తమ సమస్యల కోసం పోరాడిన కమ్యూనిస్టుల్ని ఆశ్రయించారు కమ్యూనిస్టులు తక్షణమే గ్రామాల్లో ప్రవేశించి రజాకార్ల బాధల నుండి ప్రజల్ని విముక్తి చేసేందుకు ప్రయత్నించారు కమ్యూనిస్టుల దళాలు సాయుధ రజాకార్లకు ఏమాత్రమూ తీసిపోవు అందువల్ల గ్రామస్థులు కమ్యూనిస్టుల్ని తమ రక్షకులుగ భావించారు ప్రజల ఆదరాభిమానాల్ని, మద్దతును సంపాదించిన కమ్యూనిస్టులు సామాన్య ప్రజానీకానికి కమ్యూనిస్టు సిద్ధాంతాల్ని బోధించడానికి ప్రయత్నించారు

## సాయుధ తిరుగుబాటుకు పిలుపు

సాయుధ తిరుగుబాటు ద్వారా ప్రభుత్వాన్ని చేజిక్కించుకునే సమయం ఆసన్నమయిందని కమ్యూనిస్టులు భావించారు. కావలసిన ఆయుధాల్ని, ఆయుధ సామగ్రిని సమకూర్చుకోవడంలో కమ్యూనిస్టులు ఇదివరకే సఫలీకృతులయ్యారు ఇదే సమయంలో నైజాం ప్రభుత్వం కూడ ప్రత్యేక ముస్లిం రాజ్య స్థాపన కోసం కావలసినంత ఆయుధాల్ని, ఆయుధ సామగ్రిని రహస్యంగా సమకూర్చుకుంటోంది నైజాం ప్రభుత్వం మిలటరీ టాంకుల్ని,

మర తుపాకుల్ని, యుద్ధ విమానాల్ని సేకరించడంలో విమగ్నమై ఉండగా కమ్యూనిస్టులు కావలసినన్ని రైఫిళ్ళను, తుపాకుల్ని సేకరించారు అయితే రజాకార్లు, నైజాం ప్రభుత్వం కమ్యూనిస్టుల కార్యకలాపాల్ని భారత ప్రభుత్వ వ్యతిరేకమైనవిగా భావించి ఉదాసీనత వహించారు

కమ్యూనిస్టులు సాయుధ తిరుగుబాటును చేపట్టాలని నిర్ణయించిన వారిలో ముఖ్యులు రావి నారాయణరెడ్డి, పి సుందరయ్య ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత కమ్యూనిస్టులు కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ అను రెండు సంస్థల ద్వారా పనిచేయడం మానివేశారు 1947 ఏప్రిల్లో తమ అనుబంధ సంస్థయైన ఆంధ్రమహాసభను వదలిపెట్టి కమ్యూనిస్టు పార్టీ పేరుతోనే సాయుధ తిరుగుబాటును ప్రారంభించారు

## త్రివిధ వ్యూహ రచన

త్రివిధమైన వ్యూహాల్ని చేపట్టి తిరుగుబాటును ప్రారంభించాలని కమ్యూనిస్టులు నిర్ణయించారు భూస్వాముల, వడ్డీ వ్యాపారస్తుల ఇళ్ళపైన, పోలీసు స్టేషన్లపైన ఒకేసారి దాడిచేసేందుకు వీలుగా మొదట గెరిల్లా దళాల్ని ఏర్పాటు చేశారు రెండవదిగా గ్రామ రక్షక దళాల్ని ఏర్పాటు చేశారు ఈ గ్రామ రక్షక దళాల్లో కమ్యూనిస్టు పార్టీ సానుభూతి పరులు ఉంటారు వీరు రజాకార్ల ఆట కట్టించడానికి ప్రయత్నిస్తారు మూడవ వ్యూహంలో విధ్వంసక దళాల్ని ఏర్పాటు చేశారు ఈ దళాలు రజాకార్ల, పోలీసుల, నైజాం సేనల కదలికల్ని గమనిస్తూ ఉంటాయి రజాకార్లు, నైజాం సైన్యం సాధారణంగా బస్సులు, తదితర మోటారు వాహనాల ద్వారా ప్రయాణం చేస్తారు అందువల్ల వీరు ప్రయాణించే మార్గాల్లోని పెద్ద, చిన్న వంతెనల్ని ఈ విధ్వంసక దళం నాశనం చేస్తుంది అయితే కమ్యూనిస్టులు మాత్రం కాలినడకనే ప్రయాణం చేస్తారు వీరికి ఈ ప్రాంతంలోని స్థలాల్ని గురించి చక్కటి అవగాహన ఉంది

తమ వ్యూహ రచనను సిద్ధం చేసిన తర్వాత కమ్యూనిస్టులు తెలంగాణా లోని ఎనమిది జిల్లాలకు ఒక్కొక్క ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశారు అయితే తమ కార్యకలాపాలకు నల్గొండ, వరంగల్లు జిల్లాల్ని మాత్రం ప్రధాన భూమికలుగ ఎంచుకున్నారు. ఈ రెండు జిల్లాల్ని ఎంచుకోవడంలో అనేక కారణాలున్నాయి

ఈ జిల్లాల్లో గ్రామస్థాయి నుండి తాలూకా స్థాయి వరకు తమ పార్టీ పటిష్టంగా రూపొందింది ఈ జిల్లాలు కమ్యూనిస్టు పార్టీకి బలమైన కేంద్రాలుగ నున్న కృష్ణా, గుంటూరు జిల్లాలకు అనుకుని ఉన్నాయి ఇదేకాక ఈ జిల్లాల్లో అడవులు, కొండలు విశేషంగా ఉండడం వల్ల గెరిల్లా యుద్ధ పద్ధతులకు చాలా అనువుగా ఉంటుంది మరో ముఖ్య కారణం ఇక్కడ గిరిజనులు కమ్యూనిస్టులపై మిక్కిలి సానుభూతిని కలిగి ఉండడమే

విజయవాడ వంటి పట్టణాల నుండి కావలసిన ఆయుధాల్ని, ఆయుధ సామగ్రిని కమ్యూనిస్టులు సేకరించగల్గారు విజయవాడను 'స్టాలిన్ గార్డ్'గా కమ్యూనిస్టులు పొగుడుకునేవారు పి సుందరయ్య, ఎం బసవపున్నయ్య వంటి ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు రావి నారాయణ రెడ్డి, దేవుల పల్లి వెంకటేశ్వరరావు వంటి తెలంగాణా నాయకులతో కలసి మెలసి ఐకమత్యంతో తమ కార్యకలాపాల్ని నిర్వహించేవారు కమ్యూనిస్టు పార్టీ సాంస్కృతిక సంస్థయైన ప్రజానాట్యమండలి ప్రసిద్ధి చెందిన 'మాభూమి'నాటికను ప్రదర్శించింది దీంతో ప్రజల నుండి ఎక్కువ మొత్తంలో విరాళాల రూపంలో పార్టీకి డబ్బు వచ్చేది 'మాభూమి' నాటిక విజయవంతం కావడంతోబాటు మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలన్నిటా కమ్యూనిస్టుల ప్రాబల్యం విపరీతంగా పెరుగుతుండడంతో మద్రాసు ప్రభుత్వం కలవరపడి కమ్యూనిస్టు పార్టీని, 'మాభూమి' నాటికను నిషేధించింది తమ్మారెడ్డి సత్యనారాయణ (ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి) వంటి చాలమంది నాయకులు గెరిల్లా దళాలకు ప్రాంతీయ నాయకులుగ బాధ్యతల్ని నిర్వహించారు పై విషయాలన్నీ ఆంధ్ర, తెలంగాణా కమ్యూనిస్టు పార్టీ శాఖలు రెండూ కలసి తెలంగాణా సాయుధ పోరాటాన్ని నిర్వహించాయన్న సత్యాన్ని మనకు స్పష్టం చేస్తున్నాయి

ఉద్యమ ప్రారంభంలో (1947 మొదటి దశలో) రావి నారాయణ రెడ్డి ఎక్కువగా విజయవాడలోనే ఉంటూ హైదరాబాదు రాష్ట్రంలోని పరిటాల, మీనవోలు గ్రామాల (కృష్ణాజిల్లా సరిహద్దు లోనివి) పోలీసు స్టేషన్లపై దాడుల్ని నిర్వహించేవాడు. ఈ దాడుల వల్ల కమ్యూనిస్టులు కావలసినంత ఆయుధాల్ని, ఆయుధ సామగ్రిని సమకూర్చుకోగల్గారు

ఇంతేకాక ఈ దాడుల వల్ల దాదాపు 4000 గ్రామాల్లో నైజాం ప్రభుత్వం నామ రూపాలు లేకుండా పోయింది గ్రామాల్లోని ప్రభుత్వాధికారులు, భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు తప్పించుకు పారిపోయి వరంగల్లు, హైదరాబాదు వంటి పట్టణాల్లో తలదాచుకున్నారు

## గ్రామ ప్రభుత్వం ఏర్పాటు – భూమి పంపిణీ

నైజాం ప్రభుత్వం నుండి, రజాకార్ల నుండి గ్రామాలన్నింటిని తమ చేతుల్లోకి తీసుకున్న కమ్యూనిస్టులు తాము రూపొందించిన పథకాల్ని అమలు చేయడం ప్రారంభించారు జాగీర్దారుల భూములన్నింటిని భూమి లేని పేదరైతులకు పంచి పెట్టారు స్థానిక వడ్డీ వ్యాపారస్తులకు రైతులు చెల్లించాల్సిన రుణాలన్నింటినీ రద్దు చేశారు ఒకమాటలో చెప్పాలంటే దాదాపు 4000 'విముక్త గ్రామాల్లో' కమ్యూనిస్టులు తమ అధికారాన్ని స్థాపించగల్గారు

## పోలీసు చర్య

1948 సెప్టెంబరులో భారత ప్రభుత్వం పోలీసు చర్య ద్వారా హైదరాబాదు రాష్ట్రానికి నైజాం పాలన నుండి విముక్తిని ప్రసాదించింది దీని ఫలితంగా మేజరు జనరలు జె ఎన్ చౌదరి హైదరాబాదు రాష్ట్రానికి మిలిటరీ గవర్నరుగా నియుక్తులయ్యారు రజాకార్ల నాయకుడైన కాశిం రజ్వీని అరెస్టు చేయడంతోపాటు హైదరాబాదు నగరంలోను, రాష్ట్రంలోని ఇతర పట్టణాల్లోను శాంతి భద్రతల్ని నెలకొల్పడం జరిగింది పోలీసు చర్య తర్వాత చాలమంది కమ్యూనిస్టు నాయకులు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు ఉద్యమాన్ని తీవ్రతరం చేసి కమ్యూనిస్టు పాలనను సుస్థిరంగా స్థాపించాలని వారు ఆశించారు అయితే భారత ప్రభుత్వం కమ్యూనిజాన్ని అరికట్టేందుకు సైనిక దళాల్ని దింపింది తెలంగాణాలో కమ్యూనిస్టుల పోరాటం 1951 సెప్టెంబరు వరకు కొనసాగింది కమ్యూనిస్టు పాలనను స్థాపించడంలో విఫలమౌతామని గ్రహించిన కమ్యూనిస్టులు సాయుధ పోరాటాన్ని వదలిపెట్టి దేశంలోవున్న ప్రజాస్వామ్య పద్ధతుల్లో పాలుపంచుకుంటామని అంగీకరించారు దీంతో కమ్యూనిస్టు పార్టీపై విధించిన నిషేధాన్ని ఎత్తివేశారు రాజ్యాంగ పద్ధతుల్లో తమ కార్యకలాపాల్ని నిర్వహించుకునేందుకు కమ్యూనిస్టుల్ని అనుమతించడం జరిగింది 1951 సెప్టెంబరులో అరెస్టయిన

రావి నారాయణ రెడ్డి 1951 డిశంబరు 5న భారత ప్రభుత్వ కొత్త రాజ్యాంగం ప్రకారం జరిగే మొదటి సాధారణ ఎన్నికలలో పాల్గొనేందుకు విడుదలయ్యాడు

## మొదటి సాధారణ ఎన్నికలు, 1952

1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నల్గొండ జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలన్నింటినీ కమ్యూనిస్టులు కైవశం చేసుకోగల్గారు నల్గొండ పార్లమెంటరీ నియోజకవర్గం నుండి లోక్ సభకు, భువనగిరి నియోజకవర్గం నుండి హైదరాబాదు అసెంబ్లీకి రావి నారాయణరెడ్డి ఎన్నికయ్యాడు నల్గొండ పార్లమెంటు స్థానంలో నారాయణరెడ్డికి దాదాపు 3 లక్షలకు పైగా ఓట్లు వచ్చాయి దేశంలో ప్రధానమంత్రి నెహ్రూతో సహా ఏ ఒక్కరూ ఇంతటి మెజారిటీ సంపాదించలేకపోయారు నారాయణరెడ్డి లోక్ సభ స్థానంలోనే కొనసాగాలని నిర్ణయించుకున్నాడు దీంతో హైదరాబాదు అసెంబ్లీలోని భువనగిరి స్థానానికి రాజీనామా సమర్పించాడు

## తెలంగాణా సాయుధ పోరాట సిద్ధాంతాలు

భారతదేశంలోని కమ్యూనిస్టు పార్టీ మాస్కోలోని సోవియట్ యూనియను కమ్యూనిస్టు పార్టీ ఆదేశానుసారం నడచుకునేది భారత కమ్యూనిస్టు పార్టీ మాస్కో నుండి వచ్చే ఎటువంటి ఆదేశాన్నైనా తు చ తప్పకుండా శిరసా వహించేది రెండవ ప్రపంచ యుద్ధాన్ని ప్రజా యుద్ధంగా అభివర్ణించడంలో కమ్యూనిస్టు పార్టీ ఏ మాత్రం సందేహించలేదు భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వాన్ని చేపట్టిన పి సి జోషి పట్టణాల్లో నివసించే సామాన్య ప్రజల ఉద్యమం నుండే కమ్యూనిజం ఆవిర్భవిస్తుందన్న సోవియట్ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతంలో నమ్మకం పెంచుకున్నాడు 1946లో తెలంగాణా పోరాటం ప్రారంభం అయినప్పుడు చైనాలో కమ్యూనిస్టులు అధికారంలోకి రాలేదు కేంద్ర నాయకత్వం నుండి ఎటువంటి ఆదేశాలు లేకనే ఆంధ్ర, తెలంగాణా కమ్యూనిస్టు నాయకులు తెలంగాణా ఉద్యమాన్ని ప్రారంభించారు అయితే అప్పటికే కేంద్ర నాయకత్వం మాస్కో బాటలో పయనించడం ప్రారంభించింది ఆంధ్ర కమ్యూనిస్టులు మాత్రం భూమిలేని రైతు కూలీలు అధికంగా ఉన్న గ్రామాలనే తమ స్థావరాలుగ జేసుకున్నారు ఈ విషయంలో వీరు మావో రచించిన "నూతన ప్రజాస్వామ్యం"

( New Democracy) అను వ్యాసం నుండి ఉత్తేజాన్ని పొందారు  తెలంగాణా పోరాటపు తొలి విజయాల్ని చూచిన కేంద్ర కమ్యూనిస్టు పార్టీ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది  1948  ఫిబ్రవరి–మార్చి  నెలల్లో జరిగిన కేంద్ర పార్టీ రెండవ సమావేశంలో తెలంగాణా వీర యోధులకు జోహారులర్పించి, తెలంగాణా మార్గమే భారతదేశ మార్గంగా చేస్తామని ప్రతిజ్ఞ చేసింది

1949లో చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మాస్కో కమ్యూనిస్టు పార్టీ తెలంగాణా ఉద్యమాన్ని ప్రస్తుతిస్తూ భారతదేశంలో సామాన్య ప్రజల ప్రజాస్వామ్యాన్ని నిర్మించడంలో ప్రథమ ప్రయత్నంగాను, రైతు ఉద్యమానికి నాందీ వాచకంగాను అభివర్ణించింది  అయితే 1950 నుండి నెహ్రూ ప్రభుత్వంతో సోవియట్ యూనియన్ అనుసరించిన విధానంలో మార్పు కన్పిస్తుంది  భారత ప్రభుత్వంతో స్నేహ సంబంధాల్ని అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశాన్ని కల్గియున్న సోవియట్ యూనియన్ తెలంగాణా ఉద్యమాన్ని విరమింపజేయమని భారత కమ్యూనిస్టు పార్టీకి సలహా ఇచ్చింది  ఇంతేకాక పోలీసు చర్య తర్వాత హైదరాబాదు రాష్ట్ర ప్రజలు నెహ్రూ, పటేలు నాయకత్వంలో ఉన్న భారత జాతీయ కాంగ్రెసుపై మొగ్గు చూపుతున్నారని కమ్యూనిస్టులు గ్రహించగల్గారు. నైజాం నిరంకుశ పాలన నుండి హైదరాబాదు రాష్ట్రానికి విముక్తిని ప్రసాదించిన జాతినేతగా పటేలు ప్రజల మనస్సులో చెరగని ముద్ర వేశాడు

1950 డిశంబరులో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీని పునర్వ్యవస్థీకరించే సమయంలో చాల తక్కువమంది మావో సిద్ధాంతాల్ని బలపరిచారు

## 1952 తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం

1951లో తెలంగాణా ఉద్యమాన్ని విరమించిన తర్వాత కమ్యూనిస్టులు 1951లో జరిగిన సాధారణ ఎన్నికలలో పాల్గొని తెలంగాణాలోను, ఆంధ్రలోను తగినన్ని స్థానాల్ని గెలుచుకున్నారు  నిజానికి ఈ రెండు ప్రాంతాల్లోను భారత జాతీయ కాంగ్రెసు కంటె ఎక్కువ స్థానాల్ని గెలుచుకోగల్గారు. దీంతో మద్రాసు రాష్ట్రంలోని, హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాల్ని కలిపి ఒకే పరిపాలన క్రిందకి తెచ్చినట్లయితే తాము అధికారం లోకి రాగలమని కమ్యూనిస్టులు

భావించారు అందువల్లే కమ్యూనిస్టులు విశాలాంధ్ర ఉద్యమాన్ని తీవ్రం చేశారు 1913లో ప్రారంభమయిన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం 1952 డిశంబరులో పొట్టి శ్రీరాములు అమరణ నిరాహార దీక్షచేస్తూ అమరత్వాన్ని పొందడంతో పతాక స్థాయి నందుకుంది దీంతో భారతప్రభుత్వం తలవొగ్గి 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీలో కమ్యూనిస్టులకు 41 స్థానాలుండగ కాంగ్రెసుకు 40 స్థానాలున్నాయి అయితే ప్రకాశం ముఖ్యమంత్రిగ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల్గింది ప్రకాశం ప్రభుత్వం ఒక సంవత్సరం కంటె మించి కొనసాగ లేకపోయింది అందువల్ల 1955లో ఆంధ్ర అసెంబ్లీకి మధ్యంతర ఎన్నికలు జరపాల్సి వచ్చింది ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులు పూర్తి పరాజయాన్ని చవిచూశారు 196 స్థానాలు గల అసెంబ్లీలో కేవలం 15 స్థానాలు మాత్రం సంపాదించుకోగల్గారు కాంగ్రెసు పార్టీ మాత్రం పూర్తి మెజారిటీని సాధించింది కమ్యూనిస్టులు ఓడిపోవడానికి చాల కారణాలు ఉన్నాయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కావడంతో ఆంధ్రుల ఆవేశం చల్లబడిపోయింది తమ కోర్కె నెరవేరేసరికి సంతృప్తి చెందారు కమ్యూనిస్టులు ఇక ఏ మాత్రం ఆంధ్ర ప్రజల్ని రెచ్చగొట్టలేరు కమ్యూనిస్టులు హింసాయుత సిద్ధాంతానికి కట్టుబడి ఉంటారని, తెలంగాణా సాయుధ పోరాటం ఆంధ్ర ప్రాంతంలో కూడ తిరిగి తలెత్తవచ్చుననే ప్రజల భయాన్ని కాంగ్రెసు నాయకులు బాగా వినియోగించుకున్నారు ఇదేగాక భారతదేశంలో సోవియట్ రష్యా అనుసరిస్తున్న విధానంలో స్పష్టమైన మార్పు కన్పించింది సోవియట్ రష్యా భారతదేశంతో సంబంధ బాంధవ్యాల్ని అభివృద్ధి చేసుకోవడం ప్రారంభించింది ఈ పరిస్థితి వల్లే భారత కమ్యూనిస్టు పార్టీ నెహ్రూ ప్రభుత్వానికి మద్దతును ఇవ్వాల్సి వచ్చింది 1956లో బుల్గానిన్, కృశ్చేవ్‌ల భారత పర్యటనతో ఈ రెండు దేశాల సంబంధాలు మరింత ధృడపడ్డాయి దీంతో నెహ్రూ ప్రభుత్వంతో స్నేహంగా మెలగాలని 1956లో జరగిన పాల్ఘాట్ సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది అయితే ఈ కేంద్ర పార్టీ నిర్ణయం సుందరయ్య, బసవపున్నయ్య వంటి ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులకు ఆమోదయోగ్యంగా లేదు భారత కమ్యూనిస్టు పార్టీ కూడ ఏకాభిప్రాయం గల పటిష్టమైన సంస్థ కాదు ఇందులో రెండు వర్గాలున్నాయి ఒక వర్గం సోవియట్ రష్యాను అనుసరించగా, మరో వర్గం చైనా కమ్యూనిస్టు పంథాను అనుసరించేది 1961

లో విజయవాడలో జరిగిన కేంద్ర కమ్యూనిస్టు పార్టీ సమావేశంలో ఈ రెండు వర్గాల మధ్య భేదాభిప్రాయలు మరింత ఎక్కువయ్యాయి

1962లో జరిగిన భారత-చైనా యుద్ధంతో ఈ రెండు వర్గాల్లోని అభిప్రాయభేదాలు బహిరంగంగా వ్యక్తమయ్యాయి. భారత కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడైన ఎస్ ఎ డాంగే చైనాను తీవ్రంగా విమర్శిస్తూ నెహ్రూ ప్రభుత్వానికి తిరుగులేని మద్దతును ప్రకటించాడు చైనా సానుభూతిపరులైన కమ్యూనిస్టులు అరెస్టు చేయబడ్డారు ఈ మధ్యలో చైనా, సోవియట్ ల మధ్య కూడ విభేదాలు తీవ్రమయ్యాయి ఈ పరిణామాల ఫలితంగా కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలి పోయింది మొదటిది CPI కాగా రెండవది CPI(M)గ రూపుదిద్దుకొంది

కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలిక ఆంధ్రప్రదేశ్‌లోని కమ్యూనిస్టు ఉద్యమంపై తన ప్రభావాన్ని చూపింది సుందరయ్య, బసవపున్నయ్య వంటివారు మార్క్సిస్టు పార్టీలో[CPI(M)] చేరగా రాజేశ్వరరావు, రావినారాయణరెడ్డి కమ్యూనిస్టు పార్టీలోనే (CPI) కొనసాగారు కమ్యూనిస్టు పార్టీ సోవియట్ రష్యాను, మార్క్సిస్టు పార్టీ చైనాను ఎప్పుడూ సమర్థిస్తాయని చెప్పడం సరికాదు 1967 లో మార్క్సిస్టు పార్టీ నాయకుడైన ఇ.ఎం.ఎస్ నంబూదిపాద్‌ను విమర్శిస్తూ ఆయన్ని తిరోగమనవాదిగా (Revisionist) చైనా అభివర్ణించింది దీనికి బదులుగా భారత మార్క్సిస్టు పార్టీ చైనా కమ్యూనిస్టు పార్టీని తమ అంతరంగిక విషయాల్లో జోక్యం కలుగ జేసుకొంటోందని విమర్శించింది. ఇంతేకాక పశ్చిమ బెంగాలులో తలెత్తిన నక్సల్బరీ ఉద్యమాన్ని మార్క్సిస్టు సిద్ధాంతాలకు విరుద్ధమైందిగా భావించింది

1969 మే 1న కమ్యూనిస్టు వర్గాల్లో మరో చీలిక వచ్చింది. ఈ కొత్త వర్గాన్ని మార్క్సిస్టు - లెనినిస్టు పార్టీ (CPI(ML)) గ వ్యవహరించారు ఈ కొత్త వర్గంలోని ముఖ్య నాయకుల్లో తరిమెల నాగిరెడ్డి ఒకరు. ఈయన అప్పటి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్షనాయకుడుగ ఉండేవారు దేవులపల్లి వెంకటేశ్వరరావు, కొల్లా వెంకయ్య, చంద్ర పుల్లారెడ్డి వంటి వారు మిగిలిన ప్రముఖ నాయకుల్లో చెప్పుకోదగినవారు. వీరందరు కూడ పూర్వం మార్క్సిస్టు పార్టీలో ఉండేవారు ఈ వర్గం 'జనశక్తి' అనే తెలుగు వారపత్రిక ద్వారా తమ సిద్ధాంతాల్ని ప్రచారం చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఈ పత్రిక ఎక్కువ కాలం మనలేకపోయింది

1967 నవంబరులో వివిధ కమ్యూనిస్టు వర్గాల్లోని సిద్ధాంతపరమైన, వ్యూహాపరమైన విభేదాల్ని తగ్గించుకోవాలనే ప్రయత్నం ఒకటి జరిగింది ఈ ప్రయోజనాన్ని ఆశించే కమ్యూనిస్టు విప్లవకారుల అఖిల భారత సమన్వయ కమిటి ఒకటి ఏర్పాటయింది ఈ కమిటి రెండవ సమావేశం కలకత్తాలో 1968 మే నెలలో జరిగింది ఆంధ్రదేశంలోని నాగిరెడ్డి వర్గం (మార్క్సిస్టు-లెనినిస్టు) అఖిల భారత సమన్వయం కమిటిలో చేరలేదు అయితే శ్రీకాకుళం గిరిజన ఉద్యమ నాయకులైన పంచాది కృష్ణమూర్తి, చౌదరి తేజేశ్వరరావు వంటివారు ఈ కమిటిలో చేరడానికి నిర్ణయించారు దీంతో ఆంధ్రదేశంలోని ఇతర మార్క్సిస్టు-లెనినిస్టు నాయకులు కూడ సమన్వయ కమిటిలో చేరారు డిశంబరులో శ్రీకాకుళం ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు అయితే పశ్చిమ బెంగాల్లోని నక్సల్‌బరి ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న చారుమజుందార్‌కు (మార్క్సిస్టు-లెనినిస్టు) నాగిరెడ్డికి మధ్య వ్యూహారచనలో ఉత్పన్నమైన అభిప్రాయభేదాలు సమసిపోలేదు సాయుధ తిరుగుబాటుకు తగిన సమయం ఆసన్నం కాలేదని నాగిరెడ్డి అభిప్రాయపడ్డాడు అందువల్ల ఆయన వర్గాన్ని 1969 ఫిబ్రవరిలో సమన్వయ కమిటి నుండి బహిష్కరించారు

## శ్రీకాకుళం సాయుధ తిరుగుబాటు

ఆంధ్రప్రదేశ్‌లోని అంత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీకాకుళం ఒకటి ఒకప్పుడు ఈ ప్రాంతం మద్రాసు రాష్ట్రంలోని గంజాం జిల్లాలో ఉండేది 1936లో ఒరిస్సా రాష్ట్రం ఏర్పడినపుడు ఇప్పటి శ్రీకాకుళం జిల్లాను విశాఖపట్నం జిల్లాలో చేర్చడం జరగింది 1950లో ప్రత్యేక శ్రీకాకుళం జిల్లా ఏర్పాటయింది 7000 చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల ఈ జిల్లాకు ఉత్తరాన ఒరిస్సాలోని గంజాం జిల్లా, పశ్చిమాన ఒరిస్సాలోని కొరాపుట్ జిల్లా, దక్షిణాన విశాఖపట్నం జిల్లా, తూర్పున బంగాళాఖాతం సరిహద్దు ప్రాంతాలుగ ఉన్నాయి బంగాళాఖాతంను అనుసరించి ఉన్న తీరప్రాంతాన్ని మైదాన ప్రాంతమని, తూర్పు కనుమల చుట్టూ ఉన్న ప్రాంతాన్ని ఏజన్సీ ప్రాంతమని వ్యవహరిస్తారు ఏజెన్సీ ప్రాంతంలో జాతపులు, సవరులు, గదబులు, గోండులు మొదలయిన అనేక కొండజాతి తెగలు నివాస మేర్పరచుకున్నాయి వీరినే గిరిజనులుగ వ్యవహరిస్తారు పార్వతీపురం, పాలకొండ, సాలూరు తాలూకాలు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నాయి

ఈ ఏజెన్సీ ప్రాంతంలో చింతపండు, తేనె, బీడీ ఆకులు, రకరకాల కలప మొదలయినవి సమృద్ధిగా దొరకుతాయి మైదాన ప్రాంతంలోని విజయ నగరం, బొబ్బిలి, శ్రీకాకుళం వంటి వివిధ పట్టణాల్లో నివసిస్తున్న వ్యాపారులు ఏజెన్సీ అడవుల్లో దొరికే వస్తువుల్ని అతి చౌకగా కొని గిరిజనులను దోచుకునేవారు ఇదే గాక గిరిజనుల అధీనంలో ఉన్న భూముల్ని కూడ ఈ వ్యాపారులు కొనేవారు ఒక్కమాటలో చెప్పాలంటే ఈ గిరిజనుల్ని మైదాన ప్రాంతంలోని వ్యాపారస్థులు, వడ్డీ వ్యాపారులు ఆర్థికంగా కొల్లగొట్టేవారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజనుల భూముల్ని కొనగూడదని ఎన్ని చట్టాలు చేసినా వాటిని సమర్థవంతంగా అమలు పరచడం జరగలేదు ఒక దశాబ్దంలోనే చాలమంది గిరిజనులు తమ భూముల్ని సర్వస్వం పోగొట్టుకుని నిరుపేదలుగ మిగిలారు జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం పట్టణంలో తగిన రైలు సంబంధాలు గూడ ఏర్పాటు కాలేదు రాష్ట్ర రాజధానియైన హైదరాబాదు నగరానికి 800 కి మీ దూరంలో శ్రీకాకుళం ఉంది అందువల్ల చాలమంది ప్రభుత్వాధికారులు ఈ జిల్లాలో ఉద్యోగం చేయడం ఒక శిక్షగా భావించేవారు ప్రజలు తమ నిత్య సంభాషణలో సైతం శ్రీకాకుళంను శిక్షాప్రాంతంగా ఉటంకిస్తారు దీనిని బట్టి మిగతా జిల్లాల కంటె శ్రీకాకుళంలో ప్రభుత్వ నిర్వహణ అంత పటిష్టంగా రూపొందలేదని తెలుస్తున్నది

భారత కమ్యూనిస్టు పార్టీ తప్ప మిగిలిన ఏ పార్టీ కూడా శ్రీకాకుళం జిల్లా గిరిజన సమస్యల్ని చేపట్టలేదు 1959లోనే భారతకమ్యూనిస్టు పార్టీ గిరిజన సంఘాన్ని ఏర్పాటు చేసింది ఈ సంఘం కార్యకలాపాల్లో ముఖ్యమైంది వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాడడం .అమాయకులైన గిరిజనులు ధనవంతులైన వ్యాపారులు, వడ్డీ వ్యాపారుల ఇండ్లలో వెట్టిచాకిరికి కుదిరి జీవితాంతం సేవచేసేవారు ఈ వెట్టి చాకిరీని రూపుమాపాలని కమ్యూనిస్టు పార్టీ నడుం కట్టింది.

గిరిజన సంఘం ఏర్పాటయిన తర్వాత కూడ గిరిజనుల బ్రతుకుల్లో వెలుగు కనుపించలేదు 1962లో కమ్యూనిస్టు పార్టీ చీలిన తర్వాత ఆ ప్రాంతంలోని కార్యకర్తలు నైతికబలాన్ని కోల్పోయారు నిరాటంకంగా సాగుతున్న గిరిజనుల దోపిడీని చూచిన ఏజెన్సీ ప్రాంతంలోని కొంతమంది ఉపాధ్యాయులకు అసహ్యం పుట్టింది ఇటువంటి వారిలో 'సత్యం'గా ప్రసిద్ధి చెందిన వేంపటపు సత్యనారాయణ ఒకరు.

1962నుండి ఎటువంటి కార్యక్రమము చేపట్టక నిర్జీవంగా ఉన్న గిరిజన సంఘం, మార్క్సిస్టు పార్టీ ఏర్పడిన తర్వాత 1965లో చురుకుగా పనిచేయడం ప్రారంభించింది శ్రీకాకుళం జిల్లా మార్క్సిస్టు పార్టీ కార్యదర్శి వి రామలింగాచారి 1965లో గిరిజన కూలీల సమావేశాన్ని ఏర్పాటు చేశాడు

1967లో జరిగిన సాధారణ ఎన్నికల్లో గిరిజన సంఘం రాష్ట్ర అసెంబ్లీ స్థానానికి ఒక అభ్యర్థిని పోటీలోకి దింపింది అయితే ఈ అభ్యర్థి కాంగ్రెసు పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయాడు

1967 లో తలెత్తిన నక్సల్బరీ ఉద్యమం సత్యం వంటి వ్యక్తులపై విశేష ప్రభావాన్ని చూపింది తాను చదువుకునే రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ సంస్థయైన భారత విద్యార్థి సమాఖ్యలో సభ్యుడు కాకపోయినా, గిరిజనుల సమస్యకు పరిష్కారం సాయుధ తిరుగుబాటు ఒక్కటే శరణ్యమని సత్యం భావించాడు తాను పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయుడుగ పనిచేసేటపుడు జాతాపులు, సవరులు వంటి గిరిజన తెగల మధ్య తీవ్రమైన విభేదాలున్నాయని గ్రహించగల్గాడు సత్యం అంకితభావంతోను, మనస్ఫూర్తిగను కష్టపడి పనిచేయడం వల్ల గిరిజనుల హృదయంలో స్థానాన్ని సంపాదించుకున్నాడు జాతాపులు సవరల మధ్య గల విభేదాల్ని వివాహంలో కన్యల్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా పరిష్కరించాలని సత్యం ప్రయత్నించాడు

## సాయుధ పోరాటం ప్రారంభం

1967లో జరిగిన సాధారణ ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలో గిరిజనులకై ప్రత్యేకంగా కేటాయించిన ఒక అసెంబ్లీ స్థానాన్ని కూడ మార్క్సిస్టు పార్టీ చేజిక్కించుకోలేకపోయింది అయితే ఈ పరాజయంలో వారి ఉత్సాహం సడలిపోలేదు మరింత ఉత్సాహంతో కార్యరంగంలోకి దిగారు. ఎన్నికలయిన తర్వాత గిరిజనులకు బంజరు భూముల్ని పంపిణీ చేయాలనే ఉద్యమాన్ని తీవ్రం చేశారు ఇదేగాక ఏజెన్సీ ప్రాంతం మొత్తాన్ని స్వతంత్ర ప్రతిపత్తి గల పాలనావిభాగంగా చేయాలని కోరారు గిరిజనులచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులే పాలించాలని కూడ కోరారు. గిరిజనుల నుండి భూమిని స్వాహా చేసిన స్థానిక భూస్వాముల్ని, వడ్డీ వ్యాపారస్తుల్ని శిక్షించాలని కూడ కోరారు. 1967 అక్టోబరు

31న మొండెంఖల్ అనేచోట ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి అధిక సంఖ్యలో గిరిజనులు హాజరయ్యారు సమావేశం ముగించుకుని తమతమ ఇండ్లకు వెళుతున్న గిరిజనుల్ని లేవిడి అనుచోట మేడిత సత్యనారాయణ అనే స్థానిక భూస్వామి గూండాలు అటకాయించడమే గాక వారిపై కాల్పులు జరిపారు ఈ కాల్పుల్లో ఇద్దరు అమాయక గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు ఈ సంఘటనతో గిరిజనులు కోపోద్రిక్తులయి కరుపం, సీతంపేట వంటి చోట్ల హింసాయుత చర్యలకు పాల్పడ్డారు గిరిజనులు తమ ఆందోళనను నెలల తరబడి కొనసాగించడంతో 1968 మార్చి 4న పెదకరాజ అనుచోట పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది ఈ కాల్పుల్లో కూడ ఇద్దరు గిరిజనులు మరణించారు ఈ సంఘటనతో మార్క్సిస్టు పార్టీ గిరిజనుల్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నించింది స్థానిక భూస్వాములు గాని, ప్రభుత్వం గాని గిరిజనులకు న్యాయం చేకూర్చరని బోధించారు గిరిజనులకు ప్రేలుడు ఆయుధాలను ఉపయోగించడం లోను, గెరిల్లా యుద్ధపద్ధతుల్లోను శిక్షణ ఇచ్చారు. వెంపటాపు సత్యనారాయణ గిరిజనుల్లో తిరుగులేని నాయకుడుగ చెలామణి కావడమే కాక తిరుగుబాటు వ్యూహాన్ని రచించడంలో సైతం నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శించాడు

## తిరుగుబాటు సాగిన విధం

పశ్చిబెంగాలులోని డార్జిలింగు జిల్లా మార్క్సిస్టుపార్టీ కార్యదర్శిగానే గాక నక్సల్బరీ తిరుగుబాటుకు మూలకారకుడుగ ప్రసిద్ధి చెందిన చారుమజుందార్ తో చౌదరి తేజేశ్వరరావు, పంచాది కృష్ణమూర్తి వంటి శ్రీకాకుళం ఉద్యమకారులకు ప్రత్యక్షసంబంధాలేర్పడ్డాయి ఇక్కడే మరో విషయం చెప్పుకోవాలి. శ్రీకాకుళం ఉద్యమాన్ని ప్రారంభించింది మార్క్సిస్టుపార్టీయే అయినా తర్వాతి కాలంలో ఉద్యమాన్ని తీవ్రం చేసేందుకు ఆ పార్టీ సుముఖంగా లేదు. అయితే మావో సిద్ధాంతాన్ని నమ్మినవారు మాత్రం ఉద్యమాన్ని తీవ్రం చేయాలనడంతో వీరిని 1968 జూన్ లో పార్టీ నుండి బహిష్కరించారు తరిమెల నాగిరెడ్డి తనకు తాను మావో సిద్ధాంతవాదిగా చెప్పుకున్నా సాయుధ తిరుగుబాటుకు సుముఖతను వ్యక్తం చేయలేదు చారు మజుందారు అభిప్రాయంతో ఏకీభవించలేదు సాయుధ తిరుగుబాటును చేపట్టేముందు పార్టీ కార్యకర్తలకు విశేషమైన సైనిక

శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని నాగిరెడ్డి భావించాడు అయితె చారుమజుందార్ ఉద్యమాన్ని తీవ్రం చేసి వర్గశత్రువులైన భూస్వాముల్ని, వడ్డీ వ్యాపారస్తుల్ని తుదముట్టించాలని భావించాడు శ్రీకాకుళం ఉద్యమ నాయకులు చారు మజుందారు సలహావైపే మొగ్గును చూపారు అందువల్ల వారు 1968 అక్టోబరు 23-25 తేదీల్లో బొడ్డపాడు వద్ద సమావేశమై సాయుధ పద్ధతిలో ఉద్యమాన్ని తీవ్రం చేయాలని నిర్ణయించారు 1968 అక్టోబరు చివరి నుండి 1969 సంవత్సర మధ్యకాలం వరకు శ్రీకాకుళం ఉద్యమం సాయుధ తిరుగుబాటుగ పరిణమించింది

1969 ఫిబ్రవరి చివరిలో చారుమజుందార్ ఆంధ్రలో పర్యటించి ఉద్యమాన్ని ఏయే పద్ధతుల్లో నడపాలో వివరించాడు 1969 ఫిబ్రవరి 28 నుండి మార్చి 2 వరకు చారుమజుందార్‌తోపాటు తేజేశ్వరరావు, పంచాది కృష్ణమూర్తి, మామిడి అప్పల సూరి వంటి శ్రీకాకుళం ఉద్యమ నాయకులు గుంటూరు జిల్లాలోని గుత్తికొండ వద్ద సమావేశమై ఉద్యమాన్ని సమర్థవంతంగా నడిపేందుకు ఒక కొత్త సమన్వయ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు అయితే చారు మజుందార్ ప్రతిపాదించిన 'వర్గ శత్రు నిర్మూలనం' సత్యంకు ఇష్టం లేకపోవడంలో ఆయన ఈ సమన్వయ సంఘంలో చేరలేదు

## మార్క్సిస్టు – లెనినిస్టు పార్టీ (CPI - ML) ఏర్పాటు, ఏప్రిల్ 1969

మార్క్సిస్టు పార్టీలోని కొంతమంది అతివాదులు మరో కొత్త వర్గంగా విడిపోయారు దీన్నే మార్క్సిస్టు – లెనినిస్టుగ (CPI - ML) వ్యవహరించారు నక్సల్బరి ఉద్యమ నాయకుల్లో ఒకరైన కానుసన్యాల్ లెనిన్ 99 వ జన్మాదినోత్సవ సందర్భంగా 1969 ఏప్రిల్ 22న కొత్త పార్టీ ఆవిర్భావాన్ని గూర్చి ప్రకటించారు నాగిరెడ్డి ఈ పార్టీలోచేరలేదు ఆయన తన వర్గాన్ని 1969 మే నెలలో ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు కమిటిగ (Andhra Pradesh Revolutionary Communist Committee) ప్రకటించాడు

## ఉద్యమంలో సామాన్య ప్రజల ప్రవేశం

1969 మే నెలలో శ్రీకాకుళం ఉద్యమకారులు విశాఖపట్నంలో సమావేశమైనారు. తాము ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతుల్లో మార్పు చేయాలని

నిర్ణయించారు. ఈ నిర్ణయంలో భాగంగా వర్గశత్రువుల్ని బహిరంగంగా నిర్మూలించేందుకు సుమారు 500 నుండి 1000 మంది గిరిజనుల్ని తమ ఉద్యమంలో పాల్గొనేటట్టు చేయాలని నిర్ణయించారు.

అయితే వ్యక్తుల్ని చంపడం ఇష్టంలేని సత్యం, ఆదిభట్ల కైలాసం వంటి ఉద్యమ నాయకులు ఈ సమావేశానికి హాజరు కాలేదు

## సంఘటితమైన పోలీసు చర్య

ఒకవైపు ఉద్యమాన్ని తీవ్రం చేయాలని శ్రీకాకుళం ఉద్యమకారులు ప్రయత్నిస్తుండగా భారత ప్రభుత్వ ఆదేశానుసారం ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం, ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం సంఘటితంగా నక్సలైటు ఉద్యమాన్ని అణచివేయాలని నిర్ణయించాయి

## పంచాది కృష్ణమూర్తి మరణం, 27 మే 1969

1969 మే 27న జలాంత్ర కోట అనే గిరిజన గ్రామం వద్ద జరిగిన పోలీసు ఎదురు కాల్పుల్లో ప్రముఖ ఉద్యమనాయకుడు పంచాది కృష్ణమూర్తి మరణించడంతో ఆంధ్ర, ఒరిస్సా పోలీసుల సంయుక్త చర్య తక్షణ ఫలితాన్ని సాధించింది.

పంచాది కృష్ణమూర్తి మరణం మరింత విధ్వంసకాండకు దారితీయడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాలోని మొత్తం ఏజెన్సీ ప్రాంతాల్ని 'కల్లోలిత ప్రాంతం'గ ప్రకటించింది.

పశ్చిమబెంగాలు మార్క్సిస్ట్-లెనినిస్టు నాయకులైన కానుసన్యాల్, సురేన్ బోస్ 1969 జూలైలో శ్రీకాకుళం జిల్లాను సందర్శించి భవిష్యత్కార్యక్రమ నిర్వహణ బాధ్యతను సత్యం పై పెట్టారు. ప్రభుత్వ అణచివేత చర్యల్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆత్మాహుతి దళాలు ఏర్పాటు చేయాలని గూడా వారు నిర్ణయించారు.

## ఉద్యమ పతాకస్థాయి

1969 జూలైలో ఏజెన్సీ ప్రాంతంలోని మార్క్సిస్టు పార్టీ అనుబంధసంస్థ అయిన రైతాంగ సంఘర్షణ సమితి మొత్తం 518 గ్రామాల్లో దాదాపు 300

పైచిలుకు గ్రామాలపై అదుపును సాధించడంతో ఉద్యమం చివరి దశకు చేరుకుంది  వడ్డీ వ్యాపారస్థుల్ని, భూస్వాముల్ని, తదితర ప్రజాస్వామ్య వ్యతిరేకుల్ని శిక్షించేందుకు సంఘర్షణ సమితి న్యాయస్థానాల్ని నెలకొల్పింది

1969 ఆగస్టు 4న దాదాపు 1000 మంది గిరిజనులు పాలకొండ తాలూకాలోని మల్లివీడు గ్రామంపై దాడిచేసి భూస్వాముల్ని చంపేశారు. 1969 నవంబరు 2న ఇటువంటి దాడినే పెదబుడిది గ్రామంపై నిర్వహించారు  ఈ దాడులు ఏజెన్సీ ప్రాంతంలోని భూస్వాముల, వ్యాపారుల, వడ్డీ వ్యాపారుల గుండెల్లో, భయోత్పాతాన్ని సృష్టించింది  దీంతో వీరందరు ఏజెన్సీ ప్రాంతాన్ని వదలి విజయనగరం, శ్రీకాకుళం వంటి పట్టణాల్లో తలదాచుకున్నారు.

నిరాటంకంగా సాగుతున్న ఈ హింసాత్మక ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని పోలీసులు నిర్ణయించారు  కమ్యూనిస్టుల, వారి సానుభూతి పరుల కదలికల్ని పోలీసులు గమనిస్తూ వచ్చారు  1969 డిశంబరులో పోలీసులు తేజేశ్వరరావును అరెస్టు చేయగల్గారు  మరల ఇదే నెలలోనే నాగిరెడ్డి, దేవుల పల్లి వెంకటేశ్వరరావు తదితర ఆంధ్ర కమ్యూనిస్టు విప్లవ కమిటీ నాయకుల్ని మద్రాసులో అరెస్టు చేశారు

## సత్యం కైలాసంల మరణం, 10 జూలై 1970

1970 జూలై 10న బోరికొండల వద్ద జరిగిన పోలీసు ఎదురు కాల్పుల్లో ఉద్యమ వ్యవస్థాపకులైన సత్యం, కైలాసం మరణించడంతో శ్రీకాకుళం సాయుధ తిరుగుబాటు కుప్పకూలిపోయింది

మామిడి అప్పలసూరి, డి నాగభూషణం పట్నాయక్ మొదలగు ఉద్యమ నాయకుల్ని 1970 జూలై 24న కలకత్తాలో అరెస్టు చేశారు

1967 నుండి 1970 వరకు దాదాపు మూడు సంవత్సరాల పాటు సాగిన శ్రీకాకుళం సాయుధ తిరుగుబాటు ప్రపంచంలోని కమ్యూనిస్టు దేశాల దృష్టిని ఆకర్షించింది  1969 డిశంబరు 29న నవచైనా వార్తాసంస్థ (New China News Agency) 'భారతదేశపు అత్యాధునిక కోట బురుజు' (The Most Advanced Bulwork of India) అన్న వ్యాసాన్ని కూడ ప్రచురించింది. ఈ వ్యాసంలో

శ్రీకాకుళం ఉద్యమాన్ని ప్రస్తుతిస్తూ చారుమజుందారు శ్రీకాకుళం తిరుగాబాటుకు వ్యక్తిగతంగా ఆజ్యం పోశారని వర్ణించింది చైనా ఆకాశవాణి సంస్థకూడా 1967 మార్చి 4, మే 19న చేసిన ప్రసారాల్లో శ్రీకాకుళ ఉద్యమానికి ప్రాముఖ్యత నిచ్చింది ఈ ఉద్యమాన్ని తెలంగాణా రైతాంగ ఉద్యమ పరంపరగా అభివర్ణించింది

## పార్వతీపురం కుట్రకేసు

శ్రీకాకుళం ఉద్యమంలో పాల్గొన్న 120 మందిపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు కేసులు నమోదు చేశారు ఈ 120 మందిలో ప్రముఖ ఉద్యమ నాయకులైన నాగభూషణం పట్నాయక్, తేజేశ్వరరావు వంటి వారే గాక నలుగురు న్యాయవాదులు, ఇద్దరు ఎం బి బి.ఎస్ డాక్టర్లు, అయిదుమంది ఉపాధ్యాయులు, రసాయన సాంకేతిక శాస్త్రాలలో పి హెచ్ డి పట్టా పొందిన వ్యక్తి, పదిహేను మంది విద్యార్థులు ఉన్నారు చారుమజుందారు, కానుసన్యాల్, శౌరేన్ బోస్‌లు కూడ దోషులుగ నమోదయ్యారు 1972 జూలై 16న కలకత్తాలో చారుమజుందార్ అరెస్టయ్యాడు తర్వాత 12 రోజులకు (28 జూలై 1972) పోలీసు కస్టడీలోనే మజుందార్ మరణించాడు

దోషులుగ నమోదయిన వారిలో నాగభూషణం పట్నాయక్‌కు మరణశిక్ష విధించారు దీంతో దేశం మొత్తం మీద ఆందోళన వ్యక్తమైంది మరణశిక్షను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, భారత ప్రభుత్వానికి అనేక విన్నపాలు అందాయి. పట్నాయక్ ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స కోసం ఆయన్ను మొదట విశాఖపట్నానికి, తర్వాత ఢిల్లీకి తరలించారు చివరకు ఆయన్ని విడుదల చేయడం జరిగింది

## తెలంగాణా జిల్లాల్లో హింసాయుత తిరుగుబాట్లు

శ్రీకాకుళం సాయుధ తిరుగుబాటును అణచివేయడంతోనే ఆంధ్రదేశంలో హింసాయుత విప్లవాలు అంతం కాలేదు ఈ తిరుగుబాట్లు ఖమ్మం, వరంగల్లు, కరీంనగరు, ఆదిలాబాదు వంటి తెలంగాణా జిల్లాలకు కూడా వ్యాపించింది ఆదిలాబాదు జిల్లాలోని గిరిజనులు ముఖ్యంగా గోండులు విప్లవ సిద్ధాంతాల వైపు ఆకర్షితులయ్యారు ఆదిలాబాదు జిల్లాలోని ఇంద్రవెల్లి, కరీంనగరు జిల్లాలోని

జగిత్యాల వంటి ప్రాంతాలు హింసాయుత సంఘటనలకు రంగాలుగా మారిపోయాయి నక్సల్బరీ ఉద్యమ పంథాలో నడిచే ఉద్యమాలవైపు చాలామంది విద్యార్థులు ఆకర్షితులయ్యారు విప్లవాత్మక భావాలు గల ప్రజల్ని నక్సలైట్లని పిలవడం ఈనాడు మామూలైంది

# 17

# 1956 నుండి రాజకీయ సంక్షోభాలు

1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించినప్పటి నుండి రెండు హింసాయుత రాజకీయాందోళనలు రాష్ట్రాన్ని సంక్షోభంలో పడేశాయి ఒకటి 1969లో తలెత్తిన తెలంగాణా ఉద్యమం కాగా 1972లో తలెత్తిన జై ఆంధ్ర ఉద్యమం రెండవది. ఆంధ్రప్రదేశ్ అవతరించడానికి దోహదపడిన పెద్ద మనుషుల ఒప్పందాన్ని ఆంధ్రనాయకులు ఉల్లంఘించారని తెలంగాణా ప్రజలు భావించడం వల్ల తెలంగాణా ఉద్యమం తలెత్తింది అయితే తెలంగాణా ప్రజలకు కలిగిన ఇబ్బందులు కొన్ని సమంసజమే అయినప్పటికీ వారి సమస్యలు చాలవరకు ఊహాజనితాలే అయితే ఆంధ్రప్రాంతంలోని నాయకులు వారి సందేహాల్ని తీర్చడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు పెద్ద మనుషుల ఒప్పందాన్ని 1956 లోనే మొదటి ముఖ్యమంత్రి అయిన సంజీవ రెడ్డి ఉల్లంఘించాడు ఆయన ముఖ్యమంత్రిగ ఉన్నప్పుడు తెలంగాణా వారికి డిప్యూటి ముఖ్యమంత్రి పదవిని ఇవ్వక ఈ పదవి చేతిలోని ఆరవవేలులాగా నిరుపయోగమైందని చెప్పాడు కోస్తా ఆంధ్రదేశం నుండి హైదరాబాదు నగరానికి చాలమంది ప్రజలు వలస వెళ్ళడం అనేక సాంఘిక ఉద్రిక్తల్ని సృష్టించింది నెమ్మదిగా ప్రభుత్వాధికారుల్లోను, నిరుద్యోగ యువకుల్లోను అసంతృప్తి చోటు చేసుకుంది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఉన్నతాధికారులు, చొరవతో వివిధ రంగాల్లో దూసుకుపోగల ప్రజలు తమను అలక్ష్యం చేస్తున్నారని వీరు భావించారు

తమ సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు తెలంగాణాలో ప్రజలు నిరసన సమావేశాల్ని ఏర్పాటుచేయడం ప్రారంభించారు 1968 జూలై 10న 'తెలంగాణా పరిరక్షక దినాన్ని' (Telangana Safeguard Day) పాటించారు.

హైదరాబాదు నగరంలో జరిగిన ఒక సమావేశంలో తెలంగాణా ప్రజల కోరికల్ని మన్నించనట్లయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణా విడిపోవాల్సి వస్తుందని ప్రముఖ కార్మిక సంఘ నాయకుడైన మహదేవ్‌సింగ్ ప్రభుత్వాన్ని హెచ్చరించాడు

తెలంగాణాలో తగు అర్హతలు గల అభ్యర్థులు లేకపోవడంతో చాలమంది ఆంధ్రప్రాంతీయుల్ని వివిధ ఉద్యోగాల్లో నియమించడం జరిగింది తెలంగాణా ప్రజల అసంతృప్తికి ఇది ఒక ముఖ్య కారణమని చెప్పవచ్చు 1969 జనవరిలో ఖమ్మంలోని ఒక విద్యార్థి నిరాహార దీక్ష ప్రారంభించడంతో తెలంగాణా ప్రజల అసంతృప్తి జ్వాలలకు ఆజ్యం పోసినట్లయింది విద్యార్థులందరు ఉద్యమం వైపుగా పయనించారు విద్యార్థుల్లోని ఒక వర్గం తెలంగాణా కిచ్చిన వాగ్దానాల్ని అమలు చేయాలని కోరగా, మరో వర్గం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరింది తెలంగాణా ప్రాంతానికి చెందిన ఆరువేల ఉద్యోగాల్లో పనిచేస్తున్న ఆంధ్ర ప్రాంతీయుల్ని తిరిగి పంపనట్లయితే ప్రత్యక్ష చర్యకు పూనుకుంటామని తెలంగాణా నాన్-గెజిటెడ్ ఉద్యోగులు ప్రభుత్వానికి హెచ్చరించారు

కొన్ని ప్రాంతాల్లో ఈ ఉద్యమం హింసాయుతంగ మారింది ఈ హింసాయుత ఉద్యమం ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చేయాలని రాష్ట్ర అసెంబ్లీలోని ప్రతిపక్ష పార్టీలైన భారతీయ జనసంఘ్, ముస్లిం మజ్లిస్, సంయుక్త సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిస్టు పార్టీలు ముఖ్యమంత్రిని కోరాయి మరియు ఈ ఉద్యమాన్ని అలక్ష్యం చేయవద్దని ముఖ్యమంత్రిని హెచ్చరించాయి తెలంగాణా కిచ్చిన వాగ్దానాల్ని అమలు చేయకపోతే తాము కూడా విద్యార్థులతో చేతులు కలిపి ఉద్యమాన్ని కొనసాగిస్తామని బెదిరించారు

1969 జనవరి 18, 19 న ముఖ్యమంత్రి రాష్ట్ర అఖిల పక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో రెండు ముఖ్యమైన విషయాల్ని చర్చించారు తెలంగాణాలోని ఆంధ్రోద్యోగుల్ని వెనక్కు పంపి వేయడం మొదటి అంశం కాగా, తెలంగాణా ఆదాయంలో మిగులు ఆదాయం ఎంతో తెలపాలనేది రెండవది తెలంగాణా ప్రాంతపు మిగులు ఆదాయాన్ని నిర్ణయించేందుకు ఒక సీనియరు అధికారిని నియమించేందుకు అన్ని పార్టీలు

అంగీకరించాయని ముఖ్యమంత్రి ప్రకటించారు తెలంగాణా ఉద్యోగులకు ఆంధ్ర ప్రాంతంలో ఉద్యోగాలు కల్పిస్తామని కూడ ముఖ్యమంత్రి ప్రకటించాడు ఇంతేకాక ఆందోళన చేస్తున్న విద్యార్థుల్ని తమ ఆందోళన విరమించి రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడి స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించమని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశాడు

అయితే దురదృష్టవశాత్తు జనవరి 20న హైదారాబాదులో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరిపారు ఈ సంఘటన విద్యార్థుల్ని రెచ్చగొట్టడంతో ముఖ్యమంత్రి విజ్ఞప్తిని పట్టించుకునేవారే లేకపోయారు విద్యార్థులు ఆందోళనను కొనసాగిస్తూనే ఉండడంతో ప్రభుత్వం సంక్రాంతి సెలవుల్ని పొడిగించింది జనవరి 22న ఆందోళన తెలంగాణా మొత్తం మీద తీవ్రరూపం దాల్చడంతో రైల్వేలకు, ఇతర ప్రభుత్వ ఆస్తులకు తీవ్రమైన నష్టం వాటిల్లింది రాకపోక సౌకర్యాలకు కూడ అంతరాయం కల్గింది దీంతో పరిస్థితిని అదుపులో పెట్టేందుకు ఆంధ్రోద్యోగుల్ని 1969 ఫిబ్రవరి 28 కల్లా తిరిగి పంపివేయడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది తెలంగాణా మిగులు ఆదాయాన్ని లెక్కపెట్టేందుకు భారత ప్రభుత్వ కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ఒక సీనియరు అధికారిని ఒక వారం లోపుగానే పంపేందుకు అంగీకరించినట్లు కూడ ప్రభుత్వం ప్రకటించింది ఈ ప్రకటనలు కూడ ఆందోళనను తగ్గించలేకపోయాయి

రెండు ప్రాంతాల ప్రజలు తీవ్రమైన మానసికోద్రిక్తతో ఉండగా నల్గొండలోని ఒక ఆంధ్రోద్యోగిని (డిప్యూటి సర్వేయరు) తెలంగాణా ఆందోళనాకారులు అగ్నికి ఆహుతి చేశారనే వదంతి వ్యాపించింది దీంతో ఆంధ్ర ప్రాంతంలో పోటీ ఆందోళన ప్రారంభమయింది

ఈ మధ్యలో 1969 మార్చి 9న ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేసేంతవరకు తరగతులకు హాజరు కావద్దని తెలంగాణా విద్యార్థి కార్యాచరణ కమిటి తెలంగాణా విద్యార్థులకు పిలుపునిచ్చింది ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కానిదే తెలంగాణాకు జరిగిన అన్యాయాల్ని పరిదిద్దలేమని సంజీవయ్య మంత్రివర్గంలో డిప్యూటీ ముఖ్యమంత్రిగ పనిచేసిన కె వి రంగారెడ్డి ప్రకటిస్తూ విద్యార్థులతో చేతులు కలిపాడు

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి విషమిస్తుండడంతో తెలంగాణా ప్రాంతంలో నియమితులైన ముల్కీలు కాని వారిని 1969 ఫిబ్రవరి 28 కల్లా వెనక్కు పంపమని సుప్రీంకోర్టు ఒక ఉత్తర్వును జారీ చేసింది ఈ ఉత్తర్వు గూడ రాజ్యాంగానికి అతీతమైందని తర్వాత ప్రకటించడం జరిగింది

తెలంగాణాకు చెందిన ఎనిమిదిమంది శాసనసభ సభ్యులు విద్యార్థులకు మద్దతు తెలిపి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని కోరడంతో ఉద్యమం ఒక కొత్త మలుపు తిరిగింది

ప్రారంభం నుండి పరిస్థితుల్ని గమనిస్తున్న ప్రధాన మంత్రి ఈ సమస్యను పరిష్కరించేందుకు 1969 ఏప్రిలు 11న లోక్‌సభలో ఒక ఎనిమిది అంశాల ప్రణాళికను ప్రకటించింది వీటిలో ముఖ్యమైనవి 1 తెలంగాణా మిగులు ఆదాయాన్ని నిర్ణయించేందుకు పదవీ విరమణ చేసిన లేక ప్రస్తుత సుప్రీం కోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన ఒక ఉన్నతాధికార కమిటీని నియమించడం, 2 తెలంగాణా అభివృద్ధి కార్యక్రమాన్ని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి అధ్యక్షతన తెలంగాణా అభివృద్ధి సంఘాన్ని ఏర్పాటు చేయడం 3 ప్రభుత్వోద్యోగాల్లో తెలంగాణా ప్రజలకు భద్రత కల్పించే విషయమై పరిశీలన జరిపేందుకు ఒక న్యాయవాదుల సంఘాన్ని నియమించడం

అయితే ప్రధానమంత్రి ఎనిమిది అంశాల ప్రణాళిక అసంతృప్తి వర్గ శాసనసభ సభ్యుల్ని, కాంగ్రేసేతర పార్టీలను సంతృప్తి పరచలేకపోయింది ఇంతవరకు విద్యార్థుల చేతుల్లో ఉన్న ఉద్యమం అసంతృప్తులైన రాజకీయ నాయకుల చేతుల్లోకి పోయింది వీరు తెలంగాణా ప్రజాసమితిని ఏర్పాటు చేసి దీనిద్వారా ఒక పద్ధతి ప్రకారం ఆందోళను నిర్వహించడం ప్రారంభించారు

1969 మే 1న 'తెలంగాణా కోర్కెల దినం'గా పాటించాలని ప్రజాసమితి ప్రజలకు పిలుపు నిచ్చింది తెలంగాణా కోర్కెల దినాన్ని పాటించడంవల్ల తెలంగాణాలోని కొన్ని ప్రాంతాల్లో హింసాయుత సంఘటనలు జరగాయి. దీంతో పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది ఢిల్లీలో చర్చలు జరిపేందుకు ప్రధానమంత్రి ప్రజాసమితి నాయకుల్ని ఆహ్వానించింది అయితే ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకు చర్చలు అనవసరమని 15 మంది ఆహ్వానితుల్లో 13 మంది ప్రధానమంత్రి ఆహ్వానాన్ని తిరస్కరించారు దీంతో యధాస్థితి

కొనసాగింది 1969 జూన్ 4న హైదరాబాదులో పరిస్థితులు విషమించి హింసాయుతంగా మారడంతో ప్రభుత్వం 33 గంటల కర్ఫ్యూను విధించింది దీంతో చాలమంది కాంగ్రెసు నాయకులు ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి రాజీనామా చేయాలని కోరారు

ఈ మధ్యలో ప్రజాసమితి నాయకుడైన డా ఎం చెన్నారెడ్డిని, విద్యార్థి ఆందోళన నాయకుడైన మల్లిఖార్జున్ను ప్రభుత్వం అరెస్టు చేసింది అయితే ఆందోళన మాత్రం 1969 అక్టోబరు వరకు కూడ కొనసాగింది నవంబరు కల్లా ప్రజాసమితిలో చీలిక ఏర్పడింది అసంతృప్తివాదులైన కాంగ్రెసు శాసనసభ్యులు కూడ తాము బ్రహ్మానందరెడ్డిని పదవి నుండి దింపలేమని భావించారు ప్రధానమంత్రి గట్టి మద్దతు నివ్వడంతో ముఖ్యమంత్రి తన పదవిని అంటిపెట్టుకుని ఉండగల్గాడు ఆందోళనలతోను, హింసాయుత పద్దతులతోను తనను లొంగదీయలేరని ప్రధానమంత్రి ప్రకటించింది నెమ్మదిగా రాష్ట్రంలో ప్రశాంతత నెలకొంది బ్రహ్మానందరెడ్డి తన మంత్రి వర్గాన్ని విస్తరించి జె వి చొక్కారావును డిప్యూటి ముఖ్యమంత్రిగ నియమించాడు

తెలంగాణా వారికి ముఖ్యమంత్రి పదవిని ఇవ్వడం కోసం బ్రహ్మానందరెడ్డి 1971 సెప్టెంబరులో తన పదవికి రాజీనామా చేశాడు 1971 సెప్టెంబరు 25న తెలంగాణాకు చెందిన పి వి నరసింహారావు కాంగ్రెసు శాసనసభా నాయకుడుగా ఎన్నికయ్యాడు తెలంగాణా ప్రజాసమితి నాయకులు గూడ తిరిగి కాంగ్రెసు పార్టీలో చేరారు. తర్వాత కొన్ని రోజులకు పి వి నరసింహారావు మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొదటిసారిగ తెలంగాణా వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యాడు

పి వి నరసింహారావు ముఖ్యమంత్రిత్వంలో ఆంధ్రప్రదేశ్ లో మరో ఉద్యమం తలెత్తింది అయితే ఈసారి ఉద్యమం ఆంధ్రప్రాంతంలో తలెత్తడం విశేషం ముల్కీ సమస్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల ఆంధ్రప్రాంతంలో ఉద్యమం ప్రారంభం అయింది

1956 లో హైదరాబాదు రాష్ట్రాన్ని మూడు భాగాలుగ విభజించినప్పటి నుండి తెలంగాణా ప్రాంతంలో ముల్కీ నియమాలు అమలులో ఉన్నాయి దీని

ఫలితంగా ఆంధ్రప్రాంతం ప్రజలు తెలంగాణా ప్రాంతంలోని ప్రభుత్వోద్యోగాల్లో చేరేందుకు వీలుపడేది కాదు కొంతమంది ఆంధ్రప్రాంత ఉద్యోగులు ముల్కీ నియమాల్ని సవాలు చేస్తూ హైకోర్టులో కేసు దాఖలు చేశారు ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ముల్కీ నియమాలు చెల్లవని అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన న్యాయపీఠం 4-1 మెజారిటీతో తీర్పు నిచ్చింది

ముల్కీ నియమాల్ని అమలు చేయాలని ఇదివరకే వత్తిడి చేస్తున్న తెలంగాణా ప్రజలకు హైకోర్టు తీర్పు దిగ్భ్రాంతిని కల్గించింది తెలంగాణా ప్రజల్ని సంతృప్తి పరచేందుకు హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో కేసును దాఖలు చేస్తామని ముఖ్యమంత్రి పి వి నరసింహారావు ప్రకటించాడు ఇదేగాక ప్రభుత్వోద్యోగాల్ని ప్రాంతాలవారిగా సర్దుబాటు చేయగలమని, ఉద్యోగావకాశాల విషయంలో తెలంగాణా ప్రజల న్యాయబద్ధమైన ప్రయోజనాల్ని కాపడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కూడ ముఖ్యమంత్రి ప్రకటించాడు.

1972 అక్టోబరు 3న సుప్రీంకోర్టు ముల్కీ నియమాలకు కాలం చెల్లలేదని, అవి అమలులో ఉంటాయని తీర్పు నిచ్చింది ఈ తీర్పు రాష్ట్రంలో పెద్ద సంక్షోభాన్ని సృష్టించింది తమ స్వంత రాజధానిలోనే తమను రెండవ తరగతి పౌరులుగా పరిగణిస్తున్నారని ఆంధ్రప్రాంత ప్రజలు భావించారు తెలంగాణాతో తెగతెంపులు చేసుకుంటేనే తమ గౌరవ ప్రతిష్టలు నిలుస్తాయని వారు భావించారు

ముల్కీ నియమాల విషయమై ఆంధ్ర, తెలంగాణా ప్రాంత ప్రజల్లో నెలకొన్న భావోద్రిక్తను గమనించిన భారత ప్రభుత్వం ఒక రాజీ మార్గాన్ని అనుసరించాలని ప్రయత్నించింది ఈ ప్రయత్నంలో భాగంగానే హైదరాబాదు, సికందరాబాదులలో 1977 చివరివరకు, మిగిలిన తెలంగాణా ప్రాంతంలో 1980 చివరి వరకు ముల్కీ నియమాల్ని అమలు చేయాలని నిర్ణయించింది దీని కనుగుణంగానే 1972 డిశంబరు 23న పార్లమెంటు ఒక బిల్లును ఆమోదించింది తక్షణమే ముల్కీ నియమాల్ని రద్దు చేయాలని కోరుతున్న ఆంధ్రప్రాంత ప్రజలకు పై చర్య దిగ్భ్రాంతిని కల్గించింది తమకంటూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయితేనే తమ ప్ర[illegible] గౌరవం నిలుస్తాయని ఆంధ్రప్రాంత ప్రజలు

భావించారు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 'జై ఆంధ్ర' ఉద్యమాన్ని ప్రారంభించారు

ఆంధ్రప్రాంత కాంగ్రెసు సభ్యులు 1972 డిశంబరు 31 తిరుపతిలో సమావేశమైనారు ఈ సమావేశానికి చాలమంది ఆంధ్ర కాంగ్రెసు శాసనసభ సభ్యులు, కౌన్సిలు సభ్యులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు హాజరయినారు అంతకు ముందే డిప్యూటి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన బి వి సుబ్బారెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహించాడు ప్రభుత్వానికి పన్నులు కట్టకుండా నిషేధాజ్ఞల్ని ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనను స్తంభింపజేయాలని ఈ సమావేశం ప్రజలకు పిలుపు నిచ్చింది సమావేశపు నిర్ణయాల్ని అమలు చేసేందుకు సుబ్బారెడ్డి అధ్యక్షతన ఒక కార్యాచరణ కమిటి ఏర్పాటు చేయడం జరిగింది ఈ కమిటీలో అంతకు ముందే ముల్కీ నియమాల విషయమై రాజీనామా చేసిన 8 మంది మంత్రుల్లో 6 మంది మంత్రుల్ని సభ్యులుగా నియమించారు

జై ఆంధ్ర ఉద్యమం దావాగ్నిలా వ్యాపించడంతో ప్రభుత్వం పరిపాలన పూర్తిగ స్తంభించిపోయింది దీని ఫలితంగా 1973 జనవరి 18న రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు. రాష్ట్ర అసెంబ్లీని తాత్కాలికంగా రద్దు చేయడం జరిగింది. ఈ మధ్యలో డా॥మర్రి చెన్నారెడ్డి అధ్యక్షతన తెలంగాణా కాంగ్రెసు సభ్యుల సమావేశం హైదరాబాదులో 1973 జనవరి 21న జరిగింది ఈ సమావేశం ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడాలని తీర్మానించడమే గాక 'తెలంగాణా కాంగ్రెసు ఫోరం'గ రూపుదిద్దుకుంది

జై ఆంధ్ర ఉద్యమానికి విశేషమైన ప్రజాదరణ ఉన్నా సరియైన నాయకత్వం లెకపోవడంతో తగినంత పురోభివృద్ధిని సాధించలేకపోయింది సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించిన ఒకే ఒక నాయకుడు కాకాని వెంకటరత్నం 1972 డిశంబరు 25న గుండెపోటులో మరణించాడు చివరికి ఈ ఉద్యమం ప్రజలు అసహ్యించుకునే స్థాయికి దిగజారిపోయింది రాష్ట్రాన్ని చీల్చడం ఇష్టం లేని కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లో వేర్పాటు ఉద్యమాలకు వ్యతిరేకంగా ర్యాలీలు, ప్రదర్శనల్ని నిర్వహించడం ప్రారంభించింది

జై ఆంధ్ర ఉద్యమం రెండు నెలలకు పైగా కొనసాగినా ఇది కేంద్ర ప్రభుత్వంపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేకపోయింది ఆంధ్ర కాంగ్రెసు నాయకులకు ప్రశాంతత కరువైంది వీరు 1973 మార్చి 18న భావి కార్యక్రమాన్ని నిర్ణయించేందుకు చిత్తూరులో సమావేశమయ్యారు చాలమంది విద్యార్థులు కాంగ్రెసు నాయకులు రాజీనామా చేసి ఒక ప్రాంతీయ పార్టీని ఏర్పాటు చేయాలని నిలదీయటంతో సమావేశం గందరగోళంగా ముగిసింది

రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత గవర్నరు సలహాదారుల్లో ముఖ్యంగా హెచ్ సి శరీన్ సమర్ధవంతంగా పనిచేయడం ప్రారంభించాడు అయితే అప్పటికే ఆంధ్ర ప్రాంతంలోని నాన్-గెజిటెడ్ ఉద్యోగల సమ్మె వల్ల ప్రభుత్వ పాలన పూర్తిగ స్తంభించిపోయింది అయినప్పటికి శరీన్ వాకచక్యంగా వ్యవహరించడం 108 రోజుల ఎన్ జి ఓల సమ్మె 1973 మార్చి 25న విరమించడం జరిగింది

ఈ మధ్యలోనే తెలంగాణాలో పుట్టి పెరిగినవారు ముల్కీలు కారని, తెలంగాణాకు వలస వచ్చి అక్కడ స్థిరపడ్డవారే ముల్కీలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 1973 ఫిబ్రవరి 16న ఒక తీర్పు నివ్వడంతో ఉద్యమం కొంతవరకు మెలిక తిరిగింది ఈ తీర్పు వల్ల 1972 డిశంబరులో పార్లమెంటు చేసిన ముల్కీ చట్టం ద్వారా సంక్రమించిన కొద్దిపాటి ప్రయోజనాలు కూడ తెలంగాణా ప్రజలకు దక్కకుండా పోయాయి ఇక్కడే మనం ఒక విషయం చెప్పుకోవాలి ముల్కీ నియమాలు యధాతథంగా అమలులో ఉంటాయని సుప్రీంకోర్టు తీర్పు నిచ్చినపుడు ముల్కీ నియమాల్ని అమలు చేసే విషయంలో గాని, వాటి నిర్వచనాన్ని గూర్చిగాని కోర్టు ఎటువంటి అభిప్రాయాన్ని తెలుపలేదు దీనికి కారణం ఈ విషయాల్ని గూర్చి కోర్టులో ప్రస్తావించకపోవడమే దీని ఫలితంగా 1972 డిశంబరులో ముల్కీ నిర్వచనాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అనేక పిటీషన్లు దాఖలయ్యాయి 1973 జూలై 11న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మరో తీర్పునిస్తూ ముల్కీ నియమాలు (పాతవి, కొత్తవి కలిపి) ఉద్యోగ నియామకాల ప్రారంభంలో వర్తిస్తాయే గని తర్వాత ప్రమోషను, సీనియారిటీ, వెనుకటి ఉద్యోగానికి తిప్పిపంపడం, ఉద్యోగం నుండి తీసివేయడం (తాత్కాలిక ఉద్యోగి గాని, పర్మినెంటు ఉద్యోగిగాని) వంటి విషయాల్లో వర్తించవని స్పష్టం చేసింది

ఈ పరిణామాలతో పాటు ప్రజల మద్దతు కూడ క్రమంగా తగ్గిపోవడంతో ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న తమ కోర్కెలోని నిరుపయోగాన్ని ఆంధ్ర, తెలంగాణా ప్రాంత కాంగ్రెసు సభ్యులు గ్రహించగల్గారు దీంతో వీరు ఉద్యమం విరమించుకోవడం కోసం ఒక కారణాన్ని వెతుక్కోవలసి వచ్చింది ప్రజల్లో వచ్చిన మార్పును గమనించిన కేంద్ర ప్రభుత్వం రెండు ప్రాంతాల నాయకులతో చర్చలు జరిపి ఒక ఆరు సూత్రాల పథకాన్ని రూపొందించింది ఈ పథకాన్ని కొన్ని చిన్న చిన్న మార్పులతో రెండు ప్రాంతాల నాయకులు అంగీకరించారు

ఈ ఆరు సూత్రాలు ఇలా ఉన్నాయి:

1 ముల్కీ నిబంధనల్ని, తెలంగాణా ప్రాంతీయ కమిటీని రద్దు చేయడం

2 నాన్-గెజిటెడ్ ఉద్యోగాలకు, అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగాలకు స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత నివ్వడం

3 ప్రభుత్వోద్యోగుల సమస్యల్ని పరిష్కరించేందుకు ఒక ఉన్నతాధికార న్యాయసంఘాన్ని నియమించడం

4 రాష్ట్రస్థాయి ప్రణాళిక బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు వివిధ వెనుక బడిన ప్రాంతాలకు ఉపసంఘాల్ని నియమించడం

5 విద్యా సౌకర్యాల్ని కలిగించేందుకు హైదరాబాదులో ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం

6 పై చెప్పిన అయిదు సూత్రాల్ని అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని సవరించడం

ఆంధ్ర కాంగ్రెసు కార్యావరణ కమిటి 1973 అక్టోబరు 1న ఆరు సూత్రాల పథకాన్ని ఆమోదిస్తూ 10నెలలుగా సాగుతున్న జై ఆంధ్ర ఉద్యమాన్ని విరమించింది. ఈ ఆరు సూత్రాల పథకాన్ని చట్టబద్ధం చేస్తూ 1973 డిశంబరు 18న 33వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం ఆమోదించింది బిల్లుకు అనుకూలంగా 311 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 8 ఓట్లు మాత్రమే వచ్చాయి ఆరు సూత్రాల పథకాన్ని అంగీకరించడంతో నిరుపయోగమైన ముల్కీ-నిబంధనల్ని

రద్దు చేయడం జరిగింది 1958 లో ఏర్పాటు గావింపబడ్డ తెలంగాణా ప్రాంతీయ కమిటీని 1974 జనవరి 1 నుండి రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు రద్దు చేయడం జరిగింది 1973 డిశంబరు 10న రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను ఎత్తివేశారు జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా 15 మంది గల మంత్రి వర్గం ఏర్పాటయింది ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రాష్ట్రంలో మామూలు పరిస్థితులు నెలకొనడమే కాక రాజకీయ సుస్థిరత కూడ చోటుచేసుకుంది ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకోవడంతో రాష్ట్రం వ్యవసాయికంగా గొప్ప పురోభివృద్ధిని సాధించింది పరిశ్రమల రంగం కూడ బలం పుంజుకుని అభివృద్ధి దిశగా పయనించింది

1978 ఫిబ్రవరిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ సాధారణ ఎన్నికల్లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ (ఐ) పార్టీ ఘనవిజయం సాధించింది మొత్తం 294 స్థానాల్లో 175 స్థానాల్ని కాంగ్రెసు పార్టీ గెల్చుకుంది 1978 మార్చి 6న డాక్టరు మర్రి చెన్నారెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరవ ముఖ్యమంత్రిగ ప్రమాణ స్వీకారం చేశారు ప్రత్యేక తెలంగాణా సమస్య ఇకపై ఉండదని ఆయన ప్రకటించాడు 1980 అక్టోబరులో చెన్నారెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో టి అంజయ్య ముఖ్యమంత్రి పదవిని స్వీకరించాడు

రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత చేకూర్చడంలో అంజయ్య విఫలుడయ్యాడు కాంగ్రెసు పార్టీలోని వివిధ వర్గాల్ని సంతృప్తి పరచేందుకు 63 మంది సభ్యులు గల మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశాడు దీంతో సహజంగానే అంజయ్య శక్తి సామర్థ్యాలపై అనుమానాలు తలెత్తాయి మంత్రివర్గాన్ని కుదించేందుకు కాంగ్రెసు అధిష్టాన వర్గం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది అదిష్టాన వర్గం జోక్యం వల్ల అంజయ్య క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది మంత్రిపదవులు కోల్పోయిన వారు అసంతృప్తి వర్గంగా ఏర్పడి అంజయ్య మంత్రివర్గాన్ని పడగొట్టేందుకు శాయశక్తులా కృషి చేశారు తమ ప్రయత్నంలో విజయం సాధించారు 1982 ఫిబ్రవరిలో అంజయ్య స్థానంలో భవనం వెంకటరామారెడ్డి ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు అంజయ్య తన పదవీ కాలంలో పంచాయితీ సమితులు, మునిసిపాలిటీలు, విజయవాడ, విశాఖపట్నం మునిపల్ కార్పోరేషన్ల వంటి స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాడు కాంగ్రెసు పార్టీ ఈ ఎన్నికల్లో

లధికారికంగా పోటి చేయలేకపోయినా వివిధ పదవులకు పోటీ చేసేందుకు తన అభ్యర్థుల్ని అనుమతించింది విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషను ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ మెజారిటి సాధించి మేయరు పదవిలో తన అభ్యర్థిని నియమించింది విజయవాడలో కమ్యూనిస్టు పార్టీ (CPI) మార్క్సిస్టు పార్టీ (CPI-M)లు విజయాలు సాధించడంతో తమ అభ్యర్థుల్ని వరుసగా మేయరుగాను, డిప్యూటి మేయరుగాను నియమించాయి. అంజయ్యను ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించడం మునిసిపల్ కార్పొరేషను ఎన్నికల్లో పార్టీ పరాజయానికి ఒక్క కారణమయింది.

## 'తెలుగు దేశం' ప్రాంతీయ పార్టీ అవతరణ

ఢిల్లీలోని కాంగ్రేసు పార్టీ అదిష్టాన వర్గం తరచుగ ముఖ్యమంత్రుల్ని మార్చడంతో ప్రజల్లో పలుకుబడిలేని స్వార్థపరులైన రాజకీయనాయకులు రాష్ట్ర ప్రయోజనాల్ని అలక్ష్యం చేస్తున్నారన్న భావన ప్రజల్లో ఏర్పడింది పొరుగు రాష్ట్రమైన తమిళనాడు ప్రాంతీయ పార్టీ పాలనలో పరిశ్రమలు, రవాణా సౌకర్యాలు మొదలగు వాటిలో సాధించిన విజయాల్ని చూచిన ఆంధ్ర ప్రజలు రాష్ట్ర ప్రగతికి ప్రాంతీయపార్టీ ఒక్కటే వరణ్యమని భావించారు

ఈ పరిస్థితుల్లోనే తెలుగు సినిమా ప్రపంచంలో మహానటుడుగ పేరొందిన నందమూరి తారక రామారావు 'తెలుగుదేశం' పేరుతో ప్రాంతీయ పార్టీ ని ఏర్పాటు చేస్తున్నట్లు 1982 మే నెలలో ప్రకటించాడు తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించిన కొన్ని వారాలకే కాంగ్రెసు పార్టీ సభ్యుల్లో కలవరం పుట్టించే స్థితికి ఎదిగిపోయింది దీంతో వీరు భవనం వెంకట రామారెడ్డి ప్రభుత్వం 1983 ఫిబ్రవరిలో జరగాల్సిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని సమర్థవంతంగా ఎదుర్కోలేకపోవచ్చునని భావించారు అందువల్ల కాంగ్రెసు అదిష్టానవర్గం 1982 అక్టోబరులో భవనం వెంకటరామారెడ్డి స్థానంలో కె విజయభాస్కర రెడ్డిని ముఖ్యమంత్రిగ నియమించింది 1983 జనవరి 5న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించడం జరిగింది ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో ఊహించలేని పరిస్థితి ఏర్పడింది అయితే ఇది వరకు ఇందిరా కాంగ్రెసుకు కంచుకోటగా ఉండిన కొన్ని వర్గాల్లో సైతం తెలుగుదేశం పార్టీకి విశేషమైన ఆదరణ లభించిందనేది మాత్రం తిరుగులేని సత్యంగా భావించవచ్చు

1983 జనవరి 5న జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయాన్ని సాధించింది 294 అసెంబ్లీ స్థానాల్లో 202 స్థానాల్ని తెలుగుదేశం పార్టీ సంపాదించగల్గింది తెలుగుదేశం పార్టీ విజయం చరిత్రలో ఒక అతి ముఖ్యమైన ఘట్టంగా పేర్కొనవచ్చు కేవలం తొమ్మిది నెలల చరిత్ర గల తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ స్థానాల్లోని మూడింట రెండో వంతు స్థానాలకు పైగా మెజారిటీని సాధించగల్గింది 15 మంది మంత్రులతో పాటు చాలమంది కాంగ్రెసు ప్రముఖులు తెలుగుదేశం పార్టీ చేతిలో పరాజయాన్ని చవిచూశారు తెలుగుదేశం పార్టీ తరఫున విజయం సాధించిని అభ్యర్థులు అందరు కూడ రాజకీయాలకు కొత్తేకాక మొదటిసారిగ పోటీ చేస్తున్నవారే కావడం ఒక ప్రత్యేకతగ చెప్పవచ్చు

కాంగ్రెసు పరాజయానికి మూలమైన అనేక కారణాల్లో తరచు ముఖ్యమంత్రుల్ని మార్చడం ఒక ముఖ్య కారణంగా పేర్కొనవచ్చు నాల్గు సంవత్సరాల్లో నలుగురు ముఖ్యమంత్రులు (ఎం చెన్నారెడ్డి, టి అంజయ్య, భవనం వెంటరామారెడ్డి, కె విజయ భాస్కరరెడ్డి) మారారన్న అపఖ్యాతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్కింది తరుచుగ జరిగిన మార్పులు, అసమర్ధతకు, అవినీతికి దారితీశాయి 61 మంది సభ్యులు గల మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడంతో టి అంజయ్య అపహాస్యం పాలయ్యాడు అధికార దాహంతో తరచు ఢిల్లీకి పరిగెత్తే స్వార్ధపరులైన కాంగ్రేసు నాయకులు తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని ఆంధ్రప్రజలు భావించారు

ఆంధ్రప్రజల్లో ఇటువంటి మానసిక పరిణామం జరుగుతున్న సమయంలోనే ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని కాపాడి వారి వ్యక్తిత్వాన్ని నిలుపగలనన్న నినాదంతో ఎన్ టి. రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి రాజకీయ రంగంలో ప్రవేశించాడు ఈ కొత్త పార్టీకి ప్రజల్లో విశేషమైన ఆదరణ లభించింది ఈ కొత్త పార్టీని కాంగ్రేసు నాయకులు డ్రామాట్రూప్‌గాను, కమ్మవారి పార్టీగాను వర్ణించి విమర్శించారు అయితే రామారావు సుస్థిరమైన, పరిశుద్ధమైన పరిపాలనను అందించగలడన్న నమ్మకంతో ఆంధ్రప్రజలు తెలుగుదేశం పార్టీకి ఘన విజయాన్ని సాధించిపెట్టారు.

# 18

# రామారావు ప్రభుత్వం రద్దు – దాని తర్వాత పరిణామాలు

1983 జనవరి 9న నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి పదవిని చేపట్టడంలో రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత నెలకొనడమే కాక అవినీతికి తావులేని ప్రజారంజకమైన ప్రభుత్వం ఏర్పడగలదని ప్రజలు ఆశించారు. అయితే ఒక్క నెలలోపలే ప్రజల్లో ముఖ్యభాగమైన ఉద్యోగుల్ని రామారావు దూరం చేసుకున్నాడు వారి పదవీ విరమణ వయస్సును 58 నుండి 55 సంవత్సరాలకు తగ్గించాడు ఇదేగాక అవినీతి పేరుతో కొంతమంది సీనియరు ఐ ఎ ఎస్ అధికారుల్ని విచక్షణారహితంగా సస్పెండు చేస్తూ ప్రభుత్వ యంత్రాంగానికి కూడ దూరమయ్యాడు అవినీతి పరులైన ప్రభుత్వోద్యోగుల్ని విచారించేందుకు 'ధర్మ మహామాత్ర' అనే కొత్త పదవిని ఏర్పాటు చేశాడు. సీనియరు అధికారుల ఇళ్ళపై ధర్మమహామాత్ర జరిపించిన దాడుల వల్ల సెక్రటేరియట్ లో ఒక రకమైన స్తబ్దత ఏర్పడడమే కాక ప్రభుత్వ పాలన మామూలుగ సాగిపోక కుంటుపడి పోయింది రాష్ట్ర ప్రభుత్వం సస్పెండు చేసిన ముగ్గురు సీనియరు ఐ ఎ ఎస్ అధికారుల్ని కేంద్రప్రభుత్వం తిరిగి నియమించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం కొంతమంది అధికారులపై తీసుకున్న చర్య చాల బలహీనమైన కారణాల వల్లనేనని తెలుస్తున్నది

రామారావు తమతో వ్యవహరించే తీరుపట్ల తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు కూడ అసంతృప్తితో ఉండేవారు. వీరికి ఏ మాత్రం గౌరవం కూడ ఇవ్వక బడి పిల్లల వలె చూస్తు చివాట్లు పెట్టేవాడు. 1984 మే నెలలో విశాఖపట్నంలో జరిగిన తెలుగుదేశం పార్టీ రెండవ మహానాడులో తన పార్టీ ఎం.ఎల్ ఎల్ని గడ్డి

తినేందుకు సిద్ధంగా ఉన్న వ్యక్తులుగ నిందించాడనే వార్తను కూడ పత్రికలు వెల్లడించాయి దీంతో అదివరకే ముఖ్యమంత్రి అల్లుళ్ళ నిరంకుశత్వాన్ని చవిచూసిన శాసనసభ సభ్యులు మూగబాధను అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది ఇక్కడే మనం ఒక విషయం చెప్పుకోవాలి ముఖ్యమంత్రి ఎన్ టి రామారావు ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో తన అల్లుళ్ళు అయిన డి వెంకటేశ్వరరావు, ఎన్.చంద్రబాబు నాయుడులకు ప్రముఖ స్థానం ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి అదీగాక తన రెండో అల్లుడైన ఎన్ చంద్రబాబునాయుడు కాంగ్రెసు (ఐ) పార్టీలో ఉండి అంజయ్య మంత్రి వర్గంలో పని చేశాడు తర్వాత 1983 జనవరిలో జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీతో పోటీ చేసి ఓడిపోయారు ఇటువంటి వ్యక్తికి ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యత కల్పించడం వల్ల రామారావు నిందల్ని భరించాల్సి వచ్చింది

ముఖ్యమంత్రి ప్రజల్లో మరో ముఖ్యమైన వర్గాన్ని కూడ దూరం చేసుకున్నాడు వంశపారం పర్యంగా వస్తున్న కరణం, మునిసిఫ్ వంటి గ్రామాధికారుల పదవుల్ని రద్దుచేశాడు ఈ విధంగా తాను పదవిలోకి వచ్చిన 15 నెలలకే పట్టణాల్లోని విద్యావంతుల వర్గాన్ని, పల్లెల్లో పట్టును కల్గియున్న గ్రామాధికారుల వర్గాన్ని రామారావు దూరం చేసుకున్నాడు అయితే రెండు రూపాయలకే ఒక కిలో బియ్యం సరఫరా చేయడం వల్ల సంఘంలోని అట్టడుగు వర్గాల్లో మాత్రం రామారావు అధికారానికి ఎటువంటి ఢోకా లేకపోయింది.

రామారావు వ్యవహారసరళి కొంతమంది క్యాబినెట్ మంత్రులకు నచ్చలేదు మంత్రివర్గంలో ఒకడైన ఎం రామచంద్రారావును అవినీతిపరుడుగ రామారావు సందేహించాడు. అందువల్ల ఒక పోలీసు అధికారిని పారిశ్రామిక వేత్త వేషంలో రామచంద్రరావు ఇంటికి పంపాడు పారిశ్రామిక వేత్త రూపంలో నున్న పోలీసు అధికారి రామచంద్రరావుకు 10 వేల రూపాయల లంచాన్ని ముట్ట చెప్పడానికి ప్రయత్నించాడు పోలీసు అధికారి, మంత్రి మధ్య జరిగిన సంభాషణలు రహస్యంగా రికార్డు చేశారు వెంటనే రామచంద్రారావును అవినీతి ఆరోపణలతో మంత్రివర్గం నుండి తొలగించారు ఈ సంఘటన తాత్కాలికంగా రామారావుకు ప్రయోజనం చేకూర్చినా దీని తర్వాత పరిణామాలు మాత్రం దారుణంగా తయారయ్యాయి అవినీతిపరులుగ ముద్ర వేస్తారన్న భయంతో మంత్రులు

స్వతంత్రంగా వ్యవహరించి సకాలంలో నిర్ణయాలు తీసుకునేందుకు వెనుకాడారు దీని ఫలితంగా ప్రభుత్వ పాలనలో మందకొండితనం చోటుచేసుకుంది

## భాస్కరరావుతో అభిప్రాయబేధాలు

తన మంత్రివర్గ సహచరుడైన నాదెండ్ల భాస్కరరావుతో సత్సంబంధాల్ని కలిగి ఉండడంలో రామారావు విఫలుడయ్యాడు వృత్తిరీత్యా న్యాయవాదియైన భాస్కరరావు కోస్తా ప్రాంతంలోని గుంటూరు జిల్లాకు చెందినవాడు కాంగ్రెసు (ఐ) పార్టీలో సభ్యుడుగ ఉండి సంజయ్‌గాంధీతో సన్నిహిత సంబంధాల్ని కలిగి ఉండేవాడు చెన్నారెడ్డి, అంజయ్యల మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశాడు ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావాలని కలలు కన్నాడు అయితే ఆయన కోరిక ఫలించలేదు అందువల్ల ఆయన కాంగ్రెసు (ఐ) పార్టీని వదలిపెట్టి రామారావును రాజకీయరంగంలోకి దింపడంలో కృతకృత్యుడయ్యాడు తెలుగుదేశం పార్టీ సహవ్యవస్థాపకుడుగా తన్ను తాను భావించుకున్నాడు తెలుగుదేశం పార్టీకి పైలెట్ రామారావు అయితే, తాను కో-పైలట్‌నని భాస్కరరావు తనను తానే అభివర్ణించుకునేవాడు

1983 జనవరిలో అఖండ విజయాల్ని సాధించిన రామారావు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు భాస్కరరావును మంత్రిగా చేశాడే తప్ప క్యాబినెట్‌లో రెండవ స్థానాన్ని ఇవ్వలేదు ఈ చర్య భాస్కరరావును సహజంగానే నొప్పించింది అయితే ఆయన ఆ సమయంలో ఏమీ చేయలేక కాలం వెళ్ళబుచ్చాడు

హృదయ సంబంధమైన శస్త్ర చికిత్స కోసం రామారావు 1984 జూన్‌లో అమెరికా వెళ్లాడు దాదాపు రెండు నెలల పాటు దేశం విడిచి వెళ్లవలసి వచ్చినా అత్యవసరం సమయాల్లో తనకు మారుగ నిర్ణయాలు తీసుకోవడానికి ఏ మంత్రికి రెండవ స్థానాన్ని కల్పించలేకపోయాడు రామారావు

## హైదరాబాదు నగరంలో మత కలహాలు

1978 నుండి హైదరాబాదు నగరంలో హిందువులకు ముస్లింలకు మధ్య కొట్లాటలు తరచు జరుగుతూ వచ్చాయి. 1984 జూలైలో హైదరాబాదు నగరం మరోసారి మతకలహాలకు గురైంది. ఇదివరకు లాగ కాక ఈసారి మాత్రం

కలహాలు తలెత్తిన కొన్నాళ్ళకే తగ్గిపోలేదు ఈ కొట్లాటలు కొన్ని వారాల పాటు కొనసాగాయి ప్రభుత్వం కూడ పరిస్థితుల్ని అదుపులో పెట్టలేక పోయింది ఈ సమయంలోనే విస్మయం కలిగే విధంగా హోంమంత్రి అయిన నాదెండ్ల భాస్కరరావు నుండి శాంతిభద్రతలకు సంబంధించిన అధికారాన్ని తీసివేయడం జరిగింది అయితే అపుడు కూడ భాస్కరరావు ఏమీ చేయలేకపోయాడు తాను పాతనగరాన్ని సందర్శించి పరిస్థితుల్ని సమీక్షించేందుకు సైతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అడ్డు చెప్పాడని తర్వాత భాస్కరరావు వ్యాఖ్యానించాడు

హైదరాబాదు అల్లర్లను ఆసరాగా చేసుకుని తాను ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నిస్తున్నాడన్న విషయిం రామారావుకు తెలియడంతో అమెరికాలో తానుండవలసిన కాలాన్ని అర్ధాంతరంగా ముగించుకుని 1984 ఆగస్టు 14న రామారావు హైదరాబాదు చేరుకున్నారు.

## భాస్కరరావు రాజీనామా

హైదరాబాదు చేరుకున్న వెంటనే భాస్కరరావును తన మంత్రివర్గం నుండి తొలగించవలసిందిగ రామారావు గవర్నరు రాంలాల్‌కు వర్తమానం పంపాడు అయితే ఈ మధ్యలోనే భాస్కరరావు క్యాబినెట్ పదవికి రాజీనామా చేశాడు భాస్కరరావుకు మద్దతుగా జీవనరెడ్డి, రామమునిరెడ్డి, సత్యనారాయణ అనే మరో ముగ్గురు మంత్రులు రాజీనామా చేశారు తెలుగుదేశం పార్టీకి చెందిన చాలమంది శాసనసభ్యులు భాస్కరరావు చర్యను అనుసరించారు ఈ విధంగా తెలుగుదేశం పార్టీ నిలువునా చీలిపోయింది 90 మంది తెలుగుదేశం పార్టీ ఎం ఎల్ ఎలతో పాటు మరో 15 మంది ఎం ఎల్ ఎలు తనకు మద్దతు ఇస్తున్నారని భాస్కరరావు తెలిపాడు 294 మంది గల అసెంబ్లీలో 59 మంది కాంగ్రెసు (ఐ) ఎం ఎల్ ఎలు భాస్కరరావుకు మద్దతు ఇచ్చేందుకు నిర్ణయించారు

## ముఖ్యమంత్రి పదవి నుండి రామారావు తొలగింపు

1984 ఆగస్టు 15న భాస్కరరావు మెజారిటి సభ్యుల మద్దతును కలిగి ఉన్నాడని భావించిన గవర్నరు రాంలాల్ రామారావును ముఖ్యమంత్రి పదవి నుండి వైదొలగవలసిందిగా కోరాడు అయితే తనకు మెజారిటి ఉన్నదని భావించిన రామారావు ఇందుకు అంగీకరించక పోవడమే కాక 48 గంటలలోపునే

అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించగలనని చెప్పాడు అయినప్పటికి గవర్నరు రామారావును ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించాడు ఆగస్టు 16న భాస్కరరావు ముఖ్యమంత్రిగ ప్రమాణం స్వీకారం చేశాడు.

## ప్రజల ప్రతిస్పందన

పథకం ప్రకారం జరిగిన రామారావు తొలగింపు, గవర్నరు పక్షపాత ధోరణి ఆంధ్రప్రదేశ్ లో తీవ్రమైన అలజడిని సృష్టించాయి భాస్కరావు రామారావును వెన్నుపోటు పొడిచాడని ప్రజలు భావించారు తుదివరకు పోరాడడానికి ఆయన చుట్టూ చేరారు రాష్ట్రంలో తనకు పలుకుబడి క్రమంగా తగ్గుతున్న సమయంలో ఈ తొలగింపు రామారావుకు ఒక గొప్ప వరంగా పరిణమించింది రామారావు తొలగింపు సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న జాతీయ ప్రతిపక్షాలకు సైతం చక్కటి అవకాశాన్ని కల్గించింది 1984 డిశంబరులో జరుగబోవు సాధారణ ఎన్నికల్లో కాంగ్రెసు (ఐ) పార్టీపై ధ్వజమెత్తనున్న జాతీయ ప్రతిపక్షాలు ఆంధ్రప్రదేశ్ లోని రాజకీయ పరిస్థితిని తమకు అనుకూలంగా వినియోగించడానికి ప్రయత్నించాయి చివరకు అమృతసర్ లో, 'బ్లూస్టార్' ఆపరేషన్ తో ప్రజల్లో విపరీతమైన పలుకుబడిని పెంచుకున్న ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీపై పై వివాదం ఆధారంగా ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి

## యథాస్థితిని నెలకొల్పేందుకు పోరాటం

ఆంధ్రప్రదేశ్ ప్రజల నుండి, జాతీయ ప్రతిపక్షాల నుండి విశేషమైన మద్దతు రావడంతో గవర్నరు చర్యకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించి తిరిగి ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలని రామారావు నిర్ణయించాడు.

తనకు మద్దతు నిస్తున్న 161 మంది ఎం ఎల్ ఎలలో రామారావు ఢిల్లీకి వెళ్ళి ఆగస్టు 21న రాష్ట్రపతి జైల్ సింగును కలుసుకున్నాడు. గవర్నరు రాంలాల్ ను వెనక్కు రప్పించాలని, భాస్కరరావును ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించి రామారావును ఆ పదవిలో తిరిగి నియమించాలని రామారావు, ప్రతిపక్షాలు కలసి ఒక వినతి పత్రాన్ని రాష్ట్రపతికి సమర్పించాయి దీనికి ప్రత్యుత్తరంగా రాష్ట్రపతి రాజ్యాంగానికి బద్ధుడనై ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించ గలనని చెప్పాడు.

## రాంలాల్ రాజీనామా

రామారావు రాష్ట్రపతిని కలిసిన మూన్నాళ్ళకే (1984 ఆగస్టు 24న) రాంలాల్ తన గవర్నరు పదవికి రాజీనామా చేశాడు మరీ నిర్లక్ష్యంగా వ్యవహారించాడని రాష్ట్రపతి మందలించినట్లు వార్తలు రావడంతో రాంలాల్‌కు రాజీనామా చేయక తప్పలేదు

రాంలాల్ రాజీనామా బెంగుళూరులో నిర్బంధంలో ఉన్నట్లు భావిస్తున్న రామారావు మద్దతు దార్లకు కొంత ఉపశమనం కల్గించింది తమ ఢిల్లీ పర్యటన విఫలం కాలేదని వారు భావించారు వారు కోరిన ప్రధానమైన కోర్కెల్లో ఒకటి నెరవేరింది

అయితే ఢిల్లీలో జరిగిన ఎం ఎల్ ఎల ప్రదర్శనలో పాల్గొన్న రాష్ట్ర అసెంబ్లీ స్పీకరు టి సత్యనారాయణ, డిప్యూటి స్పీకరు భీంరెడ్డి నాదెండ్ల వర్గంలో చేరడంతో కొత్త ముఖ్యమంత్రి భాస్కరరావుకు తక్షణ విజయం చేకూరినట్లయింది స్పీకరు ఫిరాయింపు ఇదివరకే దెబ్బతిన్న రామారావును మానసికంగా కృంగతీసింది హైదరాబాదుకు వచ్చినట్లయితే బెంగుళూరు, మైసూరుల్లో మకాం పెట్టిన తన మద్దతుదారులందరూ భాస్కరరావు వర్గంలోకి ఫిరాయిస్తారన్న భయం రామారావుకు కల్గింది

## రామారావు ఆంధ్రదేశ పర్యటన

తన మద్దతు దారులు బెంగుళూరు, మైసూరుల్లో ఉండగనే ఆగస్టు 26నుండి సెప్టెంబరు 3 వరకు రామారావు ఆంధ్రదేశమంతా పర్యటించాడు ఈ పర్యటన చాల విజయవంతమైంది

## రామారావు తిరిగి ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం

రాంలాల్ రాజీనామా చేసిన తర్వాత డాక్టరు శంకరదయాళ్ శర్మ ఆంధ్రప్రదేశ్ గవర్నరుగ నియమితులయ్యారు కొత్త గవర్నరు భాస్కరరావు బలాన్ని నిరూపించేందుకు హైదరాబాదులో సెప్టెంబరు 11న శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు

రామారావు మద్దతుదారులందరూ కూడ సెప్టెంబరు 10న హైదరాబాదు చేరుకున్నారు అప్పటికే మత కలహాల వల్ల నగరంలో కర్ఫ్యూ విధించబడింది

సెప్టెంబరు 11న 10-30 గంటలకు శాసనసభ సమావేశమైంది ఎం బాగారెడ్డి ప్రోటెం స్పీకరుగ బాధ్యతల్ని చేపట్టాడు సభలో గందరగోళం చెలరేగడంతో సభ మరుసటి రోజుకు వాయిదా పడింది మరల రెండు రోజులు కూడ సభా కార్యకలాపాలు నిర్వహించడానికి సాధ్యం కాకపోవడంతో సభ వాయిదా పడింది సభ్యుల అనుచిత ప్రవర్తనకు విసుగు చెందిన బాగారెడ్డి సెప్టెంబరు 13న ప్రొటెం స్పీకరు పదవికి రాజీనామా చేశాడు

తన బలాన్ని నిరూపించుకునేందుకు గవర్నరు రాంలాల్ భాస్కరరావుకు ఇచ్చిన ఒక నెల గడువు సెప్టెంబరు 14న ముగుస్తుండడంతో బాగారెడ్డి రాజీనామా రామారావు మద్దతుదారులకు ఆందోళన కల్గించింది అసెంబ్లీ మూడు రోజులపాటు సమావేశమయింది కాబట్టి ఆరు నెల్లపాటు నిరవధికంగా వాయిదా వేసే అధికారం గవర్నరుకు ఉందని కొంతమంది భావించారు ఒకవేళ ఇదే జరిగితే భాస్కరరావు తన బలాన్ని నిరూపించుకోకనే మరో ఆరునెలల పాటు ముఖ్యమంత్రిగ కొనసాగవచ్చునని దీని అర్థం

బాగారెడ్డి రాజీనామా తర్వాత తెలుగు, ఇంగ్లీషు భాషలు తెలియని మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ నాయకుడైన సలావుద్దీన్ ఒవైసీని ప్రోటెం స్పీకరుగ నియమించడం జరిగింది

ఒవైసీ సభను సెప్టెంబరు 20కి వాయిదా వేశాడు ఒవైసీ ప్రోటెం స్పీకరుగ నియమితుడు కావడంతో తాము దీర్ఘకాలిక ఉద్యమం చేపట్టవలసి వస్తుందేమోనని రామారావు మద్దతుదారులు భావించారు అయితే వివిధ సంఘటనలు ఆశ్చర్యకరంగా వారికి అనుకూలంగా మారాయి భాస్కరరావు బలనిరూపణను ఉద్దేశపూర్వకంగా జాగు చేస్తుండడంతో విసుగు చెందిన గవర్నరు శంకర్ దయాళశర్మ రాంలాల్ ఇచ్చిన గడువు సెప్టెంబరు 14తో పూర్తవడం వల్ల భాస్కరరావు రాజీనామా చేయాలని లేకపోతే తానే తొలగించవలసి వస్తుందని స్పష్టం చేశాడు దీంతో భాస్కరరావు రాజీనామా చేశాడు

సెప్టెంబరు 16న గవర్నరు ముఖ్యమంత్రి పదవిని చేపట్టాల్సిందిగా రామారావును ఆహ్వానించాడు. అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకునేందుకు గవర్నరు రామారావుకు ఒక నెల గడువును కూడ ఇచ్చాడు.

సెప్టెంబరు 20న అఖిల పక్ష కార్యాచరణ కమిటీ తలపెట్టిన 'భారత్ బంద్' ఎల్లో గవర్నరు రామారావును ముఖ్యమంత్రి పదవిని స్వీకరించాలని కోరాలని భావించడం జరిగింది. ఇదేగాక తాము ఈ సమస్యను ప్రజల ముందు ఉంచుతామని రామారావు మద్దతుదారులు గవర్నరుకు స్పష్టం చేయడం కూడ జరిగింది. ఈ పరిణామాలు ఆంధ్రదేశంలో అస్తవ్యస్త పరిస్థితిని సృష్టిస్తాయని బహుశా గవర్నరు భావించి ఉండవచ్చు.

సెప్టెంబరు 21న అసెంబ్లీలో రామారావు తన మెజారిటీ నిరూపించుకున్నాడు. ఎనిమిదవ లోక్‌సభ ఎన్నికల తేదీల్ని ప్రకటించిన తర్వాత వెంటనే అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేయకపోయినా, ఫిరాయింపు రాజకీయాల్లో పాల్గొన్నవారికి ప్రజాప్రాతినిధ్యాన్ని లేకుండా చేయాలన్న తలంపుతో నవంబరు 22న రామారావు అసెంబ్లీని రద్దు చేయించాడు.

1984 డిశంబరులో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో 43 స్థానాలకు పోటీచేసి 30 స్థానాల్ని గెల్చుకుని రాజీవ్‌గాంధీ ప్రభావాన్ని తిప్పికొట్టగల్గింది. కాంగ్రెసు (ఐ) కి కేవలం 6 స్థానాలు మాత్రమే దక్కాయి. మిగిలిన ఆరు స్థానాల్ని తెలుగుదేశం మిత్రపక్షాలు గెల్చుకున్నాయి.

## అసెంబ్లీ ఎన్నికలు (1985 మార్చి 5)

1985 మార్చి 5న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ప్రజలు రామారావుకు తిరుగులేని అధికారాన్ని కట్టబెట్టారు. 294 అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ 202 స్థానాల్ని, దాని మిత్రపక్షాలు 41 స్థానాల్ని, కాంగ్రెసు (ఐ) పార్టీ 49 స్థానాల్ని గెల్చుకున్నాయి.

## భాస్కరరావు ఓటమి

ప్రజాస్వామ్యం తెలుగుదేశం పార్టీ తరఫున భాస్కరరావు నిలబెట్టిన 220 మంది అభ్యర్థుల్లో ఒక్కరు కూడ విజయం సాధించలేకపోయారు. దాదాపు

118 మంది అభ్యర్థులు తమ డిపాజిట్లను కూడ కోల్పోయారు హైదరాబాదు నగరంలోని మలక్‌పేట నియోజక వర్గం నుండి పోటీ చేసిన భాస్కరరావు తెలుగుదేశం మద్దతు ఉన్న భారతీయ జనతాపార్టీ అభ్యర్థి చేతిలో దాదాపు 17,000 ఓట్ల తేడాతో ఓడిపోయాడు భాస్కరరావు వర్గంలో చేరిన 55 మంది తెలుగుదేశం ఎం ఎల్ ఎలలో 44 మంది పోటీ చేయక పోగా ఇద్దరు కాంగ్రెసు (ఐ) టికెట్టుపైనా, మరో 9 మంది ప్రజాస్వామ్య తెలుగు దేశం పార్టీ టికెట్టుపైనా పోటీచేశారు వీరిలో కాంగ్రెసు (ఐ) టికెట్టుపై పోటీ చేసిన ఒక్కరు మాత్రం గెలువ గల్గారు దీనికి విరుద్ధంగా రామారావుకు మద్దతు ఇచ్చిన 99 మంది ఎం ఎల్ ఎ లలో 98 మంది సునాయాసంగా విజయం సాధించారు శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు నియోజక వర్గం నుండి పోటీ చేసిన ఒకే ఒక ఎం ఎల్ ఎ తిరిగి ఎన్నిక కాలేక పోయాడు.

రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతంలో కాంగ్రెస్ పరాజయాన్ని చవిచూసినా, రాజకీయ చైతన్యం గల కృష్ణా, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో మాత్రం చెప్పుకో దగ్గ విజయాన్ని సాధించింది. జన సామాన్యంలో 1983లో 38 శాతం వున్న తన బలాన్ని 44 శాతం వరకు కాంగ్రెస్ పార్టీ పెంచుకో గల్గింది తెలుగుదేశం పార్టీకి 47 శాతం ఓట్లు వచ్చాయి ఈ ఎన్నికల్లో రామారావు సాధించిన ఘనవిజయం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహద పడుతుందని ప్రజలు తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

# 19. రామారావు మూడవ మంత్రివర్గం

9 మార్చి 1985న రామారావు మూడవసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు క్రొత్త మంత్రివర్గాన్ని 15 మంది క్యాబినెట్ మంత్రులతోను 9 మంది సహాయ మంత్రులతోను ఏర్పాటు చేసారు మంత్రి వర్గం తీసుకున్న మొదటి చర్య శాసన సమితిని (Legslative council) రద్దు చెయ్యటం శాసనసభలో తెలుగుదేశం పార్టీకి పూర్తి మెజారిటీవున్నా 90మంది సభ్యులు గల శాసన సమితిలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 48 శాసనసమితిలో తెలుగుదేశం ఆదిపత్యం సంపాదించే అవకాశం లేదు అందుకని 30 ఏప్రిల్ 1985న శాసనసభ శాసన సమితిని రద్దుచేయమని తీర్మానించింది కాంగ్రెస్ (S) బి జె పి సభ్యులు యిందుకు నిరసనగా అసెంబ్లీనుండి 'వాకౌట్' (Walk Out) చేసారు శాసనసమితి 1 జూన్ 1985న రద్దు చేయబడింది కానీ 1989లో కాంగ్రెస్ అత్యధిక మెజారిటీతో అధికారంలోనికి తిరిగి వచ్చాక శాసన సమితిని పునరుద్ధరించడానికి చర్యలను తీసుకొంది 22 జనవరి 1990న శాసనసభ కేంద్రాన్ని శాసనసమితిని పునరుద్ధరించమని తీర్మానించింది

## సుప్రీంకోర్టు తీర్పు

1983 జనవరిలో రామారావు మొదటిసారిగా ముఖ్యమంత్రి అయిన మరుక్షణం ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాలనుండి 55 సంవత్సరాలకు తగ్గించారు ఈ చర్యను ఉద్యోగులు సుప్రీంకోర్టులో సవాలు చేసారు సుప్రీంకోర్టు న్యాయమూర్తులైన చిన్నప్పరెడ్డి, బాలకృష్ణ ఇరాడే, వి ఖలీద్ ఆగష్టు 1985 యిచ్చిన తీర్పులో ఆంధ్రప్రభుత్వాన్ని 55సంవత్సరాలకే రిటైర్ అయిన ఉద్యోగులలో యింకా 58 సంవత్సరాలు నిండని ఉద్యోగులను తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలని ఆదేశించింది ఈ తీర్పును ఆంధ్రప్రభుత్వం అమలు జరుపకుండా సుప్రీంకోర్టులో మరొక అర్జీ దాఖలు చేసింది ఈ అర్జీని సుప్రీంకోర్టు ఖర్చులతో సహా కొట్టివేసింది 1985 ఆగష్టున ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయమని ఆంధ్రప్రభుత్వాన్ని ఆదేశించింది సుప్రీంకోర్టు తీర్పు

ఫలితంగా నలభైవేల మంది ఉద్యోగులకు వారిచేత పనిమాన్పించిన కాలానికి జీత భత్యాల క్రింద రాష్ట్రప్రభుత్వ 158కోట్ల రూపాయలు చెల్లించాల్సి వచ్చింది తెలుగుదేశ ప్రభుత్వం తన తొందరపాటు చర్యల ద్వారా తన విజయానికి కారకులైన ప్రభుత్వోద్యోగుల సానుభూతిని కోల్పోయింది

## రిజర్వేషన్ల పెంపు

తెలుగుదేశంపార్టీ 1982లో ఆవిర్భావం జరిగిన నుండి అది ముఖ్యంగా రాజకీయ చెతన్యం కలిగిన గుంటూరు, కృష్ణా జిల్లాలలోని కమ్మ కులానికి చెందిన ధనవంతులైన భూకామందుల వ్యాపారస్థుల పార్టీ అని అపవాదును పొందింది ఈ అపవాదును తొలగించుకోవాలని తెలుగుదేశ ప్రభుత్వం 15జూలై 1986న ప్రభుత్వోద్యోగాలలోను విద్యారంగంలోను వెనుకబడిన తెగలవారికి 44శాతం యివ్వాలని నిర్ణయించింది ఈ నిర్ణయం వల్ల రిజర్వేషన్ల శాతం 67కు పెరిగింది

ఈ నిర్ణయం కందిరీగల తుట్టెను కదిలించింది విద్యార్థులు రిజర్వేషన్ల పెంపును వ్యతిరేకిస్తూ సమ్మెలు జరిపి ప్రభుత్వాన్ని స్థంబించారు రామారావు విద్యార్థుల వ్యతిరేకత యింత తీవ్రంగా వుంటుందని ఊహించలేదు మంత్రులకు ప్రజల ముందుకు రావడానికి ధైర్యం చాలలేదు కొందరు విద్యార్థులు న్యాయ స్థానంలో రిజర్వేషన్ల పెంపును సవాలు చేసారు హైకోర్టు న్యాయమూర్తులైన జీవన్‌రెడ్డి, రామస్వామి, ఆంజనేయులు ప్రభుత్వనిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు వెనుకబడిన తరగతులకు 25నుండి 44శాతానికి పెంచిన కేటాయింపును రద్దుచేసింది కానీ షెడ్యూల్ కులాలకు 14నుండి 15శాతాన్ని, షెడ్యూల్ తెగలకు 4నుండి 6శాతానికి పెండిన నిర్ణయాన్ని సమర్థించారు పరిపాలన యంత్రాంగంపై పట్టు కోల్పోతున్న సమయంలో వచ్చిన యీ హైకోర్టు తీర్పు ప్రభుత్వాన్ని యిరకాట పరిస్థితి నుండి తప్పించి, ఉపశమనం కలిగించింది

## అవినీతి ఆరోపణలు

విద్యార్థులు రిజర్వేషన్ల పెంపు పై ధ్వజమెత్తిన తరుణంలో కాంగ్రెస్ నాయకులు తెలుగుదేశం పార్టీ అధినేత రామారావుపై అవినీతి ఆరోపణలు తెచ్చి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టారు కాంగ్రెస్ నాయకుడు ద్రోణంరాజు సత్యనారాయణ ముఖ్యమంత్రి రామారావుపై అధికార దుర్వినియోగాన్ని

ఆరోపిస్తూ హైకోర్టులో అర్జీ దాఖలు చేసారు 2 జనవరి 1988న ఆంధ్రా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికె భాస్కరన్‌తో కూడిన ఖండపీఠం (Divisional Bench) సత్యనారాయణ దాఖలు చేసిన అర్జీ పరిశీలించ తగినదని తీర్పుయిచ్చింది దీంతో కాంగ్రెస్ నాయకులు రామారావు తన పదవికి రాజీనామా చేయాలని ఆందోళన ప్రారంభించారు

## మంత్రివర్గం రద్దు

ప్రభుత్వంపై వచ్చిన ప్రజావ్యతిరేకతను కొందరు తెలుగుదేశ నాయకులు ఆసరాగా తీసుకొని తమ వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవాలని రామారావును పరోక్షంగా ఆక్షేపించారు రామారావు వారి ఎత్తులను సాగనీయకుండా 31 మంది సభ్యులుగల తన మంత్రిమండలిని రద్దు చేసి 15 ఫిబ్రవరి 1988న నూతన మంత్రివర్గాన్ని ఏర్పరిచారు 23మంది సభ్యులు గల యీ మంత్రి మండలిలో పాత మంత్రిమండలికి చెందిన ఏఒక్కరినీ చేర్చుకోలేదు

1988 సంవత్సరమంతా కాంగ్రెస్ నాయకులు తెలుగుదేశ ప్రభుత్వ వైఫల్యాన్ని దుయ్యపట్టారు 1989 సంవత్సర ప్రారంభంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్య విభేధాలు తీవ్రరూపం దాల్చాయి ప్రభుత్వాన్ని రెచ్చకొట్టడానికి కాంగ్రెస్ నాయకులు ప్రతీ అవకాశాన్ని వినియోగించుకున్నారు యువజన కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ప్రాంగణంలోనికి ప్రవేశించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేసారు దీనిపై అసెంబ్లీ 29మార్చి 1989న 32మంది యువజన కాంగ్రెస్ నాయకులకు 30రోజుల కారాగార శిక్ష విధించింది

## న్యాయ వ్యవస్థతో ఘర్షణ

కాంగ్రెస్ అసెంబ్లీకి శిక్ష విధించే న్యాయస్థాన అధికారంలేదని, స్పీకర్ తీసుకున్న చర్యను ఆక్షేపిస్తూ సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసింది సుప్రీంకోర్టు రాజ్యాంగ ఖండపీఠం (Constitutional Divisional Bench) 25ఏప్రిల్1989న సికింద్రాబాద్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులను విడుదల చేయమని స్పీకర్‌కు ఉత్తర్వు జారీ చేసింది కానీ అసెంబ్లీ స్పీకర్, జి నారాయణరావు సుప్రీంకోర్టు ఉత్తర్వును అమలు జరుపడానికి నిరాకరించారు యువజన కాంగ్రెస్ నాయకులను శిక్షపూర్తి అయిన తరువాత విడుదల చేసారు

సుప్రీంకోర్టు స్పీకర్ ధిక్కారాన్ని పరిగణించి, అతనిపై ఎందుకు చర్య తీసుకోరాదని తెలపమని నారాయణరావుకు నోటీస్ 26 సెప్టెంబరు 1989న జారీ చేసింది కానీ యీ విషయం అంతటితో వదిలివేసారు

న్యాయవ్యవస్థతో ఘర్షణ, కాంగ్రెస్ వారితో కీటులాటలు, తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠను దిగదార్చాయి ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వం అనవసర కీచులాటతో పరిపాలనను అశ్రద్ధ చేస్తున్నాదనే అభిప్రాయానికి వచ్చారు

## విశ్వామిత్ర చిత్ర నిర్మాణం

ప్రజాసమస్యల మీదనుండి దృష్టి మళ్ళించి విశ్వామిత్ర చిత్ర నిర్మాణంపై మనస్సు లగ్నం చేసి రామారావు మరొక వివాదంలోనికి దిగారు ఈ చిత్రం 1989 సాధారణ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయావకాశాలను పెంపొందించడానికి నిర్మిస్తున్నారని ఊహాగానాలు బయలుదేరాయి కాంగ్రెస్ వారు హైకోర్టులో రామారావు విశ్వామిత్ర చిత్రంలో నటించి దర్శకత్వం వహించరాదని సవాలు చేసారు హైకోర్టు తన తీర్పులో మంత్రుల ప్రవర్తనా నియమావళి న్యాయ పరిధిలోనికి రాదని కాంగ్రెస్ అర్జీని తిరస్కరించింది

రామారావు తన నిరంకుశ ధోరణిపై వస్తున్న విమర్శలను గ్రహించి కొంతమంది పార్టీ నాయకుల్ని తృప్తిపరచడానికి 3 సెప్టెంబరు 1989 తన మంత్ర వర్గాన్ని విస్తరించారు క్రొత్తగా చేర్చుకున్న మంత్రులలో రామారావు పెద్దల్లుడు వెంకటేశ్వరరావు ఒకరు

## 1989సాధారణ ఎన్నికలు

1989 నవంబరున జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో మెజారిటీ రాలేదు 543 సభ్యులు గల లోక్ సభలో 192 స్థానాలను గెలిచి కాంగ్రెస్ పెద్దరాజకీయపార్టీగా నిలచింది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 42 స్థానాలలో కాంగ్రెస్ 39 స్థానాలను గెలిచింది తెలుగుదేశం పార్టీకి రెండు స్థానాలు దక్కాయి

## రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం

లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు కూడా ఎన్నికలు

జరిగాయి 1983లో ఓటమిని చవిచూచిన కాంగ్రెస్ (I)పార్టీ అఖండ విజయం సాధించింది 294 సభ్యులు గల శాసనసభలో 180 స్థానాలను గెలివింది గత అసెంబ్లీలో 202 స్థానాలు కలిగిన తెలుగుదేశం పార్టీ కేవలం 74 స్థానాలనే గెలిచింది నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్ రామారావు మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు కానీ ఆయన పోటీ చేసిన రెండవ స్థానంనుండి గెలుపొందారు అది అనంతపురం జిల్లాలోని హిందూపురం నియోజకవర్గం

కాంగ్రెస్ విజయానికి కారకుడైన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుడాగా ఎన్నుకోబడ్డారు ఆయన 3 డిశంబరు 1989న ముఖ్యమంత్రి అయ్యారు కానీ ఆపదవిలో కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే ఉండగలిగారు

**నేదురుమల్లి జనార్ధన రెడ్డి**

చెన్నారెడ్డి తరువాత నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలను 22 డిశంబరు 1990లో చేపట్టారు కానీ ఆయన పదవిలో స్థిరంగా వుండలేదు మరొక కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ వై యస్ రాజశేఖర్‌రెడ్డి జనార్ధనరెడ్డిపై ధ్వజమెత్తి ఆయనను రాజీనామా చేయించగలిగాడు కోట్ల విజయభాస్కరరెడ్డి 9 10 92న రెండవసారిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు కాంగ్రెస్ వారు 1983లో తమ ఓటమి కారణాలను మరచి తిరిగి కీచులాటలు మొదలు పెట్టారు దీని ఫలితంగా డిశంబర్ 1994లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పరాజయం పొందింది

## లోక్‌సభ మధ్యాంతర ఎన్నికలు మే, జూన్ 1991

1991 మే, జూన్ నెలలలో లోక్ సభ మధ్యంతర ఎన్నికలు జరిగాయి మే 21, 1991 రాజీవ్‌గాంధీ హత్య జరిగింది ఈ ఎన్నికలలో రాష్ట్రానికి చెందిన 42 లోక్‌సభ స్థానాలలో 13 స్థానాలలో తెలుగుదేశం పార్టీ గెలుపొందింది ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ రాజీవ్‌గాంధీ హత్య వల్ల సానుభూతి సంపాదించి కొన్ని స్థానాలను దక్కించుకోగలిగింది

21 జూన్ 1991న పి వి నరసింహారావు భారత ప్రధానిగా బాధ్యతలను స్వీకరించారు ఈ సంఘటన రాష్ట్రంలో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ వారికి కొంత ఊరట కలిగించింది

# 20. పి.వి.నరసింహారావు

పాములపర్తి వేంకట నరసింహారావు భారతదేశ ప్రధాన మంత్రిగా 21 జూన్ 1991న బాధ్యతలను స్వీకరించడం ఆంధ్రదేశ చరిత్రలో ఒక మరుపురాని ముఖ్య సంఘటన పి వి గా సుపరిచితుడైన నరసింహారావు దక్షిణ భారతీయులలో ప్రధానమంత్రి పదవిని చేపట్టిన మొదటి వ్యక్తి పి వి ప్రధానిగా ఎన్నికవటం దేశ వాసులను ఆశ్చర్య పరచలేదు ఎందుకంటే అతను ఇందిరాగాంధి, రాజీవ్‌గాంధీల విశ్వాసాన్ని పొంది వారి మంత్రిమండలిలో దేశ వ్యవహారాల శాఖ, విదేశాంగ శాఖ యింకా యితర సున్నితమైన మంత్రి పదవులను అతి సమర్థవంతంగా నిర్వహించి కేంద్రమంత్రి మండలిలో రెండవ స్థానాన్ని పొందారు

పి వి బహుముఖ ప్రజ్ఞాశాలి అతను పేరు ప్రతిష్ఠలున్న పండితుడే గాక బహుభాషావేత్త తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠి, సంస్కృతం పర్షియన్, ఆంగ్ల భాషలలో మంచి ప్రవేశం ఉంది ఉన్నత ఆదర్శాలు గల ఒక రాజకీయవేత్త సంఘీభావం ధైర్య సాహసాలు గల పత్రికా రచయిత నరసింహారావు కరీంనగర్ జిల్లా దేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో 28 జూన్ 1921లో జన్మించారు తల్లి రుక్మిణి, తండ్రి సీతారామారావు తల్లిదండ్రులు చిన్నప్పుడే నరసింహారావుని రంగారావనే ఉన్నత ఆతర్శాలుగల ఒక శ్రీమంతునికి దత్తత యిచ్చారు నరసింహారావు తన ప్రారంభ విద్యాభ్యాసాన్ని వరంగల్ జిల్లా వాలేరు, హుజూరాబాద్‌లలో చేసారు ఉన్నత విద్య కొరకు హైద్రాబాద్ చేరి, 1938లో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు చేపట్టిన 'వందేమాతరం' ఆందోళనలో పాల్గొన్నారు దాని ఫలితంగా నరసింహారావుని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బహిష్కరించారు దాంతో ఆయన పూనెలోని ఫెర్గూసన్ కాలేజీలో చేరి, బొంబాయి విశ్వవిద్యాలయంలో బి యస్సీ పట్టాని పొందారు పిమ్మట న్యాయవిద్య కోసం నాగపూర్ చేరి, నాగపూర్ విశ్వవిద్యాలయంలో, యల్ యల్ బి పట్టాని పొందారు పరీక్షలలో విజయాన్ని సాధించిన విద్యార్థులలో మొదటి స్థానాన్ని ఆక్రమించి బంగారు పతకాన్ని సంపాదించారు

చదువు పూర్తయ్యాక నరసింహారావు నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలలో పాల్గొన్నారు ఈ ఉద్యమాలు కమ్యూనిస్టుల ఆధీనంలో వున్న ఆంధ్ర మహాసభ నిర్వహించింది నరసింహారావు స్వభావ రీత్యా గాంధేయవాది కావడంతో ఆంధ్ర మహాసభలో ఇమడ లేకపోయారు అందువల్ల 1946లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌పై గల నిషేధాన్ని ఎత్తివేయడంతో నరసింహారావు ఆ పార్టీలో చేరి స్వామీ రామానందతీర్థకు సన్నిహితుడైన అనూయాయుడుగ మారి పోయారు స్టేట్ కాంగ్రెస్ హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం కావాలని 'జాయిన్ యిండియా' (Join India) ఉద్యమం ప్రారంభించినపుడు నరసింహారావు తన న్యాయవాద వృత్తిని వదిలి పెట్టి జాతీయోద్యమం పూర్తిగా నిమగ్నమై అదిలాబాద్ జిల్లా సరిహద్దున గల మహారాష్ట్రలోని చంద్రాపూర్ వద్ద సరిహద్దు శిబిరాన్ని (Border Camp) నిర్వహించారు

హైదరాబాద్‌పై జరిగిన పోలీస్ చర్య (Police Action) తర్వాత నరసింహారావు కాంగ్రెస్ సంస్థలో అనేక బాధ్యతాయుతమైన పదవుల్ని నిర్వహించారు 1949-50లో ఆయన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడైయ్యారు 1952లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టారు ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీకి ఉపాధ్యక్షుడయ్యారు అప్పటి నుండి రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖ వ్యక్తిగా రూపొందారు

1957 నుండి 1977 వరకూ నరసింహారావు రాష్ట్ర శాసనసభ సభ్యునిగా వున్నారు 1962నుండి 1971 సెప్టెంబరు వరకూ ఆయన న్యాయశాఖ, హిందూ మత దేవాదయశాఖ వంటి వివిధ మంత్రి పదవుల్ని నిర్వహించారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా వున్నప్పుడు ఆయనకు ఎనలేని గుర్తింపు వచ్చింది ఈయన కాలంలోనే డిగ్రీస్థాయిలో తెలుగు మీడియం ప్రవేశ పెట్టబడింది ఆర్థికంగా వెనుక బడ్డ ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం అనక గురుకుల పాఠశాలల్ని స్థాపించడంలో నరసింహారావు కీలకమైన పాత్ర వహించారు ఇదే పద్ధతిలోనే డిగ్రీ విద్యార్థుల కోసం కర్నూల్‌లో 'సిల్వర్ జూబిలి' కాలేజీని స్థాపించారు

నరసింహారావు 1971 సెప్టెంబరు 30న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు తెలంగాణ ప్రాంతంకి చెందిన ముఖ్యమంత్రులలో నరసింహారావు మొట్టమొదటివారు ఆయన ముఖ్యమంత్రి అయిన కొంత కాలనికే 'జైఆంధ్ర' ఏర్పాటు ఉద్యమం తలెత్తింది తీని ఫలితంగా 1972 జనవరిలో

నరసింహారావు మంత్రి వర్గం రాజీనామా చేయడంతో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు

రాష్ట్ర రాజకీయాల్నుండి తెరమరుగైన పి వి 1974 డిశంబరు నుండి 1976 జనవరి వరకూ అఖిల భారత కాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శిగా పని చేసారు 1977 మార్చిలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో హనుమకొండ నియోజకవర్గంనుండి ఎన్నికయ్యారు 1980లో ఇందిరాగాంధి అధికారాన్ని తిరిగి చేపట్టడంతో నరసింహారావు విదేశాంగ మంత్రిగా నియమితుడయ్యారు సున్నితమైన ఈ శాఖన సమర్ధవంతంగా నిర్వహించి ఆయన అందరి మన్నలు పొందారు అనతి కాలంలోనే ఆయన ఇందిరాగాంధి మంత్రివర్గంలో ద్వితీయ స్థానాన్ని పొందారు

1984 అక్టోబరులో ఇందిరాగాంధి దారుణ హత్యకు గురికావడంతో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యారు రాజీవ్‌గాంధీతో మంచి సంబంధాన్ని కలిగి వున్న పి వి కు మంత్రివర్గంలో రెండవస్థానం లభించింది

1985లో లోక్‌సభకు జరిగిన సాధారణ ఎన్నికలలో నరసింహారావు లోక్‌సభకు మహారాష్ట్రలోని 'రామ్‌టెక్' నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు 1989లో రామ్‌టెక్ నుండి తిరిగి ఎన్నికయ్యారు 1991 మే-జూన్ నెలలలో జరిగిన సాధారణ ఎన్నికలలో నరసింహారావు పోటీ చెయ్యలేదు రాజకీయాలనుండి విరమించి హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకొందామని నిశ్చయించారు.

21మే 1991న రాజీవ్‌గాంధీ చెన్నై నగర సమీపంలో గల సిరిపెరంబుదూర్ వద్ద దారుణంగా హత్య చేయబడ్డారు దీంతో దేశ రాజకీయాలలో ఎవరూ ఊహించలేని మార్పులు వచ్చాయి లోక్‌సభలో కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు వున్నప్పటికి మెజారిటీ లేదు. దేశ రాజకీయ ఆర్థిక పరిస్థితులు దయనీయ స్థితిలో ఉన్నాయి పంజాబ్‌లో ఉగ్రవాదులు ఏర్పాటు ఉద్యమాన్ని తీవ్రం చేసారు ఆర్థికంగా దేశం దివాలా తీసే పరిస్థితికి వచ్చింది బంగారాన్ని కుదవపెట్టి అప్పు తెచ్చుకొనే స్థితికి దిగజారింది యీ విపత్కార సమయంలో నరసింహారావు తిరిగి రాజకీయాలలో చురుకుగా పాల్గొని 21 జూన్ 1991న భారతదేశ తొలి తెలుగు ప్రధాని అయ్యారు నిబ్బరంతో క్లిష్టపరిస్థితులను ఎదుర్కొన్నారు ఆర్థిక పరిస్థితిని చక్కపెట్టడానికి నరసింహారావు విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశ పెట్టారు ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త మన్‌మోహన్ సింగ్‌ను ఆర్థిక మంత్రిగా నియమించి ప్రభుత్వ ఆర్థిక విధానాన్ని పూర్తిగా మార్చారూ. సరళీకృత విధానం

ద్వారా వ్యాపార రంగంపై ప్రభుత్వ అజమాయిషీని తొలగించి చిన్నాభిన్నమైన దేశ ఆర్థిక పరిస్థితిని ఎవరూ వూహించని విధంలో చక్కపరిచారు అనతి కాలంలో ఆర్థిక పరిస్థితి చక్కబడింది కుదవపెట్టిన బంగారాన్ని విడిపించుకోగలిగాం పారిశ్రామిక, వ్యాపార రంగాలలో దేశం పురోగించ సాగింది

దేశ రాజకీయ పరిస్థితిని కూడా నరసింహారావు చక్కపెట్టడంలో విజయాన్ని సాధించారు పంజాబ్‌లో తిరుగుబాటు అణచి, ఎన్నికలను నిర్వహించి మామూలు పరిస్థితిని తిరిగి నెలకొల్పారు అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగాలలో వెనుక బడిన తరగతి వారి నియామకం మొదలైన సమస్యలను సామరస్యంగా పరిష్కరించడానికి యితర పార్టీలతో చర్చలు జరిపి ఆందోళనా రాజకీయాలకు స్వస్తి చెప్పించ గలిగారు బాబ్రీమసీదు కూల్చివేతను అరికట్టలేక పోయారు కాశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి ఎన్నికలు ఒక్కటే మార్గమని భావించి అక్కడ మామూలు పరిస్థితులను నెలకొల్పడానికి అనేక చర్యలను తీసుకొన్నారు ఈ చర్యల వలనే 1996 సెప్టెంబర్-అక్టోబర్ నెలలలో కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు విజయవంతంగా జరుపబడ్డాయి

నరసింహారావు ప్రధాని అయ్యాక లోక్‌సభకు నంద్యాల నియోజక వర్గం నుండి 1991 నవంబరులో జరిగిన ఉపఎన్నికలో పోటీ చేసి 5 లక్షల మెజారిటీతో గెలుపొందారు 1996లో జరిగిన సాధారణ ఎన్నికలలో నరసింహారావు నంద్యాల ఒరిస్సాలోని బరంపురం నియోజకవర్గాలనుండి పోటీ చేసి రెండు స్థానాలలోను గెలుపొందారు నంద్యాల స్థానాన్ని రాజీనామా చేసి బరంపురం స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో మెజారిటీ రాలేదు దేవెగౌడ నాయకత్వం వహిస్తున్న యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాని కాంగ్రెస్ పార్టీ బయట నుండి సమర్థిస్తున్నాది ప్రస్తుతం నరసింహారావు లోక్‌సభలో 143 మంది సభ్యులు గల కాంగ్రెస్ పార్టీ నాయకులు

## సాహిత్య సేవ

నరసింహారావు రాజకీయరంగంలో పూర్తిగా నిమగ్నమై వున్నా వీలు దొరికినప్పుడల్లా సాహిత్య సేవ చేస్తున్నారు తెలుగులో విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'వేయిపడగలు' అనే ప్రసిద్ధ నవలని 'సహస్రఫణ్' పేరుతో హిందీలో అనువదించారు దీనికి భారత ప్రభుత్వ పురస్కారం లభించింది ఇదీకాక 'పాన్‌లక్సతో కోన్ ఫేతో' అనే మరాఠీ నవలను 'అబల' అనే పేరుతో తెలుగులోనికి అనువదించారు ఆయన కలం నుండి ఇంకా అనేక రచనలు వెలువడతాయని ఆశిద్దాం

## 21. తెలుగుదేశం పార్టీలో చీలిక

డిశంబర్ 1994లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరిగిన సాధారణ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్ (I) పార్టీని చిత్తుగా ఓడించి అసెంబ్లీలో గల 294 స్థానాలలో 214 స్థానాలను కైవసం చేసుకొంది 12 డిశంబరు 1994న రామారావు నాల్గవసారిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు కాని తొమ్మిది నెలలు తిరగక ముందే రామారావు ఎవరూ ఊహించని విధంగా 31 ఆగస్టు 1995న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చెయ్యవలసి వచ్చింది

### అంతఃపురరాజకీయాలు

రామారావు రాజీనామాకు మూల కారణం అతని కుటుంబసభ్యుల మధ్య అంటే కొడుకులు, అల్లుళ్ళు ఒకవైపు రెండవ భార్య లక్ష్మీపార్వతి మరొకవైపు అధికారం కోసం జరిపిన కొట్లాట

రామారావు మొదటి భార్య బసవరామతారకం 1984లో మరణించారు ఇది జరిగిన అయిదు సంవత్సరాల తరువాత ఆయన ముఖ్యమంత్రి పదవిని కూడా కోల్పోయారు ఎందుకంటే నవంబరు 1989న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ఘోర అపజయం పొందింది కాంగ్రెస్ పార్టీ 294 స్థానాలలో 180 స్థానాలు గెలిచి అధికారంలోకి తిరిగి వచ్చింది రాజకీయంగా ఒంటరి అయిన రామారావు కోట్లాది రూపాయలు విలువ చేసే ఆస్తిని తన సంతానానికి పంచి వారికి దూరమయ్యారు రాజకీయంగా, మానసికంగా ఒంటరితనం అనుభవిస్తున్న తరుణంలో రామారావు జీవితంలో సంస్కృత, తెలుగుభాషలలో ప్రావీణ్యం సంపాదించిన లక్ష్మీపార్వతి అనే ఒక విడాకులు పొందిన మహిళ అతని జీవితంలో ప్రవేశించింది ఆమె రామారావు జీవిత చరిత్ర వ్రాయడానికి అతనితో పరిచయం చేసుకొంది వారి పరిచయం అనురాగంగా మారింది రామారావు పక్షవాతంవల్ల ఆరోగ్యం పోగొట్టుకున్న

సమయంలో లక్ష్మీపార్వతి ఆయనకు సేవలు చేసి స్వస్థత కలిగించింది దీనికి కృతజ్ఞతగా రామారావు తన 72వ ఏట లక్ష్మీపార్వతిని వివాహం చేసుకున్నాడు

రామారావు కుటుంబసభ్యులు లక్ష్మీపార్వతిని పరాయి వ్యక్తిగా భావించారు ఆమె వల్ల తెలుగుదేశం పార్టీలో తమ మనుగడకు ముప్పువస్తుందని ఆందోళన చెందసాగారు వారి ఆందోళన అతి త్వరలోనే కార్యరూపం దరించింది లక్ష్మీపార్వతి రామారావుపై పూర్తి ఆధిపత్యం సంపాదించింది రామారావు తన అల్లుడు, సహోదారైన చంద్రబాబునాయుడును ప్రక్కకు నెట్టారు 1994 డిశంబరు ఎన్నికల ప్రచారంలో లక్ష్మీపార్వతి తన తెలుగు భాషాచాతుర్యంవల్ల ప్రజలను ఆకట్టుకోగలిగింది రామారావు తెలుగుదేశంపార్టీ 1994 డిశంబరు ఎన్నికలలో సాధించిన ఘన విజయానికి కారణం ప్రజలపై తనకు కలిగిన సమ్మోహక శక్తి పార్వతి వాక్ పటిమ మాత్రమేనని భావించారు

రామారావు డిశంబరు 12, 1994న ఏర్పరిచిన తన నాల్గవ మంత్రిమండలిలో చంద్రబాబునాయుడుకు స్థానం యిచ్చారు కానీ మామా అల్లుళ్ళ మధ్య రోజురోజుకి అగాధం పెరిగింది దీనికి కారణం రామారావు లక్ష్మీపార్వతిని తన రాజకీయ వారసురాలని ప్రకటించి నాయుడు వర్గ కార్యకర్తల్లో కలవరం పుట్టించాడు లక్ష్మీపార్వతికూడా కొత్త రాజ్యాంగేతర శక్తిగా ప్రవర్తించ సాగింది కడప, కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అద్యక్షుల ఎన్నికలో లక్ష్మీపార్వతి, నాయుడు వర్గాలమధ్య గల వైషమ్యాలు బయటపడ్డాయి రామారావు జారీ చేసిన 'విప్' (Whip)ను పై ఎన్నికలో అసెంబ్లీ సభ్యులు ఖాతరు చెయ్యలేదు దాంతో రామారావు అర్థాంగి అభ్యర్థి పరాజయానికి కారకులని భావించిన 8మంది అసెంబ్లీ సభ్యులపై క్రమశిక్షణ చర్య తీసుకొని పార్టీనుండి తాత్కాలికంగా బహిష్కరించాడు అనూహ్యపరిణామానకి దారితీసి రామారావు పతనానికి నాంది పలికింది

## టెక్కలి స్థానం

డిశంబరు 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలో రామారావు శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, అనంతపురం జిల్లాకు చెందిన హిందూపురం నియోజక వర్గాల నుండి ఎన్నికైనారు తరువాత టెక్కలి స్థానాన్ని వదులుకున్నారు ఉప ఎన్నికలో టెక్కలి స్థానం నుండి లక్ష్మీపార్వతిని గెలిపించాలని భావించారు

కాని రామారావు కుమారుడైన హరికృష్ణ దీనికి అభ్యంతరం తెలిపి తన నే టెక్కలి స్థానం అభ్యర్థిగా నిలపెట్టాలని పట్టుపట్టాడు రామారావు యితర కుటుంబ సభ్యులు హరికృష్ణను బలపరిచారు కానీ రామారావు లక్ష్మీపార్వతి హరికృష్ణలను కాదని అప్పయ్యదొర అనే వ్యక్తిని తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా నిర్ణయించారు ఏమాత్రం పరపతి లేని అప్పయదొర ఉపఎన్నికలో రామారావు పేరువల్లనే అతి సులభంగా టెక్కలి స్థానం గెలుచుకోగలిగాడు

అప్పయ్యదొర గెలుపు నాయుడు వర్గంలో బయాందోళనను రేపింది లక్ష్మీపార్వతి తీర్థం పుచ్చుకొన్న అనామకుల వల్ల తమ ఆదిపత్యానికి విఘాతం కలుగుతుందని విశ్వసించారు లక్ష్మీపార్వతి నిరంకుశ వ్యవహార శైలిని నిలదీయడానికి నిశ్చయించారు

## ప్రజాసదస్సు

రామారావు ఉత్తర కోస్తాజిల్లాలలో పర్యటించి 16 ఆగస్టు 1995న పలు ప్రాంతాలలో ప్రజాసదస్సులను నిర్వహించారు టెక్కలిలో తన భార్య లక్ష్మీపార్వతిపై అపనిందలు వేసేవారిని సహించేది లేదని హెచ్చరించారు -

## నాయుడు ఎత్తులు

రామారావు ఆగష్టు23న హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు ఈలోగా చంద్రబాబునాయుడు తన వర్గీయులైన 50మంది శాసనసభ్యులతో సమావేశం జరిపాడు మరో 30మంది శాసన సభ్యులను తన వర్గంలో చేరమని వారికి ఆశలు చూపాడు ఈ సమయంలో రామారావు నాయకత్వాన్ని ఎదురించాలనే తలంపు ఎవ్వరికీ లేదు లక్ష్మీపార్వతిని 'దుష్టశక్తి'గా ఎంచి ఆమె అనుచిత రాజకీయ జోక్యాన్ని అరికట్టమని విన్నవించడానికి ఒక బృందం రామారావు దగ్గరకు వెళ్ళింది ఈ బృందంలోని సభ్యులు మంత్రులైన అశోక్‌గజపతిరాజు, దేవేందర్ గౌడ్, శాసన సభ్యుడు సుబ్బారెడ్డి వారు రామారావుతో లక్ష్మీపార్వతి చర్యలవల్ల తెలుగుదేశం పార్టీలో ఏర్పడిన పరిణామాలను వివరించి ఆమె అటలను అరికట్టమని హెచ్చరించారు శ్రేయోభిలాషుల సలహాలను వినే అలవాటులేని రామారావు బృందంలోని సభ్యులమీద మండిపడి, గవర్నర్ చేత శాసనసభను రద్దు చేయిస్తానని బెదిరించాడు ఈ బెదిరింపువల్ల యిరు వర్గాల మధ్య

సంబంధాలు పూర్తిగా బెడిసి కొట్టాయి

ఈ లోగా చంద్రబాబునాయుడు పార్వతి మినహా మిగతా రామారావు కుటుంబ సభ్యుల సమావేశం జరిపాడు మూడు గంటలు పైగా జరిగిన యీ సమావేశం నుండి చంద్రబాబు నాయుడు కోపంగా బయటకు వెళ్ళాడు అంతకు ముందే రూపొందించిన ప్రణాళికను అమలు జరపడానికి నిశ్చయించాడు

## వైస్రాయ్ హోటల్ సమావేశం

రామారావు కుటుంబ సమావేశంనుండి చంద్రబాబునాయుడు నేరుగా వైస్రాయ్ హోటల్‌కు వెళ్ళి తన అనుచరులతో 'విందు మంతనాలను' ప్రారంభించాడు మొదట్లో 80మంది శాసన సభ్యులు విందుకు హాజరయ్యారు అర్ధరాత్రికి సభ్యుల సంఖ్య 150కి పెరిగింది రామారావు పెద్దల్లుడు, చంద్రబాబునాయుడి ప్రత్యర్థి వెంకటేశ్వరరావు తన తోటి అల్లుడితోగల విభేదాలను విస్మరించి నాయుడితో చేతులు కలపడానిక్ విందు మంతనాలలో పాల్గొన్నాడు

1984లో రామారావు ముఖ్యమంత్రి పదవిని కోల్పోయినప్పుడు చంద్రబాబునాయుడు రామారావును సమర్థిస్తున్న శాసన సభ్యులకు హోటల్లో విడిది ఏర్పాటు చేసి, బస్సులలో వారిని ఊరేగించే విధానాన్ని అమలు జరిపాడు విజయవంతమైన ఈ విధానాన్ని తిరిగి ఆగష్టు 1995లో అమలు జరిపాడు 23-24 ఆగష్టు 1995న వైస్రాయ్ హోటల్లో సమావేశమైన అసెంబ్లీ సభ్యులు అక్కడే ఉండి, 1సెప్టెంబర్ 1995 చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి గా ప్రమాణం చేసిన తరువాత బయటకు వచ్చారు

## తెలుగుదేశం పార్టీని చీల్చడానికి ప్రయత్నం

అసెంబ్లీ సభ్యులలో కొంతమంది తెలుగుదేశం పార్టీని చీల్చి కొత్త అధ్యక్షుల్ని ఎన్నుకోవాలని సలహా ఇచ్చారు నాయుడు ఈ సలహాను తిరస్కరించాడు పార్టీ చీలిక సాధారణ కార్యకర్తలకు నచ్చదని, అంతే కాకుండా పార్టీ చీలికవల్ల న్యాయపరమైన అవరోధాలను ఎదుర్కోవలసి వస్తుందని గ్రహించాడు అందుకని శాసనసభలోని తెలుగుదేశం సభ్యులలో చీలిక తెచ్చి రామారావు నాయకత్వానికి ఉద్వాసన చెప్పాలని నిర్ణయించాడు వైస్రాయ్ హోటల్లో

బస చేసిన 144 తెలుగుదేశం పార్టీ సభ్యులు చంద్రబాబునాయుడుని రామారావు బదులు తమ నాయకుడిగా ఎన్నుకున్నారు వీరిలో ఒక బృందం గవర్నర్ కృష్ణకాంత్‌ను కలిసి చంద్రబాబునాయుడిని క్రొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయవలసిందిగా ఆహ్వానించమని ఒక వినతిపత్రం సమర్పించారు

## రామారావు స్పందన

రామారావు 25ఆగష్టు 1995న తన మంత్రి మండలి సమావేశం ఏర్పాటు చేసాడు ఈ సమావేశానికి హాజరు కాని చంద్రబాబునాయుడు, అశోక్‌గజపతి రాజు, దేవేందర్ గౌడ్, మాధవరెడ్డి, విద్యాధరరావులను మంత్రిమండలి నుండి బర్తరఫ్ చేసాడు మంత్రివర్గ సమావేశానంతరం రామారావు గవర్నర్‌ను కలిసి శాసనసభను రద్దు చెయ్యమని సలహా యిచ్చాడు

## గవర్నర్ చర్య

రామారావు గవర్నర్‌ను సందర్శించిన తరువాత అసమ్మతి మంత్రులు గవర్నర్‌ను కలిసి ఆయనకు 140మంది శాసన సభ్యులు రామారావు నాయకత్వంలో విశ్వాసం లేదని ప్రకటించిన తీర్మానప్రతిని సమర్పించారు అత్యధిక శాసనసభ్యుల విశ్వాసాన్ని కోల్పోయిన రామారావు సలహాను పాటించవద్దని గవర్నరకుకు విన్నవించారు

గవర్నరు తనకు సమర్పించిన వినతి పత్రంలోని శాసన సభ్యుల సంతకాలను పరీక్షించమని స్పీకరును కోరారు గవర్నర్ చర్యను కొంతమంది రాజ్యాంగ నిపుణులు తప్పు పట్టారు వీరి అభిప్రాయం ప్రకారం గవర్నర్ బ్రిటీష్ పార్లమెంటరీ సాంప్రదాయాలను పాటించి ముఖ్యమంత్రి సలహామేరకు అసెంబ్లీని రద్దు చేయమని రాష్ట్రపతికి విన్నవించాలి ఈ అభిప్రాయంతో గవర్నర్ ఏకీభవించలేదు

## స్పీకర్ పాత్ర

స్పీకర్ రామకృష్ణుడు విశాఖపట్నం నుండి హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక గవర్నర్ కోరిక ప్రకారం వినతి పత్రంలోని సంతకాలను పరీక్షించడమే కాకుండా, ఒక అడుగు ముందుకు వెళ్ళి అసెంబ్లీ ప్రాంగణం లోని తెలుగుదేశంపార్టీ

కమిటీహాలులో శాసనసభ్యులను స్వయంగా పరీక్షించారు అసమ్మతి వర్గానికే మెజారిటీ ఉందని ప్రకటించారు

స్పీకర్ చర్యను రాజ్యాంగ నిపుణులు విమర్శించారు వారి అభిప్రాయం ప్రకారం స్పీకర్ శాసన సభ కార్యక్రమాలను నిబంధనల ప్రకారం నిర్వహించే అధ్యక్షుడు మాత్రమే అతనికి శాసన సభ్యులు ఏ రాజకీయ పార్టీకి చెందుతారో వారు పార్టీలోని ఏ వర్గానికి చెందుతారో, చెందరో అని నిర్ణయించే హక్కు లేదు

ఈలోగా గవర్నర్ రాజ్యాంగపరమైన చిక్కులను జాగ్రత్తగా పరిష్కరించాలని నిశ్చయించారు అందుకని చంద్రబాబు నాయుడ్ని వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చెయ్యమని పిలువలేదు రామారావును అసెంబ్లీ విశ్వాశాన్ని 30ఆగష్టు 1995లోగా పొందమని ఆదేశించారు ఈ గడువు ముఖ్యమంత్రి అభ్యర్థన మేర ఒక్కరోజు పొడిగించారు

## తెలుగుదేశం పార్టీ నాయకుడిగా చంద్రబాబు ఎన్నిక

తెలుగుదేశం పార్టీ సర్వసభ్యసమావేశం (General, Body Meeting) 30ఆగష్టు 1995న కాచిగూడ (హైదరాబాద్) బసంత్ థియేటర్‌లో జరిగింది ఈ సభలో పార్టీకి చెందిన అసెంబ్లీసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, జిల్లాపరిషత్ ఛైర్మన్‌లు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షులు మొదలైన వారు పాల్గొన్నారు రామారావు కుమారుడు జయకృష్ణ పెద్దల్లుడు వెంకటేశ్వరరావులు కూడా సభకు హాజరయ్యారు ఈ సమావేశం రెండు ముఖ్యమైన నిర్ణయాలను తీసుకొంది ఒకటి రామారావు స్థానే చంద్రబాబు నాయుడ్ని పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకోండి రెండవ నిర్ణయం ప్రకారం పార్టీ నియమావళిలోని యావజ్జీవ అధ్యక్ష పదవిని రద్దు చేసారు

## రామారావు రాజీనామా

ఎంతో ఆసక్తి కలిగించిన తెలుగుదేశంపార్టీ రాజకీయం చప్పగా ముగిసింది రామారావు అసెంబ్లీలో విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ఏడు గంటల ముందే తన పదవికి 31 ఆగష్టు 1995న రాజీనామా చేసారు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు రెండు వాక్యాల ఉత్తరాన్ని గవర్నర్‌కు పంపారు ఉత్తరం పంపిన కొద్దిక్షణాలకే రామారావు అస్వస్థత చెంది ఆస్పత్రికి స్పృహలేని స్థితిలో తరలింపబడ్డారు

## 22. చంద్రబాబునాయుడు ప్రభుత్వం

చంద్రబాబునాయుడు 1 సెప్టెంబర్ 1995న ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలను స్వీకరించారు ఆయన మంత్రివర్గంలోని 11 సభ్యులలో 10మంది రామారావు మంత్రి వర్గపు సభ్యులే ఒకే ఒక క్రొత్త మంత్రి రామారావు కుమారుడు నందమూరి హరికృష్ణ ఆయన శాసన సభ సభ్యుడు కాడు

పదవీ బాధ్యతలను స్వీకరిస్తూ నాయుడు, రాష్ట్ర పురోగవృద్ధికై వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో క్రొత్త విధానాన్ని రూపొందిస్తారని చెప్పారు రామారావు గారి హయాంలో రాష్ట్ర పురోగమనం కుంటు పడిందని విలపోయారు రామారావు మంత్రి వర్గంలో రెండవ స్థానాన్ని ఆక్రమించి తానే ముఖ్యమైన రెవిన్యూ, ఆర్థిక శాఖలను నిర్వహించిన సంగతి మరచిపోయారు ఉప ముఖ్యమంత్రి పదవి కోసం ఆశించి, చంద్రబాబు నాయుడితో చేతులు కలిపిన డి వెంకటేశ్వరరావుకు మంత్రివర్గంలో స్థానం లభించకపోవటం గమనార్హం నాయుడు రామారావును పదవీ భ్రష్టుణ్ణి చేసి తానే ముఖ్యమంత్రిగా రూపొందటం రాష్ట్ర ప్రజలకు ఆశ్చర్యం కలిగించలేదు అధికారం యిచ్చే పదవులను సంపాదించటంలో ఆయన నైపుణ్యం అందరికీ తెలిసినదే

చంద్రబాబు నాయుడు చిత్తూరుజిల్లా చంద్రగిరి మండలంలోని నారావారిపల్లెలో 30 ఏప్రియల్ 1951న జన్మించారు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యార్థి రాజకీయాలలో ప్రముఖ పాత్ర వహించి ఆర్థిక శాస్త్రంలో ఎమ్ ఏ పట్టాను పొందారు 1978లో ఆయన ఆంధ్రప్రదేశ్ శాసన సభకు చంద్రగిరి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ (I) అభ్యర్థిగా ఎన్నికైనారు అంజయ్య మంత్రి వర్గంలో సినిమా పరిశ్రమ మంత్రిగా నియమితులైనారు అనతి కాలంలోనే కాంగ్రెస్ రాజకీయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకున్నారు జిల్లా దళిత నాయకుడు సి దాస్‌తో చేతులు కలిపి రెడ్డి కులజుల ప్రాబల్యాన్ని ముఖ్యంగా అమరనాథరెడ్డి అధికారాన్ని అంతం చెయ్యాలని పథకం తయారు చేసారు జిల్లా

పరిషత్ ఎన్నికలలో అధికార కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించడంలో విజయం సాధించారు అధికార కాంగ్రెస్ అభ్యర్థిపై పోటీచేసిన డాక్టర్ కుతూహలమ్మ గెలిచింది రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కోనా ప్రభాకరరావు సి దాస్, చంద్రబాబు నాయుడుపై క్రమశిక్షణ తీసుకొని వారిని పార్టీనుండి తాత్కాలికంగా బహిష్కరించారు నాయుడు ఢిల్లీ వెళ్ళి ఇందిరాగాంధీని కలుసుకొని తనపై తీసుకున్న క్రమశిక్షణను రద్దు చేయించుకో గలిగారు

సినిమా శాఖ మంత్రిగా నాయుడు యన్ టి రామారావుతో పరిచయం ఏర్పరుచుకొని చివరకు ఆయన అల్లుడు కాగలిగారు 1982లో రామారావు తెలుగు దేశం పార్టీని ప్రారంభించినప్పుడు నాయుడు దానిలో చేరలేదు 1983 ఎన్నికలలో నాయుడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తెలుగు దేశం అభ్యర్థి చేతిలో ఓడిపోయారు అనతి కాలంలో కాంగ్రెస్ పార్టీని వదలి, తెలుగుదేశం పార్టీలో చేరి రామారావు అంతరంగ సలహాదారుగా రూపొందారు

నాదెండ్ల భాస్కరరావు వల్ల ముఖ్యమంత్రి పదవిని కోల్పోయిన రామారావుకు నాయుడి రాజకీయతంత్ర ప్రావీణ్యం ఎంతగానో ఉపయోగపడింది 1984-85 సంవత్సరాల మధ్య రామారావు ఎదుర్కొన్న ఎన్నో సమస్యలను నాయుడు తొలగించారు అందరూ నాయుడ్ని రామారావు వారసుడని భావించారు కానీ లక్ష్మీపార్వతి రామారావు జీవితంలో రెండవ భార్యగా ప్రవేశించి పరిస్థితిని తారుమారు చేసింది కానీ నాయుడు రాజకీయ చదరంగంలో సాటిలేని మేటి అని నిరూపించుకున్నారు రామారావును ముఖ్యమంత్రి పదవినుండి తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవినుండి సునాయాసంగా తొలగించకలిగారు

## రామారావు మరణం

రామారావు ముఖ్యమంత్రి పదవికి 31 ఆగష్టు 1995న రాజీనామా చేశారు 18 జనవరి 1996న రామారావు హైదరాబాద్‌లో మరణించారు ఆయన మరణం పట్ల వచ్చిన అపవాదులు, ఆయన ఆస్తి రాజకీయ వారసత్వం కోసం లక్ష్మీపార్వతి, నాయుడు వర్గాల మధ్య జరిగిన కీచులాటలు రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసాయి

## 1996 లోక్‌సభ ఎన్నికలు

1996లో జరిగిన లోక్‌సభ ఎన్నికల లక్ష్మీపార్వతి, నాయుడు వర్గాల బలాబలాలను నిరూపించుకోవడానికి ఉపయోగపడ్డాయి పి వి నరసింహారావు నాయకత్వంలోని కాంగ్రెస్‌వారు తెలుగుదేశం పార్టీ అంతః కలహాలవల్ల రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాలలో 36 స్థానాలను సునాయసంగా గెలువగలరని భ్రమపడ్డారు

లక్ష్మీపార్వతి విజయవాడలో నిర్వహించిన సింహగర్జన సమావేశానికి అధికసంఖ్యలో ప్రజలు రావడంవల్ల ఆమె వర్గంవారు ఎన్నికలలో సులభంగా విజయం సాధించగలమని భ్రమపడ్డారు

నాయుడు తన రాజకీయ భవిష్యత్తు లోక్‌సభ ఎన్నికలమీద ఆధారపడిందని గ్రహించారు ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారిగా ప్రజలతో ముఖాముఖిగా తలబడ్డారు అందువల్ల రాజకీయ చతురుడైన నాయుడు ప్రజలను ఆకట్టుకోడానికి రెండురూపాయలకే కిలోబియ్యం సరఫరా చేస్తానని వాగ్దానం చేశారు అంతే కాకుండా దొంగ రేషన్ కార్డులను ఏరివేయకుండా, కొత్తగా 20లక్షల క్రొత్త తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేశారు ఈ కార్డులున్న వారు రెండురూపాయలకే కిలో బియ్యం కొనుగోలు చేయగలిగారు ఇది కాకుండా పుట్టబోయే ప్రతీ ఆడపిల్లకు 5వేల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని హామీ యిచ్చారు ఈ రాయితీల వల్ల నాయుడు వర్గ అభ్యర్థులు 16స్థానాలలో గెలుపొందగలిగారు కాంగ్రెస్ 22స్థానాలను గెలిచింది లక్ష్మీపార్వతివర్గం ఒక్కస్థానంలోనూ గెలుపొందలేదు

ఈ ఎన్నికలు చంద్రబాబు స్థానాన్ని రాష్ట్రంలోను, కేంద్రంలోను బలపరిచింది కానీ కాంగ్రెస్‌ను తక్కువగా అంచనా వేయకూడదు కాంగ్రెస్ 40శాతం ఓట్లను రాష్ట్రంలోని మూడు ప్రాంతాలైన కోస్తా, రాయలసీమ తెలంగాణలో సాధించింది ఈ శాతం తెలుగు దేశం (నాయుడు వర్గం) దాని మిత్రపక్షాలైన సి పి ఐ , సి పి ఐ(యమ్)కు వచ్చిన ఓట్లకన్నా అధికం కాంగ్రెస్ రాష్ట్రంలో కోల్పోయిన స్థానాన్ని తిరిగి సంపాదించాలంటే పార్టీలోని వివిధ వర్గాల నాయకులు తమ విభేదాలను విస్మరించి ఒక్కటిగా పని చేయాలి

# అనుబంధం – I

## తెలుగు సాహిత్యం – ఒక చారిత్రక సమీక్ష

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రధానమైన భాష తెలుగు ఈ భాషను 60 మిలియన్ల ప్రజలు వ్యవహరిస్తారు భారతదేశంలో హిందీ తర్వాత ఎక్కువమంది మాట్లాడే భాష తెలుగు భాషే ప్రాచీనకవులు, వ్యాకరణకర్తలు తెలుగు భాష ప్రాకృతంనుండి, సంస్కృతం నుండి పుట్టిందని భావించారు అయితే చాలమంది ఈ నాటి భాషా శాస్త్రవేత్తలు బిషప్ కాల్డ్వెల్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని అంగీకరించారు కాల్డ్వెల్ 'ద్రవిడభాషల తులనాత్మక వ్యాకరణం' అనే తన ఆంగ్ల గ్రంథంలో తెలుగు ద్రావిడ భాషాకుటుంబానికి చెందినదిగ భావించాడు

ఈనాడు 'తెలుగు', 'ఆంధ్ర' అనే పదాల్ని రూపాంతరాలుగ వ్యవహరిస్తున్నారు. అయితే తెలుగుభాష మొదటిసారిగ ఆంధ్ర సామ్రాజ్యాన్ని స్థాపించిన శాతవాహనుల కాలంలో రూపుదిద్దుకోలేదు క్రీ పూ రెండవ శతాబ్దినుండి క్రీ శ రెండవ శతాబ్ది వరకు ఈనాటి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలోని చాల ప్రాంతాల్లో శాతవాహన సామ్రాజ్యం విస్తరించి వుండేది ఆంధ్ర శాతవాహన చక్రవర్తియైన హాలుడు ప్రాకృతంలో 'గాథాసప్తశతి' అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించాడు

క్రీ.శ మొదటి శతాబ్దిలో తెలుగు భాష స్వతంత్రంగా రూపుదిద్దు కోవడం ప్రారంభించిందని చెప్పవచ్చు. క్రీ.శ 600–800 మధ్యకాలంలో వెలసిన చాలశాసనాల్లో అనేక తెలుగు పదాలు చోటు చేసుకున్నాయి. 9వ శతాబ్దికల్లా తెలుగు సాహిత్యం ముఖ్యంగా కథా సాహిత్యం విశేషంగా వెలువడిందని చెప్పవచ్చు.

## నన్నయ

11వ శతాబ్దిలో నివసించిన నన్నయ సంస్కృత మహాభారతాన్ని తెలుగు భాషలోకి అనువాదం చేయడంతో నిజమైన తెలుగు సాహిత్యం ప్రారంభమైందని చెప్ప వచ్చు. నన్నయ గోదావరీ నదీతీరాన వెలసిన రాజమండ్రిని పాలించిన తూర్పు చాళుక్యరాజైన రాజరాజనరేంద్రుని (1022-63) ఆస్థాన కవి. మహాభారతం తన పూర్వీకులైన చంద్రవంశ రాజులకు సంబంధించిన కథకాబట్టి ఈ కావ్యాన్ని తెలుగులోకి అనువదించమని రాజరాజు నన్నయ్యను కోరడం జరిగింది. నన్నయ ఆదిపర్వాన్ని, సభాపర్వాన్ని, అరణ్యపర్వంలో కొంతభాగాన్ని మాత్రమే అనువదించగల్గాడు.

## తిక్కన

నన్నయ చనిపోయిన రెండు శతాబ్దాల తర్వాత సింహపురికి (నెల్లూరు) చెందిన తిక్కన మహాభారతంలో మిగిలిన పదిహేను పర్వాల్ని పూర్తిగ అనువాదం చేశాడు. అయితే నన్నయ అసంపూర్తిగ వదిలిపెట్టిన అరణ్యపర్వశేష భాగాన్ని మాత్రం ఆయన అనువదించలేదు.

## ఎఱ్ఱాప్రగడ

ఆరణ్యపర్వ శేషభాగాన్ని 14వ శతాబ్దికి చెందిన ఎఱ్ఱాప్రగడ పూర్తి చేశాడు సంస్కృత మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన ఈ ముగ్గురు రచయితల్నే (నన్నయ, తిక్కన, ఎఱ్ఱా ప్రగడ) 'కవిత్రయము' అని వ్యవహరిస్తారు. ఈ ముగ్గురు కవులకు ఆంధ్రుల్లో ఎనలేని గౌరవముంది.

కవిత్రయము అనువదించిన మహాభారతంలో సంస్కృత ప్రభావం చాలవరకు కన్పిస్తుంది 12నుండి 14వ శతాబ్ది వరకు ఆంధ్రదేశంలో వీరశైవ ఉద్యమం బలంగా వేళ్ళూనుకుంది. ఈ ఉద్యమంద్వారా ప్రభావితులైన చాలమంది కవులు జనసామాన్య భాష యైన దేశీకవితలో కావ్యాలు సృష్టించి సామాన్య ప్రజల్లోకి చొచ్చుకు పోవాలని ప్రయత్నించారు క్రీ.శ 1200-1240 ప్రాంతంలో నివసించిన పాల్కురికి సోమనాధుడు బసవపురాణం, పండితారాధ్య చరిత్ర అనే రెండు ద్విపద కావ్యాల్ని రచించాడు. ఈకావ్యాల్లో తెలుగు పదాలు

చాలవరకు చోటు చేసుకున్నాయి అయితే తిక్కనమాత్రం మధ్యేమార్గాన్ని అవలంభించాడు. ప్రజల్లో వాడుకలోనున్న తెలుగు, సంస్కృత పదాల్ని రెండింటిని తిక్కన తన మహాభారత కావ్యానువాదంలో విశేషంగా ఉపయోగించాడు ఉభయకవి మిత్రుడుగ ప్రసిద్ధిచెందిన తిక్కన తెలుగు సాహిత్యంలో 'మార్గకవిత' అనే సాహిత్య ప్రక్రియకు నాందిపల్కాడు ఈ సాహిత్య ప్రక్రియ 20వ శతాబ్ది ప్రారంభంవరకు వ్యాప్తిలో ఉండింది తర్వాత కాలంలో శిష్టవ్యవహారికభాషవ్యాప్తిలోకి వచ్చింది

## రామాయణ అనువాదాలు

సంస్కృతంనుండి తెలుగులోకి అనువదింపబడ్డ మొదటి కావ్యం మహాభారతమే అయినా రామాయణానికి జన సామాన్యంలో విశేషమైన ఆదరణ లభించింది. 13వ శతాబ్ది ప్రారంభంనుండి ఈనాటి వరకు చాలమంది కవులు రామాయణాన్ని తెలుగులోకి అనువదించారు వరంగల్లునేలిన కాకతీయ చక్రవర్తి మొదటి ప్రతాపరుద్రుని సామంతుడైన గోనబుద్ధారెడ్డి మొదటిసారిగ క్రీ.శ 1250లో రామాయణాన్ని తెలుగులోకి అనువదించాడు. ఈ కావ్యమే రంగనాధ రామాయణంగా ప్రసిద్ధిచెందింది ఇదే కోవలోనే భాస్కర రామాయణం అనేమరో అనువాదకావ్యం వెలువడింది. ఈ కావ్యాన్ని మంత్రి భాస్కరుడు రచించినట్లు చెపుతారు.

## శ్రీనాథ యుగం (1380–1500)

మధ్యయుగానికి చెందిన వారిలో శ్రీనాధుడు, బమ్మెర పోతన గొప్ప కవులుగ ప్రసిద్ధిచెందారు శ్రీనాధుడు అనేక కావ్యాల్ని రచించాడు సంస్కృతంలో శ్రీహర్షుడు రచించిన నైషధకావ్యాన్ని శృంగారనైషదం పేరుతో తెలుగులోకి అనువదించడమేగాక కాశీఖండం, భీమేశ్వరపురాణం, హరవిలాసం, పల్నాటివీరచరిత్ర అనే మహాకావ్యాల్ని సృష్టించాడు హరవిలాసం ఉత్కృష్టమైన రచనకాగా పల్నాటి వీరచరిత్ర సామాన్య ప్రజల్లో సైతం ప్రచుర్యాన్ని పొందింది

## బమ్మెరపోతన (1450–1510)

ఆంధ్రులు విశేషంగా అభిమానించేకవి బమ్మెర పోతన. ఈయన భాగవతాన్ని తెలుగులో రచించాడు. పోతన రచించిన భాగవత కావ్యం సామాన్య ప్రజలో

సైతం విశేష ప్రచుర్యాన్ని పొందింది చదువులేనివారు కూడ భాగవతంలోని గజేంద్రమోక్షం, ప్రహ్లాద చరిత్ర వంటి ఘట్టాల్లోని పద్యాల్ని ఈనాటికి తమ వ్యవహారంలో సైతం వినియోగిస్తున్నారంటే భాగవతం ఎంతటి ప్రసిద్ధిపొందిందో అవగతమౌతుంది పోతన శ్రీనాధునికి బావ వరుస అవుతాడని చెపుతారు పోతన రాజా శ్రయాన్ని నిరసించడమేగాక తన కావ్యాన్ని వరంగల్లు పాలకుడైన సర్వజ్ఞ సింగభూపాలునికి అంకితమిచ్చేందుకు నిరాకరించాడు వీరభద్ర విజయం, భోగినీదండకం, అనే కావ్యాల్ని కూడ పోతన రచించినట్లు ప్రతీతి

## తాళ్ళపాక అన్నమాచార్యుడు (1408–1503)

కడప జిల్లాలోని తాళ్ళపాక గ్రామంలో జన్మించిన తాళ్ళపాక అన్నమాచార్యుడు దాదాపు 95 సంవత్సరాలు జీవించాడు సుదీర్ఘమైన తన జీవితంలో తిరుమల శ్రీవెంకటేశ్వరుని స్తుతిస్తూ దాదాపు 32వేల కీర్తనల్ని కూర్చగలిగాడు అన్నమయ్య గొప్ప కవేగాక ప్రసిద్ధిచెందిన సంగీత పారంగతుడు కూడ కావడం విశేషం. రాగిరేకులపై అన్నమయ్య కీర్తనల్ని చెక్కించి, శ్రీవెంకటేశ్వర ఆలయంలో భద్రపరచడం జరిగినా విద్యాగంధంలేని కొంతమంది ఆలయ ధర్మకర్తలు కీర్తనలున్న రాగిరేకుల విలువ తెలియక వాటిని కరిగించారు ఇప్పుడు కేవలం 8వేల కీర్తనలు మాత్రం లభిస్తున్నాయి ఈ కీర్తనల్ని తిరుమల–తిరుపతి దేవస్థానంవారు తమ అన్నమాచార్య ప్రాజెక్టుద్వారా ఈనాడు విశేషంగా ప్రచారం చేస్తున్నారు

అన్నమాచార్య కీర్తనలు, శ్రీనాధుని పల్నాటి వీరచరిత్ర తప్ప 15వ శతాబ్ది చివరి వరకు వెలువడిన మిగిలిన గ్రంధాలన్నీ కూడ కేవలం సంస్కృతం నుండి తెలుగులోకి అనువదింపబడ్డ గ్రంధాలే స్వతంత్రమైన పద్యకావ్యాలుగాని వచన కావ్యాలుగాని రచింపబడలేదు

## విజయనగర యుగం

విజయనగర కాలాన్ని (1336–1565) తెలుగు సాహిత్య చరిత్రలో స్వర్ణయుగంగా భావించారు దక్షిణ భారతంలో ప్రసిద్ధిచెందిన చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉద్దండులైన 8మంది తెలుగు కవులుండేవారు వీరిని 'అష్టదిగ్గజాలు' అని అంటారు ఈ కాలంలో తెలుగు సాహిత్యంలో

'ప్రబంధం' అనే ఒక నూతన ప్రక్రియ ఆవిర్భవించింది ప్రబంధమనేది సంస్కృతంలోని మహాకావ్యాన్ని ప్రాతిపదిక చేసుకుని ఆవిర్భవించిందే

అష్టదిగ్గజాల్లో మొదటివాడు అల్లసాని పెద్దన ఈయన ఆస్థానకవియేగాక ఆంధ్రకవితాపితామహుడనే బిరుదునుకూడ కలిగివుండేవాడు పెద్దన రచించిన మనుచరిత్ర కావ్యం ఈనాటికి కూడ ప్రాచుర్యంలో వుంది పారి జాతాపహరణం కావ్యాన్ని రచించిన నందితిమ్మన, రామాభ్యుదయాన్ని రచించిన అయ్యల రామభద్రుడు, కాళహస్తీశ్వర మహాత్మ్యగ్రంధాన్ని విరచించిన ధూర్జటి, రాజశేఖర చరిత్రను సృష్టించిన మాదయగారి మల్లన, కళాపూర్ణోదయ కావ్యాన్ని వినిర్మించిన పింగళి సూరన , వసుచరిత్ర కారుడైన రామరాజ భూషణుడు (భట్టుమూర్తి) పాండురంగ మహాత్మ్యగ్రంధ నిర్మాతయైన తెనాలి రామకృష్ణుడు అష్టదిగ్గజాల్లోని మిగిలిన కవులు. తెనాలి రామకృష్ణుడు వికటకవిగ ప్రసిద్ధి చెందాడు ఆయనను గూర్చిన అనేక హాస్యకధలు ఈనాటికి ఆంధ్రదేశంలో బహుళ ప్రచారంలో వున్నాయి ఉత్తర భారతంలో బీర్బల్ ఏవిధంగా ప్రసిద్ధిచేందాడో దక్షిణ భారతంలో తెనాలి రామకృష్ణుడు ఆదేవిధమైన ప్రసిద్ధిని బడసాడు

## ఆముక్త మాల్యద

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప చక్రవర్తేగాక ప్రసిద్ధి చెందిన కవి కూడ ఈయన రచించిన ఆముక్తమాల్యద గ్రంధం తెలుగు సాహిత్యంలో మొదటిశ్రేణి ప్రబంధంగా గుర్తింపు పొందింది

## వేమన

తెలుగులో ప్రాచుర్యం పొందిన సాహిత్య ప్రక్రియ శతకం శతకం అంటే నూరు పద్యాలు గల కావ్యం సుమతి శతకం, వేమన శతకం, ఆంధ్రదేశంలో విశేషమైన ప్రాచుర్యాన్ని పొందాయి విజయ నగర కాలం తర్వాత వెలసిన కవుల్లో ప్రసిద్ధి చెందినవాడు వేమన వేమన రాయలసీమ ప్రాంతానికి చెందినవాడు చిన్నచిన్న మాటలతో ఆకర్షణీయంగారచించబడ్డ ఆయన పద్యాలు పామర జనుల్లో సైతం విశేష ప్రచారాన్ని పొందాయి. వేమన పద్యాలవల్ల విశేషంగా ప్రభావితుడైన సి పి బ్రౌన్ అనే ఈష్టిండియా కంపెనీ ఉద్యోగి 1829లో వేమన పద్యాల్ని ఆంగ్లభాషలోకి అనువదించాడు

## దక్షిణాంధ్ర యుగం

విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత దక్షిణ భారతంలో ముఖ్యంగా ఈనాటి మద్రాసు రాష్ట్రంలో చిన్నచిన్న హిందూ రాజ్యాలు అనేకం ఏర్పడ్డాయి ఈ రాజ్యాలు నాయకులనే యువరాజుల పాలనలో వుండేవి చాలమంది నాయకరాజులు తెలుగువారే కావడం విశేషం ఈనాటి మద్రాసు రాష్ట్రంలోని మధురై, తంజావూరు, పుదుక్కోటై లు ఒకప్పుడు నాయక రాజుల సంస్థానాలుగ వెలుగొందాయి ఈసంస్థానాల్లో తెలుగు భాషా సాహిత్యాలకు విశేషమైన ఆదరణ లభించింది 17వ శతాబ్దినుండి 19వ శతాబ్ద్యర్థం వరకు ఈ సంస్థానాల్లో అనేక తెలుగు రచనలు వెలువడ్డాయి అందువల్లనే ఈ కాలంలో వెలువడిన సాహిత్యానికి దక్షిణాంధ్ర సాహిత్యమని పేరొచ్చింది చాలామంది రాజులేగాక అనేకమంది స్త్రీలు కూడ ఉత్కృష్టమైన గ్రంధరచన చేయడం దక్షిణాంధ్ర యుగసాహిత్య చరిత్ర ప్రత్యేకలక్షణం ఇదేగాక సంగీతానికి విశిష్టమైన ఆదరణ లభించింది తెలుగులో అనేక సంగీత గ్రంధాల్ని సమకూర్చడం జరిగింది ఈ రచయితలే వాగ్గేయకారులుగ ప్రసిద్ధి చెందారు

## క్షేత్రయ్య (1633-73)

క్షేత్రయ్యను క్షేత్రజ్ఞుడు అనికూడ పిలుస్తారు ఈయన సంగీత విద్వాంసుడేగాక కవిత్వరచనలో గొప్ప దిట్ట. క్షేత్రయ్య కృష్ణాజిల్లాలోని మొవ్వగ్రామంలో జన్మించాడు. ఈయన సంగీత రచనల్నే 'పదాలు' అని అంటారు ఈ పదాలే ప్రసిద్ధిచెందిన కూచిపూడి నృత్యరీతులకు గొప్ప ఆకరాలయ్యాయి క్షేత్రయ్య చాలప్రాంతాల్లో పర్యటించడమేగాక హైదరాబాదు, తంజావూరు మొదలైన దక్షిణ భారత సంస్థానాధీశుల మన్ననకూడ పొందాడు క్షేత్రయ్య దాదాపు 4వేల పదాలు రచించినట్లు తెలుస్తున్నప్పటికీ కేవలం 400పదాలు మాత్రం లభ్యమౌతున్నాయి

## త్యాగరాజు (1759-1847)

దక్షిణ భారతంలో విశేషంగా ప్రాచుర్యంలోవున్న సంగీతాన్ని కర్ణాటక సంగీతం అని వ్యవహరిస్తారు. 'కర్ణాటక' అనే పదంవల్ల ఈసంగీతం కర్నాటకకు చెందింది మాత్రమే అని భ్రమపడే అవకాశంవుంది ఈనాటి ఆంధ్రదేశంలోని

దక్షిణ జిల్లాలు, తమిళనాడులోని ఉత్తరజిల్లాలు ఒకప్పుడు కర్నాటకలో వుండేవి దక్షిణదేశంలో ప్రసిద్ధి చెందిన సంగీత విద్వాంసులు - త్యాగరాజు, దీక్షితార్, శ్యామశాస్త్రి - పై ప్రాంతానికి చెందిన వారుకావడంతో ఈ సంగీతానికి కర్నాటక సంగీతమన్న పేరువచ్చింది త్యాగరాజుగ ప్రసిద్ధిచెందిన కాకర్లత్యాగయ్య దక్షిణ దేశానికి చెందిన పైముగ్గురు ప్రముఖ సంగీత విద్వాంసుల్లో గొప్పవాడు త్యాగరాజు జన్మతహ తెలుగు బ్రాహ్మణుడు కావడం వల్ల ఆయన సంగీత రచనలన్నీ తెలుగులోనే సాగాయి అయితే ఆయన నివసించింది మాత్రం తమిళనాడులోనే

## కవయిత్రులు

తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి కవయిత్రి కుమ్మరి మొల్ల. ఈమె కుండలు తయారుచేసి జీవించే ఒక వృత్తికారుని కుమార్తె ఈమె ఆరుఖండాల్లో ఒక రామాయణాన్ని రచించింది ఈ రామాయణమే అన్నివర్గాల తెలుగు ప్రజల్లోను మొల్ల రామాయణంగా ప్రసిద్ధిచెందింది కొంతమంది ఈమెను 13వ శతాబ్దికి చెందిన తిక్కన మహాకవికి సమకాలికురాలిగ భావించారు కృష్ణ దేవరాయల కుమార్తె, రామరాయల భార్యఅయిన మోహనాంగి మారీచి పరిణయం అనే తెలుగు కావ్యాన్ని రచించినట్లు చెపుతారు అన్నమాచార్యుల భార్యయైన తాళ్ళపాక తిమ్మక్క అను మరో కవయిత్రి సుభద్రాపరిణయం అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించింది

అయినప్పటికి 17, 18శతాబ్దుల్లోనే రామభద్రాంబ, మధురవాణి, రంగాజమ్మ, ముద్దుపళని వంటి కవయిత్రులు గొప్ప సాహిత్య విలువలున్న గ్రంథాల్ని రచించగల్గారు వీరందరు కూడ తంజావూరు రాజుల ఆదరణకు నోచుకున్నారు

మైసూరులోకూడ తెలుగు సాహిత్యం వెలువడింది బెంగళూరు నగర స్థాపకుడైన కెంపెగౌడ తెలుగులో 'గంగాగౌరీ విలాసము' నే సంగీత గ్రంథాన్ని రచించాడు

గోల్కొండ పాలకుడైన కుతుబ్ షాహి రాజులు కూడ తెలుగు సాహిత్యాన్ని ఆదరించారు జనార్దనశతకం, సుగ్రీవ విజయం, కావ్యాల్ని రచించిన కందుకూరి రుద్రయ్యను, అద్దంకి గంగాధర కవిని ఇబ్రహీం కుతుబ్ షా సన్మానించాడు.

మాలిక్ ఇబ్రహీం అనే మరో గోల్కొండ సుల్తాను పద్మపురాణం వంటి రచనల్ని చేసిన మల్లారెడ్డిని ఆదరించి పోషించాడు

## ఆధునిక యుగం

1766-1802 మధ్యకాలంలో ఈనాటి ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల్లో (రాయలసీమ, సర్కారు ప్రాంతం, తెలంగాణా) రాయలసీమ, సర్కారు ప్రాంతాలు మాత్రం ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ ఆధీనంలోకి వచ్చాయి తెలంగాణా ప్రాంతం మాత్రం ఆనాటి హైదరాబాదు రాష్ట్రంలో భాగంగా వుండేది

ఆంగ్లేయుల పాలన ప్రారంభం కావడంతో ఆంగ్లసాహిత్యం తెలుగు సాహిత్యాన్ని విపరీతంగా ప్రభావితం చేసింది 1857 కు ముందే కొన్ని క్రైస్తవ మతసంస్థలు, సి పి బ్రౌనువంటి ఈస్టిండియా కంపెనీ ఉద్యోగులు తెలుగు బాషా సాహిత్యాలకు ఎనలేని సేవలందించడం జరిగింది బ్రౌన్ మహనీయుడు ఇంగ్లీషు – తెలుగు నిఘంటువును తయారు చేయడమేగాక మరుగున పడివున్న అనేక తెలుగు గ్రంధాల్ని వెలుగులోకి తెచ్చేందుకు తన స్వంతఖర్చులతో అనేకమంది పండితుల్ని నియమించుకున్నాడు.

## కందుకూరి వీరేశలింగం

సాంఘిక రంగంలో ముఖ్యంగా వితంతువుల పునర్వివాహ విషయమై వీరేశలింగం పంతులు అందించిన విశేషమైన సేవలవల్లే ఆయన్ని ఈనాటికి మనం గుర్తించుకుంటున్నాము సాంఘికరంగంపై తన దృష్టిని కేంద్రీకరించక మునుపే నవల, జీవిత చరిత్రవంటి కొత్త సాహిత్య ప్రక్రియల్ని సృష్టించి తెలుగు సాహిత్య ప్రపంచ పరిధిని విస్తృతం చేశాడు ఆయన సాహిత్య కార్యకలాపాలు బహుముఖంగా సాగాయి రాజశేఖర చరిత్ర అనేనవలను రచించి తెలుగు సాహిత్యంలో మొదటి సారిగ నవలా రచనకు శ్రీకారం చుట్టాడు జీవశాస్త్రాల్లోను, చరిత్రలోను మొదటి తెలుగు పుస్తకాల్ని ఆయనే రచించాడు సతిహిత బోధిని, హాస్యవర్ధిని వంటి మహిళా పత్రికల్ని స్థాపించడంలో కూడ వీరేశలింగం పంతులు ఆద్యులు. తెలుగు సాహిత్య విమర్శగ్రంధాల్ని రాయడంలోను, కవుల చరిత్రను రాయడంలోను పంతులుగారే మొదటివారని చెప్పవచ్చు. వీరేశలింగం రచనలు

తెలుగు సాహిత్యంలోని అన్నిరకాల ప్రక్రియలకు అద్దం పట్టిందని చెప్పవచ్చు

## నవలా సాహిత్యం

19వ శతాబ్ది మధ్యభాగంనుండి వచనం ఒక ప్రత్యేక సాహితీ ప్రక్రియగ అభివృద్ధి చెందడం ప్రారంభించింది నవల, కథానిక, నాటిక వంటి వివిధ వచన సాహితీ ప్రక్రియలు ఈనాడు పద్యకవిత్వం కంటె ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందాయి

మద్రాసు ప్రసెడిన్సీ కాలేజిలో తెలుగు పండితుడుగ పనిచేసిన పరవస్తు చిన్నయసూరి (1806-1862) రచించిన 'నీతిచంద్రిక' తెలుగు వచన సాహిత్యంలోని మొదటి ఉత్తమ రచన పేర్కొనవచ్చు సంస్కృత పంచతంత్రంలోని మిత్రభేదం, మిత్రలాభం అనుమొదటి రెండు భాగాల అనువాదమేనీతి చంద్రిక రచన రచనా శైలి కృత్రిమంగాను, ఆడంబరంగాను సాగింది వీరేశలింగంతో పాటు చాలమంది రచయితలు చిన్నయసూరి శైలిని అనుకరించారు వీరేశలింగం సంస్కృత పంచతంత్రంలోని మూడవభాగమైన విగ్రహ తంత్రాన్ని అనువదించేందుకు పైశైలిని అనుకరించాడు అయితే విద్యార్థులు అర్థంచేసుకోవడం కష్టం అని భావించిన వీరేశలింగం ఈ కృత్రిమ శైలిని వదలిపెట్టాడు. అందువల్లనే పంతులుగారు సంధి తంత్రాన్ని (పంచతంత్రంలో నాల్గవభాగం) సులభవచనంలో వ్రాశాడు

తెలుగులో మొట్టమొదటి నవలయైన రాజశేఖర చరిత్ర గోల్డుస్మిత్తు ఆంగ్లంలో రచించిన వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ (Vikar of wake field) అనేనవల ఆధారంగా రచించబడ్డది రాజశేఖర చరిత్ర కన్నడ, ఆంగ్ల భాషల్లోకి అనువదింపబడ్డది లండనునుండి వెలువడే 'దిటైమ్స్' (The Times) పత్రికలో ఈనవలను గూర్చి సమీక్షించడం జరిగింది. చిలకమర్తి లక్ష్మీనరసింహం (1867-1945) అంధత్వానికి గురైనా అనేక రచనలుచేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగ పేరు గడించాడు. ఈయన కవేగాక మంచి ఉపన్యాసకుడుగ, నాటక కర్తగ, వ్యాసరచయితగ, సంఘసంస్కర్తగ కూడ పేరుతెచ్చుకున్నాడు చిలకమర్తి ఆంధ్రదేశంలో గొప్పవ్యక్తులుగ ప్రసిద్ధి పొందిన వీరేశలింగం, న్యాపతి సుబ్బారావు, టంగుటూరి ప్రకాశంవంటి వారితో సన్నిహిత సంబంధాల్ని కలిగివుండేవాడు

న్యాపతి సుబ్బారావు ఆంగ్లదినపత్రిక 'ది హిందూ' వ్యవస్థాపకుల్లో ఒకరు. ఈయన నగదు బహుమతుల్ని ఏర్పాటుచేసి తెలుగులో నవలారచనకు ప్రోత్సాహమిచ్చాడు 1893లో చిలకమర్తి లక్ష్మీనరసింహం రచించిన 'రామచంద్ర విజయం' అనేనవలకు మొదటి బహుమతి లభించింది. మరల 1896లో చిలకమర్తి రచించిన 'హేమలత' అనే నవలకు కూడ బహుమతి లభించింది కర్పూర మంజరి, సౌందర్య తిలకం అనే ఉత్తమ నవలలుకూడ చిలకమర్తి వారి కలం నుండి వెలువడ్డాయి ఈయన రచించిన నవలలన్నీ సాంఘిక, చారిత్రక ఇతివృత్తాల ఆధారంగా రచింపబడ్డవే.

## మాలపల్లి

1917లో తలెత్తిన బోల్షివిక్ విప్లవం, గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం ఆంధ్రదేశంలోని విద్యావంతులపై విపరీతమైన ప్రభావాన్ని చూపాయి. గుంటూరు న్యాయవాదియైన ఉన్నవ లక్ష్మీనారాయణ సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు. 1921లో తాను జైలునిర్బంధంలో వున్నప్పుడు లక్ష్మీనారాయణ మాలపల్లి నవలను రచించాడు. ఈ నవల హరిజనులు, శ్రామికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల్ని గూర్చి స్పష్టంచేసింది. ధనిక, పేద వర్గాలమధ్య జరిగే సంఘర్షణను చిత్రిస్తూ రాజకీయ సమస్యలపై దృష్టిని కేంద్రీకరించిన మొట్టమొదటి నవల మాలపల్లి. ఈనవలను భారతదేశంలోని బ్రిటీషు ప్రభుత్వం నిషేధించింది. అయితే ఈనవల కాంగ్రెసు వారినే గాక కమ్యూనిస్టుల్ని సైతం ఉత్తేజితుల్ని చేస్తూవచ్చింది.

## విశ్వనాథ సత్యనారాయణ

'విశ్వనాథ' గ ప్రసిద్ధి చెందిన విశ్వనాథ సత్యనారాయణ 20వ శతాబ్దికి చెందిన ప్రసిద్ధ రచయిత. ఈయన్ని కవిసామ్రాట్టుగ అభినందించడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. ఈయన వచన రచనల్లో వేయిపడగలు, జేబుదొంగలు, ఏకవీర మొదలయిన నవలలు విశేష ప్రచారాన్ని పొందాయి. విశ్వనాథ ప్రతిష్ఠాత్మక రచనయైన 'వేయిపడగలు' నవలను 'సహస్రఫణ్' అనే పేరుతో శ్రీ.పి.వి. నరసింహారావు హిందీలోకి అనువదించారు. 'జ్ఞానపీఠ' అవార్డును గ్రహించిన ఏకైక తెలుగు రచయిత.విశ్వనాథ సత్యనారాయణ.

1950కి ముందు నవలల్లో 'చివరకు మిగిలేది' అనే నవల చాల ఉత్కృష్టమైన రచన దీనిరచయిత బుచ్చిబాబు ఈయన వృత్తిరీత్యా ఆంగ్లోపన్యాసకుడు ఈయన తన నవలలో కోస్తాజిల్లాలకు చెందిన మధ్యతరగతి కుటుంబాల్లోని జీవితసమస్యల్ని చర్చించడమేగాక సర్కారు రాయలసీమల మధ్యగల ప్రాంతీయ విభేదాల్ని గూర్చి కూడ చక్కగా వివరించాడు ఈయన ఆకాల మరణానికి గురిగావడంతో తెలుగు సాహిత్యాభివృద్ధికి గొప్ప విఘాతం కలిగిందని చెప్పవచ్చు

## మార్క్సిజం ప్రభావం

1930 నుండి తెలుగు ప్రజల్లో వామపక్షభావాలు మొలకెత్తడం ప్రారంభం అయింది మాక్సింగోర్కీ రచన 'మదర్' (Mother) , మార్క్సు, లెనిను రచించిన గ్రంథాలు తెలుగులోకి అనువదింపబడ్డాయి టి గోపీచంద్, కొడవగంటి కుటుంబరావు రాచకొండ విశ్వనాథశాస్త్రి వంటి వారు తెలుగు నవలకు పరిపుష్టిని చేకూర్చారు గోపీచంద్ రచించిన 'అసమర్థుని జీవితయాత్ర' మధ్యతరగతి సాంఘిక జీవితానికి అద్దంపడుతుంది. కుటుంబరావు, విశ్వనాథశాస్త్రి అట్టడుగు వర్గాలకు ప్రాతినిధ్యం వహించారు వీరు మార్క్సిజానికి బద్ధులై రచనలు చేశారు కుటుంబరావు గారు ఈమధ్యనే మరణించారు. ఈయన పూర్తి రచనల్ని కేతు విశ్వనాథరెడ్డి సంపాదకత్వంలో విజయవాడలోని విశాలాంధ్ర ప్రచురణ సంస్థ ప్రచురించింది. విశ్వనాథశాస్త్రి నవలయైన 'రత్తాలు – రాంబాబు' ఇప్పటికీ అసంపూర్తిగనే మిగిలిపోయింది

## నవలా రచయిత్రులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన తర్వాత తెలుగు నవలా రచనలో ఒక కొత్త ధోరణి తలెత్తింది బాగా ప్రచారంలో వున్న కొన్ని పత్రికలు ముఖ్యంగా వారపత్రికలు నవలల్ని సీరియల్‌గా ప్రకటిస్తూ, ఉత్తమ నవలలకు అవార్డు ఇచ్చే సాంప్రదాయాన్ని ప్రారంభించాయి దీంతో మాలతిచందూర్, డాక్టరు శ్రీదేవి, యద్దనపూడి సులోచనారాణి, మాదిరెడ్డి సులోచన, బీనాదేవి, శ్రీమతి అనంతరామం, డి విశాలాక్షి లత, రంగనాయకమ్మ, డి కామేశ్వరి, కె. రామలక్ష్మి, పి. సీతాదేవి మొదలైన అనేకమంది నవలారచయిత్రులు రంగంలోదిగి రచనల్ని

సాగించారు  నిజం చెప్పాలంటే ఈనాడు మగవాళ్ళకంటే ఆడవాళ్ళే ఎక్కువ నవలల్ని వ్రాస్తున్నారు  గుడిపాటి వెంకటాచలం (చలం) ప్రస్తావన లేని తెలుగు నవలా సమీక్ష అసమగ్రమైందనే భావించాలి  ఈయన స్త్రీల సమస్యల్ని చేపట్టి 'మైదానం', 'అమీనా' వంటి నవలల్ని రచించాడు, బెంగాలీ నవలల్ని ముఖ్యంగా శరత్ చంద్ర చీటర్జీ నవలల్ని అనువాదం చేసిన అడవి బాపిరాజు, బలివాడ కాంతారావు, నోరినరసింహ శాస్త్రి, పిలకాగణపతి శాస్త్రి జి వి కృష్ణారావు, చక్రపాణి వంటి వారిని గొప్ప నవలా రచయితలుగ పేర్కొనవచ్చు

కథానికలు

ఆంగ్లవిద్యావాప్తితోను, ఆంగ్లసాహిత్య ప్రభావంతోను, కథానిక సాహిత్యం కూడ నవలలాగే తెలుగు వాఙ్మయంలో ఒక ప్రత్యేక శాఖగా అభివృద్ధిచెందడం ప్రారంభించింది  అయితే 19వ శతాబ్ది నాటికే తాతాచారి కథలు, కాశీమజిలి కథల వంటివి ప్రచారంలోవున్నా వాటికి సాహిత్య రచనలుగ గుర్తింపు కలుగలేదు తాతాచారి కథలు శ్రీకృష్ణదేవరాయల రాజగురువైన తాతాచారి చుట్టూతిరిగే కథలుకాగా, కాశీయాత్రను గురించి తెలిపే కథలే కాశీమజిలీ కథలు  ఆధునిక సాహిత్యసృష్టికర్త, వ్యవహారిక భాషలో వెలువడిన కన్యాశుల్క నాటకరచయితయైన గురజాడ అప్పారావును (1862-1915) తెలుగు సాహిత్యంలో ఆధునిక కథానికరచనకు ఆద్యుడుగ పేర్కొంటారు  1910లో ప్రచురించబడ్డ 'దిద్దుబాటు' ను మొదటి ఆధునిక కథానికగ భావించడం జరిగింది  గురజాడ కలంనుండి ఎక్కువ రచనలు వెలువడకపోయినా, తెలుగు సాహిత్యంలోని నాటకం, కథానిక, కవిత్వం వంటి ప్రక్రియల్లో అత్యాధునికమైన ధోరణుల్ని ప్రవేశపెట్టిన యుగ పురుషుడుగ తెలుగు సాహితీలోకం గుర్తించింది

చింతా దీక్షితులు, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారు రచించిన కథానికలు ఆంధ్రదేశంలో బహుళ ప్రచారాన్ని పొందాయి  పిల్లల కోసం కథాసాహిత్యాన్ని సృష్టించిన మొట్టమొదటి రచయిత చింతాదీక్షితులు  మునిమాణిక్యం నరసింహరావు రచించిన 'కాంతం కథలు' అనే కథాకావ్యం మధ్యతరగతి కుటుంబ జీవితాన్ని చిత్రీకరించింది

రెండవ ప్రపంచయుద్ధం ముగియడంతో విశేషంగా అభివృద్ధిని సాధించిన తెలుగు పత్రికారంగం వల్ల కధానికా సాహిత్యం వేగాన్ని పుంజుకుంది 'న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్' నిర్వహించిన ప్రపంచ కధానిక పోటీల్లో పి పద్మరాజు రచించిన 'గాలివాన' రెండవ బహుమతిని గెల్చుకుంది. ఈ మధ్యకాలంనుండి వామపక్షభావాల్ని ప్రచారం చేసేందుకు కూడ కధానిక సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు కధానిక రచనలో అందెవేసిన చేయిగ ప్రసిద్ధిచెందిన రాచకొండ విశ్వనాధశాస్త్రి 'అభ్యుదయ రచయితల సంఘం'(అరసం) అనే సాహితీ సంస్థలో సభ్యుడయ్యాడు ఈ సంస్థను భారత కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థగ భావిస్తారు ఈ 'అరసం' కు వ్యతిరేకంగా 'విరసం'(విప్లవ రచయితల సంఘం) అనే సంస్థ ఏర్పాటయింది ఈ 'విరసం' కూడ విప్లవవాద రాజకీయ సిద్ధాంతాల్ని ప్రచారంచేస్తుంది

## నాటకాలు - రంగస్థలం

తెలుగు సాహిత్యంలో నాటకరంగం పూర్తిగ విస్మరించబడ్డదని చెప్పవచ్చు. 19వ శతాబ్ది చివరి దశకాల్లో మాత్రమే రంగస్థలంపై ప్రదర్శించే యోగ్యతకలనాటకాలు అవిర్భవించాయి దీనికి కారణం ధార్వాడ్, పూనాకు చెందిన డ్రామా కంపెనీలిచ్చిన ఉత్తేజమేనని చెప్పవచ్చు ఈ కంపెనీలు హిందీ, ఉర్దూ నాటకాల్ని ఆంధ్రదేశంలోని వివిధ పట్టణాల్లో ప్రదర్శించేవి దీనివల్ల తెలుగులో కూడ ఇటువంటి నాటకాల్ని రచించి ప్రదర్శించాలన్న కుతూహలం కలిగింది బళ్ళారి, రాజమండ్రి పట్టణాల్లో తెలుగు నాటకాల్ని విజయవంతంగా ప్రదర్శించారు బళ్ళారికిచెందిన ధర్మవరం రామకృష్ణమాచార్యులు (1853-1913) ఆంధ్రనాటక పితామహుడుగ ప్రసిద్ధివెందాడు. చిత్రనళీయం, సారంగధర, అనేఉత్తమనాటకాల్ని కృష్ణమాచార్యులు రచించాడు. బళ్ళారికి చెందిన మరోనాటక కర్త కోలాచలం శ్రీనివాసరావు ఈయన చారిత్రక నాటకాలపైన్నే తన దృష్టిని కేంద్రీకరించాడు ఈయన రచించిన 30 నాటకాల్లో 'విజయ నగర సామ్రాజ్య పతనం' చాల ఉత్కృష్టమైన రచన

చిలకమర్తి లక్ష్మీనరసింహం రచించిన గయోపాఖ్యానం, ప్రసన్న యాదవం వంటి నాటకాలు విపరీతమైన ప్రజాదరణను పొందాయి ఈ నాటకాల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్త్రీ పాత్రల్ని ధరించేవారు.

## బళ్ళారి రాఘవ

  ళ్ళారి రాఘవగ ప్రసిద్ధిచెందిన తాడిపత్రిరాఘవాచార్యులు సాటిలేని మేటినటుడుగ పేరుగడించాడు ఇతడు తన అభినయ కౌశలం ద్వారా తెలుగు నాటకరంగానికి మరింత పరిపుష్టి చేకూర్చగల్గాడు మద్రాసు, బెంగళూరు నగరాల్లో ప్రదర్శింపబడ్డ ఆంగ్లనాటకాల్లో ఒథేల్లో, షైలాక్ వంటి పాత్రల్ని ధరించి ప్రేక్షకుల్ని రంజింపజేశాడు. అతని కీర్తిచంద్రికలు దేశంలోని ఇతర ప్రాంతాలకేగాక ఇంగ్లాండుకు కూడ వ్యాపించింది ఈయన్ని భారతీయ రంగస్థలంపై అత్యుత్తమ నటుడుగ విశ్వకవి రవీంద్రనాధ ఠాగూరు అభివర్ణించాడు

తిరుపతి వేంకటకవులు రచించిన పాండవ ఉద్యోగ విజయాలు, వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన ప్రతాపరుద్రీయము, బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర, పానుగంటి లక్ష్మినరసింహరావు రాసిన పాదుకా పట్టాభిషేకం వంటి నాటికలు 20వ శతాబ్ది ప్రారంభంలో వెలువడిన ప్రసిద్ధ నాటకాల్లో పేర్కొనదగ్గవి

స్థానం నరసింహరావు, డి వి సుబ్బారావు తెలుగు నాటక రంగంలో సుప్రసిద్ధ నటులుగా పేరుగాంచారు

## కన్యాశుల్కం

గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం అత్యుత్తమమైన మొదటి సాంఘిక నాటకం అని చెప్పవచ్చు దీనిని ఆధునిక వేదంగా చాలమంది భావించారు ఈనాటకాన్ని విజయనగర జమీందారైన ఆనందగజపతిరాజు ఇచ్చిన ప్రోత్సాహంతో గురజాడ రచించాడు 19వ శతాబ్ది చివరికాలంలో మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాల్లోవున్న 'కన్యాశుల్కం' అనే దురాచారాన్ని నిరసించడానికే కన్యాశుల్క నాటకాన్ని సృష్టించడం జరిగింది. ఈ కన్యాశుల్క పద్ధతిక్రింద పసికందులనే విచక్షణ కూడలేక తమకు కల్గిన ఆడపిల్లల్ని శుల్కం తీసుకుని ముసలివాళ్ళకుసైతం కట్టబెట్టేవారు 1897లో రచించిబడ్డ ఈనాటకాన్ని 1909లో మరల పునఃసమీక్షించి కొన్నిమార్పుచేర్పులతో ప్రకటించడం జరిగింది. కన్యాశుల్క దురాచారాన్ని పాటించే వ్యక్తుల్ని తీవ్రంగా నిరసించి పరిహసించేందుకు రచించబడ్డ సాంఘిక నాటకం కన్యాశుల్కం

వ్యవహారభాషలో రాయడం వల్ల ఈనాటకం విశేషంగా ప్రాచుర్యాన్ని పొందింది. కన్యాశుల్క దురాచారం ఎప్పుడో తెరమరుగైనా ఈనాటికీ ఈనాటకాన్ని అత్యుత్సాహంతో చదువుతున్నారు గిరీశం, మధురవాణి వంటి పాత్రలు జీవితానికి అద్దం పట్టే విధంగా చిత్రించ బడ్డాయి.

మాభూమి

1942-46 మధ్యకాలంలో తమ సాంస్కృతిక సంస్థయైన ప్రజానాట్య మండలి ద్వారా 'ముందడుగు' వంటి నాటకాల్ని ప్రదర్శిస్తూ తమ పార్టీ సిద్ధాంతాల్ని ప్రచారం చేసేందుకు కమ్యూనిస్టులు ప్రయత్నించారు. 'మాభూమి' నాటకం భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణా రైతులు సాగించిన పోరాటాన్ని చిత్రించింది ఈ నాటకాన్ని కొన్నాళ్ళపాటు నిషేధించడంకూడ జరిగింది

మద్రాసు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన పి. వి. రాజమన్నారు, ఆచార్య ఆత్రేయ వంటి రచయితల ప్రస్తావనలేని తెలుగు నాటక సాహిత్యం అసమగ్రమైందనే చెప్పాలి రాజమన్నారు రచించిన 'తప్పెవరిది', 'ఏమిమగవాళ్ళు' అనే నాటికలు మేధావి వర్గాన్ని ఆకట్టుకున్నాయి. ఆత్రేయ రచించిన 'ఎన్ జి.వో.', అనే నాటిక ప్రభుత్వ సర్వీసుల్లో తక్కువ జీతంతో పని చేసే గుమాస్తాల జీవితాన్ని చిత్రిస్తుంది

1956లో ఆంధ్ర ప్రదేశ్ అవతరణ తర్వాత వెలువడ్డ ఉత్తమ నాటకాలు చాల తక్కువ. దీనికి కారణాలు అనేకం. ఆంధ్రదేశంలో సినిమా పరిశ్రమ బాగా అభివృద్ధి చెందడం ప్రారంభించింది. దీంతో తమ రచనల్ని సినిమా కథలుగా ఉపయోగించుకోవచ్చుననే వ్యాపార దృక్పథం పెరిగి రచయితలందరు నవలా రంగంపైనే తమ దృష్టిని కేంద్రీకరించారు. తగిన ఆదరణలేక తెలుగు నాటక రంగం క్రమంగా క్షీణిస్తోంది

పద్య కవిత్వం

ఈ శతాబ్ది ప్రారంభంనుండి తెలుగు కవిత పటిష్టంగా రూపొందడం ప్రారంభించింది. దీనికి కారణాలు అనేకం కందుకూరి సంఘ సంస్కరణ ప్రయత్నాలు, వందేమాతరం, స్వదేశీ ఉద్యమాలు ప్రజల్లో కల్గించిన చైతన్యం,. గిడుగు రామమూర్తి పంతుల వ్యవహారిక భాషావాదం మొదలైనవన్నీ కవుల్లో ఒక

కొత్త చైతన్యాన్ని కల్గించాయి దీంతో వీరు సాహిత్యంలో కొత్త కొత్త ప్రయోగాలు చేయడం ప్రారంభించారు.

గురజాడ అప్పారావు 'ముత్యాల సరాలు' రచనతో తెలుగు కవిత్వరచనలో ఒక కొత్త ధోరణి ప్రారంభమయింది. 'ముత్యాల సరాలు' పద్యసంపుటి ప్రచురించడంతో తెలుగు పద్యరచనలో కొత్త చందస్సు ఆవిర్భవించడమే గాక ఒక కొత్త కవిత్వ సిద్ధాంతం కూడ తలెత్తింది. ఈ పద్యాల్లో గురజాడ ఒక కొత్త సాహస ప్రపంచాన్ని చూడగల్గాడు. మాతృభూమిని కేవలం ఒక మట్టి ముద్దగా భావించి ప్రజల్ని మరచే దేశభక్తుల్ని గురజాడ అపహాస్యం చేశాడు 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ', 'లవణరాజుకల', గురజాడ ఇతర రచనలు, సుప్రసిద్ధ పత్రికారచయిత, సాహిత్య విమర్శకుడు అయిన వి ఆర్. నార్ల చెప్పినట్లు గురజాడ తెలుగు సాహితీలోకానికి ప్రసాదించిన రచనలు రాశిలో తక్కువైనా అవి ఒక సిద్ధాంతానికి కట్టుబడి అందమైన రచనలుగ భాసించాయని చెప్పవచ్చు.

## రాయప్రోలు సుబ్బారావు (1892–1983)

1912లో రాయప్రోలు సుబ్బారావు రచించిన 'తృణ కంకణం' అనే పద్య కావ్యం వెలువడడంతో తెలుగు పద్యరచనలో 'భావకవిత్వం' అనేకొత్త శాఖ ఆవిర్భవించింది. ఇది సంప్రదాయ కవిత్వానికి బిన్నమైంది. భావకవిత్వంలో రసానికంటె భావానికి ప్రాధాన్యత ఎక్కువ. రాయప్రోలు సృష్టించిన భావకవిత్వం దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు, దువ్వూరు రామిరెడ్డి, విశ్వనాధ సత్యనారాయణ, నండూరి సుబ్బారావు మొదలైన అనేకమంది కవుల్ని ప్రభావితుల్ని చేసింది.

సాంప్రదాయ కవిత్వానికి పట్టుగొమ్మగా నిలిచిన విశ్వనాధ సత్యనారాయణ సైతం తన కవిత్వరచన ప్రారంభదినాల్లో రాయప్రోలు వారిచే ప్రభావితుడై కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్ళి వంటి రచనలు సాగించడం విశేషంగా చెప్పవచ్చు.

కృష్ణపక్షం, ఊర్వశి వంటి కృష్ణశాస్త్రి రచనల్లో రాయప్రోలు ప్రభావం మనకు కన్పిస్తుంది. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి ఇచ్చిన ప్రోత్సాహంతో సుబ్బారావు, బసవరాజు అప్పారావు వంటి భావకవులు కలసి 'సాహితీ సమితి' అనే

సాహిత్యసంస్థను ఏర్పాటు చేసుకున్నారు. భావకవిత్వాన్ని ప్రచారం చేయడంలో 'ప్రగతి' అనేసాహిత్య పత్రిక గణనీయమైన సేవల్ని అందించింది

భావకవుల వర్గానికి చెందిన నండూరి సుబ్బారావు తాను రచించిన 'ఎంకిపాటలు' అనే కావ్యంలో వ్యవహారిక మాండలికాన్ని వినియోగించి ఒక పెద్ద వివాదానికి కారకుడయ్యాడు. ఈపాటల్లోని నాయికా నాయకులు (ఎంకి, నాయుడు బావ) వ్యవసాయ కూలివర్గానికి చెందినవారు కావడమేగాక ఈపాటల్లో సుబ్బారావు వినియోగించిన భాషసైతం ఆవర్గానికి చెందిందే కావడంతో కావ్యంయొక్క ఔన్నత్యాన్ని చాలమంది పండితులు ప్రశ్నించారు. అయితే బరంపురంకు చెందిన గొప్ప పండితుడు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి ఎంకిపాటలకు వ్రాసిన పదునైన పీఠిక విమర్శకుల నోళ్ళను మూయించింది

## శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీ శ్రీ)

'శ్రీ శ్రీ' గ ప్రసిద్ధి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు ఒక తిరుగుబాటు కవిగ ప్రజలహృదయాల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు విప్లవభావాలు గల యువతపై ఇదివరకే గాక ఇప్పుడుకూడ ఆయన రచనలు విపరీత ప్రభావాన్ని చూపుతున్నాయి శ్రీ శ్రీ విప్లవ రచయితల సంఘంలో (విరసం) సభ్యుడుగ కొనసాగాడు

శ్రీ శ్రీ మార్క్సిజంవైపు విశేషంగా ఆకర్షితుడు కావడమేగాక 1930లో తలెత్తిన ఆర్థిక సంక్షోభంలో చాలపేదరికాన్ని అనుభవించాడు ఆర్థిక పరమైన దోషాలన్నింటికి కమ్యూనిజమే పరిష్కార మార్గం అని ఆయన భావించాడు. అందువల్లే ఆయన 1934 నుండి 1941 వరకు అనేక పద్యాల్ని రచించి వీటన్నింటిని 'మహాప్రస్థానం' అనేపేరుతో ఒక పుస్తకరూపంలో వెలయించాడు ఈ పద్యాల్లో శ్రీ శ్రీ తానే ఒక విప్లవ కారుడిగ మారి ప్రాచీన జీవిత క్రమాన్ని, తుప్పుపట్టిన సాంప్రదాయాల్ని భూస్థాపితం చేయాలని భావించాడు

శ్రీ శ్రీని ఆయన అభిమానులు 'మహాకవి'గ పిలుస్తారు. తమకుగల రాజకీయ భావాల్ని, దురభిప్రాయాల్ని ప్రక్కకు పెట్టి చూచినప్పుడే ఎవరైనా శ్రీ శ్రీకి తెలుగు సాహిత్య చరిత్రలోగల నిజమైన స్థానాన్ని గుర్తించగలరు. ఆంధ్రదేశంలోని గొప్ప కవుల్లో ఆయన కూడ ఒకరు. సామాన్యుల కష్టాల్ని,

కన్నీటిని గురించి చెప్పే ఆయన కవితలు భావావేశాన్ని కలిగించడమేగాక మేధావి వర్గంలో కలవరపాటు కల్గించింది

## తెలంగాణా కవులు

1948 వరకు తెలంగాణా ప్రజలకు తమ మాతృభాషలో చదువుకునే అవకాశం లేకపోయినా వారు తెలుగు సాహిత్యానికి చేసిన సేవమాత్రం గణనీయమైందని చెప్పవచ్చు మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణ రెడ్డి వంటి తెలంగాణాలోని ఆంధ్రోద్యమ నాయకులందరు కూడ తెలుగులో మంచి రచయితలుగ పేరొందిన వారే సురవరం ప్రతాపరెడ్డి రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' కు సాహిత్య అకాడమి బహుమతి లభించింది సురవరం ప్రతాపరెడ్డి చరిత్ర కారుడే గాక కవికూడ. చంపకీ భ్రమర విషాదం, పేమార్పణం అనేవి సురవరం రచించిన పద్యకావ్యాలు ఇవేగాక 'హిందువుల పండుగలు' 'హైందవధర్మ వీరులు', 'రామాయణ విశేషములు' అనే చారిత్రక పరిశోధన గ్రంథాల్ని కూడ ఆయన రచించాడు బూర్గుల రామకృష్ణా రావు అనేక రాజకీయ, సాంఘిక కార్యకలాపాల్లో తలమునకలై వుండికూడ తెలుగులో రెండుముఖ్యమైన గ్రంథాల్ని రాయగల్గాడు. అవిఒకటి 'పండిత రాజ పంచామృతము', రెండు 'కృష్ణ శతకము' అభినవ పోతన బిరుతాంకితుడైన వానమామలై వరదాచారి, ఖండవల్లి లక్ష్మీరంజనం కూడ తెలుగులో గొప్ప పండితులుగ పేరొందారు

మాడపాటి హనుమంతరావు రచించిన "తెలంగాణా లో ఆంధ్రోద్యమము" అనే గ్రంథం తెలంగాణాలో సాగిన ఆంధ్రోద్యమాన్ని గూర్చి విపులంగా చర్చించింది అదే విధంగా రావినారాయణ రెడ్డి రచించిన 'వీర తెలంగాణా' అనే గ్రంథం 1946–51 మధ్యసాగిన తెలంగాణా సాయుధ పోరాటంలోని ఆంతరంగిక విషయాల్ని గూర్చి తెలియచేస్తుంది పి.వి. నరసింహారావు బహుభాషా వేత్త. ఆయనకు తెలుగు, హిందీ, మరాఠి వంటి అనేక భాషల్లో మంచి ప్రవేశముంది ఈయన విశ్వనాధ సత్యనారాయణ రచించిన 'వేయిపడగలు' అనే నవలను, 'సహస్రఫణ్' అనే పేరుతో హిందీ భాషలోకి అనువదించారు.

కాళోజీ నారాయణ రావు, దేవులపల్లి రామానుజరావు కూడ ఉన్నత

శ్రేణికి చెందిన గొప్పకవులు. తెలంగాణా కవయిత్రుల్లో పేర్కొనదగ్గ వ్యక్తి ఇల్లిందుల సరస్వతీదేవి ఈమె కథానిక సాహిత్యంలో మంచి పేరును సంపాదించింది

యువతరానికి చెందిన ఉన్నతశ్రేణి కవుల్లో పేర్కొన దగ్గవారు సి నారాయణ రెడ్డి (సినారె), దాశరథి కృష్ణమాచార్యులు (దాశరథి) నారాయణ రెడ్డి రచనలు అనేకం వున్నాయి. 'దివ్వెల మువ్వలు', కర్పూరవసంతరాయలు', 'నాగార్జున సాగరు', 'అజంతా సుందరి', 'రామప్ప' వంటివి ఆయన రచనల్లో ముఖ్యమైనవి దాశరథి అగ్నిధార, రుద్రవీణ మొదలగు రచనల్ని చేశాడు దాశరథి రంగాచార్యులు రచించిన 'చిల్లర దేవుళ్లు', 'జనపథం' అనే నవలలు తెలంగాణా ప్రాంతంలోని గ్రామీణ జీవితాన్ని చిత్రించాయి. తెలంగాణాలోని మరికొంతమంది సమకాలీనకవులు 'దిగంబర కవులు' గా ప్రసిద్ధి చెందారు. వారు తమపేర్లకు బదులు కొన్ని విప్లవ సంకేతాల్ని వాడుకున్నారు. వీరు నగ్నముని, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, మహాస్వప్న, భైరవయ్య, చెరబండరాజు అను పేర్లతో కవిత్వ రచన సాగించారు. వీరు సంఘంలో సమూలమైన మార్పును వాంచించారు. దీనికి హింసా సిద్ధాంతమే పరమాయుధమని నమ్మారు చెరబండరాజు (భాస్కర రెడ్డి) ఈ మధ్యనే మరణించారు ఈయన చాలకాలంగ జైలు నిర్బంధంలో వుండి మరణించడానికి కొద్దిరోజుల ముందే విడుదల చేయబడ్డాడు

## రాయలసీమ రచయితలు

రాయలసీమ తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు బహుముఖంగా సాగాయి. సి. ఆర్. రెడ్డి గ ప్రసిద్ధుడైన కట్టమంచి రామలింగారెడ్డి 1900లో 'ముసలమ్మ మరణం' అనే కావ్యాన్ని రచించాడు. ఆయన రచించిన మరో గ్రంథం 'కవిత్వతత్త్వ విచారం' ఇది తెలుగులో సాహిత్య విమర్శను గూర్చి క్షుణ్ణంగా తెలియ జేస్తుంది జాతీయోద్యమంలోను, ఆంధ్రదేశంలో సాగిన గ్రంథాలయోద్యమంలోను ప్రముఖపాత్ర వహించిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు కర్నూలు జిల్లాకు చెందినవాడు. ఆయన రచించిన 'విస్మృత రాజకవి' అనే గ్రంథం శ్రీకృష్ణదేవరాయల సాహిత్యనైపుణి గూర్చి వివరిస్తుంది.

పుట్టపర్తి నారాయణాచార్యులు 'శివతాండవం', 'పెనుగొండ లక్ష్మి' వంటి అనేక పద్య కావ్యాల్ని రచించాడు. గడియారం శేషశాస్త్రి రచించిన 'శివభారతం

శివాజీ వీరోచిత కార్యాల్ని ఒక పౌరాణిక గాథా క్రమంలో వివరిస్తుంది. ఆర్. యస్. సుదర్శనం ప్రసిద్ధ నవలా రచయితేగాక సాహిత్య విమర్శకుడు కూడ. కథానికా రంగంలో మధురాంతకం రాజారాం, కేతు విశ్వనాథ రెడ్డి ప్రముఖ రచయితలుగ పేరును సంపాదించారు.

సాహిత్య విమర్శ, నాటక రంగంలో తప్ప మిగిలిన అన్ని శాఖల్లోను ఆధునిక తెలుగు సాహిత్యం పురోభివృద్ధి దశలో పయనిస్తున్నదని చెప్పవచ్చు

# అనుబంధం - II

## కొంత మంది ఆంధ్ర ప్రముఖులు

### సర్వేపల్లి రాధాకృష్ణన్ (1886–1975)

ఆంధ్రప్రదేశ్ లోని ప్రసిద్ధ పండితుల్లో మొట్ట మొదట పేర్కొన దగ్గ వాడు సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు ఈయన తనకు గలఅపారమైన పాండిత్యంతో విజ్ఞాన దీపికల్ని వెదజల్లే రచనలు చేసి భారతీయ సంస్కృతీ సందేశాన్ని ప్రపంచం నలుమూలలా పరివ్యాప్తం చేశాడు. రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న ఒకపేద తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు తిరుపతిలో ప్రాథమిక విద్య నభ్యసించాడు మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ పట్టా పుచ్చుకున్న తర్వాత రాధాకృష్ణన్ మద్రాసులోని ప్రెసిడెన్సీ కళాశాలలోను, మైసూరు విశ్వవిద్యాలయంలోను కొంతకాలం పాటు తత్త్వశాస్త్ర ఆచార్యుడుగ పనిచేశాడు ఆంధ్ర, బెనారస విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షుడుగను, ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయంలప్రాచ్యమతాలు మరియు నీతి శాస్త్రాల ఆచార్యుడుగ (Spalding Professor) విద్యాలోకానికి ఆయన అందించిన సేవలు జగద్విదితమే.

1927, 1938 లో వరుసగా నంద్యాలలోను, మద్రాసులోను జరిగిన ఆంధ్ర మహాసభలకు రాధాకృష్ణన్ అధ్యక్షత వహించడమే కాక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు తన శాయశక్తులాప్రయత్నించాడు.

1947 ఆగస్టులో మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నెహ్రూ పండితుడు రాధాకృష్ణన్ సేవల్ని వివిధ రకాలుగ వినియోగించుకున్నాడు. 1949–52 మధ్య కాలంలో సోవియట్ రష్యాలో భారత రాయబారిగా రాధాకృష్ణన్

పనిచేశాడు. ఈ కాలంలో భారత్-సోవియట్ రష్యాల మధ్య భావికాలంలో నెలకొనబోయే దృఢస్నేహానికి గట్టి పునాదులు వేశాడు జోసఫ్ స్టాలిన్ రాధాకృష్ణ పండుతునికి సభాగౌరవమిచ్చి సత్కరించడం చాల అరుదైన విషయంగా ఆరోజుల్లో విశేషంగా చెప్పుకునేవారు.

రెండు పర్యాయాలు భారతదేశ ఉపరాష్ట్రపతిగను (1952-57, 1957-62) ఒక పర్యాయం భారత రాష్ట్ర పతిగను (1962-67) పనిచేసి భారత దేశ అత్యున్నతమైన ఈ పదవులకు ఎనలేని గౌరవాన్ని చేకూర్చాడు ఈయన పదవీకాలం వేదాంతియైన రాజు రాజ్యపాలన చేయాలన్న ప్లాటో ఆదర్శం భారతదేశంలో నిజరూపాన్ని దాల్చినట్లు భాసించింది

భారత దేశంలోనే గాక విదేశాల్లో సైతం ఆయన అనేక గౌరవబిరుదుల్ని అందుకున్నాడు వీటిలో 'భారత రత్న' (1954) జర్మన్ పోర్‌లా మెరిటె (German Pour la Merite) 1955, అత్యున్నత వాటికన్ అవార్డు 'గోల్డన్ స్పర్' (Golden Spur) ముఖ్యమైనవి గోల్డన్ స్పర్ అవార్డును 1964 డిశంబరు 4న బొంబాయిని సందర్శించిన పోప్‌పాల్ VI రాధాకృష్ణన్‌కు అందించారు మత విషయాల్లో అభివృద్ధిని సాధించి నందుకిచ్చే టెంపుల్టన్ అవార్డును కూడ (Templeton Prize U S A ) రాధాకృష్ణన్ అందుకున్నాడు

రాధాకృష్ణన్ ఆంగ్లంలో అనేక గ్రంధాల్ని రచించాడు. వాటిలో 'The Hindu View of Life', 'An Idealist view of Life', Eastern Religions and Western Thought', 'Brahma Sutra', 'The Religion we Need' మొదలైనవి ముఖ్యమైనవి

86 సంవత్సరాల సుదీర్ఘమైన జీవితాన్ని గడిపిన రాధాకృష్ణ పండితుడు 1975 ఏప్రిలు 17న మరణించాడు

## వరహగిరి వేంకటగిరి (1894 – 1980)

వి. వి. గిరిగ ప్రజలందరికి పరిచితుడైన వరహగిరి వేంకటగిరి భారతదేశ రాష్ట్రపతి పదవి చేపట్టిన ఆంధ్రుల్లో రెండవాడు. వి వి గిరి రాష్ట్ర స్థాయిలోను, కేంద్ర స్థాయిలోను వివిధ పదవులను అలంకరించి సమర్ధవంతంగా నిర్వహించాడు

దేశంలోని కార్మికోద్యమంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకో గల్గాడు ఈయన కొన్ని ఉన్నతమైన పిలువలకు అంకితమై తన కార్యకలాపాలు నిర్వహించుకునే వాడేగాని పదవి, గౌరవాలకు ఆరాటపడేవాడు గాదు 1954లో 'బ్యాంకు అవార్డు' సమస్య ఉత్పన్నమైనప్పుడు జవహర్ లాల్ మంత్రి వర్గంనుండి నిష్క్రమించడానికి ఆయన వెనుకాడలేదు తన కార్మిక మంత్రి పదవికి రాజీనామా చేశాడు ఆయన ప్రవర్తనలోని మరో సుగుణం మొక్కవోని ధైర్య సాహసాలుకల్గి వుండడం తనకు 75 ఏళ్ళ వయస్సు మీద పడ్డప్పటికీ 1969లో రాష్ట్రపతి పదవికి జరిగిన తీవ్రమైన ఎన్నికల పోటీలో పాల్గొని తనతోటి ఆంధ్రుడైన నీలం సంజీవరెడ్డిని ఓడించి రాష్ట్రపతి పదవిని చేపట్టగల్గాడు

ఈనాటి ఒరిస్సా రాష్ట్రంలోని గంజాం జిల్లాకు చెందిన బరంపురంలో (బెర్హంపూర్) 1894 ఆగస్టు 10న వి వి గిరి జన్మించాడు గిరి తండ్రికి తగ్గ తనయుడుగ పేరుగాంచాడు వి వి గిరి తండ్రి జోగయ్య పంతులు గాంధీజీ పిలుపు నందుకుని తన పబ్లిక్ ప్రాసిక్యూటరు పదవికి రాజీనామా చేసి సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు దేశస్వాతంత్ర్యోద్యమంలో మరుకుగ పాల్గొంటూ 1927 లో ఆయన కేంద్ర శాసనసభకు ఎన్నికయ్యాడు.

గిరి బరంపురంలోని కళ్ళికోట కాలేజీలో ఇంటర్మీడియట్ వరకు చదివి ఉన్నత విద్యకోసం ఐర్లండు వెళ్లాడు ఐర్లండులో విద్యార్థిగ వున్నపుడు ఆదేశంలో సాగిన 'సిన్ ఫెన్' (Sin Fien) ఉద్యమంలో విపరీతమైన ఆసక్తిని కనబరిచాడు ఈ ఉద్యమం బ్రిటీషుపాలన నుండి ఐర్లండుకు విముక్తిని ప్రసాదించేందుకు ఉద్దేశించింది. అందువల్ల గిరిని ఐర్లండునుండి బహిష్కరించడం జరిగింది. అయినప్పటికీ గిరి డబ్లిన్ జాతీయ విశ్వవిద్యాలయం నుండి 'లా' పట్టాను పొందగల్గాడు.

స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత 1916లో వి వి గిరి బరంపురంలో న్యాయవాద వృత్తిని ప్రారంభించాడు తర్వాత కొంత కాలానికే అనిబిసెంటు ప్రారంభించిన 'హోంరూలు' ఉద్యమంలో పాల్గొన్నాడు. 1921లో తన తండ్రితో పాటు వి వి గిరి కూడ సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్నందుకు 1921-22లో కొంత కాలం పాటు వి వి. గిరి జైలు నిర్బంధానికి గురి కావాల్సివచ్చింది

జైలునుండి విడుదలైన తర్వాత గిరి దేశంలో కార్మికోద్యమాన్ని పటిష్టం చేయడంలో నిమగ్నమైనాడు. గాంధీజీ నాయకత్వంలో సాగిన దేశ స్వాతంత్ర్యోద్యమపారంభ దశలోనే కార్మికోద్యమ ప్రాధాన్యతను గుర్తించిన అతికొద్ది మంది రాజకీయ నాయకుల్లో వి వి. గిరి ఒకరని చెప్పవచ్చు దేశంలోని వివిధ ప్రాంతాలలో వున్న తనతోటి కాంగ్రెసు కార్య కర్తలతో కలిసి అఖిలభారత కార్మిక సంఘాన్ని (All India trade Union Congress) ఏర్పాటు చేయడంలో గిరి సఫలీకృతుడయ్యాడు దీనికి 1926లోను, 1942లోను గిరి అధ్యక్షుడుగ పనిచేశాడు గిరి అఖిల భారత రైల్వే కార్మికుల సంఘానికి జనరలు సెక్రటరీగా ఆరేళ్ళపాటు పని చేయడమే కాక మరో ఆరేళ్ళపాటు ఆయన ఈ సంఘానికి అధ్యక్షుడుగ కూడ తన బాధ్యతల్ని నిర్వహించాడు ఈయన బెంగాలు-నాగపూర్ రైల్వే కార్మికుల సమ్మెను విజయవంతంగా నడిపించాడు దీంతో ఆయన పేరు దేశమంతా వ్యాపించింది.

1927 లో జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సదస్సులో పాల్గొన్నాడు. లండనులో వున్నపుడు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ లండనులోని భారతదేశ సెక్రటరీకి (Secretary of State for India) తన తండ్రితో పాటు ఒక విన్నప పత్రాన్ని సమర్పించుటేగాక బరంపురం, పర్లకిమిడి, జయపూర్ మొదలగు ప్రాంతాల్ని కొత్తగా ఏర్పాటు చేయబోయే ఒరిస్సా రాష్ట్రంలో కలిపే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాడు.

1935 భారత ప్రభుత్వ చట్ట ప్రకారం 1936లో జరిగిన మద్రాసు రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెసు అభ్యర్థిగా గిరి బొబ్బిలి నుండి పోటీ చేశాడు. ఈయనకు ప్రత్యర్థిగా అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి, జస్టిసు పార్టీ నాయకుడైన బొబ్బిలి రాజా నిలబడ్డాడు ఈ ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ తరపున ప్రచారం చేసేందుకు పండిత నెహ్రూ వంటి నాయకుల్ని సైతం బొబ్బిలి పట్నంలోకి అడుగు పెట్టనీయలేదు. ఇంతటి బలంవున్న బొబ్బిలి రాజాను అనేక అవరోధాల్ని అధిగమించి విపరీతమైన మెజారిటీతో ఓడించగల్గాడు. రాజగోపాలాచారి నేతృత్వంలో కాంగ్రెసు పార్టీ మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసి నపుడు గిరి కార్మిక, పరిశ్రమల మంత్రిగ నియుక్తుడయ్యాడు.

'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్నందుకు 1942 ఆగస్టు నుండి 1946 వరకు వేలూరు, నాగపూరు మొదలయిన జైళ్ళలో గిరిని నిర్బంధించారు

మరల 1946లో జరిగిన మద్రాసు రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో గెలుపొందడంతో ప్రకాశం మంత్రివర్గంలో కార్మిక మంత్రిగ పనిచేశాడు. 1947 నుండి 1951 వరకు గిరి శ్రీలంకలో భారత హైకమీషనరుగ పనిచేశాడు

1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం నియోజకవర్గంనుండి గిరి లోక్‌సభకు ఎన్నికయ్యాడు తర్వాత 1952లోనే ఆయన కేంద్ర కార్మిక శాఖ మంత్రిగ నియమితుడయ్యాడు మనం ఇదివరకే చెప్పుకున్నట్టు గిరి కార్మిక మంత్రి పదవికి 1954లో రాజీనామా చేశాడు

1969లో భారతదేశ రాష్ట్రపతి పదవిని అలంకరించకముందు ఉత్తర ప్రదేశ్, కేరళ, కర్నాటక రాష్ట్రాల గవర్నరుగను, 1967-69 మధ్యకాలంలో భారతదేశ ఉపరాష్ట్రపతిగను గిరి తన పదవీ బాధ్యతల్ని నిర్వహించాడు

భారత దేశ రాష్ట్రపతిగ తన అయిదేళ్ళ పదవీకాలం ముగిసిన తర్వాత 1974 ఆగస్టు 23న గిరి పదవీ విరమణ గావించాడు 1975 జనవరి 26న జరిగిన భారత రిపబ్లిక్ రజతోత్సవాల సందర్భంగా దేశంలోని అత్యున్నత గౌరవ అవార్డు అయిన 'భారత రత్న బిరుదునుగిరికి ప్రధానం చేయడం జరిగింది ఆయన 1980 జూన్ 24న మద్రాసులో పరమపదించాడు

## నీలం సంజీవ రెడ్డి (1913 – )

వివిధ రంగాల్లో సుప్రసిద్ధులైన ముగ్గురు రాష్ట్రపతుల్ని దేశానికి అందించిన గౌరవం ఆంధ్రప్రదేశ్‌కు కల్గింది. భారతదేశ రాష్ట్రపతి పదవిని అలంకరించిన మొట్టమొదట ఆంధ్రుడు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఈయన అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన గొప్ప పండితుడు, తత్త్వ శాస్త్రవేత్త ఇక రాష్ట్రపతి పదవిని అలంకరించిన రెండవ వ్యక్తి వి వి గిరి ఈయన దేశంలో కార్మికోద్యమాన్ని పటిష్టంగా రూపొందించిన వారిలో ప్రముఖ స్థానాన్ని అలంకరించాడు. తర్వాత 1977 నుండి 1982 వరకు రాష్ట్రపతి పదవి నలంకరించిన నీలం సంజీవరెడ్డి కూడ ఆంధ్రుడే. ఈయన దేశంలో చాలవెనుక బడిన ప్రాంతమైన రాయలసీమలోని పేదరైతుల్లో ఒకడుగా పనిచేస్తూ తన రాజకీయ జీవితాన్ని ఆరంభించాడు

సంజీవరెడ్డి అనంతపురం జిల్లాలోని ఇల్లూరు గ్రామంలో 1913 మే 19న జన్మించాడు. అనంతపురం ప్రభుత్వ ఆర్ట్సు కళాశాలలో కొనసాగిస్తున్న తన విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పి 1931లోజాతీయోద్యమంలోకి ప్రవేశించాడు. యుక్తవయస్సులో సంజీవరెడ్డి పండితుడు, పత్రికా రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు అయిన తనగురువు పప్పూరి రామాచార్యులచే విశేషంగా ప్రభావితుడయ్యాడు

పట్టుదల, శ్రమించి పనిచేయడం సంజీవరెడ్డి వ్యక్తిత్వంలో కన్పించే రెండు ముఖ్యమైన లక్షణాలు ఇదేగాక ఆయన కాంగ్రెసు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తి కూడ 1949-53లో కాంగ్రెసు పార్టీలో సంక్షోభం తలెత్తినప్పుడు ప్రకాశం, రంగా వంటి ప్రముఖ నాయకులు కాంగ్రెసు పార్టీని విడిచి పెట్టారు. 1952లో జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో కాంగ్రెసును ఓడించేందుకు ప్రయత్నించారు అయితే అటువంటి క్లిష్టపరిస్థితిలో సైతం సంజీవరెడ్డి కాంగ్రెసు పార్టీని వదలి పెట్టలేదు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు ప్రకాశం కాంగ్రెసు పార్టీ సభ్యుడు కాక పోయినా ఆయన నేతృత్వంలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేందుకు పండిత నెహ్రూ వంటి నాయకుల్ని సంజీవరెడ్డి ఒప్పించగల్గాడు

ఆంధ్ర, తెలంగాణా నాయకుల మధ్య సయోధ్యకుదిర్చి 1956 నవంబరులో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడంలో సంజీవరెడ్డి ప్రముఖ పాత్రను నిర్వహించాడు విశాలాంధ్ర ముఖ్యమంత్రి పదవిని స్వీకరించిన సంజీవరెడ్డి 1959 డిశంబరులో ఆపదవిని వదలుకుని భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్షపదవిని చేపట్టేందుకు ఏ మాత్రం వెనుకంజ వేయలేదు. మరల 1962 ఏప్రిల్లో రాష్ట్ర రాజకీయాల్లోకి ప్రవేశించి రెండవ సారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టి ఆపదవిలోనే 1964 ఫిబ్రవరి వరకు కొనసాగాడు. 1964 మే నెల్లో పండిత నెహ్రూ మరణించడంతో సంజీవరెడ్డి రాష్ట్రరాజకీయాల నుండి విరమించి జాతీయ స్థాయిలో కాంగ్రెసు పార్టీ వ్యవహారాల్ని నిర్వహించడంలో ప్రముఖ పాత్ర వహించాడు. 1964 జూన్ లో లాల్ బహదూర్ శాస్త్రి నేతృత్వంలో ఏర్పడ్డ కేంద్ర మంత్రి వర్గంలో ఉక్కు మరియు గనుల శాఖా మంత్రిగ సంజీవరెడ్డి నియమితుడయ్యాడు.

1967-69 లో లోకసభ స్పీకరుగ సంజీవరెడ్డి సభా కార్యక్రమాల్ని

చక్కగా నిర్వహించాడు. 1969రాష్ట్రపతి పదవికి జరిగిన ఎన్నికల్లో వి వి గిరితో పోటీ చేసి ఓడిపోయాడు.

సంజీవరెడ్డి ఓటమిని గూడ చిరునవ్వుతో స్వీకరించి తన జన్మస్థలమైన ఇల్లూరు గ్రామం చేరుకున్నాడు తర్వాత 1977 మార్చిలో తన అభిమానుల ప్రోద్బలంతో క్రియాశీలక రాజకీయాల్లో ప్రవేశించి సంద్యాల నియోజకవర్గం నుండి లోక్‌సభకు పోటీచేశాడు ఈ చారిత్రాత్మక ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ నుండి కాంగ్రెసేతర పార్టీ తరపున పోటీ చేసి గెలిచిన ఏకైక వ్యక్తి సంజీవరెడ్డి కావడం విశేషం. దీంతో సంజీవరెడ్డి 1977 మార్చి 26న లోక్‌సభ స్పీకరుగ ఏకగ్రీవంగ ఎన్నుకోబడ్డాడు అయితే మరల ఏకగ్రీవంగా సంజీవరెడ్డిని దేశ రాష్ట్రపతిగ ఎన్నుకోవడంతో స్పీకరు పదవిలో చాలకాలంపాటు కొనసాగలేకపోయాడు 1977 జూలై 25న సంజీవరెడ్డి భారత దేశ రాష్ట్రపతి పదవిని చేపట్టాడు అయిదేళ్ల తనపదవీ కాలం ముగిసిన తర్వాత 1982 జూలైలో తన స్వంత జిల్లా అయిన అనంతపురానికి తిరిగి వచ్చాడు

## మోక్షగుండం విశ్వేశ్వరయ్య (1861 – 1961)

స్వరాష్ట్రంలోని ఆంధ్రులకంటె ఇతర రాష్ట్రాల్లో పుట్టి పెరిగిన లేక పని చేస్తున్న ఆంధ్రులు తమ శక్తి సామర్థ్యాల్ని చక్కగా నిరూపించు కుంటారనే నానుడి ఒకటి వ్యవహారంలో వుంది ఈ నానుడి భారతదేశపు ఇంజనీర్లలో సాటిలేని మేటిగ ప్రసిద్ధి చెందిన మోక్ష గుండం విశ్వేశ్వరయ్య విషయంలో నిజమేనని పిస్తుంది

విశ్వేశ్వరయ్య 1861 సెప్టెంబరు 15న కర్నాటక రాష్ట్రంలోని తెలుగు ప్రాంతమైన కోలారు జిల్లాలోని ముద్దెన హళ్ళి గ్రామంలో జన్మించాడు విశ్వేశ్వరయ్య తాత ముత్తాతలు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కర్నూలు జిల్లాలోని మోక్షగుండం గ్రామానికి చెందినవారు. వీరు 19వ శతాబ్ది ప్రారంభంలోనే కోలారు జిల్లాకు వలస వెళ్ళారు

విశ్వేశ్వరయ్య చాల చిన్నతనంలోనే తన తండ్రి శ్రీనివాసాచారిని కోల్పోయాడు అప్పటినుండి విశ్వేశ్వరయ్య తనమేనమామ రామయ్య సంరక్షణలో పెరిగాడు రామయ్య తన మేనల్లుని విద్యావిషయంలో శక్తి వంచన లేకుండా కృషి

చేశాడు బెంగుళూరులోని సెంట్రలు కళాశాలలో బి ఎ పరీక్షకు కూర్చుని ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో ప్రథముడుగా నిలిచాడు

దీంతో మైసూరు ప్రభుత్వం పూనాలో ఇంజనీరింగు విద్యను అభ్యసించేందుకు విశ్వేశ్వరయ్యకు ఉపకారవేతనాన్ని మంజూరు చేసింది విశ్వేశ్వరయ్య 1884 లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడై ఇంజనీరింగులో పట్టాపుచ్చుకోవడమే గాక ప్రతిష్ఠాకరమైన జేమ్స్ బర్కెలీ (James Berkaley) బహుమతిని కూడ గెల్చుకున్నాడు దీనివల్ల విశ్వేశ్వరయ్యకు బొంబాయి ప్రభుత్వ ప్రజాపనుల శాఖలో (Public Works Department) అసిస్టెంటు ఇంజనీరుగ చేరే అవకాశం కల్గింది తర్వాత 1908లో బొంబాయి ప్రభుత్వ సర్వీసు నుండి సూపరింటెండింగు ఇంజనీరుగ పదవీ విరమణ చేశాడు.

నీటిపారుగులో బ్లాకు పద్ధతిని (Block System) ప్రవేశపెట్టడంలో విశ్వేశ్వరయ్య తన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు భారత దేశ సర్వసైన్యాధిపతియైన లార్డు కిచనర్ (Lord Kitchener) బొంబాయి గవర్నయిన లార్డు సైడన్‌హాం (Lord Sydenham) వంటి ప్రముఖులు విశ్వేశ్వరయ్య పూనా వద్ద నిర్మించిన 'కడక్‌వస్ల' రిజర్వాయరును చూచి అతని ప్రతిభను గుర్తించారు విశ్వేశ్వరయ్య ఈ రిజర్వాయరును నిర్మించడంలో "Automatic Waste weir flood gates" అనే కొత్త పద్ధతినిపెట్టాడు ఈ పద్ధతిలో ఆనకట్టలో వరదనీరు ఎక్కువైనప్పుడు వరదనీటి కవాటాలు తమకు తామే తెరచుకుని వృధానీటిని బయటకు నెట్టుతాయి నీరు తగ్గిన వెంటనే వాటంతట అవే మూతబడుతాయి.

మూసీనది వరదల్ని అరికట్టేందుకు హైదరాబాదు ప్రభుత్వం విశ్వేశ్వరయ్య సేవల్ని వినియోగించుకుంది 1908లో సంభవించిన మూసీనదీ వరదలవల్ల హైదరాబాదు నగర ప్రజలకు విపరీతమైన ఆస్తినష్టం గూడ జరిగింది. హైదరాబాదు ప్రభుత్వం విశ్వేశ్వరయ్య సలహాల్ని పాటించి ప్రతిఏటా సంభవించే మూసీనది వరద తాకిడి నుండి హైదరాబాదు నగరాన్ని రక్షించుకోగల్గింది మరల 1922లో హైదరాబాదునగర మురికి నీటి కాల్వ పథకాన్ని సిద్ధం చేసేందుకు హైదరాబాదు ప్రభుత్వం విశ్వేశ్వరయ్య సహాయాన్ని పొందింది

ఆధునిక మైసూరును నిర్మించడంలో విశ్వేశ్వరయ్య ఎంతగానో కృషి

ఈ కాలంలో ఆయన భద్రావతి వద్ద 'మైసూరు ఇనుము మరియు ఉక్కు కార్మాగారాన్ని ప్రారంభించిమైసూరు పారిశ్రామికీకరణకు శ్రీకారం చుట్టాడు. దీనికంటె ముందుగనే మైసూరు ప్రభుత్వ ప్రజాపనుల శాఖలో చీఫ్ ఇంజనీరుగ పనిచేస్తూ కన్నంబాడి గ్రామం వద్ద కావేరినదికిఆనకట్ట నిర్మించాడు ఈ ఆనకట్టయే ఈనాడు 'కృష్ణ రాజసాగర్ డాం' గ అభివృద్ధి చెందింది. ఈ ఆనకట్టకు అనుబంధంగా అభివృద్ధి చేయబడ్డ "బృందావన్ ఉద్యానవనాలు" దేశం మొత్తం మీద ప్రసిద్ధి చెంది విశ్వేశ్వరయ్య సాంకేతిక నైపుణ్యానికి, కళాత్మక హృదయానికి ప్రతీకలుగ నిలిచి పోయాయి

ప్రణాళిక (Planning) యొక్క ప్రాధాన్యతను గుర్తించిన మొదటి వ్యక్తివిశ్వేశ్వరయ్య దేశ ప్రణాళిక, పారిశ్రామికీకరణపై విశ్వేశ్వరయ్య వెలిబుచ్చిన అభిప్రాయాలు పండిత జవహర్ లాల్ నెహ్రూ వంటి ప్రముఖ నాయకుని సైతం ఆకర్షించాయి. విశ్వేశ్వరయ్య శతజయంతి ఉత్సవ సందర్భంగా బెంగుళూరులో జరిగిన ఒక సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య భవిష్యత్తుని గూర్చి కలలుకనే వాడని, ఆలోచనా పరుడని, కార్యదీక్ష కలవాడని, ఆయన చేసిన పనులు దేశమంతా స్మృతి చిహ్నాలుగ మనకు దర్శన మిస్తున్నాయని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు.

విశ్వేశ్వరయ్య నిజమైన 'భారత రత్న'గ వెలుగొందాడు. అందువల్ల 1955లో భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్యకు 'భారత రత్న' బిరుదును ప్రధానం చేయడంలో ఏటువంటి ఆశ్చర్యమూలేదు.

## రఘుపతి వెంకటరత్నం నాయుడు (1862–1939)

కందుకూరి వీరేశలింగం (1848-1919) వంటి సంఘ సంస్కర్తల సేవలకు నోచుకోవడం ఆంధ్రదేశం అదృష్టంగా భావించాలి. 19వ శతాబ్ది మధ్యకల్లా తన నిర్విరామ కృషి వల్ల ఆంధ్రుల్లో విశాలభావాల్ని నెలకొల్ప గల్గాడు. 19వ శతాబ్ది ముగిసే సరికి ఆంధ్రదేశంలో మూఢాచారాలకు, సనాతన చాంధస భావాలకు తావులేకుండా పోయింది. కాలాను గుణమైన మార్పుల్నిగమనించి కొత్త భావాల్ని స్వీకరించేందుకు ఆంధ్రదేశం సమాయత్తమైంది. ఇదేకాక వందేమాతరం, స్వదేశీ ఉద్యమాలు సామాన్య ప్రజల్లో సైతం నవచైతన్యాన్ని కలిగించాయి. ఇటువంటి

సానుకూల పరిస్థితుల్ని వినియోగించుకుని ఆంధ్రదేశంలో సంస్కరణోద్యమాన్ని చేసేందుకు రఘుపతి వెంకటరత్నంనాయుడు ప్రయత్నించాడు అందువల్లే వెంకటరత్నం నాయుడిని కందుకూరి తర్వాత గొప్ప సాంఘిక సంస్కర్తగా ఆంధ్ర ప్రజలు గుర్తించారు

రఘుపతి వెంకటరత్నం నాయుడు 1862లో మచిలీపట్నంలో జన్మించాడు తన తండ్రి అప్పయ్యనాయుడు సైనికదళంలో పనిచేస్తుండడం వల్ల యువకుడైన రఘుపతి వేంకటరత్నం తండ్రితోపాటు దేశమంతా తిరగాల్సి వచ్చింది దీనివల్ల ఆయనకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులవద్ద విద్యను అభ్యసించే అవకాశం కల్గింది

రఘుపతి వెంకటరత్నం హైదరాబాదులో మెట్రిక్యులేషను పరీక్షపాసయ్యాడు ఇక్కడే ఆయన సరోజినీ నాయుడి తండ్రియైన అఘోరనాద చటోపాధ్యాయ వంటి విద్యావేత్తదగ్గర చదువుకునే అవకాశం కల్గింది 1885లో రఘుపతి మద్రాసు క్రైస్తవ కళాశాలలో బి ఎ డిగ్రీ తరగతిలో చేరాడు ఇక్కడ కళాశాల ప్రిన్సిపాలు డాక్టరు విలియం మిల్లరు (Dr William Miller) ప్రభావానికి లోనయ్యాడు డాక్టరు మిల్లరు దక్షిణ బారత దేశంలో గొప్ప విద్యా వేత్తగ ప్రసిద్ది చెందాడు. ఈయన తన విద్యార్థులపేర్లేగాక వారి బయోడేటా (Bio-data) మొత్తాన్ని గుర్తుంచుకునే వాడని ఆరోజుల్లో మిల్లరును గురించి గొప్పగా చెప్పుకునేవారు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో చదివిన విద్యార్థుల్ని 'పెద్ద మనుషులు'గ ఆనాడు చెప్పుకునేవారు

వెంకటరత్నం నాయుడు మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఎం ఎ, ఎల్.టి పట్టాల్ని పుచ్చుకుని అధ్యాపక వృత్తిలో ప్రవేశించాడు 1889 నుండి 1904 వరకు సికింద్రాబాదులోని మహబూబ్ కళాశాల ప్రిన్సిపాలుగ ఆయన పని చేశాడు. తర్వాత 1905 నుండి 1919 వరకు కాకినాడలోని పిఠాపురం రాజా కళాశాలలో ప్రిన్సిపాలుగ పనిచేశాడు.

పిఠాపురం రాజా ఉదారస్వభావంగల గొప్ప ధార్మికుడు ఈయన విద్యా సాహిత్యాల్ని, లలిత కళల్ని ఆదరించి పోషించాడు బాలికల్నో కళాశాల విద్యను ప్రోత్సహించేందుకు వారినుండి ట్యూషను ఫీజు వసూలు చేయకుండా తన

కళాశాలలో ప్రవేశాన్ని కల్పించేవాడు ఇదేగాక బాలికలకు వసతి గృహాల్లో ఉచిత భోజన, వసతి సౌకర్యాల్ని కల్పించేవాడు పిఠాపురం రాజులోనిఉదార గుణాన్ని రఘుపతి వెంకటరత్నం మరింతగా ప్రోత్సహించాడు

వెంకటరత్నం 27 ఏళ్ల వయస్సులోనే తన భార్యను కోల్పోయాడు దీంతో ఆయన బ్రహ్మచారిగ వుండడానికి నిర్ణయించుకుని తన శేషజీవితాన్ని హరిజనుల, దేవదాసీల ఉద్ధరణకు అంకితం చేశాడు ఆంధ్రదేశంలో ఆనాడు 'భోగం' కులం వుండేది ఆ కులంలోని స్త్రీలనే దేవదాసీలనేవారు వారి వృత్తి దేవునిగుడిలోను, వివాహాల్లోను నాట్యంచేయడం అయితే కాలక్రమంలో వీరిని పడుపు వృత్తిలోకి దింపారు రఘుపతి వెంకటరత్నం నాయుడు ఆ దేవదాసీల ఉద్ధరణను చేపట్టి వీరేశలింగం స్త్రీజనోద్ధరణ కార్యక్రమాన్ని కొనసాగించాడు వివాహాల్లో దేవదాసీలు నాట్యం చేయడాన్ని మాన్పించేందుకు వీరేశలింగం యత్నించాడు అయితే తర్వాత వేంకటరత్నం ప్రయత్నాలవల్ల ఆదేవదాసీ పద్ధతి ఆంధ్ర దేశం నుండి పూర్తిగ కనుమరుగైంది ఆనాడు ఆ కులాన్ని 'భోగం' అని వ్యవహరించడం లేదు వీరినే ఆనాడు 'కళాలు' అని వ్యవహరిస్తారు ఈకులంలోని స్త్రీలు ఈనాడు వివిధ వృత్తుల్లో ప్రవేశించి న్యాయవాదులుగను, అధ్యాపకులుగను, డాక్టర్లుగను తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నారు.

రఘుపతి వెంకటరత్నం తన విద్యార్థులకు ప్రీతి పాత్రుడై వారిలో దయ, ప్రేమ వంటి ఉత్తమ గుణాల్ని పాదుకొల్పాడు ఆయన బ్రహ్మసమాజ సిద్ధాంతాల్లో గట్టి నమ్మిక మున్నవాడు ఆయన కాకినాడలోని పిఠాపురం రాజా కాలేజీలో ఉన్నప్పుడు ఆంధ్ర దేశంలోని బ్రహ్మఉద్యమానికి కాకినాడ బలమైన కేంద్రంగా రూపొందింది

1924లో రఘుపతి వేంకటరత్నం నాయుడు మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగ నియమితులయ్యారు ఆయన తన పదవీకాలంలో భారతీయ భాషల అభివృద్ధికి విశేషమైన ప్రాధాన్యత నిచ్చాడు విద్యారంగంలోను సంఘ సంస్కరణ రంగంలోను చేసిన విశేషమైన కృషికి వెంకటరత్నానికి 'నైట్' (Knight) అనే గౌరవ బిరుదును ప్రభుత్వం ప్రసాదించింది. 1939లో వేంకటరత్నం మరణించడంతో ఆంధ్ర దేశంలోని సంఘసంస్కరణోద్యమానికి తీవ్రవిఘాతం కల్గింది

## డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య (1880-1959)

'డా పట్టాభి'గ ప్రజలందరికీ సుపరిచితుడైన డాక్టరు భోగరాజ పట్టాభి సీతారామయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి వృత్తిరీత్యా ఆయన డాక్టరు అయినా స్వభావరీత్యా ఆయన ఒక గొప్ప వ్యాపార వేత్త ఆయన ఆంధ్రా జీవిత కంపెనీ, భాగ్య లక్ష్మి బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు వంటి ప్రముఖ వ్యాపార సంస్థల్ని నెలకొల్పాడు ఒక వైపు వ్యాపార కార్యకలాపాల్లో నిమగ్నమై వున్నా 1919లో ఆయన 'జన్మభూమి' అనే ఆంగ్ల వారపత్రికను తన సంపాదకత్వంలో ప్రారంభించాడు 1921లో పట్టాభి భారత జాతీయోద్యమంలో చేరి గాంధీజీకి నమ్మిన బంటుగ మారిపోయాడు.

పట్టాభి సీతారామయ్య పశ్చిమగోదావరి జిల్లాలోని గుండుగొలను గ్రామంలో 1880 నవంబరు 24న జన్మించాడు. పట్టాభి తండ్రి వెంకట సుబ్రమణ్యం ఆగ్రామ కరణంగా వుండేవాడు పట్టాభి వైద్యరంగంలో ఎం బి సి ఎచ్ (M B C H) పట్టా పుచ్చుకుని కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో తన ప్రాక్టీసును ప్రారంభించాడు అనతి కాలంలోనే ఆయన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమనాయకుల్లో ఒకడయ్యాడు 1912-13 మధ్యకాలంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుపై గొప్ప వివాదం చెలరేగినపుడు పట్టాభి 'ది హిందూ' (The Hindu) ఆంగ్ల దిన పత్రికకు అనేక వ్యాసాలు రాసి భాషా రాష్ట్రాల ఏర్పాటు ఆవశ్యకత గురించి చక్కగా వివరించాడు

1916లో జరిగిన లక్నో కాంగ్రెసు మహసభలో ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకంగా ఒక కాంగ్రెసు విభాగాన్ని ఏర్పాటు చేయాలని పట్టాభికోరాడు అయితే పట్టాభి కోర్కెను మహాత్మాగాంధీ వంటి జాతియ నాయకుడు వ్యతిరేకించినా తిలక్ మహాశయుడు పట్టాభికి మద్దతు తెలిపాడు అందువల్ల కాంగ్రెసు అదిష్టానవర్గం సైతం ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెసు కమిటిని ఏర్పాటు చేసేందుకు ఒప్పుకుంది దీంతో 1918లో ఆంధ్ర కాంగ్రెసు కమిటి ఆవిర్భవించింది

1920 నుండి 1947వరకు పట్టాభి జాతీయోద్యమంలో పూర్తిగ నిమగ్నుడయ్యాడు ఆయన దాదాపు 8 సంవత్సరాల జైలు జీవితాన్ని గడిపాడు చాలసంవత్సరాలు కాంగ్రెసు వర్కింగు కమిటి సభ్యుడుగ పనిచేశాడు 1937-40 మధ్య కాలంలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడుగ పదవీ బాధ్యతల్ని నిర్వహించాడు.

కాంగ్రెసు సిద్ధాంతాలకు ఎల్లప్పుడూ కట్టుబడి వుండే పట్టాభి వ్యక్తిత్వానికి ముగ్ధుడైన గాంధీజీ 1939 లో జరగబోయే కాంగ్రెసు మహాసభ అధ్యక్షపదవికి జరిగిన పోటీలో పట్టాభికి బాహటంగా తన మద్దతు తెలిపాడు ఈ చారిత్రాత్మక ఎన్నికల్లో సుభాష్ చంద్రబోస్ గెలుపొందడం, పట్టాభి ఓడిపోవడం జరిగింది దీంతో గాంధీజీ పట్టాభి పరాజయాన్ని తన పరాజయంగా ప్రకటించుకున్నాడు సుభాష్ చంద్రబోస్ కాంగ్రెసు అధ్యక్షుడయినప్పటికీ గాంధీజీ ఆశీస్సులు లేకపోవడంతో వర్కింగు కమిటిని ఏర్పాటు చేయలేక పోయాడు అందువల్ల సుభాష్ కాంగ్రెసు పార్టీని వదలి పెట్టి 'ఫార్వార్డ్ బ్లాక్' (Forward Block) అనే పేరుతో ఒక స్వంత పార్టీని ఏర్పాటు చేసుకున్నాడు

తర్వాత కాంగ్రెసు అధ్యక్షపదవిని అలంకరించేందుకు పట్టాభి 1948 వరకు వేచి వుండాల్సి వచ్చింది. 1948 లో జైపూరులో జరిగిన భారత జాతీయ కాంగ్రెసు మహాసభకు పట్టాభి అధ్యక్షుడుగ వ్యవహరించాడు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతకూడ పట్టాభి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు కృషి చేశాడు. ఆయన జె వి పి (J V P) కమిటీలో సభ్యుడుగ పనిచేశాడు ఈ కమిటీ మద్రాసు నగరాన్ని మినహాయించి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును సిఫార్సు చేసింది

1956 నవంబరులో ఆంధ్ర ప్రదేశ్ అవతరించడంతో పట్టాభి కలలుకన్న విశాలాంధ్రను చూసే అదృష్టం ఆయనకు దక్కింది 1952 జూలై నుండి 1956 జూన్ వరకు పట్టాభి మధ్య ప్రదేశ్ గవర్నరుగ పనిచేశాడు ఆయన 1959 డిశంబరు 17న హైదరాబాదులో మరణించాడు

పట్టాభి బహుగ్రంధకర్త 'History of Indian National Congress', (Two Volumes), 'Gandhiji and Gandhism', 'Feathers and stones', అనే ఆంగ్ల గ్రంధాలు ఆయన రచనల్లో ముఖ్యమైనవి

## పొట్టి శ్రీరాములు (1980–1952)

స్వభావ రీత్యా ఆంధ్రులు అవేశపరులు అందువల్ల వారు తమ కిష్టమైన వాటిని సాధించుకోవడంలో ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడుతారు స్వాతంత్ర సమయంలో అల్లూరి సీతారామరాజు, నామ మాత్రపు చదువుకు కూడ నోచుకోని పల్నాటి రైతు బిడ్డ, కన్నె గంటి హనుమంతు వంటివారు అనేక మంది తమ

జీవితాల్ని త్యాగం చేసి అమర వీరులయ్యారు. దేశ స్వాతంత్ర్య దీక్షే కాకుండా ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోర్కెకూడ ఆంధ్రుల్ని స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొనేటట్టు చేసింది.

1913లోనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమం ప్రారంభమైనా దేశ స్వాతంత్ర్యమే ప్రధానమని భావించిన ఆంధ్రులు 1920 నుండి తమ ఉద్యమాన్ని ప్రక్కకు నెట్టి జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొందరలోనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు చేస్తారని ఆంధ్రులు ఆశించారు. అదీగాక 1946లో కాంగ్రెసు పార్టీ విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికలోనే భాషా రాష్ట్రాల ఏర్పాటుకు హామీ ఇవ్వడం జరిగింది. కాంగ్రెసు పార్టీ వాగ్దానం, జె వి.పి. నివేదిక సిఫార్సుల వల్ల ప్రయోజనం చేకూరక పోగా 1952 నాటికి కూడ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఏటువంటి సానుకూల వాతావరణం లేకపోయింది. అప్పటికే మనదేశానికి స్వాంతంత్ర్యం వచ్చి అయిదేళ్ళు గడిచిపోయింది. దీంతో ఆంధ్రులు తాము మోసపోయామని భావించారు ఇటువంటి ఉద్రేక పూరితవాతావరణంలో 1952 అక్టోబరు 19న పొట్టి శ్రీరాములు గాంధేయ పద్ధతిలో తన నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించాడు. పొట్టి శ్రీరాములు ప్రజలందరికి సుపరిచితుడు కాకపోయినా కాంగ్రెసు పార్టీకి అంకిత భావంతో సేవచేసిన కార్యకర్త తన మరణంతోనైనా ఆంధ్రులకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం వస్తుందన్న ఆశతో 1952 డిశంబరు 15న నిరాహారదీక్షను కొనసాగిస్తూ తన తుది శ్వాసను వదిలాడు, అమరజీవి పొట్టి శ్రీరాములు. పొట్టి శ్రీరాములు మరణం తర్వాత 1953 అక్టోబరులో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటయింది.

శ్రీరాములు 1890లో మద్రాసులో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు నెల్లూరు జిల్లా నుండి వలస పోయి మద్రాసులో స్థిరపడ్డారు శ్రీరాములు తన పారంభ విద్యాభ్యాసాన్ని మద్రాసులో పూర్తి చేసుకుని ఇంజనీరింగులో ఉన్నత విద్యను అభ్యసించేందుకు బొంబాయి వెళ్ళాడు. అక్కడ ఇంజనీరింగు విద్యను పూర్తి చేసుకుని బొంబాయిలోని రైల్వేశాఖలో (Great Indian Peninsular Railway) ఇంజనీరుగ చేరాడు.

తాను 25 సంవత్సరాల వయస్సులో వున్నప్పుడు తనభార్య చనిపోవడంతో పొట్టి శ్రీరాములు జీవితం ఒక కొత్త మలుపు తిరిగింది భార్య పోవడంతో ఆయన ఒంటరి తనంతో విచార గ్రస్థుడయ్యాడు తర్వాత తన శేష జీవితాన్ని దేశసేవకు అంకితం చేయాలని నిర్ణయించాడు దీంతో శ్రీరాములు తన ఉద్యోగానికి రాజీనామా చేసి శబర్మతి ఆశ్రమంలో చేరాడు ప్రశాంతమైన మనస్సుతో కష్టపడి పనిచేసే స్వభావంగల పొట్టి శ్రీరాములంటే గాంధీజీ ఎంతో మక్కువ చూపేవాడు శ్రీరాములు కొంతకాలం పాటు రాజకోట ఆశ్రమంలో కూడ నిర్మాణాత్మక కార్యక్రమాల్లో పాల్గొన్నాడు

1946లో శ్రీరాములు నెల్లూరు జిల్లాకు తిరిగి వచ్చి హరిజనాభివృద్ధికి, ఖద్దరు ప్రచారానికి, గ్రామీణ పరిశ్రమల స్థాపనకు విశేషంగా కృషి చేశారు గాంధీజీ మరణం తర్వాత గాంధేయ సిద్ధాంతాన్ని ముమ్మరంగా ప్రచారం చేశాడు 1946–48 మధ్యకాలంలో హరిజనుల దేవాలయ ప్రవేశానికి మూడు సార్లు నిరాహార దీక్షను చేపట్టారు. 1946లో ఆంధ్ర దేశానికి తిరిగి వచ్చిన తర్వాత ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై ఆంధ్రుల అభిప్రాయాన్ని గ్రహించగల్గాడు ఈయన 1952లో ప్రారంభించిన చారిత్రాత్మకమైన నిరాహార దీక్ష వల్లే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటయింది. ఆంధ్రుల ఆశయసాధన కోసం తన ప్రాణాల్ని బలిపెట్టి శ్రీరాములు 'అమరజీవి' అయ్యాడు.

## దుర్గా బాయి దేశ్ ముఖ్ (1910–1980)

ఆంధ్రదేశపు మహిళలు భారత జాతీయోద్యమంలో ప్రముఖ పాత్రను వహించారు. దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాలన్నింటిలోను అనేక మంది మహిళా సత్యాగ్రహుల్ని అందించే అదృష్టం ఆంధ్రదేశానికే దక్కింది స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ఈ మహిళలు ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని జైలు జీవితానికి సైతం చిరునవ్వుతో స్వాగతం పల్కారు. 1922లో జరిగిన సహాయనిరాకరణోద్యమంలో కాకినాడలో ఒక పన్నెండేళ్ళ బాలిక సత్యాగ్రహంలో పాల్గొంది ఈ బాలిక పేరే దుర్గాబాయి. ఈ బాలికే తర్వాత కాలంలో తన శక్తి సామర్థ్యాల్ని నిరూపించుకుని 'ఆంధ్రమహిళా సభ' స్థాపనకు మూలకారకురాలయింది. దక్షిణ దేశంలో మహిళా సంక్షేమం కోసం ఏర్పడ్డ మొట్ట మొదటి సంస్థ ఆంధ్ర మహిళా సభ కావడం విశేషం.

1954లో సి. డి దేశ్‌ముఖ్‌ను పెళ్ళాడటంతో దుర్గాబాయి దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రజలకు దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గా పరిచయమయింది దుర్గాబాయి 1910 జూలై 15న రాజమండ్రిలో జన్మించింది ఇదివరకే చెప్పినట్టు ఈమె తన పన్నెండేళ్ళ వయస్సులోనే సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనింది. సహాయనిరాకరణ ఉద్యమాన్ని విరమించిన తర్వాత దుర్గాబాయి మహిళలకు నూలు వడకడంలోను, నేతపనిలోనుశిక్షణ నిచ్చే పాఠశాలల్ని స్థాపించి రాజమండ్రి, కాకినాడ చుట్టు ప్రక్కల గల గ్రామాల్లో గాంధీజీ సిద్ధాంతాల్ని విశేషంగా ప్రచారం చేసింది

1930 మే నెల్లో మద్రాసు నగరంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో టంగుటూరి ప్రకాశం పంతులుతో పాటు దుర్గాబాయి కూడ పాల్గొంది. 1930లోను, 1932 లోను దుర్గాబాయి అరెస్టు చేయబడింది. ఈమె జాతీయోద్యమంలో తల మునకలై వున్నప్పటికి వీలు దొరికినప్పుడల్లా చదువు కుంటూ ఎం.ఎ., బి ఎల్ పట్టాల్ని పొందగల్గింది 1935 నుండి తాను మరణించే వరకు మహిళా సంక్షేమానికి, శిశుసంక్షేమానికి దుర్గాబాయి తన జీవితాన్ని అంకితం చేసింది

బెనారసు హిందూ విశ్వవిద్యాలయం నిర్వహించే మెట్రిక్యులేషను పరీక్ష రాయదలచిన మద్రాసు నగరంలోని తెలుగు బాలికలకు శిక్షణ ఇచ్చే ప్రధానోద్దేశంతోనే 1936లో ఆంధ్రమహిళా సభను దుర్గాబాయి స్థాపించింది ఈ విధంగా ప్రారంభమైన ఆంధ్రమహిళా సభ పదేళ్ళ కాలంలోనే మద్రాసు నగరంలోని గొప్ప విద్యా, సాంఘిక సంక్షేమ సంస్థగా రూపుదిద్దు కుంది ఈ సంస్థకు సంపన్నులనుండే గాక పేదలనుండి కూడ విరాళాల్ని సేకరించే సామర్థ్యం దుర్గాబాయి కుండేది ఆంధ్రమహిళా సభ నర్సింగు, జర్నలిజం, మొదలగు అనేక విషయాల్లో స్త్రీలకు శిక్షణ ఇచ్చేది దుర్గాబాయి తన సంపాదకత్వంలో 'ఆంధ్ర మహిళ' అనే తెలుగు మాసపత్రికను స్థాపించి నిర్వహించింది. ఆంధ్ర మహిళా సభ కార్యకలాపాలు పండిత నెహ్రూ వంటి నాయకుడ్ని సైతం ఆకర్షించాయి అందువల్లే నెహ్రూ దుర్గాబాయి సేవల్ని దేశ ప్రయోజనాలకోసం వినియోగించ దలచుకున్నారు

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సేవల్ని జాతీయ స్థాయిలో పూర్తిగ వినియోగించు కోవడం జరిగింది ఈమె 'కేంద్ర సాంఘిక సంక్షేమ మండలి' (Central Social

Welfare Board) జాతీయ స్త్రీ విద్యా మండలి' (National council for Women's Education), జాతీయ బాలికల మరియు స్త్రీ విద్యా సంఘం (National Committee on Girls and Women's Education) వంటి అనేక కేంద్ర సంస్థలకు అధ్యక్షురాలిగ వ్యవహరించింది. ఇదేగాక ఆమె పార్లమెంటు సభ్యురాలుగను, ప్రణాళికా సంఘ సభ్యురాలుగ కూడ పని చేసింది. ఢిల్లీలోని ఆంధ్రా విద్యా సంఘతో (Andhra Educational Society) తో సన్నిహిత సంబంధాలుండేవి.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అవతరించిన తర్వాత ఆంధ్ర మహిళా సభ తన కార్యకలాపాల్ని హైదరాబాదు నగరానికి కూడ విస్తరింపజేసింది. నగరంలో ఒక కళాశాలతో పాటు అనేక విద్యా కేంద్రాల్ని కూడ నడపడమేగాక స్త్రీలకు, పిల్లలకు చాల సంక్షేమ సంస్థల్ని ఆంధ్రమహాసభ ప్రారంభించింది. భారత దేశంలో విద్యా వ్యాప్తికి అందించిన విశేష సేవలకుగాను 1971లో దుర్గాబాయి దేశ్ ముఖ్‌కు నాల్గవ 'నెహ్రూసాహితీ అవార్డు' (Nehru Literacy Award) లభించింది. 1975లో ఈమెకు 'పద్మవిభూషణ్' బహుమతిని ప్రధానం చేయడం జరిగింది. దుర్గాబాయి దేశ్‌ముఖ్ మరణంతో భారత దేశం ప్రతిభావంతురాలైన ఒక మహిళను కోల్పోయింది.

## ఎన్. జి. రంగా (1900 –

మనదేశానికి స్వాతంత్ర్యం రాకముందు (1947కు ముందు) ఆంధ్రదేశంలోని కోస్తా జిల్లాల్లో చాల జమిందారీలు వుండేవి. ఈ జమిందారీల్లో రైతుల పరిస్థితి బానిసలకంటె హీనంగా వుండేది. మహాత్ముని నాయకత్వంలో నడిచిన సహాయ నిరాకరణోద్యమం ఆంధ్ర దేశంలోని మారుమూల గ్రామాల్లోని రైతుల్ని సైతం చైతన్యవంతుల్ని చేసింది. ఈ నవచైతన్యాన్ని ఒక పటిష్టమైన రైతు ఉద్యమంగా రూపొందించిన ఖ్యాతి ఎన్. జి. రంగాగా సుపరిచితుడైన గోగినేని రంగానాయకులకు దక్కింది

రంగా 1900 నవంబరు 7న గుంటూరు జిల్లాకు చెందిన నిడుబ్రోలు గ్రామంలో జన్మించాడు. ఈయన కోస్తా జిల్లాల్లో సంపన్నవర్గమైన కమ్మ కులానికి చెందిన రైతు కుటుంబానికి చెందిన వాడు. ఆంధ్ర దేశంలో సాగిన సహాయ నిరాకరణోద్యమానికి గుంటూరు జిల్లా ఆయువు పట్టుగా నిలిచింది. ఈ కాలంలో

గుంటూరు జిల్లాలో చీరాలపేరాల ఉద్యమం, పల్నాడు అడవి సత్యాగ్రహం, పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం రంగా ఆలోచనా తీరుపై చెరగని ముద్ర వేశాయి దీంతో ఆయన రైతు సమస్యల పైన, కౌలు చట్టాలపైన తన దృష్టిని కేంద్రీకరించి ప్రత్యేక అధ్యయనం చేశాడు

రంగా ఉన్నత విద్య కోసం, ఇంగ్లాండు వెళ్ళి 1926లో ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయంనుండి బి లిట్ పట్టాపొందాడు. 1927 నుండి 1930 వరకు మూడేళ్ళ పాటు ఆయన మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక, రాజకీయ శాస్త్రాల ఆచార్యుడుగ పనిచేశాడు 1930లో మహాత్మాగాంధీ శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించినపుడు రంగా తన ఉద్యోగానికి రాజీనామా చేసి జాతీయోద్యమంలో పాల్గొన్నాడు కృష్ణా, గోదావరి జిల్లాల్లో ఆయన పన్నుల నిరాకరణోద్యమాన్ని నడిపించాడు

జమీందారీ రైతుల సమస్యల్ని గూర్చి ప్రత్యేక అధ్యయనం చేసిన రంగా జమీందార్ల అత్యాచారాల్ని అరికట్టాలంటే రైతుల్ని సంఘటిత శక్తిగ రూపొందించడం ఒక్కటే మార్గమని భావించాడు. 1933-36 మధ్య కాలంలో నెల్లూరు జిల్లాలో అతిపెద్ద జమీందారీ అయిన వెంకటగిరిలో రంగా రైతు ఉద్యమాన్ని నిర్వహించాడు ఈ కాలంలో రంగా వామపక్షాలపై సానుభూతిని చూపేవాడు అయితే ఆయన కాంగ్రెసు పార్టీని వదలలేదు 1934లో ఆయన నిడుబ్రోలులో భారతీయ రైతు శిక్షణా కేంద్రాన్ని (Indian Peasants Institute) స్థాపించి రాజకీయ తరగతుల్ని నిరహించాడు. గౌతులచ్చన్న, పుల్లెల శ్యామ సుందర రావు, పి. తిమ్మారెడ్డి వంటి చాలమంది యువ స్వాతంత్ర్య యోధులు రంగాచే ప్రభావితులై ఆయనకు నమ్మిన బంటులుగా మారిపోయారు.

రైతుల్ని సంఘటిత పరచడంలో రంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలు దేశంలోని జాతీయనాయకుల దృష్టిని సైతం ఆకర్షించింది 1936లో ఫయాజ్‌పూర్‌లో జరిగిన అఖిలభారత రైతు కాంగ్రెసుకు అధ్యక్షుడుగ వ్యవహరించడమే గాక 1938 నుండి ఈ సంస్థ ప్రధాన కార్యదర్శిగ కూడ పనిచేవాడు 1938-40 మధ్య కాలంలో శ్రీకాకుళం జిల్లాలోని మాందస జమీందారీ రైతుల్ని సంఘటిత పరచి జమీందారుకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాన్ని నిర్వహించాడు ఈ

ఉద్యమంలో గౌతులచ్చన్న, పుల్లెల శ్యామసుందరరావు ప్రముఖ పాత్రను నిర్వహించారు 'క్విట్ ఇండియా' ఉద్యమ కాలంలో రంగాను వేలూరు మొదలగు జైళ్లలో నిర్బంధించారు

1948లో రంగా ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటి అధ్యక్షుడయ్యాడు ఆయన ప్రకాశం పంతులుతో కలిసి పని చేసేవాడు అయితే కాంగ్రెసులోని అంతర్గత కలహాలవల్ల విసుగు చెందిన రంగా కొన్నాళ్ళకు పార్టీకి రాజీనామా చేసి 1951లో కృషికార్ లోక్ పార్టీని స్థాపించాడు దీనకంటె ముందే అఖిలభారత నేత కార్మికుల సంఘాన్ని (All India Weaver's Congress) స్థాపించి నేతపని వారిని సంఘటిత పరిచాడు

రంగా పార్లమెంటులో సమర్థుడైన ప్రజాప్రతినిధిగ తన బాధ్యతల్ని నిర్వహించాడు పార్లమెంటులో 50 సంవత్సరాలు గడిపిన ఏకైక వ్యక్తి రంగా 1930లో కేంద్ర శాసనసభ సభ్యుడుగ కావడంతో రంగా తన పార్లమెంటు జీవితాన్ని ప్రారంభించాడు. ఇప్పుడు ఆయన, లోక్‌సభ సభ్యుడుగ కొనసాగుతున్నాడు

దాదాపు 50 సంవత్సరాల సుదీర్ఘమైన తన రాజకీయ జీవితంలో నెహ్రూ, రాజాజీవంటి ప్రముఖ నాయకులలో కలిసి రంగా పనిచేశాడు. చాల విషయాల్లో రంగా నెహ్రూతో విబేదించేవాడు అందువల్లనే రంగా రాజాజీతో చేతులు కలిపి స్వతంత్ర పార్టీ ఏర్పాటుకు దోహదం చేశాడు. అయితే స్వతంత్ర పార్టీలో చాలకాలం ఆయన మనలేక పోయాడు మరల 1971లో ఇందిరాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెసు పార్టీలో చేరాడు.

రంగా విదేశాల్లో విస్తృతంగా పర్యటించడమేగాక వివిధ అంతర్జాతీయ సదస్సుల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాడు. రంగా అనేక గ్రంధాల్ని రచించాడు వాటిలో Credo of world Peasantry, Fight for Freedom, Revolutionary Peasant వంటి గ్రంధాలు ముఖ్యమైనవి. రంగా చేపట్టిన అన్ని కార్యక్రమాల్లోను ఆయన సతీమణి భారతీ దేవి సమర్థవంతమైన సహాయ సహకారాల్ని అందించేది. ఈమె కూడ ప్రముఖంగా పేర్కొన దగ్గ స్వాతంత్ర యోధురాలు. భారతదేవి 1972 సెప్టెంబరు 27న మరణించింది.

## బూర్గుల రామకృష్ణారావు (1899 - 1967)

ఆంధ్ర ప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతం అన్ని రంగాల్లోను ప్రముఖ వ్యక్తుల్ని మనకు అందించింది రావినారాయణ రెడ్డి, ఎం చెన్నారెడ్డి, పి వి నరసింహారావు లాంటి నాయకులు రాజకీయ రంగంలో ప్రముఖమైన పాత్ర వహించారు ఈనాటి తెలుగు సాహిత్య రంగంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన సి. నారాయణ రెడ్డి, దాశరధి కృష్ణమాచారులు కూడ తెలంగాణా ప్రాంతం వారే. హైదరాబాదు రాష్ట్రంలో మొదటి సారిగ ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వానికి ముఖ్య మంత్రిగ వ్యవహరించిన బూర్గుల రామకృష్ణారావు రాజకీయ నాయకుడేకాక కవి, బహుభాషా కోవిదుడు రామకృష్ణారావు పుట్టి వాడైనా ఆయన సాధించిన ఘన కార్యాలు చాలా వున్నాయి.

రామకృష్ణారావు 1899 మార్చి 13న మహబూబు నగరు జిల్లాలోని బూర్గుల అనే గ్రామంలో జన్మించాడు. ఆయన తన గ్రామ నామాన్నే ఇంటి పేరుగ స్వీకరించాడు. హైదరాబాదులో తన ప్రారంభ విద్యాభ్యాసాన్ని ముగించుకున్న రామకృష్ణారావు పై చదువులకోసం పూనా, బొంబాయి నగరాలకు వెళ్ళాడు. బి.ఎ., ఎల్.ఎల్.బి పట్టాలు పొందిన తర్వాత హైదరాబాదులో న్యాయవాదిగ ప్రాక్టీసును ప్రారంభించాడు. రామకృష్ణారావుకు ఆంగ్లము, తెలుగు, సంస్కృతం, మరాఠీ, ఉర్దూ, పర్షియను భాషల్లో మంచి ప్రవేశం వుంది. ఆయన 'కృష్ణశతకం', 'సారస్వత వ్యాస ముక్తావళి' అనే రెండు తెలుగు రచనల్ని చేశాడు.

1920-40 మధ్య కాలంలో వున్న ఇతర తెలంగాణా నాయకులలాగే రామకృష్ణారావు కూడ ఆంధ్ర పితామహ బిరుదాంకితుడైన మాడపాటి హనుమంతరావు చేత ప్రభావితమయ్యాడు ఆంధ్ర జనసంఘ వ్యవస్థాపకుల్లో రామకృష్ణారావు ఒకరు. ఈ ఆంధ్ర జనసంఘమే 1921-31 మధ్యకాలంలో తెలంగాణా ప్రజాసంఘంగా పిలువబడేది. రామకృష్ణారావు గ్రంధాలయోద్యమ నిర్మాతల్లో కూడ ఒకడు. హైదరాబాదు రాష్ట్ర సంస్కరణల సంఘంలో సభ్యుడుగ రామకృష్ణారావు పని చేశాడు. రామకృష్ణారావు భారత జాతీయ కాంగ్రెసు సానుభూతి పరుడైనా హైదరాబాదు కమ్యూనిస్టుల మొదటి ప్రధాన సంస్థయైన 'కామ్రేడ్స్ అసోసియేషన్'లో కొంతకాలం పాటు సభ్యుడుగ వున్నాడు.

తెలంగాణా ప్రాంత సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ విషయాల్లో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఆంధ్ర కేంద్ర జనసంఘం 1930లో ఆంధ్ర మహాసభగ రూపు దాల్చింది. 1931లో దేవరకొండలో జరిగిన ఆంధ్రమహాసభ రెండవ సమావేశానికి రామకృష్ణారావు అధ్యక్షత వహించాడు.

హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసును ఏర్పాటు చేయడంలో రామకృష్ణారావు కీలక పాత్ర వహించాడు. అయితే రాష్ట్రం వెలుపలనున్న రాజకీయ పార్టీతో సంబంధం గల ఒక మత సంస్థగ భావించి హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసుపై ఆ రాష్ట్ర ప్రధానమంత్రి సర్ అక్బరు హైదరి నిషేధాన్ని విధించాడు. రాష్ట్ర కాంగ్రెసు మత సంస్థ కాదని, దీనికి ఇతర రాష్ట్రాల పార్టీలతో ఎటువంటి సంబంధం లేదని నిరూపించడానికి బూర్గుల విఫలయత్నం చేశాడు. 1942-47 మధ్య కాలంలో ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి బహిరంగంగా ఉపన్యాసాలు ఇచ్చినందుకు రామకృష్ణారావును ప్రభుత్వం అనేక సార్లు అరెస్టు చేసింది. 1947లో 'జాయిన్ ఇండియా' ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆయన చివరిసారిగ అరెస్టయ్యాడు.

1948 సెప్టెంబరులో హైదరాబాదుపై పోలీసు చర్య జరిగిన తర్వాత రాష్ట్రంలో ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో రామకృష్ణారావు ప్రముఖ పాత్ర వహించాడు. 1950-52 లో ఎం.కె. వెల్లోడి మంత్రివర్గంలో రెవెన్యూ, విద్యాశాఖ మంత్రిగ రామకృష్ణారావు పనిచేశాడు. 1952 మార్చిలో ప్రజాప్రభుత్వం ఏర్పడినపుడు రామకృష్ణారావు ముఖ్యమంత్రి అయ్యాడు. తెలంగాణా ప్రాంతంనుండి ఎన్నికైన అతికొద్ది మంది కాంగ్రెసు నాయకుల్లో రామకృష్ణారావు ఒకడు. ఆయన తెలంగాణా ప్రజల అభిమానాన్నే గాక రాష్ట్రంలోని మిగిలిన రెండు ప్రాంతాల ప్రజల ఆదరణకు కూడ నోచుకున్నాడు.

విశాలాంధ్రను ఏర్పాటు చేయడంలో రామకృష్ణారావు కీలకమైన పాత్రను నిర్వహించాడు. ఆయనే గనుక ప్రత్యేక తెలంగాణా వైపు తన మొగ్గును చూపి వున్నట్టయితే ఈనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ జరిగి వుండేది కాదు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అవతరణతో తన రాజకీయ జీవితం అంతం అవుతుందని రామకృష్ణారావుకు స్పష్టంగా తెలుసు. అయినప్పటికి ఆంధ్రుల చిరకాలవాంఛను నెరవేర్చేందుకు తాను రాజకీయంగా సమాధికావడానికి కూడ రామకృష్ణారావు అంగీకరించాడు. అంతటి మహోన్నత వ్యక్తి ఆయన.

1957 జూన్ నుండి 1960 జూన్ వరకు రామకృష్ణారావు కేరళ రాష్ట్ర గవర్నరుగా పనిచేశాడు. తర్వాత 1960 జూలై నుండి 1962 జూన్ వరకు ఆయన ఉత్తర ప్రదేశ్ గవర్నరుగ పనిచేశాడు పదవీ విరమణ చేసిన తర్వాత 1962 నుండి 1966 వరకు ఆయన రాజ్యసభ సభ్యుడుగ కొనసాగాడు

రామకృష్ణారావుకు భారత సేవక్ సమాజ్, భారతీయ విద్యాభవన్ ఆంధ్రప్రదేశ్ కేంద్ర (హైదరాబాదు), దక్షిణ భారత హిందీ ప్రచార సభ వంటి అనేక సంస్థలతో సన్నిహిత సంబంధాలుండేవి రామకృష్ణారావు 1967 సెప్టెంబరు 15న హైదరాబాదు లో మరణించాడు. దీంతో ఆంధ్రదేశం రాజకీయ పరిణతిగల ప్రతిభావంతుడైన ఒక నాయకుణ్ని కోల్పోయింది.

## డాక్టరు యల్లాప్రగడ సుబ్బారావు 1895-1948

వైద్య, ఇంజనీరింగ్, సాహిత్యం, వేదాంతం, ఆటలపోటీలు మొదలగు వివిధ రంగాలలో భారతదేశానికి కీర్తి, ప్రతిష్ఠలను సంపాదించిన తెలుగువారిని పాటి తెలుగువారే విస్మరించడం పరిపాటి అందువల్ల చాలా కొద్దిమందికి మాత్రమే ప్రఖ్యాత బయోకెమిస్టు డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరు గుర్తు వుంది అమెరికా మున్నగు పాశ్చాత్య దేశాలలో రావుగారిని 'అద్భుతమందుల మాంత్రికుడు' (Wizard of wonderful drugs) అని కొనియాడారు

53 సంవత్సరాల వయస్సు ప్రాయంలో 8 ఆగష్టు 1948న సుబ్బారావు మరణించినప్పుడు ఒక ప్రఖ్యాత అమెరికా పత్రిక వారికి ఈవిధంగా శ్రద్ధాంజలి ఘటించింది

మీరు ఒహుశః డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు పేరు వినియుండక పోవచ్చు కాని వారు జీవించినందు వల్లే మీరు ఈ నాటికి ఆరోగ్యంగా జీవిస్తున్నారు వారి జీవితం వల్లే మీరు ఎక్కువ కాలం జీవించగలరు

న్యూయార్క్ హెరాల్డ్‌ట్రిబ్యూన్ (New york Herald Tribune) సుబ్బారావు మరణ వార్తను ప్రచురించినప్పుడు వారిని ''యీ శతాబ్దపు వైద్య మేధావి'' అని కొనియాడింది

డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు 12 జనవరి 1895న పశ్చిమగోదావరి జిల్లా మోచేకుర్రు గ్రామంలో జన్మించారు బాల్యం నుండి సుబ్బారావు ఏదైనా మంచిపని చేసి పేరు సంపాదించాలనే కోరిక వుండేది ఆయన 13 సంవత్సరాల బాలుడిగా వున్నప్పుడే యిల్లు వదిలి సన్యసించి కాశీకి వెళ్ళారు వారి తల్లి కుమారుని యింటికి తీసుకువచ్చి తిరిగి చదువుకొనే ఏర్పాటు చేసారు మెట్రిక్యులేషన్ పరీక్ష రాసి రెండు సార్లు తప్పారు అందుకని తల్లి మాటమీద మద్రాస్ వెళ్ళి పరీక్ష తిరిగి వ్రాసారు పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాక రామకృష్ణామిషన్‌లో చేరడానికి ప్రయత్నించారు కాని మిషన్‌వారు తల్లి అభ్యంతరం వల్ల రావుని మిషన్‌లో చేర్చుకోలేదు తల్లి ప్రోద్బలం వల్ల సుబ్బారావుని మద్రాస్ వైద్యకళాశాలలో చేరి పట్టం పొందారు చదువు పూర్తిచేసిన పిమ్మట మద్రాస్ ఆయుర్వేద కళాశాల వైస్-ప్రిన్సిపల్ పదవి లభించింది ఆ పదవిలో వున్నప్పుడు అనేక వనమూలికలపై పరిశోధన చేసి ఆయుర్వేద మందులపై విజ్ఞాన సర్వస్వం ప్రచురించారు

1923లో సుబ్బారావు ఉన్నత విద్యకోసం అమెరికాకు వెళ్ళి Tropical medicine లో డిప్లొమా సంపాదించారు హార్వర్డ్ మెడికల్ స్కూల్, బోస్టన్ (Harvard Medical school, Boston) లోని బయోకెమిస్ట్రీ విభాగం చేశారు సుబ్బారావు, డ్క్టర్ సైరస్ ఫిస్కే (Dr Cyrus Fiske) తో కలిసి మానవ దేహంలో భాస్వరం ఎంత వుందో పరిశోధనలు జరిపారు వీరి పరిశోధనను వైద్య పుస్తకాలలో ఫిస్కే - సుబ్బారావు పద్ధతి `Fiske Subbarao Method' అని పేర్కొన్నారు

న్యూయార్క్ రాష్ట్రంలో పెరల్‌రివర్ దగ్గరవున్న లెడ్స్లె (Ledsle) లేబొరేటరీలో 1940 మేలో చేరారు అక్కడ విటమిన్లు, Anti biotics మీద పరిశోధనలు జరిపారు బోదకాలు (Filaria, Cancer) నివారణ మందుల తయారికి నాంది పలికారు ప్లేగ్ రోగనివారిణి టెట్రాసైక్లిన్ (Tetracyclin) మందు తయారిలో ప్రముఖ పాత్ర వహించారు Aureomycin (ఆరియోమైసిన్) అనే అద్భుత మందును కనిపెట్టడంలో ముఖ్యపాత్ర సుబ్బారావుదే ఈ మందు రక్తకేంసర్ (Leukaemia) లుకేమియా అరికట్టడానికి ఉపయోగిస్తారు

సుబ్బారావుకు వ్యాపార అనుభవం లేదు ఆయన కనిపెట్టిన మందులపై patent తీసుకోలేదు కానీ వైద్య ప్రపంచం సుబ్బారావును యీనాటికి స్మరిస్తున్నాది ఆయన వైద్యరంగంలో సాధించిన విజయాలను వివరిస్తూ శిఖరం ప్రసన్నకుమార గుప్తా మరియు డాక్టర్ ఎడ్గార్ మల్ మిల్‌ఫోర్డు (Dr Edgar L Milford) అనే రచయితలు "In quest of Panacca Successes and failures of Subba Rao అనే ఆంగ్లగ్రంథాన్ని ప్రచురించారు వారు బహుముఖ ప్రజ్ఞాశాలి సుబ్బారావును యిలా వర్ణించారు

"He was a man of all sciences, a chemist among chemists, a para sitologist among parasitelogists and a clinician among clinicians"

బి యస్ పద్మనాబన్ గారి మాటలలో చెప్పాలంటే సుబ్బారావు కీర్తి ప్రతిష్ఠలకు ప్రాకులాడని గొప్ప శాస్త్రవేత్త వారు కనిపెట్టిన మందులు ప్రపంచం నలుమూలల్లో వున్న లక్షలాది స్త్రీలు, పురుషులు పిల్లలకు ఉపయోగపడుతున్నాయి

సుబ్బారావు శతజయంతిని 1995లో దేశమంతటా జరుపుకున్నారు

## కట్టమంచి రామలింగారెడ్డి (1880–1951)

కట్టమంచి రామలింగారెడ్డి (సి ఆర్ రెడ్డి) దక్షిణ భారత దేశంలోని ప్రముఖ విద్యావేత్తగ పేరు గడించాడు ఆయనకున్న పాండిత్య ప్రకర్ష, సమయస్ఫూర్తి, వాడియైన చతురోక్తులు ఆయన జీవిత కాలంలోనే ఒక ఇతిహాస పురుషుడుగ మార్చి వేశాయి

రామలింగారెడ్డి చిత్తూరు పట్టణానికి ఆనుకుని వున్న కట్టమంచి గ్రామంలో జన్మించాడు రామలింగారెడ్డికి ఆయన తాతపేరు పెట్టారు రామలింగారెడ్డి తాత గొప్ప సంస్కృత పండితుడు చిత్తూరులో ఉన్నత పాఠశాల విద్యను ముగించు

కున్న సి ఆర్ రెడ్డి ఉన్నత విద్యకై మద్రాసు వెళ్ళి అక్కడ క్రైస్తవ కళాశాలలో చేరాడు. బి ఎ డిగ్రీని పొందకముందే ఆయన తెలుగులో 'ముసలమ్మ మరణము' అనే పద్యకావ్యాన్ని రచించి తన పాండిత్య ప్రతిభను కనపరిచాడు. దీంతో ఆయన కవి పండిత వర్గంలో చేరి పోయాడు. 1901లో బి ఎ పరీక్షలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడవడమేగాక ఆర్థిక, తత్త్వ శాస్త్రాల్లో అత్యుత్తమ శ్రేణిని సంపాదించాడు. దీనివల్ల ఆయనకు ఇంగ్లండులో చదువుకునేందుకు భారత ప్రభుత్వ ఉపకార వేతనం లభించింది. కేంబ్రిడ్జిలో కాలేజి యూనియనుకు ఉపాధ్యక్షుడుగ ఎన్నికయ్యాడు. ఈ పదవికి ఎన్నికైన మొట్టమొదటి భారతీయుడు కట్టమంచి రామలింగారెడ్డి.

ఇంగ్లాండునుండి తిరిగివచ్చిన తర్వాత బరోడా కాలేజీకి వైస్-ప్రిన్సిపాలుగ రమ్మని ఆహ్వానం వచ్చింది. ఈ పదవిని అప్పటికి కొంతకాలం ముందే అరవిందఘోష్ వదలి పెట్టడం జరిగింది. బరోడాలో రెండేళ్ళ పాటువున్న రామలింగారెడ్డి మైసూరు మహారాజా ఆహ్వానాన్ని అందుకుని విద్యాశాఖ ఇన్‌స్పెక్టరు జనరలుగ పదవీ బాధ్యతల్ని స్వీకరించాడు. ఆయన ఆపదవిలో 1920 వరకు కొనసాగారు.

తర్వాత కొన్నాళ్ళకు మద్రాసు రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన జస్టిసు పార్టీ సభ్యుడుగ చేరడంతో రామలింగారెడ్డి రాజకీయ జీవితం ప్రారంభమైంది. అయితే ఆయన స్వతంత్ర భావాలు గల వ్యక్తి కావడంతో పార్టీ క్రమ శిక్షణకు లోబడి వుండలేక జస్టిసు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. 1926లో విజయవాడ కేంద్రంగా కొత్తగా స్థాపించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడుగ పదవీ బాధ్యతల్ని స్వీకరించాడు. వర్తక వ్యాపారాలకు ప్రధాన కేంద్రం కావడంవల్ల విజయవాడ విశ్వవిద్యాలయ కేంద్రంగా వుండడానికి అనువైన చోటు కాదని రామలింగారెడ్డి భావించాడు. అందువల్ల ఆయన ప్రభుత్వాన్ని ఒప్పించి విశ్వవిద్యాలయ ప్రధాన కేంద్రాన్ని వాల్తేరుకు (విశాఖపట్నం) తరలించ గల్గాడు. రాబోయే కాలంలో వాల్తేరు గొప్పనగరంగా రూపొంద గలదని ఆయన చెప్పిన మాటలు నిజమైనాయి. ఆయన 1926-1931 మధ్య కాలంలోనే కాకుండ తర్వాత 1936 నుండి 1949 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగ పనిచేశారు. వాల్తేరు ప్రసిద్ధ విద్యా కేంద్రంగా రూపొందడానికి కట్టమంచి రామలింగా

రెడ్డితోపాటు 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగ పనిచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ కు డ విశేషంగా కృషి చేశాడు 1949లో మైసూరు విశ్వవిద్యాలయ ప్రొ-చాన్సలరుగ రామలింగారెడ్డి నియమితులయ్యారు 1951లో ఆయన మరణించారు

రామలింగారెడ్డి విద్యారంగానికే కాక తెలుగు సాహిత్య లోకానికి కూడ ఇతోధికమైన సేవల్ని అందించాడు. 'ముసలమ్మ మరణం'తో పాటు ఆయన 'కవిత్వ తత్త్వ విచారము' అనే సాహిత్య విమర్శన గ్రంథాన్ని 'నవ యామిని' అను కావ్యాన్ని రచించాడు అనేక తెలుగు రచనలకు ఆయన రాసిన పీఠికలు ఆలోచనల్ని రేకెత్తించేవిగా వుంటాయి. రెడ్డిగారి రచనలు రాసిలో తక్కువైనా వాసిలో మాత్రం చాల విలువైనవి.

## పనపాకం ఆనందాచార్యులు (1843–1907)

1885లో భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భవించినప్పటినుండి దీని కార్యకలాపాల్లో ఆంధ్రులు ప్రముఖ పాత్రను నిర్వహించారు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడ బి పట్టాభి సీతారామయ్య , నీలం సంజీవరెడ్డి, డి సంజీవయ్య, కె బ్రహ్మానందరెడ్డి కాంగ్రెసు అధ్యక్షులుగ వ్యవహరించారు కాంగ్రెసు ఆవిర్భవించిన ప్రారంభదశలోనే కాంగ్రెసు అధ్యక్షపదవిని చేపట్టిన వ్యక్తి పనపాకం ఆనందాచార్యులు 1891 లో నాగపూర్ లో జరిగిన జాతీయ కాంగ్రెసు ఏడవవార్షిక సమావేశానికి ఆనందా చార్యులు అధ్యక్షులుగ వ్యవహరించారు.

ఆనందాచార్యులు కూడ సి. ఆర్ రెడ్డి జన్మస్థలమైన కట్టమంచి (చిత్తూరు) గ్రామంలోనే 1843 ఆగస్టులో జన్మించాడు సర్వేపల్లి రాధాకృష్ణన్, జిడ్డు కృష్ణమూర్తి వంటి అంతర్జాతీయ ఖ్యాతినందినవారేగాక జాతీయ ఖ్యాతి నార్జించిన సి ఆర్. రెడ్డి వంటి ప్రముఖ మేధావుల్ని అందించే అదృష్టం చిత్తూరు జిల్లాకు దక్కింది

ఆనందాచార్యుల తండ్రియైన శ్రీనివాసాచారి జిల్లా కోర్టులో (చిత్తూరు) "షెరిస్తార్' అనే చిన్న ఉద్యోగాన్ని చేసేవాడు తనకువచ్చు ఆదాయం చాల తక్కువేఅయినా తన కుమారులకు ఇంగ్లీషు మీడియం చదువుల్ని చెప్పించగల్గాడు మెట్రిక్యులేషన్ పరీక్ష పాసయిన తర్వాత ఆనందాచార్యులు మద్రాసు చేరుకుని

అక్కడ పచ్చయప్ప పాఠశాలలో [illegible] ఆరోజుల్లో మద్రాసు విశ్వవిద్యాలయంలో [illegible] మెట్రిక్యులేషను చదివిన ప్రైవేటు విద్యార్థులు [illegible] ఆనందాచార్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని [illegible]

1870లో ఆనందాచార్యులు మద్రాసు హైకోర్టులో న్యాయవాద వృత్తిని చేపట్టేందుకు తనపేరు నమోదు చేయించుకొన్నాడు. న్యాయవాదిగా నమోదైన మూడు రోజులకే హిందూ చట్టానికి సంబంధించి అతి క్లిష్టమైన కేసులో వాదించే అవకాశం ఆయనకు కల్గింది. హిందూ చట్టానికి సంబంధించి ఆనందాచార్యులకున్న విశేష పరిజ్ఞానానికి, కోర్టు చట్టాల్ని సముచితంగా వినియోగించుకోవడంలో ఆయన ప్రదర్శించిన నైపుణ్యాన్ని చూసిన న్యాయమూర్తి హాల్వే (Justice Hallway) ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. కేసుతీర్పు ఆనందాచార్యుల కక్షిదారునికి (Client) అనుకూలంగా వచ్చింది. ప్రారంభంలోనే విజయాన్ని సాధించడంతో ఆనందాచార్యులు మద్రాసు హైకోర్టులో గొప్ప న్యాయవాదిగ స్థిరపడ్డాడు.

ఆనందాచార్యులు కోర్టు వ్యవహారాల్లో తలమునకలై వున్నప్పటికి మద్రాసు నగర పౌర, సాంస్కృతిక వ్యవహారాల్లో కూడ చురుకుగ పాల్గొనేవాడు. 1884 నుండి దాదాపు 15 సంవత్సరాలపాటు మద్రాసు కార్పొరేషను కౌన్సిలు సభ్యుడుగ ట్రిప్లికేను వార్డుకు ప్రాతినిధ్యం వహించాడు. 1884 మే 16న ఆవిర్భవించిన మద్రాసు మహా జనసభకు కార్యదర్శిగ ఎన్నికయ్యాడు. ఆ హోదాలోనే ఆయన భారత ప్రభుత్వం నియమించిన ప్రజా సర్వీసుల సంఘం (Commission for Public Services) ఎదుట సాక్ష్యం చెప్పాడు. ఇంగ్లండులోను, ఇండియాలోను ఐ సి ఎస్ పరీక్షలు నిర్వహించాలని కమీషను ఎదుట వాదించాడు.

భారత జాతీయ కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో ఒకడైన ఆనందాచార్యులు కాంగ్రెసు వార్షిక సమావేశాల్లో చురుకుగ పాల్గొనేవాడు. నాగపూర్ కాంగ్రెసు అధ్యక్షుడుగ ఆయన చేసిన ప్రసంగం ప్రముఖంగా ఎన్నదగింది. ఈ ప్రసంగంలో ఆయన భారతదేశం ఒక సమైక్య దేశం కాదని వాదించేవారిని తీవ్రంగా విమర్శించాడు.

1895లో ఆనందాచార్యులు కేంద్ర శాసనసభ సభ్యుడై ఆ హోదాలో ఎనిమిది సంవత్సరాలు కొనసాగాడు. 1900లో కాంగ్రెసు ప్రతినిధి వర్గం

సభ్యుడుగ భారత ప్రభుత్వ వైస్రాయి లార్డు కర్జనును కలిసిన ఆనందాచార్యులు కరువు కాటకాదుల్ని పరిశీలించేందుకు ఒక ప్రత్యేక పరిశీలనా సంఘాన్ని ఏర్పాటు చేయాలని వాదించాడు 1903లో ఆనందాచార్యుల కేంద్ర శాసన సభ సభ్యత్వం ముగిసినపుడు శాసనసభ సభ్యుడుగ దేశానికి ఆయన అందించిన సేవల్ని దేశం చిరకాలం గుర్తించుకుంటుందని 'దిహిందూ' దినపత్రిక వ్యాఖ్యానించింది

ఆనందాచార్యులు 1907 నవంబరు 28న మద్రాసులో మరణించాడు సూరతు కాంగ్రెసు సమావేశం ఆనందాచార్యుల మరణానికి సంతాపం వ్యక్తం చేస్తూ ఘనంగా నివాళులర్పించింది :

"ఆయన కున్న కార్యదీక్ష, విధినిర్వహణ పట్ల గల ఆసక్తి, తన ఆదర్శంపట్ల గల అంకితభావం నిజాన్ని నిర్మొగమాటంగా వ్యక్తం చేసే స్వభావం ఆనందాచార్యులకు దేశవ్యాప్తంగా కీర్తిని తెచ్చి పెట్టాయి కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో ఒకడుగ ఆయన కీర్తి ఎప్పటికి చెరగిపోదు"

## జిడ్డు కృష్ణ మూర్తి (1895–1986)

అనాదినుండి గొప్ప తత్త్వ వేతల్ని, మతాచార్యుల్ని అందించే అదృష్టం ఆంధ్ర దేశానికి దక్కింది నాగార్జునుడు ప్రాచీన కాలానికి చెందిన వాడు కాగా వల్లభాచార్యుడు మధ్య యుగానికి చెందినవాడు. ఆధునిక యుగంలో సర్వేపల్లి రాధాకృష్ణన్, జిడ్డు కృష్ణమూర్తి ప్రపంచ ప్రఖ్యాతి నందిన తత్త్వ వేత్తలుగ చలామణి అయ్యారు వారిద్దరు కూడ చిత్తూరు జిల్లాకు చెందినవారు కావడం విశేషం.

జిడ్డు కృష్ణమూర్తి 1895 మే 11న చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో జన్మించారు ఈయన తల్లి దండ్రులు సంజీవమ్మ, నారాయణయ్య జిడ్డు కృష్ణమూర్తి తమకు కల్గిన అష్టమ సంతానం కావడంతో వీరు తమకుమారునికి కృష్ణ అని పేరుపెట్టారు ఎందుచేతనో తనకు కల్గబోయే సంతానం లోకోత్తర పురుషుడుగ రూపొందగలడని గ్రహించిన సంజీవమ్మ కుమారుని ప్రసవం తన ఇంట్లోని పూజగదిలోనే జరగాలని పట్టుపట్టింది కృష్ణమూర్తికి పదేళ్ళ వయస్సు వచ్చినపుడు సంజీవమ్మ మరణించింది కృష్ణమూర్తి తండ్రి 1909లో మద్రాసు చేరుకుని అక్కడి దివ్యజ్ఞాన సమాజంలో ఉద్యోగానికి కుదిరాడు

కృష్ణమూర్తి బాల్యం [illegible]
వెనుకబడి వుండేవాడు [illegible]
ప్రత్యేక ప్రేమగలదని [illegible]
కొండల్ని, అందమైన [illegible]

ఆడయారు సముద్ర [illegible]
గమనిస్తున్న కృష్ణమూర్తిని అనిబిసెంటు [illegible]
బీటర్ (C W Lead Beater) [illegible]
వెంటనే కృష్ణమూర్తిని కాపాడే [illegible] 1909లో
జరిగింది

లెడ్ బీటరు, అనిబిసెంటు కలిసి కృష్ణమూర్తిని ప్రపంచ ప్రవక్తగా చేయాలని ప్రయత్నాలు ప్రారంభించడంతో నారాయణయ్యకు [illegible] దీంతో నారాయణయ్య అనిబిసెంటు దగ్గర నుండి కృష్ణమూర్తిని తను ఇప్పించాలని కోర్టులో దావావేశాడు భారత దేశంలో కోర్టు తీర్పులన్నీ బిసెంటుకు వ్యతిరేకంగా వచ్చాయి అయితే అనిబిసెంటు లండనులోని ప్రివి కౌన్సిలుకు అపీలు చేసింది చివరకు కొన్ని సాంకేతిక కారణాలవల్ల కేసు తీర్పు అనిబిసెంటుకు అనుకూలంగా పరిణమించింది దీంతో కృష్ణమూర్తి అనిబిసెంటు సంరక్షణలోనే పెరిగాడు

కృష్ణమూర్తిని క్రీస్తు తర్వాత అంతటి గొప్ప ప్రవక్తగా చేయాలన్న తలంపుతో అనిబిసెంటు, లెడ్ బీటరు కలిసి 1911లో దివ్యజ్ఞాన సమాజంలోనే ఒక భాగంగా ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఇన్ ది ఈస్ట్ (Order of the Star in the East) అనే సంస్థను ఏర్పాటు చేశారు కృష్ణమూర్తి ఈ సంస్థకు అధినేత కావడంతో ప్రపంచంలోని నలుమూలలా ఆయనకు అనుయాయులు తయారయ్యారు ఒక డచ్చి దేశస్థుడు హాలెండులోని తన 200 హెక్టార్ల ఎస్టేటును, Castle Eerde అనే భవనంతో పాటు కృష్ణ మూర్తికి ఇచ్చాడు అప్పటినుండి ఈ హాలండు ఎస్టేటు కృష్ణమూర్తి సంస్థకు ప్రధాన కేంద్రంగా మారింది

కృష్ణ మూర్తి పాఠశాల విద్యకు నోచుకోకపోయినా తన 16 ఏళ్ళ వయసులోనే "At the Feet of the Master' అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించాడు ఈ గ్రంథం 40 సార్లు ప్రచురింపబడడమేగాక 27 భాషల్లోకి అనువదింపబడింది మొత్తం మీద కృష్ణమూర్తి, 712 రచనలు చేసినట్టు తెలుస్తున్నది

కృష్ణమూర్తి 1929లో ఒక దృఢమైన నిర్ణయాన్ని తీసుకున్నాడు తాను ఆధిపత్యం వహిస్తున్న సంస్థను రద్దుచేసి సంస్థ సంపదల్ని తిరిగి ఇచ్చి వేయడమే గాక తాను ప్రవక్తను కాదని ప్రకటించాడు తర్వాత సంవత్సరంలో దివ్య జ్ఞాన సమాజానికి రాజీనామా చేశాడు ఆయన కాలిఫోర్నియాలోని 'ఓజయ్'లో స్థిరపడ్డాడు కృష్ణమూర్తి బహిరంగంగా ఉపన్యాసాలిస్తూ, ప్రత్యేక చర్చల్ని నిర్వహిస్తూ ప్రపంచమంతా విశేషంగా పర్యటించాడు కృష్ణమూర్తి అభిమానులు మద్రాసులో స్థాపించిన 'కృష్ణమూర్తి ఫౌండేషను' అనే సంస్థ కృష్ణమూర్తి బోధనల్ని విరివిగా ప్రచారం చేసింది అయితే కృష్ణమూర్తి గురు శిష్య భావాన్ని తీవ్రంగా నిరసించాడు. కృష్ణమూర్తి ప్రతిసంవత్సరం భారత దేశానికి వచ్చి 'కృష్ణ మూర్తి ఫౌండేషను' ప్రధాన కేంద్రమైన వసంత విహార్‌లో ఉపన్యాసాలిచ్చేవాడు సత్ప్రవర్తన, సృజనాత్మక శక్తిని విద్యార్థులలో పెంపొందించేందుకు 'కృష్ణమూర్తి ఫౌండేషను' అనేక పాఠశాలల్ని నెలకొల్పింది పాఠశాలల్లో ప్రముఖంగా ఎన్నదగింది మదనపల్లి సమీపాన గల 'రిషి వ్యాలి' పాఠశాల ఈ పాఠశాల అందమైన లోయలో 370 ఎకరాల స్థలంలో నిర్మించ బడింది

కృష్ణ మూర్తి చివరి సారిగా 1985 డిశంబరు 23న భారతదేశానికి వచ్చి 1986 జనవరి 4న తన చివరి ఉపన్యాస మిచ్చాడు తర్వాత జనవరి 10న కాలిఫోర్నియాలోని తన స్వంత ఇల్లు చేరుకున్నాడు 1986 ఫిబ్రవరి 17న గాఢనిద్రలో వున్నప్పుడు కృష్ణమూర్తి తన అంతిమ శ్వాస వదిలాడు. ఆయన మరణంతో భారత దేశం ఒక గొప్ప మేధావిని, తాత్త్విక వేత్తను కోల్పోయింది